

అనుబంధితమైన
విద్యాసంచికతోసహా

ఆంధ్రప్రదేశ్

సంపుటి: 6 సంచిక: 12

ఆశ్వియుజ_కార్తీక 1884 శకం

అక్టోబరు, 1962



1962 సెప్టెంబరు 7వ తేదీన జనరల్ యస్. యం. శ్రీ నగేష్, ఆంధ్రప్రదేశ్ గవర్నరుగా ప్రమాణస్వీకారం చేస్తున్న దృశ్యం.



1962 సెప్టెంబరు 9వ తేదీన కేంద్రవాణిజ్య, పరిశ్రమల మంత్రి శ్రీ కె. సి. రెడ్డి, హైద్రాబాదులో సింథెటిక్ డ్రగ్ ప్రాజెక్టుకు చెందిన పరిపాలనా బ్లాకుకు శంఖుస్థాపన చేశారు.

సంపుటి: 6

సంచిక: 12

ఆంధ్రప్రదేశ్

సచిత్ర మాస పత్రిక

అక్టోబరు, 1962

ఆశ్వయుజ-కార్తీక 1884 శకం

అనుబంధితమైన

విద్యాసంచికతోసహా

సంవత్సరం చందా:
3 రూపాయలు

విడిప్రతి వెల
25 నయాపైసలు

విషయసూచిక

ముఖ చిత్రం :— గాంధీజీ

వెనుక అట్టమీది చిత్రం :— బీదల వాహనం

మహాత్ముడు

శ్రీ బోయిభీమన్న

మానవ తరణోపాయం మహాత్ముని రూపంలో
మళ్లీ తూరుపు దెసనే మనోజ్ఞంగా ఉదయించిందని
పాశ్చాత్య భక్త ప్రపంచం ప్రాంజలి ఘటించిందిటు తిరిగి!
మానవతా మహితధర్మం మళ్లీ నడిచింది నాల్గు పాదాలా!

సర్వమానవ స్వాతంత్ర్యోద్యమ ప్రాభవ ప్రభాకరుడు
మాయెరుగని ముద్దుపాపలా తూర్పున కనబడగానే,
దురహంకార సూర్యనాముడస్తమించని పశ్చిమ సామ్రాజ్యవాదం
నెత్తురు కక్కుకొంది—అస్తగిరి శిఖరాగ్రానికి కొట్టుకొని!

ఇద్దరు సూర్యులా మానవ లోకానికి?
రాముడు పుట్టిన తర్వాత రావణుడికి మరిస్థానంఎక్కడ?
స్వాతంత్ర్యసహజ భాస్కరుని ప్రచండతేజం సోకి
పారతంత్ర్య కృత్రిమ రత్నం తెల్లనై, నల్లనై పోయింది!

తెల్లని ముసుగులో నల్లని ఆ చీకటి రక్కసి
చాచిన ఎర్రని నెత్రు నాల్కలకు తన జీవితసర్వస్వాన్నే వొడ్డి,
ఒక్క భారతభువికేనా అతడు విముక్తి చేకూరుస్త?
మానవున్నే విశ్వమానవుడుగా రూపుదిద్దిన విధాత అతడు!


సత్యాహింసలను రాజకీయ రథానికి పూన్చిన తొలిసారథి,
ఊతకర్రతో ఉర్వరనే ఉర్రూతలూపిన సేనాచార్యుడు,
చిరునవ్వుతో శాత్రవ హృదయమాలిన్యాన్ని ప్రక్షాళించిన ఘనుడు,
ప్రేమతో ప్రపంచాన్ని గెల్చిన సార్వభౌముడు.
విశ్వమానవ మహితాత్ముడు-
గాంధీమహాత్ముడు.

"ప్రజల సహకార, సానుభూతుల్ని అభిలషిస్తున్నాను"

★



జనరల్
శ్రీనగేష్ సందేశం



1962 సెప్టెంబరు 9 తేదీన ఆంధ్రప్రదేశ్ గవర్నరు జనరల్ ఎస్.ఎం. శ్రీనగేష్ ఆకాశవాణి ద్వారా రాష్ట్ర ప్రజలకు దిగువ సందేశం ఇచ్చారు:

ఆంధ్రప్రదేశ్ ప్రజలకు సేవచేసే గౌరవం నాకు లభించింది. నాకు లభించిన ఈ గౌరవం మరింత విశేషమైనది. ఎందుచేతనంటే విశిష్టమైన గవర్నరుగా పేరుపొంది ఒక్క ఆంధ్రప్రదేశ్‌లోనే కాకుండా దేశమంతటా ప్రజల భక్తి గౌరవాలను చూరగొన్న శ్రీ భీమ్ సేన్ సచార్ స్థానే నేను ఇక్కడికి గవర్నరుగా వచ్చాను. శ్రీ సచార్ ఎంత భక్తి విశ్వాసాలతో ఈ రాష్ట్రానికి సేవ చేశారో, ఆయన ప్రజల సమస్యలను సానుభూతితో అర్థం చేసుకోవడం మూలంగా ప్రజలకు ఆయనపట్ల ఎంతటి వాత్సల్యం వున్నదో నాకు తెలుసు. మహోన్నతమైన ఆయన ఆదర్శాన్ని దృష్టిలో పెట్టుకొని దానిని అనుసరించడానికి నేను చిత్తశుద్ధితో కృషి చేస్తాను.

నేను హైద్రాబాదుకు రావడంతో నా బాల్యప్రదేశానికి వచ్చినట్లయింది. సుమారు 30 సంవత్సరాల క్రితం మా నాయనగారు హైద్రాబాదులో దివంగతులయ్యారు. నేను ఆంధ్రప్రదేశ్‌లో నియమించబడినందుకు శుభాకాంక్షలు తెలియజేస్తూ మా నాయనగారి మిత్రులు పలువురు నాకు లేఖలు వ్రాశారు. వారు చూపిన అభిమానానికి నా కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను. మా తండ్రిగారు ఇక్కడ వైద్య వృత్తికి తమ జీవితాన్ని అర్పించారు. ఇక్కడ మీ మధ్య మా తండ్రిగారి స్థానంలో సేవచేసే అవకాశం నాకు కూడా కలిగినందుకు నేను ఎంతో గర్విస్తున్నాను.

నా వయస్సు 19 సంవత్సరాలున్నప్పుడు సైన్యంలో నియామకం జరుగగా ఈ హైద్రాబాదులోనే మొదటిసారిగా సైనిక దుస్తులు ధరించాను. సైనిక దళాల అధిపతిగా ఈ హైద్రాబాదులోని ఫతేమైదానంలోనే నేను నా ఆఖరు "పెరేడు" కు హాజరయ్యాను. నేను ఉద్యోగ విరమణ చేసిన తరువాత, పరిపాలనా సిబ్బంది శిక్షణ కళాశాల స్థాపనలో సహాయపడటానికై మళ్ళీ ఈ హైద్రాబాదుకే వచ్చాను. కాబట్టి నా జీవితంలోని కొన్ని ప్రధాన సంఘటనలతో హైద్రాబాదుకు సన్నిహిత సంబంధం వుంది. నా బాల్య స్థానమైన ఈ ప్రదేశానికి నేను చెల్లించవలసివున్న ఋణాన్ని సేవచేయడం ద్వారా తీర్చుకోవాలన్నదే ఇప్పుడు నా ఆకాంక్ష.

హైద్రాబాదు పరిపాలనా సర్వీసులలో, తమ బాధ్యతలను విశ్వాసపాత్రంగా నిర్వర్తించిన గొప్పవ్యక్తులున్నారనీ, ఎంతటి

(8వ పేజీ చూడు)

ఒకదేశం ఎంతగా అభివృద్ధిచెందిందో పేర్కొనాలంటే అక్కడి ప్రజలు తలకు వాడే విద్యుచ్ఛక్తి ప్రమాణాన్ని బట్టి నిర్ణయించడం జరుగుతుంది. నిత్య జీవితంలోనే గాక పరిశ్రమలకు కూడా విద్యుచ్ఛక్తి అత్యవసరం.

మన దేశంలో ఆంధ్రప్రదేశ్ నాల్గవ పెద్దరాష్ట్రమైనా, గోదావరి, కృష్ణావంటి జీవ నదులు ప్రవహిస్తూ కావలసినంత జల సంపద ఉన్నా, 400 కోట్ల టన్నులవరకూ బొగ్గు నిల్వలున్నా యింతవరకూ జల విద్యుచ్ఛక్తిగాని, థర్మల్ పవర్‌గాని చెప్పుకో తగ్గంతగా అభివృద్ధి పరచబడలేదు. దేశంలో విద్యుచ్ఛక్తి విషయంలో చాలా వెనుకబడిఉన్న రాష్ట్రాలలో ఆంధ్రప్రదేశ్ ఒకటిగా ఉండిపోయింది.

ప్రణాళికలలో అభివృద్ధి

పంచవర్ష ప్రణాళికలద్వారా విద్యుచ్ఛక్తి విషయంలో కొంత అభివృద్ధి జరిగినా పెరుగుతున్న ఆర్థిక వ్యవస్థలో ఆ అభివృద్ధి గణనీయంగా లేదు. పైగా పొరుగు రాష్ట్రాలలో యీ విషయమై శరవేగంగా అభివృద్ధి జరుగుతున్నది.

వెలుగు బాటలు

ఉదాహరణకు ప్రథమ పంచవర్ష ప్రణాళిక ప్రారంభించే నాటికి ఆంధ్రప్రదేశ్‌లో తలసరి విద్యుచ్ఛక్తి వాడకం 2.5 యూనిట్లయితే, ఆ ప్రణాళికాంతానికి అది 7 యూనిట్లకు, ద్వితీయ ప్రణాళికాంతానికి 15 యూనిట్లకు పెరిగింది. తృతీయ ప్రణాళికాంతానికి 40 యూనిట్లకు పెరగాలని అంచనా వేయబడింది. కాని మద్రాసులో అది ద్వితీయ ప్రణాళికాంతానికి 60, తృతీయ ప్రణాళికాంతానికి 100 యూనిట్లు (కేరళలో 30-60, మైసూరులో 35-60 యూనిట్లు) అవుతున్నది.

పొరుగు రాష్ట్రాల ముందంజ

మన పొరుగు రాష్ట్రాలు ఇప్పటికే 40 నుండి 50 శాతం గ్రామాలకు విద్యుచ్ఛక్తి సౌకర్యం కలిగించగా ఆంధ్రప్రదేశ్ ద్వితీయ ప్రణాళికాంతానికి 12 శాతం గ్రామాలకు మాత్రమే విద్యుచ్ఛక్తిని సరఫరా చేయగలిగింది. చౌకగా తగినంత విద్యుచ్ఛక్తిని సరఫరా చేయలేకపోవడం వలననే ఆంధ్రప్రదేశ్ భారీ పరిశ్రమలకు అవసరమైన సంపద అంతా ఉన్నా పారిశ్రామికంగా పురోగమించలేక పోతున్నది.

విద్యుచ్ఛక్తి వాడకం విపరీతంగా పెరిగిపోతూ ఉత్పాదన శక్తిలో అందుకు అనుగుణమైన అభివృద్ధి కనబడనందున గత ఏప్రిల్ 1నుండి తెలంగాణాలోని జిల్లాలలో విద్యుచ్ఛక్తి వాడకంలో 20 శాతం కోత విధించబడింది.

అయితే యీ పరిస్థితిని మెరుగు పరచడానికి రాష్ట్ర ప్రభుత్వం కృతనిశ్చయమైనది. ఎట్టకేలకు సీలేరు జల విద్యుచ్ఛక్తి ప్రాజెక్టు విషయమై ఆంధ్రప్రదేశ్, ఒరిస్సా ప్రభుత్వాలమధ్య ఒప్పందం కుదిరింది. తుంగభద్ర హైడ్రో — ఎలక్ట్రిక్ పథకం, తుంగభద్ర నెల్లూరు హైడ్రో థర్మల్ పథకం, కొత్తగూడెం థర్మల్ పథకం, రామగుండం థర్మల్ విస్తరణ పథకం, శ్రీశైలం — నాగార్జునసాగర్ హైడ్రో ఎలక్ట్రిక్ పథకం అమలు జరపబడుతాయి. వీటి విషయమై సాంకేతిక అనుమతి, విదేశీ మారక ద్రవ్యం, దిగుమతి లైసెన్సు. వగైరాలను త్వరగా మంజూరు చేయవలసిందిగా రాష్ట్రప్రభుత్వం కేంద్రాన్ని కోరటం జరిగింది.

తక్షణ చర్యలు

ఈ పథకాలు అమలుకు కొన్ని సంవత్సరాలు పట్టవచ్చును గనుక తక్షణం సమస్యను పరిష్కరించేందుకై అందుబాటులో ఉన్న డీసెల్ సెట్లనన్నింటినీ వినియోగించడం, విశాఖపట్నం, విజయవాడల్లోని కేంద్రాలను వాటి గరిష్ఠ స్థాయిలో పని చేయించి, విద్యుత్తు ఉత్పత్తిని ప్రసార విధానంలో పంపిణీ చేయటం, హైడ్రో స్టేషన్‌లలో ఉత్పత్తి తక్కువగా వుండే కాలంలో అందుబాటులో ఉండేట్టుగా బాయిలర్లన్నిటి వార్షిక పరిశీలనలను వాయిదా వేయడం, చిత్తూరునుండి మద్రాసుకు మన రాష్ట్రం సమకూర్చే సరఫరాను నిలిపివేసి మద్రాసునుండి 2000 కిలో వాట్లను పొందటంలాటి అనేక చర్యల్ని రాష్ట్రప్రభుత్వం గైకొన్నది.

ఇవిగాక కొద్దికాలంలో నిర్మించడానికి వీలయిన రెండు 11 మేగావాట్ల గాస్- టర్బో ఉత్పాదక యంత్రాలకు కావలసిన విదేశీ మారకాన్ని కేంద్రం మంజూరు చేయడంతో వాటిని హైద్రాబాద్‌లో నెలకొల్పడానికి నిర్ణయించబడింది సత్వర అవసరాల్ని యీ సెట్లు తీర్చగలిగినా తీవ్రమైన విద్యుచ్ఛక్తి కొరత విషయమై తగినంత పరిష్కారం కల్గించలేవు.

12 లేక 14 నెలలో ఉత్పత్తి చేసి సరఫరా చేయబడగల 30/36 మేగావాట్ల ఉత్పాదన శక్తిగల థర్మల్ యంత్రాగారాన్ని

యివ్వగలమని జపాన్ ఉత్పత్తిదార్లు ముందుకు వచ్చారు. అలాంటి రెండు యూనిట్లను విజయవాడలో నెలకొల్పాలని సంకల్పించబడుతున్నది. అందువలన రెండు సంవత్సరాలలో కొంత సమయం లభిస్తుంది.

అదే విధంగా తృతీయ ప్రణాళికా కాలంలో నెలకొల్ప సంకల్పించిన సెట్టుకు అదనంగా మరో 30 మెగావాట్ల సెట్టును నెల్లూరు స్టేషన్‌లో నెలకొల్పాలని సంకల్పించబడింది.

విద్యుచ్ఛక్తి పరిస్థితి

ప్రథమ పంచవర్ష ప్రణాళికాంతానికి రాష్ట్రంలో స్థాపితమైన ఉత్పాదన శక్తి 98.9 మెగావాట్లు. ప్రథమ ప్రణాళికలో రాష్ట్ర విద్యుచ్ఛక్తి పథకాలకు రూ. 25.79 కోట్లు, ద్వితీయ ప్రణాళికలో రూ. 27.08 కోట్లు కేటాయించ బడినవి. ద్వితీయ ప్రణాళికా కాలంలో స్థాపితమైన ఉత్పాదన శక్తి 245.6 మెగావాట్లకు పెరుగుతుందని ఆశించబడింది. కాని 114.1 మెగావాట్లు ఉత్పాదనశక్తి (Generating Capacity) మాత్రమే స్థాపితమైనది. 131.5 మెగావాట్ల లోటుకు కారణం భారత ప్రభుత్వం కొన్ని పథకాలకు అవసరమైన మంజూరీ యివ్వక పోవడమే. ద్వితీయ ప్రణాళికలో స్థాపితమైన కొద్దిపాటి అదనపు ఉత్పాదన శక్తి ప్రథమ ప్రణాళికలో మిగిలి పోయిన కొన్ని పథకాలు ద్వితీయ ప్రణాళికా కాలంలో అమలు జరగడంవలన లభించింది. అంతకు మించి ద్వితీయ ప్రణాళికలో మంజూరయిన కొత్త పథకాల ప్రశ్న లేదు. అందువలన ద్వితీయ ప్రణాళికాంతానికి రాష్ట్రంలో 213 మెగావాట్ల మొత్తం (Installed Capacity) ఉంది. ప్రస్తుతం మనరాష్ట్రంలో మాచ్‌ఖండ్, తుంగభద్ర (డాం మరియు హంపి), నిజాంసాగర్ ఇంకా విశాఖపట్నం, విజయవాడ, నెల్లూరు; హైద్రాబాద్, రామగుండంలలో ఐదు థర్మల్ స్టేషన్లు ఉన్నవి.

ఆంధ్ర ప్రదేశ్‌లో తృతీయ ప్రణాళిక ప్రారంభం నాటికి విద్యుచ్ఛక్తి డిమాండ్ 80 మెగావాట్లుండగా ప్రణాళికాంతానికి 691 మెగావాట్లకు పెరగగలదని ఆశించబడుతున్నది.

రాష్ట్రం విద్యుచ్ఛక్తి విషయంలో వెనుకబడి ఉండటం వలన తృతీయ ప్రణాళికలో విద్యుచ్ఛక్తి శాఖ పద్దులకు రూ. 90.33 కోట్ల అంచనాలు ప్రతిపాదించబడినవి. కాని అవి రూ. 64.94 కోట్లకు తగ్గించడం జరిగింది. అందులో 1962–63 సంవత్సరానికి రూ. 16,06,94,300 కేటాయించ బడినవి.

ఇప్పుడున్న ఏర్పాట్లు

ప్రథమ పంచవర్ష ప్రణాళికకు పూర్వం ప్రారంభమైనవి, ఈ ప్రణాళికాకాలంలో ప్రారంభమైనవి కొన్నిపథకాలున్నవి. అందులో అధికభాగం అనేక ఏండ్ల క్రితం ప్రారంభించబడినవే. వాటి వివరాలు :—

హుసేన్ సాగర్ థర్మల్ స్టేషన్

ఆంధ్ర ప్రదేశ్‌లో అతి పురాతనమైన ఈ స్టేషన్ పరిమాణంలో రెండవది. 1923లో నెలకొల్పబడిన ఈ స్టేషన్ హుసేన్‌సాగర్ సరస్సుకు దక్షిణంగా ఉంది. చివరి దశ 1951లో పూర్తయింది. ఉత్పాదన శక్తి 22,250 కిలోవాట్లు హైద్రాబాద్, సికింద్రాబాద్ నగరాలకు, సమీపంలోని పారిశ్రామిక ప్రాంతాలకు విద్యుచ్ఛక్తిని సరఫరా చేస్తున్నది.

విజయవాడ థర్మల్ స్టేషన్

ఈ స్టేషన్ 1937లో ఉత్పత్తిని ప్రారంభించినది. 1939–1951లో విస్తరించబడింది. ఉత్పాదక శక్తి 12,000 కిలోవాట్లు.

విశాఖపట్నం థర్మల్ స్టేషన్

విశాఖపట్నం హార్బర్ పవర్‌హౌస్ విద్యుచ్ఛక్తి సరఫరాలను 1938లో విద్యుచ్ఛక్తి శాఖ స్వాధీన పరచుకొన్నది. అప్పటి నుండి ఈ పవర్ స్టేషన్ మాచ్‌ఖండ్ పవర్ స్టేషన్ పని ప్రారంభించేవరకూ విశాఖపట్నం, శ్రీకాకుళం జిల్లాల విద్యుచ్ఛక్తి అవసరాల్ని తీర్చేది. విశాఖపట్నం హార్బర్‌లో ఉన్న ఈ స్టేషన్ ఉత్పాదక శక్తి 6750 కిలో వాట్లు.

నెల్లూరు థర్మల్ స్టేషన్

1949లో ఉత్పత్తిని ప్రారంభించిన నెల్లూరు థర్మల్‌స్టేషన్ ముఖ్యంగా నెల్లూరు జిల్లా అవసరాలకు ఉద్దేశించ బడింది. నెల్లూరు స్టేషన్ 66 కె.వి. లైనుతో మాచ్‌ఖండ్‌కు కలపబడింది. ఇది 132 కె. వి. లైన్సు ద్వారా కూడా తుంగభద్ర, మాచ్‌ఖండ్‌లతో కలపబడింది. ఉత్పాదన శక్తి 5000 కిలో వాట్లు.

తృతీయ పంచవర్ష ప్రణాళికలో తుంగభద్ర – నెల్లూరు హైడ్రో–థర్మల్ పథకంపేర తుంగభద్ర డాం పవర్‌హౌస్ వద్ద రెండు, కాల్వ పవర్ హౌస్ దగ్గర ఒకటి 9 మెగావాట్ల హైడ్రో యూనిట్లు, నెల్లూరులో 30 మెగా వాట్ల థర్మల్ యూనిట్‌ను నెలకొల్పి అభివృద్ధి చేయడానికి ఉద్దేశించబడింది. హైడ్రో యూనిట్లు జపాన్‌లో ఉత్పత్తి అవుతున్నవి. కొన్ని సెట్లు నెలకొల్పబడుతున్నవి. 1964 డిసెంబర్ నాటికి నెల్లూరు సెట్ ఉత్పత్తిని ప్రారంభిస్తుంది.

నిజాంసాగర్ హైడ్రో-ఎలక్ట్రిక్ పథకం

1946 లో ఉత్పత్తిని ప్రారంభించిన యీ స్టేషన్‌తో హుసేన్‌సాగర్ థర్మల్ స్టేషన్‌కు సంబంధం ఏర్పరచి హుసేన్‌సాగర్‌లో బొగ్గు ఎక్కువ ఖర్చు కాకుండా చూస్తుంది. కామారెడ్డి రైల్వే స్టేషన్‌కు 32 మైళ్ళలో ఉన్న యీ ప్రాజెక్టు నిజాంసాగర్ రిజర్వాయిర్ నుండి నీటిని సేద్యానికి యిస్తూ 15000 కిలో వాట్ల విద్యుచ్ఛక్తిని యిస్తున్నది. వ్యవసాయానికి తీసుకునే నీటిని బట్టి

ఒకసారి విద్యుచ్ఛక్తి ఉత్పాదనం తగ్గిపోతుంది. సంవత్సరంలో కొన్ని రోజులు అసలు ఉత్పాదన ఉండదు.

రామగుండం థర్మల్ స్టేషన్

రామగుండం స్టేషన్ 1947 లో ఉత్పత్తిని ప్రారంభించింది. 1957 జూన్ నాటికి విస్తరణ కార్యక్రమం కూడ అమలు జరిగింది. 37,500 కిలోవాట్ల ఉత్పాదన శక్తితో రాష్ట్రంలో పెద్ద థర్మల్ స్టేషన్‌గా ఉన్న యిది సిమెంటు, ఎరువులు, పేపర్ మిల్లులు, బొగ్గు గనులకు విద్యుచ్ఛక్తిని సరఫరా చేస్తూ హైదరాబాద్, సికింద్రాబాద్ నగరాల అదనపు అవసరాలను ఆదుకొంటున్నది. తృతీయ ప్రణాళికా కాలంలో డి.ఎల్.ఎఫ్. సంస్థ యిచ్చే ఋణంతో 60 మెగావాట్ల సెట్‌ను నెలకొల్పడం ద్వారా యీ పథకాన్ని మరింత విస్తరింపజేయడానికి సంకల్పించబడింది. ఈ విస్తరణ పథకం నుండి విద్యుచ్ఛక్తి ఉత్పాదన 1966 నాటికి ప్రారంభమౌతుందని ఆశించబడుతున్నది. ఇదిగాక రామగుండంలో మరో 60 మెగావాట్ల సెట్‌ను నెలకొల్పాలని కూడా ప్రభుత్వం ఆలోచిస్తున్నది. తెలంగాణా హైడ్రో థర్మల్ పథకం క్రింద హుస్సేన్‌సాగర్, రామగుండంలలో ఒక్కొక్క బాయిలర్లను నెలకొల్పాలని ఉద్దేశించబడింది. ఇవి 1963 లోనే ఉత్పత్తిని ప్రారంభిస్తాయి.

మాచ్‌ఖండ్ హైడ్రో-ఎలక్ట్రిక్ పథకం

ఆంధ్రప్రదేశ్—ఒరిస్సా రాష్ట్రాలు సంయుక్తంగా ఏర్పాటు చేసిన యీ ప్రాజెక్టు నుండి ఆ రాష్ట్రాలు 70:30 శాతంలో విద్యుచ్ఛక్తిని పొందుతాయి. ఒరిస్సాలోని కోరాపుట్ జిల్లాలో యీ ప్రాజెక్టు ఉంది. 1956 లో ప్రారంభించబడిన యీ పథకం రెండవ దశ 1959 లో పూర్తయింది.

తుంగభద్ర హైడ్రో-ఎలక్ట్రిక్ పథకం

ప్రథమ పంచవర్షప్రణాళికలో అమలు జరిగిన రెండవ హైడ్రో—ఎలక్ట్రిక్ పథకం యిది. ఈ ప్రాజక్టు క్రింద 36,000 కిలోవాట్ల విద్యుచ్ఛక్తి ఉత్పత్తి అయి కడప, కర్నూలు, అనంతపురం, చిత్తూరు జిల్లాలకు సరఫరా అవుతున్నది.

1953 లో ఆంధ్ర రాష్ట్రం విడిపోవడంతో ఆంధ్ర—మైసూరు రాష్ట్రాల మధ్య ఇది ఉమ్మడి ప్రాజక్టుగా రూపొందింది. 1958 లో 9 మెగా వాట్ల శక్తి గల నాలుగు ఉత్పాదక యూనిట్లు నెలకొల్పబడినవి. ఆంధ్ర, మైసూర్ రాష్ట్రాలు 4:1 నిష్పత్తిలో విద్యుచ్ఛక్తిని పొందుతున్నవి. మరో 9 మెగా వాట్ల యూనిట్ 1963 సంవత్సరాంతానికి పని ప్రారంభించేటట్లు త్వరలో నెలకొల్పబడుతుంది. అదిగాక మరో మూడు 9 మెగా వాట్ల హైడ్రో—యూనిట్లు—రెండు డాం పవర్‌హౌస్ దగ్గర, ఒకటి కాల్వ పవర్ హౌస్ దగ్గర నెల్లూరులో 30 మెగావాట్ల యునిట్‌తోబాటు నెలకొల్పాలని సంకల్పించబడుతున్నది.

కొత్తగూడెం థర్మల్ పథకం

ప్రపంచ బ్యాంక్ ఋణంతో 60 మెగావాట్ల శక్తిగల రెండు సెట్లను కొత్తగూడెంలో నెలకొల్పాలని సంకల్పించబడింది. అయితే గత సంవత్సరం నుండి ప్రపంచ బ్యాంక్ అధికారులు యీ పథకాన్ని పరిశీలిస్తూనే ఉన్నారు. ఈ పథకానికి ప్రత్యేక సర్కిల్ నెలకొల్పబడి సివిల్ వర్క్స్ చేపట్టబడినవి. ఈ సెట్లు 1965 నాటికి ఉత్పత్తిని ప్రారంభించగలవని ఆశించబడుతున్నది. ఇదిగాక మరో రెండు 60 మెగా వాట్ల సెట్లను కూడా నెలకొల్పి కొత్తగూడెం థర్మల్ పథకాన్ని విస్తరించాలని కూడా ప్రభుత్వం సంకల్పిస్తున్నది.

ఎగువ సీలేరు హైడ్రో-ఎలక్ట్రిక్ పథకం

ఒరిస్సా ప్రభుత్వంతో స్థల విషయమై వివాదం తలెత్తి నిలిచిపోయిన యీ ప్రాజెక్టు సెప్టెంబర్ 4 వ తేదీన హైద్రాబాద్‌లో ఆంధ్ర, ఒరిస్సా ముఖ్యమంత్రుల మధ్య ఒప్పందం కుదరడంతో యిక ముందుకు సాగవచ్చు. ఒప్పందం ప్రకారం ఒరిస్సా సరిహద్దులోని బలిమెలవద్దనే రూ. 24 కోట్ల ఖర్చుతో నమిష్టిగా సీలేరు ప్రాజక్టు నిర్మించబడుతుంది. బలిమెల దిగువ సీలేరు నీటిని ఆంధ్రప్రదేశ్ యిష్టమైనట్లు వినియోగించుకోవచ్చు. గుంటవాడలో నిర్మాణంలో ఉన్న "వీర్" పూర్తిచేయబడుతుంది.

నాగార్జునసాగర్ శ్రీశైలం హైడ్రో-ఎలక్ట్రిక్ ప్రాజెక్టు

మొదట్లో నాగార్జునసాగర్‌తో కలిపి నమిష్టి ప్రాజక్టు నివేదిక రూపొందించబడినా కేంద్రం కోరికపై యిటీవల విడి ప్రాజెక్టు నివేదిక కూడా పంపబడింది. ఈ పథకం క్రింద దిగువ కృష్ణలో ఒకటి శ్రీశైలం వద్ద, మరొకటి నాగార్జునసాగర్ వద్ద రెండు పవర్ స్టేషన్లను నెలకొల్పి శ్రీశైలంవద్ద ఒక్కొక్కటీ 110 మెగావాట్ల శక్తిగల మూడు యూనిట్లను, నాగార్జునసాగర్ వద్ద 50 మేగావాట్ల శక్తిగల రెండు యూనిట్లను, నాగార్జునసాగర్ వద్ద 50 మెగావాట్ల శక్తిగల రెండు యూనిట్లను ముందుగా నెలకొల్పి చివరకు శ్రీశైలంలో 770 మెగావాట్లకు నాగార్జునసాగర్‌లో 400 మేగావాట్లకు శక్తిని పెంచాలని ఉద్దేశించబడింది. శ్రీశైలం వద్ద, ప్రాథమిక పనులు 19[illegible]9లో ప్రారంభించబడినవి. అయితే నదీజలాల వివాదం సందర్భంగా 1951 ఒప్పందాన్ని తిరగతోడడంవల్ల, గుల్హాతీ కమీషన్ నియామకంవలన జాప్యం జరిగింది. ఈ ప్రాజక్టు ఖర్చు అంచనా రు. 50కోట్లకు పైగా ఉంది.

చిన్న ప్రాజక్టులు

ఇవిగాక ఒక్కొక్కటి 100 కిలోవాట్ల శక్తిగల మూడు యూనిట్లను సెట్టిపేటలో నెలకొల్పాలని సంకల్పించబడింది. ఈ సెట్లు 1963 నవంబరులో ఉత్పత్తిని ప్రారంభిస్తాయి. ఆదిలాబాదులో కుంతల ప్రాజక్టు కూడ దర్యాప్తు చేయబడింది. లాభదాయకం కాదని తేలడంతో దేవనూర్—హైడ్రో ఎలక్ట్రిక్ ప్రాజక్టు విడిచిపెట్టబడింది.

రాష్ట్ర విద్యుచ్ఛక్తి బోర్డు

1959లో నెలకొల్పబడిన రాష్ట్ర విద్యుచ్ఛక్తి బోర్డుకు పబ్లిక్ వర్క్సు శాఖ కార్యదర్శి అధ్యక్షుడు. బోర్డుకు ప్రత్యేకంగా చీఫ్ ఇంజనీర్ యితర సిబ్బంది ఉన్నది. 1962 మార్చివరకూ రాష్ట్రంలో విద్యుచ్ఛక్తి పంపిణీ విషయంలోనే బోర్డుపని పరిమితమైనా ఏప్రిల్‌నుండి విద్యుచ్ఛక్తి ఉత్పాదనం (మాచ్‌ఖండ్, తుంగభద్ర గాక) బోర్డు ఆధీనంలోకి వచ్చింది. అయితే ప్రభుత్వం ఎలక్ట్రిక్‌లో ఇన్స్పెక్టరేటును, ప్రాజెక్టులనిర్మాణం, దర్యాప్తు, మాచ్‌ఖండ్, తుంగభద్రలలోని పవర్‌హౌస్‌లను తనక్రింద ఉంచుకొన్నది. ట్రాన్స్మిషన్‌లైన్లు వేయడం, సబ్‌స్టేషన్ల నిర్మాణం పనుల్ని కూడా కొనసాగిస్తుంది. 1962–63 సంవత్సరంలో 364 గ్రామాలకు కొత్తగా విద్యుచ్ఛక్తిని సరఫరా చేయాలని సంకల్పించుకొన్నది

గ్రామీణ విద్యుద్దీకరణ

ప్రథమ ప్రణాళిక ప్రారంభమయ్యే నాటికి రాష్ట్రంలో 212 గ్రామాలకే విద్యుచ్ఛక్తి సరఫరా చేయబడింది. ప్రణాళికాంతానికి ఆ సంఖ్య 700లకు పెరిగింది. ద్వితీయ ప్రణాళికాంతానికి 3238కి పెరిగింది. తృతీయ ప్రణాళికలో 979 గ్రామాలకు విద్యుచ్ఛక్తిని విస్తరింపచెయ్యాలని సంకల్పించబడితే వాస్తవానికి మొదటి రెండు సంవత్సరాలలోనే 1204 గ్రామాలకు విద్యుచ్ఛక్తి లభించుతున్నది.

రాష్ట్రంలో మొత్తం 26,500 గ్రామాలున్నవి. అయితే సుమారు 41వందల గ్రామాలకు మాత్రమే విద్యుచ్ఛక్తి లభించింది. అందువలన యింకా జరుగవలసిన కృషి చాలా ఉంది.

ప్రయివేటు రంగం

లోగడ ప్రయివేటు సంస్థలు విద్యుచ్ఛక్తిని ఉత్పత్తి చేసి గ్రామాలకు. వాడకందార్లకు సరఫరా చేసేవి. కాని ప్రభుత్వం యీ సంస్థల్ని జాతీయం చేసింది. అయితే యిప్పుడున్న విద్యుచ్ఛక్తి కొరత పరిస్థితి దృష్ట్యా ప్రయివేటు పారిశ్రామికవేత్తలు తమ విద్యుచ్ఛక్తి అవసరాలకు థర్మల్ యూనిట్లను నెలకొల్పుకొంటే అనుమతించాలని భావించబడుతున్నది. కాని యీ సూచనకు మంచి రెస్పాన్స్ రాలేదు. సింగరేణి కాలరీలు మాత్రం 6 మేగవాట్ల శక్తిగల థర్మల్ యూనిట్లు కొన్నిటిని ఏర్పాటు చేసుకోవాలనుకొంటున్నవి. అయితే ప్రయివేటు సంస్థలు విద్యుచ్ఛక్తిని ఏర్పాటు చేసుకోవడం కూడా కష్టమే. ఎందుకంటే ప్రభుత్వానికే లభించిన విదేశీ మారకం వారికి మాత్రం ఎలా లభిస్తుంది?

మంత్రి వివరణ

నీటి పారుదల, విద్యుచ్ఛక్తి శాఖల మంత్రి శ్రీ ఎ. సి. సుబ్బారెడ్డి యిలా అన్నారు: "జాతీయం చేయడం జరిగినా పెద్ద పెద్ద మొత్తాల విద్యుచ్ఛక్తిని ఉత్పత్తి చేసి సరఫరా చేస్తామని ఎవరైనా ప్రయివేటు వ్యక్తులు ముందుకు వస్తే ప్రభుత్వం వారిని ప్రోత్సహిస్తుంది. వారు ఉత్పత్తి చేసే విద్యుచ్ఛక్తి నంతటినీ ప్రభుత్వమే కొని ప్రజలకు సరఫరా చేస్తుంది. అంతేగాని ప్రయివేటు సంస్థలు సూటిగా ప్రజలకు విద్యుచ్ఛక్తిని సరఫరా చేయడం మాత్రం జరగదు.

"రాష్ట్రం తీవ్రమైన విద్యుచ్ఛక్తి కొరతను ఎదుర్కొంటున్నప్పుడు, విద్యుచ్ఛక్తి వాడకంలో కొంతకోతను కూడా విధించవలసి వచ్చినప్పుడు యీ విధంగా అయినా పరిస్థితిని కొంత వరకూ మెరుగుపర్చడం ప్రభుత్వ కనీస ధర్మం. అందుకు ఎవరైనా ముందుకు వస్తే ప్రభుత్వం లైసెన్సులిచ్చి సహాయం చేస్తుంది."

—"ఉదయభాను"

(4 వ పేజీ తరువాయి)

కష్ట సమయాలలో నైనా వారు ప్రజా సేవలో ఉన్నత సంప్రదాయాలను పరిరక్షించారనీ నాకు తెలుసు. పూర్వ ఆంధ్ర రాష్ట్ర ఉద్యోగులకు కూడా ఇది వర్తిస్తుంది. వారు కూడా అంతే ఉన్నతమైన సంప్రదాయాలను కలిగివున్నారు. మన అధికార్లందరూ, తమ ముందున్న సవాలతో కూడిన బృహత్తరమైన కార్యభారాలను నిర్వర్తించడంలో ఇదేవిధంగా ముమ్ముందు కూడా శాయశక్తులా పాటుపడతారని నాకు నమ్మకగా వుంది. మనకు స్వాతంత్ర్యం సిద్ధించి ఇది పదహారవ సంవత్సరం. దేశాన్ని శీఘ్రంగా పారిశ్రామికవంతం చేస్తున్నారు. అనేక సమస్యలు మనలను ఎదుర్కొంటున్నాయి. అయినప్పటికీ ప్రీతితోనూ, క్రమశిక్షణతోనూ కష్టించి పనిచేస్తే సరైన పరిష్కారం లభించని సమస్య అంటూ వుండదని నా దృఢమైన నమ్మకం.

మన ప్రజాస్వామిక విధానంలో ప్రజలు ప్రభుత్వంతో సహకరిస్తేనే మన కార్యాలు సాఫీగా కొనసాగుతాయి. గణనీయమైన అభివృద్ధిని సాధించగలుగుతాము. కనుకనే కష్టార్జితమైన దేశ స్వాతంత్ర్యానికి హానికలుగకుండా వుండటానికై అన్నివర్గాలకూ చెందిన ప్రజల సహకారాన్నీ, సానుభూతినీ, ఔదార్యవంతమైన దృక్పథాన్ని నేను అభిలషిస్తున్నాను. దేశసమైక్యతకై ప్రతి ప్రజా సేవకుడూ బలగాలలో చేరాలని నేను వాంఛిస్తున్నాను.

రాష్ట్ర సమస్యలను అవగాహన చేసుకోవడానికి నేను శాయశక్తులా కృషిచేస్తానని మీరందరూ తెలుసుకొనవలసిందిగా కోరదలిచాననిచెప్తూ నేను ముగిస్తున్నాను. సర్వవేళలా నా సేవ మీకు లభిస్తుందనీ, ఏ విధంగా నా సేవ మీకు ఉపకరిస్తుందనుకుంటారో ఆ విధంగా వినియోగించుకోవచ్చని నేను మీకు హామీ ఇస్తున్నాను.

రాష్ట్రాభ్యుదయమే భారతదేశాభ్యుదయం

శ్రీ తెన్నేటి విశ్వనాథం

ఎం. ఎల్. ఏ

[ఆగస్టు పదిహేనవ తేదీన స్వాతంత్ర్య దినోత్సవ సందర్భంగా హైదరాబాదు కేంద్రం నుంచి ఒక ప్రత్యేక రేడియో గోష్ఠిని ఆకాశవాణి నిర్వహించింది. ఈ గోష్ఠికి ఆంధ్రప్రదేశ్ శాసన సభాధ్యక్షులు శ్రీ బి.వి. సుబ్బారెడ్డి అధ్యక్షత వహించారు. సమాచార, న్యాయ శాఖల మంత్రి శ్రీ పి.వి. నరసింహారావు, శాసనసభా ప్రతిపక్ష నాయకులు శ్రీ పుచ్చలపల్లి సుందరయ్య, శాసన సభ్యులు శ్రీ తెన్నేటి విశ్వనాథం, శ్రీ వావిలాల గోపాల కృష్ణయ్య, సర్వోదయ నాయకులు శ్రీ ప్రభాకర్‌జీ, విద్యావేత్తలు శ్రీ మామిడిపూడి వెంకటరంగయ్యగార్లు యీ గోష్ఠిలో పాల్గొన్నారు. శ్రీ సుబ్బారెడ్డి, శ్రీ నరసింహారావు, శ్రీ సుందరయ్యగార్ల ఉపన్యాసాలను వ్యాసాల రూపంలొ క్రిందటి సంచికలో ప్రచురించాము. మిగిలిన వారి ప్రసంగాలను విడి విడిగా వ్యాసాల రూపంలో యీ సంచికలో ప్రకటిస్తున్నాము.]

రాష్ట్రాభ్యుదయం ఆంధ్ర రాష్ట్రాభ్యుదయం—ఈ రెండున్నూ మాటలు వేరుగాని, నిజంగా వీటికి వస్తుభేదంలేదు. 14 రాజ్యాలతో కూడుకొన్నది మనభారతరాష్ట్రం. ఏరాజ్యం వెనకపడ్డా ఆమేరకు భారతరాష్ట్రం అంతా కుంటుపడినట్లే. అంచేత, ఏరాజ్యంలో ఉన్నవారు, ఆ రాజ్యాన్ని అన్నివిధాలా పుష్టి పరుచుటకు గాను పూర్ణయత్నం పట్టుదలతో చేయాలి. తామున్న రాజ్యాన్నే సంరక్షించుకోలేక అజాగ్రత్తపరులైనవారు తామువేని యితర రాష్ట్రములన్నింటియొక్క సంరక్షణయందు జాగ్రత్త పడతామని చెప్పేమాట కలలోమాట వంటిది. నిజానికి యావత్తు భారత రాష్ట్రముయొక్క అభ్యుదయం కావలసిన వారు రాష్ట్రంలోగల ప్రతిరాజ్యంయొక్క అభ్యుదయమున్నూ, ముందు వెనకలులేక, హెచ్చుతగ్గులు కాకుండా, కావలసినదనే చెప్తారు. మెప్పుతప్పులకు లొంగకుండా వారి యత్నాల్ని సూటిగా సాగిస్తారు. ఆ విధంగా రాష్ట్రమంతటికినీ అభ్యుదయ ముఖంగా చేస్తారు. అట్టి వారికి నా అభివందనములు.

రాష్ట్రాభ్యుదయానికి ప్రజాశికలు సాగుతున్న కాలంలో మనమున్నాం. ఈ అభ్యుదయం ప్రకృతిపరంగానూ పురుషపరంగానూ కూడా కావాలి. భూ సంపద, జల సంపద, భూగర్భ సంపద, యీ మూడింటినీ పొందుపరచి, వికివిపరిచేది ప్రకృతి పరమైన అభ్యుదయం. ధర్మ సంపద, అర్థ సంపద, తేజస్సంపద—యీ మూడింటినీ పొందుపరచి వికివిపరిచేది పురుషపరమైన అభ్యుదయం.

ఈ రెండు విధములైన అభ్యుదయాల్ని సాధించేవాడు వ్యక్తి. అంచేత వ్యక్తియొక్క గౌరవం సకలమైన అభ్యుదయాలనూ కొలిచే మానదండమై ఉండాలి. అయితే "సంఘంలేని వ్యక్తిలేదు. కనుక సంఘం అవసరం. వ్యక్తి అనవసరం" అనే సూత్రం కొత్తగా బయలుదేరింది కొన్ని సంవత్సరాలయి. నానా శిరములూ వేసింది. బహుజనాభిప్రాయం అనే కత్తెరను చేత పుచ్చుకుంది. వ్యక్తియొక్క భావమనే తీగను కత్తిరించేస్తుంది. ఆ తీగ పుష్పించడానికి గానీ, సువాసన ఇవ్వడానికి గానీ, వీల్లేకుండా

చేస్తుంది. ఈ భీభత్సం తాత్కాలికమయితే ప్రమాదం లేదు. కాని దీనికి శాశ్వత బుద్ధి పుట్టితేమాత్రం మానవాభ్యుదయానికి తప్ప కుండా నిరోధం అవుతుంది అనటానికి సందేహం లేదు.

భావ వికాసం అవసరం

మానవ జీవితంయొక్క పరమలక్ష్యం లోక సంగ్రహం అని అంటారు. అయితే ఆ లోకసంగ్రహం చేకూర్చేవారు వ్యక్తులు అనేమాట మరువరాదు. లోకసంగ్రహార్థమే ప్రతివ్యక్తి యొక్క భావవల్లరిని పెరగనివ్వాలి: పువ్వులు పూయనివ్వాలి. ఇది నిజం. అయినా యీ నిజాని గ్రహించడం అరుదైనది నేటి కాలంలో. అంతేకాదు, లోక సంగ్రహణ, సంఘం అనే అనే పేరులుచెప్పి, స్వలాభం ఎంత చేసుకుంటే, అంతరాజనీతిగా చెల్లుబడి అవుతుంది. స్వాతంత్ర్యం వచ్చిన తరువాత, ఇతరేతర విరుద్ధమైన సూత్రప్రభావాల్లో మన భారత జాతి చిక్కుకున్నది. సంఘమే అని పెద్దనియంతలు అంటారు. అవునంటూ, వారి శిష్యులందరూ మాత్రం వ్యక్తియే ముఖ్యమని మనస్సులో అనుకుంటూరు. పైకి ఏమీచేయలేకుండా ఉన్నారు, సంఘ సూత్రనియంతల మాటలకు ఎదురులేకుండా ఉన్నారు. నీడల్నిచూచి నిజాలనుకుంటున్నారు బహిస్సౌధ నిర్మాణాలకోయి బహు వ్యయములనూ, బహు రుణాలనూ చేస్తున్నారు. కాని, ఆ సౌధాల్లో ఉండతగ్గవాడు ఎచ్చటున్నాడో వారు మరచిపోయారు. కొంతకాలం అయిన తరువాత, పరిణామాల్నిచూచి "లక్ష్యాలు తగ్గాయి, ప్రమాణాలు తగ్గాయి, నీతి తగ్గింది, అవినీతి ఆకాశం అంటుకుంది" అని వ్యర్థమైన ఆశ్చర్యాన్ని పొందుతున్నారు. అంచేత మన రథాన్ని మనం మరలించాలి, వెనక్కి తిప్పాలి,

పదిహేనో స్వాతంత్ర్య దినం యీ రోజున. అంచేత కొంత వరకూ అంతర్ముఖులం కావాలి. వెనక్కి చూచినట్లయితే, అప్పుడు మనకు నూతన చైతన్యం ప్రసాదించిన మహాత్ముడు కనపడడా ? సత్యమూ అహింసా అనే సూత్రాలు అప్పుడు భారత జాతికి జీవిత సూత్రాలు అయినట్లు మనకు కనిపించదా ? నిరాడంబరంగా ప్రతివ్యక్తి గౌరవంగా బ్రతకడానికి వీలయిన ఆర్థిక తత్వాన్ని బోధిస్తూన్న మహాత్ముని కంఠరవం మనకు వినిపించదా? ఆ కంఠంతోనే రాజకీయ విప్లవం నడిపించిన దృశ్యం కనిపించదా? నేటి స్వాతంత్ర్యం నాటి మహాత్ముడిచ్చిన రాజకీయ భిక్ష కాదా?

మరొక విషయం. సాంఘిక వ్యవస్థ ఏదయినప్పటికీ, ప్రజాస్వామ్య తంత్రం ఏ పద్ధతిని సాధిద్దామనుకున్నప్పటికీ, సత్యమూ అహింసా అనే రెండు గట్టుల మధ్య నుంచి మన రాజకీయ వ్యవహారాల ప్రవాహాన్ని ప్రవహింపజెయ్యాలి. గట్లు తప్పినట్లయితే, కట్టు తప్పుతుంది. కట్టు తప్పితే, ఇప్పుడున్న అవస్థలకే అనగా సర్వాంతర్యామి అయిన అవినీతి అనే నాచు మనకాళ్ళకు చుట్టుకుని ముందుకీ వెనక్కి కూడా కదలనీయదు.

"రెండు మహా యుద్ధములైన తరువాత భూభాగ్యం అంతా పాశ్చాత్యుల చేతుల్లో పడింది. మన రాష్ట్రం అభ్యుదయం కావాలన్నా, వారియొక్క సాహాయ్యం కావలసి ఉంది. అయితే, వారి సాహాయ్యం వారి అవసరాలు తీరిన తరువాత ఇస్తారు. వారిది, అన్ని అవసరాలలోనూ ముఖ్యావసరం, అణువుతో మారణ ప్రయోగం చెయ్యడం, ఎవరికన్న ఎవరు హెచ్చని పందెములు వేసుకొనడం, వెనుకబడిన దేశాలకు సాహాయ్యం చేయాలంటే అణా పైసలకు కూడా ముందు వెనకలాడడం. పోనీ "ఈ భూమి ఏ ఒక్కరూ సృజించినది కాదు కదా. ఉన్నవారం అందరమూ సర్దుకోగూడదా" అంటే కెనడా వారు రానివ్వరు, అమెరికాలో అడుగు పెట్టనీరు, దక్షిణ అమెరికాలో తావు ఇవ్వరు, ఆఫ్రికా ఆస్ట్రేలియాలలో అసలే రానివ్వరు. "లోకమంతా ఒకటి, లోకమంతా ఒక రాజ్యం, "One world, one nation" అనే సూక్తులు అతి కర్ణపేయంగా మాత్రం చెప్తారు.

"కనుక, యీ విషమ పరిస్థితుల నుండి మన భారత రాష్ట్రం తప్పుకొని అభ్యుదయ మార్గం పట్టాలంటే, మన మార్గం మనమే చూసుకోవాలి. ఏ సూత్రాలపైని ఆధారపడి యీ రోజున మనం యీ స్వాతంత్ర్య దినోత్సవం చేసుకుంటున్నామో, ఆ సత్యమూ అహింసా అనే సూత్రాన్ని ప్రతిక్షణమూ రాజకీయ రంగంలో ఆర్థిక రంగంలో సాంఘిక రంగంలో స్వకీయ జీవితాల్లో దైవముఖం చూసి అమలు పరుచుకొందుకు యత్నం చెయ్యాలి. దురాశాపరుల చేతుల్లోకి దేశీయ భాగ్యం పోకుండా చూడాలి. తగనటువంటివారిని మొగను కూర్చోబెట్టుకోకుండా ఉండాలి. శాసనాల్లో ధర్మం ఉండాలి. జనానీకం యొక్క ఉత్సాహమూ, శక్తి రాజ్యరథాన్ని లాగేలాగు, ఆ రథాన్ని వారికి అప్పజెప్పాలి. వచ్చే స్వాతంత్ర్యం రోజున మన అభ్యుదయమనే రథం ఆ త్రోవను పట్టిందని అనగలిగితే, ఇన్నేళ్లూ మన పెద్దలు చేసిన త్యాగం వారు చూపించిన ధైర్యం ఫలించాయని పలుకగలుగుతాము.

సాతవాహనుల పరిపాలనా విధానము

శ్రీ బి. ఎస్. శాస్త్రి ఎం. ఏ.

ఉత్తర హిందూ దేశమున మగధరాజ్యము శక్తి సమన్వితమైనది. శిశునాగ వంశీయుల యనంతరము నందవంశీయులు మగధను పాలించిరి. క్రీ. పూ. 322 లో నందవంశమును రూపుమాపి మౌర్య చంద్రగుప్తుడు రాజ్యమును స్థాపించెను. చంద్రగుప్తుని కుమారుడు బిందుసారుడు. బిందుసారుని కుమారుడు అశోకుడు క్రీ. పూ. 272 లో మగధరాజ్య సింహాసనమునధిష్ఠించెను. ఆంధ్రులు అశోకుని సామ్రాజ్యమున నుండిరి. వారాతని సామంతులుగనో మిత్రులుగనో వ్యవహరించిరి. అశోకుని ధర్మశాసనములాంధ్రదేశమున లభించినవి. దక్షిణాపథమునందంతట నచ్చటచ్చట నున్నవి. అశోకుని 13 వ శిలా శాసనమందు యవన కాంభోజాదులతో బాటాంధ్రులాతని రాజ్యమునందున్నట్లు చెప్పబడినది. అశోకుని షాహబాజ్‌గహి, మాన్సెర, గిర్నార్ శాసనములందాంధ్రుల ప్రశంసకలదు.

"ఏవమేవ ఇహరాజవిషయేషు యవన కమ్బోజేషు, నాభకే నాభ పంక్తిషు భోజపితినిక్యేషు అన్ధ్రపులిన్దేషు—సర్వత్ర దేవానాం ప్రియస్య ధర్మానుష్టిమనువర్తన్తే" 13 వ ధర్మలిపి శాసన భాగము.

ఆంధ్రదేశమున బౌద్ధమత ప్రచారము గావించుట కశోక చక్రవర్తి మహాదేవుడను భిక్షువును పంపెను. అశోకుడు మత ప్రచారార్థము మహాదేవ భిక్షువును పంపుటకు పూర్వమే ఆంధ్ర దేశమున బౌద్ధమతము వ్యాప్తియందుండెను.

అశోకునిమరణానంతర మాంధ్రదేశము స్వాతంత్ర్యము వహించెను. ఆంధ్రులతో పాటు కఠిక, భోజక, పిటనిక కళింగాది జాతులవారు మౌర్యుల యధికారము నంగీకరింపక స్వాతంత్ర్యము వహించిరి. ఇట్లు స్వతంత్ర సామ్రాజ్యముల నిర్మించుకొని దక్షిణాపథమును వివిధ వంశీయులు పాలించుచుండిరి. కాలక్రమమున ఆంధ్రులు విజృంభించి, ఉత్తరాపథముపై దండెత్తి రాజ్యమును విస్తరింపజేసికొని దక్షిణాపథమును తమ యధికారము క్రిందికి దెచ్చుకొనిరి.

దక్షిణాపథ మహోజ్వల చరిత్ర యందు ఆంధ్ర సాతవాహనులు పాలించిన కాలము చారిత్రకము గాను, సాంస్కృతికము గను అతి ముఖ్యమైనది. ఉత్తర హిందూదేశమున అరాజకము ప్రబలియున్న సమయమున దక్షిణాపథమును తమ ఏకచ్ఛత్రాధిపత్యము క్రిందికి దీసికొని వచ్చి, దేశమున శాంతిభద్రతలను నెలకొల్పి ఆంధ్ర దేశచరిత్రకు పునాదులు వేసి, తమ కీర్తిని శాశ్వతముగా నిల్పుకొనిన సాతవాహన వంశీయులు పరిపాలనాధురంధరులు. వీరి రాజ్యమునందాంధ్రులు, మహారాష్ట్రులు, ద్రావిడ, ఘూర్జర, కాళింగ, కన్నడ, శకయవన పహ్లావాములు కలిసిమెలసి జీవించినారు.

సాతవాహనుల రాజధాని అమరావతి. ఇది కృష్ణానది యొడ్డున నున్నది. ధాన్యకటకము, దనకటకము, ధాన్యవాటి యని దీనికీ పేర్లు. మహారాష్ట్ర దేశమునందున్న పైఠను లేక పిష్ఠపురము వీరి రెండవ రాజధాని. ఈ రాజుల పరిపాలనా విధానము, ఆనాటి ప్రజల ఆచార వ్యవహారములు, దానధర్మములు కళాపోషణము—భాషా సేవ, ప్రజల సాంఘిక సాంస్కృతిక జీవన విధానము తెలిసికొనుటకు ఈ రాజుల కాలమున వెలసిన శాసనములు—గ్రంథములు—సమకాలిక రాజుల శాసనములు—సాహిత్యము ముఖ్యములు.

గుహాలయములు, అందలి శిల్పము, దేవాలయములు—విద్యాలయములు—ఆనాటి ప్రజా జీవన విధానమునకును, రాజుల కళాపోషణమునకును తార్కాణములు.

సాతవాహనుల కాలమున రెండు శకములు వ్యాప్తిలోనికి వచ్చినవి. ఒకటి శాలివాహనశకము. రెండవది విక్రమాదిత్య శకము.

శాలివాహన శకము క్రీ. శ. 78 నుండియు, విక్రమ శకము క్రీ. పూ. 58 నుండియు లెక్కింపబడుచున్నవి. శాలివాహన శకము విక్రమశకము తరువాతిదైనను బహుళ ప్రచారము నందున్నది.

సాతవాహన యుగమునందలి సాంఘిక చరిత్ర తెలిసికొనుటకు, సాతవాహనుల శాసనములు—గాథాసప్తశతి, వాత్స్యాయనీయము, సమకాలిక ప్రభువుల శాసనములు—వాఙ్మయము—బృహత్కథ (కథాసరిత్సాగరము) ముఖ్యములగు సాధనములు.

సాతవాహనులకు సంబంధించిన శాసనములు ఇప్పటి వరకు 27 లభించినవి. ఇందు ముఖ్యమైనవి—

1. నానే ఘాట్ గుహలో విగ్రహములమీద శాసనములు (6)
   Ludhers list No 1113 to 111[illegible]
2. నానే ఘాట్ గుహా శాసనము—
   నాగానిక.
   ,, No 1112
3. వాసిక శాసనము— కృష్ణుడు.
   E. I. Vol VIII
   నాసిక శా. నం. 22
4. నాసికశాసనము—మహాహాకు శ్రీదేహిత్రి.
   E. I. Vol VIII
   నాసిక శా. నం. 19
5. సాంచీశాసనము—సాతకర్ణి.
   Guid to Sanchi By Marshall
6. నాసికశాసనము—గౌతమీపుత్ర సాతకర్ణి.
   E. I. Vol VIII నాసిక శా. నం. 4
7. నాసిక శాసనము— ,, ,, [illegible]
8. ,, వాసిష్ఠీ పుత్రపులోమావి
   E. I. Vol. VIII నాసిక శా. నం. 25
9. ,, వాసిష్ఠీ పుత్రపులోమావి.
   E. I. Vol. VIII నాసిక. శా. నం. 1
10. కార్లాశాసనము—వాసిష్ఠీ పుత్రపులోమావి.
   E. I. Vol. VII కార్లా. శా. నం. 14
11. ,, వాసిష్ఠీ పుత్రపులోమావి.
   E. I. Vol. VII నం. 14.
12. నాసిక శాసనము—వాసిష్ఠీ షత్రపులోమావి.
   E. I. Vol. VIII నాసి. శా. నం. 2.
13. నాసిక శాసనము—వాసిష్ఠీ పుత్రపులోమావి.
   E. I. Vol VIII నాసి శా. నం. 3.
14. కార్లాశాసనము—వాసిష్ఠీ పుత్రిషులోమావి.
   E. I. Vol. VII No. 20
15. అమరావతీ శాసనము—వాసిష్ఠీ పుత్రపులోమావి.
16. నానేఘాట్ శాసనము—చతరపణ సాతకణి.
   Luders list No. 1120.
17. కన్హేరీ శాసనము—మాఢరీ పుత్రశకసేనుడు.
   Luders list No. 1001.
18. నాసిక శాసనము—యజ్ఞశ్రీ సాతకర్ణి
   E. I. Vol. VIII No. 24.
19. కన్హేరీశాసనము—గౌతమీ పుత్రయజ్ఞ శ్రీ సాతకర్ణి.
   Luders list No. 1024.
20. కన్హేరీశాసనము— ,, 987.
21. చిన్నగంజాంశాసనము—గౌతమీ పుత్రయజ్ఞశ్రీ
   E. I. Vol. I. P. 95-96
22. కొడవలిశాసనము—చందసతి.
   E. I. Vol. XVIII
23. మ్యాకదోని శాసనము—శ్రీపులోమావి.
   E. I. Vol. XIV
24. అమరావతీ శాసనము—సివమ సాతకర్ణి

ఇవికాక సమకాలిక ప్రభువులగు ఖారవేలుని హాథీ గుంఫ శాసనమును E. I. Vol. XX రుద్రదాముని జునాగఢ్ శాసనములును ముఖ్యములు.

సాతవాహనులకు సంబంధించిన నామములు ఆంధ్రదేశమున వినిపించుచున్నవి. సాతవాహన శబ్దముతో సంబంధముకల స్థలనామము లెన్నియో యున్నవి.

సతకన్ని నగరము. — S. B. E. Vol XVII

సాతాహనిరాష్ట్రము సాతాహనిహారము.	శాసనాధారము
సాతవాహని కోట సాతానకోట	కర్నూలుజిల్లా నందికొట్కూరు తాలుక

సాతవాహనపల్లె | గుంటూరుజిల్లా.
సత్తెనపల్లి |

సాతునూరు—బళ్ళారిజిల్లా—అదోని తాలూక

సాతంబాకం—చిత్తూరుజిల్లా—చంద్రగిరి తాలూక

సాతులూరు—కృష్ణాజిల్లా—బందరు తాలూక
గుంటూరుజిల్లా—నరసరావుపేట తాలూక

సాతుకొట్టని, సాతొపొడియ, సాతొనాలొ, సదనపల్లె, సాతులి, సడాందాం, సతాపి, సాత—గంజాం విశాఖపట్నం జిల్లాలలో గల నామములు.

సెటగిరి—గౌతమీబాల శ్రీ నాసికశాసనము
E. I. Vol VIII నా. శా నం. 2

సాతమాల పర్వతపంక్తి

సాతనాల, సాతపుర, సత్తపణ్ణి మున్నగు నామములు సాతవాహనులకు సంబంధించినవి.

పరిపాలనా విధానము

సువిశాలమైన సాతవాహన సామ్రాజ్యమున సమర్థనీయమైన పరిపాలనా విధానముండెను. రాజు సర్వస్వతంత్రుడే కాక ఈ పరిపాలనమున కంతటికి మూలాధారుడు. ప్రజాక్షేమమునకు, సామ్రాజ్య రక్షణమునకును రాజే బాధ్యుడు. ఈ వంశమున వారసత్వము పురుషులనుండియే లభించుచుండెను. గౌతమీపుత్ర సాతకర్ణి కుమారుడగు వాసిష్ఠీ పుత్రపులోమావి నాసిక శాసనమున గౌతమీపుత్రసాతకర్ణి గురించి ఇట్లున్నది.

6. ... అపరాజిత విజయపతాక (స) సతుజనదు పధపనీయ
7. పురవరస కులపురిస పరపరాగత విపుల రాజసదస అగమాన నిలయస సపురిసానం అసయససిరీయ...

E. I. Vol. VIII నాసిక శా. నం. 2.

శాసనములందు, రాజులు అపరాజిత విజయపతాకులగను, ఏకదనుర్ధరులగను, క్షత్రియ దర్పమాన మర్ధనులగను వర్ణింపబడినారు.

వారసత్వము మొదట జ్యేష్ఠ పుత్రునికి సంక్రమించుచుండెడిది. అపైన రాజునకు పుత్రులు లేని యెడల తమ్ములు రాజ్యాధిపతులగుచుండిరి ఒకవేళవా రసుడు పిన్నవాడైన అతని పినతండ్రి కాని, తల్లికాని రాజ్యపాలనము చేయుచుండిరి. సిముకుని మరణానంతరము అతని కుమారుడగు మొదటి సాతకర్ణి బాలుడగుటవలన సిముకుని సోదరుడగు కృష్ణుడు సాతవాహన సామ్రాజ్యాధిపతియయ్యెను. అట్లే మొదటి సాతకర్ణి మరణానంతర మాతని పుత్రులలో జ్యేష్ఠుడగు వేదిశ్రీ బాలుడగుటవలన సాతకర్ణిభార్య దేవీనాగానీక పరిపాలన సాగించెను. నానేఘాట్ శాసనమును నాగానీక వేదిశ్రీ కాలమున వేయించెను. రాజు పరిపాలనా విషయమున శక్తి సమన్వితుడు కానియెడల అతనికితల్లి రాజకీయ వ్యవహారనిర్వహణమునందు దోడ్పడుచుండెను. గౌతమీపుత్ర సాతకర్ణి నాసిక శాసనమున గోవర్ధనమునందలి అమాత్యుడగు శ్యామకుని కీయవలసిన రాజాజ్ఞలో రాజగు గౌతమీ పుత్ర సాతకర్ణి యొక్కయు, రాజమాతయు, జీవసుతయునగు మహాదేవి యొక్కయు మాటలుగా గోవర్ధనమున అమాత్యుడగు శ్యామకుడు ఆరోగ్యము అడుగబడుగాక— ఆ పైన నిట్లుచెప్పబడుగాక—యని యున్నది. ఇందు రాజు—అతని తల్లి ఇద్దరి ఆజ్ఞలు ప్రస్తావింపబడినవి.

శాసనము:—

1. సిద్ధ—గొవధనె అమచససామక సదెమొ రాజాణితొ.
2. రజొ గొతమ పుతసాతకణిస మహాదెవీయ చజీవసుతాయ రాజమాతయ వచనెన గొవధనె——చొసామకొ అరొగవత వాతతొ ఎవచ.
3. పతవొ ఎథ అంహెహి పవతె...

E. I. Vol. VIII నాసికశా. నం. 5.

ఆనాటి రాజధర్మములు ప్రజల కనుకూలముగ నుండెను. రాజ్యమందలి ప్రజల కభయ మొసంగి ప్రతివారును నిశ్చింతగ జీవించుట కవకాశము కల్పించి ప్రజల కష్ట సుఖములను తమవిగా చూచుకొని, రాష్ట్రమున కితరులవలన ఉపద్రవములు కలుగకుండ చూచుకొనుట, ధర్మమార్గమున, నియమానుసారము సుంకములను వసూలుచేయుట, సత్క్రమ మార్గమున ధనమును వినియోగించుట, వర్ణాశ్రమ ధర్మము నశింపకుండ కాపాడుట, పెద్దలయెడ గౌరవము కల్గియుండుట ఆనాటి సాధారణ రాజధర్మములుగా నుండెను.

రాజకార్య నిర్వహణమునందు సామంతులు, రాజోద్యోగులు రాజులకు సహాయపడుచుండిరి. పరిపాలనా సౌకర్యార్థము దేశము, అసిక, అనక, ములక, సురఠ, కుకుర, అపరాంత, అనూప, విదర్భ, అకరావంతి, వైజయంతి మున్నగురాష్ట్రములుగా విభజింపబడి ఆయా రాష్ట్రములకు ప్రతినిధులుగా కొందరు నియ

మింపబడి పాలించుచుండిరి. వాసిష్ఠీ పుత్రపులోమావి నాసికశాసన భాగమున ఈ రాష్ట్రముల నామములు కలవు.

2. —— అసిక అసక ముళకసురఠకు కురోపరంత అనుప విదభ ఆకరావతి—రాజసః యుఛవతపారి చాతసహ్య కణ్హగిరి మచ సింటనమలయ మహిద.

3. సెటగిరిచ కొరపవతపతిస ——

E. I. Vol. VIII నాసిక శాసన. నం. 2.

సాతవాహన రాజులు అన్య రాజ్యములను జయించి ఆ రాజులను తమ సామంతులుగ నంగీకరించుచుండెడివారు. ఆనాడు మహారఠి మహాభోజ అను బిరుదములు గలిగిన సామంతులు వుండిరి. మొదటి సాతకర్ణిభార్య దేవీనాగానీక. అమె మహారఠిత్ర ణయికరో కుమార్తె—మహారఠి మహాభోజ పదములానాటి శాసనములందును కన్పించుచున్నవి. నాణెములపైనను ఈ పేర్లు ముద్రింపబడినవి.

మహారఠి శబ్దము వాసిష్ఠీ పుత్రపులోమావి కార్లాశాసనము.

No. 14. E.I. Vol VII. కార్లా శాసనములు నం. 2

లోను మహాభోజ అనుశబ్దము కన్హేరీ శాసనములందును కలదు. ఈ మహారఠులు మహాభోజులు సాతవాహనుల సామంతులు. వీరస్త్రీలకు మహారఠిని, మహాభోజి, అను బిరుదములుండెను. ఈ సామంతులందరును సాతవాహనులకు లోబడి యుండురనుటకు గౌతమీపుత్ర సాతకర్ణి యొక్క "సర్వమండలా వాదిత చరణస్య", "సర్వరాజలోకమండల ప్రతిగృహీత శాసనస్య" అను బిరుదములు తార్కాణము. ఈ బిరుదములు వాసిష్ఠీ పుత్రపులోమావి నాసిక శాసనమునందున్నవి.

E. I. Vol.. VIII నాసిక శా. నం. 2.

కార్లా చైత్య గృహముయొక్క ప్రాంగణమున సింహస్తంభము నెత్తించినవాడు మహారఠి పుత్రుడగు మహారఠి. చిత్తల దుర్గమున లభించిన నాణెములు కళలాయ మహారఠివి.

మెగస్తనీసు అను గ్రీకు రాయబారి చంద్రగుప్తమౌర్యుని ఆస్థానమునకు రాయబారిగా వచ్చి భారతావనియందు పర్యటించి, తాను చూచిన వింతలను, విశేషములను ఒక గ్రంథముగా వ్రాసెను. ఆ గ్రంథముపేరు 'ఇండికా' అందాతడు మగధ రాజ్యము తరువాత పేర్కొనదగిన రాజ్యమాంధ్రరాజ్యమని, ఆంధ్రరాజునకు ముప్పది దుర్గములు, లక్ష కాల్బలము, రెండువేల గుఱ్ఱపుదళము, వేయి ఏనుగులతో గూడుకొనిన సైన్యముండెననియు, ప్రజలు రాజును అతని పరిపాలనమును గౌరవించుచుండిరనియు, వ్రాసినాడు. ఇట్టి ముప్పది నగరములలో ముఖ్యమయినవి పైఠను, ఫణిగిరి, కొండాపురము, విజయపురి, ధరణికోట, భట్టిప్రోలు, గాజులబండ, వేంగీ, ముష్కనగరము (మస్కీ) మొదలగునవి. తెలంగాణము నందిప్పటికివి కొన్ని గ్రామములు ఈ పేర్లతోనే పిలువబడుచున్నవి. (ఫణిగిరి, గాజులబండ, కొండాపురము ఆదులు.)

ఈ పట్టణములను నగరములని, నిగమములని పిలుచుచుండెడివారు. నగరపాలన కేంద్రమునకు లోబడి యుండునట్టి పౌర సంఘము నిర్వహించుచుండెను. ఎక్కువ అధికారములు గల నాగరికుడను ప్రభుత్వోద్యోగి, నగర పరిపాలనా బాధ్యతను వహించుచుండెను. రాజునకు మహాసేనాపతి ముఖ్యుడు. ఇతడు రాజునకు ఆంతరంగిక కార్యదర్శిగ కూడ వ్యవహరించెడివాడు. మహాసేనాని యోధునుడు ఒక నాసిక శాసన లేఖకుడు.

E i vol VII నాసిక శా. నం. 3.

మహాసేనాపతియగు స్కందనాగుడు సాతవాహనీ హారమునకు పరిపాలకుడుగా నుండెను. పులోమావిమ్యాకదోని శాసనము.

E i vol XIV

ఒక్కొక్క ఆహారమున కొక్కొక్క పాలకుడుండెను. ఇట్లు ఆహారములకు పరిపాలకులుగా నియమింపబడినవారు మహామాత్యుడు.

అమాత్యులు—సేనాధిపతులు కాక, మహాతారక, భాండాగారిక, మహామాత్ర, క్రమనిబంధకార అను రాజోద్యోగులును ఆనాడు ఉండిరి

సాతవాహన సామ్రాజ్యమానాడు రాష్ట్రములుగను, నిగమములుగను, జనపదములుగను విభజింపబడినది. నిగమములకు ప్రత్యేక పరిపాలనా వ్యవస్థ యుండెడిది.

ఆహారమనునది ఒక రాష్ట్ర విభాగము. గోవర్ధనాహారము, సాతవాహనాహారము, వామాలహారము అను రాష్ట్రముల పేర్లు పులోమావిమ్యాకదోని శాసనమందును, నాసిక శాసనమందును, మరికొన్ని శాసనములందును కన్పించుచున్నవి.

గ్రామమునకు గుమిక, గ్రామిక, గ్రామణి అను అధికారి యుండెను. ఈ అధికారికి గ్రామమును శాసించుట యందు సంపూర్ణాధికారముండెను. గ్రామాధికారులు, మండలాధిపతులకు,

మండలాధిపతులు రాష్ట్రాధిపతులకు, రాష్ట్రాధిపతులు కేంద్రాధికారమునకు అనగా రాజులకు లోబడి యుండెడివారు.

గ్రామమున పంచాయతీ సభలుండెను. వ్యక్తి హక్కులను కాపాడుట యందును, ప్రజల క్షేమ సమాచారములరయుట యందును, వారికి దగిన వసతులు కల్పించుట యందును గ్రామ రక్షణ యందును గ్రామ పంచాయతీలు బాధ్యత వహించెడివి.

గ్రామమునందలి భూమిపై సమిష్టి యాజమాన్యమున్నను వ్యక్తిగత కుటుంబములచే వ్యవసాయము చేయబడుచుండెను. వ్యవసాయదారుల నుండి పన్నులు వసూలు చేసి గ్రామాధికారులు ప్రభుత్వమునకు నిర్ణీతమైన పన్నులు చెల్లించెడివారు. సంతలోని పన్ను వసూళ్ళు చేయుటకు గల హక్కు, బంజరు భూములపై యధికారము, నీళ్లు మున్నగు వానిపై కేంద్ర ప్రభుత్వాధికారముండెను. ఆ కాలపు సామాన్య వ్యవస్థ కౌటిల్యుని అర్థశాస్త్రము ననుసరించి యుండెనని చెప్పవచ్చును.

ఒక్కొక్క రాష్ట్ర విభాగమాయా రాష్ట్ర కేంద్ర నామముతో వ్యవహరింపబడుచుండెడిది. పథము, రాష్ట్రము అను పేర్లు ఆనాటి రాష్ట్రములకుండెను. పుగిరత లేక పుగి రాష్ట్రము అమరావతి శాసనమున బేర్కొనబడినది.

ఈ రాష్ట్రముల పరిపాలనా భారమును అమాత్యులు వహించుచుండిరి. ఆ కాలమున కఠిన శిక్షలు అమలులో నుండెను. జనులకు రాజులనెన్నుకొను అధికారము కొన్ని రాష్ట్రములలో నుండెను. రుద్రధాముని జూనాఘఢ్ శాసనమున ఈ విషయము ప్రస్తావింపబడినది.

శాసన భాగము

రాజ్ఞోమహా క్షేత్రపస్య సుగృహితన్నామః స్వామి చష్టన స్యపేత్రస్య రాజ్ఞః క్షత్రపస్య సుగ్రిహిత నామనః స్వామి జయ దామ్నః పుత్రస్య రాజ్ఞో మహాక్షత్రపస్య – రుద్రదామ్నోవర్షే ద్విగప్తతితయే–70,2.

సర్వవర్ణై రభిగంమ్యరక్షణార్థం పతిత్వేవృతేనా...

ఇట్లు సాతవాహనులు రాజ్య పరిపాలనా ధురంధరులై అరి వీర భయంకరులై సుమారు నాల్గున్నర శతాబ్దుల కాలమాంధ్ర దేశమునే కాకయావద్దక్షిణాపథమును పాలించి ఆంధ్ర దేశ చరిత్రలో తమ పరిపాలనా కాలమును సువర్ణాక్షరములతో లిఖింప దగిన కాలమని చారిత్రకులు పొగడునట్లు చేసినారు.



ఒకరిమాట వినుచు ఊకొట్టు తీర్పరి
న్యాయమూర్తికాడు మాయమూర్తి
ఒంటికాలివాడు కుంటి కాకుండునా?
జనసుతాంతరంగ! వినర రంగ!

"కృష్ణ శతశతి"

సీలేరుపై ఒప్పందం

సీలేరు నదీ జలాల వినియోగం విషయంలో ఆంధ్రప్రదేశ్, ఒరిస్సా ప్రభుత్వాల మధ్య, ఈ ఉభయ రాష్ట్రాల ముఖ్యమంత్రులు హైదరాబాదులో సమావేశమై చర్చలు జరిపిన ఫలితంగా కుదిరిన ఒప్పందంపై 1962 సెప్టెంబరు 4 వ తేదీన సంతకాలు జరిగాయి.

ఈ ఒప్పందం పట్ల తమ హర్షాన్ని వెలుబుచ్చుతూ ముఖ్యమంత్రులిద్దరూ చేసిన సంయుక్త ప్రకటనలో ఇలా అన్నారు:

“ఈ సమస్య విద్యుదుత్పాదక శక్తిని పెంపొందించడంలో అడ్డుతగలడమే గాకుండా ఉభయ రాష్ట్రాలకూ నష్టం కలిగిస్తున్నది. ఈ అంతరరాష్ట్ర విభేదాలు, పెరిగిపోయినట్లయితే జాతి పురోగతినే అవి స్తంభింపజేస్తాయి. కడకు జాతీయైక్యతా విచ్ఛిత్తికి దోహదం చేస్తాయి. అందుచేత ఆంధ్ర, ఒరిస్సా రాష్ట్రాల ప్రయోజనాలనూ, మొత్తం దేశం ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని, జలాలను సమంగా పంచుకుంటూ, బలిమెల వద్ద సమిష్టిగా రిజర్వాయరును నిర్మించి, ఆంధ్రప్రదేశ్, ఒరిస్సా ప్రభుత్వాల సమిష్టి కృషితో విద్యుదుత్పాదక పథకాన్ని నిర్వహించడానికి మేము అంగీకరించాం. విద్యుచ్ఛక్తి ఉత్పత్తికై (1) బలిమెల ఆనకట్ట స్థలం వద్దా, (2) గుంటవాడ ఎగువ సీలేరు వద్దా (3) దిగువ సీలేరు వద్దా ఆంధ్రప్రదేశ్ తన వాటా నీటిని స్వేచ్ఛగా వినియోగించుకోవచ్చు. బలిమెల వద్ద తన వాటా నీటిని ఒరిస్సా విద్యుదుత్పాదనకే కాకుండా నీటి పారుదలకు కూడా వినియోగించుకోవచ్చు. స్వల్పంగా ఇచ్చి పుచ్చుకోవడాల ద్వారా ఒప్పందం కుదుర్చుకొనగలిగినందుకు మేము ఆనందిస్తున్నాం. ఒప్పందంపై నేడే సంతకాలు జరిగాయి. అంతర్రాష్ట్ర నదీలోయ వివాదాలన్నింటినీ కూడా ఆయా రాష్ట్రాలకు ప్రయోజనం కలగడానికీ తద్వారా దేశం మొత్తానికీ లాభం చేకూరడానికి ఇదేమాదిరిగా పరిష్కరించవచ్చునని మేము విశ్వసిస్తున్నాము. సమగ్రమైన ఈ పథకాన్ని శీఘ్రంగా అమలుపరచడంలో తమ సానుభూతి పూర్వకమైన సహకారాన్ని అందజేయవలసిందిగా ఉభయ రాష్ట్రాల ప్రజలకూ, ప్రతిపక్ష నాయకులకూ మేము విజ్ఞప్తి చేస్తున్నాము.”

ఒప్పందపు షరతులు ఇవి:

1. బలిమెల వద్ద సీలేరుపై ఒక ఆనకట్ట (ఎఫ్. ఆర్. ఎల్. 1516) నిర్మించాలి.

2. గుంటవాడ వద్ద పూర్తిగా ఆంధ్రప్రదేశ్ ఖర్చుతో నిర్మించబడే “వీర్” ఎత్తు దిగువ నిర్దేశించిన విధంగా వుండాలి:
(అ) గుంటవాడవద్ద “వీర్” నిర్మాణం ఈ విధంగా జరుగుతుంది:—

1963 జూన్ 1 — స్పిల్‌వే సెక్షను, 1332 వద్ద 600 అడుగులు; 1320 వద్ద 400 అడుగులు.

1964 ఏప్రిల్ 15 — స్పిల్‌వే సెక్షను, 1332 వద్ద 800 అడుగులు; 1320 వద్ద 200 అడుగులు.

1964 మే 15 — స్పిల్‌వే సెక్షను 1332 వద్ద 1000 అడుగులు.

1320 వద్ద నీరు వున్నప్పుడు 4000 క్యూసెక్కుల నీరు విడుదల కావడానికి వీలైన తూముల నిర్మాణానికి ఏర్పాటు వుంటుంది.

1964 డిసెంబరు నాటికి స్పిల్‌వే మట్టం శిఖర స్థాయికి అంటే 1340 లకు పెంచబడుతుంది.

(ఆ) విద్యుదుత్పాదక యంత్రాగారం పని ప్రారంభించే సమయానికి నీటిమట్టం 1340 అడుగులు వుంటుంది.

(ఇ) బలిమెల వద్ద నిర్మించే ఆనకట్ట ఎత్తు కనీసం 1,400 అడుగులకు చేరుకున్నప్పుడు 1340 అడుగుల మట్టంపై వుండే 20 అడుగుల ఎత్తుగల గేట్లతో మొత్తం మట్టం 1360 అడుగులు వుంటుంది.

అయితే ఎట్టి పరిస్థితిలోనూ గుంటవాడ వద్ద, వరదలు వచ్చిన సమయంలో కానీ లేదా ఇతర సమయాలలో కానీ నీటి మట్టం సుమారు 1360 అడుగులకు మించరాదు. నీటి విడుదల గరిష్ఠ ప్రమాణం 2.5 లక్షల క్యూసెక్కులు.

3 బలిమెల ఆనకట్ట సమిష్టి పనులకు సంబంధించిన వ్యయాన్ని ఆంధ్రప్రదేశ్, ఒరిస్సా ప్రభుత్వాలు సరిసమంగా భరించాలి.

అయితే ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వపు వాటా వ్యయం రూ. 12 కోట్లకు మించరాదు.

(4) ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అభ్యర్థించిన ప్రకారం తృతీయ ప్రణాళికా కాలంలో, ప్రాజెక్టు నిర్మాణానికి ఆంధ్రప్రదేశ్ వాటా క్రింద రూ 3 కోట్లకు మించి జరిగే వ్యయాన్ని భరించడానికి ఒరిస్సా ప్రభుత్వం ఆమోదించింది.

ఈ విధంగా ఒరిస్సా ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి పెట్టుబడి పెట్టే మొత్తానికి ఒరిస్సా ప్రభుత్వం, 1962_65 వ సంవత్సరానికి ప్రజల నుండి సేకరించిన ఋణాలకు వర్తించే సగటు వడ్డీరేటు వర్తిస్తుంది.

నాల్గవ ప్రణాళిక మొదటి సంవత్సరంలో ఒరిస్సా ప్రభుత్వానికి ఈ అప్పును చెల్లించివేయాలి.

నాలుగవ ప్రణాళికా కాలంలో, ప్రతి సంవత్సరం వాస్తవంగా జరిగిన పని మేరకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తన వాటా క్రింద అవసరమైనంతగా మిగతా మొత్తాలు ఇస్తుంది.

(5) బలిమెల వద్ద ఆనకట్ట నిర్మాణానికి అవసరమైన డిజైన్లను, నమూనాలను ముగ్గురు నిపుణులతో కూడిన సంఘం రూపొందిస్తుంది. ఈ సంఘంలో దిగువ వారు సభ్యులుగా వుంటారు: (1) డా. ఏ. ఎన్. ఖోస్లా, ప్రణాళికాసంఘం సభ్యుడు; (2) డా. కె. ఎల్. రావు, పార్లమెంటు సభ్యుడు; (3) కేంద్ర జల విద్యుత్ సంఘం డైజైన్ల విభాగం సభ్యులు.

ఉద్యోగ ఖాళీలు ఏర్పడినప్పుడు వాటిని కంట్రోలు బోర్డు భర్తీ చేస్తుంది.

(6) బలిమెల ఆనకట్ట వద్ద బలిమెల రిజర్వాయరులోకి ప్రవహించే మొత్తం నీటి ప్రవాహంలో సగం ఆంధ్రప్రదేశ్ వాటా క్రింద విడువబడుతుంది. మిగతా సగం ఒరిస్సా ప్రభుత్వపు బలిమెల హైహెడ్ పవర్‌హౌస్‌కు వదిలిపెట్టబడుతుంది. ఉభయ విద్యుత్కేంద్రాలకు వాస్తవంగా అవసరమైనంత మేరకు నీరు విడువబడుతుంది. ఏ సంవత్సరంలోనైనా జూలై 1 వ తేదీ నుంచి జూన్ 30 వ తేదీ వరకు, ఉభయ పక్షాలలో ఎవ్వరూకూడా స్టోరేజి నుంచి, అనుమతించిన దానికంటే సగాన్ని మించి నీరు తీసుకోకూడదు. నీరు ఇంకిపోవడం వల్ల జరిగే నష్టం కూడా ఇందులో చేరుతుంది. కాగా రిజర్వాయరు నిండటం వల్ల ప్రవహించే మిగులు నీరు దీనిలో చేరదు. రిజర్వాయరు పూర్తయిన తరువాత దానికి వర్తింపజేసే నిబంధనలను కంట్రోలు బోర్డు రూపొందిస్తుంది.

(7) గుంటవాడ, దిగువ సీలేరు స్థలాల వద్ద "వీర్," డొంకరాయి లేదా ఆ సమీపంలో దిగువ సీలేరు ఆనకట్టలకు సంబంధించిన పరిశీలనలలోనూ, వాటి నిర్మాణంలోనూ, నిర్వహణలోనూ ఒరిస్సా ప్రభుత్వం. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి పూర్తి సౌకర్యాలు కలిగిస్తుంది. ఒరిస్సా ప్రాంతంలో, భూముల స్వాధీన చట్ట నిబంధనల క్రింద అవసరమైన భూములను ఒరిస్సా ప్రభుత్వం సేకరిస్తుంది. బలిమెల రిజర్వాయరు కోసం, ఆంధ్రప్రదేశ్‌లోని ప్రాంతాల విషయంలో ఒరిస్సా ప్రభుత్వానికి ఆంధ్రప్రదేశ్ ఇలాంటి సౌకర్యాలనే కలిగిస్తుంది.

(8) బలిమెల ఆనకట్ట నిర్మాణం సంయుక్త కంట్రోలు బోర్డు అధ్వర్యం క్రింద జరుగుతుంది. ఈ బోర్డులో ఒరిస్సా, ఆంధ్రప్రదేశ్‌లకు సరిసమాన ప్రాతినిధ్యం వుంటుంది. బోర్డు అధ్యక్షులుగా ఉభయ రాష్ట్రాల ముఖ్యమంత్రులు ఒకరి తరువాత ఒకరు ఒక్కొక్క సంవత్సరం పాటు వ్యవహరిస్తారు. ఒరిస్సా ముఖ్యమంత్రి మొదట బోర్డు అధ్యక్షులుగా వుంటారు. బలిమెల వద్ద ఒరిస్సా ప్రభుత్వం, గుంటవాడ "వీర్" వద్ద ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పనులు చేపడతాయి.

(9) బలిమెల ఆనకట్టవద్ద ఆంధ్రవాటా జలాలను వినియోగించే విద్యుత్కేంద్రాన్ని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం స్వంత ఖర్చుతో నిర్మిస్తుంది. దీనిని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వమే నిర్వహిస్తుంది. ఇది పూర్తిగా ఆంధ్ర ప్రభుత్వ ఆధీనంలో వుంటుంది. పెన్‌స్టాకులు మొదలైనవాటికయ్యే ఖర్చులు ఈ వ్యయంలోనే చేరుతాయి. బలిమెల హైహెడ్ విద్యుత్కేంద్రాన్ని ఒరిస్సా ప్రభుత్వం నిర్వహిస్తుంది. ఇది పూర్తిగా ఆ ప్రభుత్వ హక్కు భుక్తాలలో వుంటుంది. ఇందుకు సంబంధించిన ఖర్చులన్నింటినీ ఒరిస్సా ప్రభుత్వమే భరిస్తుంది.

10. బలిమెల ఆనకట్ట దిగువన, సీలేరునది, దాని ఉపనదుల ప్రవాహాన్నంతటినీ ఆంధ్రప్రదేశ్ యదేచ్ఛగా ఇష్టమైనప్పుడు వినియోగించుకోవచ్చు. అవసరమైన నిర్మాణాలను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సాగిస్తుంది. అదే విధంగా హైహెడ్ పవర్‌హౌస్ దిగువన పూర్తి జలాలను ఒరిస్సా వినియోగించుకోవచ్చు.

11. మాచ్‌ఖండ్ బేసిన్‌లోనికి ఇతర వనరులనుంచి అదనపు జలాలను మళ్లించవలసివస్తే దానిలో సగం భాగాన్ని ఆంధ్రప్రదేశ్‌కు లభింపజేయడం జరుగుతుంది. జలాల మళ్లింపుకూ, నిలువకూ అయ్యే ఖర్చులో సగం మొత్తాన్ని ఆంధ్రప్రదేశ్ భరించాలి.

12. ఈ ఒప్పందంపై సంతకాలు జరగడంతో, రెండవ

క్లాజులో నిర్దేశించిన కార్యక్రమాన్ననుసరించి ఒరిస్సా భూభాగంలో నది ప్రవహించే ప్రదేశంలో గుంటవాడ "వీర్" నిర్మాణం తదితర అనుబంధ పనులను చేపట్టవచ్చు. ఇదే విధంగా బలిమెల ఆనకట్ట నిర్మాణానికి సంబంధించిన పనులను వెంటనే ప్రారంభించవచ్చు.

13. ఈ ఒప్పందంలోని షరతులలో ఏమైనా మార్పులు జరగాలంటే అందుకు ఉభయ పక్షాలూ అంగీకరించాలి.

ఎగువ సీలేరు జలవిద్యుత్ ప్రాజెక్టు మొదటి దశ ఆంధ్ర ప్రదేశ్‌లో అసమానమైనది. ఈ ప్రాజెక్టు వల్ల అనేక లాభాలున్నాయి. ఆర్థికంగా ఇది లాభసాటియైనది. సులభసాధ్యమైనది. దీనిని త్వరితంగా నిర్మించవచ్చు. విద్యుచ్ఛక్తిని శీఘ్రంగా వినియోగంలోకి తేవచ్చు. పెట్టుబడికి ప్రతిఫలం అత్యధికంగా లభిస్తుంది. ప్రస్తుతం పనినుంచి విడుదలైన యంత్రపరికరాలనూ, అనుభవజ్ఞులైన సిబ్బందినీ, నిర్వహణ వ్యవస్థను వినియోగించుకోవచ్చు. విదేశ మారకద్రవ్యంకూడా తక్కువగానే అవసరమవుతుంది.

దేశంలో ఆర్థికంగా మిక్కిలి లాభసాటియైన జలవిద్యుత్ ప్రాజెక్టులలో ఇది ఒకటి. రూ. 6 కోట్ల పెట్టుబడితో వంద మె. వా. విద్యుదుత్పత్తిని సాధించవచ్చు. అంటే ఒక కి. వా. విద్యుదుత్పత్తికి సుమారు రూ. 600 లు అవుతుంది. భారతదేశంలో యుద్ధానంతరం విద్యుత్ ప్రాజెక్టులపై ఒక కి. వా. విద్యుదుత్పత్తికి రూ. 1,000 మొదలు రూ. 2 000 లకు పైగా ఖర్చవుతున్నది.

ఇది సాధారణమైన ప్రాజెక్టు. ఇదే నదిపై 50 మైళ్ల ఎగువన వున్న మాచ్‌ఖండ్ జలవిద్యుత్ పథకం చివరి జలాలను ఇది వినియోగించుకుంటుంది. దీనికి ఆనకట్ట నిర్మించవలసిన అవసరం లేదు. సాధారణమైన మళ్లింపు "వీర్"ను నిర్మిస్తే చాలు. ఇదే ఉత్తరోత్తరా కొనసాగే అభివృద్ధి దశలలో ఆనకట్టలో భాగంగా రూపొందుతుంది. అఘాతానికి ముందు మళ్లింపు 'వీర్' నీటిని ఆనుకొని ఒక పెద్ద సరస్సు వుంది కాబట్టి ఇక్కడ విద్యుచ్ఛక్తికి కాలువ అవసరంలేదు. మళ్లింపు వీర్‌నుంచి చిన్న చిన్న పెన్‌స్టాకులు నేరుగా బయలుదేరుతాయి. ఈ సరస్సును, లోయకు అడ్డంగా మట్టికట్టలు వేసి ఏర్పరిచారు. ఈ ప్రాజెక్టు ఆంధ్ర ప్రదేశ్‌కు అత్యవసరం.

ఆనకట్టనూ, విద్యుచ్ఛక్తి ఉత్పత్తికి కాలువనూ లేదా సొరంగాలనూ నిర్మించవలసిన అవసరంలేదు కాబట్టి ప్రాజెక్టును మూడు లేదా నాలుగు సంవత్సరాల స్వల్పవ్యవధిలోనే పూర్తి చేయవచ్చు.

ఆంధ్రప్రదేశ్ అంతటికీ విస్తరించివున్న విద్యున్మార్గాలు (పవర్‌గ్రిడ్) వుండటంవల్లా, పారిశ్రామికావసరాల నిమిత్తం. భారీ ఎత్తున విద్యుచ్ఛక్తి అవసరమవడంవల్లా ఈ ప్రాజెక్టు ద్వారా లభించే విద్యుచ్ఛక్తిని మూడు సంవత్సరాల స్వల్పవ్యవధిలోనే సంపూర్ణంగా వినియోగించుకొని పూర్తి ప్రయోజనం పొందవచ్చు.

పై కారణాల వల్ల ఈ ప్రాజెక్టు లాభసాటిదిగా అసమానమైనదవుతుంది. సుమారు రూ. 8 కోట్ల పెట్టుబడి, వడ్డీలపై ప్రాజెక్టు వినియోగంలోకి వచ్చిన నాలుగవ సంవత్సరంలోనే ప్రతిఫలం నికరంగా 11_2 శాతం వరకూ వుంటుంది.

జాలాపుట్ ఆనకట్ట, మాచ్‌ఖండ్ విద్యుత్కేంద్రంతోసహా మాచ్‌ఖండ్ జలవిద్యుత్ ప్రాజెక్టు పూర్తయింది. విద్యుత్కేంద్రం, ఇదేనదిపై 50 మైళ్ల ఎగువన వుంది. ప్రాజెక్టు మొదటి దశ వినియోగంలోకివచ్చింది. అదనంగా మూడు విద్యుదుత్పాదక విభాగాలను నెలకొల్పే రెండవదశ పనులు చురుగ్గా సాగుతున్నాయి. పై ప్రాజెక్టునుంచి రెగ్యులేటెడు విధానంలో విద్యుచ్ఛక్తి కొరకు సుమారు 1400 క్యూసెక్కుల నీరు ఎగువ సీలేరుకు నిరంతరం లభించగలదు. నదికి అడ్డంగా తక్కువ ఎత్తున "వీర్"ను మాత్రం నిర్మించడంవల్ల ఎగువసీలేరుకు, విద్యుచ్ఛక్తి నిమిత్తం సుమారు 18,00 క్యూసెక్కుల నీరు నిరంతరం లభిస్తున్నది.

మాచ్‌ఖండ్-సీలేరు బేసిన్, జలవిద్యుచ్ఛక్తిని లాభసాటిగా అభివృద్ధి పరచడానికి చాలా అనువైనది. మాచ్‌ఖండ్ సుమారు 850 అడుగుల ధారనుంచి 110 మె. వా. విద్యుచ్ఛక్తిని అభివృద్ధి పరుస్తున్నది. 50 మైళ్ల దిగువనవున్న మాచ్‌ఖండ్ చివరి జలాల పథకమైన ఎగువ సీలేరు ప్రాజెక్టు, 440 అడుగుల ధారను వినియోగించుకొన గలుగుతుంది. ఇదే నదిపై ఇంకా 25 మైళ్ల దిగువనున్న ఎగువ సీలేరు చివరి జలాల పథకమైన దిగువ సీలేరు ప్రాజెక్టు మొత్తం 800 అడుగుల ధారను వినియోగించుకొనగలుగుతుంది. ఈ విధంగా ఈ బేసిన్ పూర్తి విద్యుదుత్పాదక శక్తి 800 మె. వా. లకు పైగా వుంటుంది.

ఎగువ సీలేరు ప్రాజెక్టు ప్రథమ దశ క్రింద దిగువ పనులు జరుగుతాయి :—

(1) గుంటవాడవద్ద సుమారు 35 అడుగుల ఎత్తున మళ్లింపు వీర్. దీని రెండు వైపులా కొద్ది ఎత్తున మట్టికట్టలు.

(2) సాడల్స్‌కు అడ్డంగా తక్కువ ఎత్తున మట్టికట్టలతోనూ, సరస్సులోకి వ్యాపించిన నదీజలాలను విద్యుచ్ఛక్తి నిమిత్తం విడుదల చేయడానికై రెగ్యులేటింగ్ గేట్లతోనూ "వీర్" కు దిగువన ఒక సరస్సు.

(3) సరస్సునుంచి విద్యుత్కేంద్రం వరకు కొద్దిపాటి పెన్ స్టాకులు.

(4) విద్యుత్కేంద్రం భవనం. నది వరకు టేల్ రేస్.

(5) ప్రారంభంలో 60 మె. వా. విద్యుచ్ఛక్తిని ఉత్పత్తి చేసే రెండు యూనిట్ల స్థాపన. కడసారిగా అయిదు యూనిట్లు నెలకొల్పడానికి అవకాశం వుండాలి. (మళ్లింపు వీర్‌తో కలుపుతూ గుంటవాడవద్ద నిర్మించే ఆనకట్టసహా 60. మె. వా. విద్యుచ్ఛక్తిని ఉత్పత్తి చేసే మూడు అదనపు యూనిట్ల స్థాపనా తరువాతి అభివృద్ధి దశలలో జరుగుతాయి.)

(6) ఎగువ సీలేరు నుంచి ఆంధ్రప్రదేశ్ గ్రిడ్ పై 132 కె. వి. సబ్‌స్టేషను అయిన రాజమండ్రి వరకు సుమారు 85 మైళ్ళ పొడవున 132 కె వి. ట్రాన్స్‌మిషన్ లైను. ఎగువ సీలేరు నుంచి ప్రస్తుత మాచ్‌ఖండ్ విద్యుత్కేంద్రం వరకు సుమారు 50 మైళ్ళ పొడవున 132 కె. వి. ట్రాన్స్‌మిషన్ లైను.

ఈ పథకాన్ని కేంద్ర జలవిద్యుత్ సంఘంవారితో సంప్రదించి సమగ్రంగా పరిశీలించడం, స్థిరపరచడం జరిగింది.

ఎగువ సీలేరు ప్రాజెక్టు ఇదే నదపై, దాదాపు పూర్తి అయిన ప్రస్తుత మాచ్‌ఖండ్ జల విద్యుత్ ప్రాజెక్టునుంచి కొద్ది మైళ్ళ దూరంలోనే వుంది కాబట్టి మాచ్‌ఖండ్ ప్రాజెక్టు పనుల నుంచి విడుదలైన యంత్ర పరికరాలను, అనుభవజ్ఞులైన సిబ్బందినీ, నిర్వహణ వ్యవస్థనూ చాలావరకూ పటిష్ఠంగా వినియోగించుకోవచ్చును. ఈ విధంగా యంత్ర పరికరాలపై సుమారు 80 లక్షల మేరకు విదేశ మారకం ఖర్చు తగ్గుతుంది. నిర్మాణాన్ని త్వరగా ప్రారంభించి శీఘ్రంగా ముగించవచ్చు.

సీలేరు జలవిద్యుత్ ప్రాజెక్టు మొదటి దశకు రూ. 200 లక్షల వరకు విదేశమారక ద్రవ్యం అవసరమవుతుంది. కాగా విద్యుదుత్పాదక యంత్రం ఖరీదుకు మాత్రమే విదేశమారకం కావల్సివుంటుంది. ప్రాజెక్టు వల్ల కలిగే ప్రయోజనాలతో పోల్చినప్పుడు ఈ మొత్తం తక్కువే.

మాచ్‌ఖండ్, సీలేరు బేసిన్‌లో సమీకృత విద్యుచ్ఛక్తి అభివృద్ధి పరంపరలో ఎగువ సీలేరు జలవిద్యుత్ ప్రాజెక్టు ప్రథమ దశ లాభసాటియైన ఒక ముఖ్యమైన యూనిటు. దీని మొత్తం విద్యుదుత్పాదక శక్తి 800 మె. వా. లకు పైగా వుంటుంది. దశలవారీగా దీన్ని అభివృద్ధి పరచవచ్చు.



"ఆంధ్ర వ్యక్తిత్వం వికసించాలి!"

శ్రీ వావిలాల గోపాలకృష్ణయ్య
ఎం. ఎల్. ఏ.

మనం ఆంధ్రులం. ఆంధ్రాభ్యుదయం మన మహాశయం. నేడు అగస్టు 15. తెల్లదొరల పాలన నుండి పదునైదు సంవత్సరాల క్రితం బయటపడ్డాం. నదిజాము రాజ్యంగావున్న నిజాం నుండి విముక్తి పొందాం. 'మాకొద్దీ జమీందారీ పొందు' అని వదలించుకున్నాం. దేశ భాషలందు తెలుగు లెస్సయన్న తెలుగులంతా కలసిన రాజ్యం సాధించుకున్నాం. రాజు రాజ్యం వదలించుకొని ప్రజల రాజ్యంలోవున్నాం. సంఘంలో అసమానతలు రూపుమాపి, సాంఘిక న్యాయం పెంచి, సమసమాజం నెలకొల్పాలని పరుగులెత్తుతున్నాం. దీనినే సంక్షేమ రాజ్యం అంటున్నాం. దీనినే సహకార సహసంపద అంటున్నాం. దీనినే సోషలిస్టు తరహా సమాజం అని పిలుస్తున్నాం.

దోపిడీ తొలగించి సర్వులు సమానులుగా రాజ్యాంగం అందరికీ హామీ యిచ్చి పండ్రెండేండ్లయింది. రాజులు లేరు. ఇక ప్రజలు, వారెన్నుకున్న సంస్థలు; దేశానికి పార్లమెంటు, రాష్ట్రానికి శాసన సభ, జిల్లాకు పరిషత్తు, మండలానికి సమితి, గ్రామానికి పంచాయతీ; వీటి ద్వారా ప్రణాళికలు, కార్యక్రమాలు విరివిగానే సాగుతున్నాయి. ఆనాటి కన్నా ఈ నాడు ప్రభుత్వ పరంగా, ప్రజాసంక్షేమానికి అధికంగా వ్యయం చేయబడుతునే వుంది.

కాని దేశ ప్రయోజనం బదులు స్వప్రయోజనం, త్యాగం బదులు స్వార్థం, సాంఘిక న్యాయం బదులు స్వంత లాభం. అందరి ఆనందంలో తను సంతోషం పొందటం బదులు ఎవరేమైనా తన సంతోషం, కుల మతాతీతంగా వుండటం బదులు కులం, మతం ప్రాతిపదికగా ప్రజాజీవితం సాగించటం, ప్రజాధనాన్ని స్వార్థానికి ఆకట్టుకోటం ఏమాత్రమూ జరుగగూడదు. ప్రతి ఎన్నికలలో పది హేనేండ్ల స్వాతంత్ర్య అనుభవం తర్వాత పై అపగుణాలన్నీ ప్రతిబింబిస్తున్నాయో లేదో మనం ఆలోచించుకోవాలి.

ప్రజాస్వామ్యాన్ని, పార్లమెంటరీ ప్రజాస్వామ్యాన్ని మనం వరించాం. పునాదులు గ్రామాల్లో వుండాలని స్థిరపరుచుకున్నాం. ఆంధ్ర అకారాదిలోనే గాకుండా, వికేంద్రీకృత ప్రజాస్వామ్యంలోను అగ్రస్థానంలో వుండాలెనని నిర్ణయించుకున్నాం. ముందడుగు వేశాం. ప్రణాళికాబద్ధంగా ఆర్థికాభివృద్ధిలో సాగుతున్నాం.

ఆంధ్ర వ్యక్తిత్వం వికసించాలి

స్వరాష్ట్రం సాధించుకున్నందుకు స్వభాషావికాసాన్ని ప్రజల సంస్కృతిలో సముజ్జ్వలం చేదామనుకున్నాం. కాని సమాజ జీవితంలో భూస్వామ్య పెత్తనం పోయినట్లగుపడుతుంది సరే. పెత్తందారీ విధానం కూడా పోవాలి. ప్రజాస్వామ్యాన్ని ఉచ్చరించడంతోనే పరిపుచ్చకుండా, కుల అహంకారం, గ్రామ పెత్తనందారీ, జబర్దస్తీలు దినదినాభివృద్ధి పొందగూడదు. బలహీన వర్గాలకు రక్షణ ఆశయం ఉండాలి. బీద ప్రజలకు బ్రతికే అవకాశమే పూర్తిగా నిజంగా కలగాలి. సాంఘిక సమానత్వం లక్ష్యమే కాకుండా ఆశ్రిత పక్షపాతము అవంతయినా ఉండగూడదు. పువ్వు పువ్వునుండి మకరందం గ్రోలి, అందరికీ మాధుర్యమందించే తేనె టీగవలె వుండవలసినవి పన్నులు. ఉన్నవారికే హాయి, లాభం యివ్వగూడదు. సమర్థక, నిజాయితీ, దేశభక్తి కలిగి రాజకీయంలో మనవలెను. ఆశ్రిత పక్షపాతం, వ్యక్తిపూజ అభిమాన దురభిమానాలు ప్రజా జీవితాన్ని ఆవరించగూడదు. ఆంధ్రప్రదేశ్ అవతరించింది కనుక హిందీ, ఇంగ్లీషులే రాజ్యపాలన చేయగూడదు. ఆంధ్రవ్యక్తిత్వం భాషలో, వేషంలో, సంస్కృతిలో,

కళల్లో చెప్పుకోదగినట్లు వికసించాలి. పార్లమెంటరీ ప్రజాస్వామ్యంలో నడుస్తున్నాం. కనుక ప్రజాభిమతానికన్నా సంఖ్యాబలానికే ప్రాధాన్యం ఇయ్యగూడదు.

అందరిని సమానంగా చూడవలసిన కేంద్రప్రభుత్వం కూడా పరిశ్రమలు, జలవిద్యుతు, ప్రాజెక్టుల కేటాయింపుల్లో, నిర్మాణంలో, ద్రవ్య సహాయంలో ప్రోత్సహించవలెను. కొన్ని రాష్ట్రాల వత్తిళ్లకు లోనై, కొన్నింటిని చిన్నచూపు చూడదగదు. ఆంధ్రాభ్యుదయంకోసం ముక్కోటి ఆంధ్రులు ఐక్యంగా నిలువడమే మార్గం.

ఆంధ్రభాషా వికాసానికి గ్రామగ్రామాన అణిగిమణిగియున్న జాను తెలుగు పదాలను ఏరి కూర్చి తెలుగుతల్లిని అలంకరించాలి. అధికార భాషగా, బోధనా భాషగా తెలుగును ఆచరణలో అమలు జరుపుకోవాలి. నిర్మించే భవనాలలో ఆంధ్ర శిల్పసంపద వ్యక్తీకరించేటట్లు చేయాలి.

ప్రణాళికల్లో వుత్పత్తి నెక్కువచేసే పథకాల మీదనే హెచ్చు మొత్తాలను హెచ్చించాలి. ఆంధ్రప్రదేశ్ రత్నగర్భ, అన్నపూర్ణ, నదులరాజ్యం. మనకున్న అపార భౌతిక సంపదను సద్వినియోగం చేసుకొని, పరిశ్రమలు నెలకొల్పాలి. ఆహారోత్పత్తికి, విద్యుదుత్పత్తికి వీలుకలిగించే జలవిద్యుత్ ప్రాజెక్టులను నిర్మించుకోవాలె. పరిశోధనాలయాలు, వ్యావసాయిక, సాంకేతిక విజ్ఞానాన్నిచ్చే విద్యాలయాలు, ఎల్లెడెలా వెలయాలె. ఈ ముఖ్యాంశాల మీదనే ఆంధ్రాభ్యుదయం ఆధారపడివుంది. అందుచే నేటి ప్లానింగులో వీటికే అత్యధిక ప్రాధాన్యం ఇవ్వాలె. లేకపోతే అంధకారబంధురమే.

రాష్ట్రంలో పన్నుల విధింపు గరిష్టస్థాయిని చేరుకుంది. ప్రభుత్వ ఆర్థిక వనరులు వట్టి పోదగదు. ముఖ్యమైన ఆర్థిక వనరులన్నీ కేంద్రపరం కాగూడదు. అందుచే కేంద్రం ద్రవ్యసహాయమైనా ఎక్కువచేయాలి. లేదా ద్రవ్య వనరులనైనా రాష్ట్రానికి వదలాలి. అభివృద్ధి స్కీములపై సర్వాధికారాలు రాష్ట్రాలకే వుండాలి.

అభివృద్ధి ప్రణాళికలను, కార్యక్రమాలను ప్రభుత్వ పనులుగానే చూడటంగాకుండా, ప్రజలు, ప్రజా సంస్థలు, ప్రజా ప్రతినిధులు దేశపునర్నిర్మాణ కార్యక్రమాలను తమవిగా భావించి, పథకాల రచనలో, నిర్వహణలో చొరవతో కృషి చేయాలి.

పంచాయతీరాజ్య విధానాన్ని అమలు జరుపుటకు పూనుకోటం సంతోషమే. కాని ఈ వికేంద్రీకరణ వికృతీకరణ గాకుండా ప్రజాస్వామ్యానికి అట్టడుగు పునాదులైన వీటిని ప్రజానుగుణ్యంగా నిర్వహించడం ద్వారా వికేంద్రీకరణపై విశ్వాసం గల్గించాలె.

నేడు కుల, మత తత్వాలు వెర్రితలలువేసి సక్రమ రాజ్యాంగ నిర్వహణను కుంటుపడ జేస్తున్నవి. సామాజిక జీవితాన్ని కలుషితం చేస్తున్నవి. వీటినుంచి బయటపడినప్పుడే మనకు ముక్తి.

విభిన్నతలోనే ఐక్యతవుంది. ఆంధ్ర వ్యక్తిత్వం నశింపబడటం ద్వారా గాక, యింకా పెంపొంది పోషింపబడటం ద్వారానే భారత జాతీయ సమైక్యత ఉద్ధరింపబడుతుందన్న దేశభక్తి వినాదమే నా గాఢ విశ్వాసం.

విశుద్ధ పరిపాలన అవసరం

ఆంధ్రప్రజలు కష్ట నష్టాలకులోనై చెల్లిస్తున్న ప్రతి పైసా దుబారాలకు, ఆడంబరాలకు ఖర్చుబడిపోకుండా దేశ ప్రయోజనానికి వినియోగపడుతున్నదనె విశ్వాసం గల్గించాలె. నీతి నిజాయితీలతో కూడిన, పౌరుసరితనం గలిగిన సామాన్య మానవునికి సంతృప్తి గలిగించే విశుద్ధ పరిపాలన అవసరం.

త్యాగం లేని దేశభక్తి లేదు. జాతీయ స్వాతంత్ర్య సమరంలో లాఠీ దెబ్బలు, జైళ్లు, ఉరి కంబాలకు గురికావటం నాటి త్యాగాలయితే, జాతీయ పునరుద్ధరణ సమరంలో, ప్రణాళికా నిర్వహణలో, నిర్మాణ కార్యక్రమాలలో, నిస్వార్థంగా పాల్గొనడం, వీటి లాభాలు, ముందు తరాలవారికి అప్పజెప్పటం ఈ నాటి త్యాగం దేశ భక్తి. దేశ భక్తి — దేశం ఎవరి సొత్తు కాదు. అందరి ఆస్థి.

త్యాగాలకు విలువలు ఆర్జించటం మరచి, స్వంత లాభం కొంత మానుకొని పొరుగు వానికి సహాయపడే మన తత్వంతో, నిరాడంబరతతో, ముందు తరాలవారి మన్ననలందుకొనేటట్లు తరతరాల ఆంధ్రవ్యక్తిత్వాన్ని నిలుపుకుంటూ, భారత జాతీయ సమైక్యతను పోషించుకుంటూ సామ్యవాద సమాజ నిర్మాణానికి సాగుతూ, ఆంధ్రాభ్యుదయం కోసం ఐక్యతతో కృషిచేద్దాం.

— జై ఆంధ్ర —

[illegible]

శ్రీ వి. రామలింగారెడ్డి

మన దేశము సాంఘికంగా విశిష్టమైనది. బహుశా మనదేశములో ఉన్న వివిధ రకాలైన జాతులు, తెగలు, వివిధభాషలు, ప్రపంచములో మరే దేశములో వుండవని చెప్పవచ్చు. ఈ వివిధ జాతుల ప్రజలకు, భిన్న భిన్న ఆచార వ్యవహారాలు, సాంస్కృతి ఉన్నాయని, అందరూ ఒక రకమైన పురోగమనస్థాయి (State of Development) లో లేరని తెలిసినప్పుడు మనదేశ సాంఘిక చరిత్రకున్న విశిష్టత బోధ పడుతుంది. కొండగుహల్లోను, భీకర అరణ్యాలలోను నివసిస్తున్న ఆదిమజాతులు మొదలు బాగా నాగరికులనబడే వారి వరకూ అందరినీ చూడవచ్చు మన దేశంలో.

ముఖ్యంగా మన దేశంలో ఉన్నంత మంది ఆదిమవాసులు మరే దేశంలోనూ లేరు. వీరు దాదాపు మనదేశ జనాభాలో 5% అంటే 2 కోట్లమంది ఉంటారని అంచనా. వీరు భారత దేశపు వివిధ ప్రాంతములలో ఉండటం మూలానా భౌగోళిక, నైసర్గిక వాతావరణ ప్రభావమువల్ల నైతేనేమి, అనేక రకములైన భాషలు, వివిధ ఆచార వ్యవహారాలు, ప్రత్యేకమైన చరిత్ర అలవడినది. దక్షిణభారత దేశంలో కనిపించే ముఖ్యమైన ఆదిమవాసజాతులు. గోండులు, సవరలు, కోయలు, లంబాడీలు, చెంచులు, తోడలు, కురుంబులు ముఖ్యులు.

ఆంధ్రప్రదేశ్ లో ఉన్న ముఖ్యమైన ఆదిమ జాతులలో చెంచులు ఒకరు. వీరుముఖ్యముగా కర్నూలు జిల్లాలోని నల్లమల కొండలలోను, మహబూబ్‌నగర్ జిల్లా కొండలలోను నివసిస్తారు. ఒక కర్నూలు జిల్లాలోనే 1961 సం॥ర జనాభా లెక్కల ప్రకారం 4698 మంది ఉన్నారు. వీరు నివసించే వాటిని "గూడెములు" అంటారు. అటువంటివి కర్నూలు జిల్లాలో 46 ఉన్నవి... వీరు అనేకవందల సంవత్సరాలనుండి ఈ కొండల్లో నివసిస్తున్నా ఒకొక్కప్పుడు బయటనుండి అక్కడికిపోయి నివాసమేర్పరచుకొన్న వారేకాని, నిజంగాఆదిమ జాతివారుకారు, అని ఒక వాదన ఉంది. ఏదైనా అనేక వందల సంవత్సరాలనుండి వీరు కొండప్రాంతములలో నివసిస్తూ, బయటి ప్రపంచము తోటి సంబంధములేక పోవటంవల్లనేమి, ప్రత్యేక భౌతిక లక్షణాలు, ఆచార వ్యవహారాలు. సాంఘిక కట్టుబాట్లు అలవడి, వీరికి ప్రత్యేక విశిష్టత చేకూర్చుతున్నవి. వీరు. మాట్లాడే భాష తెలుగు అయినా మాట వరుసలో ప్రత్యేకత ఉంటుంది. మన ఆంధ్ర దేశంలో ఉన్న తక్కిన ఆదిమ జాతులతో పోల్చి చూచినప్పుడు చెంచులు తక్కిన వాళ్ళతో చాలా కలసి మెలసి ఉంటారని చెప్పవచ్చు. వీరు చాలా వ్యక్తిత్వము గలవారు అయినా సోమరి తనము వీళ్ళలో యెక్కువగా కనిపిస్తుంది. కలరా, మసూచికము అంటే వీళ్ళకు విపరీతమైన భయము. యెందుకంటే ఒక మాటు ఇటువంటి అంటువ్యాధులు వస్తే వందల మంది చెంచులను పొట్టపెట్టుకుంటాయి. పది సంవత్సరముల కు పూర్వమున్న చెంచు జనాభా ఇప్పుడులేదు. యెందుకంటే 1959 లో శివరాత్రి పండుగప్పుడు వచ్చిన కలరా జబ్బువల్ల అనేక మంది చెంచులు చని పోయారు. వీరికి ఇతరరులపైన నమ్మకము ఏర్పడితే వాళ్ళకు ఎంత సేవ చేయడానికైనా వెనుకాడరు. త్రాగుడు ఒక పెద్ద దురలవాటు. ఆడవాళ్ళు కూడా త్రాగుతారు. ఈ రోజుకు కావలసినంత తిండి ఉంటే రేపటిని గురించి ఆలోచించే అలవాటు వీళ్ళలోలేదు.

చెంచులు మంచి దృఢకాయులు. చెంచుస్త్రీలు చాలా అందంగా ఉండేవారట, కాని వారి ప్రస్తుత అందవిహీనతకు ఒక కథచెబుతూ ఉంటారు. ఆహోబిలము దేవుడైన 'నరసింహస్వామి' చెంచిత అన్న అందమైన అమ్మాయిని తీసికెళ్ళి బలవంతంగా పెళ్ళి చేసుకున్నాడని, దానిమీద చెంచితకోపగించి ఇక మీదట తన జాతిస్త్రీలకు ఇటువంటి అన్యాయము జరగకుండా ఉండటానికి, చెంచుస్త్రీలు అందవిహీనంగా పుట్టుదురుగాక అని శపించినదనీ కథ. చెంచులకు కులదైవము అహోబిల నరసింహస్వామి.

చెంచులు నివసించేవి అరణ్య ప్రాంతాలయినా అక్కడక్కడా పెద్దపెద్ద మండపాలలో నిర్మించబడిన బహుసుందరమైన దేవాలయాలు, పెద్ద పెద్ద తటాకాలు కనుపిస్తాయి. కర్నూలు జిల్లాలోని అహోబిలములోని నరసింహస్వామి దేవాలయము సుప్రసిద్ధమైన శ్రీశైల మల్లికార్జున దేవాలయము, పెచ్చెరువు గూడెందగ్గర ఉన్న పెద్ద చెరువు, పెచ్చెరువు, బెయిర్‌టూటి, నాగటూటి దగ్గర ఉన్న పెద్ద దేవాలయాలు అన్నీ కూడా చెంచు గూడేలకు దగ్గరగాఉన్నవే. అందువల్ల ఈ ప్రాంతాలన్నిటిలో కూడా ఒకప్పుడు నాగరికులయిన ప్రజలు నివసిస్తూ పెద్ద పెద్ద రాజులు చేత పరిపాలింపబడిన ప్రాంతములే అయి ఉండాలని తేలుతుంది.

చెంచులకు ప్రత్యేకమైన ఆచార వ్యవహారాలు అంతకంటే బలమైన సాంఘిక కట్టుబాట్లు ఉన్నాయి. వాళ్ళకు కుల పంచాయతి అనే సంస్థ ఉంటుంది. అదే చెంచుల మధ్య వచ్చే తగాదాలన్నిటినీ తీరుస్తుంది. ఆ సంస్థకు విశేషమైన అధికారాలు ఉంటాయి, దాని తీర్పుకుతిరుగులేదు. చెంచులలో పెళ్ళిళ్లు తక్కిన ఆదిమవాసుల పెళ్ళిళ్లలాగానే జరుగుతాయి. పెళ్ళిచేసుకోదలుచుకున్న యువతీ యువకులిద్దరు ఎవరికి తెలియకుండా ఒక రోజు రాత్రంతా కొండ లోనికి పోతారు. వారు తిరిగి రావడంతోనే వాళ్ళ తల్లి దండ్రులు నలుగురు పెద్దలను పిలిపించి వాళ్ళిద్దరు పెళ్ళి చేసుకొన్నట్లు అధికారికంగా ప్రకటిస్తారు. పెళ్ళి అయిన చెంచు స్త్రీ మరి ఒకరితో పోయిందంటే కొత్తగా ఆమెను చేర దీసినవాడు ఆమె ముందు భర్తకి కొంత భరణము ఇచ్చుకోవాలి. ఎంత ఇవ్వవలయునన్నది కుల పెద్దలు నిర్ణయిస్తారు. ఇదే విధంగా వారికి అనేక రకమైన సాంఘిక కట్టుబాట్లు ఉన్నవి. వీటిని ఎవరైనా ఎదిరించితే వాళ్ళను వెలివేసి హీనంగా చూడటం కూడా పరిపాటి.

చెంచులలో స్త్రీలకు ప్రత్యేకమైన స్థానముంది. కుటుంబాన్ని చక్కబరచటం, పిల్లలను పోషించడమే కాకుండా కుటుంబానికి కావలసిన ఆహారాన్ని సంపాదించే బాధ్యత పురుషునితోటి సరిసమానంగా ఉంటుంది. చెంచు స్త్రీలకు ఇష్టమున్న వాళ్ళతో ఉండటానికి స్వాతంత్ర్యము ఉంది. వాళ్ళకు తిరిగి పెళ్ళాడే హక్కు కూడా ఉంది.

ప్రతిఒక్క చెంచూ ఒక విల్లు బాణముతో పుడతాడని ఒక సామెత ఉంది. వేట అన్నది వాళ్ళకు పుట్టుకతో వచ్చిన విద్య అడవులలో ఉన్న చిన్న చిన్న మృగాలను చంపడం, తినడం మామూలు. పూర్వము వీళ్ళకు వేట ఒక ప్రధాన వృత్తిగా ఉండి జీవనాధారంగా ఉండేది. అడవుల్లో దొరికిన పండ్లు, ఫలాలు, వేట ఆడిన జంతువుల మాంసముతోటి కాలము గడిపే వారు. కాని రానురాను తిరుగుడు జీవితము మాని ఒక చోట స్థిరనివాసం ఏర్పరచు కొనడం మొదలుపెట్టినారు. పశువులను మచ్చిక చేసుకొనడం, వ్యవసాయం చెయ్యడం కూడా మొదలు పెట్టినారు. అదే సమయంలో చెంచులలో రెండు వర్గాలు యేర్పడినవి.

సాంప్రదాయ సిద్ధంగా వస్తున్న తిరుగుడు జీవితం మాని ఒక చోట స్థిరనివాస మేర్పరచుకొని వ్యవసాయం చేయటం ఒక వర్గానికి సరిపడలేదు. వీళ్ళుతక్కిన వాళ్ళను ఎదిరించి సఫలీకృతులు కాకఅక్కడ నుండి పారిపోయారని వాళ్ళే యానాదులుగా మారారని కూడా అంటారు. ప్రస్తుతం చెంచులందరికి వ్యవసాయం ముఖ్యాధారమైనప్పటికి, చాలా మంది కొండ ప్రాంతాలలో దొరికే పండ్లు, వేర్లు, తేనే మొదలగు వాటితో జీవిస్తుంటారు వాళ్ళ భుక్తి కోసం అడవులకు విపరీతంగా నష్టం కలిగించేవారు. కొన్ని చేపలను పట్టుకోవడం కోసం ఒకచెరువునంతా విషము కలపడానికి గాని కొన్నిపండ్లుకోసు కొనడం కోసం ఒకపెద్ద చెట్టును నరకడానికి గాని వెనుకాడరు. వీటి మూలాన అటవీ శాఖ వారు వీరిపైన కొన్ని నిబంధలను విధించి కొద్ది పాటిహక్కులనే వీరికిచ్చారు. చెంచులకు ముఖ్యంగా తేనే చింత పండు సారపప్పు. లక్క కొన్ని మూలికలు అమ్మటం వలన మంచి ఆదాయము వస్తుంది. ఇదే కాకుండా శివరాత్రి పండుగకు శ్రీశైలము వచ్చే యాత్రికులలో ఒక్కొక్కరికి 0-2-0 చొప్పున వసూలు చేస్తారు. ఈ విధంగా వాళ్ళకు సంవత్సరానికి రు. 10,000/- ఆదాయం వస్తుంది ఈ ఆదాయాన్ని అన్ని చెంచు గూడాలకు సమానంగా పంచుతారు.

పూర్వము వీరుచేసే దుండగకృత్యాలను పురస్కరించుకొని ప్రభుత్వమువారు ఒకప్పుడు Criminal Act ను వీళ్ళకు వర్తింపచేటట్లు చేశారు.

చెంచుల సాంఘికాభివృద్ధి (Social Welfare measares) కార్యక్రమాలు దాదాపు 10 సంవత్సరాలనుండి విస్తృతంగా అమలులో ఉన్నవి. అటవీశాఖవారు లోగడనే తిరుగుడు జీవితము గడుపుతున్న చెంచులను వ్యవసాయదారులుగా మార్చడానికి

ప్రయత్నం చేశారు. స్వాతంత్ర్యంవచ్చినప్పటినుండి కూడా అనేకమైన సాంఘికాభివృద్ధి కార్యక్రమములు అటవీశాఖవారు నిర్వర్తిస్తూ వస్తున్నారు. ముఖ్యంగా కర్నూలు జిల్లాలోని దాదాపు 5000 చెంచులకు అనేకవిధములయిన సహాయం లభిస్తున్నది. ప్రభుత్వమువారు ఫారెస్ట్‌రేంజి అధికారి హోదాలో అసిస్టెంటు చెంచు అధికారిని వారి కార్యక్రమాలను సక్రమంగా నిర్వర్తించటానికి నియమించినారు.

ఆంధ్ర ప్రభుత్వం, అటవీశాఖ వారి ప్రయత్నంవల్ల చెంచుల అభివృద్ధికోసం అనేక సంస్థలు నెలకొల్పబడినది.

వ్యవసాయము

కర్నూలు జిల్లాలో దాదాపు 1600 వందల ఎకరముల భూమి చెంచులచే సాగులోనికి తీసుకురాబడినది. వీరు ముఖ్యం పండించే పంటలు జొన్నలు, అరికలు, కంబులు, ఉలవలు మొదలైన ధాన్యపుపంటలు. రెండవ పంచవర్ష ప్రణాళికలో కేంద్ర ప్రభుత్వము గ్రాంటుతో దాదాపు 250 ఎకరముల భూమిని సాగులోనికి తీసుకురావటం కూడా జరిగింది. వీటికోసం ప్రభుత్వం భూమి అభివృద్ధి అప్పులు, మంచి పశువులను కొనుటకు అప్పులను మంజూరు చేస్తున్నది.

విద్య

చెంచులను విద్యావంతులుగా చేయవలయునన్న ప్రయత్నముతో ఉచిత భోజన సౌకర్యములతో కొన్ని పాఠశాలలు ప్రారంభింపబడినవి. కర్నూలు జిల్లాలో బైర్లూటి దోర్నాల దగ్గర ఉన్న బోరింగు పాఠశాలలలో దాదాపు 300 చెంచుపిల్లలు చదువుకుంటున్నారు. ఇవికాక 20 మామూలు ప్రాథమిక పాఠశాలలను కూడా నెలకొల్పడం జరిగింది. పై పాఠశాలలలో మొత్తం 661 చెంచుపిల్లలు చదువుకుంటున్నారు.

ఆరోగ్యము

చెంచులను అంటువ్యాధులనుండి తప్పించడం వారి ఆరోగ్య సౌకర్యాలను పెంపొందించటం కోసం ప్రభుత్వం పెచ్చెరువు, బైయికోలూటి, దోర్నాలవగ్గర మూడు అస్పత్రులను నెలకొల్పి వీరి ఆరోగ్యాభివృద్ధికి విశేషమైన కృషి చేస్తున్నది.

సహకారము

చెంచులు అడవిలో ప్రోగుచేసిన తేనే, లక్క, చింతపండు మొదలగునవి మంచి ధరతో అమ్మించే ఉద్దేశ్యముతో సహకార సంస్థలనుకూడా స్థాపించటం జరిగినది. ఆత్మకూరు దోర్నాల దగ్గర ఉన్న కోఆపరేటివ్ పర్చేజ్ అండ్ సేల్ సొసైటీలు బాగా పని చేస్తున్నవి. ఈ రెండు సంఘాలలోను దాదాపు 770 మంది చెంచులు సభ్యులుగా ఉంటున్నారు.

ఇంతేగాక కేంద్ర ప్రభుత్వమువారు బైయికోలూటి నాగులూటి, గూడేల దగ్గర ఒక వంద చెంచుకుటుంబాలకు పునరావాసం కల్పించటంకోసం 1956_57 సం॥లో లాండ్‌కాలనైజేషన్ సొసైటిని ప్రారంభించుటకు అనుమతించిరి. దాని ప్రకారం 100 కుటుంబాలకు ఇళ్ళుకట్టడం పూర్తయింది. ఆ కుటుంబాల చెంచులు అక్కడ నివసిస్తూ భూమిని సాగుచేస్తున్నారు.


ప్రపంచములో జరిగే ఇతర మార్పులవల్లనైతేనేమి, పై చెప్పబడిన సాంఘికాభివృద్ధి కార్యక్రమాలను ప్రవేశపెట్టడంవల్లనైతేనేమి తిరుగుడు జీవులుగా ఉంటూ దుండగ కృత్యాలు చేస్తున్న చెంచులలో సాంఘికంగా, మానసికంగా, ఆర్థికంగా విపరీతమైన మార్పు వస్తూ ఉంది. ప్రస్తుతం విద్యావంతులవుతున్న యువక తరమువారు ఆ మార్పును పూర్తి చేసేట్లు అభివృద్ధిముఖులు కావలసిఉన్నది. ఈ పని జరిగినప్పుడే ప్రభుత్వం ప్రవేశపెట్టే అన్ని కార్యక్రమాలకూ పూర్ణమైన ఫలితం కనిపిస్తుంది.



1962 సెప్టెంబరు 5వ తేదీన హైదరాబాదునుండి వెళ్ళిన డాక్టర్ భీమసేన్‌సచార్ దంపతులకు
ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి ప్రజంటేషన్స్ ఇస్తున్న దృశ్యం




సికింద్రాబాదు, అంటువ్యాధుల ఆసుపత్రివద్ద నిర్మింపబడిన అల్పాదాయవర్గాల గృహాల నమూనాలను, 1962ఆగష్టు 28వ తేదీన ముఖ్యమంత్రి, మునిసిపల్ వ్యవహారాలమంత్రి తనిఖీచేసినప్పటి చిత్రం.



సీలేరుపై ఒప్పందం: 1962 సెప్టెంబరు 4వ తేదీన హైద్రాబాదులోని గ్రీన్‌లాండ్సులో ఆంధ్రప్రదేశ్, ఒరిస్సా ముఖ్యమంత్రులు సమావేశమై సీలేరు జలాల ఒప్పందంపై సంతకాలుచేశారు. ఆంధ్రప్రదేశ్ నీటిపారుదల, విద్యుచ్ఛక్తిశాఖలమంత్రి, యితర నాయకులు యీ సమావేశంలో పాల్గొన్నారు.



అస్సాం, మణిపూరులకు వెళ్ళిన ఆంధ్రప్రదేశ్ సాంస్కృతికబృందం: హైద్రాబాదునుంచి బయిలుదేరేముందు. 1962 సెప్టెంబరు 9వ తేదీన సమాచార, న్యాయశాఖల మంత్రి శ్రీ పి. వి. నరసింహారావు, బృందం సభ్యులతో ఉన్నప్పుడు తీసిన చిత్రం.




1962 జూలై 19వ తేదీన ప్రధానమంత్రి పునాదిరాయి వేసిన హైదరాబాదులోని బాలికల పాలిటెక్నిక్
(ప్రతిపాదిత) భవనం—చిత్రకారుని దృష్టిలో




1962 ఆగస్టు 15వ తేదీనుంచి ఆర్. టి. సి. వారు నగర సర్వీసులలో ప్రవేశపెట్టిన వెనుకభాగంలో
యింజనుఉండే కొత్త అట్లాంటిన్ రెండంతస్థుల బస్సు.



హైదరాబాదు, బాలికల పాలిటెక్నిక్‌లోని రేడియో యింజనీరింగ్ లైసెన్సియేటు కోర్సులోని రేడియో లెబొరెటరీలో శిక్షణ పొందుతున్న విద్యార్థినులు.



లైసెన్సియేట్ సివిల్ ఇంజనీరింగ్ కోర్సులోని అప్లైడ్ మెకానిక్స్ లేబరెటరీలో విద్యార్థినులు శిక్షణ పొందుతున్న దృశ్యం.



శ్రద్ధాంజలి: హైద్రాబాదులో సెప్టెంబరు 28వ తేదీన దివంగతులైన పశుపోషణ. అటవీ, మత్స్యశాఖలమంత్రి శ్రీ మల్లిపూడి పళ్లంరాజుకు భక్త్యంజలి ఘటిస్తున్న ఆంధ్రప్రదేశ్ గవర్నరు జనరల్ ఎస్. ఎం. శ్రీ నగేష్. ముఖ్యమంత్రి శ్రీ నీలం సంజీవరెడ్డి ప్రభృతులు.

కథానిక :

సౌశీల్యం

'కొలకలూరి'

జీవితంలోని అన్ని దశలకూ ఏదో విధంగా అట పట్టయిన రైలు ప్లాటుఫారం విడిచిపెట్టి, పొగలు జిమ్ముకుంటూ చీకట్లో త్రోవచూచుకుంటూ వెళుతూవుంది.

రైలు కూతవిని నిద్రలేచిన ప్రకృతి వెలుతురు చూచి కళ్లు మూసుకొని మరో ప్రక్కకు తిరిగి ఆవులించి నిద్రపోతూవుంది

నిద్రపోవటానికి ప్రయత్నించి విఫలురాలయిన ముసలమ్మ బెడ్డుమీదనుంచి లేచికూర్చుని ఫ్లాస్కులో కాఫీ గ్లాసులో పోసుకొని తాగుతూ 'ఎవరూ' అంటూ ప్రక్కకు చూచింది.

అంతకు ముందుపోయిన స్టేషనులో ఫష్టుక్లాసు కంపార్టుమెంటులోకి ఎక్కిన యువకుడు 'ఏమిటండీ' అంటూ ముసలమ్మ వైపు చూశాడు, మూలకు చేరగిలబడి వున్నవాడల్లా ముందుకు వంగి.

ఆ కంపార్టుమెంటులో వాళ్ళు ఇద్దరు తప్ప మరెవరు లేరు. ఈదురుగాలి తోలుతూవుంది. కిటికీ రెక్కని ఆమె కొంచెం క్రిందికి లాగిండి.

'ఏవూరు వెళుతున్నావ్ బాబూ' అంటూ ఆమె అతని ముఖంలోకి చూచింది

మెల్లగా నవ్వుతూ, కొంచెం సిగ్గు పడుతూ వూరు పేరు చెప్పటానికే బిడియపడుతూ, క్రొత్తగా పెళ్ళయిన అమ్మాయికి భర్త పేరు చెప్పమంటే ఊరక కుంచించుకు పోయినట్లుగా తల వంచుకొని మెడ గోక్కుంటూ 'విశాఖపట్టణం' అన్నాడు.

నుదుటి ముడతల్లో ఆమె నవ్వింది. పసిపిల్లవాడి అల్లరి పనులు చూచి ప్రేమగా అమ్మ నవ్వీనవ్వకుండా ఎలా సంతోషం కనబరుస్తుందో అలా వుంది నవ్వు.

ఊరు పేరు చెప్పటానికే యువకుడు అంతగా అన్యాయం అయి పోవటంతో ఆవూరు ఎందుకు పోతున్నాడో అని అందరికీ కలిగే సంశయమే ఆమెకూ కల్గి, వృద్ధాప్యం వల్ల ఎవరిని అయినా ఎలాంటి చొరవ తీసుకుని అయినా ప్రశ్నించటం అనే అధికారం పొందిన ముసలమ్మ, 'అత్తవారింటికా?' అని అడిగేసింది.

తలవంచుకొని గోళ్ళు గిల్లుకుంటూ 'కాదు' అని చెప్పి అటూ ఇటూ చూచి 'అవును' అని ఆమె ముఖంలోకి చూచి 'కాదు అని తను పరుచుకున్న పడకమీద పడిపోయి దిండులో తల దాచుకున్నాడు.

ఆమె తలలో వెంట్రుకల కంటే తెల్లగా నవ్వింది. నవ్వుతూనే 'కాదూ అవునూ' అంటావేం బాబూ పిల్లని చూచిరా పెళ్ళి చేసుకుందువు గాని అని యింట్లో పోరు పెడితే బయలుదేరి వెళ్ళటం లేదు కదా!'.

ఈ సారి వెంటనే చెప్పాడు 'అవును'. ఈ విషయం ఎలా తెలుసుకుందో తెలియక తికమక పడుతూ ఆమె ముఖంలోకి చూశాడు.

అతని ముఖం చాలా ముద్దుగా వుంది ఆ కళ్ళలో అమాయికత్వం లాస్యం చేస్తూవుంది.

ఆమెకు ఏమి అనుమానం కలిగిందో ఏమో 'ఆ యిల్లు తెలుసా? ఆ యింటికి పోగలవా? పోయినా ఆ అమ్మాయిని సరిగ్గా చూచి రాగలవా?' గబగబా అడిగింది.

'మానాన్న విశాఖపట్టణంలో వున్నాడు. ఆయన స్టేషను దగ్గరకు వస్తాడు. మా నాన్న వాళ్ళయింటికి తీసుకు వెళతాడు' ముఖం వంచుకునే చెప్పాడు.

'పిచ్చి పిల్లాడు' ముసలమ్మ గొణిగింది.

'మీ నాన్న ఏం చేస్తారు?'

ఛీఫ్ ఇంజనీరు'

'నువ్వు ఏం చదువుకున్నావ్?'

'ఎం. ఏ'

'నీ పేరు.........'

'రాం బాబు'

ఆమె ఏమి అడగాలో, సంభాషణ ఎలా సాగించాలో తెలియలేదు. ఎంతో శ్రమ తగ్గి మరెంతో హాయిగా వున్నట్లు రాంబాబు నిద్రపోవటానికి ప్రయత్నిస్తున్నాడు.

రైలు ఏలూరులో ఆగింది.

ఫస్టు క్లాసులోకి ఒక యువతి. మరొక వృద్ధురాలు ఎక్కారు.

రైలు బైలు దేరింది.

యువతి బెడ్డు పరిచింది. వృద్ధురాలు పడుకుంది.

యువతి తల్లి వృద్ధురాలు. ముఖం తీరుచూచి పోల్చుకోవచ్చు. వృద్ధురాలికి తలలో పూలుకాని, చేతులకు గాజులు కాని, నుదుటిమీద బొట్టుగానీ, మెడలో మాంగళ్యం కాని కనిపించటంలేదు. ముక్కుకి ఒకప్పుడు ముక్కుపుడక వుండి వుండేది. ఇప్పుడు లేదు. కుట్టుమాత్రం కనబడుతుంది. చెక్కిలిమీద పచ్చపొడుపు వుంది. ఆమె పడుకున్న మరు క్షణంలో నిద్రపోయింది.

యువతి అందంగా వుంది. కట్టూబొట్టూ ఒద్దికగా వున్నాయి. వేషభాషలు మితంగా వున్నాయి.

తల్లి నిద్రపోయిన తరవాత ఏదో ఇంగ్లీషు నవల చదువుకుంటూ ఆమె కూర్చుంది.

నిద్రరాని ముసలమ్మ ఫ్లాస్కు తీసి దూరంగా వుంచి, తలగడ దిండు మార్చుకొని, యువతి వైపు చూస్తు 'ఏం పుస్తకమమ్మా అది' అంది.

యువతి పుస్తకం ఇచ్చింది. ముసలమ్మ పుచ్చుకుంది. అటూ ఇటూ తిప్పింది. 'ఇంగ్లీషా? నేను చదవలేను' అంటూ ఇచ్చివేసింది.

మళ్ళీ అడిగింది 'ఏవూరు వెళ్ళాలి?'

'సామర్లకోట'

'ఉద్యోగం చేస్తున్నావా'?

'అవును'

'ఎక్కడ'

'ఏలూరు కాలేజీలో'

'లెక్చరరా?'

'అవును'

'ఏం పేరమ్మా'

'సుశీల'

మెలకువగానే వుంది. దుప్పటి ముసుగు పెట్టి నిద్రపోతున్నట్టుగావున్న రాంబాబు మెల్లగా దుప్పటి తొలిగించి సుశీల వైపు నెమ్మదిగా చూచి దుప్పటి మళ్ళీ పైకి లాక్కొని కదలకుండా వుండటం సుశీల కానీ, ముసలమ్మకానీ చూడలేదు.

'పెళ్ళయిందామ్మా'

'కాలేదు'

'ఎందువల్ల'

'అలా అడిగితే ఎలానంది చెప్పటం. నేను పెళ్ళి చేసుకునే వ్యక్తి చదువుకొని వుండాలికదా. అసలే మాలో చదువుకున్న వాళ్లు తక్కువ పోనీ చదువుకున్న వాళ్ళకి కట్నాలు కావాలి. కట్నాలు మేం ఇవ్వలేం. ఇంకొకరయితే ఎందువల్ల పెళ్ళి కాలేదూ అని అడిగితే నాకు ఇష్టం లేదని చెప్పివుండే వాళ్ళు. నాకు పెళ్ళి చేసుకోవాలని ఇష్టమయితే వుంది కాని అందుకు అవకాశాలు చాలా తక్కువగా వున్నాయి. పెళ్ళి చేసుకోకుండా స్త్రీ ఈ సంఘంలో బ్రతికి వుండటం – అపనిందలు లేకుండా చాల కష్టం. సంఘానికి భయపడి అయినా పెళ్ళి చేసుకోవాలి. భయపడక పోతే ఏం జరుగుతుందొ నిదర్శనంగా చాలా మంది కనబడుతున్నారు. గుట్టుగా బ్రతకాలంటే పెళ్ళి చేసుకోవాలి. పెళ్ళి చేసుకోవాలంటే డబ్బు కావాలి. డబ్బు కావాలంటే ఉద్యోగం చేయాలి. ఉద్యోగం చేస్తూవుంటే పరువు మర్యాద రోడ్డు మీద కాపురం పెడతాయి. తీరా కట్నంఇవ్వటానికి తగినంత డబ్బు కూడ బెట్టే సరికి వయస్సు కాస్తా ముదరిపోతుంది. అంత వయస్సూ వచ్చే సరికి రావలసినన్ని అపనిందలూ, కట్టు కథలూ, కాకపోతే జరిగిన కథలూ లోకం అంతా ప్రాకి పోతాయి. ఒకొకప్పుడు చాలా కోపంవస్తూ వుంటుంది, పిచ్చి జనం మీద, సహించలేని కట్టుబాట్లూ ఆచారాలమీద.'

రైలు ఆగింది. చల్లగా గాలి తోలుతూవుంది. లైట్లు వెలుగుతూ వున్నాయి.

ముసలమ్మ కొంచెం ఆలోచనలో పడింది. 'మీరేం కులం వాళ్ళు'.

సుశీల మళ్లీ మాట్లాడింది. 'మిమ్మల్ని చూస్తే గౌరవ భావం కలుగుతుంది కాబట్టి చెబుతున్నాను. మరొకరే ఇలా అడిగినట్లయితే చక్కగా చీవాట్లు పెట్టేదాన్ని. హరిజనులం'.

'మీలో చదువుకున్న వాళ్ళు చాలా మంది వున్నారు కదా'!

'హరిజనులు, క్రైస్తవులు అని రెండు విభేదాలు వున్నాయి ఎక్కువ తక్కువలు కూడావున్నాయి క్రైస్తవుల్లో చదువుకున్నవాళ్ళు ఎక్కువ మంది వున్నారు. వాళ్ళు హరిజనుల్ని పెళ్ళి చేసుకోరు.'

'అదొకటా?' ముసలమ్మ బుగ్గ నొక్కుకుంటూ ఆశ్చర్యపోయింది.

'నాన్న లేరుకదూ!'

'లేరు. నేను పుట్టినప్పుడే చనిపోయారు' సుశీల కళ్ళు చెమర్చాయి. నెమ్మదిగా తుడుచుకుంది.

'అన్నదమ్ముళ్ళున్నారా?'

'లేరు'

'ఆస్తి పాస్తుల ...'

'లేవు'

'ఎలా చదువుకున్నావ్'

సుశీల నవ్వింది. ఆ నవ్వులో బాధ. ఆనందం మిళితమయి వున్నాయి ముఖంలో గతం కదిలాడింది. పాత జ్ఞాపకాల చిహ్నాలు కళ్ళలోతళతళా మెరిసిపోయాయి.

'చెప్పమ్మా' అంది ముసలమ్మ.

'చెబుతానమ్మా' అంది సుశీల.

రాంబాబు కొంచెం కదిలాడు. సుశీల గమనించలేదు. ముసలమ్మ చూచింది.

'నా నాలుగో ఏట మానాన్న గతించారు. అప్పుడు మా వూరులో ఒక పాఠశాలవుంది. అందులో ఇద్దరు పంతులమ్మలు పని చేసే వారు. ఒకామె అప్పుడే ట్రయినింగ్ తీరి మావూరు పాఠశాలకు వచ్చింది, ఆమె పేరు నవనీతం, పేరు ఎంత చక్కనిదో ఆమె హృదయం అంత మెత్తనిది. ఇప్పుడు గుంటూరు కాలేజీలో లెక్చరరుగా వుంది, ఆ॥ ...... ఆమె చక్కగా బట్టలు వేసుకొని కాళ్ళకు చెప్పులు తొడుక్కొని చేతికి గడియారం పెట్టుకొని గొడుగు వేసుకొని వస్తూవుంటే, చిరిగిపోయిన బట్టలతో, బీదతనంతో దిగులుగా వుండే నేను చూచి ఎంతో ఆశ్చర్యపడ్డాను. నిజానికి ఆమె కనిపించిన రోజు నాకు చైతన్యం కలిగిందని చెప్పాలి, అప్పటికి నాకు ఏడు సంవత్సరాలు. అప్పుడు బడికి పోవటం ఆమె కారణంగా అలవాటయింది, ఆమె గొంతు చాలా తియ్యగా వుండేది. చెల్లిని అక్కయ్య ఎలా లాలిస్తుందో అలా నన్ను ఆమె ప్రేమించి పలకరించేది. చక్కగా పాఠాలు చెప్పేది. ఆమెకు నాన్న లేడు. అమ్మ వుంది. అన్నదమ్ముళ్ళు లేరు. అక్కాచెల్లెళ్ళు లేరు. నేనంటే ఆమెకు చెల్లెలు అనే భావం వుండేది. అలాగే పిలిచేది. కొన్ని నెలలు పోయింతరవాత ఆమె వాళ్ళ అమ్మతో సహా మా యింటిలోనే వుంది. నేను చాలా తెలివి కలిగిన దానిననీ, చదివిస్తే బాగా చదువుకుంటాననీ మా అమ్మతో చెబుతూ వుండేది. అంతా మీ యిష్టం మీ చెల్లి అదృష్టం అంటూ వుండేది మా అమ్మ. మూడు సంవత్సరాలలో నన్ను అక్కయ్య షష్ఠ ఫారంలో చేర్చింది. గుంటూరులో అప్పుడు యానాది హాస్టలు వుండేది. అప్పుడది ప్రత్యేకంగా ఆడపిల్లలకోసం ప్రభుత్వం ఏర్పాటు చేసింది. అందులో ఎరుకల, యానాది ఆడపిల్లలేకాక హరిజనులు కూడా వుండే వాళ్ళు. నేను హాస్టల్లో చేరాను. అక్కయ్య మావూరు నుంచి మరొక వూరు బదిలీ అయిపోయింది. నేను ప్రతి సంవత్సరం. పాసవుతూ వుండేదాన్ని. భోజనం వూరికనే హాస్టల్లో పెట్టేవాళ్ళు. పుస్తకాలు కొనుక్కోవటానికి డబ్బులు ఇచ్చేవాళ్ళు. అమ్మ బట్టలు కొని పెడుతూ వుండేది. రెండు వారాల కొకసారి వచ్చి చూచి పోతూవుండేది. కూలి పనులు చేసి మిగిల్చిన డబ్బులతో బట్టలు కొనటం, హాస్టలుకు వచ్చి నన్ను చూచి కొనుక్కు తినటానికి ఇవ్వటం చేసేది. నేను చదువుకోకుండా వుంటే అమ్మకు రెక్కకు రెక్కతోడై వుండేది. నేను చదువుకునే రోజుల్లో నవనీతమక్కయ్య ఎక్కడ వుందో నాకు తెలియదు. అమ్మమాత్రం అప్పుడప్పుడూ చెబుతూ వుండేది. ఫలానా చోట పని చేస్తూవుందనీ, మళ్ళఏదో చదువుకుంటూ వుందట అనీ, ఉద్యోగం చేస్తూకూడా చదువుకోవచ్చుననీ ఏమేమో చెప్పేది. అయితే ఆమె నాకు ఎప్పుడూ కనబడలేదు. నేను ఎక్కడా

తప్పకుండా ప్రతి క్లాసూ పాసవుతూ స్కూలు ఫైనలుకు వచ్చే సరికి చాలా మార్పులు వచ్చాయి. మా హాస్టలులో మగ పిల్లల్ని కూడా చేర్చుకున్నారు. మమ్మల్ని మరొక హాస్టలుకి మార్చారు. అది గవర్నమెంటు హాస్టలు. అందులో ఆవకాశాలు చాలా వున్నాయి. అంతకుముందున్న హాస్టలు గవర్నమెంటు డబ్బుతో కొందరు వ్యక్తులు నడుపుతూవుండేవాళ్లు. మొదటి హాస్టలు కంటే రెండో హాస్టలు ఎంతో బాగుంది. మరొక ఆనందకరమైన విషయం. మాకు వార్డనుగా నవనీతం అక్కయ్య చేరింది. ఆమె ప్రయివేటుగా బి. ఏ. చదివి పాసయ్యి. ఆ సంవత్సరమే యల్. టి. ట్రయినింగ్ కూడా చదివింది. ఆమెనాకు కనబడితే నాలో ఉత్సాహం పొంగులువారుతుంది. ఆ సంవత్సరం నాకు ఏ లోపమూ లేకపోయింది. ఆమె చదువు కూడా చెబుతూ వుండేది. ఆమెని ఎవరయినా పెళ్లి చేసుకోవేం అంటే నన్ను పెళ్ళి చేసుకోటానికి దమ్ములున్న మగాడేడి అని నవ్వేది. ఎప్పుడూ నవ్వుతూ హాయిగావుండేది. పెళ్ళయి పిల్లలు పుట్టి, సంతోషం లేకపోగా బాధలు పడుతూ, ఏదో పోగొట్టుకున్న వాళ్ళలాగా కనబడే వాళ్ళకంటే పెళ్ళి చేసుకోక ఆనందంగా వుండే నవనీతమక్కయ్య అంటే అదో మాదిరి గౌరవం కలిగేది. గర్వంగా వుండేది. స్కూలు ఫైనలు పరీక్షలు అయిన తరువాత యింటికి పోయాను. ఆ ఏడు నేను యౌవన దశలోకి నడిచాను. అప్పుడే పోలీసు ఉద్యోగం చేసుకుంటున్న అమ్మ తరపు బంధువు పెళ్ళి చేసుకుంటానని వచ్చాడు. నేను ఇష్ట పడలేదు. పెళ్ళి జరగలేదు. పెళ్ళి చేసుకొని నేను అమ్మకి అప్పుడు కలిగించే ఆనందం కంటే ఇప్పుడే ఎక్కువ ఆనందం కలిగించ కలుగుతున్నానని నేను అనుకుంటూ వుంటాను. అయితే నాకు పెళ్ళి కాలేదని అమ్మపడే బాధ మాత్రం నేను సహించలేక పోతున్నాను. ఆమె దుఃఖం నేను చూడలేను. అయితే ఓదార్చటానికి నేను ఏ విధంగానూ సమర్థురాలను కాదు. ఏం చేయను. నాకు వచ్చిన మొదటి పెళ్ళి సంబంధం అలాదూరమయి పోయింది. ఆ తరువాత నేను కాలేజీలో చేరాను. మొదటి సంవత్సరం 600 రూపాయలు స్కాలర్‌షిప్ వచ్చింది. అది సోషల్ వెల్‌ఫేర్ డిపార్టుమెంటు నుంచి. ఆడబ్బుతేకపోతే నా చదువు కొనసాగి వుండేదికాదు. నెలకి నలభై రూపాయిల చొప్పున హాస్టలుకి చెల్లించాలి. హాస్టలుకి, కాలేజీ జీతాలకీ, నాబట్టలకీ పోను ఒక వంద రూపాయలు ఆ వేసవిలో అమ్మకు ఇచ్చాను. అమ్మకు ఎంత సంతోషం కలిగిందో నేను మాత్రం చెప్పలేను. అమ్మను విడిచిపెట్టి వుండటం, అన్నం పానం విషయంలో అలవాటులు మారటం, బట్టలు కొనటం కట్టు కోవటం అమ్మకు అందుబాటులో లేని సంగతులు కావటం వల్ల నేను అమ్మకు దూరమయి పోతున్నానని ఆమె బాధపడుతూ వుండేది. ఇంటరు రెండోయేడు కాలేజీలో చేరాను. మార్కులు చాలా బాగా వస్తూవుండేవి. మాలెక్చరరు ఒకాయన నేనంటే ఆప్యాయత చూపించటం నేను గమనించాను. పలకరించటానికి కుతూహల పడుతున్నాడని తెలుసుకోవటానికి ఎంతో కాలం పట్ట లేదు. యౌవనం ప్రారంభంకావటం వల్ల కావచ్చు, ఇప్పటికంటే అప్పుడు నేను చాలా అందంగా వుండేదాన్ని. ఒకసారి ఒక విచిత్రం జరిగింది. నేను ఒక్కదానినే కాలేజీకి వస్తున్నాను. ఆయన ఎదురుగా వస్తున్నాడు, ఆయనంటే నాకు చాలా గౌరవం. పైగా ఆ మధ్య భయంకూడా పట్టుకుంది. ఎదురుగా వచ్చిన ఆయన ఎంతో చిలిపిగా 'నమస్కారమండి సుశీలగారూ' అన్నాడు. నాకు చెమట పోసింది నేను నమస్కారం చేస్తే, తలవూపి పోవల సిన వ్యక్తి ఆలా చేయటం చాలా వింతగా అనిపించింది. నన్ను ఒకసారి సినీమాకి రమ్మన్నాడు. నేను పోలేదు. మరొకసారి తన రూంకి రమ్మన్నాడు వెళ్ళలేదు. చివరికి ఒకసారి కనబడి 'నాతో మాట్లాడవా' అన్నాడు. నేను మంచి సమాధానం చెప్పాను. ఆ సమాధానం చెప్పగలిగినందుకు ఇప్పటికీ సంతోషిస్తాను. అదేమీ లేదు. 'మా అమ్మ మాట్లాడ మంటే మాట్లాడతానూ అని'. ఆయన అడ్రసు అడిగి తీసుకున్నాడు. ఇంటికివెళ్ళి, అమ్మతో మాట్లాడి తిరిగివచ్చిన వ్యక్తి నన్ను మళ్ళీ కన్నెత్తి చూడలేదు. నాకుకోపం వచ్చింది. అయితే వానవెలిసినంత ఆనందంగా వుంది. ఆ(... అసలు చెప్పటం మరిచాను. ఆ సంవత్సరం నాకు రెన్యూలు కావలసిన స్కాలర్‌షిప్ రాలేదు. కారణం తెలియదు. ఎన్నో అర్జీలు పెట్టాను. ఒక్క దానికి జవాబులేదు. ప్రిన్సిపాల్ కూడా వ్రాశారు. ఎంతకీ సమాధానం రాలేదు. నాకు దిగులు ఎక్కువయింది. హాస్టలులో మెస్‌బిల్ పెరిగిపోయింది. ఏంచేయాలి? అంతలో పరీక్షలు దగ్గర పడ్డాయి. పరీక్షలు వ్రాశాను. మార్చినెల ఇరవైనాలుగో తారీఖుకి అయిపోయాయి. స్కాలర్ షిప్ ఆనెల చివరికి రావాలి. అప్పుడు ఒక ధైర్యం చేశాను. నవనీతం అక్కదగ్గరకు పోయి ముప్పయి రూపాయలు తీసుకొని మద్రాసు పోయాను. అప్పుడు సోషల్ వెల్‌ఫేర్ ఆఫీసు మద్రాసులో వుంది. డైరెక్టరుగారిని చూశాను. ఆయన ఆఫీసువాళ్ళమీద కోప పడ్డారు. నాకు స్కాలర్ షిప్ వచ్చింది. ప్రొసీడింగ్స్ తీసుకొని హాస్టలుకి వచ్చాను. అక్కయ్య నన్ను ఎంతో మెచ్చుకుంది. అలా ఇంటరు గడిచి పోయింది. ఆ సంవత్సరం పెళ్ళిసంబంధం ఒకటి వచ్చింది.

బి. యిడి. చదివిన వ్యక్తి. మనిషి రామరామ మరీ ఏం బాగోడు. పెళ్ళి వద్దని చెప్పాను. పెళ్ళి ఆగిపోయింది. ఆ ఏడే నేను ఆనర్సుకి అప్లై చేశాను. ఖర్చు ఎక్కువనీ, దూరం అయిపోతానని అమ్మ బాధపడింది. శీలం చెడిపోతుందేమోనని అక్కయ్య శంకించింది. అయితే ఎవరి మాటా వినకుండా నేను ఆనర్సుకి వెళ్ళిపోయాను. ఆ ఏడాది . స్కాలర్ షిప్ ఆఫీసు గుంటూరు వచ్చింది. అక్కయ్య పోయి సకాలానికి నాకు స్కాలర్ షిప్ వచ్చేట్టు చూచింది. అవసరమయినప్పుడు డబ్బు పంపుతూ వుండేది. మూడు సంవత్సరాల కాలం అలాగే గడిచిపోయింది. నేను లెక్చరరుగా ఉద్యోగంలో చేరి, అమ్మను నాదగ్గరకు పిలుచుకున్నదాకా అమ్మ భయపడుతూనే వుంది. నా ఉద్యోగం చూచి అక్కకు ఉత్సాహం వచ్చింది. ప్రైవేట్‌గా ఎం.ఏకి వెళ్ళింది. పాసయింది. లెక్చరరుగా ఉద్యోగంలో చేరింది. ఒక్కమాటలో చెప్పాలంటే అక్కయ్య మంచితనం, సోషల్ వెల్ ఫేర్ డిపార్టుమెంటు స్కాలర్ షిప్పు నన్ను మనిషిని చేశాయి. సుశీల అప్పటిదాకా చెప్పి మెల్లగా వెనక్కు అనుకుంది.

ముసలమ్మ గాఢంగా నిట్టూర్పు విడిచింది.

తూర్పు తెల్లవారింది.

రైలు రాజమండ్రి స్టేషనులో ఆగింది.

రాంబాబు లేచి బ్రష్ తీసి ముఖం కడుక్కుంటున్నాడు.

సుశీల అతని వైపు చూచి విపరీతంగా సిగ్గు పడిపోయింది.

ఎదురుగా పడుకుంది మగవాడనీ, పైగా యువకుడనీ, ఇంకా అందగాడనీ ఆమె అనుకోలేదు.

తను మాట్లాడింది అంతా విన్నాడు కాబోలు అనుకోగానే ఎంతో చక్కని దిగులు కలిగింది.

'ఏమిటమ్మా అతనికంటే ఎక్కువగా సిగ్గుపడుతున్నావ్' అంది ముసలమ్మ.

సుశీల మాట్లాడలేదు.

రాంబాబు ముఖం కడుక్కొని తిరిగి వచ్చాడు. 'మీరు ఏ డిపార్టుమెంటులో లెక్చరరు?' అడిగాడు.

రాంబాబు ధైర్యానికి ముసలమ్మ ఆశ్చర్యపోయింది.

సుశీల పలకలేదు. అతను మళ్ళీ అడిగాడు.

'చెప్పండి. చెప్పటం తప్పుకాదు'

ఆమె చెప్పింది.

'ఇంగ్లీషు'

'నేను రాత్రి నిద్రపోలేదు' రాంబాబు చెప్పుతున్నాడు. 'మీరు చెప్పింది అంతా విన్నాను.' తలవంచుకున్నాడు.

సుశీల అతనిముఖం చూడలేక పోతూవుంది.


రాంబాబు తనని గురించి చెప్పుకున్నాడు. ఆమె వింది.

సామర్లకోటలో రైలు ఆగింది. సుశీల తల్లితో పాటు దిగింది.

రాంబాబు ముసలమ్మతో ఇలా చెప్పాడు. 'వాల్తేరు స్టేషనులో మానాన్న నాకోసం ఈ కంపార్టుమెంటు దగ్గరకు వస్తాడు. మీరు నాగురించి చెప్పండి. నా పెళ్ళికోసం ఆయన మరి ప్రయత్నం చేయనక్కరలేదనికూడా చెప్పండి' తొందర తొందరగా, ఉత్సాహంగా రాంబాబు చెప్పుకు పోతున్నాడు.

ముసలమ్మకు ఎంతో ఉత్సాహం కలిగింది.

రాంబాబు రైలుదిగి దూరంగా వున్న సుశీల వాళ్ళవైపు నడక సాగించాడు.



పునాదులు ముఖ్యం

శ్రీ ప్రభాకర్ జీ

రోజులు త్వరగా మారిపోతున్నవి. ఒకనాటికంటె ఒక నాటికి కాలగమన వేగం హెచ్చిపోతున్నది. మానవుని ఆశయాలు త్వరత్వరగా వికసిస్తున్నవి. ఎక్కడో మారుమూలనున్న మానవుని సమస్యలు మనుష్యులందరి సమస్యలుగా మారే తరుణం ఆసన్నమైనదేమోనని అనిపిస్తున్నది. ప్రపంచాన్ని చిన్న చిన్న ముక్కలుగా కాక ఒకే అఖండ నివాస భూమిగా చూచే అలవాటు మానవుల కలవడటానికి అట్టే కాలం పట్టదేమో కూడా. రోజు రోజుకు పెరిగిపోతున్న విజ్ఞానాభివృద్ధి-ఇందుకు ముఖ్య హేతువు కావచ్చును. గాంధీజీ ప్రచారం చేసిన అహింసా తత్వం, ఆ తత్వాన్ని వైదేశిక విధానంలోని కనువదించడానికి నెహ్రూజీ చేస్తున్న కృషి కూడ ఇందుకు హేతువులని నేననుకుంటాను.

ఏది ఎలా వున్నా ప్రపంచం మునుపటివలె లేదిప్పుడు. చాలా మారింది. మారుతున్నది. మనుష్యులు కూడ మునుపటివలె లేరు. చాలా మారిపోయారు. అక్కడక్కడ నిరాశా ఛాయలు లేవని కాదు. మొత్తం మీద చూచినప్పుడు మాత్రం ప్రపంచ పరిస్థితి ఆశాజనకంగానే వున్నది. ఇంతకు ముందు పెద్ద పెద్ద పుస్తకాలలోనూ గొప్పవారి నోళ్లలోనూ వుంటూ వచ్చిన సంగతులు ఇప్పుడు అందరి మనసులలోనికి చొచ్చినవి. విత్తనాలెటువంటివో భావాలు అటువంటివే.

ఇంతకు చెప్పవచ్చేదేమంటే లోకమంతా ఒకటేననే దృష్టి పెరుగుతూ, మానవ సమాజం శాంతినీ అభ్యుదయాన్నీ కోరుతూ వున్న ఈ రోజులలో మన రాష్ట్రాభ్యుదయం దేశాభ్యుదయానికీ, దేశాభ్యుదయం ప్రపంచాభ్యుదయానికీ విరుద్ధం కాకుండా వుండాలనుకుంటాను. అంతే కాదు, వీని అభ్యుదయం ఒకదానిపైనొకటి ఆధారపడి ఉన్నదనే సంగతి మనం గుర్తించి ఆలోచన చెయ్యాలి.

మన నదీజలాల వివాదం నాకెప్పుడూ ఆశ్చర్యమే కలిగిస్తూ వుంటుంది. ఈ విషయంలో ఆయా రాష్ట్రాలు చూపుతున్న పట్టుదలలు అంత అవసరం కాదేమోనని నా అనుమానం. ఈ పట్టుదలలు కొన్ని ప్రాజెక్టులకు, అభివృద్ధి కార్యక్రమాలకూ అడ్డు తగులుతూ వుండడం చాలా విచారకరం. దేశమంతా ఒకటేననే భావం అందరిలోనూ సమానంగా వుంటే ఈ అడ్డులకు తావుండదు. కృష్ణా గోదావరీ నదీజలాలను సత్వరంగా, సంపూర్ణంగా వినియోగించుకోవడం కోసం ప్రతిపాదింపబడిన ప్రాజెక్టులు జాప్యంలో పడడం మన రాష్ట్రానికే కాక దేశానికి కూడ క్షేమకరం కాదు. ఎక్కడో సమ్యగ్దృష్టి లోపించడమే యిందుకు కారణం. ఈ మానసికావరోధం తొలగితేనే గాని బాహ్య అవరోధాలు తొలగవు. ఇందువల్ల తేలుతున్న సారాంశం ఏమంటే అభ్యుదయ సాధనలో అవరోధాల నివారణ ఒక ముఖ్యాంగం. ఇది జరగకపోతే అడుగు ముందుకు పడదు.

రాష్ట్రాభ్యుదయాన్ని అడ్డుతున్న మరి కొన్ని సమస్యలలో భూమి సమస్య, మద్యపాన సమస్య ముఖ్యమైనవి. ఆంధ్రప్రదేశ్ అవతరణానంతరం ఆంధ్ర ప్రాంతంలో అమలులో వున్న మద్యపాన నిషేధాన్ని తెలంగాణా ప్రాంతంలోనూ, తెలంగాణా ప్రాంతంలో అమలులో వున్న భూమి శాసనాలను ఆంధ్రప్రాంతంలోను విస్తరింపజేసి వున్నట్లయితే రెండు పెద్ద సమస్యలపై ఒకేసారి చర్య ఆరంభమయి వుండేది. మన ఆశించిన భావ సమైక్యత కూడ ఇంకా ముందే కలిగివుండేది. అలా జరుగక పోవడం చాలా అనర్థాలకు హేతువవుతున్నది. మానవుని ప్రాణ, మాన విత్తములను నాశనోన్ముఖం చేస్తున్న మద్యపానాన్ని నిషేధించే పట్ల రూపాయిలు అణాలు పైసలు లెక్క చూడడం సహేతుకం కాదు. పైగా ఈ విషయంలో మనం రాజ్యాంగం ద్వారానే కట్టుబడి యున్నాము కూడ. ఇక భూమి సమస్యకు వస్తే ఇందుకు

కావలసిన భావ ప్రచారం అనుష్ఠాన పూర్వకంగా వినోబాజీ చేశారు. మనుష్యుల మనస్సులను ఆయన పరిపక్వం చేసివుంచారు. ఈ పునాదులను మనం శాసనబద్ధం చేసుకుంటే సరిపోతుంది.

అభ్యుదయానికి అవరోధాలు

మనది ప్రజాస్వామ్యం. దీనికి పరిపూర్ణ రూపమివ్వడానికే మనం పంచాయతీరాజ్య విధానాన్ని చేపట్టాము. దీనిని ముందు ఆచరణలో పెట్టిన కీర్తి మన రాష్ట్రానికి దక్కింది. అభివృద్ధి కార్యక్రమాల నిర్వహణ భారమంతా ఇప్పుడు పంచాయతీలు, సమితులు, పరిషత్తుల ద్వారా ప్రజల మీద పడింది. అయితే ఇప్పుడు ప్రభుత్వం రచించే ప్రణాళికలకు ప్రజల సహకారమనే ధోరణి నుంచి ప్రజలు రచించుకునే ప్రణాళికలకు ప్రభుత్వ సహకారమనే ధోరణి ప్రస్ఫుటం కావాలి. ప్రజలు తమ అభివృద్ధిని గూర్చి తామాలోచించుకోవడానికి, అందుకు కావలసిన వనరులను సమకూర్చుకోవడానికి సిద్ధంగా లేరు. కారణం తగిన విద్య, శిక్షణ చైతన్యం వారికి లేకపోవడమే. ఈ మూడింటినీ ఎంత త్వరగా ప్రజలకు సమకూర్చితే, రాష్ట్రాభ్యుదయం అంత త్వరగా పురోగమిస్తుంది. ఐతే ఇక్కడ మరొక సంగతి చెప్పవలసివున్నది. ఇప్పటికి మన ప్రజాస్వామ్యం పార్టీయుతంగా వుంది. పార్టీలు పరస్పర ద్వేషాలను రెచ్చ కొట్టి ప్రజలను చీలుస్తున్నవి. ఇది వాని సహజ స్వభావం కావచ్చు. ఇందువల్ల అభ్యుదయ కార్యక్రమంలో అందరినీ సంఘటితం చేయడం కష్టమవుతుంది. పార్టీలలో వుండే ఈ విచ్ఛిన్నకర వైఖరి లోపించాలి. లేదా పార్టీలే లేకుండా పోవాలి. అనుభవాన్ని బట్టి చూస్తే పార్టీ సహిత ప్రజాస్వామ్యం అభ్యుదయానికి అడ్డుపడుతున్నట్లు తోస్తున్నది.

మన రాష్ట్రంలో అభ్యుదయానికి మరొక పెద్ద అవరోధం కుల తత్వం. ప్రజాస్వామ్యానికి వయసు పెరిగేకొద్దీ, ఈ భూతానికి బలమెక్కువవుతున్నది. దీనికి ప్రోత్సాహం ఎక్కడ నుంచి లభిస్తున్నదో కనిపెట్టి, ఆమూలాన్ని ధ్వంసం చెయ్యాలి. అప్పుడు గాని ఇది నాశనం కాదు. మానవులంతా ఒకే కుటుంబమనే భావం ఒక వైపునుంచి పాలసముద్రం పొంగినట్లు పొంగివస్తూవుంటే మరొక వైపునుంచి కులమత దురభిమానాలు కాటుక కొండలలాగా పైకి లేస్తున్నాయి. మన రాష్ట్రంలో కులతత్వం వలెనే ఇతర రాష్ట్రాలలో మత దురభిమానాలు భూతాలై లేచినవి. వీటికితోడు ప్రాంతీయ దురభిమానాలు గూడా బాగా తలఎత్తినవి. ఇవి అన్నీ దేశాభ్యుదయాన్ని చీడపురుగులై నాశనం చేస్తున్నవి. జాతీయ సమైక్యతా భావాన్ని ఎక్కడికక్కడ ఈ సంకుచిత భావాలు ముక్కలు ముక్కలు చేస్తున్నవి.

ఇక జనాభాలో సగంగా వున్న స్త్రీల విషయంలో మన రాష్ట్రం ఉచితంగా ప్రవర్తించిందని చెప్పడానికి వీలులేదు. శాసన సభలో 15 శాతం స్త్రీలుండాలని మనం నిర్ణయించుకున్నాం. అర్హురాండ్రయిన సోదరీమణులు చాలామంది వున్నా ఈ ఆశయం నెరవేరక పోవడం చాలా విచారకరం. ఎక్కడ స్త్రీకి ఉచిత గౌరవ స్థానం లభించదో అక్కడ అభ్యుదయం వుండదు. ఈ సంగతి మనం గుర్తుంచుకోవాలి. విద్యారంగం అభ్యుదయానికి అనురూపులైన పౌరులను తయారుచేసే విధానాన్ని అనుసరించాలి. బడికి పోయే వయస్సుగల పిల్లల సంగతే మనమింతవరకూ ఆలోచిస్తున్నాము కాని అంతకు చిన్న పిల్లల సంగతి మనం ఆలోచించడం లేదు.

ఏ ప్రాతిపదికల మీదనైతే అభ్యుదయం సుసాధ్యమవుతుందో ఆ ప్రాతిపదికలలో ఇవి ముఖ్యమయినవని నేననుకుంటాను. పునాదులే నిర్మాణమునకు బలము.



పిచ్చుకమ్మ

శ్రీ పాలా వెంకటసుబ్బయ్య

కార్యదక్షుని సేయఁగఁ-గర్ణయుగళి
నేమి యూదితివోగద!-గృహిణినీవు
నిముసమేని నీనాధుఁడు- నిలువఁడొకట
గృహమునిర్మింపఁ గృషిసేయు-నహరహంబు.

రివ్వురివ్వున నెగిరి-పవను జవంబున
నేగివచ్చును పీచు-నెత్తికొనుచు.
వచ్చినివేశన-మెచట లభించునా
యనియు నన్వేషణ-మునకుఁబూను.
పూనిపైకప్పులో-మూలల. దంతెల
సందుల, దూలాల-సరసనెమకు,
నెమకి పీచు నమర్చు-నిలువక నేలకు
రాలనదియు యత్న-మోలిసేయు.
సరసనీవుంట నీపతి జారివోని
పటుతనంబున కృషిసేయు-చిటుకుమనిన
వచ్చి ముచ్చటించును నీతో-భవ్యమైన
దంపతులు మీరు; తులలేరు-ధాత్రిమీకు.

పతి ఘటియించు కార్యమున
బాసట యై జని పూరిపుల్లలన్
కతిపయ మింత ముక్కునను
గట్టిగ పట్టి మనోహరంబుగా
ధృతిఁజనుదెంచు నీకృషిని
యిందుముఖుల్ గమనించి వృత్తులన్
పతులకు సాయమై నిలువ
భాగ్యము లబ్బవె పిచ్చుకమ్మరో.

మీకున్న శ్రద్ధయే-మాకున్నచో గృహ
నిర్మాణ పథకాలు-నిగ్గుగనవె;
మీకున్న యాసక్తి-మాకున్నచో సమా
జ వికాస కార్యాలు చక్కబడవే;
మీకున్న యోరిమి-మాకున్నచో కళా
విలసనంబెంతయో-పేరుగొనదే.
మీకున్న దీక్షయే-మాకున్నచో దేశ
సౌభాగ్యమధిక ప్ర-శస్తి గనదె.
మీకుశలత నిపుణతాది-మేల్మిగుణము
లెల్ల మాకున్ననభివృద్ధి-వెల్లివిరిసి
సిరులటు సమాజమెల్ల వి-శిష్ట గతిని
క్రమ్ముకొనియుండవే పిచ్చు-కమ్మనేడు.

దూదియు నీకలు దారము
బోదవితానమ్ము మీరు-ముక్కున గొనుచున్
మోదము తోడ కులాయన
మాదృతి నిర్మించుకొనుట-నాదర్శంబె.

తెచ్చిన చెత్త చెదారము
గ్రుచ్చిన చోటున నిలువక-కూలఁగనేలన్
పొచ్చెము లేని ప్రయత్నము
నిచ్చలు సలుపుదురు మీరు-నిశ్చితబుద్ధిన్

ఒకదినమ! రెండుదినముల!
ఒక వారము నాఱువిట్టు-లోరిమి తోడన్
తికమక జెందక సలిపితి
రిఁక విరమించుటలేద!—యేమనువాడన్.

ఇంటబడుచెత్త దిబ్బకు-నేగుచుండె.
సణుగు నాభార్యయిదియేమి-సంభ్రమనుచు
కాని మీదంపతులు దీని-వీనుగవకు
చేర్పఁబోవరు జ్ఞానంబు-చేటువడుట.

దైవము మీకృషిఁగని కరు
ఱావనుఁడై నాకుమారు నాజ్ఞనుసేయన్
బావనమతి నాబాలుఁడు
మీవసతికి నట్టనొకటి-మేకున గొట్టెన్.

మీకృషి యీడేరెను; నా
శోకము గట్టునకు జేర,-ఱుచియగుగూటిన్
మీకునుకులు మొదలాయెను
శ్రీకరమౌ గ్రుడ్లువెట్టి-చెందుడి సుఖమున్.

గ్రామాలకు విద్యుచ్ఛక్తి సరఫరా

కృష్ణా జిల్లా గన్నవరం తాలూకాలోని దిగువ గ్రామాలకు 962 జూలైలో విద్యుత్ సౌకర్యాలు కలిగించారు :—

(1) గోపాలపురం (హెచ్/ఓ ఉయ్యూరు). (2) అగ్నిపాడు.

962 ఆగస్టులో కర్నూలు తాలూకాలోని లద్దిగిరి గ్రామానికి విద్యుత్ సౌకర్యాలను విస్తరింపజేశారు.

నిరక్షరాస్యతా నిర్మూలనం

శ్రీ మామిడిపూడి వెంకటరంగయ్య

రాష్ట్రాభ్యుదయంకోసం విద్యారంగంలో చేయవలసిన కృషి ఎంతైనా ఉంది. ప్రపంచంలో ప్రగతిగాంచిన దేశాలన్నిటిలో నూటికి నూరు మంది అక్షరాస్యులున్నారు. ఇంతేగాక మాధ్యమిక ఉన్నత విద్యలను, సాంకేతిక విద్యలను అభ్యసించినవారి సంఖ్య కూడా చాలా ఎక్కువగా ఉంది. అన్నిరకములైన అభ్యుదయాలకు విద్య ప్రధాన ఆధారం అని దీనిని బట్టి స్పష్టం అవుతూవుంది.

మనకు స్వాతంత్ర్యం వచ్చినవెంటనే యీ విషయాన్ని మన పెద్దలు గ్రహించి, రాజ్యాంగాన్ని రూపొందించడంలో 6 మొదలు 11 సంవత్సరాల పిల్లలందరికి నిర్బంధంగానూ ఉచితంగానూ ప్రాథమిక విద్యను నేర్పవలసిందిగా రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించారు. ఈ కార్యక్రమం 1960 నాటికే పూర్తి కావలసి ఉన్నది. కాని దీనికి అవసరమైన ఆర్థికవసతులు మనకు లభించని కారణాన రాష్ట్రప్రభుత్వం యీ కార్యక్రమాన్ని అమలు పరచలేక పోయింది. ప్రస్తుతం అది చేయగలిగింది 6 మొదలు 11 సంవత్సరముల పిల్లలకూ మాత్రమే నిర్బంధంగానూ ఉచితంగానూ విద్యను నేర్పడం. 1961 లో ప్రారంభం అయిన పంచవర్ష ప్రణాళికతో యీ కార్యక్రమం కూడా ప్రారంభం అయింది. తల్లిదండ్రులందరూ వారి పిల్లలను నిర్బంధంగా బడులకు పంపవలసినట్లు శాసనం చేయబడ్డది.

కాని, ఈ శాసనానుసారం, తల్లి తండ్రులందరూ వారి పిల్లలను బడులకు పంపుటకు ఇంకా సిద్ధంగాలేరు. విద్యయొక్క విలువను వారు గ్రహించకపోవడం, గ్రహించినా పిల్లల పనిమూలంగా లభించే ఆదాయాన్ని పోగొట్టుకొనుటకు వారు ఇష్టపడకపోవడం దీనికి ప్రధాన కారణం. వారియొక్క సహకారం లేనిదే, నిర్బంధ విద్యావిధాన చట్టాన్ని అమలుపరచడం సాధ్యంకాదు. పిల్లలను బడులకు పంపని తల్లిదండ్రులు శిక్షాపాత్రులైనా, అట్టివారిని శిక్షించుటకు అధికారులు సుముఖులుగాలేరు. అందుచేత సామోపాయంద్వారాను దానోపాయం ద్వారాను వారిని ప్రోత్సహించవలసి ఉంది. పల్లె ప్రాంతాలలో పలుకుబడిగల నాయకులు యీ ప్రోత్సాహ కార్యక్రమంలో పాల్గొనడం అవసరం. ఇందుకుగాను ప్రస్తుతం ఉచితంగా బడి పిల్లలకు మధ్యాహ్నభోజన ఏర్పాటులు ప్రభుత్వంవారు కొన్ని ప్రాంతాలలో ప్రవేశపెట్టారు. ఇది చురుకుగా అన్ని ప్రాంతాలకు వ్యాపించవలసి ఉంది. దీనితో పాటు, ఉచితంగా దుస్తులను, పుస్తకాలను పలకలను ఇచ్చే ఏర్పాటుకూడా జరిగితే మరింత సులభంగా ఉచిత నిర్బంధ విద్యావిధానం అమలు పరచడం సాధ్యం. విద్యారంగంలో రాష్ట్రాభ్యుదయంకోసం చేయవలసిన పనులన్నిటిలో ఇది మొదటిది. చాలా ప్రధానమైనదీ కూడా.

స్త్రీ విద్య

అందరినీ విద్యావంతులుగా చేసే ఇప్పటి ప్రయత్నంలో ఆడపిల్లల విషయంలో ప్రత్యేక కృషి జరగవలసి ఉంది. మధ్య తరగతికి చెందిన తల్లిదండ్రులు ఆడపిల్లలకు చదువు చెప్పించడంలో శ్రద్ధ గలవారైనా, ఆర్థికంగా క్రింది తరగతులకు చెందినవారు యీ విషయంలో ఎలాటి శ్రద్ధాచూపడం లేదు. ఆడపిల్లలకు చదువెందుకు? అన్న ప్రాచీన ధోరణిలోనే వారు ఉన్నారు. ఈ అభిప్రాయంపల్లె ప్రాంతాలలో ఎక్కువగా వ్యాపించి ఉంది. కాని ఈ యుగంలో మొగపిల్లలకు విద్య అవసరమైనట్లే ఆడపిల్లలకు కూడా అవసరం. రాష్ట్రాభ్యుదయంలో వారుకూడా తోడ్పడవలసి వుంది. అందరి తెలివి తేటలు అభ్యుదయ కార్యక్రమాలలో వినియోగమైనప్పుడే పురోగమనం సాధ్యమవుతుంది. కనుక స్త్రీ విద్య విషయంలో పంచాయతీ సమితులు, జిల్లా పరిషత్తులు, ఇతర అధికార అనధికార సంస్థలు ప్రత్యేక కృషి చేయడం అవసరం.

ప్రజలందరూ అక్షరాస్యులైనంతమాత్రం చేత రాష్ట్రాభ్యుదయం పూర్తి కాదు. దేశంలో వివిధ రంగాలలో నాయకత్వం

వహించతగ్గవారు, నిపుణులుగా అన్ని వృత్తులలో పనిచేయతగ్గ వారు, పరిశోధనలను జేసి నూతన ప్రకృతి రహస్యాలను సత్యాలను కనుగొనదగిన వారు కావలసిఉంది. విద్యారంగంలో జరుగవలసిన సంస్కరణలు యీలాటి వారిని రూపొందించేవిగా ఉండవలెను.

" సనాతనంగా వస్తూ ఉండిన సంప్రదాయాలను అనుసరించి దేశంలోని వృత్తులన్ని సాగుతూ వచ్చిన కాలంలో ఆయా కులాల వారు వారి వారి వృత్తులను వారి వారి తల్లి దండ్రుల నుండి వారి వారి ఇండ్లలోనే నేర్చుకుంటూ ఉండే వారు. కాని ప్రస్తుత పరిస్థితులలో ఈ విధానం సాధ్యం కాదు. కులాలను బట్టి వృత్తులలో ప్రవేశించే ఆచారం సన్నగిల్లి పోయింది. ఇంతేకాక శాస్త్రజ్ఞానం వృద్ధి కావడం చేతనూ, దాని ఫలితంగా ప్రతి వృత్తిలోనూ కొత్త పద్ధతులు, కొత్త యంత్రాలు, కొత్త పనిముట్లు ఉపయోగంలోకి రావడం చేతనూ వృత్తుల గురించిన జ్ఞానాన్ని వారి వారి ఇండ్లలో నేర్చు కోవడం సాధ్యం కాదు. దీనికి తోడు, ఇదివరకు దేశంలో లేని వృత్తు లనేకాలు ప్రస్తుతం ఏర్పడుతూ ఉన్నాయి. ఈ మార్పులన్నిటి మూలంగా వృత్తి విద్యలను, సాంకేతిక విద్యలను ప్రత్యేక విద్యాలయాలలో నేర్చు కొన్న వారి సంఖ్య పెరగవలసి ఉంది. ప్రాథమిక విద్య నేర్చు కొన్న వారిలో సగానికి సగమైనా, మాధ్యమిక విద్యాలయాలలోను కళాశాలలలోను, ప్రత్యేక సాంకేతిక విద్యాలయాలలోను విద్యను సాగించినప్పుడు ఈ అవసరం తీరుతుంది. ఈ సత్యాన్ని గ్రహించి ఇటీవల కాలంలో విద్యావిధానంలో కొన్ని మార్పులు చేయబడ్డవి. మహాత్మా గాంధిగారు సూచించినట్లు ఏదో ఒక వృత్తిలో ప్రవేశించుటకు అనుగుణంగా ఈ మార్పులు చేయబడుతూ ఉన్నవి. దీని మూలంగా విద్యావంతులలోని నిరుద్యోగ సమస్య కూడా చాలా వరకు పరిష్కారం కావచ్చు. దారిద్ర్య నిర్మూలనానికి భోగభాగ్యాలు వృద్ధి కావడానికి సాంకేతిక విద్యకు ఎక్కువ ప్రాధాన్యం లభించవలసి ఉంది.

వయోజన విద్యా వ్యాప్తి

"ఈ సందర్భంలో ఇంకొక విషయం గుర్తించడం అవసరం. చిన్న వయస్సున విద్యాలయాలలో మనం నేర్చుకొనే విద్య ద్వారా మనకు పూర్తి విద్య లభించదు. యావజ్జీవం విద్యను సంపాదిస్తూ ఉండడం అవసరం. దీనినే వయోజన విద్య అని అంటారు. దీని యొక్క అవసరం ప్రస్తుతం మనదేశంలో ఎక్కువగా ఉంది. మనది ప్రజారాజ్యం, దేశాన్ని పాలించే అధికారుల చర్యలలోని మంచి చెడ్డలను విమర్శించి, తగిన వారిని పరిపాలకులుగా ఎన్ను కోవలసిన బాధ్యత యువజనులందరిపైన ఉన్నది. దీనిని చక్కగా నిర్వహించుటకు దేశంలో ఉత్పన్నం అయ్యే సమస్త రాజకీయ ఆర్థిక సాంఘిక సమస్యలతో సామాన్య ప్రజలందరికి కొంచెమో గొప్పో జ్ఞానం ఉండడం అవసరం. పంచాయతీ సమితులలో Social Education Officer ద్వారా వయోజన విద్యా వ్యాప్తికి కొన్ని ప్రయత్నాలు జరుగుతూ ఉన్నా ఈ ప్రయత్నాలు చాలవు. ఈ విషయంలో ఇంత కంటె ఎక్కువ కృషి జరగవలసి ఉంది.

విద్యారంగంలో జరగ వలసిన పనులు ఇంకా ఎన్నో ఉన్నాయి. కాని ప్రస్తుతం మనం అందరూ అక్షరాస్యులయ్యే కార్యక్రమాలలోనూ, స్త్రీల విద్యా విషయంలోనూ, సాంకేతికవిద్యా వ్యాప్తికి, వయోజన విద్యా వ్యాప్తికి సంబంధించిన కార్యక్రమాలలోను ఎక్కువ శ్రద్ధను వహించగలిగితే రాష్ట్రాభ్యుదయం చురుకుగా జరుగుతుంది.

విశేషాలు

"అసిల్" జాతి కోళ్ళపై పరిశోధన

భారత వ్యవసాయ పరిశోధనా సంస్థ ప్రతిపాదించిన వివిధ రకాల 'అసిల్ జాతి కోళ్ల పెంపకం' పరిశీలనా పథకాన్ని భారత ప్రభుత్వం మంజూరుచేసింది. కాకినాడ కోళ్ల పరిశోధనా కేంద్రంలో మూడు సంవత్సరాలపాటు యీ పరిశోధన జరుగుతుంది.

'అసిల్' అంటె 'వాస్తవం' అని అర్థం. యీ జాతి కోళ్లలో వాస్తవమయిన పౌరుష లక్షణాలు ఉంటాయి. వీటిలోని సహన శక్తిని విశేషంగా చెప్పుకుంటారు. అసిల్ కోడి యెప్పుడూ అంతం వరకూ పోరాడుతుంది. చావుకైనా సిద్ధంగా ఉంటుందిగాని రంగం నుండి వెనుదిరిగి పోదు.

బొబ్బిలి, పల్నాడు యుద్ధాలు 'అసిల్ కోళ్లపందాల' వల్లనే జరిగినవనేవిషయాన్ని గుర్తుంచుకోవచ్చు. అసిల్ కోళ్లను వివిధరంగుల్లోకి మార్చేమార్గాలను పరిశీలించడమే యీ పథకం ముఖ్య ఉద్దేశం. అంతేగాక ప్రత్యేక పెంపకం, క్షేత్రం అవసరాలు, మాంసం వెల, రోగ నివారణ, వగైరాలకు జరిగే ఆర్థిక విషయాలకు సంబంధించి కూడా పరిశీలన జరుగుతుంది. ఆంధ్రప్రదేశ్‌లో వివిధ ప్రాంతాలలోని అసిల్ కోళ్లను యెన్నికచేసి పరిశోధన నిమిత్తం కాకినాడలోని కోళ్లక్షేత్రంలో ఉంచుతారు.

భారతదేశంలోని యితర రాష్ట్రాలలోనే గాక విదేశాలలో గూడా యీ కోళ్లకు మంచి గిరాకీ ఉంది.

కుష్ఠువ్యాధి నిరోధనకు ప్రయోగాత్మక పథకం

వార్ధాలోని గాంధీమెమోరియల్ కుష్ఠువ్యాధి నిరోధక సంస్థ డైరెక్టరు డాక్టరు ఆర్. డి. వార్దేకర్ బొబ్బిలిలో మాట్లాడుతూ కుష్ఠువ్యాధి నివారణకై బొబ్బిలిసమీప గ్రామమైన పిరిడిలో ప్రారంభింపబడిన చెమో ప్రొఫెలాక్సిస్ ప్రయోగాత్మక పథకం భారత దేశంలో మొదటిదని ఆయన అన్నారు. కుష్ఠు నివారణ, శిక్షణకేంద్రం ఉన్న జిల్లా శ్రీకాకుళం ఒక్కటేనని కూడా ఆయన అన్నారు.

కుష్ఠు నివారణకు సల్ఫోన్ ఔషధాన్ని ఆయుధంగా యీ సంస్థ ఉపయోగిస్తున్నదని డాక్టర్ వార్దేకర్ అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో యింటింటికీవెళ్ళి యీ వ్యాధికి గురి అయిన వారిని కనుగొని తగిన చికిత్స చేస్తున్నారు. పట్టణ ప్రాంతాల్లో కుష్ఠు నివారణ కార్యక్రమాన్ని చేపట్టడానికి పట్టభద్రులను నియమించడం వారి కార్యక్రమాల్లో క్రొత్త అంశం. 25 సంవత్సరాలలోపు వారికి వయసునుబట్టి ఔషధాన్ని యిస్తూ యీ వ్యాధికి ప్రయోగాత్మకంగా చికిత్సచేయడం ముఖ్యమైనపని. ప్రజలకు తెలియ పర్చడానికిగాను ఒక ప్రదర్శనా యూనిట్టును ప్రారంభించాలని యీ సంస్థ ఉద్దేశం.

నూటికి నూరుపాళ్ళ విజయం

పశ్చిమ గోదావరిజిల్లాలో అధికాహారోత్పత్తికై ప్రారంభించబడిన సాంద్ర వ్యవసాయపథకం అమలును పరిశీలించడానికి ఆగస్టులో ఢిల్లీనుండి పాలకొల్లుకు వచ్చిన నిపుణుల బృందాన్ని బి. డి. ఓలు పెద్దపాడు, అత్తిలి, మదపాడు, నిడదవోలు, మారుటేరు మొదలగు గ్రామాలకు తీసుకెళ్ళారు.

నిపుణులలో ఒకరైన డాక్టర్ జి. యస్. సింగు మాట్లాడుతూ వ్యవసాయ ఉత్పత్తులలో ఆంధ్రప్రదేశ్ గణనీయమైన అభివృద్ధిని సాధించిందని అన్నారు. అంతేగాక సాంద్ర వ్యవసాయ పథకం నూటికి నూరుపాళ్ళు విజయం సాధిస్తుందని కూడా ఆయన అన్నారు.

ఉపాధ్యాయులకు జాతీయ పతకాలు

యీ సంవత్సరం ఆంధ్రప్రదేశ్‌లోని దిగువ ఉపాధ్యాయులకు జాతీయ పతకాలు లభించాయి. ప్రతివారికీ యోగ్యతాపత్రంతో పాటు రూ. 500/– రొక్కం కూడా లభిస్తుంది. 1962 అక్టోబరు 25వ తేదీన ఢిల్లీలో జరిగే ప్రత్యేక సమావేశంలో రాష్ట్రపతి యీ పతకాలను అందజేస్తారు.

ప్రాథమిక ఉపాధ్యాయులు

తూర్పు గోదావరిజిల్లా రామచంద్రపురం తాలూకాలోని పంచాయతీసమితి ఎలిమెంటరిపాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీ కొరిపెల్లి వీరన్న చౌదరి. కర్నూలుజిల్లా, ఆలూరు తాలూకా, హాలహర్విలోని పంచాయతీ సమితి జూనియర్ బేసిక్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీ ఆర్. భీమసేనరావు. హైద్రాబాదు జిల్లా, దబీర్ పూరాలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీ మహ్మదు ఇసాక్. తూర్పు గోదావరిజిల్లా, రాజమండ్రిలోని రివర్‌డేల్ హయ్యర్ ఎలిమెంటరి పాఠశాల ప్రధానోపాధ్యాయిని శ్రీమతి జి. రాజవిజయమ్మ.

సెకండరీ ఉపాధ్యాయులు

కాకినాడలోని పి. ఆర్. ప్రభుత్వ కళాశాల హయ్యర్ సెకండరీ పాఠశాల ఉపాధ్యాయులు శ్రీ యస్. యల్. నరసింహారావు. చిత్తూరుజిల్లా, తిరుపతిలోని మునిసిపల్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీ వి. యస్. వెంకటనారాయణ. *

పోస్టాఫీసు సేవింగ్సు బ్యాంకు

వడ్డీ రేటు పెంచబడింది

1962 ఆగస్టు 1వ తేదీ నుండి పోస్టాఫీసు సేవింగ్సు బ్యాంకులో ఒకే వ్యక్తిపేర వున్న ఎకౌంటులో రూ. 10,000 వరకు (జాయింటు ఎకౌంటు అయితే రూ. 20,000 వరకు) నిలవచేసిన సొమ్ముమీద సాలీనా పన్నులేని 3% వడ్డీ లభిస్తుంది. రూ. 10,000 కు పైబడి రూ. 15,000 వరకూ (జాయింటు ఎకౌంటు అయితే రూ. 30,000 వరకు) నిలవచేసిన సొమ్ముమీద సాలీనా పన్నులేని 2½% వడ్డీ లభిస్తుంది.

పబ్లిక్ ఎకౌంట్లమీద వడ్డీ కూడా 2½% కి పెంచబడింది.

మీ పోస్టాఫీసులో ఒక ఎకౌంటును తెరవండి

జాతీయ పొదుపు ఉద్యమ సంస్థ

ప్రభుత్వ నిర్ణయాలు

* పౌర గ్రంథాలయాల చట్టాన్ని సవరించి, రాష్ట్రం మొత్తంలో లైబ్రేరియనుల సర్వీసును గ్రేడ్ I గా మార్చాలనీ, పటాన్కూర్‌ల వార్డు మూలంగా రాష్ట్రానికి మార్చబడిన ప్రాంతానికి దీనిని వర్తింప జేయాలని ప్రభుత్వం నిర్ణయించింది.

* ప్రస్తుత విద్యా సంవత్సరం నుండి 2000 పాఠశాలలో దశల వారీగా మూడవ తరగతి నుండి ఇంగ్లీషు బోధనను ప్రవేశ పెట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది.

ఇంగ్లీషును బోధించడానికి అవసరమైన ఉపాధ్యాయులకు, బ్రిటిష్ కౌన్సిల్ ఆజమాయిషీలో, కేరళ, మద్రాసు రాష్ట్రాలలోవలే ఇంగ్లీషు బోధనలో శిక్షణ ఇవ్వడం జరుగుతుంది.

* మూసీప్రాజెక్టు ప్రాంతానికై కేంద్ర భూమితనఖా బ్యాంకు, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నుండి రుణంగా స్వీకరించే రూ. 25 లక్షలకు ప్రభుత్వం హామీగా ఉండడానికి నిశ్చయించింది. ప్రస్తుత సంవత్సరంలో సాధారణ నిర్వహణకై భూమి తనఖా బ్యాంకు, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నుండి అప్పుగా తీసుకునే కోటి రూపాయిలకు గ్యారంటీ యివ్వాలని కూడా ప్రభుత్వం నిర్ణయించింది. హైదరాబాదు సహకార ఎపెక్స్ బ్యాంకు, ప్రస్తుత సంవత్సర సాధారణ నిర్వహణకై రిజర్వు బ్యాంకు నుండి అప్పుగా తీసుకునే రూ. 5 కోట్లకు కూడా గ్యారంటీ యివ్వాలని ప్రభుత్వం నిశ్చయించింది.

* సిర్పూరు పేపర్ మిల్లు జారీ చేసిన రూ. 85.5 లక్షల విలువగల షేర్ల కొనుగోలును ప్రభుత్వం ఆమోదించింది.

* యెవరికీ చెందని దిక్కులేని శవాలను వైద్య కళాశాలలో వైద్య పరిశోధనల నిమిత్తం ఉపయోగించడానికి వీలుగా ఆంధ్ర ప్రదేశ్ శారీరక శాస్త్ర చట్టాన్ని తెలంగాణ ప్రాంతానికి వర్తింప జేయాలని ప్రభుత్వం నిశ్చయించింది.

* బేగంపేట 'గ్రీన్‌లాండ్సు'కు యెదురుగా ఉన్న ప్రభుత్వ భూమిలో ఆరుగురు మంత్రులకు నివాస గృహాలను నిర్మించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ప్రతి గృహానికి రూ. 85000లు ఖర్చు అవుతుంది.

మూడవ ప్రణాళికలో చిన్న తరహా నీటి పారుదలకు అదనంగా రూ. 3.00 కోట్లు కేటాయించాలని ప్రభుత్వం నిర్ణయించింది. కేంద్ర ప్రభుత్వం యీ విషయంలో ఇచ్చే రూ. 7.00 కోట్ల సహాయాన్ని ఉపయోగించుకోవడానికి వీలుగా యీ అదనపు కేటాయింపు జరిగింది.

* సాధారణ బడ్జెటు కేటాయింపులకుతోడు, ఆరోగ్య వైద్య సర్వీసులకు అదనంగా రూ. 50.00 లక్షలను కేటాయించాలని ప్రభుత్వం నిర్ణయించింది.

* మూడవ ప్రణాళికా కాలంలో విద్యుచ్ఛక్తి పద్దుకు అదనంగా రూ. 10.00 కోట్లను కేటాయించాలని కూడా ప్రభుత్వం నిర్ణయించింది. ఇందువల్ల విద్యుచ్ఛక్తికి కేటాయించిన మొత్తం రూ. 64 కోట్ల నుండి రూ. 74 కోట్లకు పెరుగుతుంది.

కమ్యూనిటీ రేడియో సెట్లు

1962 జూలై నెలలో ఈ క్రింది గ్రామాలలో సాముదాయక రేడియో సెట్లను నెలకొల్పారు.

తాలూకా పేరు	గ్రామము లేక సంస్థ పేరు	కమ్యూనిటీ రేడియో సెట్టు నెలకొల్పబడిన తేదీ	తాలూకా పేరు	గ్రామము లేక సంస్థ పేరు	కమ్యూనిటీ రేడియో సెట్టు నెలకొల్పబడిన తేదీ
	హైద్రాబాదు జిల్లా			నిజామాబాదు జిల్లా	
పర్గీ	చంగోమల్	6_7_62	నిజామాబాదు	మూడాపూరు	19_7_62
చేవెళ్ళ	రీగాడిధోళ్వద	9_7_62	,,	వడ్డియట్పల్లి	27_7_62
,,	బాబిల్గాంవు	6_7_62	,,	నాగేపూరు	22_7_62
,,	తంగడపల్లి	6_7_62	,,	షాకాపూరు	24_7_62
,,	నర్కోడ	5_7_62	ఆర్మూరు	పల్లికొండ	26_7_62
,,	పొటుగల్	6_7_62	,,	కోటపల్లి	22_7_62
,,	సోలిపేట	5_7_62	,,	తిమ్మాపూరు	23_7_62
తాండూరు	బసవపూరు	3_7_62	,,	ఉప్పలూరు	24_7_62
,,	బోపినవరం	4_7_62	,,	షాపూరు	19_7_62
వికారాబాదు	మర్పల్లికలన్	21_7_62	బోధన్	రైకూర్ క్యాంప్	17_7_62
,,	కల్కోడ	22_7_62	,,	రమరొపల్లి	18_7_62
,,	చిమల్దాం	20_7_62	,,	అచ్చంపల్లి	21_7_62
,,	బర్వాద్	20_7_62	,,	తగిడపల్లి	19_7_62
,,	కుక్కిండ	15_7_62	బాన్స్వాడ	అన్నారం	23_7_62
,,	బిల్కల్	21_7_62	యెల్లారెడ్డి	రాఘవపల్లి	26_7_62
హయాత్‌నగర్	కుర్రేమల్	23_7_62	,,	లింగంపేట	27_7_62
ఇబ్రాహింపటం	ఆదిబట్ల	30_7_62	కామారెడ్డి	భూంపల్లి	29_7_62
,,	పోల్కంపల్లి	25_7_62	,,	గిద్ద	28_7_62
,,	ఎలిమినాదె	26_7_62	బాన్స్వాడ	దుర్కి	24_7_62
,,	మురళీనగర్	28_7_62		కరీంనగర్ జిల్లా	
,,	దాసర్లపల్లి	29_7_62	కరీంనగర్	నాగులమల్లియాల్	7_7_62

తాలూకా పేరు	గ్రామం లేక సంస్థ పేరు	కమ్యూనిటీ రేడియో సెట్టు నెలకొల్పబడిన తేదీ
సుల్తానాబాద్	కిషన్‌రావుపేట	19_7_62
హుజూరాబాద్	కముకిలగిడ్డ	19_7_62
సిరిసిల్ల	కోడూరుపాక	25_7_62
మెట్పల్లి	యూసఫ్‌నగర్	25_7_62
	ఆదిలాబాదు జిల్లా	
నర్సాపూర్	అర్లి 'బి'	24_7_62
,,	రత్నాపూర్	25_7_62
,,	ముజ్గి	26_7_62
,,	రాజూర	27_7_62
,,	అంబకంటి	28_7_62
ఖానాపూరు	మస్కాపూరు	28_7_62
	మెదకు జిల్లా	
జోగిపేట	జూకల్	13_7_62
	వరంగల్ జిల్లా	
వరంగల్	అన్నారం	20_7_62
,,	వంచనగిరి	22_7_62
,,	భీమవరం	23_7_62
మహబూబాబాదు	దంతాలపల్లి	28_7_62
,,	వీరారం	28_7_62
వరంగల్	కొలనుపల్లి	26_7_62
,,	మొరిపెరాల	26_7_62
,,	రాయపర్తి	26_7_62
మహబూబాబాదు	కొరివి	28 7_62
	నెల్లూరు జిలా	
నెల్లూరు	అనికెపల్లి	20_7_62
కోవూరు	నార్త్ అములూరు	21_7_62
ఆత్మకూరు	ఓబులాయపల్లి (పాతపాడులో సెట్)	23_7_62
కోవూరు	ఉటూకూరు (పాత పాలెంవద్ద సెట్)	25_7_62

తాలూకా పేరు	గ్రామం లేక సంస్థ పేరు	కమ్యూనిటీ రేడియో సెట్టు నెలకొల్పబడిన తేదీ
నెల్లూరు	ఇందుకూరుపేట (గవండ్లపాలెంవద్ద సెట్టు)	25_7_62
	కొత్తపాలెం (జంగం వారి దరువులో సెట్టు)	21_7_62
,,	బలిజపాలెం	20_7_62
ఆత్మకూరు	అనంతసాగరం	22_7_62
నెల్లూరు	తిక్కవరప్పాడు	25_7_62
గూడూరు	అయ్యవారిపాలెం	23_7_62
సూళ్ళూరుపేట	పువ్వులతోట	22_7_62
,,	తనయాలి	21_7_62
గూడూరు	దమనెల్లూరు	20_7_62
సూళ్ళూరుపేట	ఎంజూరు	20_7_62
,,	నాయుడుపేట	21_7_62
గూడూరు	తిప్పవరప్పాడు	23_7_62
రాపూరు	రాధాకృష్ణ మైకాగనులు (తలుపూరు)	28_7_62
,,	కలిచెడూరు మైకా గనులు (వడ్డెపాలెం వద్ద సెట్టు)	24_7_62
,,	మునేరియా మైకాగనులు	24_7_62
,,	రమణవిలాస్ మైకా గనులు	24_7_62
వెంకటగిరి	కయ్యూరు. (వంజ మాంబావద్దసెట్టు)	23_7_62
,,	సగటూరు	22_7_62
రాపూరు	కొమ్మిపాడు	30_7_62
కావలి	బిట్రగుంట II	24_7_62
,,	అల్లిమడుగుయామిడి కాలని	24_7_62
కందుకూరు	సింగరబొట్లపాలెం	24_7_62
,,	అవ్వారిపాలెం	25_7_62
,,	నెర్నూరుపాడు	25_7_62
,,	మూగచింతల	25_7_62

తాలూకా పేరు	గ్రామం లేక సంస్థ పేరు	కమ్యూనిటీ రేడియో సెట్టు నెలకొల్పబడిన తేదీ
కనిగిరి	చెన్నప్పనాయుడుపల్లి	26-7-62
ఉదయగిరి	రాచవారిపల్లి	24-7-62
..	గణేశ్వరపురం	27-7-62
..	ఉదయగిరి	24-7-62
	చిత్తూరు జిల్లా	
చిత్తూరు	ఆదిలక్ష్మణబాపురం (జిల్లాపరిషత్ హైస్కూలు)	12-7-62
..	తుంబ	14-7-62
..	ముంగరమడుగుపల్లి	14-7-62
..	కొత్తపల్లి —45	15-7-62
..	ఎగువతడకర	15-7-62
..	అరగొండ II (నెల్లపరెడ్డిపల్లిలో సెట్టు)	15-7-62
కాళహస్తి	కాటూరు	15-7-62
..	పెద్దపాలవీడు	15-7-62
చిత్తూరు	142 బండపల్లి	16-7-62
..	పాపసముద్రం	16-7-62
..	చీలపల్లి	16-7-62
కాళహస్తి	బోనుపల్లి	17-7-62
..	కోరకల్లు	18-7-62
చిత్తూరు	కొత్త వెంకటాపురం	20-7-62
..	ఆత్మకూరు	20-7-62
కాళహస్తి	ఒల్లూరు	16-7-62
చంద్రగిరి	నన్నూరువారిపల్లి	21-7-62
..	కృష్ణాపురం	23-7-62
చిత్తూరు	కలిజవీడు (నసిం పల్లిలో సెట్టు)	27-7-62
..	పులికల్లు (ఉగ్గిన పల్లిలో సెట్టు)	27-7-62
..	గొల్లపల్లి—13	30-7-62
..	అధికారపల్లి	30-7-62
..	దాసరిపల్లి	31-7-62
..	పి. కొత్తకోట—II	31-7-62

తాలూకా పేరు	గ్రామం లేక సంస్థ పేరు	కమ్యూనిటీ రేడియో సెట్టు నెలకొల్పబడిన తేదీ
	అనంతపురం జిల్లా	
పెనుకొండ	ఏదుల బాలపురం	10-7-62
..	గుడిపల్లి	12-7-62
కదిరి	మేకలచెరువు	18-7-62
..	టి. సదం	19-7-62
రాయదుర్గం	సోళ్ళపురం	22-7-62
కల్యాణదుర్గం	తిమ్మసముద్రం	24-7-62
..	తగ్గుపర్తి	24-7-62
అనంతపురం	అలమూరు	28-7-62
..	ఆకులాడు	30-7-62
..	కే. కే. అగ్రహారం	31-7-62
..	సోదనపల్లి	31-7-62
	నల్గొండ జిల్లా	
..	తాడవి. వెంకటాపురం	17-7-62
..	దోరకుంట	18-7-62
..	చిమిరియాల	20-7-62
	విశాఖపట్నం జిలా	
భీమునిపట్నం	చింతలవలస	13-7-62
..	చింతపల్లి	13-7-62
చోడవరం	గవరపాలెం	25-7-62
విజయనగరం	సరిక	26-7-62
..	చెలువూరు	27-7-62
..	వంటితాడిఅగ్రహారం	28-7-62
చోడవరం	గున్నెంపూడి	25-7-62
యస్. కోట	గులివెందల	23-7-62
..	సంతపాలెం	18-7-62
చోడవరం	సేమునపల్లి	24-7-62
యెలమంచిలి	దుప్పిటూరు	20-7-62
చోడవరం	పి. భీమవరం	25-7-62
భీమునిపట్నం	మజ్జివలస	14-7-62
అనకాపల్లి	పి. బోనంగి	8-7-62
భీమునిపట్నం	బొడ్డువలస	13-7-62

తాలూకా పేరు	గ్రామం లేక సంస్థ పేరు	కమ్యూనిటీ రేడియో సెట్టు నెలకొల్పబడిన తేదీ
విజయనగరం	కంచరపాలెం	29_7–62
చోడవరం	మారుపల్లి	26–7–62
భీమునిపట్నం	గోవిందపురం	14–7–62
చోడవరం	లక్ష్మీపురం	21–7–62
		(పాతసెట్టుస్థానే క్రొత్తది)
..	తిరువాలు	22–7–62
		(పాత సెట్టు స్థానే క్రొత్తది)
..	కలిగొట్ల	22–7–62
		(పాత సెట్టు స్థానే క్రొత్తది)
యస్. కోట	వెంకటరమణపేట	18–7–62
		(పాత సెట్టు స్థానే క్రొత్తది)
..	మూసిరాం	17–7_62
		(పాత సెట్టు స్థానే క్రొత్తది)
విశాఖపట్నం	నడిపూరు	7–7–62
		(పాత సెట్టు స్థానే క్రొత్తది)
	తూర్పు గోదావరి జిల్లా	
పిఠాపురం	మాధవపురం	26_7_62
కాకినాడ	నవర	27_7_62
	పశ్చిమ గోదావరి జిల్లా	
ఏలూరు	ముప్పవరం–I	20–7_62
..	జగన్నాధపురం	18–7–62
..	ముప్పవరం–II	20–7–62
..	రాళ్ళకుంట	21–7–62
..	దొరసానిపాడు	22_7_62
చింతలపూడి	ఏపినగుంట	23–7–62
	కృష్ణా జిల్లా	
గుడివాడ	ఎలమర్రు	29–7–62
	గుంటూరు జిల్లా	
రేపల్లె	పెదపులివర్రు–IV	20–7_62
..	రాయభట్లపాలెం–III	31–7–62
గుంటూరు	మల్లాయపాలెం	7–7–62
గుంటూరు	వడ్లమాను II	11–7–62
తెనాలి	సిరిపురం	14–7–62
గుంటూరు	వాజెండ్ల	31_7_62
వినుకొండ	అంగలూరు	27–7–62
..	బొల్లపల్లి	28–7–62
..	ఉప్పరపాలెం	24_7–62
..	నాగులవరం	26–7–62
..	తాళ్ళబాడు	25–7–62
యస్. ఆర్. పేట	ఉప్పుమాగులూరు	24–7–62
..	మారుటూరు	30–7–62
బాపట్ల	ఇటికంపాడు	21–7–62
..	తొట్టెంపూడి	20–7–62
..	పచ్చలతాడిపర్రు	21–7–62
..	పెదగొల్లపాలెం	24–7–62
..	పులుగువారిపాలెం	31–7–62
..	మురుకొండపాడు	26–7_62
..	కొత్తపేట–II	24–7–62
..	కొమ్మూరు	21–7–62
..	అడుసుమల్లి–II	22-7–62
ఒంగోలు	మోదేపల్లి	17–7–62
..	హెచ్.నిడమనూరు–III	18–7_62
	నెల్లూరు జిల్లా	
దర్శి	కెల్లంపల్లి	26–7–62
	గుంటూరు జిల్లా	
ఒంగోలు	వాళ్ళపల్లి–II	10_7-62
	నెల్లూరు జిల్లా	
దర్శి	వెంపరాల	28-7-62
..	ఏదార–III	25-7-62
పొదిలి	తువ్వపాడు	20_7-62
..	ఈగలపాడు	20_7-62
..	వేమవరం	21-7-62

సంగ్రహ ప్రకటనలు

స్వల్పకాలిక బి. యిడి. కోర్సు పునరుద్ధరణ

సెకండరీ గ్రేడు శిక్షణపొంది పనిచేస్తున్న పట్టభద్రులైన ఉపాధ్యాయులకై ప్రస్తుత విద్యా సంవత్సరంనుండి స్వల్పకాలిక బి. యిడి కోర్సును పునః ప్రవేశపెట్టాలని ప్రతిపాదించారు. రాష్ట్రంలోని గుర్తించబడిన పాఠశాలల్లోని పట్టభద్రులై (బి. ఎ. బి. యస్., బి. కాం) సెకండరీ గ్రేడు శిక్షణ పొంది, పనిచేస్తున్న శాశ్వత ఉపాధ్యాయులకు మాత్రమే యీ 5నెలల కోర్సు ఉద్దేశించబడింది.

9నెలల రెగ్యులర్ బి. యిడి కోర్సుకై విశ్వవిద్యాలయం నిర్దేశించిన పాఠ్య ప్రణాళికలనే యీ కోర్సులోకూడా అనుసరిస్తారు. ఈ కోర్సులో చేర్చుకోబడిన అభ్యర్థులను ప్రత్యక్ష తరగతులనుండి మినహాయించడం జరుగదు. 9నెలల రెగ్యులరు బి. యిడి. కోర్సు అభ్యర్థులకు విశ్వవిద్యాలయం నిర్దేశించిన ప్రత్యక్ష రికార్డులనే వీరు కూడా నిర్వహించాల్సి ఉంటుంది

రెగ్యులర్ బి యిడి. కోర్సు అభ్యర్థులకు మాదిరిగానే వీరికి కూడా విశ్వవిద్యాలయ పరీక్ష, పాఠ్యబోధనలో ప్రత్యక్ష పరీక్షలు ఉంటాయి. విశ్వవిద్యాలయం పరీక్షలో ఉత్తీర్ణులైనవారికి విశ్వవిద్యాలయ బి. యిడి. డిగ్రీని యివ్వడం జరుగుతుంది. ప్రస్తుత విద్యా సంవత్సరంలో 1962 అక్టోబరునుండి 1963 మార్చివరకు ఆంధ్ర విశ్వవిద్యాలయం ప్రాంతంలో రాజమండ్రిలోని ప్రభుత్వ శిక్షణ కళాశాలలోనూ, శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం ప్రాంతంలో, కర్నూలులోని ప్రభుత్వ శిక్షణ కళాశాలలోనూ ఉస్మానియావిశ్వవిద్యాలయం ప్రాంతంలో హైదరాబాదులోని ప్రభుత్వశిక్షణ కళాశాలలోను యీ కోర్సును నిర్వహించాలని ప్రతిపాదించారు.అయితే ఆర్థిక వసరులు లభించడంపైననే యీ నిర్వహణ ఆధారపడి ఉంటుంది. వచ్చే విద్యా సంవత్సరంనుండి సంవత్సరానికి రెండుసార్లు ఏప్రిల్‌నుండి సెప్టెంబరువరకు, అక్టోబరునుండి మార్చివరకు యీ కోర్సునునిర్వహిస్తారు.

కొత్త పంచాయతీ సమితులు

1962 అక్టోబరునుండి దిగువ తెల్పిన ప్రతి బ్లాకుకు పంచాయితీ సమితిని యేర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది.

బ్లాకు	తాలుకా	జిల్లా
వీరఘట్టం	పాలకొండ	శ్రీకాకుళం
మెరకముడిదం	చీపురుపల్లి	శ్రీకాకుళం
కురుపం	పార్వతీపురం	శ్రీకాకుళం
చోడవరం	చోడవరం	విశాఖపట్నం
భీమనపల్లి	అమలాపురం	తూర్పు గోదావరి
పెనుగొండ	తణుకు	పశ్చిమ గోదావరి
ఆచంట	నర్సాపూర్	పశ్చిమ గోదావరి
గుడివాడ	గుడివాడ	కృష్ణా
నల్లపాడు	గుంటూరు	గుంటూరు
అమర్తలూరు	తెనాలి	గుంటూరు
పరచూరు	బాపట్ల	గుంటూరు
కొవ్వూరు	కొవ్వూరు	నెల్లూరు
తార్లపాడు	పొదిలి	నెల్లూరు
పెనుమూరు	చిత్తూరు	చిత్తూరు
రాజంపేట	రాజంపేట	కడప
ధర్మవరం	ధర్మవరం	అనంతపురం
పరిగి	పరిగి	హైద్రాబాదు
కోదాడు	హుజూరునగరం	నల్లగొండ
మోత్కూరు	రామన్నపేట	నల్లగొండ
అడ్డకల్లు	వనపర్తి	మహబూబునగరం
రేవల్లి	నాగరకర్నూలు	మహబూబునగరం
జగిత్యాల	జగిత్యాల	కరీంనగరం
నర్మెట్ట	జనగామ	వరంగల్లు
నెల్లికుదురు	మహబూబాబాదు	వరంగల్లు
మోర్తాడు	ఆర్మూరు	నిజామాబాదు

అధికాహారోత్పత్తికి రాయితీలు

1372 ఫసలీ (30-6-1963వరకు)లో కూడా దిగువ తెల్పిన అధికాహారోత్పత్తి రాయితీలను కొనసాగించాలని ప్రభుత్వం ఆదేశించింది.

(1) సంస్థ ఆవరణలలో సేద్యం (2) ఇంటి పెరడులలో సేద్యం (3) గ్రామాలు, పట్టణాలలో ఖాళీగాఉన్న స్థలాలలో సేద్యం (4) సముద్రతీరంలోని భూములలో సేద్యం (5) నీటి పారుదల నియమావళులను సాంకేతికంగా ఉల్లంఘించిన సందర్భాలలో పెనాల్టీలను రద్దు చేయడం (6) గోదావరి, కృష్ణా, గుంటూరు జిల్లాలలోని కోస్తా ప్రాంతం భూములలో సేద్యం చేయడం.

పాఠ్య పుస్తకాలలో మెట్రిక్ పద్ధతి

దేశంలో వివిధరంగాలలో మెట్రిక్ పద్ధతి తూనికలు, కొలమానాలను ఉపయోగించడం జరుగుతున్నది. పాఠ్య పుస్తకాలలోనూ, గణిత ఉపకరణాలు, గ్రాపులలో కూడా మెట్రిక్ పద్ధతి యూనిట్లను, కొలతలను ప్రవేశపెట్టాలి.

విజ్ఞానశాస్త్రం, గణిత శాస్త్రాలలో మెట్రిక్ పద్ధతి యూనిట్లను, కొలతలను ప్రవేశపెట్టడానికి రాష్ట్రప్రభుత్వం తగిన చర్యలను తీసుకున్నది.

గణితశాస్త్ర ఉపకరణాలను తయారు చేసేవారు, గ్రాపు పుస్తకాల డీలర్లు అందరూ వాటిని మెట్రిక్ పద్ధతి యూనిట్లలో మాత్రమే తయారు చేయాలి.

పుస్తకాలలో ప్రాంతాలు, లైనుల కొలతలు అవసరమైన చోట్ల సెంటిమీటర్ గ్రాపులను ప్రచురణకర్తలు వాడాలి.

ట్రాన్సుపోర్టు పరిశ్రమలదారులకు రుణ సౌకర్యాలు

1951 రాష్ట్ర ఆర్థిక కార్పొరేషను చట్టాన్ని సవరించారు. ఈ సవరణ 1962 జనవరి 1వ తేది నుండి అమలులోకి వచ్చింది. యీ సవరణ మూలంగా నదులు, రోడ్డురవాణాపరిశ్రమలు, యితర పరిశ్రమల మాదిరిగానే రాష్ట్ర ఆర్థిక కార్పొరేషను నుండి నేరుగా ఆర్థిక సహాయాన్ని, గ్యారంటి సౌకర్యాలను పొందగలుగుతాయి. రవాణా పరిశ్రమ అభివృద్ధికిగాను, ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ఆర్థిక కార్పొరేషను నుండి ఆర్థిక సహాయాన్ని పొంద దల్చిన రాష్ట్రంలోని రోడ్డు రవాణా పరిశ్రమ దార్లు, హైద్రాబాదు. చాపిల్ రోడ్డులోని పైకార్పొరేషను మేనేజింగ్ డైరెక్టరుకు దరఖాస్తుచేయవచ్చు.

కేటాయింపుల సలహా సంఘం

1956 స్వల్పాదాయ వర్గం గృహ నిర్మాణ పథకం క్రింద నిర్మించ బడిన గృహాలను అద్దె కొనుగోలు పద్ధతిపై కేటాయించే సందర్భంగా వరంగల్లు కేటాయింపు సలహా సంఘంలో క్రింది సభ్యులను 1962 జనవరి 21 వ తేదీన ప్రభుత్వం తిరిగి నియమించింది. వీరి సభ్యత్వ గడువుమూడు సంవత్సరాలు.

(1) కలెక్టరు (అధ్యక్షుడు) (2) డిప్యూటి కలెక్టరు (ఉపాధ్యక్షుడు) (3) మునిసిపల్ కమిటి ప్రెసిడెంటు (4) శ్రీ టి. హయగ్రీవాచారి, యం. యల్. ఎ. (5) శ్రీ మీర్జా షుకూర్ బేగ్. (6) డా. టి. యస్. మూర్తి, వరంగల్లు.

మునిసిపల్ కమిటి ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ యీ సంఘం ఎక్స్ అఫీషియో కార్యదర్శిగా ఉంటారు.

బేతవోలు గ్రామం

నల్లగొండ జిల్లా, సూర్యాపేట తాలూకాలో ఉన్న బేతవోలు గ్రామం అదే జిల్లాలోని హుజూరు నగర్ తాలూకాకు మార్చబడిన కారణంగా ఎక్సైజ్ పరిపాలనా వ్యవహారాల నిమిత్తం యీ గ్రామాన్ని హుజూరు నగర్ ఎక్సైజ్ రేంజికి మార్చడం జరిగింది.

రాక్షసి బొగ్గు సరఫరా

1962 జులై 1 వ తేది నుండి రాక్షసి బొగ్గు పంపిణీపై తిరిగి కంట్రోలు విధించబడిన కారణంగా గృహ వాడకానికై నెలకు 100 కిలోగ్రాములు అంతకు తక్కువ వాడే చిన్న వినియోగదార్లు బొగ్గును పొందడంలో చాలా అవస్థలను యెదుర్కొంటున్నారు. అందువల్ల 100 కిలోగ్రాములు అంతకు తక్కువ రాక్షసి బొగ్గు కొనుగోలు పై కంట్రోలును రద్దు చేయాలని ఆంధ్ర ప్రదేశ్ కంట్రోలు సరకుల డైరెక్టరు నిశ్చయించారు. డీలర్లు పొందే ప్రతి వ్యాగన్ నుండి 4 టన్నుల బొగ్గును స్వేచ్ఛంగా చిన్న వినియోగదార్లకు విక్రయించ వచ్చు. నెలకు 100 కిలోగ్రాములు, అంతకు తక్కువ వాడే ప్రజలు కంట్రోలు సరుకుల డైరెక్టరు కార్యాలయం జారీ చేసే కార్డు లేకుండానే డీలర్ల నుండి ఆ మేరకు బొగ్గును కొనుగోలు చేయవచ్చు.

నెలకు 100 కిలో గ్రాములకు మించి రాక్షసి బొగ్గు అవసరమయ్యే వారు పర్మిటుకై డైరెక్టరుకు ఒక రూపాయి కోర్టు ఫీజు స్టాంపుతో సహా దరఖాస్తు చేయాలి.

భారత ప్రభుత్వ స్కాలర్ షిప్పులు

షెడ్యూలు కులాలు, షెడ్యూలు జాతులు యితర వెనుకబడిన తరగతులకు చెందిన మెట్రిక్యులేషను తర్వాత చదివే విద్యార్థులకు భారత ప్రభుత్వ స్కాలర్ షిప్పులు లభిస్తాయి. హైద్రాబాదులోని ఆంధ్ర ప్రదేశ్ సాంఘిక సంక్షేమ శాఖ డైరెక్టరు యీ స్కాలర్ షిప్పులను యిస్తారు. హెచ్. యస్. సి. యస్. యస్. యల్. సి లలో ఉత్తీర్ణులై యితర ఉన్నత విద్యా కోర్సులకు వెళ్ళే విద్యార్థులు కూడా పై స్కాలర్ షిప్పులకు అర్హులవుతారు.

భారత ప్రభుత్వ స్కాలర్ షిప్పుల ఫారాలను ఆయా కళాశాలల నుండి వారు పొందవచ్చు. స్కాలర్ షిప్పు ఫారాలను విద్యాసంస్థల అధిపతుల ద్వారా ప్రతి సంవత్సరం హైద్రాబాదు, నారాయణగూడాలో 3-5-115 వ నెంబరు ఇంటిలో ఉన్న ఆంధ్ర ప్రదేశ్ సాంఘిక సంక్షేమశాఖ డైరెక్టరుకు పంపాలి.......— ★

మహాకవి!

శ్రీ బృందావనం రంగాచార్య

కవితా వన సీమలలో
జవసత్త్వము రూపుదాల్చి
నవ జీవన రాగ లహరి
భువిపై ప్రవహింపజేయ
యువ భావ పరంపరలో
ఉజ్జ్వలమగు వెన్నెల గాయ
సువిశాలాశయ శోభలు
వివిధ దిశల వెల్లివిరియ
స్తవ నీయ సాహిత్యామృత
సాగరమున పొంగు లెగయ
నిరుపమాన నియమమ్ముల
నిర్ణయించు నీజాడ-
నిశ్చయమ్ము నీవు కళా
నిధి వయ్యా! గురజాడ!

★

పేశల కవనాల లీల
మోసులెత్తి మొగ్గ దొడిగి
ఆశామయ కుసుమావళి
ఆంధ్రవాణి కాభరణాలై
జనముల మురియించినవి
మనముల వరియించినవి

★

భాషార్ణవ గర్భములో
బ్రహ్మాండమునూపి వేయు
పెను తుఫాను విసరినపుడు
ఘన గర్జనముసరినపుడు.
ప్రజలభావభంగిమలకు
నిజమైన ప్రతినిధిగా
వినిపించెను నీమాట
విన సొంపగు నీపాట
ప్రతి హృదయము పులకించి
రసవసంతముదయించి
సమాజమున సౌభాగ్యము



[మహాకవి శ్రీ గురజాడ అప్పారావుగారు 1862 సెప్టెంబరు 21వ తేదీన జన్మించారు. అనేక రంగాలలో బహుముఖంగా సేవచేసి శ్రీ గురజాడ 1915 నవంబరు 30న కీర్తిశేషులయ్యారు. భాషాపరంగా, కవితా పరంగా, సంఘపరంగా వచ్చిన విప్లవంలో శ్రీ గురజాడ ఒక ప్రముఖ మూర్తి. మానవుణ్ని మానవుడుగా చూడవలసిందని ప్రతిమానవుణ్ని ఉద్బోధిస్తూ దేశభక్తి గేయాన్ని రచియించినమహాకవి. పెక్కు గ్రంథాలు రచియించి ప్రజాకవిగా కీర్తిగడించిన శ్రీ అప్పారావుగారి శతవార్షిక జయంత్యుత్సవాలను ఒక సంఘాన్ని నియమించడం ద్వారా ప్రభుత్వం నిర్వహిస్తున్నది. ఈ సంవత్సరం అంతా యీ ఉత్సవాలు జరపడానికి యీ కమిటీ వారు నిశ్చయించారు.]

కాంతి రేఖ ప్రభవించి
జగన్మంగళోద్యమమున
సార్థకతను సాధింపగ
విశ్వసేవలో— కవితా
వీణియలను పలికించి
తరియించిన నీ కలము
తమ్ముళ్ళ తపః ఫలము.

★

కల కాలము తెలుగు గుండె
కావ్యశోభ లీనుచుండె
చవులూరే తేనె తేట
కవితయాయె నీనోట
దేశభక్తి గేయముగా
తేజరిల్లె తెలుగు నాట
ముదమారగ నీకిచట
మ్రొక్కుబడులు ముప్పూట
విశ్వహితం మతముగా
వినిపించిన నీపాట
భువన మోహనాదర్శము
పొరలుచున్న పూల బాట
భావిశుభము కొరకు భద్ర
పరచబడిన పసిడి మూట.

★

విలాసాల లాలసతో
కులాసాల కులుకులతో
ఇలాతలమునే మరచి
విహాయసమునందు నడచి
గగన కుసుమ పరిమళాల
ఘనతను వర్ణించువారు
అరచేత నవనిధులను
గిరగిరమని త్రిప్పునట్లు
సురగురువును మేధస్సున
పరిహసింప బూనినట్లు
మెరమెచ్చుల జూపువారు
పరుల సొమ్ము మేయువారు.
కన్యాశుల్కపు వాడల
కనిపింతురు నీనీడల.
శాస్త్రాలను వల్లించి
సంస్కృతినే విస్మరించి
అక్రమాల నాచరించి
అదురు బెదురు గనని జనం
మేక తోలు గప్పుకొన్న
భీకర శార్దూల గణం
తప్పుకొనేదారిలేక
ఒప్పుకొనేయోర్మిలేక
నీలేఖిని కెదురుగా
నిలిచిరయ్య దోషులుగా
అమరమయ్య! నీకీర్తి!
అప్పరాయకవి మూర్తీ!

★

ఆశలకు లోబడుట తెలియని
పాశవిక శక్తులకు జంకని
అడుగు వెన్కకు వేయ నెరుగని
ఆశయమ్ముల విస్మరింపని
నీశుభంకర మహోద్యమము
దేశహితరత నవోద్యమము
నీకలస్వన నిస్వనమ్ము
లోకముల కభిరంజనమ్ము
నీ మహోజ్జ్వల కావ్యరీతి
మా మహీతలమునకు ప్రీతి
నమస్సుమములు మహాకవీ!
జయ! జయ! వాఙ్మయరవీ!

ప్రశ్నోత్తరావళి

శ్రీ ఇందుపూరు లక్ష్మణరావు,
పార్వతీపురం, శ్రీకాకుళం జిల్లా.

ప్రశ్న : నాలుగు సంవత్సరాల క్రితం పార్వతీపురంలో మంచినీటి సరఫరా పథకాన్ని ప్రారంభించారు. అయితే అది యింత వరకూ పూర్తి కాలేదు. యిది యెప్పుడు పూర్తి అవుతుంది. నీటి సరఫరాను యెప్పటి నుండి ప్రారంభిస్తారు?

సమాధానం : పార్వతీపురం నీటి సరఫరా పథకాన్ని ప్రభుత్వం మంజూరు చేసింది. 1959_60 సం.లో యీపథకం అమలును ప్రారంభించారు. గ్యాలరీ పని యింకా జరగాల్సి ఉంది. 1963 ఏప్రిల్ వరకు పట్టణానికి నీటి సరఫరా జరుగుతుంది.

కుమారి, పి.యల్. దేవి,
గునుపూడి, భీమవరం. పశ్చిమ గోదావరి జిల్లా.

ప్రశ్న : టెలికమ్యూనికేషన్, సివిల్, మెకానికల్ శాఖలలో — ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్‌లో యెంతమంది మహిళా యింజనీర్లు ఉన్నారు ?

సమాధానం : ఆంధ్ర ప్రాంతంలో దిగువవిధంగా మహిళా యింజనీర్లు ఉన్నారు :

సివిల్ ఇంజనీర్లు	...	...	2
టెలి కమ్యూనికేషన్లు	...	...	లేరు
మెకానికల్	...	...	లేరు

శ్రీ పి. రమేశ్,
దేవీరోడ్డు, నిజామాబాదు.

ప్రశ్న : నిజాంసాగర్ చెరువులో మేట తీసే ప్రయత్నాలు యేమైనా చేస్తున్నారా. పని యెప్పుడు ప్రారంభిస్తారు?

సమాధానం : నిజాంసాగర్ చెరువులో యే ప్రాంతంలో మేట ఉన్నదీ, యెంత ఉన్నదనే విషయాన్ని అంచనా వేసేందుకు చర్యలు తీసుకుంటున్నారు. అంచనాలు అందిన తర్వాత మేట తీసేందుకు అవసరమైన విధానాలను నిర్ణయిస్తారు.

ఎగువసీలేరు

ఎగువసీలేరు ప్రాజెక్టును గురించి మరికొన్ని యితర విశేషాలున్న వ్యాసభాగం నవంబరు సంచికలో ప్రకటితమవుతుంది.

గమనిక

సెప్టెంబరు ఆంధ్రప్రదేశ్‌లో తెలుపు నలుపు శీర్షిక క్రింద వెలువడిన పద్మశ్రీ శ్రీ సి. నరసింహం ఐ.ఏ.యస్. గారి వ్యాసం, హైద్రాబాద్ ఆలిండియా రేడియో కేంద్రం వారి సౌజన్యంతో ప్రకటితమైందిగా గుర్తించగోరుతున్నాము.

— ఎడిటర్ :

మానవతామూర్తి శ్రీ గురజాడ

" వి జ య "

కాలం మారడమూ కాలంతోపాటు నాగరకతా. తత్ప్రగతికి ప్రధాన కారణం అయిన సాహిత్యపు రూపురేఖలు మారడం సహజం. అయితే ఒక విప్లవాత్మకమైన మార్పు వచ్చినప్పుడు దాన్ని తట్టుకోలేని ఛాందసులు తమ పెత్తనమూ. అధికారమూ కాపాడుకోడానికి ప్రగతికారుల మీద దండెత్తి వారిని బహిష్క-రించి శిక్షించి వారిని ప్రగతి పథం నుండి మళ్లించడానికి ప్రయత్నించడం కూడా సహజములే. అంతమాత్రం చేత వారు ప్రగతికి అడ్డుగోడలు నిర్మించలేకున్నా తాము మాత్రం సనాతనులమైనామని మురిసిపోతారు. బ్రహ్మాండమైన విజ్ఞాన వికాసానికి అంటే సైంటిఫిక్ డెవలప్‌మెంట్‌కు చర్చి ఏవిధంగా నిరోధాలు కల్పించిందో, ఎంతమంది వారి క్రౌర్యానికీ, కర్కశత్వానికీ. గురి అయినారో మనకు తెలియంది కాదు. అలా అయినప్పటికీ ప్రగతి శీలురు జన్మిస్తూనే ఉన్నారు. ఒకనాడు వారిని ఎదిరించిన సనాతనులు వారి కృషివల్ల లాభాలు పొందుతూనే ఉన్నారు. అయితే ప్రగతిని ఎదిరించిన వారి కంటే ప్రగతి పథాన పురోగమించే మహాపురుషులకే చరిత్ర నివాళులిస్తూంది. ఒకనాడు వారిని ఎదిరించిన ఛాందసులే తరువాత ఆ ప్రగతి శీలురను పూజిస్తారు.

మన తెలుగు సాహిత్యానికి సంబంధించినంతవరకు పాల్కురికి సోమనాధునిలాంటి వారు సాహిత్యంలో మహా విప్లవం తీసుకునిరాగా నాడు వారినెదిరించిన వారే ఆ తరువాత వారి రచనల్ని పురాణాలుగా చదువుకొని తరిస్తున్నారు. ఆనాటి విప్లవం తర్వాత ముఖ్యంగా పేర్కొనదగిన విప్లవం 18 వ శతాబ్దపు చివరి భాగము 20 వ శతాబ్దపు ప్రథమ పాదముదీన్నీ. "లోకంలోని గొప్పదనాలన్నింటినీ తమలో ఇముడ్చుకొని తాము విశ్వరూపులై తీరాలన్న ఉబలాటం ఆనాటి వారిలో తీవరించింది." కావ్యం అన్నా రచన అన్నా సామాన్యునికి అతీతంగా అతనికి అర్థం కాకుండా ఉండాలనే భావం సడలి కావ్యం సామాన్యుని జీవితానికి ప్రతిబింబంగానూ అతనికి అర్థం అయ్యేట్టున్నూ ఉండాలనే ఆలోచన మేధావుల్లో రేకెత్తింది. ఇది ఇంగ్లీషు ప్రభావం అనీ మన వారంతా మ్లేచ్ఛులు అయిపోతున్నారనీ వాపోయే ఛాందసులు కొల్లలుగా ఉన్నా తమలో రేకెత్తిన విప్లవ భావాలకు అక్షర రూపం కల్పించడానికి అనేకులు పూనుకున్నారు. యుగపురుషుడుగా వీరేశలింగం పంతులు, మార్గదర్శకులుగా తిరుపతి వెంకటేశ్వరులు, ఒక నూతన కవితా పద్ధతికి ఒరవడి పెట్టిన రాయప్రోలూ, సామాజిక వ్యవస్థలో సాహిత్యం ద్వారా విప్లవం రేకెత్తించిన గురజాడా ఇలాంటివారు. అయితే వీరందరిలోకీ గురజాడకు ఒక విశిష్ట స్థానం ఉంది. అందుకు కారణం అయిన సాహిత్య రంగంలో ఒక మహా విప్లవం తెచ్చి సాహిత్య ప్రవంతిని ప్రజా క్షేత్రాల వైపు మళ్ళించడమే.

గురజాడ అప్పారావు 1864 నవంబర్ 30 వ తేదీన జన్మించారు. ఆయన బి.ఏ పరీక్షలో ఉత్తీర్ణులు అయింతర్వాత 1887 వ సం. లో ఉపాధ్యాయ వృత్తిని స్వీకరించారు. తొమ్మిది సంవత్సరాలు విద్యా వ్యాసంగంలో గడిపి 1896 నుండి 1915 వరకు విజయనగరం మహారాజావారి ఆంతరంగిక కార్యదర్శిగా పని చేశారు.

అప్పారావు బాల్యం నుంచీ అస్వస్థ శరీరులు. ఆయనకు ఆరోగ్యం సరిగా ఉన్న కాలం చాల తక్కువ. ఎల్లప్పుడూ ఆయన వ్యాధిగ్రస్తులుగానే ఉండేవారు. ముప్పై మూడవ ఏట ఆయన బరువు 78 పౌనులు మాత్రం ఉండేది. జీర్ణకోశానికి నరాలకు సంబంధించిన వ్యాధులు బాల్యంలోనే ఆయన వెంటపడి ఆయన ఆయువునకు మాత్రమే కాక తెలుగువారి అదృష్టానికే గండి కొట్టాయి. గాలి సైతం భరించలేని అప్పారావుగారు గొడుగు అడ్డం పెట్టుకొని నడవడం అలా ఉండగా వెన్నెల సైతం భరించలేక, రాత్రిపూట సైతం గొడుగు వేసుకొని నడిచేవారు. ఏ ఉదక

మండలానికో పోవడం సంభవిస్తే జుబ్బా మీద జుబ్బా, కోటు మీద కోటు వేసేవారు. వారు అతి నిరాడంబరులు. పట్టభద్రులైనంత మాత్రంలో తమ వేషభాషల్ని వదిలి వచ్చి పాశ్చాత్యులు అయి పోలేదు. ఆయన వేషాన్ని చూచి ఎంత మంది వెక్కిరించినా ఆయన వారిని లెక్కపెట్టలేదు. పాశ్చాత్య సాంగత్యం వల్ల కొందరు అవినీతులుగా తయారుకాగా గురజాడవారు అందులోని మంచిని మాత్రమే గ్రహించి ఆదర్శపురుషులుగా తయారు అయి నారు. భూత భవిష్యద్వర్తమానాల్లో జరుగుతున్నవీ, జరిగినవీ, జరగబోయేవీ-అన్నీ మా పెరట్లోవే అనే ఛాందసంగల వ్యక్తి కాదు. లోకములోని విశిష్టతలన్నింటినీ గ్రహించి తెలుగుభాషలో జొప్పించాలనే ఆయన ఉబలాటం అడుగు అడుగునా గోచరిస్తున్నది. అప్పారావు ఆంధ్రాంగ్ల సంస్కృత సాహిత్యాల్ని క్షుణ్ణంగా అధ్యయనం చేసి ఆకళించుకున్న మహాపురుషుడు. బెంగాలీ, కన్నడ భాషల్లో సహితం ఆయనకు బాగా పరిచయం ఉండేది.

'కన్ను కానవి వస్తుతత్త్వము
కాంచనేర్పరు లంగిరీజులు
కల్ల నొల్లరు, వారి విద్యల
కరచి సత్యము నరసితిన్!

అని చెప్పి వారు సంస్కరణ వాదులు కావడానికి ఇంగ్లీషు చదువే కారణం అని వివరించారు. ఫ్రెంచి విప్లవ ఆదర్శాలను చూచి ప్రభావితుడై 1812 సంవత్సరపు కాటక పీడితులైన కార్మికుల పక్షాన గర్జించిన షెల్లీ, కాటకపీడితులైన నాటింగ్‌హాం కార్మికుల పక్షం వహించి వారి హక్కులకై తనవారిని ఎదిరించి పోరాడిన లార్డ్ బైరన్ కూడా ఈయనపై ప్రభావం వేసి ఉండాలి. అందుకే వాస్తవిక విషయాలను, యథార్థాలనూ కప్పిపుచ్చక "డాక్టరు రోగికి శస్త్ర చికిత్స చేసినట్లు సమాజంలో గల రుగ్మతలను కత్తి తీసుకొని కోసి దేనికది విడదీసి వివిధ భాగాలను పరీక్షించి" చూచాడు.

అప్పుడు ఆయనకు జీవితం నీటి బుడగవంటిదనీ, సౌందర్యం అశాశ్వతం అయిందనీ సూక్తులు వల్లించి, తాము మాత్రం కామినీ కాంచనాలకు దాసులు అవుతున్న వేదాంతులూ, తాము సంఘసంస్కర్తలమని చెప్పి చక్కని బోగంది కనిపించగానే ఉద్యమాన్ని తమకు వీలు అయినట్లు వాడుకునే సంఘసంస్కర్తలూ, భర్త చాటున దుర్మార్గాల్ని సాగిస్తూనే సానిదాన్ని ఏవగించుకునే సంసారులూ, తమ చుట్టూ ఉన్న కుళ్లును చూడలేక స్త్రీ పురుష శారీరక వాంఛల్ని గురించి, వారి కామ ప్రవృత్తిని అతివికారంగా శృంగారం పేరుతో వర్ణించే పండిత మ్మన్యులూ మూఢ విశ్వాసాలను చూపి అమాయకులను మోసపుచ్చి పొట్ట నింపుకునే భూసురులూ, కోర్టు పేరు చెప్పి ఆస్తులను కొల్లగొట్టించి ఆనందించే కోర్టు పక్షులూ, మాలలను వెలివేసే మాల హృదయం గల సనాతనులూ, డబ్బుగ్గాను బాలికల గొంతులుకోసే మహిళా శ్రేయోభిలాషులూ. 'దేవతలు, దేవతాస్త్రీలు, రాజులు, రాజకుమారికలు, పెద్దఇంటి పురుషులు, స్త్రీలు వీరి అవస్థలనే వర్ణించి .. తక్కువ జాతి వారిని గురించి' వ్రాయం అని వ్రతం పట్టిన కవిశిఖామణులూ గోచరించారు.

మూఢాచారాలను తుదముట్టించే సంఘాన్ని సంస్కరించ బూనుకున్న బ్రహ్మ సమాజమూ, సమాజంలో కుళ్ళును బయట పెట్టి సమాజాన్ని సంస్కరించడానిగ్గాను వ్యావహారిక భాషలో జరుగుతూండిన సులభమైన వంగ రచన అయన్ను బాగా ఆకర్షించాయి. పక్కనే ఉన్న వంగ రాష్ట్రం శరవేగంతో ముందుకు పోతూ ఉంటే గ్రాంధిక భాష అనీ, వ్యాకరణం అనీ మడి కట్టుకొని ప్రజలకు దూరంగా కూర్చోవడం దేశానికీ, సంఘానికీ ద్రోహం చేయడమేనని అంటూ "ఇకనైనా మనలో బుద్ధిమంతులు బెంగాలీ భాష నేర్చి దానిలోగల మంచిని తెనుగునకూర్తురు గాక." అని ఆశించారు. వ్యావహారిక భాషను గురించి గిడుగు వారు పండితులతో చర్చలు సాగిస్తూండగా వీరు కావ్యరంగంలోకి దూకి "దిక్కుమాలిన స్త్రీ అయిన గ్రామ్య భాషను పండితులు నిష్కారణంగా దూషించి అవమానించగా కనికరించి ఫీజు లేకుండా వకాల్తా పట్టి ... గ్రామ్యం అని పొరపాటున పేరుపెట్టి పిలిచే వాడుక భాషను కావ్యరచనలో ప్రవేశపెడితే ఉత్తమ కావ్యాలకుండవలసిన విలువ దిగజారిపోతుందనే విమర్శను మనం లెక్కచెయ్యనక్కర లేదు. ఎందుచేతనంటే కావ్య ప్రశస్తి, కావ్య ప్రయోజనమూ నిర్ణయించేవి పాతకాలపు వైయాకరుణుల ఛాందసాలు కావు. ...... సంకెళ్ళను ప్రేమించేవాళ్లు దాన్ని...అనగా గ్రాంధిక భాషను ఆరాధిస్తారుగాక. నామట్టుకు నా మాతృభాష సజీవమైన తెలుగు. 'ఇటాలియన్ ఆఫ్ది ఈస్ట్' అనిపించుకున్న ఈ తెలుగులో మన సుఖాల్ని మన దుఃఖాన్ని వెల్లడించుకోవడానికి మనం ఎవరమూ సిగ్గుపడలేదు. కాని కాగితం మీద పెట్టడానికి మాత్రం మనలో కొంత మంది బిడియపడుతున్నారు." అన్నారు.

తెలుగులో కథానికకు నాందిపలికింది గురజాడ వారే. అంతకు ముందు కథ చెప్పాలన్నా మనవాళ్లు పద్యాన్నే ఉపయోగించే వారు. వైద్య, జ్యోతిషాదిశాస్త్రాలే పద్యాల్లో రచించిన

ప్పుడు కథల్ను అడిగిన వారెవరూ? అలా అంటే మన సాహిత్యంలో వచనం లేనే లేదని అర్థంకాదు కాని వచనానికి ఉండాల్సిన సౌలభ్యత లేక పోగా పద్యం కంటే గంభీరంగా ఉండేదని చెప్పాల్సి వస్తుంది. అంటే వచనంతో సాధించాల్సిన ప్రయోజనానికి అది ఏ మాత్రమూ పనికి రాలేదని అర్థం. కావ్యంలా శ్రావ్యతకూ మనోరంజనానికే కాని ప్రత్యక్షప్రయోజనానికి వినియోగ పడలేదు. అప్పారావుగారు వచనం బహు జనోపయోగం అయ్యేట్లు రచించిన్నీ సౌందర్యంలో ప్రాచీన గద్యానికి ఏ మాత్రం తీసి పోకుండా రచించారు. అంతేకాదు వారు కథల ద్వారా దేశానికి ప్రజలకూ చక్కని గుణపాఠం నేర్పారు. ఈ కథలు తెలుగు కథారంగానికి తలమానికాల వంటివి. వాటిల్లో " మీ పేరేమి " అనే కథ ప్రపంచసాహిత్యంలోని ఉత్తమమైన కథానికలో ఒకటి కాగలిగినంత గొప్పది.

ఆధునిక యుగంలో మొదటి సారిగా పాతకాలం నాటి ఛందస్సులను వదలి కొత్త ఛందస్సును సృష్టించిన వాగనుశాసనుడు గురజాడ. " క్రొత్త పాతల మేలు కలియిక క్రొమ్మెరుంగులు జిమ్మగా " వారు గుచ్చిన ముత్యాల సరాలు నిజంగా ఆంధ్రవాణికి ముత్యాల సరాలే. అయినా " కొయ్య బొమ్మలు మెచ్చే కళ్లకు సోమరులు సౌరెక్క " లేదు. ఒక తుఫాను రేగింది. కాని చుక్కాని పట్టినవాడు మొనగాడు కాబట్టి నావ క్షేమంగా దరిచేరింది. గురజాడ అప్పారావు మిగతా రచనలు చేయక అచ్చం ముత్యాల సరాలు మాత్రమే రచించి యుండినా— అంతేకాదు ఒక్క దేశ భక్తి గేయం రచించి ఉండినా ఆయన అమర జీవి అయి ఉండే వారు.

ఆయన " దేశభక్తి గీతం సమస్త ప్రపంచ మానవులకు జాతీయగీతం. రామాయణ భారతాది ఇతిహాసాలకున్న విలువ ఈ ఒక్క గీతానికే ఉందని అంటే కొందరు ఆశ్చర్యం పొందుతారేమో ! కాని ఇది ఆశ్చర్యకరమైన యధార్థం.....ఇది ఒక తెలుగు కవి ప్రపంచానికి ఇచ్చిన భవితవ్యపు కానుక. ఒక కాలానికీ, ఒక స్థలానికీ పరిమితం కాని సందేశం ఇది." అన్నారు శ్రీ శ్రీ. " భారత దేశంలో అనేక జాతీయ గీతాలు వచ్చాయి. కాని వాటిలో దేనికీ అప్పారావు గీతంలోని భావగాంభీర్యం లేదు. బంకించంద్రుని వందేమాతరం గాని, రవీంద్రుని జనగణమనగాని ఇక్బాల్ రచించిన " హిందూస్థాన్ హమారా"గాని 'దేశమును ప్రేమించు మన్నా' గీతానికి ఏమాత్రం పోలికకురావు. " అన్నారు వాసిరెడ్డి వారు.

దేశాభిమానం నాకు కద్దని
ఒట్టి గొప్పలు చెప్పుకోకోయ్
పూని ఏదైనా వొక మేల్
కూర్చి జనులకు చూపవోయ్.

అనే గురజాడవారి ప్రబోధం ప్రకారం నడుచుకుంటే ఏ దేశమైనా పాడిపంటల్లో పొంగి పొర్లి తిండికలిగి కండగల మనుష్యులు దేశీ వస్తువులు సిద్ధంచేసి అన్ని దేశాలకూ అమ్మి దేశాన్ని సుసంపన్నం చేసి ఉందురు.

ఈనాడు మనం ఊహిస్తున్న వసుధైక కుటుంబాన్ని గురించి అప్పారావుగారు 1910 లోనే "యెల్లలోకము లొక్కయిల్లయి, వర్ణభేదములెల్ల కల్లయి, మతములన్నియు మాసిపోయిన, జ్ఞానమొక్కటినిలిచి వెలిగినవాడు, స్వర్గ సుఖంబులన్నవి యవని విలసిల్లున్" అని కలలు గన్నాడు. ఇలాంటి వసుధైక కుటుంబం యుద్ధాలవల్ల కాని, రాజులవల్ల కాని సాధ్యం అవుతుందనికాక యుద్ధాలకు ''పాత సంధులే ఉనికి పట్టులు" అవుతాయి అంటూ లోకమంతయు ఏకమై యుద్ధమునే మారణము చేయును" అంటూ, శాంతి స్థాపించుకోవాల్సింది ప్రజలుగాని ప్రభుత్వాలు కావని నాడు ఆయన చెప్పిన సూక్తులు నేడు ఎంత వాస్తవంగా కనిపిస్తున్నాయో రేపూ అంతే. లవణ రాజుకల అనే స్వర్ణఖండిక మహాకవికి అస్పృశ్యత విషయంలో ఉన్న బాధను వ్యక్తపరుస్తుంది. ''మాల యనువారున్న, వారల మందబుద్ధికి వగవవలెనంటూ మంచియన్నది మాలయైతే మాలనే యగుదున్" అంటారు అప్పారావు ముక్కుపచ్చలారని పుత్తడి బొమ్మ అయిన పూర్ణమ్మను ముదుసలికిచ్చి పెళ్లి చేయగా ఆమె ఆత్మహత్య చేసుకున్న కథ అందరినీ గోడుగోడునా ఏడ్పించేట్టు రచించి బండ గుండెలకు చమట పట్టించారు ప్రజా కవులు. పట్టపగలే నట్టివీధిని పట్టబోరే జారచోరులు పట్టదలచితి వింకనీవొక పట్లమేలే రాజువట" అంటూ స్వార్థ పూరితుడైన ప్రభువు జారచోరులకంటే కడహీనం అని వక్కాణించారు. "మనిషి చేసిన రాయి రప్పని మొక్కుతూ మనుషులంటే రాయిరప్పలకన్న కనిష్టంగాను" చూచే సంఘాన్ని చూచి జాలిపడ్డారు.

వారి కన్యా శుల్కాన్ని గురించి కట్టమంచి రామలింగారెడ్డి గారు అన్న "ముఖ్యంగా నాటకరచన విషయంలో నీవు ప్రదర్శించినప్రతిభ సమకాలిక భారతదేశంలోనే కాదు; సమకాలిక ప్రపంచంలోనే గణించ తగినట్టిది." యీ వాక్యాలకంటే ఎక్కువగా చెప్పడం అప్రస్తుతం.

బహుముఖ ప్రజ్ఞ కలిగి, ఆ ప్రజ్ఞనంతా జనసామాన్యానికి గాను వినియోగించిన ఆ మహాపురుషుడు తెలుగు దేశపు దురదృష్టాన 30 నవంబర్ 1915 సంవత్సరంలోనే అస్తమించారు. ఆయనకు మనం చాలా ఋణపడి ఉన్నాం. ఆ ఋణం తీర్చుకోవలసిన భారం ప్రతి తెలుగువానిమీదా ఉంది.

* * *

నాటిక :

చీకటిలో వెలుగు

శ్రీ ముద్దంశెట్టి హనుమంతరావు

(గత సంచిక తరువాయి)

కన : (ఉత్సాహంగా) అదీ... అలా అడగండిచెప్తాను. నా సలహా విన్నాక మీరే అంటారు భేషుగ్గా వుందని. మీ ఆయన ప్రస్తుతం మీలానే చేతులు ముడుచుక్కూర్చున్నాడనేనా మీ అభిప్రాయం ? మరొక అమ్మాయిని పెళ్లి చేసుకొని నిశ్చింతగా హాయిగా కాలం గడుపు కుంటుంటాడు. అటు వంటప్పుడు అతని కోసం మీరు యెదురుతెన్నులు చూడ్డం తెలివి తక్కువ తన మంటాను. మీరూ యెవర్నో పెళ్ళి చేసుకుని. హాయిగా వుండ కూడదా ?

వేద : (కోపంగా) చాలించండి కనకరాజుగారూ. హద్దులు మీరి మాట్లాడితే, అగౌరవం జరుగ వచ్చు.

కన : అదిగోండి...అప్పుడే మీకు కోపం వచ్చేసింది. మీరు దూరంగా యోచించడం లేదు. నా మాట అంత తేలిగ్గా కొట్టి పారేయకండి. మీలో యౌవనం, రూపం, లావణ్యం చదువు, సంస్కారం—యిన్ని వుండి కూడా యెడారి పువ్వులా నిరుపయోగంగా వుండటం, నిజంగా శోచనీయమైన విషయం. మీరు 'వూ' అన్నారంటే కోకొల్లలు; అంతెందుకు, నా భార్య పోయి అయిదేళ్ళు కావస్తోంది. అప్పట్నించీ ఆడవాళ్ళంటేనే అసహ్యించుకునే నేను, మిమ్మల్ని చూసి ముగ్ధుడనయ్యానంటే, నమ్మరు. మీరు 'వూ' అంటే, నేను అదృష్టవంతుణ్ణే. నా ఐశ్వర్య మంతా మీదే.

వేద : (వగరుస్తూ—కోపంతో) ఆపండిక కనకరాజుగారూ! ముందు బైటికి నడవండి. మీరేదో పెద్ద మనిషను కున్నాను. మీలో ఇంత కపటబుద్ధి పొంచి వుందని నేనెప్పుడూ వూహించలేదు.

(కనకరాజు చప్పున నిల్చుండి పోతాడు)

రామ : (కేకలువిని లోపల్నించి ఆత్రంగా వచ్చి)ఏమయ్యిందమ్మా? అలా కసురు తున్నారేమిటి ?

కన : (చప్పున కలిగించుకుని) ఏం లేదు రామయ్యా : ఆమె శ్రేయస్సే కోరి, మళ్ళీ పెళ్ళి చేసుకోమంటున్నాను. ఆ సలహా యిచ్చినందుకే, ఆమెకి కోపం వచ్చేసింది. ఏం చెయ్యను ? కాలం అట్లాంటిది.

వేద : (దుఃఖంతో) విధి వంచితయైన స్త్రీ ఒంటరిగా జీవించడం తప్పా? ప్రేమించిన వ్యక్తి, ఆమెను వంచించి దూరంగా పోతే, ఆమె యింక గౌరవంగా బ్రతకలేదా ? ఆ స్త్రీ పట్ల సానుభూతి చూపే వారే వుండరా ? ఏమిటీ అన్యాయం ? ఆయన ద్రోహం చేసి పోయారన్న దుఃఖంతో నేను కుమిలి పోతున్న తరుణంలో, మీరు అనవలసిన మాటలివేనా కనకరాజుగారూ ! తండ్రి వంటి వారు...... యిది మీకు న్యాయంగా వుందా ?

రామ : ఏమన్నారమ్మా ?

కన : (అందుకుని) ఏమీ లేదోయ్. మీ బాబు గారు యీమెను అన్యాయం చేసి పోయాడన్న విషయం అందరికీ తెలుసు. మళ్ళీ ఆయన తిరిగి వచ్చి చేరదీస్తాడన్న నమ్మకం కూడా లేదు. రేపోనాడో, ఆఫీసులో అతని వుద్యోగం కూడా వూడుతుంది. పరిస్థితులు యెంత విషమంగా తయారవుతాయో ఆలోచించు. ఈమెదా, వుద్యోగం చెయ్యవల్సిన వయస్సుకాదు, హాయిగా సంసారం చేస్తూ స్వర్గ సీమల్లో విహరించాల్సిన వయస్సు. ఇక, నా విషయమంటావా, డబ్బువుతే పుష్కలంగా వుందిగాని, సుఖం లేదు.

మా ఆవిడ చనిపోయి అయిదేళ్ళు కావస్తోంది. మళ్ళీ పెళ్ళి చేసుకోమని యెంతో మంది సలహా లిచ్చినా, వాటిని పెడచెవిని పెట్టాను. కాని, ఆ నిగ్రహం యీమెను చూశాక మంచులా కరిగి పోయింది. నా మనసు మారింది. అందుకే నన్ను వివాహం చేసుకోమని అర్థిస్తున్నాను. నాకేం వయస్సెక్కువని ? మహావుంటే, ముప్పయ్యెనిమిది...అదేం అధికం కాదు.

రామ : (కోపంతో కళ్ళు యెర్రపడగా) వయస్సెంతన్నారు ?

కన : పోనీ నలభై అనుకో :

రామ: (వెటకారంగా) అబ్బే: అన్నేళ్ళుండవండీ:

కన: (మందహాసంతో) అదే నేనూ చెప్తున్నాను. అసలు, వయసుమళ్ళిన వాడిలా అగుపించనే అగుపించను.

రామ: (పళ్ళు బిగబట్టి) మహా వుంటే పాతికేళ్ళు వుంటాయేమో:

కన: (కోపంగా రామయ్యవేపు చూస్తూ) రామయ్యా:

రామ: (ఉద్రేకంతో.) లేకపోతే యేంటి బాబూ: మీకేమన్నా మతి పోయిందా? డబ్బు వుందన్న గర్వంతో కన్నూ మిన్నూ గానక, యిలా ప్రవర్తించడమేనా: ఆయనగారు మోసం చేశారని అమ్మగార్ని అగాధంలోకి దిగమంటారా? మిమ్మల్ని పెళ్ళి చేసుకోమని అడగడానికి మీకు నోరెట్లా వచ్చిందండీ అమ్మగారిలాంటి కూతురు వుండి వుండాలే. అదైనా ఆలోచించలేదా.

కన: (రుద్రుడై) రామయ్యా: అంతస్థు తెలుసుకొని మాట్లాడు. నౌకరువి నౌకరులానే వుండటం శ్రేయస్కరం.

వేద: అక్కడితో ఆపండి కనకరాజుగారూ:

రామ: నౌకరుగా నేను వుంటున్నా, మీకు మాత్రం నేను నౌకర్ని కాదు. నేనూ కొద్దో గొప్పో చదువుకున్న వాణ్ణే: కాని దైవోపహతుడనై, యీ అధోగతికి యేనాడో వచ్చాను. అంతమాత్రాన మీరు నన్ను నీచంగా చూడనవసరం లేదు. నౌకరుకీ హృదయముంది ... వాడికినూ అనుభూతులుంటాయి. అది మాత్రం మీరు గుర్తుంచుకోవాలి.

కన: (వెటకారంగా) పిట్ట కొంచెమైనా కూత ఘనంగా వుందే?

రామ: (చీదరించుకుంటూ) అది కొంత నయమే లెండి. పిట్ట ఘనంగా వుండి, కూత మాత్రం హీనంగా వుంటే, ప్రయోజనం లేదు. సరిగా ఒక్కొక్కప్పుడు ప్రమాదం కూడాను.

కన: (కళ్ళెఱ్ఱజేసి) నోర్మూయ్ ... అట్టే వాగితే మంచిమాట కాదు.

వేద: (కలిగించుకుని) ఊరుకో రామయ్యా: వారు ఐశ్వర్యవంతులు ... అందుకే వారు బలసంపన్నులు కూడాను, వాళ్ళకి హృదయం అన్నది ఒకటి వుంటేగా, మనసు తెలుసుకొని మాట్లాడ్డానికి: ఈ సత్యం తెలిశాక, మనం తగ్గిపోవడం మంచిదేనేమో:

రామ; మీరుండండమ్మా: ఏమిటీ యీయన మహ పెద్దగా మాట్లాడుతున్నాడు ... యీ రామయ్యంటే యేమనుకుంటున్నారో: (ఒకడుగు ముందుకు వేసి) ఏంచేస్తారు బాబూ?

కన: (కాస్త గాభరాపడి) నా యింట్లో వుండి నామీదే కళ్ళెఱ్ఱజేస్తున్నావా; నిన్ను యేంజేస్తానో చూడు.

వేద: ఎందుకండీ కనకరాజుగారూ. అలా నోరు పారేసుకుంటారు?

కన: (కాస్త తగ్గి చూడండి మరి? అంతస్థు చూసుకొని మాట్లాడొద్దూ? మీరు మధ్యన కలిగించుకుంటున్నారు గాబట్టి, వూరుకోవల్సి వస్తుంది.

రామ: (వెటకారంగా) పాపం: లేకపోతే యేంజేసేవారో?

వేద: (విసుగ్గా) అబ్బబ్బ: నువ్వూరుకో రామయ్యా: కనకరాజుగారూ మీరింక దయచెయ్యండి.

కన: (కలవరపడి) వెళ్తానుగాని, మరి నా మాట...

వేద: అది యెన్నటికీ జరుగదండీ: ఇటువంటి కోరిక కోరడానికి మీరు సిగ్గుపడాల్సింది. వెళ్ళండిక ... స్త్రీలను గౌరవించడం నేర్చుకోండి.

కన: (దెబ్బతిన్నవాడై) అంతేనా?

వేద: బెదరిస్తున్నారా:

కన: (విషపు నవ్వు నవ్వి) బెదరింపే కాదు ... మీ బ్రతుకు నాశనం చేస్తాను.

వేద: (బాధగా నవ్వి) తలవరకు మునిగిన మనిషికి చలేమిటి కనకరాజుగారూ: నా బ్రతుకు యిప్పటికే నాశనమయింది. ఇంక మీరు నాశనం చేసేదేమిటి? ఆ భయమేం నాకు లేదు లెండి.

కన: సరే చూస్తాను. (నిష్క్రమించబోతాడు)

రామ: సరే చూడండి ... మేమూ చూస్తాం.

కన: (ఆగి) రేపట్లోగా నా యిల్లు ఖాళీ చెయ్యండి,

రామ: చెయ్యకపోతే?

కన: ఫలితం అనుభవిస్తారు.

వేద: (నిట్టూర్చి) ఇంతేగా మీరు చెయ్యగలిగింది? మీవంటి హృదయంలేని కిరాతకుని యింట్లో ఉద్దెకుండటం కంటె చెట్టు నీడను నివసించడం నయం. మీరు చెప్పినట్టే జరుగుతుంది... వెళ్ళండిక.

[కనకరాజు చురచుర చూస్తూ, చరచరా బైయటికిపోతాడు]

రామ: (కనకరాజు పోయినవేపే పళ్ళుపటపట కొరుకుతూచూస్తూ) మనిషి కాడు ... రాక్షసుడు.

వేద: (నిస్పృహతో కుర్చీలో కూలబడి కంటనీరు పెట్టుకుంటూ) నా బ్రతుకు యే స్థితికి వచ్చిందో చూడు రామయ్యా: హాయిగా సంసారం చేసుకుంటూ, నా భర్త, నా పిల్లలు, అన్న మమకారాన్ని పెంపొందించుకుని, స్వర్గ సౌఖ్యాలు చవి చూడవలసిన ఈ వయసులో నాకు ఈ కన్నీరే రాసిపెట్టి వుంది గామోను: ఎన్నాళ్ళింకా యీ మోడు బ్రతుకీడ్వడం? (కళ్ళు ఒత్తుకుంటుంది).

రామ: (కళ్ళు ఒత్తుకుని) ఊరుకోండమ్మా: ధైర్యం కూడగట్టుకోండి. ఏంచేస్తాం? కష్టాలు వచ్చినపుడే, సడలిపోకండా, ధైర్యంగా నిలబడి పరిస్థితుల్ని యెదుర్కోవాలి. ఎప్పటికైనా మంచిరోజులు రాకపోవు.

వేద: (నిట్టూర్చి) ఏవింటో రామయ్యా: ఎదురు చూస్తున్నకొద్దీ, మంచిరోజులు మరింత దూరమౌతున్నాయి. ఆశలు పెంచుకుంటున్నకొద్దీ, అవి గాలిమేడలే అవుతున్నాయి. కష్టాలకు అంతులేదు. భవిష్యత్తు భయంకరంగా కన్పిస్తుంది. చూడిప్పుడు — నలుగుర్లో పెద్దమనిషిగా చెలామణీ అవుతున్న యీ కనకరాజుకి నన్ను పెళ్ళిచేసుకోవాలన్న బుద్ధి పుట్టింది. ఇదంతా నా దురదృష్టం కాకపోతే ఇంకేమిటి చెప్పు: రేపు ఇల్లు ఖాళీ చెయ్యాలి ... కాని యెక్కడికి వెళ్తాం? (క్షణం ఆగి — దుఃఖాన్ని దిగమ్రింగుతూ) నిన్ను నమ్ముకున్నందుకు నా బ్రతుకు యెన్ని ఒడుదుడుకుల పాలయ్యిందో చూశావా మూర్తీ ... (మొహాన్ని చేతుల్తో కప్పుకుని కుమిలిపోతుంది.)

[అదేక్షణంలో బైటిద్వారం దగ్గర మూర్తి నుంచుంటాడు. అతని మొహం వివర్ణమై వుంటుంది]

మూర్తి: (బాధగా) అందుకు నేను చాలా చింతిస్తున్నాను వేదవతీ.

[హఠాత్తుగా మూర్తిని చూడ్డంతో వేదవతి, రామయ్యల మొహాలు వికసిస్తాయి]

వేద. (ఆనందంతో లేచి నుంచుని) మూర్తీ: వచ్చేశావా?

(మూర్తి, మొహందించుకుని మెల్లగా లోపలికి నడుస్తాడు)

రామ: (మందహాసంతో) నేను అన్నాను కదమ్మా. తప్పకండా వస్తారని.

వేద: (బాధగా) నన్నిలా ద్రోహంచేసి వెళ్ళిపోవడం నీకు న్యాయమేనా మూర్తీ? నిన్ను నమ్ముకుని, నా సర్వస్వం నీకు ధారపోశానే: నావాళ్ళను కాదని సంఘాన్ని ఎదిరించి నువ్వే నా సమస్తమనీ, నీతో వచ్చేశానే: యిటువంటిది, నువ్విలా చెయ్యడం బావుందా? నీ జాడ తెలుసుకోలేక, నేనెంత కుమిలిపోయానో, నీకేం తెలుసు?

మూర్తి: (మొహం దించుకుని — ఆవేదనతో) నీకు చాలా అన్యాయం చేశాను వేదవతీ, నువ్వేకాదు ... నన్ను భగవంతుడు కూడా క్షమించడు.

వేద: పోనీలే మూర్తీ: జరిగిందానికి బాధపడకు. ఇప్పుడు వచ్చేశావుగా ... అదే పదివేలు. నా హృదయం, ఆనందంతో పొంగిసలాడుతోంది. (రామయ్యవేపు చూసి) రామయ్యా: బాబుగారికోసం కాఫీ చేసి పట్రా.

రామ: అలాగేనమ్మా: (లోపలికి వెళ్తాడు)

వేద: అదేవిటి మూర్తీ — కొత్త మనిషిలా అలా నుంచుండిపోయావేం? కూచో: (మూర్తి కుర్చీలో కూలబడతాడు) నిజంగా నేను యెంతో భయపడ్డాను — నువ్వు వస్తావో రావోనని; ప్రతి క్షణం భవిష్యత్తు ఓ పెద్ద భూతంలా కనిపించేది. రాత్రింబవళ్ళు యిదే ఆలోచన ... నీ రూపమే నా కళ్ళల్లో మెదిలేది. (క్షణం ఆగి) నువ్వు వెళ్ళిపోయాక వుద్యోగంలో చేరాల్సి వచ్చింది ... ఈ విషయంలో హెడ్ మిస్ట్రెస్ చాలా సహాయం చేసిందనుకో: మా వాళ్ళింటికి వెళ్ళనని నీకూ తెలుసుగా: విధి విలయ తాండవానికి ఆహూతి అయితే అయ్యాననుకుని, ధైర్యంగా నిలబడ్డాను. నువ్వు యెప్పుడో తప్పకండా తిరిగి వస్తావన్న ఆశ మిణుకుమిణుకుమంటూ వుంటే, యిలా నిర్జీవంగా కాలాన్ని గడుపుతున్నాను.

మూర్తి: (మాట్లాడడు. అతనిలో సంక్షోభం చెలరేగింది. అయినా జవాబు చెప్పే స్థితిలో వుండడు)

వేద: (ఆత్రంగా) మౌనంగా వున్నావేం మూర్తీ? (బల్ల తెచ్చుకుని అతనికి దగ్గరగా కూచుని) ఏవిటి విశేషం? ఒంట్లో బాగుండలేదా? నాతో చెప్పవూ? నువ్వు వచ్చావన్న ఆనందంతో నేను వుక్కిరిబిక్కిరి అవుతున్న తరుణంలో, నువ్విలా మౌనంగా, ముభావంగా కూచోవడం నాకేమీ నచ్చలేదు. విషయమేవిటో నాతో చెప్పవూ ... (గోముగా అతని కళ్ళలోకి చూస్తుంది.)

మూర్తి: (మెల్లగా తలెత్తి) ఏవిటి చెప్పమంటావు వేదవతీ? (రుద్ధ కంఠంతో) ఎలా చెప్పడం ... ఎలా చెప్పడం ... (మొహం ప్రక్కకు తిప్పుకుంటాడు)

వేద: (పాలిపోయిన మొహంతో) ఏమిటంత చెప్పలేని విషయం మూర్తీ?

మూర్తి: (వేదనగా) నీకు నేను చేసిన అన్యాయానికి క్షంతవ్యుణ్ణి కాదు వేదవతీ :

వేద : నీ ధోరణి నాకేమీ అర్థం కావడం లేదు మూర్తీ ! నువ్వు వచ్చేశావుగా ! ఇంక నువ్వు చేసిన అన్యాయం యేముంది, గతాన్ని మర్చిపో.

మూర్తి: నీకు తెలీదు వేదవతీ : జరిగిన విషయం నీకు తెలీదు. (క్షణం ఆగి బాధగా) ఎలా చెప్పడమో, తోచడం లేదు.

వేద : (గాభరాగా) ఏమిటి నువ్వు చెప్పదల్చుకున్నది ? చెప్పు త్వరగా...నాకేమిటో భయంగా వుంది.

మూర్తి: (క్షణం ఆగి-నిట్టూర్చి) ఆ రోజు నేను నీకు చెప్పకుండా వెళ్లి పోయానంటే, అది నా తప్పు కాదు వేదవతీ : ఆఫీసు నుండి బైటికి వచ్చేసరికి మా నాన్నగారు, మరో ఇద్దరు బంధువులూ ప్రత్యక్ష మయ్యారు. అంతే. నన్ను మరో మాట అడనివ్వకుండా బలవంతంగా కారులో యెక్కించి తీసుకుపోయారు. ఎంత ప్రయత్నించినా, వారి యినుప హస్తాల నుంచి బైట పడ లేక పోయాను. నయాన్న, భయాన్న పెళ్ళికి నా చేత ఒప్పించాలని చూశారు. కాని, నేను ఒప్పుకోలేదు.

వేద : (చప్పున అందుకుని-ఆనందంతో నిట్టూర్చి) హమ్మయ్య ! నా హృదయ స్పందన తగ్గింది. నీ మీద నాకు పూర్తి విశ్వాసముంది మూర్తీ !

మూర్తి: నేను మాత్రం విశ్వాస ఘాతకుణ్ణి వేదవతీ : నీ యెదుట నిల్చోడానికి కూడా నాకు అర్హత లేదు...(మొహం దించు కుంటాడు)

వేద : (అర్థంగాక) ఏమిటిదంతా మూర్తీ ? అంతా అయోమయంగా వుంది....

మూర్తి: నేను కూడా అటు వంటి స్థితిలోనే వున్నాను వేదవతీ ! మనిద్దరం యేదో ఒక విధంగా వివాహం చేసుకోక పోవడం యింత అనర్థానికి దారితీస్తుందని యేనాడూ అనుకోలేదు.

వేద : చెప్పేదేదో సూటిగా చెప్పు మూర్తి ! సస్పెన్సులో పెట్టి నన్ను చిత్రవధ చెయ్యొద్దు !

మూర్తి: చెప్పలేని స్థితిలో వుండే యీ డొంక తిరుగుడు మార్గాన్ని అవలంబిస్తున్నాను. ఏం చెయ్యను? చెప్పక తప్పదు. మా వాళ్ళు పెద్దింటి అమ్మాయిని తెచ్చి, నాకిచ్చి పెళ్ళి చేశారు.

వేద : (ప్రక్కనే పిడుగు పడ్డట్టుగా లేచి నుంచుని) పెళ్ళా ?

మూర్తి: (మొహం దించుకుని లేస్తూ) ఔను వేదవతీ ! పెళ్ళి చేశారు. అదీ బలవంతపు పెళ్ళి, నాలుగు గోడల మధ్య నన్ను కట్టు దిట్టాలతో వుంచారు. ఒక వేళ, నేను బైట పడ్డానికి ప్రయత్నిస్తే, పరిణామంగా మా అమ్మ ఆత్మ హత్య చేసు కోవడం తథ్యమని బెదిరించారు. ఏం చెయ్యను ? కనీసం నీకు వుత్తరం రాద్దామనుకొన్నా, వీల్లేక పోయింది. అశక్తుడనైపోయాను. (రుద్ధకంఠంతో) నేను నీకు క్షమించరాని ద్రోహం చేశాను వేదవతీ !... క్షమించరాని ద్రోహం చేశాను.

వేద : (బావురు మంటూ) ఎంత పని చేశావు మూర్తీ ? ఇప్పుడు నా జీవితానికి గమ్యమేది ? అయిన వారిని దూరం చేసుకున్నాను. సంఘాన్ని యెదిరించాను. ఇప్పుడు వారికి నా ముహం యెట్లా చూపించడం ? ఇంక, అందరి దృష్టిలో నేను కులటగా బ్రతకవల్సిందేనా ? అవకాశం కోసం కోరలు చాస్తూ, యెదురు చూస్తున్న వ్యక్తులు, కసిగా, క్రూరంగా, హేయంగా, హేళన చేస్తే, సహించవల్సిందేనా ? గౌరవనీయ కుటుంబంలో పుట్టి, గౌరవంగా బ్రతకవల్సిన నాకు, యీ అధోగతా ? ఇప్పుడు నాకు కర్తవ్యం యేమిటి ? ఆత్మహత్య తప్ప ఇంకేమిటి నాకు శరణ్యం ? ...(కుమిలి పోతుంది)

మూర్తి: (గతుక్కుమని) అంత మాట అనకు వేదవతీ :

వేద : (బాధగా) ఇంకో మార్గమేముంది మూర్తి ? నీ సుఖం, నీ ఆనందం, నువ్వు చూసు కున్నావు. మీ వాళ్ళు వారి ఆనందాన్ని దృష్టిలో పెట్టుకొని, నీకు పెళ్ళి చేసి వారి పంతం నెగ్గించుకున్నారు. రెండింటికీ చెడ్డ దాన్ని నేనే. మరి, నాకు గత్యంతరమేముంది చెప్పు ? ఏం చూసుకుని నన్ను జీవించమంటావు ? (కుమిలిపోతూ) భగవాన్ ! నా కెందుకీ జీవితాన్ని ప్రసాదించావు ? నీలో కలుపుకుంటే యీ ఆ వేదన వుండేది కాదు కదా ! (వెక్కి వెక్కి యేడుస్తుంది)

(మిగతా వచ్చే సంచికలో)

గురజాడ-చరిత్ర పరిశోధన

శ్రీ మల్లంపల్లి సోమశేఖరశర్మ

శ్రీ గురజాడ అప్పారావుగారు శిల్ప, చిత్రకళలలో, సంగీత, సాహిత్య, నాట్యములలో అభిమానముతో అభిరుచి అభివివేకము కలవారు. ఈ రంగములయందాయన ఆసక్తి అపారము. ఆయన యే కృతినయినా కళాదృష్టితోనే పఠించేవారు. రచనా సంవిధానము, కథావస్తువు, శబ్దప్రయోగము, శైలి-ముఖ్యంగా ఆయన పరిశీలనలో వుండేవి. ఈ విధానాన్ని తెలుగు సాహితీ సీమకు పరిమితం చెయ్యలేదు. ఆంగ్ల, సంస్కృతములను కూడా అదేతీరులో పఠించేవారు.

సాహిత్యం మీదనే ఆయనకు ప్రత్యేకాసక్తి వున్నప్పటికి ఆయన తన దృష్టిని దానికే పరిమితం చెయ్యలేదు. ప్రప్రథమములో ఆయన విజయనగరం మహారాజావారి కళాశాలలో అధ్యాపకుడుగా పనిచేస్తూ గ్రీకు, రోమ్ దేశాల చరిత్ర పాఠం చెప్పేవారు. చరిత్ర రచన కూడా ఒక కళాదృష్టియేననే భావం ఆయనకుండేది. చరిత్రలో ఆయన కూడా అమితాభిమానం ప్రకటించేవారు. ఏదేశచరిత్ర అయినా సరే అది ఇంగ్లాండు చరిత్ర కావొచ్చు, లేదా గ్రీసు, రోము, ఇండియాల చరిత్ర కావొచ్చు. కళా, సాహిత్యాలను అధ్యయనం చేసినట్లే ఇంగ్లీషులోని నానాదేశాల చరిత్రలను ఆయన నిశితంగా పఠించేవారు. ఆ గ్రంథములలో ఆ రచయితల శిల్పవైదగ్ధ్యానికి ఆయన ముచ్చట పడేవారు.

మద్రాసు, మైసూరు, బెంగుళూరుల వంటి ప్రముఖ నగరాలకు ఆనందగజపతి మహారాజుతో వెళ్లినప్పుడు అక్కడి విశ్వవిద్యాలయాలలోని చరిత్రశాఖ ప్రధానాధ్యాపకులతో ఆయన గోష్ఠి సలిపేవారు. చరిత్ర బోధన విషయాన్ని గురించి ఆ చర్చ సాగేది. అప్పట్లో మద్రాసు క్రిస్టియన్ కాలేజి ప్రిన్సిపాలుగా డాక్టర్ ముల్లర్ ఉండేవారు. ఆయనతో జరిగిన గోష్ఠి గణనీయమైనది. ఆ సందర్భంలోనే శ్రీ అప్పారావుని గ్రీసు, రోము దేశాల చరిత్ర తులనాత్మక దృష్టితో రచించమని డాక్టర్ ముల్లర్ సలహా యిచ్చారు. అంటే శ్రీ అప్పారావు శక్తిని నాడే డాక్టర్ ముల్లర్ గ్రహించాడనక తప్పదు. ఆయన డైరీలలో అనాటి చరిత్రాధ్యాపకుల వివరాలు లభిస్తాయి.

1897 ప్రాంతంలో విజయనగరం సంస్థానంలో ప్రాచీన లిపి పాఠకుడుగా శ్రీ అప్పారావు నియోగితులయారు. అది మొదలుగా ఆయన ప్రాచీన తామ్రశాసనాలను పరిశోధిస్తూ, ఆయా రాజవంశాలను గురించి గ్రహించడానికి ప్రయత్నించారు. ఇందుకోసమే ఆయన, బర్నెల్ రచించిన 'సౌత్ ఇండియన్ పాలియోగ్రఫీ' చదివారు. జార్జిబ్యూలర్ జర్మనీ భాషలో వ్రాసిన 'ఇండియన్ పాలియోగ్రఫీ' తాలూకు ఆంగ్లానువాదాన్ని డాక్టర్ జె. యఫ్. ఫ్లీట్ వ్రాసిన దాన్ని కూడా అధ్యయనం చేశారు.

ఈ కాలంలోనే ఆయనకు సాహిత్యాసక్తితో సమంగా ఆంధ్రేతిహాసంమీద కూడా శ్రద్ధ యినుమడించింది. అత్యంతాప్తుడూ, అతిసన్నిహితుఆయన ఆనందగజపతి వంశ చరిత్రను వ్రాయాలనేకోరికకదిఅంకురార్పణచేసింది. ఈలక్ష్యసాధనకుసాధనసంపత్తి సమకూర్చుకొనే దృష్టితో ఆయన 'ఇండియన్ యాంటిక్వేరీ', 'ది మెడ్రాస్ జర్నల్ ఆఫ్ లిటరేచర్ అండ్ సైన్సు' పత్రికలను చదవడం ప్రారంభించారు. దక్షిణమండల పురావస్తుశాఖ శాసన విభాగానికి చెందిన అధికారుల వార్షిక నివేదికలూ, ఏషియాటిక్ రిసెర్చెస్ 'గవర్నమెంటు క్వార్టర్లీ జర్నల్ ఆఫ్ ఎపిగ్రాఫియా యిండియా'లను కూడా చదివేవారు. వీటిలో ప్రాక్ప్రతీచీ దేశ విద్వాంసుల ప్రాచీన శాసనాలపై సాగించే పరిశోధనలు వెలువడేవి. సంస్థాన వ్యవహారాలమీద కాని, ఆనందగజపతితో కలిసి కాని మద్రాసు వెళ్లినప్పుడు ఆయన తప్పనిసరిగా ప్రభుత్వ ప్రాచ్య గ్రంథాలయంలో యీ పనికోసం అధికకాలం గడిపేవారు. దక్షిణ భారతానికి చెందిన అనేక విషయాలపై పరిశోధనలకు ప్రభుత్వం

వారి 'ఓరియంటల్ మానుస్క్రిప్టు లైబ్రరీ' ఆదినుంచీ యెంత గానో ఉపయోగపడేది. భాషా, సాహితీ, యితిహాస పరిశోధనలకు అది కల్పవృక్షమే. ప్రాచీనాంధ్ర సాహిత్య గ్రంధాలెన్నో దానిలో వున్నాయి. ప్రాచీన రాజవంశ చరిత్రలూ, మెకంజీ వ్రాత ప్రతులు కైఫీయతులూ, గ్రామాలలో లభించే శాసనాల వ్రాత ప్రతులు అక్కడ లభిస్తాయి. ఈ భాండాగారంలోని నకళ్లలో వొక విచిత్ర మైన వ్రాతపద్ధతి ఉన్నట్లు ఆయన కనుగొన్నారు. జీర్ణమవుతున్న తామ్రశాసనాల నకళ్లు కూడా వీటిలో వున్నాయి. చాలాభాగం నకళ్లు ద్రాక్షారామ, సింహాచలం, బాపట్లలలో ఆలయ కుడ్యాల మీదివే వున్నాయి. కొన్ని మాత్రం కొందరు వ్యక్తులవద్ద లభించి నవి. వీటి నన్నిటినీ సేకరించినవాడు ఇలియట్ దొర కావడంవల్ల ఆయన పేరనే యివి నేటికీ వ్యవహృత మవుతున్నాయి. పురావస్తు శాఖ అప్పటి కింకా యీ శాసనాలను ప్రచురించని కారణాన యీ భాండాగారం పరిశోధకులకు కామధేనువుగా వుండేది. శ్రీ అప్పారావు 'యిలియట్ తెలుగు శాసనాలు' చాలా శ్రద్ధాసక్తులతో పఠించి వాటినుండి ముఖ్యాంశాలను ఎత్తి వ్రాసుకొనేవారు.

ఈ కాలంలోనే ఆయనకు తెలుగు దేశపు చరిత్రమీద అభి లాష పెరిగింది. ధరణికోట నాయకుల చరిత్ర, నాదెండ్లకొండ వడమటి నాయకుల వివరాలు, మరికొందరు జమీందారి కుటుంబాల చరిత్రలు ఆయన సేకరించారు. బెంగుళూరు వెళ్లినప్పుడల్లా అక్కడి ప్రభుత్వ పురావస్తుశాఖ కార్యాలయాన్ని దర్శించేవారు. అప్పట్లో డాక్టర్ హుల్జక్ (Dr. Hultszch) దాని సూపరిం టెండెంటుగా వుండేవారు. వి. వెంకయ్య, హెచ్. కృష్ణశాస్త్రి ఆయనకు సహకరించేవారు. వారినుండి శిలా శాసనాలను, తామ్ర శాసనాలను ఎత్తి వ్రాసుకునే విధానాన్ని అప్పారావుగారు నేర్చుకు న్నారు. ఆరోజుల్లో ప్రభుత్వ శాసన పరిశోధకుల వ్రాతకు నాసిక్ పేపరు అనబడే కాగితాన్ని వాడేవారు. అప్పారావుగారు కూడా బ్రష్లు, ఇతర చిన్నసాధనాలు యీ శాసనాలను ఎత్తుకునేందుకు ఉపయోగపడే సామగ్రిని వారినుండి గ్రహించారు. ఆ శాఖ సహా యంతోనే వాటిని కొనకలిగారు. అయితే వెంకయ్యగారు ఇందుకు సహకరించేవారు కాదు. దొర అక్కడలేని సమయంలో వెంకయ్యగారే అధికారిగా ఉండేవారు. అప్పారావుగారు ఆ సంద ర్భములో కొన్ని శాసనాలను కోరగా వెంకయ్య పంపడానికి నిరా కరించారు. ఇటువంటి సంఘటనలు కొన్ని వారుభయుల మధ్య విరోధానికి దారితీసినట్లు అప్పారావుగారి డైరీలో కనిపిస్తుంది.

రాను రాను అప్పారావుగారి దృష్టి కళింగదేశ చరిత్రకే పరి మితం చేసుకొన్నారు. ఇందుకోసం ఆయన చాలా సేకరించారు. 'శ్రీ జయమంగళ' పేరుతో బుర్రా శేషగిరిరావు ప్రచురించిన కర పత్రంలో యీవిషయం బాగా తేటతెల్లమవుతుంది. ఆంధ్రదేశానికి చెందిన క్షత్రియుల గురించి అప్పారావుగారు చాలా సేకరించినట్లు ఆయన కరపత్రంలో ఉన్నది. 'క్షత్రియ పురుష బిరుదమాలికలు' అనే శీర్షిక క్రింద కళింగ చరిత్ర వ్రాయడానికి అప్పారావు సేక రించిన విషయాలలోని కొన్ని అంశాలను యీకరపత్రంలో శేషగిరిరావు ప్రచురించారు. విజ్ఞాన చంద్రిక మండలివారు ప్రచు రించదలచిన గ్రంధాలలో అప్పారావు కళింగ చరిత్ర నొకటిగా అడ్వర్టయిజు చేసి ప్రచారం చేశారు. దురదృష్టవశాత్తు ఆ పని జరగనేలేదు. బహుశా ఎస్టేటు వ్యవహారాలవల్ల కళింగ చరిత్ర వ్రాయడానికి ఆయనకు తీరిక చిక్కివుండకపోవచ్చు.

ఎస్టేటు శాసన పరిశోధకుడుగా, అప్పారావు విజయనగరం ఎస్టేటులోని చెక్కడాలపై ముద్రలను సేకరించడానికి ఎస్టేటు అంతటా పర్యటించారు. వైదిక పండితులకు అగ్రహారాలు, భూములు దాన మిచ్చిన పురాతన రాగిపళ్లెములను సేకరించడం ఆయన కొక సరదా అయింది. ఆయన దాదాపు ఏడు రాగిపళ్లెము లను సేకరించారు. అందులో ఒకటి విష్ణుకుండిను వంశానికి చెందిన ఇంద్రవర్మకు సంబంధించినది. మరొకటి మూర్పు గంగవంశీకుడైన 3వ వజ్రహస్తునికి—967 శకం—చెందినది. మిగిలి నవి తూర్పు చాళుక్యవంశీకులయిన రాజులైన కొక్కిలి మహారాజ మంగి రెండవ యువరాజు, కొక్కిలి విక్రమాదిత్య భట్టారకుడు, మొదటి చాళుక్యభీముడు మున్నగు వారికి చెందినవి. వీటి నన్నిటిని పురావస్తు శాస్త్ర అసిస్టెంటు సూపరింటెండెంటుకు పంపించారు. ఇంకా మిగిలిన వేమైనా ఉన్నవేమో తెలియదు. వాటిపై 1908–1909 లో వెలువడిన శాసన పరిశోధనల వార్షిక నివేదికలో శ్రీ హెచ్. కృష్ణశాస్త్రి గమనించారు. ఇవి ఓరియంటల్ జర్న ల్సులో కాని, లేక ఎపిగ్రాఫియా ఇండికా త్రైమాస పత్రికలలో కాని ప్రచురించబడలేదు. మంగి రెండవ యువరాజు, చాళుక్య భీమ–1–రాగిపళ్లెల రికార్డులను అప్పారావుగారికి సప్లయి చేశారు. ఎపిగ్రాఫియా ఇండికాలో బహుశా ఆయన సవరణచేసి ప్రచురించ దలచి వుండవచ్చు.

రెండవ మంగి యువరాజు కొక్కిలి మహారాజా వంశీకుడు. మొదటి మంగి యువరాజ కుమారుడు. ఆయన మారుతమ్ముడైన 3వ విష్ణువర్ధనుడు రాజ్యం నుంచి వెళ్లగొట్టగా, 2వ మంగి యువ రాజు కళింగ దేశంలోని యలమంచిలిలో చిన్న రాజ్యాన్ని ఏర్పాటు

చేసి కొన్నాడు. ఆయన వంశీకులు కొంత కాలం అక్కడ రాజ్యం చేశారు. మొదటి చాళుక్య భీమ బహూకరించిన రాగి పళ్లాన్ని, బహుశా అప్పారావే తుడిచివేశారు. తెలుగులో వ్రాత ప్రతి ప్రతిపంక్తి స్పష్టంగా గోచరిస్తున్నది. ఇదే నిజమైతే తూర్పు చాళుక్య శాసనాల్లో అప్పారావు కెంతటి పరిజ్ఞానమున్నదో స్పష్టమౌతున్నది. తెలుగు – కన్నడ లిపి కిది సంధి దశ అని జి. బుహ్లార్ అభిప్రాయ పడ్డాడు. ఈ చెక్కడం పై వ్రాతను ఆయన ఎందుకని ఎపిగ్రాఫియా ఇండికాలో కాని లేక మరో పత్రికలో కాని సవరించి ప్రచురించలేదో బోధపడడం లేదు. బహుశా ఇతఃపూర్వం చెప్పినట్లు ఎస్టేటు వ్యవహారాల్లో నిమగ్నమై పోవడం వల్ల యిది సంభవించి వుండక పోవచ్చు.

ఆంధ్ర దేశంలో లభించిన ఒరిజినల్ రికార్డుల నుంచి ఆయన తెలుగు చరిత్రను పఠించారు. అప్పటికే శ్రీ సి. వీరభద్రరావు ఆంధ్ర చరిత్ర మొదటి భాగం కూడా ప్రచురించబడింది. అప్పారావు రికార్డులను, యీ చరిత్రను క్షుణ్ణంగా చదివారు. ఆయనకు ఎంత పరిజ్ఞానం వున్నదీ 20వ శతాబ్దపు ప్రారంభదశలో వచ్చిన సాహిత్య చరిత్ర సందర్భంలో ' ఆంధ్రకవితా–పిత ' అనే శీర్షిక క్రింద ఆయన ప్రచురించిన వ్యాసం వల్ల మనకు, విదితమవుతున్నది.

1892 ప్రాంతం నాటికి ప్రభుత్వ శాసన పరిశోధకులు సేకరించిన శాసనాల్లో బెజవాడ యుద్ధమల్ల స్తంభం చెక్కడం ప్రసిద్ధి చెందినది. 1892–93 లో ప్రచురించిన ఎపిగ్రాఫికల్ రిపోర్టులోను, 1909–10లో దక్షిణ సర్కిల్ పురావస్తుశాఖ అసిస్టెంటు సూపరింటెండెంటు ప్రచురించిన రిపోర్టులోను యీ విషయం స్పష్టంగా వున్నది. తేడాలు లేకుండా, యుద్ధమల్లఅను పేరుతో ఇద్దరు రాజులున్నట్లు ఆ రిపోర్టులో వున్నది. అయిదు ' అక్కరలలో ' ఒకటైన 'మధ్యాక్కరమున్రై' రచించిన తెలుగు గేయంలో కూడా ఈ ప్రస్తావన వున్నది. అంతవరకూ, ఆంధ్ర కవిత్వానికి ఆంధ్ర కవితాపితామహుడని పేరుగాంచిన నన్నయభట్టారకుడు మూల పురుషుడని పండితులు భావించారు. 11 వ శతాబ్దానికి పూర్వం అనగా నన్నయభట్టారకునికి పూర్వం తెలుగు చరిత్ర లేదనే అంశాన్ని యీ అభిప్రాయాన్ని రుజువు చేయడానికి ఉదహరించారు. కాని బెజవాడ యుద్ధమల్ల చెక్కడం లభించడం, దానిని ప్రథమంగా జె. రామయ్య పంతులు సంపాదకత్వాన వెలువడిన ' ఆంధ్ర సాహిత్య పరిషత్ పత్రిక ' లో ప్రచురించడం జరిగే సరికి తెలుగు సాహిత్య రంగంలో సంచలనం కలిగింది. దానివల్ల నన్నయభట్టుకు పూర్వమే అనగా 11వ శతాబ్దికి పూర్వమే తెలుగు సాహిత్యం ఉన్నట్లు తేలింది. 20 వ శతాబ్దం రెండవ దశలో తెలుగు పత్రికల్లో చాలా కాలం ఆంధ్ర దేశంలోని ప్రథమ కవి ఎవరు, తెలుగు పద్య సాహిత్యం ఎప్పటినుంచి ప్రారంభమైంది అనే అంశాలపై తీవ్ర వాదోపవాదాలు చెలరేగాయి. నన్నయ మొదటి కవి అనీ, తెలుగు కవిత్వానికి ఆయన ఆదిపురుషుడనీ, ఆయనకు పూర్వం తెలుగు కవిత్వం లేదనీ కొందరన్నారు. మరి కొందరు నన్నయకు పూర్వమే తెలుగు కవిత్వం వున్నదనీ, ఆయన మొదటి కవి కావటం అసంభవమని భావించారు.

వీరు పైనుదహరించిన శిలాశాసనాన్ని బట్టి 11వ శతాబ్దానికి పూర్వమే తెలుగు కవిత్వం ఉన్నదన్నారు. తెలుగు సాహిత్యం పై పరిశోధన ప్రారంభం కావడం యిదే మొదలు. ఈ చర్చలో శ్రీ వి. ప్రభాకరశాస్త్రి, శ్రీ సి. వీరభద్రరావు, శ్రీ జె. రామయ్య పంతులు, శ్రీ కాశీభట్ల బ్రహ్మయ్యశాస్త్రి మున్నగు ప్రముఖులు పాల్గొన్నారు. నన్నయ ఆది తెలుగు కవి అనే వాదానికి కాశీభట్ల బ్రహ్మయ్యశాస్త్రి నాయకత్వం వహించారు. శాస్త్రిగారి వాదనలను జె. రామయ్య, కె. వి. లక్ష్మణరావు, సి. వీరభద్రరావు తదితరులు నిశితంగా విమర్శించి ఖండించారు. యుద్ధమల్ల బెజవాడ శిలాశాసనం లభించిన పిమ్మట కూడా బ్రహ్మయ్యశాస్త్రి తన అభిప్రాయాన్ని మార్చుకోలేదు. నన్నయకు ముందే తెలుగు కవిత్వం ఉన్నదని అంగీకరించకుండా ఆ శాసనం నన్నయ తరువాతనే వెలువడిందని వాదించ నారంభించారు. రాజరాజ నరేంద్రుడు–1022–1061–కన్నాకూడా రెండవ యుద్ధమల్ల వెనుక రాజ్యమేలినట్లు ఆయన వాదించారు. అప్పారావుగారు కూడా యీ వాద ప్రతివాదనలలో పాల్గొన్నారు. ఆ సందర్భంలోనే ' ఆంధ్ర కవితా పిత ' అనే వ్యాసం వ్రాశారు. ఉభయ పక్షాల వాదనలను విన్న పిమ్మట అప్పారావు తీర్పు చెప్పినట్లుగా ఉన్నదా వ్యాసం. ' వ్యాస చంద్రిక ' లో అప్పారావుగారు యీ వ్యాసాన్ని ప్రచురించారు. దానిని బట్టి తెలుగు దేశ చరిత్ర ఆయన ఆమూలాగ్రం క్షుణ్ణంగా పరిశీలించినట్లు తెలుస్తుంది. ముఖ్యంగా తూర్పు చాళుక్యులను గురించి ఆయనకు సమగ్రంగా తెలుసునని తెలుస్తున్నది. నేటికీ ఆయన వ్రాసింది యథార్థంగానే కనిపిస్తున్నది. సాహిత్యం రూపేణ, శిలాశాసనాల రూపేణ కూడ తగిన ఆధారాలను సాక్ష్యాన్ని సేకరించి, సమస్యను శాస్త్రీయ దృష్టితో పరిశీలించి కాని ఆయన ఒక నిర్ణయానికి వచ్చేవారు కారని దీనివల్ల రుజువవుతున్నది.

(శ్రీ సోమశేఖరశర్మగారి ఆంగ్ల వ్యాసానికి తెలుగు)

ప్రగతి పథంలో

(జిల్లాలనుంచి అందిన వివిధ అభివృద్ధి కార్యక్రమాలను గురించిన సంక్షిప్త వార్తలు)

అనంతపురం జిల్లా

ప్రాథమిక పాఠశాలల ప్రారంభం

1962 ఆగష్టు నెలలో చిన్న కొత్తపల్లి పంచాయతీ సమితి లోని నరసింగ రాయనిపల్లి, కోటగిరి, కొత్తపల్లి, పల్లన్నగారిపల్లి గ్రామాలలో క్రొత్తగా 4 ప్రాథమిక పాఠశాలలను ప్రారంభించారు. 1974వ సం. రాష్ట్ర అభివృద్ధి రుణానికై కేటాయించిన రూ. 1 లక్షలో రూ. 91000 లను సేకరించడం జరిగింది.

1962 ఆగష్టు 9వ తేదీన అనంతపురం జిల్లా పరిషత్తు అధ్యక్షులు, నింబగల్లులోని మాధ్యమిక పాఠశాలకు ప్రారంభోత్స వం చేశారు.

ఆదిలాబాదు జిల్లా

బాల మందిరం

ఆదిలాబాదులో రూ. 10,000ల ఖర్చుతో నిర్మింపబడిన బాల మందిరానికి, 1962. ఆగష్టు 15వ తేదీన జిల్లా కలెక్టరు ప్రారంభో త్సవం చేశారు.

1962 ఆగష్టు 15 తేదీన జిల్లా కలెక్టరు, ఆదిలాబాదులోని ప్రభుత్వోద్యోగుల వినిమయదార్ల సహకారస్టోరుకు ప్రారంభోత్స వంచేశారు. యీ స్టోరు పెట్టుబడి ధనం రూ. 5000లు.

పంచాయతీ భవనం

ఆదిలాబాదు పంచాయితీ సమితిలోని తుర్కాల చాందా గ్రామంలో పంచాయితీ భవనాన్ని నెలకొల్పారు. 50 శాతం విరాళాల ద్వారా యీ భవనాన్ని నిర్మించారు.

కరీంనగరం జిల్లా

మధ్యాహ్న భోజన కేంద్రం

మెట్టపల్లి పంచాయితీ సమితిలో 'కేర్' సంస్థ సహాయంతో 1962 ఆగష్టు 15వ తేదీని 4 మధ్యాహ్న భోజన కేంద్రాలకు ప్రారంభోత్సవం జరిగింది. మొత్తం 14 కేంద్రాలను నెల కొల్పాల్సిఉంది.

రాజేశ్వరపేట, వెల్లుల రెండు గ్రామాలలో మొత్తం 140 మందికి లాభం చేకూరుతుంది.

కడప జిల్లా

గ్రామ సహాయక శిబిరం

పెండ్లిమర్రి పంచాయితీ సమితిలోని చింతకొమ్మదిన్నె గ్రామంలో గ్రామ సహాయకుల శిక్షణ శిబిరాన్ని 3 రోజుల పాటు నిర్వహించారు. వ్యవసాయంలో ఆధునిక పద్ధతులు, పశు పోషణ విషయాలపై యీశిబిరంలో శిక్షణ యిచ్చారు.

కృష్ణా జిల్లా

రహదారి బంగళా

ఆగష్టు 24వ తేదీన మునిసిపల్ వ్యవహారాలశాఖా మంత్రి. విజయవాడలోని మునిసిపల్ రహదారి బంగాళాకు పునాదిరాయి వేశారు.

అదనపు ట్రాన్స్‌మీటరు

వివిధ భారతి కార్యక్రమాలను రిలే చేయడానికై విజయవాడ రేడియో కేంద్రంలో నెలకొల్పబడిన అదనపు ట్రాన్స్‌మీటరుకు

కేంద్ర సమాచార, ప్రసార శాఖలమంత్రి ఆగస్టు 19 వ తేదీన ప్రారంభోత్సవం చేశారు.

ఖమ్మం జిలా

పాఠశాలకు ప్రారంభోత్సవం

కల్లూరు పంచాయితీ సమితి, వెంకటాపురం గ్రామంలోని మాధ్యమిక పాఠశాలకు ఖమ్మం జిల్లా పరిషత్తు అధ్యక్షులు ఆగష్టు 17వ తేదీన ప్రారంభోత్సవం చేశారు.

ఖమ్మం, నయాబజారులోని ఉన్నత పాఠశాలలో స్వాతంత్ర్య దినోత్సవంనాడు మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రారంభించారు.

రోడ్డు నిర్మాణం

ఖమ్మం సమితిలోని కొడుమూరులో సగం శాతం విరాళాల ద్వారా రు. 2000/-ల ఖర్చుతో 4 ఫర్లాంగుల రోడ్డును గ్రామస్తులు నిర్మించారు. అదే సమితిలోని రఘునాధపాలెంలో కూడా రోడ్లను నిర్మించారు. ప్రొద్దుటూరు గ్రామస్తులు ప్రభుత్వ, సమితి సహాయాంతో రూ. 1500/లు ఖర్చుకాగల మంచినీటి బావిని త్రవ్వారు.

గుంటూరు జిలా

రాష్ట్రి రుణానికి విరాళాలు

సత్తినపల్లి సమితిలోని అన్ని గ్రామాలలోనూ స్వాతంత్ర్య దినోత్సవాన్ని జరిపారు. యీ సందర్భంగా సత్తినపల్లిలో బాలల ఊరేగింపు జరిగింది.

రాజుపాలెం బ్లాకు ప్రాంతంలో రాష్ట్రి అభివృద్ధి రుణానికి ప్రజలనుండి రూ. 1,4,2600/-లు విరాళంగా లభించాయి.

చిత్తూరు జిలా

రోడ్డు నిర్మాణం

నగరి పంచాయతీ సమితిలోని గోవిందప్పనాయుడు కందిగమాదిగవాడలో ఆగస్టు 30వ తేదీన హరిజన దినోత్సవాన్ని జరిపారు. యీ సందర్భంగా 50 గజాల అప్రోచ్ రోడ్డును శ్రీమదానంతో నిర్మించారు. పారిశుద్ధ్య ఉద్యమ ఫలితంగా గృహాలు, వీధులు పరిశుభ్ర పర్చారు. పెంటదిబ్బ, గోతులను పూడ్చారు. బాతులవారికందిగ, తిరుమలకుప్పం గ్రామాలలో రెండు గ్రామ సహాయక శిక్షణ శిబిరాలను నిర్వహించారు. వీటిలో పాల్గొన్న 60 మందికి ఆధునిక వ్యవసాయంలో శిక్షణ యివ్వడం జరిగింది.

తూర్పు గోదావరి జిలా

రాష్ట్రి రుణానికి విరాళాలు

1962 ఆగస్టులో 1974 వ సం. రాష్ట్రి అభివృద్ధి రుణానికై కోటనందూరు పంచాయతీ సమితి ప్రాంతంలో రూ. 87000/-లను సేకరించడం జరిగింది. స్వాతంత్ర్య దినోత్సవాన్ని వైభవంగా జరిపారు.

నల్లగొండ జిలా

క్రొత్త మహిళా మండలి

1962 ఆగస్టులో సమితి ప్రాంతంలో సాంఘిక విద్యా రంగంలో ఒక వయోజన విద్యా కేంద్రాన్ని ప్రారంభించారు. యిందులో 20 మంది సభ్యులు ఉన్నారు. 112 మంది సభ్యురాండ్రతో 5 మహిళా మండలులను నెలకొల్పారు. దేవరకొండ పంచాయతీ సమితిలోని గన్నెర్లపల్లి గ్రామంలో గ్రామ సహాయకుల శిక్షణ శిబిరాన్ని మూడు రోజుల పాటు నిర్వహించారు.

నిజామాబాదు జిల్లా

కుట్టు మిషనుల సరఫరా

బన్సవాడా పంచాయితీ సమితిలోని చందూరు గ్రామంలో ఆగస్టు 9వ తేదీన మహిళా మండలికి ప్రారంభోత్సవం జరిగింది. 50 శాతం విరాళాల పద్ధతిపై సమితి యీ మండలికి కుట్టు మిషనులను సరఫరా చేసింది.

నెల్లూరు జిలా

గ్రామస్థుల విరాళం

కొండపి పంచాయతీ సమితిలోని జరుగుమల్లి సరిహద్దు గ్రామం పంగులూరివారిపాలెంలో రూ. 7500/- ల ఖర్చుతో నిర్మించబడి ప్రాథమిక పాఠశాల భవనానికీ, బాలల పార్కుకు ప్రారంభోత్సవాలు జరిగాయి. రొక్కరూపంలోనూ, వస్తురూపంలోనూ గ్రామస్థులు రూ. 6000/-లు విరాళంగా యిచ్చారు.

కొండపి గ్రామంలో మూడు రోజుల పాటు జరిగే గ్రామ లక్ష్మి శిక్షణ శిబిరానికి ఆగస్టు 13 వ తేదీన ప్రారంభోత్సవం జరిగింది.

పశ్చిమ గోదావరి జిలా

గ్రామ సహాయకుల శిక్షణ శిబిరం

పెంటపాడు పంచాయితీ సమితిలోని నందమూరు గ్రామంలో

ఆగస్టు 10వ తేది నుండి రెండు రోజుల పాటు గ్రామ సహాయకుల శిక్షణ శిబిరాన్ని నిర్వహించారు. ఆధునిక వ్యవసాయ పద్ధతులు, పశు పోషణలలో శిక్షణ యివ్వడం జరిగింది.

చింతలపూడి బ్లాకు సిబ్బంది కృషి ఫలితంగా 15 మంది ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు రూ. 5/ ల క్యుమిలేట్సు టైం డిపాజిటు పద్దులను ప్రారంభించారు.

మహబూబునగరం జిలా

క్రొత్త కళాశాల

నాగరకర్నూలు డివిజన్, పాలెం గ్రామములోని శ్రీ వెంకటేశ్వర ఆదర్శ పాలెం కళాశాలకు, అగస్టు 5వ తేదీన, మహబూబునగరం కలెక్టరు, పునాది రాయి వేశారు. అదే సందర్భంలో రూ. 32000ల విరాళాలను ప్రకటించారు. వచ్చే విద్యా సంవత్సరం నుండి కళాశాలను ప్రారంభించడానికి కృషి చేస్తామని కలెక్టరు హామీ యిచ్చారు.

మెదకు జిలా

వయోజన విద్యా కేంద్రం

నారాయణఖేడ్ బ్లాకులోని నారాయణఖేడ్ పట్టణంలో హరిజనుల కై వయోజన విద్యా కేంద్రానికి ఆగస్టులో సమితి అధ్యక్షులు ప్రారంభోత్సవం చేశారు.

' స్వయం సహాయం ' కార్యక్రమం

స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా మోర్గి, పైడిపల్లి, నగ్దర్, సంజీవనరావుపేట, నారాయణఖేడ్ గ్రామాల మహిళా మండలులు స్వయం సహాయ కార్యక్రమాన్ని అనుసరించి 5 కుట్టు యంత్రాలను కొనగోలు చేశారు.

వరంగల్లు జిలా

మహిళలకు క్లుప్తీకరించిన కోర్సుల ప్రారంభం

కొడకండ్ల పంచాయితీ సమితిలోని కామారెడ్డిగూడెంలో కేర్ సంస్థ సహాయంతో అమలు జరిగే మధ్యాహ్న భోజన పథకానికి సెప్టెంబరు 2వ తేదీన ప్రణాళికా మంత్రి ప్రారంభోత్సవం చేశారు. ఆగస్టు 28వ తేదీన వరంగల్లు కలెక్టరు, హనుమకొండలోని మధ్య తరగతి మహిళల క్లుప్తీకరించిన కోర్సులకు ప్రారంభోత్సవం చేశారు.

ఉపాధ్యాయ దినోత్సవం

సెప్టెంబరు 5వ తేదీన హనుమకొండలోని ప్రభుత్వ బహుళార్థ సాధక ఉన్నత పాఠశాలలో వరంగల్లు కలెక్టరు అధ్యక్షతన ఉపాధ్యాయ దినోత్సవం జరిగింది. యీ సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాలను కూడా నిర్వహించారు.

విశాఖపట్నం జిలా

గోశాల నిర్మాణం

సింహాచలం దేవస్థానం వారు సింహాచలంలో నిర్మించిన గోశాలకు, ఆగస్టు 20వ తేదీన పశుపోషణ, అడవులశాఖా మంత్రి ప్రారంభోత్సవం చేశారు. తిమ్మరాజుపేట, ప్రాథమిక పాఠశాలలోని 14 మంది విద్యార్థులకు ఆగస్టు 15వ తేదీన ఉచిత మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రారంభించారు. ఈ కేంద్రానికై ప్రజల నుండి రూ. 380 ల రొక్కం, 14 బస్తాల వరిధాన్యం విరాళంగా సేకరించారు.

శ్రీకాకుళం జిలా

మధ్యాహ్న భోజన కేంద్రం

స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా, రామభద్రాపురం బ్లాకులోని లోతుగెడ్డ, లక్ష్మీపురం. ఆర్. చింతలవలస, కొత్తవలసలలో మధ్యాహ్న భోజన కేంద్రాలకు ప్రారంభోత్సవాలు జరిగాయి.

పారిశ్రామిక విశేషాలు

[రాష్ట్ర పారిశ్రామిక రంగంలో అనుదినం అభివృద్ధిపథకాలు ప్రవేశపెట్టబడుతున్నాయి. పారిశ్రామిక వేత్తలు, ప్రజలు వాటిని గురించి తెలుసుకొనటం అవసరం అనే దృష్టితో ముఖ్య పారిశ్రామిక విశేషాలు యీ శీర్షక క్రింద యివ్వబడుతున్నవి.]

ఎలెక్ట్రిక్ మీటర్లను తయారుచేసే ఫ్యాక్టరీని విశాఖపట్నం లో కాక హైద్రాబాదులో నెలకొల్పడానికి భారత ప్రభుత్వం ఆమోదించింది.

ఆంధ్రా షుగర్స్‌లోని ఆల్కహాలు యంత్రం 1962 జూలై 20వ తేదీనుంచి ఉత్పత్తి ఆరంభించింది. పరిశ్రమలకు అవసర మయ్యే ఆల్కహాల్‌ను సాలీనా 8 లక్షల గ్యాలనులను ఇది ఉత్పత్తి చేస్తుంది. హైద్రాబాదులోని ఫార్మాసూటికల్ సంస్థలలో ఒకదానికి ఇటాలియన్ సంస్థ సహకారంతో డయామినో—సల్ఫోన్‌ను ఉత్పత్తి చేయడానికి భారత ప్రభుత్వం లైసెన్సు ఇచ్చింది. ఇంజి నీరింగు, శాస్త్రీయ పరికరాల్ని ఉత్పత్తి చేస్తున్న హైద్రాబాదు లోని మరొక సంస్థ, హంగేరియన్ సంస్థ సహకారంతో తియోడ లైట్స్, మైక్రో స్కోపులు తయారుచేయడానికి అనుమతించ బడింది. అయితే విదేశీ సాంకేతిక సహాయపు ఏర్పాట్లను భారత ప్రభుత్వం ఇంకా ఆమోదించవలసివుంది. విశాఖపట్నంలో స్టిరీన్ మానోమోర్, పోలీస్టిరీన్‌లను ఉత్పత్తిచేయడానికి యంత్రాన్ని నెలకొల్పే ప్రాథమికపనులు చురుకుగా కొనసాగుతున్నాయి.

రాష్ట్రప్రభుత్వరంగంలోని ప్రాజెక్టు

స్థానికంగా లభించే ఇనుము, ఇతర ముడిపదార్థాలను విని యోగించుకొని లోషాఫు పద్ధతిప్రకారం దుక్క ఇనుము ఫ్యాక్టరీని నెలకొల్పే విషయమై జాతీయ మెటలర్జికల్ పరిశోధనా సంస్థ అందచేసిన నివేదికను పరిశీలించడానికై భారత ప్రభుత్వం నియ మించిన సాంకేతిక నిపుణులసంఘం న్యూఢిల్లీలో 1962 ఆగస్టు 4వ తేదీన సమావేశమైంది.

సమీకృత గాజు ఫ్యాక్టరీ ప్రాజెక్టు విషయమై హంగేరియన్ నిపుణులు తయారుచేసిన నివేదికను భారత ప్రభుత్వ వాణిజ్య పరిశ్రమల శాఖలోని అభివృద్ధి విభాగం పరిశీలిస్తున్నది. ఈ ఫ్యాక్ట రీని హైద్రాబాదులో నెలకొల్పవలసిందని ఆంధ్రప్రదేశ్ పారిశ్రా మిక అభివృద్ధిసంస్థ పెట్టుకొన్న దరఖాస్తు పరిశీలనలో వున్నది.

బొగ్గు పరిశ్రమ

సింగరేణి బొగ్గు గనులలో ఉత్పత్తి పెరుగుతున్నది. 1961 సం॥లో జూలై నెలాఖరుకు బొగ్గు ఉత్పత్తి 15, 16, 713.8 టన్నులు ఉండగా, ఈ సంవత్సరం అదే నెలలో 16, 99 400 9 టన్నుల బొగ్గు ఉత్పత్తి అయింది. 5వ ఇన్‌క్లయిన్‌లో రూ. 3.6 లక్షల ఖర్చుతో తొట్లెద్వారా బొగ్గు నిల్వలను రవాణా చేసే శక్తిని పెంపొందించుటకై ప్రయత్నాలు చురుకుగా కొన సాగుతున్నాయి.

నిజాం చక్కెర ఫ్యాక్టరీ లిమిటెడ్

నిజాం చక్కెర ఫ్యాక్టరీ యజమానులు 1960-61 సంవ త్సరంలో చెరకు సరఫరాలపై టన్ను 1కి రూ. 1—60 న. పై. ల రేటు చొప్పున బోనసు (అదనపు చెరకుధర) ప్రకటించారు. ఇందుకొరకై మొత్తం రూ. 7, 15, 730/= లు ఖర్చు అవు తుంది. ఈ మొత్తాన్ని పంపిణీ చేయడానికి ఏర్పాట్లు జరుగు తున్నాయి.

1963-64 సం॥లో రైతులు 3.30 లక్షల టన్నుల చెరకును సరఫరా చేయాలని లక్ష్యం నిర్దేశించబడింది. ఎంత చెరకు పండించ వలసిందీ, రైతులకు తెలియపరచబడింది. ఇందుకై రైతులకు అడ్వాన్సుగా ఇచ్చేడబ్బు రూ. 30/=లక్షలకు మించుతుందని అంచనా.

చేతిపనుల విభాగం

భారతప్రభుత్వ చేతిపనుల సంఘపు అధ్యక్షురాలు శ్రీమతి కమలాదేవిఛటోపాధ్యాయగారు 1962 జూలై నెలలో హైద్రాబాదు లోని రాష్ట్ర ప్రభుత్వ చేతిపనులు, కుటీరపరిశ్రమల విక్రయశా లను సందర్శించారు.

1962 ఆగస్టు నెలలో చిత్తూరుజిల్లా కాళహస్తిలో కలం కారీ కళోద్ధరణకై ఉద్దేశించబడిన పైలట్ కేంద్రంలో పనిఆరంభ మైంది. దీనిని రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వంనుండి తీసు కొన్నది.

విజయదశమి

శ్రీ బొడ్డు బాపిరాజు

శ్రీ శరన్మోహనాస్య కాశ్మీర కళిక
శైలకన్యా కృపామృత చంద్ర రేఖ
వీర కైవార మధుప ఝుంకార సురభి
విజయ దశమి విచ్చేసె మావీథిబడికి.

కదలుం గల్కితురాయి కుచ్చు తలపాగాతో, భుజాగ్రమ్మునన్
వదులై వ్రేలెడు విల్లు. నంబులు కరాబ్జాతంబునంగా జయా
స్పదయానమ్ముల బాలమన్మథశతం బట్లున్న వీరాంధ్రసం
పదకున్ వారసు, లీ మహార్నవమి భాస్వన్ముగ్ధ వైతాళికుల్!

తలపించున్ నివురావరించిన మహాంధ్రశ్రీ ప్రతాపోజ్వలత్
జ్వల నోద్దీప్త శిఖాస్ఫులింగములు తత్ సౌందర్య సౌభాగ్యమూ
ర్తుల: శౌర్యావధులైన పూర్వ జయ కీర్తుల్ పాడుచుంబోవ, నీ
తెలుగున్ వాడలు నేడు పావనత జెందున్ తత్పదాంకంబులన్!

ఈ పూజా దివసమ్ములన్ సరస సాహిత్య ప్రతా పార్ష వి
ద్యా పాండిత్యములన్ పరీక్ష గొనె వీరారాధనల్ సేయు త
ద్భూపాస్థానములున్. బహూకృతులు పోపో విస్మృతింగొన్న మా
కీ పాపల్మరి గుర్తు దెత్తురటె యిట్లేడాది కేడాదికిన్?


లలిత శ్రావ్య పదారవ శ్రుతిని కోలాటమ్ములందీర్చి, గో
కుల కన్యా హృదయాభిషిక్తములు శ్రీ గోవింద శృంగార గా
థలు మాధుర్యము చింద పాడుకొను ఛాత్ర శ్రేణితో వీరుగో
తెలుగున్ జాను తనమ్ము నిల్పు గురువుల్ దీవింతు రుద్యన్మతిన్.

(63 వ పుట చూడుడు)

అటవీశాఖామంత్రి

శ్రీ మల్లిపూడి పళ్లంరాజు అస్తమయం

గుండె జబ్బుకారణంగా ఉస్మానియా ఆసుపత్రిలో చికిత్సకై చేర్చబడిన, పశుపోషణ, మత్స్య, అటవీశాఖల మంత్రి శ్రీ మల్లిపూడి పళ్లంరాజు, 1962 సెప్టెంబరు 27వ తేదీ రాత్రి 2-20 గంటలకు కాలధర్మం చెందారు. 28వ తేదీ రాత్రి 9-40 ని.లకు అంబర్‌పేట శ్మశానవాటికలో సకల ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు జరిగాయి.



శ్రీ పళ్లంరాజు మృతిపట్ల ఆంధ్రప్రదేశ్ గవర్నరు, జనరల్ ఎస్. ఎం. శ్రీ నగేశ్ తమ సంతాపం వెల్లడిస్తూ, ప్రభుత్వం సమర్థుడైన పరిపాలకుని ఆంధ్రప్రజలు మహానాయకుని, కోల్పోయినారన్నారు.

"ఆయన రాష్ట్రప్రజలకు చేసిన సేవ అద్వితీయం, వారి కుటుంబానికి నాహృదయపూర్వక సానుభూతి తెల్పుతున్నాను" అని గవర్నరు సంతాప సందేశంలో పేర్కొన్నారు.

ముఖ్యమంత్రి జోహార్లు

"మన నాయకులు, అగ్రశ్రేణి స్వాతంత్ర్య సమరయోధులు, శ్రీ పళ్లంరాజు మనలను విడిచి వెళ్లిపోయారు. స్వాతంత్ర్య సమరకాలంలో క్లిష్ట పరిస్థితుల కెదురొడ్డి నిలిచిన ఆయన సాహసం మనం మరువలేము. వారు లేని ఆంధ్రదేశం పేదపడిపోయింది. గౌరవనీయుడు, ముఖ్యుడు అయిన మంత్రివర్గంలోని సహసభ్యుని కోల్పోయినందుకు బాధపడుతున్నాను. ఆయన కుటుంబానికి నా సానుభూతి తెల్పుతున్నాను." అని ముఖ్యమంత్రి డాక్టర్ నీలం సంజీవరెడ్డి తమ సంతాప ప్రకటనలో పేర్కొన్నారు.

జీవిత సంగ్రహం

శ్రీ పళ్లంరాజు 1899 ఏప్రిల్ 25వ తేదీన జన్మించారు. కోయంబత్తూరు వ్యవసాయ కళాశాలలో పట్టభద్రులయినారు. 1929 లో తూర్పు గోదావరి జిల్లాబోర్డు అధ్యక్షులుగా ఎన్నికైనారు. స్వాతంత్ర్య ఉద్యమ కాలంలో పెక్కుసార్లు జైలుకు వెళ్ళారు. 1937-39 వరకు, 1946-52 వరకు అసెంబ్లీ సభ్యులుగా ఉన్నారు. 1960 లో సంజీవయ్య మంత్రివర్గంలోచేరారు. ఆంధ్రప్రదేశ్ కాంగ్రెసు అధ్యక్ష పదవి చేపట్టడానికై 1961 మార్చిలో మంత్రిపదవికి రాజీనామా యిచ్చారు. తిరిగి 1962 మార్చిలో యేర్పడిన సంజీవరెడ్డి మంత్రి వర్గంలో సభ్యులుగా చేరారు.

(62 వ పుట తరువాయి)

అనఘుల్ మీరు. స్వతంత్ర భారత సువర్ణాంకంబునన్ జన్మమున్
గొనినారే సుకృతమ్ము పండినదొ మీకున్; దేశసౌభాగ్య సా
ధన సంపత్తికి దోహదంబయిన విద్యా ప్రాభవ శ్రీ సమా
ర్జనకై కోరుకొనుండయా తనయులారా! తల్లి శార్వాణినిన్.

తల్లీ! మహిషాసుర విజ
యోల్లాస విభాత దీప్త లొత్తిన భవదు
త్ఫుల్లాబ్జ సదృక్ దృక్ఛట
చల్లగ కాపాడు విజయ సంవర్ధనివై! ★

కుష్ఠరోగ నివారణ

శ్రీ డి. వెంకటసుబ్బారావు.

కుష్ఠ రోగాన్నరికట్టడం, నివారించడం మన నాగరికతనూ, ఆర్థికాభివృద్ధిని సూచిస్తుంది. భారత దేశంలో ఇప్పుడు $1\frac{1}{2}$ మిలియనుల కుష్ఠ రోగులున్నారు. ఈ వ్యాధిని నివారించ డానికి ప్రభుత్వం అనేక సంస్థల్ని నెలకొల్పింది. వాటిలో సహాయ సంస్థలు, చికిత్స సంస్థలు, నివారణోపాయాలను వృద్ధిచేసే సంస్థలు ముఖ్యమైనవి. మద్రాసులో కేంద్ర ప్రభుత్వం ఆధిపత్యం క్రింద కుష్ఠ నిర్మూలన విద్యా సంస్థ, పరిశోధక సంస్థలు యీ వ్యాధిని గూర్చిన వివరాలను సేకరించి, నివారణోపాయాలను అభివృద్ధిచేసే మార్గాలను కనుగొని, వ్యాధి నిర్మూలనకై తగు నిపుణులకు శిక్షణ యివ్వడం మొదలైన కార్యాలను నిర్వహించడం, వంటి కార్యక్రమాలను నిర్వర్తిస్తున్నవి. రెండవ పంచవర్ష ప్రణాళికా కాలంలో 31 మార్చి 1961 లోపున 137 సంస్థలు పరిశోధనా కార్యాలను నిర్వహించి 65,63 లక్షల మంది ప్రజలను పరీక్షించి వారిలో 1.04 లక్షల రోగులకు చికిత్స జేయదొడగారు. మూడవ పంచవర్ష ప్రణాళికలో ఈ వ్యాధి నరికట్ట డానికి 424 లక్షల రూపాయలు కేటాయించ బడినవి. ఈ మొత్తంతో జరుగుతున్న కృషి వివరాలు ఇవి.—

1. 50 కుష్ఠ నరికట్టే కేంద్రాలను స్థాపించడం.
2. కుష్ఠ నరికట్టే నిపుణులను తయారుచేసే సంస్థలు 10 నెలకొల్పడం.
3. వివిధ సంస్థల్లో పనిచేయడానికి 1,000 మంది పని వారిని నియోగించడం.
4. 15 సహాయ కుష్ఠ నిపుణుల నియోగించడం.
5. కుష్ఠ వ్యాధిని గూర్చిన యితరాంశాలను, పరిశోధించే యేర్పాట్లు చేయడం.
6. సహాయ సంస్థలకు ఆర్థిక సహాయం చేయడం.
7. కుష్ఠ వ్యాధినయమైపోయిన వారికి పనులు కల్పించడం.
8. ఆరోగ్య సూత్రాల ప్రచారం చెయ్యడం.
9. వివిధ రాష్ట్రాలలో పరిశోధనలకు కావలసిన సహాయం చేయడం.

ఆంధ్ర ప్రదేశ్‌లో కూడా కుష్ఠ వ్యాధి ప్రబలుతున్నది. చిలకలపల్లిలో వున్న గాంధి కుష్ఠ నివారణ సంఘం, ఇతర మత బోధక సంస్థలు ఈ వ్యాధిని అరికట్టడానికి కృషి చేస్తున్నవి. ప్రథమ పంచవర్ష ప్రణాళికా కాలంలో ప్రభుత్వపు యాజమాన్యాన తిరుపతి, రామచంద్రపురం, నారాయణపేటల్లో నివారణ స్థానాలేర్పరుప బడ్డాయి. రెండవ పంచవర్ష ప్రణాళికా కాలంలో కర్నూలు, విశాఖపట్టణం, తణుకు, కోడూరు, కేసరపల్లి, యల్లారెడ్డి, సిద్దిపేట, సూర్యాపేట, కొండనగల్లు, వెంకటగిరి, హీరమండలం, హిందూపురాల్లో యిటువంటి సంస్థలు స్థాపింప బడ్డాయి. ఈ ప్రదేశాల లోనే కాక హైదరాబాదు, గుంటూరు, కంభం జిల్లాలలో గూడా ఏర్పాటుపబడ నున్నాయి. రాష్ట్రీయ కుష్ఠ నివారణా సంఘం వొకటి రెండవ పంచవర్ష ప్రణాళికాకాలంలో హైద్రాబాదు కేంద్రంగా స్థాపింప బడింది. ఈ కేంద్రం క్రింద రెండు పరిశోధనా సంస్థలు ఏర్పరచి రాష్ట్రంలో కుష్ఠ ప్రబలివున్న స్థానాలలో పరిశోధనలు చెయ్యడానికి కుష్ఠ నివారణ కేంద్రాలు స్థాపించ బడ్డాయి. ఈ వ్యాధినరికట్టడానికి ప్రజలకు (Sulphonedrugs) సల్ఫోను మాత్రలు పంచి పెట్టబడ్డాయి. ఇంటింటికి వెళ్ళి మందును పంచే (Domicilliary Service) ఏర్పాట్లు కూడా చేయబడ్డాయి. వైద్యుల్ని నాగపూరులోని శిక్షణా కేంద్రానికి పంపి ఆ తరువాత తిరుపతిలో వారు అనుభవం సంపాదించుకొనే ఏర్పాట్లు చేయబడ్డాయి. ఇంతగా ఆరితేరిన నిపుణులను యీ కేంద్రాలలో నియో

గించడం ద్వారా క్రమ వైద్య సౌకర్యములు ప్రజలకందుబాటులోకి తేబడ్డాయి. మూడవపంచవర్షప్రణాళికలో కుష్ఠు పరిశోధనచేయడం కుష్ఠువైద్యశాస్త్రాభ్యసనం, కుష్ఠు నివారణ మార్గాలను కనుగొనే కేంద్రాలను ఏర్పరచడమేగాక, ప్రజా సేవకు వైద్యనిపుణత అవసరంలేని ఇతరులకు క్రమ శిక్షణ నిచ్చే వారిని తగు స్థానాలలో ఉంచి కుష్ఠు నిర్మూలం కావించే ఏర్పాట్లు చేయబడుతున్నాయి. హైదరాబాదులో ఉన్న మౌలాలీ కుష్ఠు ఆస్పత్రిలో, ఆరోగ్యవంతులైన వారికి పునర్వాస స్థానమేర్పరచ డానికి రూ. 46,000 ఇవ్వడంజరిగింది. ఇదిగాక కుష్ఠు నివారణకు స్వేచ్ఛగా సేవచేసే సంస్థలకు ఆర్థికాది సహాయాలు చేయబడుతున్నవి. ప్రపంచ కుష్ఠు నివారణాసంస్థ వారు అనేక ఇతర సదుపాయాలుకూడా చేస్తున్నారు. హిందూ కుష్ఠు నివారణా సంఘం చేస్తున్న సేవ చాలా ప్రశంసనీయమైనది. ఈ సంఘం సహాయంవల్ల ప్రజాభిప్రాయం ఈ వ్యాధి నిర్మూలనకు అనుకూలమవు తున్నది.

కుష్ఠు వ్యాధి భారతదేశంలోను, ఆఫ్రికాలోను అతి పురాతన కాలం నుంచి వ్యాపించి వున్నది. క్రీస్తుకు పూర్వం ఈ వ్యాధి యూరపులో వ్యాపించి వున్నది. తర్వాత అమెరికా మొదలైన ఇతర ప్రాంతాలకు వ్యాపించింది. ప్రస్తుతం ప్రపంచంలో 50 లక్షల మంది ఈ వ్యాధితో బాధపడుతున్నారు. మనదేశంలో సుమారు 15 లక్షలున్నారు. ఆంధ్ర దేశంలో 85,000 మంది రోగులున్నారు.

కొందరు ఈ వ్యాధి సమీకరణాహార దోషంవల్ల సంభవిస్తున్నదని భావిస్తున్నారు. ఇందుకు కారణం ఒక విధమైన క్రిమి (Brcillus) అని అది జీనస్ మైకో బాక్టియం (Genas Mycobactium) కుటుంబానికి చెందిందని అభిప్రాయపడుతున్నారు. ఈ వ్యాధికి మూలకారణమైన క్రిమి (Bacillus) 1847 సంవత్సరంలో కనిపెట్ట బడింది. ఈ క్రిమి మానవాది శరీరాలలో తప్ప ఇతరత్రా ఎక్కడా వృద్ధి పొందడం లేదు. ఇది వంశ పారంపర్యంగా సంభవించే వ్యాధి కాదు. ఈ విషయాన్ని నిరూపించడానికి అనేక ఆధారాలున్నాయి. కుష్ఠుతో బాధపడే తల్లితండ్రులకు జన్మించిన శిశువులను వెంటనే వేరు చేసి పెంచితే వారిలో ఈ వ్యాధి పొడ సూపడం లేదు. ఈ పిల్లలే తల్లి తండ్రులవద్ద ఉంటే మాత్రం పెద్దలకంటే అతిశీఘ్రంగా ఈ వ్యాధికి గురవుతున్నారు. ఈ వ్యాధి వ్యాప్తతనొందేమార్గం ఇదమిద్ధమని సిద్ధాంతీకరించ డానికి ఆధారాలింత వరకూ కనిపించ లేదు. అనుభవజ్ఞులు తెలిసికొన్న దాని ప్రకారం క్రిములు రోగుల పుండ్ల నుంచి వెలువడే రసి నుంచి బయల్పడి ఆరోగ్యవంతుల చర్మ రంధ్రాల ద్వారా ప్రవేశిస్తూ వ్యాధిని కలుగ జేస్తున్నవి. డాక్టరు కనోల్కారుగారి ఆధిపత్యాన ఏర్పడిన సంస్థ కృషి ఫలితంగా ఈ వ్యాధికి మూలమైన ప్రధమ కారణములు కొన్ని తెలియ వచ్చాయి.

ఈ వ్యాధి మూడు భాగాలుగా నిర్ణయించబడినది.

1. చర్మంమీద మచ్చలేర్పడడం, ఆయా చోట్ల చర్మం మొద్దుబారటం, చర్మం రంగు మారటం, కొన్ని స్థానాల్లో ఎరుపుబారటం, సూది మొన గుచ్చినా గుచ్చుకొన్నట్లు ఉండకపోవడం ప్రధమ సూచనలు.
2. చర్మం మీద మచ్చలు లేకపోవడం, కాళ్లు గాని, చేతులు గాని తమ స్పర్శ జ్ఞాన శక్తిని కోల్పోయి బాధ కలగడం, ఆ అవయవములు వేడిని గాని చల్లదనాన్నిగాని తెలిసికొనలేకపోవడం, వ్యాధి ఎక్కువగా వ్యాపించితే వేళ్లు వంకరలు తిరగడం, పుండ్లు ఏర్పడడం, కొన్ని సమయాల్లో వ్రేళ్లు ఊడిపోవడం సంభవిస్తుంది.
3. ముఖచర్మం, చెవులు మొద్దుబారటం, వాయడం, ముఖం మీద, చెవుల మీద, ఇతర చోట్ల వ్రజదళా (Nodules) లేర్పడడం జరుగుతుంది.

మొదటి రెండు రకాలైనవి ఎక్కువ ప్రమాదకరమైనవి కావు. మన దేశంలోని కుష్ఠు రోగుల్లో ¾ వంతు యీ విధాలైన రోగాలతో బాధపడుతున్నారు. మూడవరకం ప్రమాదకరం. ఇది క్రమంగా రోగిని క్షీణింపజేసి ఇతరులకు వ్యాధి వ్యాపించడానికి హేతువవుతున్నది. మనకు బజారుల్లో నిత్యమూ కనుపించే కుష్ఠు రోగులు ప్రమాద స్థితికి చెందినవారు కాదు. వారి వల్ల ఎటువంటి ప్రమాదమూ సంభవించదు.

వ్యాప్తి పొందే మార్గాలు నిర్ధారణ చేయబడనందువల్ల యీ వ్యాధిని అరికట్టే మార్గాల నన్వేషించడం కష్టసాధ్యం. దీనికి తోడు రోగులకు వ్యాధిని గూర్చిన వివరాలు తెలియకపోవడం, బంధువుల అజ్ఞానం వ్యాధి ప్రథమ రూపం అనుచరులకు, సన్నిహితులకు తెలియకపోవడం మరొక కారణం. రోగ నిర్ణయమైతే సాంఘిక బహిష్కారం, బంధుమిత్రులకు దూరమవడం జరుగుతుందనేభయంతో రోగి వైద్యుని సలహాలను పొందడు. ఈ వ్యాధి బీదల్లో ఎక్కువగా ప్రబలివున్నా ధనికుల్లోనూ, మధ్యతరగతుల వారిలోనూ లేక పోలేదు. ఇటువంటి నిరాదరణ రోగులకు ఆత్మ తృప్తి విశ్వాసాల కంటె, నిరుత్సాహం, నిస్పృహలను కలుగజేస్తున్నది. కుష్ఠ రోగి ఇతర రోగులవలె ఆదరింపబడవలసి వున్నాడు. అతనిని సంఘానికి దూరం చేయడం అన్యాయం. ఇటువంటి అన్యాయాన్ని నివారించాలంటే రోగులు ఉత్సాహంతో మందులు సేవించి తిరిగి ఆరోగ్యవంతులవడం చాలా అవసరం.

ప్రస్తుతం సల్ఫోనులు (Sulphones-DDS-) చవుకగా దొరుకుతూ పూర్ణ ఫలితాలిస్తున్నది. ఈ మందు స్వీకరించడం కష్టం కాదు. దీనిని మాత్రలు గాను, ఇంజక్షనులు గాను కూడా వాడడానికి వీలున్నది. కొద్ది ప్రమాణంతో ప్రారంభించి యీ మందును క్రమంగా మరికొంత అధిక ప్రమాణంగా వాడవచ్చును. ఇందులో దోషం లేదు. రోగికి రోగ లక్షణాలు ప్రారంభమైన వెంటనే మందు ప్రారంభిస్తే కాళ్లు, చేతులు మొద్దుబారటం సంభవింపదు. వ్రేళ్లు వంకరలు పోయే దుర్లక్షణాలు ప్రారంభం కాగానే రోగిచికిత్సకై ప్రత్యేకవైద్యులవద్దకు వెళ్ళవలెను. ఈ స్థితిలో శస్త్ర చికిత్సకైగాని విద్యుత్‌చికిత్సగాని జరిపితే వ్యాప్తిని అరికట్టే అవకాశాలెక్కువగాఉన్నవి. ఈ వ్యాధి ప్రథమ లక్షణాలు కనిపించగానే చికిత్స మొదలుపెడితే, రోగాన్ని తగ్గించడం సులభం. లేకపోతే మాత్రం నివారించడం కష్టం. ప్రజలు తమ తమ క్షేమం దృష్ట్యానే గాకదేశ క్షేమం దృష్ట్యా కూడా. కుష్ఠురోగ నివారణలో ప్రభుత్వం చేస్తున్నకృషి సఫలత నందేట్లు చూడాలి. అందుకు సంపూర్ణమైన సహకారాన్నివ్వాలి.

వర్షగీతి

శ్రీ దామెర రాజగోపాలరావు

ముత్యాల వానజల్లును వచ్చితిని నేను;
అత్యంత సంతోషమును దెచ్చితిని నేను.
మున్నీటి వేడినిట్టూర్పు గాడ్పును నేను;
క్రొన్ననల మన్ననల కేలుమోడ్పును నేను.
మిన్ను వచ్చిన హర్షబాష్పావళిని నేను,
మన్ను విచ్చిన హాస పుష్పావళిని నేను
రవరవల గాలినడకల, దేవతలు పనుప,

దివినుండి భువికేను దిగివచ్చితిని. దనుప,
ప్రకృతి నను దలఁదాల్చు రవ్వలతురాయిగా;
సకలమ్ము ననుదల్చు సరిలేనిహాయిగా.
వినువీథిఁ జాతకము స్వాగతము వచియించు;
వనసీమల నెమళ్లు కైవార మొనరించు.
ఉఱుము వెఱిగించు మునుముందుగా నారాక;
హరివిల్లు దెలుపుఁగచ్చర మీకు నా పోక.

పంచాయతీరాజ్య పురోగమనం

శిక్షణ శిబిరం

అనంతపురంజిల్లా తనకల్ పంచాయతీసమితిలోని ఈతోడు గ్రామంలో 1962 ఆగస్టు 16, 17 తేదీలలో గ్రామ సహాయక శిక్షణ శిబిరాన్ని నిర్వహించడం జరిగింది. బ్లాకు సిబ్బంది శిక్షణ పొందేవారికి అభివృద్ధికర వ్యవసాయోత్పత్తి పద్ధతులు వివరించి చెప్పింది.

ప్రాథమిక పాఠశాల ఆరంభం

అనంతపురం జిల్లా రాయదుర్గ పంచాయతీ అధ్యక్షులు 1962 ఆగస్టు 24 వ తేదీన చాడం గ్రామంలో పంచాయతీసమితి ప్రాథమిక పాఠశాలకు ప్రారంభోత్సవం చేశారు. ఈ నెలలో రెండు బావుల నిర్మాణం—రాతి భావివంకలో ఒకటి సిద్ధాపురం తాండాలో మరొకటి—పూర్తి అయింది. రాయదుర్గ పంచాయతీ భవనపు పంచాయతీ కోర్టు హాలు నిర్మాణానికి పని ఆరంభమైంది.

ఆధునిక వ్యవసాయ పద్ధతులు

చిత్తూరు జిల్లా నగరి పంచాయతీ సమితిలోని బాతులవారి కండిగ తిరుమల కుప్పం గ్రామాలలో ఆగస్టు నెలలో రెండు గ్రామ సహాయక శిక్షణ శిబిరాలు నిర్వహించబడ్డాయి. 60 మంది యువకులు, ఇతర రైతులు ఆధునిక వ్యవసాయ పద్ధతులలో శిక్షణ పొందినారు.

రసాయనిక యెరువుల పంపిణీ

గుంటూరు జిల్లా ఈమని పంచాయతీసమితిలోని రైతులకు ఆగస్టు నెలలో 5868 పౌనుల రసాయనిక ఎరువులు సహకార సంఘాల ద్వారా పంపిణీ చేయడం జరిగింది. అంతేగాక 22 గ్రామీణ మరుగుదొడ్ల నిర్మాణం పూర్తి అయింది. ఆగస్టు 15 న పెదకొండూరులో పంచాయతీసమితి ప్రాథమిక పాఠశాల భవనం తెరువబడింది.

మధ్యాహ్న భోజన కేంద్రాలు

1962 ఆగస్టు నెలలో తూర్పు గోదావరి జిల్లా, కోట నండూరు పంచాయతీసమితిలోని 8 గ్రామాలలో బడి పిల్లలకు మధ్యాహ్న భోజన కేంద్రాలు తెరువబడినాయి. కేర్ సంస్థ సహాయంతో ఈ కేంద్రాల నిర్వహణ జరుగుతున్నది. ఆగస్టు 28, 30 తేదీల మధ్య లక్ష్మీదేవిపేటలో స్త్రీలకొరకు గ్రామసహాయక శిక్షణ శిబిరం నిర్వహించడం జరిగింది. 40 మంది స్త్రీలు శిక్షణ పొందినారు. ఇక్కడ ఆగస్టు 30 వ తేదీన హరిజన దినోత్సవం జరిగింది. మధ్యాహ్న భోజన కేంద్రం ఒకటి తెరువబడింది.

"కేర్" సంస్థ సహాయంతో గుంటూరు జిల్లా గురజాల పంచాయతీసమితిలో ఆగస్టు నెలలో 23 స్కూళ్ళలో మధ్యాహ్న భోజన పథకం ఆరంభించబడింది. ఈ పథకం వల్ల 1230 మంది విద్యార్థులు లాభపడుతారు.

ప్రజా విరాళం

ఆగస్టు 14 న కృష్ణా జిల్లా బంటుమిల్లి పంచాయతీసమితి లోని అర్థమూరు గ్రామంలో నాచుగుంట హరిజనవాడలో ఒక పాఠశాల భవనం తెరువబడింది. భవనం ఖర్చు రూ. 4000/– ఈ ఖర్చునుపంచాయతీసమితి హరిజనులు, కలిసి చెరిసగం భరించారు.

గ్రంథాలయ ప్రారంభం

ఆగస్టు నెలలో కరీంనగరు జిల్లా కలెక్టరు మంథని పంచాయతీ సమితి ఆధ్వర్యంలో ఉన్న పాఠశాలలో 6 వ తరగతికి ప్రారంభోత్సవం చేశారు. ప్రజల సహకారంతో ఇక్కడి ప్రాథమిక పాఠశాల మాధ్యమిక పాఠశాలగా రూపొందింది. మధ్యాహ్న భోజన పథకం కూడా ఆరంభమైంది. కలెక్టరు గ్రామ గ్రంథాలయానికి కూడా ప్రారంభోత్సవం చేశారు. యూత్ క్లబ్ సభ్యులు ఈ గ్రంథాలయానికి 50 శాతం విరాళంగా ఇచ్చారు.

క్రొత్త తరగతుల ప్రారంభం

మెదక్ జిల్లా పరిషత్తు, విద్యా విభాగపు ఉపకార్యదర్శి ఆగస్టు 17 న నారాయణఖేడ్ బ్లాకులోని సిర్గాపూరు స్కూలులో 8 వ తరగతికి దేశాయి చప్టాలో 6 వ తరగతికి ప్రారంభోత్సవం జరిపారు.

ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

ప్రణాళిక శాఖా మంత్రి ఆగస్టు 10 వ తేదీన నల్గొండ జిల్లా మునుగోడులో ప్రాథమిక ఆరోగ్యకేంద్రానికి ప్రారంభోత్సవం చేశారు. మునుగోడు ప్రజలు పొరుగుగ్రామాల ప్రజలు కలిసి రూ. 10,000/-లు విరాళంగా ఇచ్చారు. 12 మంచములఏర్పాటుగల ఈ ఆరోగ్య కేంద్రానికి రెండు యెకరాల భూమిని కూడా విరాళంగా ఇచ్చారు.

మంచి నీటి బావులు

1962 ఆగస్టు నెలలో నిజామాబాదు జిల్లా బాన్సువాడ బ్లాకులో యెన్నుకోబడిన చెరువులలో విస్తృత పుష్టికర ఆహార పథకం క్రింద 50,000 చిరుచేపలు నిలవ వుంచబడినాయి. కోళ్ళ అభివృద్ధి కార్యక్రమం క్రింద 912 గ్రుడ్లు ఉత్పత్తి అయినాయి. వీటిల్లో 478 గ్రుడ్లు అవసరమైన వారికి పంచిపెట్టడం జరిగింది. వారికి 70 కిలో గ్రాముల కూరగాయలు కూడా పంచిపెట్టడం జరిగింది. రెండు మంచి నీటి బావుల నిర్మాణం కూడా పూర్తిఅయింది.

పలకల పంపిణీ

వరంగల్ జిల్లా పరకాల బ్లాకులో 1962 ఆగస్టు 29 నుంచి 31 వరకు తిరుమలగిరి గ్రామములో గ్రామ నాయకుల శిక్షణ శిబిరం నిర్వహించబడింది. నిర్బంధ ప్రాథమిక విద్యా పథకం క్రింద సమితి 2000 మంది పిల్లలకు ఉచితంగా పలకలు పెన్సిళ్ళు సరఫరా చేసింది. ప్రాథమిక పాఠశాలలను మాధ్యమిక పాఠశాలలుగా మార్చే సందర్భంలో నాగారం, తిరుమలగిరి, నడికూడ గ్రామవాసులు ఒక్కొక్క వూరిక్రింద రూ. 1000 లు వంతున విరాళమిచ్చారు.

పంచాయతీ సమితి కార్యక్రమ విధానాలను పరిశీలించేందుకై భారత ప్రభుత్వ ప్రజా సంబంధాల సంస్థ (న్యూఢిల్లీ) సభ్యులు ఈ బ్లాకును ఆగస్టు 9వ తేదీన సందర్శించారు.

కార్మిక సహకార సంఘం

నెల్లూరు జిల్లా చేజెర్ల పంచాయతీ సమితిలోని కల్లూరు గ్రామములో 21 మంది సభ్యులు ఆగస్టు నెలలో కార్మిక సహకార సంఘాన్ని ఒక దానిని ఆరంభించారు. సాంఘిక విద్యా వ్యాప్తి క్రింద ఈ బ్లాకులో ఆగస్టు నెలలో రెండు యువజన క్లబ్‌లు, ఒక పఠనాలయం ఒక మహిళా మండలి, ఒక వయోజన అక్షరాస్యతా కేంద్రం, ఒక భజన మండలి కూడా తెరువబడినాయి.

పాఠశాల భవనానికి విరాళం

ఆగస్టు 18వ తేదీన భారత ప్రభుత్వ సమాచార, ప్రసార శాఖల మంత్రి అహమదాపురంలో ఒక హైస్కూలు, భవనానికి ప్రారంభోత్సవం చేశారు. ఈ భవన నిర్మాణానికి రూ. 1,66,000 లు ఖర్చు అయ్యింది. శ్రీ డి. సుబ్బారెడ్డి గారు ఈ డబ్బును విరాళంగా ఇచ్చారు. ఇదే వూరులో రాష్ట్ర ఆర్థిక మంత్రి హాస్టలు భవనానికి శంకుస్థాపన చేశారు.

ప్రపంచ రాజ్యాల గమ్యం ఒరులతో యే ప్రసక్తి పెట్టుకోనొల్లని దైనప్పుడు అది స్వాతంత్ర్యం కాదు. ఐచ్ఛికంగా ఒండొరుల మీద ఆధారపడి మనగోరే స్వాతంత్ర్యం.

— మహాత్మాగాంధీ.

ముఖ్యవార్తలు

రాష్ట్రంలో

ఆగస్టు 22: ఆంధ్ర ప్రదేశ్‌లో విద్యుచ్ఛక్తి కొరతను తీర్చడానికి మద్రాసు ప్రభుత్వం ఆంధ్రకు అదనంగా విద్యుచ్ఛక్తి సరఫరా చేయడానికి అంగీకరించింది.

ఆగస్టు 27: పది కోట్ల రూపాయల రాష్ట్రాభివృద్ధి ఋణానికి కావలసిన మొత్తం సమకూరినందున ఈ ఋణ సేకరణను నిలిపి వేశారు.

ఆగస్టు 30 : గ్రామీణ, పట్టణ ప్రాంతాలలో నీటి సరఫరా, డ్రైనేజి పథకాలను గురించి పరిశీలించడానికి రాష్ట్రప్రభుత్వం 8 మంది సభ్యులున్న కమిటీని నియమించింది.

ఆగస్టు 31: రాణి కుముదినీ దేవి ఏకగ్రీవంగా హైదరాబాద్ మేయర్‌గా ఎన్నికయ్యారు.

సెప్టెంబరు 1:ప్రస్తుత విద్యా సంవత్సరంనుంచి మూడవ తరగతి నుంచి ఇంగ్లీషు బోధించే పథకాన్ని ప్రవేశ పెట్టాలని రాష్ట్ర మంత్రి వర్గం నిర్ణయించింది.

సెప్టెంబరు 4:ఆంధ్ర ప్రదేశ్, ఒరిస్సాల ముఖ్య మంత్రులు సీలేరు ప్రాజెక్టు ఒప్పందంపై సంతకాలు చేశారు.

సెప్టెంబరు 5:పదవీ విరమణ చేస్తున్న గవర్నర్ డాక్టర్ భీమసేన్ సచార్ హైదరాబాద్ నుంచి న్యూఢిల్లీకి వెళ్ళే సందర్భంగా ఆయనకు లాంఛనప్రాయమైన వీడ్కోలు ఇవ్వబడింది.

సెప్టెంబరు 7:జనరల్ శ్రీ యస్.యం. శ్రీనగేశ్ ఆంధ్ర ప్రదేశ్ గవర్నరుగా పదవీ ప్రమాణస్వీకారం చేశారు.

సెప్టెంబరు 10: రేడియో గ్రామీణ గోష్ఠుల ముఖ్య నిర్వాహకుల ఆరు రోజుల శిక్షణ కోర్సుకు ప్రణాళికా మంత్రి హైద్రాబాదులో ప్రారంభోత్సవం చేశారు.

సెప్టెంబరు 12: వికలాంగులకు ఉపయోగించే ఉద్యోగ సాధక కేంద్రానికి రాష్ట్ర ఆర్థిక మంత్రి హైద్రాబాదులో ప్రారంభోత్సవం చేశారు.

సెప్టెంబరు 13: కేంద్ర శాస్త్రీయ పరిశోధల, సాంస్కృతిక వ్యవహారాలశాఖా మంత్రి ఉస్మానియా విశ్వవిద్యాలయా వరణలో రాష్ట్ర ప్రాచీన పత్రాల భాండాగార భవనానికి శంకుస్థాపన చేశారు.

సెప్టెంబరు 16: తృతీయ ప్రణాళికలో విద్యుచ్ఛక్తికి నిర్దేశించి 64 కోట్ల రూపాయలను 74 కోట్ల వరకూ పెంచుతూ పది కోట్ల రూపాయలను ఖర్చు చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది.

సెప్టెంబరు 18: రాష్ట్ర తృతీయ ప్రణాళికా వ్యయం మొత్తాన్ని పెంచడం జరగగలదని ప్రణాళికలు, పంచాయతీరాజ్య శాఖల మంత్రి ఒక పత్రికా ప్రకటనలో తెలిపారు.

భారతదేశంలో

ఆగస్టు 21: భారత రాజ్యాంగ సవరణకు సంబంధించిన ఒక బిల్లును, నాగా రాష్ట్రం అనే మరొక కొత్త రాష్ట్రాన్ని ఏర్పాటు చేయడానికి మరొక బిల్లును ప్రధాన మంత్రి లోక్‌సభలో ప్రవేశపెట్టారు.

గుల్జాతీ కమిషన్ తన నివేదికను భారత ప్రభుత్వానికి సమర్పించింది.

ఆగస్టు23: భూసేకరణ, అభివృద్ధి పథకం క్రింద జీవిత భీమా సంస్థ ఆంధ్రప్రదేశ్‌కు రూ. 20 లక్షలను ఇచ్చింది.

ఆగస్టు 28: నాగా రాష్ట్రాన్ని ఏర్పాటు చేయడానికి వీలుగా రాజ్యాంగ (13 వ సవరణ) చట్టాన్ని లోకసభ ఆమోదించింది.

సెప్టెంబరు 8: మూడు వారాల పాటు విదేశాలలో పర్యటించడానికై ప్రధాన మంత్రి న్యూఢిల్లీ నుంచి లండన్‌కు బయలుదేరి వెళ్ళారు.

సెప్టెంబరు 11: భావసమైక్యతా సాధనకై నియమింపబడిన సంపూర్ణానంద్ కమిటీ తన తుది నివేదికను కేంద్ర విద్యా మంత్రిత్వ శాఖకు సమర్పించింది.

సెప్టెంబరు 14: ఆరుకోట్ల రూపాయల బాండ్లను జారీ చేయడానికి భారత పారిశ్రామిక ఆర్ధిక సహాయ సంస్థ నిర్ణయించి నట్లు న్యూఢిల్లీలో వెలువడిన ఒక అధికార ప్రకటన తెలుపుతున్నది.

11 వ జాతీయ నౌకాశ్రయమండలి (బోర్డు) సమావేశానికి కేంద్ర రవాణా, కమ్యూనికేషన్ల ఘంత్రి విశాఖపట్నంలో ప్రారంభోత్సవం జరిపారు.

సెప్టెంబరు 15; అఖిల భారత చేనేత బోర్డు 18 వ సమావేశాన్ని అంతర్జాతీయ వాణిజ్య కేంద్ర మంత్రి బొంబాయిలో ప్రారంభించారు.

సెప్టెంబరు 16: తూర్పు మండలంలోని విద్యార్థులు దక్షిణ భారత భాషలైన తెలుగు, తమిళం, మళయాళం, కన్నడం భాషల నభ్యసించడానికి వారికి ప్రత్యేక సౌకర్యాలను కల్పించాలని తూర్పు మండలపు కౌన్సిల్ నిశ్చయించింది.

విదేశాలలో

ఆగస్టు 25: హవానా రేవుపై కొన్ని సాయుధ నౌకలు కాల్పులు జరిపాయి. ఈ ముట్టడికి అమెరికా ప్రభుత్వానిదే బాధ్యత అని క్యూబా ప్రధాన మంత్రి అన్నారు.

ఆగస్టు 27: వీనస్ గ్రహం వద్దకు అమెరికా పంపనిర్ణయించిన మెరైనర్_2 అంతరిక్ష నౌకను అంతరిక్షంలోకి ప్రయోగించారు.

సెప్టెంబరు 2: ఇరాన్‌లో బ్రహ్మాండమైన భూకంపం సంభవించి అపారమైన నష్టం వాటిల్లింది.

సెప్టెంబరు 4: కాటాంగాను కాంగోతో తిరిగి కలిపే ఉథాంట్ పథకాన్ని ప్రెసిడెంట్ షోంబే అంగీకరించాడు.

సెప్టెంబరు 5: అల్జీరియా అంతర్యుద్ధం పూర్తయి, ఒక ఒప్పందం కుదిరిందనీ అహమ్మద్‌బెన్ బెల్లా ప్రకటించారు.

సెప్టెంబరు 14: ప్రపంచ బ్యాంకుకు అనుబంధంగా వున్న ఇంటర్నేషనల్ డెవలప్‌మెంట్ అసోసియేషన్ తంతి తపాలా సర్వీసుల అభివృద్ధికి భారతదేశానికి 42 మిలియన్ల డాలర్లను ఇచ్చింది.



సత్యాహింసలను వ్యష్టిసాధనకేగాక, వివిధవర్గాల, జాతుల సంఘాల సమిష్టిసాధనకు కూడా వినియోగింపజేయవలసిన అవసరం వున్నది. అదే నేను కనే స్వప్నం. అందుకోసమే నేను జీవిస్తాను మరణిస్తాను. దీనియందలి విశ్వాస బలం చేత రోజు రోజుకూ నూతన సత్యాలు నేను కనుక్కోగలుగుతున్నాను. అహింస ఆత్మగుణం. కాబట్టి అందరూ అన్ని వ్యవహారాల్లోనూ దీనిని అనుష్ఠించవచ్చు_

_మహాత్మాగాంధి

గ్రాంథికాంధ్ర భాషాక్షీరార్ణవ “రాజహంస” చిన్మయసూరి చిన్నయసూరి జీవిత-ప్రశంసలు

గ్రాంథిక భాషా వ్యాకరణ ప్రపంచంలో అసమాన ప్రతిభా శాలిగా అసాధారణ సూత్ర రచనాశక్తి యుక్తుడుగా యుగపురుషుడుగా పేర్కొన దగినవాడు పరవస్తు చిన్నయసూరి. చిన్నయ సూరి నీతి చంద్రికబాల వ్యాకరణాలు రెండూ గ్రాంథికాంధ్ర–వచన రచనలకు వ్యాకరణాలకు తలమానికం వంటివి. 'బాల వ్యాకరణ' మన్న పేరులో ఉన్న బాల శబ్దాన్ని చూచి దాన్ని బడి పిల్లల కోసం చిన్నయ్య రచించాడని ఇటీవల కొందరు భావిస్తున్నారు. 'జ్ఞానధారణ పటుర్బాలః' అన్నది బాలశబ్ద నిర్వచనం–జ్ఞానధారణ పటుత్వం ఉన్నవారు చదువదగిన వ్యాకరణమని దాని కర్థం. చిన్నయ సూరికి బాగాతర్వాత ఆంధ్రభాషలో గ్రాంథిక వ్యావహారికాల పేరుతో రెండు చీలికలేర్పడ్డాయి. నిజానికి ఈ రోజుల్లో చిన్నయ సూరే సజీవుడై ఉంటే ఆయనే వ్యావహారిక భాషా వ్యాకరణం వ్రాయడానికి సమకట్టేవాడు. చిన్నయ నాటికి ఆంధ్రంలో భాషా పరిణామ స్వభావ వివేచనా పరిశోధనా దృక్పథమే రాలేదు. అందువల్ల కొంత కొంత రచన ఉన్నా వ్యావహారిక భాషా వాదం మాత్రం బైలు దేర లేదు. అప్పుడే యీ వాదం బైలు దేరి ఉంటే భాషా తత్వాన్ని గుర్తించడంతోపాటు చిన్నయ సూరి వ్యావహారికంవైపు మొగ్గుచూపేవాడు. ఆధునిక సాహిత్యంలో యుగపురుషులెవరని విభిన్నాభిప్రాయములు వినవస్తున్నాయి. యుగపురుషులొక్కరే ఉండనక్కరలేదు. విషయవైవిధ్యంలో యుగపురుషానేకత్వం కూడా సహజంగానే రూపొందుతుంది. వ్యావహారిక భాషా దృష్టితో గురజాడ గిడుగు లిద్దరూ యుగపురుషులే. సంఘ సంస్కరణాదివిషయాల్లో కందుకూరి యుగపురుషుడు. పాతవాటిని కాదని కొత్త పురాణాన్ని నిర్మించడంలో త్రిపురనేని యుగపురుషుడు. కవితను ప్రజలకు సన్నిహితం చెయ్యడంలో తిరుపతి వెంకట కవులు యుగ పురుషులు.

గ్రంథ సమీక్ష

ఇట్లాగే గ్రాంథిక భాషా చరిత్రలో చిట్టచివరగా ఉద్భవించిన ప్రత్యేక మౌలికతగల యుగ పురుషుడు చిన్నయ సూరి. ఒప్పును గొప్పగా గుర్తించి మెప్పుల్ని గుప్పించడంలో చూపే ఉత్సాహం తప్పుల్ని తప్పులుగా గుర్తింపచెయ్యడంలో కనిపించడం లేదీనాడు. కాగా చిన్నయ వ్యాకరణంలో ఏమైనా తప్పులు చూపిస్తే ఆ చూపించిన వారిని చిన్నయ అంటే గిట్టనివారుగా చిత్రిస్తున్నారు కొందరు. ఇది ఆరోగ్యకరమైన పద్ధతి కాదు. యుగ పురుషుడన్నంత మాత్రాన ఆయన వ్రాసిన తప్పులన్నిటిని ఒప్పులుగా అంగీకరించాలనడం సరికాదు. తప్పులున్నంత మాత్రాన యుగ పురుషుడు కాడనడమూ సరికాదు. చిన్నయ ఒక్క వ్యాకరణ రచనకేకాదు వచన రచనకు కూడా యుగ పురుషుడే. ఇటీవల చిన్నయ సూరి శతజయంత్యుత్సవాలను ఆంధ్ర ప్రదేశ్ సాహిత్య ఎకాడమీ జరపడం ముదావహమైన విషయం. ఈ ఉత్సవాల సందర్భంగా 'చిన్నయ సూరి జీవితము' ను విద్యా రత్న శ్రీ నిడదవోలు వెంకటరావుగారు రచించి ఎకాడమీ సహాయంతో ముద్రించి ప్రకటించారు. ఇందులో లోగడ చిన్నయ సూరి రచించిన 'హిందూ ధర్మ శాస్త్ర సంగ్రహము' ను కూడా చేర్చి ప్రకటించారు. (జీవితము 103 పుటలు–హిందూ ధర్మ శాస్త్ర సంగ్రహము 136 పుటలు. గ్రంథం వెల రూ. 3.00. ప్రాప్తిస్థానం–శ్రీ నిడుదవోలు వెంకటరావు, 81, కార్నేశ్వర్ కోయిల్ స్ట్రీట్, మైలాపూర్, మద్రాసు-4). చిన్నయ సూరి జీవితంలో జననాదిగా విద్యాభ్యాసం పాండిత్య ప్రకర్ష–ఉద్యోగ ప్రయత్నాలు–పండిత పదవి, వచన రచన, వ్యాకరణ రచన, బాల వ్యాకరణ రచన మొదలైన ఇతర రచనా విశేషాలతోపాటు సూరి శిష్యవర్గ విషయాలు కూడా ఇందులో పొందు పరచ బడ్డాయి. రెండవ గ్రంధం చిన్నయ సూరి గారి

అనువాద రచన—థామస్ లంస్డ స్ట్రేంజి వ్రాసిన 'ఎలిమెంట్స్ ఆఫ్ హిందూ లా' అన్న గ్రంథానికి తెలుగు సేత. ఇది తొలుత 1858 లో ప్రకటింప బడింది. తిరిగి ఇప్పుడు ముద్రింప బడింది. మన సంఘ వ్యవస్థాపరిణామాన్ని సామాన్యంగా సంఘనియమ స్వభావాన్ని గుర్తించ డానికి తెలుగు వారికిది బాగా ఉపకరిస్తుంద నడంలో సందేహం లేదు. ఈ రెండు గ్రంథాలనూ వెలువరించిన శ్రీ వెంకటరావు గారు, దీని ముద్రణలో సహాయపడిన ఎకాడమీ వారు అభినందనీయులు.

చిన్నయసూరి

ఈ శత జయంత్యుత్సవాలను పురస్కరించుకొని చిన్నయ సూరి ప్రశంసాపరంగా వెలువడిన చిన్న పద్యకృతి "చిన్నయ సూరి" — రచయిత శ్రీ అద్దేపల్లి నాగ గోపాలరావు (ప్రతులకు — పద్మా పబ్లికేషన్సు — ఏలూరు — పశ్చిమగోదావరి జిల్లా — వెల. 40 నయాపైసలు.) ఇరవై పద్యాలున్న యీ చిరుపొత్తంలో చిన్నయసూరి ప్రతిభాపాండిత్యాలకు ప్రతికృతులన దగిన పద్యాలు కొన్ని ఉన్నాయి. కవిత సరళమై సహజ ధారా సంశోభితమై ఉంది. చిన్నయసూరి రచనల్లో తప్పులున్నవన్న వారంతా ఆయనకు వ్యతిరేకులనుకొనడం — ఆయన వ్రాసింది ప్రతి అక్షరమూ తప్పడానికి వీలులేనిది పరమ ప్రామాణికమైనది అనుకొనడం పెద్ద అనారోగ్యంగా విజ్ఞులు భావిస్తారు. చిన్నయ బాల వ్యాకరణం మాత్రమే ప్రామాణికమైనదైతే ఆయనే "బాల వ్యాకరణ శేషం" అంటూ మరో వ్యాకరణం వ్రాయవలసిన అవసరం లేనేలేదు. ఈ మాట అన్నంత మాత్రాన ఆయన బాల వ్యాకరణ స్థానానికి లోటు ఏర్పడదు. చిన్నయ రచన గొప్పదే అందుకేవిధమైన సందేహమూ లేదు. అయితే చిన్నయ్య ఒక్కడే గొప్పవాడు కాదు. చిన్నయను గొప్పవాడనడానికి యితరులను పనికిరానివారినిగా మనం చిత్రించనక్కరలేదు. "నీ చెప్పిన చొప్పునన్ రసము చిందుచు విందొనరించి కబ్బముల్ చెప్పగలారెవారు" అన్నారు గోపాలరావుగారు. నిజం చెప్పలేదు. ఆయన చెప్పినట్లు అందరూ చెప్పితే యింక ఆయన ప్రత్యేకత ఏముంది? "వారు" అనడంలో తప్పులు పట్టేవారినే నాగగోపాలరావుగారుద్దేశించారనుకోండి. తప్పుల విషయం విడచిపెడదాం. చిన్నయ రచనతో తులతూగేట్లు తప్పులు పట్టేవారు మాత్రమే కాదు ఒక్క ఒప్పులు పట్టేవారే కాదు నన్నయాదులైనా రచన చెయ్యగలరా అంటే చెయ్య గలరని విజ్ఞులెవ్వరూ సమాధానం చెప్పరు. నన్నయాదుల రచనలవంటి రచనలను చిన్నయసూరి చెయ్యగలడా అంటే చెయ్యగలడని యెవ్వరూ సమాధానం చెప్పరు. చివరకి చిన్నయకూడా చెప్పడు. చెయ్యలేనని చేతులు జోడిస్తాడు. ఒక్కొక్క దృక్పథంతో చూస్తే ఒక్కొక్కరి గొప్పతనం ఒక్కొక్కవిధంగా ప్రఫుల్లమై గోచరిస్తుంది. మౌలికంగా భాసించే ఆ ప్రత్యేకతను గుర్తించి అందరినీ ఎవరి ప్రత్యేకతతో వారిని ఆరాధించడం ఉత్తమం. నన్నెచోడ, నన్నయ, తిక్కన, యెర్రనాది కవులంతా గొప్పవారే. అయితే వారి అందరి గొప్పతనమూ ఒకేమూసలో పొయ్యడానికి వీలైంది కాదు. ఈ దృష్టితో గొప్ప వారిలో చిన్నయసూరి ఒకడు — యుగపురుషుల్లో చిన్నయసూరి ఒకడు అనడం సమంజసంగా ఉంటుంది. చిన్నయసూరి అముద్రిత గ్రంథాలు కొన్ని లండన్‌లో ఇప్పటికీ ఉన్నాయి. వాటిని తెప్పించి సాహిత్య ఎకాడమీవారు ముద్రింపించితే యెంతైనా సాహిత్యోపకారం జరుగుతుంది. అనేక రగడలకు దారితీసిన "హరికారికావళి" కూడా చిన్నయసూరి రచనే అని కొన్ని కారణాలవల్ల నాకు తోస్తున్నది. ఇవన్నీ పునర్ముద్రితాలు కావలసిన అవసరం యెంతైనా ఉంది.

"వాఙ్మయ మహాధ్యక్ష"

Edited & Published by the Director of Information and Public Relations, Andhra Pradesh, Hyderabad-1
Printed at Vir Milap Press, Mukarramjahi Road, Hyderabad.

రచయితలు

గవర్నర్, జనరల్ ఎస్. ఎమ్. శ్రీ నగేష్—హైద్రాబాద్

శ్రీ బోయి భీమన్న, ట్రాన్స్‌లేటర్, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, హైదరాబాద్

‘‘ఉదయభాను’’, హైదరాబాద్

శ్రీ తెన్నేటి విశ్వనాథం, యం. యల్. ఎ. విశాఖపట్నం

శ్రీ బి. యన్. శాస్త్రి, యం. ఏ. నారాయణగూడా, హైదరాబాద్

శ్రీ వావిలాల గోపాలకృష్ణయ్య, యం. యల్. ఏ. సత్తెనపల్లి గుంటూరుజిల్లా

శ్రీ వి. రామలింగారెడ్డి బి. ఎ. (ఆనర్స్) నంద్యాల, కర్నూలుజిల్లా

శ్రీ “కొలకలూరి” ఇనాక్, అసిస్టెంట్ లెక్చరర్, ప్రభుత్వకళాశాల అనంతపురం

శ్రీ ప్రభాకర్‌జీ, భూదానోద్యమ కార్యాలయం, గాంధీభవనం, హైదరాబాద్

శ్రీ పాలా వెంకటసుబ్బయ్య, నాగరాజుపేట, కడప

శ్రీ మామిడిపూడి వెంకటరంగయ్య, మారేడుపల్లి, సికిందరాబాద్

శ్రీ బృందావనం రంగాచార్య, పరుచూరు, గుంటూరు జిల్లా

“విజయ’’—

శ్రీ ముద్దంశెట్టి హనుమంతరావు, ఖరగ్‌పూర్

శ్రీ మల్లంపల్లి సోమశేఖరశర్మ, ఆంధ్ర విశ్వవిద్యాలయం, వాల్తేరు

శ్రీ బొడ్డు బాపిరాజు, ఏలూరు

శ్రీ డి. వెంకటసుబ్బారావు, త్రిమల్‌ఘిరి, సికిందరాబాద్

శ్రీ దామెర రాజగోపాలరావు, చిత్రాడ, తూర్పు గోదావరి జిల్లా

"ఆంధ్ర ప్రదేశ్"

(తెలుగు, ఇంగ్లీషు, ఉర్దు, హిందీ) మాసపత్రిక ప్రకటన రేట్లు.

దిగువ రేట్లననుసరించి 'ఆంధ్రప్రదేశ్' మాసపత్రికలో ప్రకటనలు స్వీకరించబడగలవు

వివరాలు	నాలుగు సంచికలలో			ఒక సంచికలో మాత్రమే		
	పూర్తి పేజీ	సగం పేజీ	పావు పేజీ	పూర్తి పేజీ	సగం పేజీ	పావు పేజీ
	రూ	రూ	రూ	రూ	రూ	రూ
లోపలి పేజీ	300	50	00	00	55	30
వెనుకఅట్ట పేజీ (4)	400	—	—	50	—	—
అట్ట 2, 3 పేజీలు	350	—	—	25	—	—

ఒక సంవత్సరం కంట్రాక్టు ప్రకటనలకు 20 శతి రిబేటు ఇవ్వబడును.

నిబంధనలు

. మెకానికల్ వివరాలు: $0\frac{3}{4}'' \times 8\frac{1}{2}''$ డెమ్మి.


2. ముందు అట్ట టైటిల్ పేజీకై ప్రకటనలు స్వీకరించబడవు.
3. పావుపేజీకి తక్కువగాఉన్న ప్రకటనలు స్వీకరించబడవు.
4. వచ్చే సంచికలో ప్రచురించడానికి వీలుగా స్థలం వివరాలు, డబ్బుతోసహా ప్రకటన సమాచారాన్ని ప్రతినెల 8 వ తేదీలోపుగా యీ కార్యాలయానికి పంపాలి. క్రాస్‌చేయని డిమాండ్ డ్రాఫ్ట్‌ద్వారాగానీ, మనియార్డరుద్వారాగానీ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సమాచార, ప్రజాసంబంధముల శాఖ డైరెక్టరు హైదరాబాదుపేర డబ్బునుపంపాలి.
5. బ్లాకుల విషయంలో అన్ని విధాలా శ్రద్ధ తీసుకోబడుతుంది, అయితే మిషనుపై బ్లాకులు పగిలిన యెడల యీ శాఖ బాధ్యత వహించదు.
6. ప్రకటన విధం, స్థలం వివరాలను, ఒక సంచికలో ప్రకటించాలో (భాషనుతెల్పాలి)లేక 4 సంచికలలో ప్రకటించాలో స్పష్టంగా పేర్కొనాలి.
7. డబ్బు చెల్లింపు, యితర ప్రత్యుత్తరాలను దిగువ వారితో జరుపాలి:—

డైరెక్టర్,
సమాచార ప్రజాసంబంధాల శాఖ,
ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం
హైదరాబాద్—1




విద్యాసంచిక

"సింక్రోట్రోన్" డ్రిఫ్టు ట్యూబులలో ఒకదానిలోనుంచి పరిశీలిస్తున్న వైజ్ఞానికుడు



హైదరాబాదులోని ప్రభుత్వ పాఠ్య పుస్తకాల ముద్రణాలయం చిత్రం.



పాఠ్య పుస్తకాల ముద్రణాలయంలోని రెండు రంగుల ఆఫ్-సెట్ ముద్రణాయంత్రం విభాగం.

(ఈ రెండూ చిత్రాలను గురించిన వివరాలకై చూ. LVIII-LXI పుటల్లో ఉన్న వ్యాసం.)

ఆంధ్రప్రదేశ్

(సచిత్ర మాస పత్రిక)

ఆశ్వయుజ-కార్తీక 1884 శకం

అక్టోబరు, 1962

★

విద్యయొసఁగును వినయంబు వినయమునను
బడయుఁబాత్రత పాత్రతవలన ధనము
ధనమువలనను దానంబు దానివలన
నైహికాముష్మికఫలంబు లందు నరుఁడు.

తిక్కన: భారతం.

★

విద్యాసంచిక

(అనుబంధం)

విషయసూచిక

ప్రాథమిక పాఠశాలలలో

మధ్యాహ్న భోజనం

శ్రీ సి. వి. హెచ్. రావు

ఆంధ్రప్రదేశ్‌లో బడిపిల్లలకు కేర్ (Care) సంస్థ మధ్యాహ్న భోజన పథకానికి ఇండియాలోని అమెరికా రాయబారి ప్రొఫెసర్ జె. కె. గాల్ బెత్ 1962 జూలై మూడవ తేదీన నరసాపూర్ పంచాయతీసమితిలో ప్రారంభోత్సవం చేశారు. ఆ ప్రారంభోత్సవం—ఆరు నుంచి పదకొండు సంవత్సరాల మధ్య వయసు గల బాల బాలికలకు ప్రాథమిక విద్యా విధానాన్ని సర్వత్రా అమలు జరుపుతున్న రాష్ట్ర ప్రభుత్వాలకు సహాయం చేసే—భారత ప్రభుత్వ పథకమైన విద్యా—బలవర్ధకాహార కార్యక్రమానికి అమెరికా చేస్తున్న సహాయానికి చిహ్నం. ఈ కేర్ సంస్థ కార్యక్రమం రాష్ట్రంలోని ప్రాథమిక పాఠశాలలలో గల రెండు లక్షల మంది (తెలంగాణా ప్రాంతంలో 1,50,000 ఆంధ్ర ప్రాంతంలో 50,000) బాలబాలికలకు వర్తిస్తుంది. ఈ పథకం వల్ల వారికి బలవర్ధకమైన మధ్యాహ్న భోజనం లభిస్తుంది. ఈ కార్యక్రమం క్రింద ప్రస్తుత సంవత్సరంలో కేర్ సంస్థ ఇచ్చే ఆహార పదార్థాల విలువ రూ. 12,50,000 లని అంచనా. కాగా రాష్ట్ర ప్రభుత్వం రూ. 6,66,000 ల వివాళం ఇస్తుంది. ఆంధ్రప్రదేశ్‌కు 2½ లక్షల పౌన్ల మొక్కజొన్న ఆహారం, 2½ లక్షల పౌన్ల పాలపొడి, 12,50,000 పౌనుల మంచినూనె లభిస్తాయి. ఈ పథకం రాష్ట్ర విద్యా శాఖ పర్యవేక్షణ క్రింద పంచాయతీ సమితుల ద్వారా నిర్వహించబడుతుంది. ఈ పథకం సక్రమంగా శక్తివంతంగా సాగడానికి స్థానిక ప్రజలతో పాఠశాలల స్థాయిలో మధ్యాహ్న భోజన సంఘాలను ఏర్పాటు చేస్తారు.

భారత దేశ తృతీయ పంచవర్ష ప్రణాళికలో 6–11 సంవత్సరాల మధ్యవయసుగల బాల బాలికలకు నిర్బంధోచిత ప్రాథమిక విద్యా పథకాన్ని ప్రవేశపెట్టే కార్యక్రమం విస్తృత విద్యా కార్యక్రమంలో ఒక విశిష్టమైన స్థానాన్ని ఆక్రమిస్తుంది. తగినంత ధనం, సుశిక్షితులైన ఉపాధ్యాయులు లేరనిమనం ఒప్పుకున్నప్పటికి కూడా ఈ పథకం అమలులో ఇప్పటికే జాప్యం జరిగింది. ఈ ఆశయం నిస్సందేహంగా ప్రశంసార్హమైంది. ఇవేగాక మరికొన్ని ఆటంకాలు కూడావున్నాయి. బాలలను పాఠశాలలకు పంపడం డబ్బును, విద్యాశక్తిని వృధా చేయడమే అనే భావం ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాలలో వుంది. గ్రామీణ ప్రాంతాల్లో అనాది నుంచి—ఆడపిల్ల గాని మొగపిల్లవాడు గాని ఇంటివగ్గుంటే పొలాల్లో పనికైపనికివస్తారనే—భావం వుంది ఒకచిన్న భూఖండం వున్న ఒక బీద కుటుంబానికి ఆ భూ ఖండాన్ని ఆకుటుంబ సభ్యులతోనే సాగుచేయడానికి కొడుకువల్లగాని కూతురువల్లగాని ఆర్థికంగా లాభం కలుగుతుంది. తత్ఫలితంగా ఆ పసివారికి విద్యా సౌకర్యం శూన్యమై, బాధ్యతగల విద్యావంతులైన పౌరులుగా మారడానికి నిరోధం కలుగుతుంది.

ఈ విశిష్టమైన విద్య ప్రతి బాలికకు బాలునికి లభ్యంకావాలి. అంతేగాక రాజకీయ ప్రజాస్వామ్యం విజయవంతం కావడానికి, విద్యావంతుడైన ఒక బాలుడు ఒక కళాకారుడుగా, ఒక మెకానిక్‌గా, ఒక రైతుగా పెరగడానికి గాని, బాలికైతే ఒక మాతృమూర్తిగా గాని, తన భర్త వ్యవహారాల్లో జీవిత భాగస్వామిగా కావడానికి గాని ఆ విద్య ఎంతో ఉపయోగిస్తుంది. ఇందువల్ల నిర్బంధ ప్రాథమిక విద్యా కార్యక్రమం అమలుకు తగిన డబ్బును సేకరించడం అవసరమని తేలుతుంది.

బాలికల విద్య

తృతీయ ప్రణాళికలో ఇతర విషయాలతో పాటు "6–11 సంవత్సరాల మధ్య వయసుగల బాలబాలికలకు విద్యా సౌకర్యాలను

కల్పించడం" అవసరమని తృతీయ ప్రణాళికలో గట్టిగా భావించారు. అంతేగాక ప్రణాళికలో "బాల బాలికల విద్యాభివృద్ధి స్థాయిలో ప్రస్తుతంవున్న ఎక్కువ తక్కువ భావాలు సమసి పోవడానికై బాలికల విద్యపట్ల దృక్పథాన్ని కేంద్రీకరించాలని" కూడా భావించారు.

తృతీయ ప్రణాళికలో తలపెట్టిన ఈ ఆశయాల సాధనలో ఎదుర్కొనవలసిన ముఖ్య సమస్యలలో మొదటిదిగా పేర్కొనదగినవి: బాలబాలికలను తగినంత సంఖ్యలో పాఠశాలలలో చేర్చడంలో సాధక బాధకాలు, కొన్ని ప్రాంతాల వెనుకబడిన స్థితిగతులు, కొన్ని వర్గాల ప్రజలు తమ పిల్లలు కొంత ఎదగగానే కుటుంబాదాయానికి తోడ్పడగలరనే ఉద్దేశంతో పిల్లలకు చదువు మాన్పించడంవల్ల ఐదింట ఒక వంతు మంది పిల్లలు నాలుగవ తరగతి వరకు కూడా చదవ లేకుండా శాశ్వతంగా విద్యా ప్రయోజనాన్ని పొందలేక పోతున్నారు. కనుక ఇందుకు ముఖ్యంగా పిల్లలను పాఠశాలలకు పంపేట్లు తల్లి దండ్రులకు నచ్చచెప్పాలి. ఆ తర్వాత ఆ పిల్లలు నాలుగవ తరగతి వరకు ప్రాథమిక విద్యను పూర్తి చేయడానికి ఐదేళ్ళపాటు పాఠశాలలలో చదివించడానికి కూడా తల్లిదండ్రులకు నచ్చజెప్పాలి.

ఈ సమస్యలు ఎంతో కాలంనుంచి వుండడం, వాటి నిర్మూలనకు ఏ ఒక్క పరిష్కార మార్గాన్ని నిర్ణయించక పోవడం అనేది ముమ్మాటికి నిజం. కనుక పిల్లలను పాఠశాలలకు సక్రమంగా పంపడానికి తల్లి దండ్రులలో వున్న అయిష్టతను తొలగించడానికి వీలుగా తగిన సౌకర్యాలను, నిబంధనలను ఏర్పాటు చేయడం ప్రాథమికావసరం. పిల్లలు పాఠశాలలకు హాజరు కావడం వల్ల వారికి విద్యలభించడమేగాక ఇంకా ఇతర ప్రయోజనాలు కూడా కలగగలవని తల్లిదండ్రులకు నచ్చజెప్పాలి. పిల్లలను పాఠశాలలకు పంపని పక్షంలో చట్టబద్ధమైన చర్యతీసుకోబడుతుందని తల్లిదండ్రులను హెచ్చరించాలి. ఆంధ్రలో ప్రాథమిక విద్యను ప్రవేశపెట్టినపుడు ఈ విషయం గతానుభవమే: పాఠశాలల వేళలలో పిల్లలకు భోజన సదుపాయాన్ని కల్గించడం అనేది ఆర్థిక వాదానికి తోడ్పడుతుంది.

ఈ సందర్భంగా ప్రాథమిక పాఠశాలలలో బాలలకు మధ్యాహ్న భోజన వసతి కార్యక్రమం ఒక విశిష్ట ప్రాముఖ్యతను పొందింది. తమ పిల్లలను పాఠశాలలలో చేర్చడానికి ప్రోత్సహించడానికవసరమైన వాటిలో ఈ పథకం పెక్కు బీదకుటుంబాలలో ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాలలో బలవర్ధ కాహారం లభించే సౌకర్యంలేని పెక్కు మంది బాలల బలవర్థకాహార ప్రమాణాల పెరుగుదలకు కూడా తోడ్పడుతుంది.

పటిష్టమైన సాధనాలు

భారత దేశంలో విద్యా సమస్యలను పరిశోధించిన పెక్కు కమిటీలు ఈ మధ్యాహ్న భోజనాల వల్ల పాఠశాలలలో పిల్లల హాజరు సంఖ్య పెరగడమేగాక వారి బలవర్ధక ప్రమాణాలు పెంపొందగలవని, బాలల ప్రగతి, సంక్షేమాలకై తలపెట్టిన పథకాలలో దీనికి కూడా స్థానం ఏర్పడగలదని భావించాయి. ఆ విధంగా వివిధ రాష్ట్రాలలో అమలు జరుపుతున్న బాలల సమైక్యాభివృద్ధిని పైలట్ పథకాలలో ఒక. భాగంగా దాన్ని చేర్చారు.

ఉదాహరణకు 1959లో శ్రీ విద్యా భారత జాతీయ సంఘం ప్రాథమిక పాఠశాలలలో బాలికలను చేర్చడానికి పాఠశాలా సౌకర్యాలనేగాక "తల్లిదండ్రులు తమ పిల్లలను పాఠశాలలకు పంపడానికై మధ్యాహ్న భోజన సదుపాయాల సౌకర్యాన్ని ఏర్పాటు చేయా"లని భావించింది. ఈ సంఘం ఈ సందర్భంగా మద్రాసు, కేరళ రాష్ట్రాల అనుభవాన్ని ప్రస్తావించి "ఈ పథకం బాలికలను పాఠశాలలలో చేర్చడంలో విజయాన్ని సాధించి అనవసరమైన వ్యయాన్ని నిర్మూలించింది. వివిధ వర్గాల వారు—బాలురు, బాలికలు—ఒకే పంక్తిన కలసికూర్చొని భోజనం చేయడం వల్ల సాంఘిక కట్టుబాట్లు, వర్గభేదాలు, ఇతర కట్టుబాట్లు క్రమక్రమేణ విచ్ఛిత్తి అయి వారి మనసుల్లో సోదరభావం ఏర్పడుతుంది" అని వాక్రుచ్చింది. కేంద్ర ప్రభుత్వం ఈ పథకం అవకాశాన్ని విస్తృతం చేసి దానిని "ప్రాథమిక పాఠశాలా కార్యక్రమంలో ఒక శాశ్వత భాగంగా చేయా"లని ఆ సంఘం సిఫార్సు చేసింది.

ప్రణాళిక పథకాల సంఘం నియమించిన సాంఘిక సంక్షేమానికి చెందిన పరిశీలక బృందం కూడా ఈ కార్యక్రమం ప్రాముఖ్యతను నొక్కి చెబుతూ "బలవర్ధకాహారంలేక బాధపడుతున్న పెక్కుమందిబాలలకు చౌకలో సమపాళ్ళలో ఆహారాన్నివ్వడం వల్ల ఒక ప్రత్యేక ప్రయోజనం చేకూరుతుంది" అని వివరించింది "అద్యతన భావిలో ఈ పథకాన్ని పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో ప్రాథమిక పాఠశాలలకు వెళ్ళే పిల్లలకు ముఖ్యంగా అల్పాదాయ

వర్గాలవారికి ప్రాముఖ్యత ఇస్తూ విస్తరింపచేయడానికి దృష్టిని కేంద్రీకరించాలని అది సిఫార్సు చేసింది.

శ్రీమతి రేణుకా రే అధ్యక్షతన గల పాఠశాలల ఆరోగ్య సంఘం ఈ పథకాన్ని సమర్థిస్తూ గట్టిగా సిఫార్సు చేయడమేగాక దేశం మొత్తంమీద వున్న ఐదు వేల బ్లాకులలో దీన్ని ప్రవేశపెట్టాలని సూచించింది. ఈ పథకం అమలుకు తృతీయ ప్రణాళికలో 144 కోట్ల రూపాయల ఖర్చును ఈ సంఘం అంచనా వేసింది. ఈ మొత్తాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్థానిక సంస్థలు భరిస్తాయి. కేంద్రం వాటా 75 కోట్ల రూపాయలుగాని 50 శాతం గాని వుంటుంది.

ఈ పథకం 1945 లోనే ప్రారంభించిన కీర్తి మద్రాసుకు దక్కుతుంది. ఆ తర్వాత ఈ పథకాన్ని ఇతర రాష్ట్రాలు కేరళ, మైసూరు, ఒరిస్సా, పంజాబ్‌లలో చేపట్టాయి. ఆ వరుసలో తాజాగా చేరింది ఆంధ్రప్రదేశ్. రాజస్థాన్ త్వరలో ఈ పథకాన్ని చేపట్టనున్నది. కేరళలో ఈ పథకం 1.5 మిలియన్ల మంది బాలలకు వర్తిస్తుంది. ద్వితీయ స్థానం గల మద్రాసు రాష్ట్రంలో ఈ పథకం 1.3 మిలియన్ల మంది బాలలకు, పంజాబ్‌లో 5 లక్షల మంది బాలలకు వర్తిస్తుంది. ఇతర రాష్ట్రాలలో ఏడు లక్షల మందికి ఈ పథకం వర్తిస్తుంది. ఆంధ్రప్రదేశ్‌లో ప్రస్తుత సంవత్సరానికి ఈ పథకం గ్రామీణ ప్రాంతాలలోని రెండు లక్షల మంది బాల బాలికలకు ఈ సంవత్సరంలో రెండువందల రోజులు మధ్యాహ్న భోజనం లభిస్తుంది. వచ్చే కొద్ది సంవత్సరాలలో ఈ పథకం వల్ల లాభంపొందేవారి సంఖ్య క్రమంగా పెరుగుతుంది. ఇంకా కొన్ని ఇతర రాష్ట్రాలు మధ్యాహ్న భోజనాల ఖర్చును తమ విద్యా ప్రణాళికలలో చేర్చాయి. మరికొన్ని రాష్ట్రాలు ఆ పనిని అద్యతన భావిలో చేస్తాయి.

కొత్త సూచన

ఈ పథకానికి ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం తృతీయ ప్రణాళికలో 75 లక్షల రూపాయలు కేటాయింపు చేసింది. ఉచిత గ్రంథాలు, స్టేషనరీ సామగ్రి సరఫరా కూడా ఈ కేటాయింపులోనే చేర్చబడ్డాయి. కేరళ ప్రభుత్వం రూ. 103.18 లక్షలు, మద్రాసు, 211.36 లక్షల రూపాయలు, మైసూరు 30 లక్షల రూపాయలు, ఒరిస్సా 40 లక్షల రూపాయిలను తమ ప్రణాళికలలో ఈ పథకానికి కేటాయించాయి. కేంద్రపాలిత ప్రాంతాలైన అండమాన్, నికోబార్ దీవులు, పుదుచ్చేరిలకు కూడా ఇందుకై కొద్ది మొత్తాలు కేటాయించారు. ఈ పథకం ప్రారంభించిన మహారాష్ట్రలో బీద పిల్లలకు మధ్యాహ్న భోజనానికయ్యే ఖర్చులో కొంతభాగాన్ని ఉన్నత కుటుంబాల పిల్లలు భరించాలని ఒక సరికొత్త సూచన చేయబడింది.

ప్రస్తుత అంచనాల ప్రకారం తృతీయ ప్రణాళికాంతానికి 498.4 లక్షలమంది బాలలను ప్రాథమిక పాఠశాలలలో చేర్చుకుంటారు. ఒక్కొక్కరికి రోజుకి మధ్యాహ్న భోజనానికి పది నయాపైసల చొప్పున పాఠశాల పనిచేసే రెండువందల రోజులకు వార్షికంగా మొత్తం మూడువందల కోట్ల రూపాయల ఖర్చు అవుతుంది. ఈ ఖర్చులో కొంత భాగాన్ని రాష్ట్రాలు అంటే మద్రాసు రాష్ట్రంవలె 60 శాతాన్ని భరించాలంటే ఆ మొత్తం 180 కోట్ల రూపాయలు అవుతుంది. ఈ పథకాన్ని అత్యవసరమైన బాలలకి వర్తింపచేయాలన్నా మొత్తం బాలలలో 30 శాతం మందికి వర్తింపచేయాలి. ఇందుకై ప్రభుత్వానికి 90 కోట్ల రూపాయలు వ్యయమవుతుంది.

మధ్యాహ్నభోజనానికి సగటు ఖర్చును పదినయాపైసలుగా అంచనా వేసినా, సహజంగా అది ఒక రాష్ట్రానికి మరొక రాష్ట్రానికి మారుతుంటుంది. మద్రాసు రాష్ట్రంలో సగటును 10 న. పై. లుగా అంచనా వేశారు. అందులో 6 న. పై. లను ప్రభుత్వం ఇస్తుంది. 4 న. పై. లు స్థానిక విరాళాలు. కేరళలో సగటు భోజనం ఖర్చు అంచనా 6 న. పై. లు కాగా ప్రభుత్వం 4 న. పై.లను, విరాళంగా ఇస్తుంది. మిగతా రెండు నయాపైసలు స్థానిక విరాళాలు. ఆంధ్రప్రదేశ్‌లో సగటు అంచనా 16 న. పైలు. ఇందులో 75 శాతాన్ని లేక 12 న. పైలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ నిధులనుంచి విరాళంగా వస్తాయి. మిగతా నాలుగుపైసలు స్థానిక విరాళాలు.

జాతీయ కార్యక్రమం


ఈ మధ్యాహ్న భోజనాల పథకం అమలుకు కేర్ (CARE) యునిసెఫ్ (UNICEF) సంస్థలనుంచి లభిస్తున్న అత్యవసర సహాయం ఎంతైనా ప్రశంసనీయమైనది. రానున్న సంవత్సరాలలో ఈ పథకం పెక్కు ప్రాంతాలలో పెక్కుమంది బాలలకు వర్తింప చేయడానికి ఆ సంస్థలనుంచి మరింత సహాయం లభించగలదని మనం ఆశించవచ్చు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు

స్థానిక సంస్థలు సమన్వయంగా నిర్వహిస్తున్న జాతీయ కార్యక్రమంలో దీన్ని ఒక భాగంగా గమనించాలి. ప్రాథమిక పాఠశాలలలో నూటికి నూరు మంది పిల్లలను చేర్చడమేగాక మరొకవైపు ఆరోగ్య వంతులైన పౌరుల కొత్త తరాన్ని సృష్టించే జాతీయ కార్యక్రమానికి ఈ కృషి సమైక్యమైంది.

రాష్ట్ర వ్యాప్తంగా కొన్ని లక్షల మంది పిల్లలకు ఇంత వ్యయమయ్యే తీవ్ర కార్యక్రమం నిర్వహణకు అన్ని వర్గాల సహకారం, కృషి కావలసి వుంటుంది. నూనెలు, కాయ గూరలు మొదలైన విరాళాలు, సేకరించిన వాటిని దుర్వ్యయం చేయకుండా చూడడం మొదలైన విషయాలలో ఈ సహకారం నానాటికీ అధికంగా లభిస్తున్నది. పంచాయతీ రాజ్యం అమలులో వున్న రాష్ట్రాలలో పంచాయతీలు, పంచాయతీ సమితులు, వాటి ఉప సంఘాలు ఈ వివిధ వర్గాల కృషిని సాధించడంలో పాత్ర వహిస్తున్నాయి. అక్కడి స్థానిక ప్రజల ప్రతినిధులుగా ఆ సంస్థలు నిర్వహించ వలసిన బాధ్యతే ఈ పని. స్థానిక విరాళాలను గ్రామస్థుల ప్రయోజనం కొరకే వినియోగిస్తే వారు విరాళాలను ఇంకా ఉదారంగా ఇస్తారు. ఈ పథకానికయ్యే ఖర్చును కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, స్థానిక సంస్థలు వాటాలు వేసుకొని భరించవలసి వున్నా పంచాయతీరాజ్య వ్యవస్థ అభివృద్ధిచెందిన ఆంధ్రప్రదేశ్‌లో పెక్కు పంచాయతీ సమితులు ఈ కార్యక్రమాన్ని అమలు జరపడంలో అమితోత్సాహాన్ని ప్రదర్శిస్తున్నాయి.

ఈ కేర్ సంస్థ కార్యక్రమం క్రింద పంపుతున్న కొన్ని సరుకులను కేరళలోని ప్రాంతాలలో దుర్వ్యయం చేయడం జరుగుతున్నవనే ఫిర్యాదులు వినవస్తున్నాయని ప్రొఫెసర్ గాల్‌బ్రైత్ తమ నరసాపూర్ ప్రసంగంలో తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌కు సంబంధించినంతవరకు అట్టి ఫిర్యాదులు లేవు. కాని మొత్తంమీద ఇతర రాష్ట్రాలకు ఇదొక హెచ్చరికవంటిది. స్థానిక సాంఘికసంక్షేమాధికారి, విద్యాశాఖాధికారి, ఒక రిద్దరు స్థానిక సభ్యులు, ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, ఇంకా ఇతర ఉపాధ్యాయులు వున్న స్థానిక కమిటీ పర్యవేక్షణ క్రింద ఆ లోపాలను నిర్మూలించవచ్చు. ఈ పథకం అమలులోవున్న కొన్ని గ్రామాలకు కలిపి ఇటువంటి కమిటీలుండడం వల్ల ఈ భోజనవసతి అర్హులైన బాలబాలికలకే లభ్యమయ్యేట్లు చూడడానికి వీలుంటుంది.

ఈ కార్యక్రమాన్ని, దాని ప్రభావాన్ని, ఫలితాలను రాష్ట్ర ప్రభుత్వం తరచు ఒక నిపుణునిచేత అంచనా వేయించడం మంచిదని నా సలహా. విదేశీ సంస్థలనుండి వచ్చే సహాయాన్ని, స్థానిక సంస్థల ఆహార పదార్థాల విరాళాలు దుర్వ్యయం కాకుండా చూడడమేగాక ఈ పథకం అమలులో తలఎత్తే కొన్ని అవాంతరాలను ఎదుర్కొనడం కూడా అవసరం. ఉదాహరణకు పాఠశాల బృందం, ఉపాధ్యాయులు లెక్కలను సకాలంలో సక్రమంగా వుంచడం, వంట, ఆహార పదార్థాల పంపిణీ అజమాయిషీ మొదలైన వాటికి సమయాన్ని వినియోగించడం వల్ల వారి బోధనా విధిలో ఏవైనా ఆటంకాలు తల ఎత్తుతవేమో అన్న విషయాన్ని పరిశీలించాలి. ఇటువంటి అవాంతరాలను ఎదుర్కొనడానికి వీలుగా తగిన చర్యలను తీసుకోవాలి.



స్కాలర్ షిప్పులు

శ్రీ ఆర్. హెచ్. పి. హాల్మన్.
ఎం. ఏ., ఎల్. టి.

విద్యాభ్యాసం చేసే ప్రతివ్యక్తికి కూడా ప్రాతిపదికగా కొన్ని అవసరాలుంటాయి. వాటిని స్థూలంగా దిగువ విధంగా వర్గీకరించవచ్చు:—

1. విద్యా సముపార్జనమునకు సంబంధించిన అవసరాలు

విద్యాభ్యాసానికై అన్ని హంగులు గల సంస్థ, సరి అయిన ఉపాధ్యాయులు అతనికి అవసరం.

2. ఆర్థికావసరాలు

ఆహారం, వస్త్రాలు, వసతి సౌకర్యాలు అతనికి అవసరమవుతాయి.

సమాజపు సాధన సంపత్తులన్నీ ప్రభుత్వ గుప్పిట్లో వుండే నియంతృత్వ దేశాలలో విద్యార్థులయొక్క ఈ అవసరాలను తీర్చే బాధ్యతను ప్రభుత్వమే వహిస్తుంది. పూర్తిగా పెట్టుబడిదారీ దేశాలైన వాటిలో (సైద్ధాంతికంగా గాక వాస్తవంగా వుంటే) ఈ సదుపాయాలను సమకూర్చే బాధ్యత సమాజంలోని వ్యక్తులపై వుంటుంది. కాని ప్రజాస్వామిక దేశాలలో రాజీమార్గాన్ని అవలంబించవల్సి వస్తుంది. ఈ అవసరాల్లో ప్రభుత్వం ఎన్నింటిని తీర్చాలో, వ్యక్తిగతంగా సమాజ సభ్యులు ఎన్నింటిని సమకూర్చాలో ప్రభుత్వం నిర్ణయించవలసి వుంటుంది.

అనేక ప్రజాస్వామిక దేశాలలో ప్రభుత్వం మామూలుగా విద్యాశాఖకు కేటాయించిన మొత్తాలలో అధిక భాగాన్ని విద్యాబోధనకు సంబంధించిన అవసరాలను తీర్చడానికి వినియోగిస్తుంది. ఈ అవసరాలను తీర్చేపని వ్యక్తుల పరంగా జరిగినప్పుడు వారు స్వార్థం, సంకుచితత్వం వంటి వాటికి లోనుకావడం సంభవం కనుక ధనాఢ్యుల ప్రాబల్యం వుండే ప్రదేశాలలో విద్యా సౌకర్యాలు మిక్కుటంగా వుండటం, మిగతా ప్రాంతాలలో ఇలాంటి సౌకర్యాలు తగినంతగా లేకపోవడం, కొన్నింటిని వీటినుంచి పూర్తిగానే ఉపేక్షించడం జరుగుతుంది. విద్యా సౌకర్యాలను సమానంగా కలిగించడం ప్రజాస్వామిక దేశంలో అవసరం కాబట్టి సాధ్యమైనంతవరకు ఈ సౌకర్యాలను సమంగా చేకూర్చడానికి ప్రభుత్వం తనకు గల సాధన సంపత్తులలో అధిక మొత్తాలను విద్యా బోధన సౌకర్యాలను కలిగించడానికి ఖర్చుచేస్తున్నది. ఆంధ్రప్రదేశ్ లో, ప్రాథమిక, మాధ్యమిక, సెకండరీ, శిక్షణ పాఠశాలలూ, ఆర్ట్సు, శిక్షణ, సాంకేతిక కళాశాలలూ మొదలైన అన్ని ప్రభుత్వ విద్యాసంస్థల నిర్వహణ క్రిందా, ఇలాంటి సంస్థలను నిర్వహించే వారికి ఇచ్చే గ్రాంట్లక్రిందా రూ. 17.00 కోట్లు ఖర్చుచేస్తున్నారు. ఈ గ్రాంట్లను సిబ్బంది జీతాలు, బోధనసామగ్రి భవనాలు, క్రీడాస్థలాలు మొదలైన వాటికొరకు ఇస్తున్నారు నిధుల పంపిణీ, వినియోగం సక్రమంగా జరగడానికీ, విద్యాబోధన తగు స్థాయిలో వుండడానికీ చర్యలు తీసుకునే నిమిత్తం ప్రభుత్వం కార్యాలయాలను కూడా నిర్వహిస్తున్నది. ఉపాధ్యాయుల శిక్షణ ఖర్చులన్నింటినీ ప్రభుత్వమే భరిస్తున్నది. శిక్షణ సంస్థలలో ఉచితంగా విద్యాబోధన జరుగుతున్నది. శిక్షణపొందేవారికి స్టయిఫండులు కూడా ఇస్తున్నారు. రు. విద్యార్థుల విద్యావిషయకమైన అవసరాలు తీరడానికి వీలుగా, ఉపాధ్యాయులను తగువిధంగా అర్హత సంపాదించుకోడానికి ప్రోత్సహించే నిమిత్తం ఈ విధంగా స్టయిఫండులు ఇవ్వడం జరుగుతున్నది. పోతే ప్రజాస్వామిక దేశంలో విద్యార్థుల ఆర్థికావసరాల విషయానికి వద్దాం. ఇలాంటి అవసరాలను విద్యార్థులు స్వయంగా కానీ లేదా వారి కుటుంబం వారు కానీ తీర్చాలని సాధారణంగా ప్రజాస్వామిక ప్రభుత్వం ఆశిస్తుంది. అయితే ప్రభుత్వం విద్యావిషయకమైన అవసరాలను తీర్చడానికి ఖర్చుచేయగా మిగిలినదాన్ని ఇందుకొరకు వినియోగించడం ద్వారా ఈ అవసరాలను తీర్చడానికి కూడా సాయశక్తులా ప్రయత్నిస్తుంది. ఈ విధంగా ప్రభుత్వం నిర్బంధప్రాథమిక విద్యాపథకాలను ప్రవేశపెడుతున్నప్పుడు వెనువెంటనే ఆర్థికంగా వెనుకబడిన జనాభా గల ప్రదేశాలలో మధ్యాహ్న భోజన పథకం వంటి వాటిని కూడా అమలుపరుస్తుంది. రాష్ట్రంలో 1961 వ సంవత్సరంలో

నిర్బంధ ప్రాథమిక విద్యాపథకాన్ని ప్రవేశపెట్టారు. ఆదిమజాతుల వారు అధికంగా నివసించే ఏజెన్సీవంటి ప్రదేశాలలో, మధ్యాహ్న భోజనమేగాకుండా బట్టలు, పుస్తకాలు, పలకలనుకూడా ఉచితంగా తంగా ఇస్తున్నారు. ఇంతేగాకుండా ప్రభుత్వం ఉచితభోజన గృహాలను కూడా నిర్వహిస్తున్నది. రాష్ట్రమంతటా విద్యావిషయకంగానూ, సాంఘికంగానూ, ఆర్థికంగాను వెనుకబడి వున్న కొన్ని వర్గాల వారికి ప్రభుత్వం, పూర్తి ఫీజు, సగం ఫీజు రాయితీల వంటి ప్రత్యేక సౌకర్యాలను కలుగజేస్తున్నది. నిమ్నజాతులు, వెనుకబడిన తరగతులుగా వర్గీకరించబడిన ఈ వర్గాల వారికి పై రాయితీలతో పాటు స్కాలర్‌షిప్పులు కూడా వారి సంక్షేమ కార్యకలాపాల నిమిత్తం ప్రత్యేకంగా స్థాపించబడిన సాంఘిక సంక్షేమ శాఖ ద్వారా లభింపజేయబడుతున్నాయి.

ఇదంతా జరిగినప్పటికి కూడా, విద్యాభ్యాసం కొనసాగించడానికై ప్రత్యేకసహాయం అవసరమయ్యేవారు ఎల్లప్పుడూ కొందరు వుంటూనే వుంటారు. ఇలాంటి వారికి సహాయపడటానికే స్కాలర్‌షిప్పులు ఇస్తున్నారు. ఉన్నత విద్యా కోర్సులకు అంటే తొమ్మిదవ తరగతి తరువాత నుంచి ఉచిత విద్యా విధానాన్ని వర్తింప జేసే అవకాశం ప్రభుత్వానికి లేదు. అందువల్ల, ఏదో ఒక విధంగా సహాయం పొందనిదె ఉన్నత కోర్సులో చదువు సాగించలేని స్థితిలో వుండేవారు ఎప్పుడూ వుంటారు. నిమ్నజాతులు, వెనుకబడిన తరగతుల విద్యార్థులకు పైన పేర్కొన్న ప్రత్యేక సహాయం లభిస్తుంది. కాని వీటిలో దేనికీ చెందకుండా ఆర్థికంగా వెనుకబడి వున్న వర్గాల విద్యార్థులకు ఈ సౌకర్యాలు వర్తించవు. ఇలాంటి విద్యార్థులకు సహాయం చేసేందుకై స్కాలర్‌షిప్పులను ఏర్పరిచారు.

స్కాలర్‌షిప్పులను మంజూరుచేయడానికి ప్రభుత్వం విడివిడిగాకానీ లేక సమిష్టిగాకానీ రెండు విషయాలను అంటే ప్రతిభ, లేమినికాని లేదా మరేదైనా ఇతర లోపాన్ని కాని పరిగణిస్తుంది. ఆంధ్రప్రదేశ్‌లో వివిధ పథకాలూ, ఒక్కొక్కదానికి 1962–63వ సంవత్సరంలో కేటాయించిన మొత్తాల వివరాలు ఈ విధంగా వున్నాయి:

1. ప్రతిభనూ, లేమినీ దృష్టిలో పెట్టుకొని మంజూరు చేసిన స్కాలర్‌షిప్పులు

స్కాలర్‌షిప్పు పేరు	మొత్తం (రూ)	స్కాలర్‌షిప్పును మంజూరు చేయడానికి దృష్టిలోపెట్టుకున్నఅంశాలు. స్కాలర్‌షిప్పులు మంజూరు చేసిన తరగతులు.
రియాయతీ స్కాలర్‌షిప్పులు–తెలంగాణా ప్రాంతం	1,38,200	ప్రతిభ, లేమి 9 నుంచి 11, 12, కళాశాల తరగతులు
స్కాలర్‌షిప్పులు–సాధారణ ప్రాంతాలు –ఆంధ్ర ప్రాంతం	1,43,500	ప్రతిభ, లేమి 9 నుంచి 11, కళాశాల తరగతులు.
వికలాంగులు, అనాధుల స్కాలర్‌షిప్పుల వంటి ఇతర స్కాలర్‌షిప్పులు	43,800	ప్రతిభ, లేమి 9 నుంచి 11, కళాశాల తరగతులు.
ప్రతిభావంతులైన విద్యార్థులకు స్కాలర్‌షిప్పు ఇచ్చే పథకం–1962–63వ సంవత్సరానికి మంజూరీ లభించవలసివుంది.	5,00,000	ప్రతిభ, లేమి ఫైనల్ ఇయర్ పరీక్షకు వెళ్లే తరగతులు
హైదరాబాదు పబ్లిక్ స్కూళ్ళలో మెరిట్ స్కాలర్‌షిప్పులు	20,000	భారత ప్రభుత్వం నిర్వహించే ప్రత్యేక పరీక్ష ఆధారంగా పూర్తిగా ప్రతిభను బట్టి వీటిని ఇస్తారు. ఆదాయాన్ని బట్టి వీటిని ఇవ్వడం జరుగుతుంది. పబ్లిక్ స్కూలులో కోర్సు ముగిసే వరకు వీటిని లభింపజేస్తారు.
మొత్తం	రూ. 8,45,500	

ప్రతిభావంతుడైన ఏ విద్యార్థి కూడా ఆర్థిక స్థితి బాగులేని కారణంగా ఉన్నత విద్యాభ్యాసం కొనసాగించలేని పరిస్థితి ఏర్పడకుండా వుండేందుకై ఇలాంటి స్కాలర్‌షిప్పులు ఉద్దేశింపబడినవి. ఈ విధంగా ప్రభుత్వం, ప్రతిభావంతులైనవారు అభివృద్ధిలోకి వచ్చి తనకు ఉపయోగ పడగలిగేటట్టుగా వారికి తోడ్పడుతున్నది.

2. లేమి లేదా మరేదైనా లోపంవల్ల మంజూరు చేసే స్కాలర్‌షిప్పులు

స్కాలర్‌షిప్పు పేరు	మొత్తం (రూ)	స్కాలర్‌షిప్పు మంజూరు చేయడానికిగల కారణాలు. స్కాలర్‌షిప్పు మంజూరు చేసిన తరగతులు.
రాజకీయబాధితుల పిల్లలకూ, మనుమలకు, మనుమరాండ్రకు స్కాలర్‌షిప్పులు.	1,00,000	అన్ని తరగతులు
పూర్వ హైద్రాబాదు రాష్ట్రంలో 1947-48 వ సం. లో సాగిన పోరాటంలో పాల్గొన్న వారి పిల్లలకు స్కాలర్‌షిప్పులు.	22,000	అన్ని తరగతులు
ఉద్యోగంలో వుండగా మరణించిన రాష్ట్ర ప్రభుత్వోద్యోగుల పిల్లలకు స్కాలర్‌షిప్పులు.	81,000	అన్ని తరగతులు

మొత్తం 2,03,000

ఈ స్కాలర్‌షిప్పులను, స్వాతంత్ర్య పోరాటంలో కానీ లేదా పరిపాలన నిర్వహణలో కాని పాల్గొని కష్టనష్టాలకు గురైన వారి పిల్లలకు ఇస్తారు.

అక్టోబరు 1962.

3. ప్రతిభావంతులకు ఇచ్చే స్కాలర్‌షిప్పులు

స్కాలర్‌షిప్పు పేరు	మొత్తం (రూ)	స్కాలర్‌షిప్పు మంజూరు చేయడానికిగల కారణాలు. స్కాలర్‌షిప్పు ఇచ్చిన తరగతులు.
తెలంగాణా ప్రాంతంలో మెరిట్ స్కాలర్‌షిప్పులు.	62,000	కేవలం ప్రతిభను పురస్కరించుకొని. 6 వ తరగతి నుంచి 12 వ తరగతి వరకు,

మొత్తం రూ. 62,000

ఇవేగాక 16-18 సంవత్సరాలు, 20-25 సంవత్సరాల మధ్యవయస్కులైన ప్రతిభావంతులైన విద్యార్థులకు కేవలం సమర్థతను బట్టి స్కాలర్‌షిప్పులు మంజూరు చేసే విషయాన్ని ప్రభుత్వం పరిశీలిస్తున్నది. స్కూల్ ఫైనల్, విశ్వవిద్యాలయ పరీక్షా ఫలితాల ఆధారంగా గానీ లేదా ప్రత్యేక పోటీ పరీక్ష ఆధారంగాగానీ వీటి మంజూరీ జరగాలి. ఇతర స్కాలర్‌షిప్పుల మంజూరీకై నిర్దేశించిన ఆదాయ పరిమితికి మించి రాబడి వున్నప్పటికీ కుటుంబ సభ్యుల సంఖ్య అధికంగా వున్న వారి పిల్లలకు -ప్రతిభావంతులైన వారికి- ఈ స్కాలర్‌షిప్పులు మిక్కిలి సహాయకారిగా వుంటాయి.

పైన ఇచ్చిన సంఖ్యలను బట్టి, రాష్ట్ర ప్రభుత్వం రూ. 11,10,500 ల మేరకు స్కాలర్‌షిప్పులు ఇచ్చినట్లు తెలుస్తుంది. కేవలం ప్రతిభను బట్టి స్కాలర్‌షిప్పులు మంజూరు చేసే పథకంపై ప్రభుత్వ ఉత్తర్వులు చేశాక మరికొంత మొత్తాన్ని స్కాలర్‌షిప్పుల నిమిత్తం కేటాయించడం జరుగుతుంది.

రాష్ట్ర ప్రభుత్వం మంజూరుచేసే ఈ స్కాలర్‌షిప్పులతో పాటు, భారత ప్రభుత్వం కూడా ఆంధ్రప్రదేశ్‌లో దిగువ స్కాలర్‌షిప్పులు లభింపజేస్తున్నది.

1. సెకండరీ, ఎలిమెంటరీ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయుల పిల్లలకు ప్రతిసంవత్సరం మంజూరు చేసే స్కాలర్‌షిప్పులు. (మొదటి తరగతిలో

సంఖ్య

ఉత్తీర్ణులైన విద్యార్థులకు మాత్రమే) 42

2. మొదటి తరగతిలోనూ, రాంకులోను ఉత్తీర్ణులైన ఆంధ్రప్రదేశ్ స్కాలర్లకు ప్రతి సంవత్సరం ఇచ్చే జాతీయ స్కాలర్‌షిప్పులు 163
3. హిందీయేతర రాష్ట్రాలకు చెందిన విద్యార్థులకు ఇచ్చే హిందీ స్కాలర్‌షిప్పులు 35
4. ఆంధ్రప్రదేశ్‌లోని వికలాంగులైన పిల్లలకు ఇచ్చే స్కాలర్‌షిప్పులు సంఖ్యను నిర్ణయించలేదు.


ఇకపోతే ఈ స్కాలర్‌షిప్పుల సంఖ్యా, వాటికి ప్రత్యేకించే మొత్తాల విషయంలో ముమ్ముందు ఎలాంటి అవకాశాలువుంటాయో సూచాయగా తెలుసుకుందాం. విద్యాశాఖకుగల సాధనసంపత్తిని పెంపొందించవిదే స్కాలర్‌షిప్పులను గానీ, వాటి మొత్తాలను గాని హెచ్చించడం సాధ్యం కాదనేది సుస్పష్టం. వీటిని హెచ్చించినప్పటికీ, ఈ మొత్తాలను స్కాలర్‌షిప్పుల సంఖ్యనూ, మొత్తాలను పెంచడం ద్వారా విద్యార్థుల వ్యక్తిగత ప్రయోజనాలకు వినియోగించాలా లేక సెకండరీ పాఠశాలల్లో ఉన్నత తరగతులకు, కళాశాలలకు ఉచిత విద్యా పథకాన్ని వర్తింపజేయడం ద్వారా సమాజం మొత్తానికి ప్రయోజనం కలిగే విధంగా వినియోగించాలా అనే విషయాన్ని ప్రభుత్వం పరిశీలించవలసి వుంటుంది. ఒకవేళ ఉన్నత తరగతులకు ఉచిత విద్యా బోధన పథకాన్ని విస్తరింపజేయడానికి నిర్ణయం జరిగినట్లయితే ఆర్థిక సహాయం అవసరమయ్యే విద్యార్థులందరికీ ఆ సముపాయం కల్పించడానికి వీలుగా ప్రస్తుతం మంజూరు చేస్తున్న స్కాలర్‌షిప్పుల సంఖ్యను గానీ లేదా మొత్తాలను గాని చెప్పుకొనదగినంత పెంచడానికి తగినంత డబ్బు లభ్యం కావడం దుర్లభం. కొన్ని దేశాలలో ఈ సమస్యకు కొంతవరకు పరిష్కారం సాధించబడింది. విద్యార్థులకు ముఖ్యంగా కళాశాలలో చదివే యుక్తవయస్కులైన వారికి, తమ ఖర్చులకు కావల్సిన సొమ్మును పూర్తిగా గానీ లేదా కొంత వరకు కాని సంపాదించడానికై విద్యా బోధన జరగని సమయాలలో ఏదైనా పనీ పాటా చేసుకోడానికి ఆదేశాలలో సౌకర్యాలు కలుగజేస్తారు. ఇలాంటి పథకాన్ని మన దేశంలో ప్రవేశపెట్టడానికి ప్రజలకు ఎట్టి అభ్యంతరం వుండగూడదు. ఎందుచేతనంటే అలనాటి మన గురుకుల వ్యవస్థలో శిష్యులు ఒకే గురువును ఆశ్రయించి వుండేవారనీ, గురువు తన శిష్యులకు శాస్త్ర విద్యలను నేర్పడంతో పాటు వారు తనకు, తన కుటుంబానికీ చేసే సేవకు ప్రతిఫలంగా వారికి తన ఇంటనే భోజన వసతి సౌకర్యాలను కూడా సమకూర్చేవారని వింటుంటాము. ఏమైనప్పటికీ ఇది ప్రజలూ, విద్యా సంస్థల నిర్వాహకులు నిర్ణయించవలసిన విషయం. ఎందుకంటే ఈ ఉభయ పక్షాల సహకారం లేనిదే ఇలాంటి పథకం విజయం కావడం అసంభవం.

పాండిత్యం విజ్ఞానం జీవితంలో మనకు
అనేక దశలలో అక్కరకు రావచ్చు.
కాని విపత్సమయంలో మనలను రక్షించేది
ఆస్తిక్యం విశ్వాసం మాత్రమే –


–మహాత్మాగాంధీ–




మధ్యాహ్న భోజన పథకం: మెదకు జిల్లా, నర్సాపూర్‌లో 'కేర్' మధ్యాహ్న భోజన పథకానికి గత జులైలో అమెరికా రాయబారి ప్రారంభోత్సవం చేసినప్పుడు, బాలబాలికలకు పాలు యిస్తున్నప్పటి చిత్రం.



రెండవ ప్రణాళికా కాలంలో సికింద్రాబాదులో నిర్మించబడిన బాలికల కీడ్ ఉన్నత పాఠశాలలోని శాస్త్ర విజ్ఞాన విభాగం.



గత జూలైలో హైదరాబాదులో జరిగిన విద్యాధికారుల సమావేశంలో విద్యాశాఖ కార్యదర్శి
శ్రీ యస్. యస్. గుప్తా ప్రసంగించినప్పటి చిత్రం



హైదరాబాదులోని రాష్ట్ర కేంద్ర గ్రంథాలయంలోని వ్రాత ప్రతుల విభాగం

ఆంధ్రప్రదేశ్‌లో
వయోజన విద్యా ఉద్యమం

శ్రీ కె. రాఘవరెడ్డి, యల్. టి. డిప్లమో (లీడ్స్)

భారతదేశంలోని ఆధునిక విశ్వవిద్యాలయాల వంటి ఉన్నత విద్యా కేంద్రాలు పూర్వ కాలంలో వుండేవి. అటువంటి పవిత్ర విజ్ఞాన కేంద్రాలు ఆంధ్రప్రదేశ్‌లో కూడా వున్నాయి. ఈ విద్యా కేంద్రాలు ముఖ్యంగా ప్రాచీన సంస్కృతీ సంపదను పరిరక్షించడానికేర్పడిన మత సంస్థలు. వయోజన విద్యతో సహా జన బాహుళ్యానికి విద్య గరపాలన్న ఆలోచన దాదాపు గత శతాబ్దం చివర వరకూ కలగలేదు. 1813 వ సంవత్సరం ఛార్టర్ చట్టం కూడా ప్రాథమిక విద్య పైనే ఎక్కువ దృష్టిని కేంద్రీకరించింది. గత శతాబ్ది చివరన కొన్ని రాత్రి పాఠశాలలను నెలకొల్పారు. కాని అవి కూడా బాలలకే నిర్దేశించబడినవి. ప్రస్తుత శతాబ్దారంభంలో కొందరు వదాన్యులు దేశంలో కొన్ని రాత్రి పాఠశాలలను స్థాపించారు. అవి కేవలం బాలలకు నిర్దేశించబడినవే అయినా కొద్ది మంది వయోజనులు కూడా వాటిలో చేర్చుకోబడ్డారు. కాని వారికున్న సౌకర్యాలు పరిమితమైనవి. అందువల్ల రాత్రి పాఠశాలలు అంత తృప్తివంతంగా పనిచేయలేకపోయినాయి. ఏది ఏమైనా బొంబాయి, బెంగాలు, మద్రాసు రాష్ట్రాలలో వున్న కొద్ది రాత్రి పాఠశాలలు దేశంలో ఇతర ప్రాంతాలలో వున్న వాటి కంటే ఎంతో తృప్తికరంగా పనిచేశాయి. మొదటి ప్రపంచ యుద్ధం చెలరేగే వరకూ వయోజన పాఠశాలలను నెలకొల్పడానికి ఏవిధమైన సక్రమమైన కృషి జరగలేదు.

అటు కేంద్ర ప్రభుత్వమూ, ఇటు రాష్ట్ర ప్రభుత్వాలు కూడా తగిన ప్రోత్సాహం ఇవ్వనందున వున్న కొద్ది మంది వదాన్యుల ఉత్సాహం కూడా క్షీణించింది.

ప్రముఖ ఇంజనీరు, రాజకీయవేత్త అయిన కీ. శే. డాక్టర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య 1912 వ సంవత్సరంలో మైసూరు రాష్ట్రంలో పెక్కు వయోజన విద్యా పాఠశాలలను ఆరంభించారు. తరువాత కీర్తిశేషులైన బరోడా మహారాజా వారు కూడా ఈ ఉద్యమం పట్ల అత్యుత్సాహంతో అనుసరించారు. మన రాష్ట్రంలో ప్రముఖ సంఘ సంస్కర్తలైన కీ. శే. కందుకూరి వీరేశలింగం పంతులు, సర్ రఘుపతి వెంకటరత్నం నాయుడు వంటి వారు సాంఘిక విద్యావ్యాప్తికై బహుముఖమైన సేవ చేశారు. అయినప్పటికీ దానికి తగిన ప్రాముఖ్యం రాలేదు. ఆ తర్వాత కొన్ని సంవత్సరాలకు ప్రజా బాహుళ్యంలో వచ్చిన రాజకీయ చైతన్యం పుణ్యమా అని అదొక ఉద్యమం రూపుదాల్చింది. అప్పటిలో వున్న కొద్ది రాత్రి పాఠశాలలను, పగలు పాఠశాలలలో పనిచేసే ఉపాధ్యాయులే చాలా కొద్ది అదనపు వేతనంతో నిర్వహించే వారు. అప్పుడు వయోజనులకు తగిన ప్రాథమిక పుస్తకాలు గాని, ఒక నిర్ణీత పాఠ్య ప్రణాళిక గాని లేవు. ఈ వయోజన విద్యా ఉద్యమాన్ని ప్రభుత్వాలు గాని, దేశనాయకులు గాని అంత తీవ్రమైనదాన్నిగా భావించలేదు.

మొదటి ప్రపంచ యుద్ధం పూర్తి అవడంతో వయోజన విద్యా ఉద్యమం రెండవ దశ ప్రారంభమైంది. ప్రజాబాహుళ్యంలో వినూత్న చైతన్యం ప్రభవించింది. ప్రభుత్వాలతో పాటు దేశ నాయకులు కూడా వయోజన విద్యా సమస్యను గుర్తించి తమ దృష్టిని ఈ మహోద్యమం వైపు మళ్ళించారు. పంజాబ్, ఉత్తర ప్రదేశ్, తిరువాన్కూరు మొదలైన ప్రభుత్వాలు వయోజన పాఠశాలల స్థాపనకు ప్రత్యేక గ్రాంటుల నివ్వడానికి ముందంజ

వేశాయి. తత్ఫలితంగా దేశంలో ఆ పాఠశాలల సంఖ్య త్వరితంగా పెరిగింది. కాని పగలు పాఠశాలలలోని ఉపాధ్యాయులకు వయోజన విద్యా విధానాలు తెలియనందున వయోజన విద్యా ప్రమాణాలు అలాగే వుండిపోయాయి. అంతే గాక ఉపాధ్యాయులకిచ్చే ప్రతిఫలం కూడా తగినంతగా వుండేది కాదు. నిరక్షరాస్యులకు కావలసిన ప్రాథమిక పాఠ్యగ్రంథాలు, కొత్తగా అక్షరాస్యులైన వారికి తగిన పాఠ్య గ్రంథాలు కూడా లభించేవి కావు. ఈ దొసగులను వయోజన విద్యా ఉద్యమం పట్ల ఉత్సాహం గలవారు గమనించి ఆ సమస్య పరిష్కారానికి ఆ తరువాత సంవత్సరాలలో కొత్త విధానాల నవలంబించారు.

1937 లో పెక్కు రాష్ట్రాలలో ప్రజాదరణ పొందిన ప్రభుత్వాలేర్పడిన తర్వాత ఇతర దేశ నిర్మాణ కార్యక్రమాలతో పాటు వయోజన విద్యాకార్యక్రమం నవజీవితాన్ని సంతరించుకున్నది. బహుశా అప్పుడే వయోజన విద్యా ఉద్యమం ఉత్సాహంతో ప్రారంభమైందనవచ్చు. వయోజన విద్య ప్రభుత్వాల బాధ్యతగా అంగీకరింపబడి వివిధ రాష్ట్ర ప్రభుత్వాలు తమ తమ రాష్ట్రాలలో వయోజన విద్యా పాఠశాలలను నిర్వహించే కార్యక్రమాన్ని చేపట్టాయి. వయోజనులను విద్యావంతులుగా చేయటమే గాక వారికి పౌర విద్య, పారిశుద్ధ్యం మొదలైన విషయాలు బోధించడానికి వీలుగా వయోజన విద్యావకాశాన్ని విస్తృతం చేయడం జరిగింది. వివిధ రాష్ట్ర ప్రభుత్వాలు ప్రాథమిక విద్యా తరగతులనే గాక ఆ పై తరగతులను కూడా నెలకొల్పాయి. రాజకీయ నాయకులు ఈ ఉద్యమం పట్ల ప్రజలలో ఉత్సాహాన్ని రేకెత్తించారు. ప్రభుత్వాలు, ఇతర సంస్థలు నెలకొల్పిన వయోజన పాఠశాలలను పర్యవేక్షించే కార్యక్రమాన్ని కొందరు రాజకీయ నాయకులు తమకు తాముగా చేపట్టారు. రాజకీయ నాయకులతో పాటు ఆయా ప్రభుత్వాలిచ్చిన చేయూతతో ఈ ఉద్యమం చురుకుగా ముందుకు సాగింది. ఆ విధంగా పాఠశాలల సంఖ్య పెరగటం, బోధనావశ్యకత విస్తృతం కావడమేగాక పెక్కురు నిరక్షరాస్యులు అక్షరాస్యులుగా మారడం కూడా అధికమైంది. ఒకప్రక్క ఈ విస్తృత కార్యక్రమాలు సాగిపోతుండగా మరొకప్రక్క ఈ ఉద్యమాన్ని బహుళ ప్రచారం కావించడానికి తీసుకోవలసిన చర్యలను కూడా చేపట్టారు. 1938 వ సంవత్సరంలో భారతీయ వయోజన విద్యాసంఘం ఏర్పడింది. ఆ సంఘం వయోజనవిద్యా ఉద్యమ ప్రచారానికి ఇతోధిక సహాయం చేసింది. అది వయోజన విద్యకై పెక్కు గ్రంథాలను కూడా ప్రచురించింది.

కొన్ని సంవత్సరాల పాటు వయోజన విద్యా రంగంలో జరిగిన అభివృద్ధి 1942 ప్రాంతంలో ముఖ్యంగా రెండవ ప్రపంచ యుద్ధం వల్ల కుంటుపడింది. రాష్ట్రాల ప్రజా ప్రభుత్వాలన్ని రాజీనామాలిచ్చాయి. రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు తమ దృష్టిని యుద్ధం వైపు కేంద్రీకరించాయి. దేశనిర్మాణ కార్యకలాపాలపై ఖర్చును కోత పెట్టారు. వయోజనవిద్యా కార్యక్రమం కూడా కోతకు బలి కాక తప్పలేదు. ఆయా వ్యక్తులు, స్వచ్ఛంద సంస్థలు గూడా తమ శక్తిని యుద్ధం వైపే మళ్లించాయి. ఈ కారణాలన్నిటి వల్ల అన్ని రాష్ట్రాలలోని వయోజన పాఠశాలల సంఖ్య, పాఠశాలలకు హాజరయ్యే వయోజనుల సంఖ్యకూడా తగ్గి, వున్న కొద్ది పాఠశాలలుకూడా సక్రమంగా నడవలేక పోయాయి.

ఏమైనా ఈ క్షీణ దశ తాత్కాలికం మాత్రమే. 1947 లో కేంద్రంలో జాతీయ ప్రభుత్వం ఏర్పడి నపుడు వయోజన విద్యా ఉద్యమం మళ్ళీ ముందుకు వచ్చింది. నిరక్షరాస్యతను నిర్మూలించడమే బాధ్యతగాగల రాష్ట్రప్రభుత్వాలకు మార్గదర్శకంగా వుండడానికి ఒక పథకాన్ని తయారు చేయడానికి భారత ప్రభుత్వం ఒక కమిటీని నియమించింది. ఈ కమిటీ రూపొందించిన పథకం కేవలం వయోజన విద్యకే నిర్దేశింపబడలేదు. అందులో ఆరోగ్యం, పారిశుద్ధ్య విషయాల విద్య కూడా చేర్చబడింది. కాని తమ అవసరాల కనుగుణంగా పాఠ్య ప్రణాళికను రూపొందించుకొనే సమస్యను రాష్ట్ర ప్రభుత్వాలకే వదిలిపెట్టారు. రాష్ట్రాలవిద్యామంత్రులు 1949 లో న్యూఢిల్లీలో ఈ పథకాన్ని గురించి సమగ్రంగా చర్చించి ఆ పథకాన్ని భారత ప్రభుత్వం ఆమోదానికి సిఫార్సు చేశారు. ఈ పథకాన్ని అమలు జరపడంలో రాష్ట్ర ప్రభుత్వాలు అమితోత్సాహాన్ని ప్రదర్శించాయి. ఉమ్మడి మద్రాసు రాష్ట్రంలోని ఆంధ్ర ప్రాంతంలో ఈ పథకం అమలుకై ఒక ప్రత్యేకాధికారిని నియమించారు. అలాగే తెలంగాణా ప్రాంతంలో కూడా వయోజన పాఠశాలలను పర్యవేక్షించడానికి వయోజనవిద్యకు సంబంధించిన విషయాలపై ప్రభుత్వానికి సలహా లివ్వడానికి ఒక ప్రత్యేకాధికారిని నియమించారు. చివరకు ప్రజల నుంచి మంచి ప్రోత్సాహం లభించింది. తత్ఫలితంగా పెక్కు మంది నిరక్షరాస్యులైన వయోజనులను అక్షరాస్యులను చేయడం జరిగింది. ఒక్కొక్క నిరక్షరాస్యుడిని అక్షరాస్యునిగా చేసినందుకు తల 1కి ఒక్కొక్క రూపాయిని ఉపాధ్యాయునికి బోనస్‌గా ఇచ్చారు. కాని ఈ క్రింది కారణాలవల్ల ఈ పథకాన్ని పూర్తిగా అమలు జరపడం జరగలేదు. ఈ పథకం

అమలుకై కేంద్రం కేటాయించిన మొత్తాలు చాలీ చాలకుండా ఉన్నాయి. రాష్ట్ర ప్రభుత్వం తయారుచేసిన ప్రణాళిక కూడా తగిన విధంగా లేదు. ఉమ్మడి మద్రాసు రాష్ట్రంలో వయోజన పాఠశాలలకై మూడు సంవత్సరాల పాఠ్య ప్రణాళిక నొకదాన్ని రూపొందించారు. ఒక వయోజనుడిని మూడేళ్ళపాటు పాఠశాలలో వుంచడం కష్టసాధ్యమనే విషయం గుర్తింపబడలేదు. నిరక్షరాస్యులైన వయోజనులకు బోధించడానికి తగిన ప్రాథమిక పాఠ్య గ్రంథాల కొరత వల్ల వాటిస్థానంలో బాలలకు ఉపయోగించే ప్రాథమిక గ్రంథాలనే ఉపయోగించారు. వయోజనుని అక్షరాస్యుడిగా చేయడమూ, బాలుని అక్షరాస్యుడిగా చేయడమూ ఒకటి కాదనే విషయాన్ని కూడా గుర్తించడం జరగలేదు. అక్షరాస్యులైన వారికి ఆ పై పాఠ్య గ్రంథాలు కూడా లభించలేదు. అక్షరాస్యులైన వయోజనులకు తగిన పుస్తకాలను సరఫరా చేయకపోవడం వయోజన పాఠశాలలకై ప్రజాధనాన్ని దుర్వినియోగం చేయడమే నన్న విషయం కూడా గుర్తింపబడలేదు. వయోజన విద్యా కార్యక్రమంలో వున్న ఈ లోపాల వల్ల ఆ ఉద్యమం ప్రగతి కుంటుపడింది. ఏలాగైతేనేం అందుకు తగిన నివారణోపాయాలను పంచవర్ష ప్రణాళికలలో అమలు జరిపారు.

ప్రథమ పంచవర్ష ప్రణాళికలో సాంఘిక విద్యకు ప్రాముఖ్యత ఇవ్వబడింది. ఈ సాంఘిక విద్యలోనే అక్షరాస్య కార్యక్రమాలను చేర్చారు. సమాజాభివృద్ధి ప్రాంతాలలో పెక్కు వయోజన పాఠశాలలను నెలకొల్పారు. ఈ ప్రాంతాలలో వున్న ఈ పాఠశాలలను సమాజాభివృద్ధిశాఖ, ఆ ప్రాంతం బయట వున్న పాఠశాలలను విద్యాశాఖ నిర్వహిస్తుంది. ఈ రెండు శాఖల ఉత్సాహం వల్ల మొదటి పంచవర్ష ప్రణాళిక చివరకు వయోజన పాఠశాలల సంఖ్య పెరిగింది. ఒక్క ఆంధ్ర ప్రాంతంలోనే 2659 వయోజన పాఠశాలలున్నాయి. ఆ పాఠశాలలలో 77,947 మంది వయోజనులున్నారు. పెక్కు పాఠశాలలకు వయోజన విద్యకు సంబంధించిన సాధనాలను సరఫరా చేశారు. కాని అవి అంతగా చాలకపోయినా వాటి ప్రమాణాలు పెరగవలసి వుంది.

మొదటి ప్రణాళికా కాలంలో ఈ వయోజన విద్యా ఉద్యమంలో అభివృద్ధి జరిగినప్పటికీ ఈ కార్యక్రమాల పట్ల చూపవలసిన శ్రద్ధ అంతగా చూపబడలేదు. ఈ ఉద్యమానికై ఉపాధ్యాయులు చేసిన బహుముఖ సేవను గౌరవించలేదు. వయోజన విద్యా కార్యకర్తల నైతిక స్థాయి పెంపొందలేదు. చాలా మంది ఈ ఉద్యమాన్ని కన్నా ఆర్థిక కార్యక్రమాలకు ప్రాముఖ్యత నివ్వడం మంచిదన్న అభిప్రాయాన్ని వెలువరించారు. దేశం ఆర్థికంగా ప్రగతి సాధించాలిగాని ఈ వయోజన విద్య అంత అవసరం కాదు—అని ఈ సందర్భంగా వెలువడిన అభిప్రాయాలలో ఒకరు వెలిబుచ్చారు. ఇది ద్వేష భూయిష్ఠమైన వాదంగా కనబడుతుంది. ప్రజా స్వామ్య విజయం చాలావరకు ఈ వయోజన విద్యమీదే ఆధారపడి వుంటుందన్న విషయం గుర్తింప బడలేదు. దేశ ఆర్థికాభివృద్ధిని సాధించాలంటే వయోజన విద్య అవసరం అనే విషయం కూడా గుర్తించడం జరగలేదు.

మొదటి ప్రణాళికలో రూపొందించ బడిన సాంఘిక విద్యా కార్యక్రమాలను ద్వితీయ ప్రణాళికారంభంలో కొనసాగించారు. ఈ రెండవ ప్రణాళికాకాలంలో కూడా కొంత అభివృద్ధి జరిగింది. కాని జాతీయ విస్తరణ కార్యక్రమాలు, ఇతర అభివృద్ధి పథకాల క్రింద కాక ఇతర ప్రాంతాలలో వున్న వయోజన పాఠశాలలను 1956 ఆగస్టు మొదటి తేదీ నుంచి మూసివేయాలని రాష్ట్ర ప్రభుత్వం ఉత్తరువు జారీచేసింది. తత్ఫలితంగా విద్యాశాఖ ఆధిపత్యాన వున్న ఈ పాఠశాలల సంఖ్య 1503 కు తగ్గింది. అయితే ఈ రంగంలో సమాజాభివృద్ధి కార్యక్రమాల క్రింద ఎంతో అభివృద్ధి జరిగింది. 1959–60లో సమాజాభివృద్ధి కార్యక్రమాల క్రింద రాష్ట్రంలో 7,500 వయోజన పాఠశాలలు పనిచేశాయి. ఆ పాఠశాలలలో 3,71,869 మంది అక్షరాస్యులయ్యారు.

వయోజన విద్యా కార్యకర్తలకు అవసరమైన శిక్షణ గరపడానికి తూర్పు గోదావరి జిల్లా అనపర్తిలో ఒక శిక్షణ పాఠశాలను నెలకొల్పారు. ఈ పాఠశాల ప్రతి యేటా రెండు వందల మంది ఉపాధ్యాయులకు శిక్షణ గరపుతుంది. అలాగే తెలంగాణా ప్రాంతంలోని వయోజన పాఠశాలలలో పని చేస్తున్న ఉపాధ్యాయులకు కూడా శిక్షణ నివ్వడానికి ప్రణాళికాంతంలో మహబూబ్‌నగర్ జిల్లా జడ్చెర్లలో మరొక శిక్షణ పాఠశాలను స్థాపించారు. వయోజన పాఠశాలలలో అనుసరిస్తున్న పాఠ్య ప్రణాళికను పరిశీలించడానికి, సవరించడానికి పౌర గ్రంథాలయాల డిప్యూటీ డైరెక్టర్ అధ్యక్షతన రాష్ట్ర ప్రభుత్వం ఒక కమిటీని ఏర్పాటు చేసింది. ఈ పాఠశాలలలో అమలులో వున్న మూడేళ్ల కోర్సును ఒక సంవత్సరం కోర్సుకు తగ్గించాలని ఈ కమిటీ సిఫార్సు చేసింది. ఈ సంవత్సరం కోర్సులో నాలుగు నెలల ప్రాథమిక విద్య, ఎనిమిది నెలల ప్రాథమిక విద్యానంతర కోర్సు వుంటాయి. ఈ

సిఫార్సును ప్రభుత్వం ఆమోదించి అమలు జరిపింది. నాలుగు నెలల కోర్సు ముగియగానే పరీక్షలు నిర్వహింపబడి అందులో ఉత్తీర్ణులైన వారికి సర్టిఫికెట్లనిస్తారు. ఒక్కొక్క వయోజనుడ్ని అక్షరాస్యుడిగా చేసినందుకు ఒక్కొక్క రూపాయిని ఉపాధ్యాయునికి బోనసుగా ఇచ్చే పథకం గూడా కొనసాగింది.

వయోజన పాఠశాలలను పటిష్ఠం చేయడానికి తగిన చర్యలు తీసుకొనబడినవి. అక్షరాస్యులైన వయోజనులు తాము అభ్యసించిన దానిని మర్చిపోకుండా వుండడానికి తగిన పాఠ్యగ్రంథాలను వయోజన పాఠశాలలకు సరఫరా చేశారు. అక్షరాస్యులైన వయోజనులు తమ విజ్ఞానాన్ని పెంపొందించుకోడానికై వారికి వార్తా పత్రికలు ఇతర పత్రికలు గూడా సరఫరా చేశారు. సులభశైలిలో పుస్తకాలు వ్రాసే రచయితలకు శిక్షణనివ్వడానికి రాష్ట్ర ప్రభుత్వం కొన్ని రచనా శిబిరాలను నిర్వహించింది. జిల్లా విద్యాధికారులు వయోజన పాఠశాలలను శక్తివంతంగా పర్యవేక్షించడానికి వీరిగా వయోజన విద్యతో సహా సాంఘిక విద్యలో శిక్షణ పొందడానికి వారిని న్యూఢిల్లీలోని జాతీయ ప్రాథమిక విద్యా కేంద్రానికి పంపారు.

బ్లాకు ప్రాంతం కాని చోట్ల ఈ వయోజన విద్యా కార్యక్రమాలను విద్యాశాఖ అధికారులు చూస్తుండగా, బ్లాకులలో వాటిని విద్యాశాఖ మార్గదర్శకత్వం క్రింద సాంఘిక విద్యా ప్రచారకులు చూస్తుంటారు.

ఈ ఉద్యమానికి మరింత ప్రోత్సాహం ఇవ్వడం సముచితమని ఈ క్రింది లెక్కలు తెలుపుతవి:

1961 జనాభా లెక్కల ప్రకారం దేశంలోని ప్రతి వెయ్యి మందిలో 230 మంది, లేక 23.9 శాతం మంది మాత్రమే వ్రాయడము, చదవనూ నేర్చారు. దేశం మొత్తం మీద అక్షరాస్యులైన వారిలో ఎక్కువ శాతం మంది ఢిల్లీలో వున్నారు. అక్కడ నూటికి 52.8 మంది అక్షరాస్యులున్నారు. ఆంధ్రప్రదేశ్‌లో అక్షరాస్యులు నూటికి 21.2 శాతం మంది మాత్రమే. మిగతా రాష్ట్రాలలో అక్షరాస్యులు: కేరళ 46.9, మద్రాసు 31.4, మైసూరు 25.3 శాతం. ఆంధ్రప్రదేశ్‌లోని కొన్ని జిల్లాలలో అక్షరాస్యుల సంఖ్య కొంత ప్రోత్సాహకరంగా వుంది. హైదరాబాద్‌లో అక్షరాస్యుల శాతం 34.40, కృష్ణాలో 30.91, పశ్చిమ గోదావరిలో 30.29, ఆ తర్వాత మిగతావి వస్తాయి. ఆదిలాబాద్‌లో చాలా తక్కువమంది—అంటే నూటికి 11.47 శాతం మంది మాత్రమే అక్షరాస్యులు వున్నారు. స్త్రీలలో అక్షరాస్యులైన వారి సంఖ్య చాలా తక్కువ.

కనుక అద్యతన భవిష్యత్తులోనైనా నిరక్షరాస్యత నిర్మూలనకు అధిక ప్రాముఖ్యత నివ్వాలని సూచించడం అనవసరమే. అక్షరాస్య కార్యక్రమాలను రూపొందించడానికై రాష్ట్రస్థాయిలో వెనువెంటనే ఒక అక్షరాస్య కార్యక్రమ సంఘాన్ని ఏర్పాటు చేయాలి. సాంఘిక విద్యకు తగినంత నిధులను కేటాయిస్తున్నారు. వాటిలో ఎక్కువ భాగాన్ని వయోజన విద్యా కార్యక్రమాలకు ప్రత్యేకించాలి. ప్రజాస్వామ్యం మనుగడ కాకపోయినా దాని విజయం దేశంలో విద్యా సంపదమీద ఆధారపడివున్నందున వయోజన విద్యకై పెట్టే ఖర్చు ఒక పెట్టుబడి వంటిదని పరిగణించాలి.

ఈ మహోద్యమంలో నిమగ్నులైన సాంఘిక సేవకులు ఈ నిరక్షరాస్యతను నిర్మూలించడానికి అకుంఠిత దీక్షతో పని చేయాలి. వయోజన విద్యకు సంబంధించిన కార్యక్రమాలను సమాజాభివృద్ధిశాఖ, విద్యాశాఖ, ఇంకా ఇతర స్వచ్ఛంద సంస్థలు కలిసి రూపొందించాలి. ఈ వయోజన విద్యావకాశం చాలా విశాలమైంది కనుక లభ్యమైన అన్ని సౌకర్యాలను ఇందుకై వినియోగించుకోవాలి. గ్రామ పంచాయతీలు నిరక్షరాస్యత నిర్మూలనా బాధ్యతను చేపట్టాలి. ప్రాథమికపాఠ్యగ్రంథాలు, కొత్తగా అక్షరాస్యులైన వారికి తగినటువంటి ఆ పై శ్రేణి పుస్తకాలను తయారుచేయాలి. దీనిని చేపట్టడానికి కొంత ధనాన్నిచ్చి స్వచ్ఛందసంస్థలను ప్రోత్సహించాలి. ఈ పనిని అప్పుడే ఆంధ్రప్రదేశ్ ఆరంభించిందని తెలపడం ఇక్కడ అప్రస్తుతం కాదు. కొత్తగా అక్షరాస్యులైన వయోజనులకు పనికివచ్చే పుస్తకాలను తయారు చేయడం, కొనడం, వాటిని ఉచితంగా గ్రంథాలయాలకు సరఫరా చేసేందుకై జిల్లాలలోని స్థానిక గ్రంథాలయాధికారులకు పౌర గ్రంథాలయాల శాఖ గ్రాంటు నిచ్చింది.

రాష్ట్రంలో నిరక్షరాస్యతను కొంత పరిమితకాలంలో నిర్మూలించడానికి ఇవి కొన్ని సూచనలు మాత్రమే.

జాతీయ సమైక్యతకై ❋ విద్య ❋

శ్రీ వి. భాస్కరాచార్యులు

మన అభివృద్ధి ప్రణాళికల దృష్ట్యా జాతీయసమైక్యత ప్రాధాన్యతను నేడు రాజకీయ నాయకులు, సాంఘిక కార్యకర్తలు, విద్యాబోధకులు అందరూ చక్కగా గుర్తిస్తున్నారు. ఈనాడు దేశం అప్రమత్తంగా వుండవలసిన అవసరం వుంది. దీనికి కారణం దేశంలో కులమత తత్వాలూ, ప్రాంతీయ విభేదాలూ, ఇంకా ఇతర వివాదాలు తలెత్తడం మాత్రమే కాదు. మన గత అనుభవాలూ, అస్సాం, అలీఘర్‌లలో ఇటీవల జరిగిన సంఘటనలు మన మేధావి వర్గాలను కలవరపరిచాయి.

భారత జాతీయులు ఫ్రెంచ్, ఇటాలియన్, జర్మన్లవంటి వారు కారు. భారతదేశం అనేక మతాలు, తెగలు, భాషలతో కూడుకున్నది. ఇంతటి వైవిధ్యంతో కూడుకున్న సమాజం వివిధ వ్యక్తుల మధ్య సహనం, సుహృద్భావం వున్నప్పుడే అభివృద్ధి చెందగలుగుతుంది. ఏ ప్రజాస్వామిక దేశమైనా సరే సక్రమంగా అభ్యున్నతిని సాధించాలంటే ఈ విధంగా భిన్నత్వంలో ఏకత్వం తప్పనిసరిగా వుండాలి. ఇది లోపించినట్లయితే దేశానికి విపత్తు సంభవించవచ్చు. ప్రజలలో ఇలాంటి ఐక్యతా భావాలను వెదజల్లడానికి జాతీయ సమైక్యతకై విద్య గరపడమే ప్రధాన మార్గం.

మానవునిలో నిబిడీకృతమై వున్న అంతఃశక్తులను కుసుమింపజేయడమే విద్యాబోధన ధ్యేయం కారాదనే విషయాన్ని ఈనాడు అంతా ఆమోదిస్తారు. కొన్ని సాంఘిక లక్ష్యాలను కూడా అది నెరవేర్చవలసి వుంది. సమకాలీన సాంఘికావసరాలను తీర్చడంలో వ్యక్తి ప్రతిభ వినియోగపడటానికి అనువుగా అతనికి విద్య గరపాలి. ఈ ధ్యేయాన్ని సాధించడంలో విద్య అతనికి తోడ్పడాలి. జాతీయ సమైక్యతా సంఘం ముఖ్య విధుల్లో, జాతీయ సమైక్యతను సాధించడంలో విద్య వహించగల పాత్రను గురించి సూచనలు చెయ్యడం ఒకటి. రాజస్థాన్ గవర్నరు డా. సంపూర్ణానంద్ ఈ సంఘం అధ్యక్షులుగా వున్నారు.

ప్రవర్తనా నిబంధనావళి

ప్రజలు, విద్యార్థులు, పత్రికలకు వర్తింపజేయడానికై "ప్రవర్తనా నిబంధనావళు"లను రూపొందించడానికి, 1961 సెప్టెంబరులో జరిగిన జాతీయ సమైక్యతా మహాసభ సారథ్య సంఘం నిశ్చయించింది. రాజకీయ పక్షాలకు వెంటనే వర్తింపజేయడానికై ఆరు అంశాలతో కూడుకున్న ఒక ప్రవర్తనా నిబంధనావళిని ఈ మహాసభ ఆమోదించింది. దీని ముఖ్యాంశాలు ఇవి: వివిధ కులాలు, మతాలు, వర్గాలు లేదా ప్రాంతాల మధ్య వైషమ్యాలు తలెత్తడానికి కానీ, లేదా అవి రెచ్చిపోవడానికి కాని దోహదం చేసే ఎటి చర్యలలోనూ ఏ రాజకీయ పక్షం పాల్గొన కూడదు. కులం, మతం, వర్గం, భాష, ప్రాంతీయ విషయాలకు సంబంధించిన సమస్యలపై రాజకీయ పక్షాలు ఆందోళన చేయకూడదు.

పత్రికల నిమిత్తం, జాతీయ సమైక్యతా మండలి రూపొందించిన ముసాయిదా ప్రవర్తనా నిబంధనావళి, ప్రజానీకంలో ఐక్యత, సామరస్యాలను పెంపొందించడానికీ, సమిష్టి పౌర భావాన్ని కలిగించడానికీ, దేశం పట్ల విశ్వాసపాత్రం ప్రవర్తింపజేయడానికీ, కుల, మత, వర్గ, భాష, ప్రాంతీయాభిమానాలు జాతీయ ప్రయోజనాలకు భంగం కలిగించకుండా వుండటానికి అవసరమైన అన్ని చర్యలను పత్రికలు గైకొనాలనీ, దేశాన్ని విభజించడానికి లేదా ప్రజానీకంలో ఉద్రిక్తతను కలిగించడానికి ఎవరైనా వ్యక్తి, పార్టీ లేదా వర్గం చేసే ఎట్టి ప్రయత్నాన్నయినా అవి ప్రతిఘటించాలనీ, విభేదాల పరిష్కారానికి సాధనంగా దౌర్జన్య చర్యలకు దిగకుండా అది నిరోధించాలనీ, దేశాభివృద్ధికీ, జాతీయ సమైక్యతకు దోహదం చేసే ప్రభుత్వ కార్యక్రమాలను కానీ, ప్రజల కార్యకలాపాలను కానీ విశేషంగా ప్రకటించాలనీ నిర్దేశిస్తున్నది.

సమగ్రమైనది కాకపోయినప్పటికీ దిగువ ప్రవర్తనా నిబంధనావళిని విద్యారంగానికి వర్తింపజేయడం అవసరం:

1. రాజకీయమైన ప్రయోజనాల కొరకు, రాజకీయ పక్షాలు, రాజకీయవాదులు విద్యా సంస్థలను వినియోగించుకోకుండా చేయాలి.

2. పాఠ్య విషయాలలోనూ, తత్సంబంధమైన కార్యకలాపాలలోను జాతీయ సమైక్యతా కార్యక్రమాలకు అవకాశం కలిగించాలి.

3. విద్యార్థి సంఘాలకు జరిగే ఎన్నికలలో కుల, మత, వర్గ, భాషా, ప్రాంతీయ విభేదాలకు దారితీసే చర్యలకు విద్యార్థులు దిగకుండా చూడటం విద్యాధికారుల, ప్రజల పవిత్ర కర్తవ్యం

4. విద్యాభ్యాస కాలంలో, ప్రారంభదశలోనే సర్వమానవ సౌభ్రాతృత్వం, వసుధైక కుటుంబం వంటి విశాల భావాలను విద్యార్థుల లేత హృదయాల్లో నాటాలి.

5. జాతీయ సమైక్యత, భావ సమైక్యతలను సాధించడంలో ఉపాధ్యాయులు, పరిపాలనా నిర్వాహకులు విద్యార్థులకు మార్గదర్శకులుగా వుండాలి.

పై నిబంధనావళి, అందుకు సంబంధించిన వారికి ఆమోదయోగ్యంగానే వుండవచ్చు. అయితే ఇలాంటి నిబంధనావళుల ప్రయోజనం మాత్రం వారు వాటిని త్రికరణశుద్ధిగా ఆమోదించడం పైననే ఆధారపడి వుంటుంది. మన దేశంలో ఇందుకు ప్రజలను ఆయత్తం చేయడానికి మొదట వారికి విద్య గరపవలసి ఉంటుంది.

జాతీయ సమైక్యతా మండలి ఇటీవల న్యూఢిల్లీలో సమావేశమైనప్పుడు జాతీయ సమైక్యతకై తలపెట్టిన విద్యా కార్యక్రమాలలో దిగువ అంశాల విషయంలో జరిగిన అభివృద్ధిని సమీక్షించింది:

(అ) భారతదేశంలో ప్రస్తుత సమాజావసరాలకు అనుగుణ్యంగా విద్యావిధానాన్ని సంస్కరించడం.

(ఆ) హిందీ ఇంగ్లీషు భాషల అభివృద్ధి, ప్రచారం.

(ఇ) సెకండరీ విద్యా దశలో మైనారిటీ భాషల బోధనకు సౌకర్యాలు కలిగించడం.

(ఈ) జాతీయ స్థాయిలో పాఠ్య పుస్తకాలను తయారు చేయడం.

విద్యా పరిశోధన, శిక్షణల జాతీయ మండలి ఆధ్వర్యంలో పాఠ్యపుస్తకాల పరిశోధన కేంద్ర సంస్థ ద్వారా నమూనా పాఠ్య పుస్తకాలను సిద్ధం చేయడానికి కేంద్ర విద్యా మంత్రిత్వశాఖ ఏర్పాట్లు చేసినట్లు తెలుస్తున్నది కేంద్ర విద్యా మంత్రిత్వ శాఖ క్రిందటి సంవత్సరం తీసుకున్న నిర్ణయాన్ననుసరించి ఉద్యోగం, విద్య, జుడీషియల్ వ్యవహారాలలో ఫారములు రిజిస్టర్లలో కులం, తెగలకు సంబంధించిన అంశాలను తొలగించవలసి వుంది. 1961వ సంవత్సరంలో జరిగిన జనాభా లెక్కల సేకరణ సందర్భంలో నిమ్నజాతులు, నిమ్న తెగల వారి విషయంలో మినహా కులాల వారీ వివరాలను నమోదు చేయలేదు. ఈ మార్పులు హర్షణీయమైనవే. అయితే మనం ఆశించేది ప్రజల మనస్సుల్లో నుంచి కుల తత్వం, ప్రాంతీయ తత్వం మొదలైనవి తుడిచిపెట్టుకొని పోవాలని మాత్రమే. దీనికి సంబంధించిన శాసనం ఈ సమస్యను కొంతవరకు పరిష్కరించవచ్చు. కాని మనస్సాక్షిగా అందుకు పూనుకున్నప్పుడే వాస్తవమైన మార్పు వస్తుంది.

బెంగుళూరులో భారత శాస్త్ర విజ్ఞాన సంస్థ స్వర్ణోత్సవ గ్రంథాలయానికి శంకు స్థాపన చేస్తూ డాక్టర్ రాధాకృష్ణన్ ఇలా అన్నారు :—

"ఏదో విధంగా మానవుని ప్రవర్తనను అదుపులో పెట్టగలగడమే ఈనాడు కావల్సింది ...... మనుష్యుడు అంతర్ముఖుడై చూచుకోవాలి కూడా." ఇది అక్షరాలా నిజం. దీనికి దోహదకారిగా విద్య ప్రముఖ పాత్ర వహిస్తుంది.

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రాచీన పత్రాల సంరక్షణ పుట్టుపూర్వోత్తరాలు

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రాచీన పత్రాల పుట్టుపూర్వోత్తరాల వివరాలు 'దఫ్తరే-దివానీ' కార్యాలయంనుండి తెలుస్తాయి. ఈ కార్యాలయాన్ని 1721లో నెలకొల్పారు. మొదటి ఆసఫ్‌జా కాలంలోని మొట్టమొదటి కార్యాలయం యిది. మొఘల్ చక్రవర్తి అధిపత్యాన్ని గుర్తించి దక్కన్ సుబేదారుగా ఉన్న కాలంలో యీ కార్యాలయం ప్రారంభించబడింది. 1724లో ఆసఫ్‌జా, మొగల్ చక్రవర్తినుండి స్వాతంత్ర్యాన్ని పొందాడు. అయితే ఆ తర్వాత చాలా కాలం వరకు చక్రవర్తికి సామంతుని మాదిరిగానే ఉన్నాడు. దఫ్తరే దివానీ ముఖ్యమైన, మొట్టమొదటి కార్యాలయం కాబట్టి అనామకులు, అనుమానాస్పదమైన ప్రవర్తనగలవారి ఆధీనంలో దీనిని ఉంచకుండా ఆసఫ్‌జా జాగ్రత్తతీసుకున్నారు. ఆయనకు విశ్వాస పాత్రులైన రాయరాయన్ కుటుంబానికి చెందిన ఒక బ్రాహ్మణునికి దీనిని ఆధీనంచేశారు. కొంతకాలం తర్వాత మరొక కార్యాలయాన్ని నెలకొల్పడం జరిగింది. దీని పేరు 'దఫ్తరేమాల్' దీనిని ఇంకో విశ్వాసపాత్రులైన కాయిస్థ కుటుంబం, రాజా శివరాజ్' బహద్దుర్ పూర్వీకులైన రాజాసాగర్‌మల్ ఆధీనంలో ఉంచారు. ఈ రెండు కార్యాలయాలు మొత్తం రాష్ట్ర పరిపాలనా వ్యవహారాలను అజమాయిషీ చేసేవి. దక్కన్‌లోని ఔరంగాబాదు, బీరారు, బీజాపూర్, బుర్హాన్‌పూర్‌తో సహా ఖందేశ్ నాలుగు సూబాల సివిల్, మిలిటరీ వ్యవహారాలను దఫ్తరే-దివానీ నిర్వహిస్తు ఉండేది. దక్కన్‌లోని మిగిలిన రెండు సూబాలు, హైద్రాబాదు, బీదర్‌ల సివిల్, మిలిటరీ వ్యవహారాలను దఫ్తరే-మాల్ నిర్వహించేది. ఈ విభాగాలు అధికార పరిధికే గాక ఫైళ్ళను ఉంచే పద్ధతికికూడా విస్తరింపజేయడం జరిగింది. దఫ్తరే-దివానీలో అక్షర క్రమపద్ధతిని అనుసరించేవారు. దఫ్తరే-మాల్‌లో తేదీవారీ పద్ధతిని అనుసరించేవారు. రాష్ట్రానికి సంబంధించిన అన్ని వ్యవహారాలు వాటి అధికార పరిధికి లోబడి దఫ్తరే-దివానీ, దఫ్తరే-మాల్, యీ రెండు కార్యాలయాలలో జరుగుతుండేవి. మిలిటరీ, సివిల్ నియామకాలు, ప్రభుత్వ రెవిన్యూల సేకరణ, పంపిణీ, అన్ని రకాల రికార్డుల నిర్వహణ, వివిధరకాల గ్రాంట్లకు సంబంధించిన సనదులు, బిరుదుల నిర్వహణ, సేనల సంరక్షణలను యివి నిర్వహించేవి. ఈ కార్యాలయాల అధిపతులను 'సర్-దఫ్తర్స్' అని పిలిచేవారు. ఈ ఉద్యోగాలలో ఉండేవారు కీర్తిశిఖరాలను అందుకునేవారు. ఈ ఉద్యోగాలను వారసత్వంగా మార్చడంలో వారు విజయవంతులవడమే గాక వారిలో ఒకరు కొంతకాలం పాటు దివాన్ పదవి కూడా అధిష్ఠించారు.

రెండవ ఆసఫ్‌జా (మీర్‌నిజాం అలీఖాన్) కాలంలో ఇంకొక కార్యాలయం (ధఫ్తర్) నెలకొల్పడం జరిగింది. ఇది 'దఫ్తరే-దారుల్ యింషా' అని పిలువబడేది. ఈ కార్యాలయం అధిపతిని 'నాజిం' అనేవారు. 'ఇజాముల్ ముల్క్' కుటుంబం ఆధ్వర్యంలో యీకార్యాలయం పని చేసేది. విదేశీ, రాజకీయ శాఖగా యిది పనిచేసేది. మొగలు చక్రవర్తులు, మహారాష్ట్రులు, భారత గవర్నర్ జనరల్, రాష్ట్ర గవర్నర్లు, ఇరుగు పొరుగు రాష్ట్రాల పరిపాలనాధిపతులతో ఉత్తర ప్రత్యుత్తరాలు జరుపేది.

దఫ్తరే-దివానీ, దఫ్తరే-మాల్ మామూలుగా తమ వ్యవహారాలను నిర్వహించేవి. ఉన్నత కుటుంబీకులు సాధారణంగా తమ వ్యక్తిగత ఉత్తర ప్రత్యుత్తరాలకై ప్రైవేటుగా చిన్న కార్యాలయాలను నెలకొల్పుకునేవారు. వీటిని 'మున్షీఖానా' 'దారుల్‌ఇన్‌షా' అని పిలిచేవారు. ఉన్నత కుటుంబానికి చెందిన వ్యక్తి దివాన్‌గా నియమించబడినప్పుడు ఆయన వ్యక్తిగత కార్యాలయం గూడా ప్రాముఖ్యానికి వస్తుండేది. రాజా చందూలాల్, రాజా రాంబక్ష్ కుటుంబాల అజమాయిషీలో ఉన్న కార్యాలయం 'దఫ్తరే-పేష్కా

రీ', నవాబ్ షిరాజుల్‌ముల్క్ కుటుంబం ఆధ్వర్యంలో ఉన్న 'దప్తరే' ముల్కీలు కూడా యిటువంటి కార్యాలయాలే.

రాజా చందూలాల్ 1806 లో పేష్కారుగాను, 1832 లో ప్రధాన మంత్రిగాను నియమితులయినారు. దాదాపు 30 సంవత్సరాలవరకు రాష్ట్రంలో ఆయన ప్రముఖ వ్యక్తిగా ఉండేవారు. రాజకీయ పరిపాలనా వ్యవహారాలకు దప్తరే-పేష్కారీ కేంద్రస్థానంగా ఉండేది. పేష్కారు జారీచేసిన ఉత్తర్వుల అసలు ప్రతులన్నీ యీ కార్యాలయంలో ఉండేవి.

నవాబ్ షిరాజుల్‌ముల్క్ 1846 నుండి 1848 వరకు, 1851 నుండి 1853 వరకు ప్రధానమంత్రిగా పనిచేశారు. ఆయన మరణించిన తర్వాత ఆయన అల్లుడు మీర్ తురాబలీఖాన్ (మొదటి సర్ సాలార్‌జంగ్) ప్రధాన మంత్రి అయ్యారు. 1853 నుండి 1883 వరకు ఆయన ప్రధాన మంత్రిగా పనిచేశారు. 1884 లో ఆయన కుమారుడు మీర్ లియాకత్ అలీఖాన్ సాలార్‌జంగ్ II ప్రధాన మంత్రిగా ఉన్నారు. 1887 లో ఈయన మరణించారు. ఈతని కుమారుడు మీర్ యూసుఫ్ అలీఖాన్ 1912 లో ప్రధాన మంత్రి అయ్యారు. 1914 లో ఆయన పదవిని వదలుకున్నారు. ఆయా సాలార్‌జంగుల కాలంలోనూ, ఆతర్వాత ప్రధానమంత్రి పదవిని నిర్వహించిన కాలంలోను జారీచేయబడిన ఉత్తర్వుల, సనదుల అసలు ప్రతులు దప్తరే-ముల్కీ కార్యాలయంలో ఉండేవి. అంతేగాక నిజాం, ఆంగ్లేయ ప్రభుత్వాల మధ్య జరిగిన ఒప్పందాలను భద్రపరచడమే గాక రాజకీయ సంబంధాలను నిర్వహించే పనికూడా యీ కార్యాలయం జరుపుతుండేది. దప్తరే దివానీ, దప్తరేమాల్ కార్యాలయాలుకూడ వాటి పరిధిలో అవి పనిచేస్తూ ఉండేవి. ప్రభుత్వ రికార్డుల భద్రతను ప్రైవేటు కుటుంబాల ఆధీనంలో ఉంచడంలో గల అనుచితాన్ని మొదటి సాలార్‌జంగ్ దివాను అయిన తర్వాత గుర్తించాడు. పరిపాలనా పునర్వ్యవస్థీకరణలో హైద్రాబాదు పరిపాలనలో నవీన పద్ధతులను ఆయన ప్రవేశపెట్టారు.

1868లో నిర్వహణాధికారాలు దప్తర్లను లేకుండా చేశారు. జాగీర్లు, ఇనాముల గ్రాంట్లకు సంబంధించిన సనదులను జారీ చేయడం, ధ్రువపర్చడం వంటి పనులకు మాత్రమే యీ కార్యాలయాల అధికారాలు పరిమితం చేయడం జరిగింది. ఈ కార్యాలయాలను ఆ కుటుంబాల ఆధీనంలో ఉంచటం మాత్రం కొనసాగింది. దప్తరే దివానీ, దప్తరేమాల్‌లనుండి రాష్ట్ర పరిపాలనాధికారాలను సచివాలయం స్వీకరించింది. కాలక్రమేణా యితర అనుబంధ కార్యాలయాలు వెలిశాయి. దప్తరేదివానీ, దప్తరేమాల్ కార్యాలయాలతో పాటు యివి పనిచేయనారంభించాయి. వీటిలో కొన్నిటిని దిగువ ఇవ్వడం జరిగింది.

1. దప్తరే ఇస్తిఫా:- దప్తరే దివానీనినెలకొల్పినప్పుడేదీనిని కూడా ప్రారంభించారు. దప్తరే దివానీ జారీచేసిన ఉత్తర్వులు, సనదుల ప్రతులు తియారుచేసి వాటిపై అధికారముద్ర వేయడం ఆ తర్వాత అసలుప్రతులను దప్తరేదివానీకి వాపసుచేయడం, తయారుచేసిన ప్రతిని భద్రపర్చడం యీ ఉపకార్యాలయం విధి. ఈ కార్యాలయం నుండి అధికార ముద్రపడిన ఉత్తర్వులే సక్రమంగా జారీ అయిన ఉత్తర్వులుగా భావింపబడేవి. జాగీర్దారు కుటుంబం ఆధ్వర్యంలో యీ కార్యాలయం ఉండేది.

2. దప్తరే మనాసిబ్ కితాబత్:- ఉన్నత కుటుంబాలకు చెందిన వ్యక్తులకు, యితరులకు వారి ప్రశంసనీయ సేవకై రాజ్యాధిపతులు జారీ చేసిన బిరుదులు, గౌరవ పట్టాలను యీ కార్యాలయం ధ్రువపర్చేది.

3. దప్తరే మావహీర్:- కార్యాలయాలు, ఉన్నత కుటుంబీకులు ఉపయోగించే ముద్రలు, పట్టీల నమూనాలను యీ కార్యాలయం తయారు చేసేది.

4. దప్తరే బక్షీగిరి:- రాష్ట్ర సైనిక వ్యవహారాలను యీ కార్యాలయం నిర్వహించేది. సరిష్తాలుగా లేక చిన్న కార్యాలయాలుగా దీనిని విభాగించారు. సరిష్తాలు రాజా శివరాజ్ బహద్దుర్ ఆధ్వర్యంలో ఉండేవి.

5. దప్తరే క్వాన్గోయె చక్బందీ:- భూమి, గ్రామాల తగాదాలను యీ కార్యాలయం పరిష్కరించేది. వివాదం యేర్పడిన ప్రాంతానికి యీ కార్యాలయం గుమాస్తావెళ్ళి భూమిని తనిఖీచేసి విస్తీర్ణం, సరిహద్దుల వివరాలతో చాక్నామా (నోటు) తయారుచేసేవాడు. ఈ రిపోర్టును అనుసరించి వివాద పరిష్కారం ఉత్తర్వు యీ కార్యాలయం జారీచేసేది.

రాజా శివరాజ్ బహద్దుర్ కాలంవరకు యీ కార్యాలయాన్ని రాజా ఉజ్గర్‌చంద్ కుటుంబం నిర్వహించేది. ప్రైవేటు కుటుంబాల ఆదీనంలో కార్యాలయాలు ఉండకూడదనే విధానం మొదటి సర్‌సాలార్‌జంగ్ గతించిన తర్వాత కూడా అమలు జరపడం జరిగింది. 1893 వ సం॥లో దప్తరే దివానీ కార్యాలయాన్ని నిజాం ప్రభుత్వం స్వాధీనం చేసుకొని ఆర్థికశాఖ అధ్వర్యంలో ఉంచారు.

ఇనాం కమీషన్ జారీచేసిన ముంతఖాబత్ అనే పత్రాలు దప్తరే దివానీలో రికార్డు చేయడానికై 1948 లో పంపబడ్డాయి. గ్రాంట్లు పొందిన వారి హక్కులు, కోర్కెలను పరిశీలించడానికి రెవిన్యూ శాఖ ఇనాం కమీషన్‌ను నియమించింది. పరిశీలనల తరువాత సరి అయిన హక్కుదారులకు సనదులు లేక ముంతఖాబత్‌లను జారీచేయడం జరిగింది.

1905 లో దప్తరే ఇస్తిఫాను దప్తరే దివానీలో కలిపారు. 1925లో దప్తరేమాల్‌ను దాని అధికార పరిధిలో ఉన్న ముంతఖాబాలను కూడా దప్తరే దివానీలో కలిపివేశారు.

దప్తరే దివానీ ఆధీనమైన మరికొన్ని కార్యాలయాల వివరాలు దిగువ యివ్వడం జరిగింది.

(1) దప్తరే ముల్కీ 1929 లో
(2) దప్తరే బక్షిగిరి 1938 లో
(3) దప్తరే దారుల్ ఇన్‌షా 1938 లో
(4) దప్తరే పేష్కారీ 1946 లో
(5) దప్తరే సదారతుల్ అలియా 1950 లో

దప్తరే దివానీ ఆధీనంలోకి మొగలియా రికార్డులు వచ్చిన వివరాలు తెలుసుకోనిదే సేకరణ చరిత్ర అసంపూర్తిగా మిగిలిపోతుంది. పూర్వం సుబేదారి కార్యాలయం ఉన్న ఔరంగాబాదులోని ఖిలాయె అర్క్ గోడల గూళ్ళల్లో పాతదస్తావేజులు యెక్కువ మొత్తంలో లభించాయి. వాటిని సేకరించడానికి వెంటనే తగిన చర్యలు తీసుకోబడ్డాయి. 1916 లో దప్తరే దివానీ కార్యాలయానికి వీటిని మార్చడం జరిగింది.

షాజహాను, ఔరంగజేబుల కాలానికి సంబంధించిన ముఖ్యమైన పత్రాలు చాలా లభించాయి. మొగల్ పరిపాలనా వ్యవహారాలు, ముఖ్యంగా మిలిటరీ వ్యవహారాలకు సంబంధించిన పత్రాలు చాలా ఉన్నాయి.

నిజాం ప్రభుత్వంలో రికార్డు ఆఫీసుగా దప్తరే దివానీ ముఖ్యమైన పాత్ర వహించింది. కాలక్రమంలో వివిధ కార్యాలయాలు దప్తరే దివానీకి మార్చబడి అన్నిహంగులు గల స్టేట్ ఆర్కీవ్‌గా యీ కార్యాలయం అభివృద్ధిచెందింది.

దప్తరే దివానీ-మాల్‌లను సూపరింటెండెంటు, లేక మొహత్మీమ్ ఆధీనంలో ఉంచడం జరిగింది. రికార్డుల సేకరణ, పట్టికలు తయారు చేయడం, క్రమపద్ధతిలో వీటిని భద్రపర్చడం, వగైరా యీ కార్యాలయం నిర్వహిస్తుంది. ఇది సనదులను ధ్రువపర్చేదికూడా. ఇతర కార్యాలయాలను దీనికి మార్చడంతో పాటు యితర విధాల సేకరణతో యిప్పటి అభివృద్ధి స్థితికి యీ కార్యాలయం రాగలిగింది. హైదరాబాదు చరిత్ర, నాటి సమాజ పరిస్థితి, పరిపాలనా పద్ధతులు చారిత్రక వివరాలు స్టేట్ ఆర్కీవ్ కార్యాలయంలో లభ్యమవుతాయి. భారతదేశంలోని, విదేశాలలోని విద్యార్థులకు యీ కార్యాలయంపై ఆసక్తి యెక్కువవుతున్నది.

శ్రీ సయ్యద్ ఖుర్షీద్, దప్తరే దివానీ ఆదర్శ ప్రాయమైన మొహత్మీమ్‌గా పనిచేశారు. 1915లో ఆయన నియమితులైనారు. వివిధ ప్రైవేటు కుటుంబాలనుండి రికార్డులను సేకరించి సక్రమంగా అమర్చడంలో ఆయన యెన్నో ఇక్కట్లను యెదుర్కొన్నారు. దప్తరేదివానీ-మాల్‌ల ప్రథమ డైరెక్టరుగా ఆయనే నియమితులయినారు పర్షియన్ లిపిలో వ్రాతప్రతులు అమూల్యమైన యితర పరిశీలన పుస్తకాలను సేకరించి ఒక గ్రంథాలయాన్ని ఆయన నెలకొల్పారు.

1950 లో దప్తరే దివానీ-మాల్ కార్యాలయం పేరును సెంట్రల్ రికార్డు కార్యాలయంగా మార్చారు.

1956 లో హైదరాబాదు రాష్ట్రంలోని తెలుగు ప్రాంతాన్ని కలుపుకొని ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఏర్పడింది. ఆంధ్రరాష్ట్రం రాజధాని కర్నూలు నుండి హైదరాబాదుకు మార్చబడింది. సెంట్రల్ రికార్డు కార్యాలయం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రమొత్తానికి పాతరికార్డుల భద్రపరిచే సంస్థగా మారింది. పూర్వ ఆంధ్రరాష్ట్ర రికార్డులనుకూడా సెంట్రల్ రికార్డ్ ఆఫీసుకు మార్చడం జరిగింది.

1962లో సెంట్రల్ రికార్డ్ ఆఫీసు పేరును ఆంధ్రప్రదేశ్ 'స్టేట్ ఆర్కీవ్స్‌గా' మార్చారు.

తృతీయ ప్రణాళికలో ఆంధ్రప్రదేశ్‌లో విద్యా కార్యక్రమాలు

శ్రీ కె. వి. రంగారెడ్డి,

విద్యాశాఖ కార్యాలయం హైదరాబాద్.

" ఆర్థిక సాంకేతికాభివృద్ధిని శీఘ్రగతిని సాధించడానికి, సరియైన సాంఘిక వ్యవస్థను ఏర్పాటుచేసి అందరికీ సమానావకాశాలను, సాంఘిక న్యాయన్ని కల్పించడానికి విద్య అత్యంత ముఖ్యమైనది. దేశంలోని ప్రజలందరికి సమాన పౌరసత్వాన్ని కల్పించి, ప్రజాశక్తులను వినియోగించుకోడానికి, దేశంలోని ప్రతి భాగంలోగల మానవ ప్రకృతి వనరులను అభివృద్ధిపరచడానికి విద్యా కార్యక్రమా లేర్పడుతున్నవి. గత దశాబ్దంలోని అభివృద్ధి కార్యక్రమాలు శీఘ్ర ఆర్థికాభివృద్ధికి దోహదం చేశాయి. అయినప్పటికీ సక్రమమైన అభివృద్ధిని సాధించడానికై ముఖ్యంగా తొలగించుకోవలసిన పెక్కు లోపాలు విద్యారంగంలో వున్నాయి. విద్యాకార్యక్రమాలను విస్తృతం చేసి, అవి ప్రతి యింటిలోని వారికి లభించేట్లు చూడడం తృతీయ ప్రణాళిక ప్రధాన లక్ష్యాలలో ఒకటి. అందువల్ల ఇప్పటినుంచే జాతీయ జీవనానికి సంబంధించిన అన్ని రంగాలలో ప్రణాళికాభివృద్ధికి విద్య ముఖ్యమవుతుంది."

6-11 సంవత్సరాల మధ్య వయసుగల బాలలకు విద్యా వసతులను కల్పించడం, సెకండరీ. విశ్వవిద్యాలయ స్థాయిలలో విజ్ఞాన శాస్త్ర బోధనను విస్తృతం చేయడం, పెంపొందించడం, అన్ని స్థాయిలలో వృత్తి పనులు, సాంకేతిక విద్యనభివృద్ధి చేయడం, విద్యారంగంలోని ప్రతి దశకు కావలసిన ఉపాధ్యాయులకు శిక్షణ సౌకర్యాలను పెంపొందించి విస్తృతం చేయడం, ఉచిత వేతనాలను (స్కాలర్ షిప్పులు) అధికం చేయడం వంటి సహాయాల నివ్వడానికై తృతీయ ప్రణాళికలో ప్రాముఖ్యత నిచ్చారు. బాల బాలికల విద్యాస్థాయిలలో వున్న బేధాలను తొలగించి, బాలికల విద్యకు ప్రాముఖ్యత నివ్వాలనికూడా ప్రణాళికలో గట్టిగా భావించారు. నైపుణ్యాన్ని, విజ్ఞానాన్ని, సృజనాత్మక దృష్టిని, ప్రాంతీయ భాషా, కులతత్వాల కతీతంగా వుండే జాతీయైక్యతా భావాన్ని, సర్వుల శ్రేయస్సును కాంక్షించే భావాన్ని పెంపొందించడమే విద్యారంగంలోని అన్ని దశలలోని ఆశయం.

రాష్ట్రంలోని వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు తృతీయ ప్రణాళికలో 305 కోట్ల రూపాయల మొత్తాన్ని కేటాయించారు. అందులో విద్యాభివృద్ధికై 23.61 కోట్ల రూపాయలను కేటాయించారు. ఈ కేటాయింపులో 20.56 కోట్లను సాధారణ విద్యకు, 3.05 కోట్లను పురాతత్వశాఖ, వస్తు ప్రదర్శన శాలలతోసహా సాంకేతిక విద్యకు కేటాయించారు.

ప్రాథమిక విద్య

ద్వితీయ ప్రణాళిక ముగిసేనాటికి ఒకటినుంచి ఐదవ తరగతులవరకు 29.75 లక్షల మందిని చేర్చుకున్నారు. (ఇది ప్రథమంలో అంచనా వేసిన 28.2 లక్షలకన్నా ఎక్కువ.)

తృతీయ ప్రణాళికారంభంలో భారత దేశంలోనూ, అభివృద్ధిచెందిన ఇతర రాష్ట్రాలలోనూ 6-11 మధ్య వయసుగల బాలలను ఒకటినుంచి ఐదవ తరగతి వరకు చేర్చుకొన్న శాతం వివరాలు ఈ క్రింది పట్టికలో ఇవ్వబడినాయి.

	మొత్తం	బాలురు	బాలికలు
భారత దేశం	61.5	80.5	40.4
1. కేరళ	108.8	118.0	99.7
2. మద్రాసు	78.9	99.7	58.0
3. మహారాష్ట్ర	73.3	89.0	56.6
4. గుజరాత్	72.0	85.9	57.3
5. మైసూరు	67.4	84.0	50.1
6. పశ్చిమ బెంగాల్	65.6	80.8	48.4
7. ఆంధ్ర ప్రదేశ్	63.6	78.7	48.5
8. పంజాబ్	61.8	84.0	36.3
9. అస్సాం	61.7	73.7	48.0

6_11 సంవత్సరాల మధ్య వయసుగల బాల బాలికలకు పదేళ్ళలోపల నిర్బంధ ఉచిత విద్యా సౌకర్యాలను కల్పించాలని రాజ్యాంగం తలపెట్టింది. ఈ తలపెట్టిన పదేళ్ళకాలం అయిపోయింది. మొదటి రెండు ప్రణాళికలలో వ్యవసాయం, పరిశ్రమలకు సంబంధించిన పథకాలు చేపట్టడంవల్ల రాజ్యాంగంలో తలపెట్టిన ఆశయం అసంపూర్తిగా నిలిచి పోవడానికి కారణం. అందువల్ల తృతీయ ప్రణాళికలో ఈ సమస్యకు ప్రాముఖ్యత ఇవ్వబడింది. 6_11 సంవత్సరాల మధ్య వయసుగల వారికి తృతీయ ప్రణాళిక చివరకు క్రమ క్రమంగా నిర్బంధ ప్రాథమిక విద్యను ప్రవేశ పెట్టడానికి వసతి కల్పించ బడింది. ఈ లక్ష్య సాధనకు 6_7 సంవత్సరాల మధ్య వయసుగల బాల బాలికలకు 1961_62 లో నిర్బంధ విద్యా విధానాన్ని ప్రవేశ పెట్టారు. ఇది 6_8 సంవత్సరాల మధ్య వయసుగల వారికి ప్రస్తుత విద్యా సంవత్సరంలోకూడా అమలు జరుపబడింది. తృతీయ ప్రణాళిక చివరకు_అంటే 1965_66 నాటికి___ఈ పథకం 6_11 సంవత్సరాల మధ్య వయసుగల వారికి విస్తరింపబడుతుంది.

తృతీయ ప్రణాళికాంతానికి 6_11 సంవత్సరాల మధ్య వయసు గల వారి సంఖ్య 52.3 లక్షలుంటుందని అంచనావేసి, అందులో 44.2 లక్షల మందిని ఒకటినుంచి ఐదవ తరగతి వరకు చేర్చుకోవాలని అంచనా వేసి. ఈ ఉచిత నిర్బంధ విద్యా సౌకర్యాన్ని ఏజన్సీ ప్రాంతాలలో తప్ప రాష్ట్రం అంతటా వర్తింపచేసినప్పటికీ ఈ సౌకర్యం అదనంగా 16.00 లక్షల మందికి మాత్రమే వర్తిస్తుంది. ఈ 16 లక్షల మందిలో 5 లక్షల మందిని ప్రస్తుతం వున్న పాఠశాలలలోనే_ ఒక్కొక్క_ ఉపాధ్యాయుని క్రిందవుండే విద్యార్థుల నిష్పత్తిని పెంచి_చేర్చుకుంటారు. మిగతా 11 లక్షల మందికై 28 వేల మంది ఉపాధ్యాయులను నియమిస్తారు. అదనంగా ఉపాధ్యాయులను నియమించకుండా ప్రస్తుతం వున్న పాఠశాలలలోనే చేర్చుకునే 5 లక్షల మందిలో, 1.55 లక్షల మందిని అప్పుడే చేర్చుకున్నారు ప్రథమంలో 28.2 లక్షలమందినే చేర్చుకోవాలని అంచనా వేసినా, 1960_61 నాటికి ఈ సంఖ్య 29.75 లక్షల వరకు పెరిగింది. ఈ 16 లక్షల మందిని చేర్చుకోవడంతో తృతీయ ప్రణాళికాంతానికి పాఠశాలలలో 6_11 సంవత్సరాల మధ్యవయసు గలవారి సంఖ్య 84.5 శాతం అవుతుంది_

ఈ క్రింది ముఖ్య కారణాలవల్ల తృతీయ ప్రణాళికాకాలంలో 6_11 సంవత్సరాల మధ్య బాలలకు ఈ విద్యాసౌకర్యం కల్పించడానికి సంబంధించిన ముఖ్య సమస్యలు తల ఎత్తుతాయి.

(అ) తగినంతమంది బాలికలను పాఠశాలలలో చేర్చడం,

(ఆ) విద్యా విషయకంగా వెనకబడిన కొన్ని ప్రాంతాలు కొన్ని వర్గాల జనాభా.

(ఇ) బాలలు మూడవ తరగతి వరకూ రాకుండానే వారు తమ కుటుంబాదాయానికి తోడ్పడ గలరనే భావంతో తల్లిదండ్రులు, వారి చదువును మాన్పించడంవల్ల కలిగే అనవసరపు వ్యయం.

(ఈ) చట్టబద్ధమైన చర్యలు తీసుకోవడంకన్నా తల్లిదండ్రులకు నచ్చచెప్పడాన్ని అవలంబించడం.

ఏది ఏమైనా ప్రజలందరికి విద్యా సౌకర్యాలు కల్పించడానికి నిశ్చయించారు.

6_11 సంవత్సరాల వారిని 1 నుండి 5వ తరగతి వరకు చేర్చుకునే వారి శాతాన్ని తృతీయ ప్రణాళికాంతానికి ఆంధ్రప్రదేశ్ లో పరిస్థితిని ఇతర రాష్ట్రాలతో పోల్చి చూస్తే ఈ క్రింది విధంగా వుంటుంది.

	మొత్తం.	బాలురు	బాలికలు
భారతదేశం.	76 4	90.4	61.6
కేరళ	108.7	117.8	99.7
మద్రాసు	100	106.8	93.1
మహారాష్ట్ర	90.5	104.8	75.3
మైసూరు	88.2	88.4	88.1
ఆంధ్రప్రదేశ్	84.5	96.1	72.7
గుజరాత్	84.2	95.8	71.4
అస్సాం	77.4	86.6	66.9
పంజాబ్	74.6	91.4	55.2
పశ్చిమబెంగాల్	73.4	84.5	60.7

ప్రాథమిక పాఠశాలలలో 16 లక్షల మందినే చేర్చుకోవాలనే లక్ష్యాన్ని సాధించడంతో ప్రణాళికారంభంలో 7వ స్థానంలోవున్న ఆంధ్రప్రదేశ్, ప్రణాళికాంతానికి 5వ స్థానాన్ని పొందుతుంది.

ఉపాధ్యాయుల శిక్షణ

తృతీయ ప్రణాళికకు కావలసిన ఉపాధ్యాయుల అవసరానికి, ప్రస్తుతం రాష్ట్రంలోని ఆంధ్ర ప్రాంతంలోవున్న ఉపాధ్యాయుల శిక్షణ సౌకర్యాలు (ఉపాధ్యాయులకు ట్రైనింగ్ సౌకర్యాలు) చాలినంతగా వున్నట్లు కనుపిస్తున్నవి. అయినా ఉపాధ్యాయులకు శిక్షణ సౌకర్యాలు లేని కొన్ని రాయలసీమ జిల్లాలలోను, విశాఖపట్నం, శ్రీకాకుళం కోస్తా జిల్లాలలోను ఉపాధ్యాయుల శిక్షణ పాఠశాలలను ప్రారంభించ తలపెట్టారు. ఆంధ్ర ప్రాంతంలో పని చేస్తున్న ఉపాధ్యాయులందరూ సుశిక్షితులే. కాని తెలంగాణా ప్రాంతంలో సుశిక్షితులైన ఉపాధ్యాయులు 33 శాతం మాత్రమే. అందువల్ల ద్వితీయ ప్రణాళికలో తెలంగాణా ప్రాంతంలో 50 శిక్షణ విభాగాలను ప్రారంభించటానికి చర్యలు తీసుకున్నారు. తృతీయ ప్రణాళికకు కావలసిన ఉపాధ్యాయులకు శిక్షణనివ్వటానికై వీటిలో 2500 మంది ఉపాధ్యాయులను ఏటా చేర్చుకుంటారు. తెలంగాణా ప్రాంతంలో అర్హులైన ఉపాధ్యాయులు తగినంత మంది లేనందున ముఖ్యంగా సెకండరీ గ్రేడ్ శిక్షణ విభాగాలకు అంత ప్రాశస్త్యం లేదు. అందువల్ల అర్హతగలవారు శిక్షణకు లభించే వరకూ శిక్షణ పొందని ఉపాధ్యాయులను నియమించడం అత్యవసరం.

బేసిక్ విద్య

ద్వితీయ ప్రణాళికాంతానికి 35,534 ప్రైమరీ పాఠశాలలలో (బేసిక్, నాన్-బేసిక్ 2532 పాఠశాలలను బేసిక్ పాఠశాలలుగా మార్చారు. తృతీయ ప్రణాళికా కాలంలో బేసిక్ విద్య ముఖ్య విధానాలను నాన్-బేసిక్ ఎలిమెంటరీ పాఠశాలలలో—మామూలు ఎలిమెంటరీ పాఠశాలల ఉపాధ్యాయులకు 'ఓరియంటేషన్ ట్రైనింగ్' ఇవ్వడం ద్వారా—అమలు జరపడానికి ప్రతిపాదించారు. బేసిక్, నాన్-బేసిక్, పాఠశాలలకు ఒకే సమైక్య పాఠ్యప్రణాళికను అప్పుడే ప్రవేశ పెట్టారు. బేసిక్ పాఠశాలలలో బోధన వృత్తి విషయకంగానూ, నాన్-బేసిక్ పాఠశాలలలో ఆచార ప్రకారంగానూ సాగుతుంది.

సమాజకృషి

పాఠశాలల భవనాల నిర్మాణం, వాటికి తగిన ఫర్నీచరు, అదనపు సాధన సామగ్రిని సమకూర్చడం, బీద విద్యార్థులకు ఉచితంగా దుస్తులు ఇవ్వడం, మధ్యాహ్న భోజన వసతివంటి కార్యక్రమాలలో స్థానిక సమాజకృషిని ప్రణాళికలో తలపెట్టారు. పిల్లలను పాఠశాలలకు పంపడం, బాలికలను పంపేట్లు తల్లిదండ్రులకు నచ్చచెప్పడానికి స్థానిక ప్రజల సహకారం అత్యవసరం.

మాధ్యమిక పాఠశాలావిద్య (11-14 మధ్య వయస్సువారికి)

ద్వితీయ ప్రణాళికాంతానికి 4.08 లక్షల మందిని నాలుగు నుంచి ఎనిమిదవ తరగతుల వరకు చేర్చుకున్నారు. (ద్వితీయ ప్రణాళికా లక్ష్యం 3.55 లక్షలే అయినా దాన్ని కూడా మించిందన్న మాట) ఈ మొత్తం 11—14 సంవత్సరాల మధ్యవయసు గల జనాభాలో 17.9 శాతం. ఈ క్రింది పట్టికనుబట్టి ఇతర రాష్ట్రాలతో పోల్చిచూస్తే మనరాష్ట్ర స్థితి చాలా నిరుత్సాహకరంగా వుంటుంది.

	11—14 మధ్యవయసుగల జనాభాలో వారు 4—8 తరగతులలో చేరినశాతం (అంచనా)		
రాష్ట్రం	మొత్తం.	బాలురు.	బాలికలు
కేరళ	50.3	59.4	41.3
మద్రాసు	30.1	41.8	18.3
మహారాష్ట్ర	28.5	40.7	15.5
పంజాబ్	28.3	38.8	16.3
జమ్మూ, కాశ్మీర్	27.8	44.0	9.0
అస్సాం	27.4	37.4	16.0
గుజరాత్	26.8	39.0	13.8
మైసూరు	23.8	34.1	13.1
పశ్చిమబెంగాల్	21.1	30.3	10.7
బీహార్	19.4	34.3	4.2
ఉత్తరప్రదేశ్	18.6	30.9	5.0
ఆంధ్రప్రదేశ్	17.9	27.8	8.0
మధ్యప్రదేశ్	16.3	26.6	5.5
రాజస్థాన్	14.8	24.5	4.1
ఒరిస్సా	7.9	13.8	2.0

తృతీయ ప్రణాళికా కాలంలో అదనంగా 1.68 లక్షల మంది బాలికలను 4_8 తరగతులలో చేర్చుకోవానికి కేటాయింపు జరిగింది. ప్రస్తుతం వున్న మాధ్యమిక పాఠశాలలలో అదనంగా ఉపాధ్యాయులను నియమించకుండానే మరొక 90 వేల మందిని కూడా చేర్చుకోవాలని సంకల్పించారు. ప్రజలలో నూతన చైతన్యం కలుగుతున్నందున తృతీయ ప్రణాళిక మొదటి రెండేళ్ళలో పెక్కు మాధ్యమిక పాఠశాలలు ప్రారంభించవలసివుంది. ఈ చైతన్యం అలాగేవుంటే పాఠశాలలలో చేర్చుకోవలసిన వారి సంఖ్య, అసలు చేర్చుకోదలచిన విద్యార్థుల సంఖ్యకు మించిపోయి. ఆంధ్రప్రదేశ్ కూడా ఈ విషయంలో ఇతర రాష్ట్రాలకో పురోగమించగలదని ఆశించవచ్చు.

ఉన్నత పాఠశాల విద్య (14_17 సంవత్సరాల వారికి)

ద్వితీయ ప్రణాళికాంతానికి 9_11 తరగతులలో 1.91 లక్షల మందిని చేర్చుకున్నారు. (అంచనా 1.86 లక్షలు మాత్రమే) ఈ విద్యార్థుల సంఖ్య మొత్తం 14_17 మధ్య వయసు గల జనాభాలో 9 శాతం అన్నమాట. ఉన్నత పాఠశాల విద్యా విషయంలో ఆంధ్రప్రదేశ్‌ను దేశంలోని ఇతర రాష్ట్రాలతో పోల్చి చూస్తే దానిస్థితి మాధ్యమిక పాఠశాల విద్యాస్థితి వలెనే వున్నట్లు ఈ క్రింది పట్టిక తెలుపుతుంది.

రాష్ట్రం	14_17 సంవత్సరాల మధ్య వయసుగల జనాభాలో 9_11 తరగతులలో చేర్చుకొన్న వారి శాతం.		
	మొత్తం	బాలురు	బాలికలు
కేరళ	21.6	27.00	16.3
అస్సాం	17.5	26.0	7.8
మహారాష్ట్ర	13.6	20.1	6.5
మద్రాసు	13.4	19.9	6.9
బీహార్	12.4	23.0	1.5
గుజరాత్	12.2	18.2	5.8
ఉత్తరప్రదేశ్	12.2	20.9	2.6
పంజాబ్	12 0	19.3	3.6
పశ్చిమబెంగాల్	11.2	17.6	3.8
మైసూరు	10.4	16.6	4.5
జమ్ము. కాశ్మీర్	9.9	15.9	3.2
ఆంధ్రప్రదేశ్	9.0	15.2	2.9
రాజస్థాన్	7.4	13.0	1.3
మధ్యప్రదేశ్	4.3	7.3	1.3
ఒరిస్సా	4.2	7.5	0.8

తృతీయ ప్రణాళికలో 9 నుంచి 11 తరగతులవరకు 50 వేల మందిని అదనంగా చేర్చుకోవాలని ప్రణాళికలో తలపెట్టారు. అంతమాత్రాన ఆంధ్రప్రదేశ్ స్థితి మెరుగుకాదు. కాని మాధ్యమిక పాఠశాల విద్యావశలోవలె తృతీయ ప్రణాళిక మొదటి రెండేళ్ళలో తలపెట్టినదానికన్నా పెక్కు ఉన్నత పాఠశాలలను ప్రారంభించాలి.

హయ్యర్ సెకండరీ, బహుళార్థసాధక పాఠశాలలు

ద్వితీయ ప్రణాళికాంతానికి 140 ఉన్నత పాఠశాలలను హయ్యర్ సెకండరీ పాఠశాలలుగాగాని, బహుళార్థ సాధకోన్నత పాఠశాలలుగాగాని అప్‌గ్రేడ్ చేయడం జరిగింది. సాంకేతిక కోర్సులకు కావలసిన సాంకేతిక ఉద్యోగుల కొరం దృష్ట్యా ఒక్క తృతీయ ప్రణాళికా కాలంలోనే నాలుగువందల ఉన్నత పాఠశాలలను హయ్యర్ సెకండరీ పాఠశాలలుగా మార్చడానికి తగిన కేటాయింపు చేయడానికి సంకల్పించారు.

విద్య, వృత్తివిద్యల సలహా

అభివృద్ధి పథంలో పురోగమిస్తున్న ఏ దేశంలోనైనా ప్రజలు తగిన విద్యా కోర్సులను, వృత్తి విద్యలను ఎన్నుకోడానికి సహాయ భూతంగా వుండడానికి సెకండరీ పాఠశాలలలోని విద్యార్థులకు విద్య, వృత్తివిద్యలపై సలహాలిచ్చే సక్రమమైన కార్యక్రమం అత్యవసరం. ఇందుకై తగినంతమందికి శిక్షణ ఇవ్వడానికై రాష్ట్రవిద్యా, వృత్తివిద్యా విషయకసంస్థను పటిష్టం చేయడానికి సంకల్పించారు. ఈ కార్యక్రమాన్ని కేంద్ర ఆధ్వర్య పథకం క్రింద చేపట్ట సంకల్పించారు. అందువల్ల రాష్ట్రప్రణాళికలో ఎట్టి కేటాయింపు చేయలేదు.

విశ్వ విద్యాలయ విద్య.

ఎలిమెంటరీ. సెకండరీ విద్యా కార్యక్రమాలు విస్తృతం కావడంతో ఉన్నత విద్యావసరం కూడా అధికమైంది. కళాశాలలలో సైన్సుబోధనా సౌకర్యాలను పెంపొందించడానికి, పోస్టు గ్రాడ్యుయేట్ చదువులను, పరిశోధనలను విస్తృతం చేయడానికి విశ్వ విద్యాలయాలకు గ్రాంట్లు ఇవ్వడానికి కేటాయింపు జరిగింది. వాల్తేరులో అణ్వస్త్ర పరిశోధన ప్రయోగాలను నెలకొల్ప దానికి ఆంధ్ర విశ్వ విద్యాలయానికి సహాయక గ్రాంటు ఇవ్వడానికి కూడా

కేటాయింపు జరిగింది. హైదరాబాదులోని గృహ నిర్వహణ శాస్త్ర కళాశాలలో (హోమ్ సైన్స్) 1961-62 లో డిగ్రీ కోర్సును ప్రారంభించడానికి కూడా ప్రణాళికలో కేటాయించారు. 1965-66 లో మరొక కొత్త విశ్వ విద్యాలయాన్ని నెలకొల్ప నిర్ణయించి, అందుకై ప్రణాళికలో నామ మంత్రంగా పది లక్షల రూపాయలను కేటాయించారు. ప్రాంగవర్గం క్రిందవున్న అన్ని కళాశాలలలోని ఉపాధ్యాయులకు విశ్వవిద్యాలయ గ్రాంట్స్ కమిషన్ వేతనాలను ఇవ్వడానికి కూడా కేటాయించారు.

బాలికల విద్య

వివిధ వృత్తులను ముఖ్యంగా విద్యా సంస్థలలో వాటిని చేపట్టడానికి తగినంత మంది విద్యా వంతులైన స్త్రీల కొరత ఏర్పడటంమూలంగా దేశాభివృద్ధికి ఆటంకం కలుగుతున్నది. ఒక బాలుణ్ని విద్యావంతుడిని చేయడమంటే అది ఒక వ్యక్తిని మాత్రమే. కాని ఒక బాలికను విద్యావంతురాలిగా చేయడమంటే ఒక కుటుంబాన్ని విద్యావంతం చేయడమన్నమాట. ఎక్కువ మంది బాలికలకు విద్య గరపడంవల్ల దేశానికెంతో లాభం చేకూరుతుంది. గ్రామీణ ప్రాంతాలలోని బాలికలు అధిక సంఖ్యలో విద్యాలయాలల్లో చేరడాన్ని ప్రోత్సహించడానికి వారికి స్కాలర్ షిప్పులను, సహాయంపొందే హాస్టళ్ళను ఏర్పాటుచేయడానికి, అవసరమైన బాలికలకు పాఠశాలల యూనిఫారమ్‌లను ఇవ్వడానికి కూడా సంకల్పించారు. ఈ కార్యక్రమంలో ఇవే గాక గ్రామీణ ప్రాంతాలలో ఉపాధ్యాయినిలకు ఉచితమైన అద్దె గృహాలను నిర్మించడానికి, తల్లి దండ్రులు తమ కూతుళ్ళను పాఠశాలలకు పంపడాన్ని ప్రోత్సహించడానికి తగిన పరిస్థితులను కల్పించడానికి కూడా కేటాయించారు.

సాంఘిక విద్య

సాంఘికవిద్యకు కావలసిన ముఖ్య కేటాయింపులు అను సంధాన బడ్జెట్ (Schematic Budget) ద్వారా సమాజాభివృద్ధి కార్యక్రమం క్రింద చేర్చబడినవి. సమాజాభివృద్ధి కార్యక్రమాలకు చెందిన సాంఘిక విద్యా కార్యక్రమాలను సహాయకారిగా తాలూకా కేంద్రాలలో గ్రంధాలయాలను నిర్వహించ తలపెట్టారు.



ఏ సంస్కరణైనా విజయవంతం కావాలంటే
దానిని గురించి క్షుణ్ణంగా తెల్సుకోవడానికి
అనవరతం పరిశ్రమ చెయ్యడం అవసరం.
మంచిసంస్కరణలుకూడా విఫలమై పోతూ వుండడానికి
కారణం అజ్ఞానమే. సంస్కరణ
పేర చెలామణీ అయ్యే ప్రతీది సంస్కరణ
కానేరదు.

—మహాత్మాగాంధీ

సాంకేతిక నిపుణులకు ఉద్యోగావకాశాలు

మన దేశ పారిశ్రామికాభివృద్ధి చాలావరకూ సాంకేతిక సిబ్బంది అందుబాటులో వుండటంపై ఆధారపడి వుంది. సాంకేతిక సిబ్బంది అంటే వృత్తి పనివారలకన్న ఎక్కువగానూ, శాస్త్ర నిపుణులకన్న కొంచెం తక్కువ గానూ శాస్త్రీయ, సాంకేతిక పరిజ్ఞానం అవసరమయ్యే బాధ్యతాయుతమైన పనులను నిర్వహించే వారు అని అర్థం.

పారిశ్రామిక యంత్రాగారాల స్థాపన, నిర్మాణాల పర్యవేక్షణ, నిర్వహణ, పరిశీలన, తదితర ప్రత్యేకమైనబాధ్యతలను వీరు నిర్వహిస్తారు. స్వాతంత్ర్యానికి పూర్వం, విదేశాల నుంచి దిగుమతైన యంత్రాలతో మన పరిశ్రమలు నడిచేవి. వాటికి సాంకేతిక నిపుణులు, తగు మాత్రం ప్రావీణ్యత గల సిబ్బంది అవసరం అంతగా వుండేవి కాదు. రెండవ ప్రపంచ యుద్ధం మన పరిశ్రమల నికృష్ట పరిస్థితిని బహిర్గతం చేసింది. యుద్ధ పరికరాలనూ, యంత్ర సామగ్రినీ భారీ ఎత్తున ఉత్పత్తి చేయవలసిన అగత్యం కూడా ఈ ప్రపంచ సంగ్రామం వల్ల ఏర్పడింది.

అప్పటి ఢిల్లీ ప్రభుత్వం నామ మాత్రంగా వున్న ఆ నాటి పరిశ్రమలను విస్తృతపరచడానికి సత్వర చర్యలు గైకొన్నది. అయితే వాటిని నిర్వహించడానికి అవసరమైనంత మంది సాంకేతిక నిపుణులు సిద్ధంగా లేరు. ముఖ్యంగా రెండువిధాలైన అవసరాలకు సాంకేతిక ప్రవీణులు కావల్సివచ్చారు. యుద్ధ రంగంలో పనిచేయడానికీ, యుద్ధపరికరాలను ఉత్పత్తి చేసే యుద్ధ పరిశ్రమలో పనిచేయడానికీ వారు అవసరమయ్యారు. సాంకేతికోద్యోగుల అవసరాలను గురించి తెలుసుకొన్న తరువాత భారీ ఎత్తున సాంకేతిక శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించే పథకాన్ని రూపొందించి అమలు పరచడం జరిగింది. యుద్ధ కాలంలో, మన యుద్ధ పరిశ్రమలోనే గాకుండా, సైనిక, నావిక, వైమానిక దళాలలో కూడా సాంకేతిక నిపుణులకు ఉద్యోగావకాశాలు మిక్కుటంగా ఏర్పడ్డాయి. 1945 వ సంవత్సరంలో యుద్ధం ముగిసిన తరువాత త్రివిధములైన దళాల నుంచీ అనేక మంది సాంకేతిక నిపుణులను తీసివేయడం, యుద్ధ పరిశ్రమ నుంచి సాంకేతిక ప్రవీణులను, ఇతర పనివారలను అధిక సంఖ్యలో తొలగించడం జరిగింది. ఆ పరాయి ప్రభుత్వం మనదేశంలో పరిశ్రమాభివృద్ధికి ఎట్టి పథకాలనూ వేయలేదు. యుద్ధం ముగియడం, బలగాలను ఎత్తివేయడం వల్ల, యుద్ధ కాలంలో సాంకేతిక ప్రవీణులకు వున్న ఉజ్వలమైన అవకాశాలు దాదాపు మృగ్యమై పోయాయి అయితే ఆ పరిస్థితి తాత్కాలికంగానే వుంది. స్వాతంత్ర్యానంతరం ఆ నిరాశాజనకమయిన పరిస్థితి తొలగిపోయింది. మన జాతీయ ప్రభుత్వం దేశ ఆర్థికాభివృద్ధికి తీవ్రంగా కృషి చేస్తున్నది. ఆ లక్ష్య సాధనకై వ్యవసాయం, విద్యుచ్ఛక్తి అభివృద్ధికి విస్తారమైన మన సహజ వనరులను సమర్థంగా వినియోగంలోకి తేవడానికీ, ఉక్కు, నూనె రసాయనికాల వంటి భారీ పరిశ్రమలను స్థాపించడానికి విస్తృతంగా పథకాలు రూపొందించింది. మొదటి రెండు ప్రణాళికలూ నిపుణతలేని పనివారలకూ, సాంకేతిక నిపుణులకూ, ఇంజనీర్లకూ, పరిపాలనా నిర్వాహకులకూ అత్యధికంగా ఉద్యోగావకాశాలు కల్పించాయి. మన దేశ ఆర్థికాభివృద్ధికై సుశిక్షితులైన ఉద్యోగ బృందం అత్యవసరం. జాతీయాభ్యుదయం దాని పారిశ్రామికాభివృద్ధిపైనే ఆధారపడి వుంది.

విస్తృతమైన మన ద్వితీయ పంచవర్ష ప్రణాళికను పూర్తి చేసుకున్నాము. రెండు పంచవర్ష ప్రణాళికల స్వల్ప కాలంలోనే మనం పారిశ్రామికంగా సత్వరాభివృద్ధిని సాధించినమనడానికి దేశంలో ప్రతి చోటూ నిదర్శనాలు కానవస్తాయి. మన తృతీయ

ప్రణాళిక ఆరంభమైంది. వివిధ పథకాలు విజయవంతంగా అమలు జరగాలంటే అదనంగా 12 మొదలు 13 లక్షల వరకు సాంకేతిక నిపుణులు, వృత్తి పనివారలు అవసరమవుతారని అంచనా వేశారు. కాగా వీరిలో సుమారు 8 లక్షల మంది ఇంజనీరింగ్ పనులకూ మిగిలినవారు నాన్ ఇంజనీరింగ్ పనులకూ కావల్సి వస్తారు. మన పరిశ్రమలకై సాంకేతిక సిబ్బంది అవసరం నిరంతరం పెరుగుతూ వుంది.

వర్క్‌షాపులు, ఫ్యాక్టరీలు, విద్యుత్కేంద్రాలు, నూనె శుద్ధి కర్మాగారాలు, బట్టల మిల్లులు మొదలైనవాటిలో నిపుణతతో చేయవలసిన అనేకమైన పనులకు పలురకాలైన సాంకేతిక ప్రవీణులు కావల్సి వస్తారు. ఎలక్ట్రిషియన్లు, టర్నర్లు, మెకానికులు, డ్రాఫ్ట్స్‌మెన్ (సివిల్, ఎలక్ట్రికల్, మెకానికల్), వెల్డర్లు (గ్యాస్, ఎలక్ట్రిక్), ఇన్‌స్ట్రుమెంట్ మెకానికులు, ఫిట్టర్లు మొదలైన సాంకేతిక నిపుణులకు పరిశ్రమలలో పనులు లభిస్తాయి. వీటిని ఇంజనీరింగ్ పనులంటారు. ఇలాంటి పనులు అనేకం వున్నాయి. మెట్రిక్ కంటే కనీసం రెండు తరగతులు తక్కువ వరకు విద్యాభ్యాసం చేసి వుండి మెకానికల్ విషయాలలో అభిరుచి వున్నవారు ఇంజనీరింగ్ వృత్తులలో దేనిలోనైనా, ఏదైనా పారిశ్రామిక శిక్షణ సంస్థలో ఉచితంగా శిక్షణ పొంది పరిజ్ఞానం సంపాదించవచ్చు. ఇంజనీరింగ్ పరిశ్రమలో దేనిలోనైనా టెక్నీషియన్‌గా శిక్షణ పొందిన వారెవరైనా, రైల్వేలు, నౌకా కేంద్రాలు, ఆర్డినెన్స్ ఫ్యాక్టరీలు, ఎయిర్‌క్రాఫ్ట్స్ ఫ్యాక్టరీలు మొదలైన భారీ, తేలికరకం ఇంజనీరింగ్ పరిశ్రమలలో ఏ శాఖలలోనైనా పని లభిస్తుందని అభిలషిస్తాడు. ఇంజనీరింగ్ వృత్తులకు చెందే ఈ సాంకేతిక నిపుణులు కాక, నాన్ ఇంజనీరింగ్ వృత్తులలో శిక్షణ పొందిన వారు కూడా వున్నారు. వాణిజ్యానికీ, ఇంటి వాడకానికి అవసరమయ్యే వివిధ వస్తువులను తయారుచేసే పరిశ్రమలలో వీరిని నియోగిస్తారు. కొన్ని ముఖ్యమైన ఇంజనీరింగ్, నాన్ ఇంజనీరింగ్ వృత్తులలో గల ఉద్యోగావకాశాలను గురించి దిగువ పట్టికలో తెలుసుకోవచ్చును:-

వృత్తి పనివారల రకం	ఉద్యోగావకాశాలు వుండే సంస్థలు–ఉన్నతికి గల అవకాశాలు
I. ఇంజనీరింగ్ వృత్తులు. 1. టర్నర్లు	రైల్వేలు, నౌకా కేంద్రాలు, ఆర్డినెన్స్ ఫ్యాక్టరీల వంటి, భారీ తేలిక రకం ఇంజనీరింగ్ పరిశ్రమల అన్ని శాఖలు అనుభవం గల టర్నర్లు, మెషిన్ సూపర్‌వైజరు, ఛార్జ్‌మన్, ఫోర్మన్, వర్క్‌షాప్ సూపరింటెండెంట్ల స్థాయికి వెళ్తారు.
2. జనరల్ ఫిట్టర్లు	అన్ని రకాలైన వర్క్‌షాపులు, ఉత్పత్తి పరిశ్రమలు. అనుభవజ్ఞులైన ఫిట్టర్లు, సూపర్‌వైజర్, ఛార్జ్‌మన్ స్థాయికి చేరుకోవచ్చు.
3. మెకానిస్టులు	ప్రభుత్వం ప్రైవేటు పారిశ్రామికుల టూల్ రూమ్స్, మెషిన్ షాపులు.
4. మౌల్డర్లు	అన్ని ఉత్పత్తి సంస్థలు, బట్టల మిల్లులు, జనరల్ వర్క్‌షాపుల ఫౌండరీలు.
5. వెల్డర్లు	వివిధ పారిశ్రామిక సంస్థల స్థాపన ఉత్పత్తికి సంబంధించిన పనులు, వాటి నిర్వహణ, మరమ్మతులు.
6. ఎలక్ట్రిషియన్లు	రైల్వే వర్క్‌షాపులు, విద్యుత్కేంద్రాలు, నౌకా కేంద్రాలు ప. వ. శా. మొదలైనవి.
II. నాన్ ఇంజనీరింగ్ వృత్తులు:	
1. చలువ చేయడం, రంగు అద్దడం, కాలికో ప్రింటింగ్	చేనేత పరిశ్రమ పెద్ద పెద్ద బట్టల మిల్లులు.
2. పుస్తకాల బైండింగ్	ముద్రణ పరిశ్రమ.
3. చేనేత పనివారలు	చేనేత పనివారల సహకార సంస్థలు.
4. పాదరక్షల తయారీ	బాటా షూ కంపెనీ, ఫ్లెక్స్ షూ కంపెనీ వంటి పెద్ద పెద్ద సంస్థలు ఆర్డినెన్స్ ఫ్యాక్టరీలు.
5. పండ్లు కూరగాయలను నిలువచేయడం.	పంట్ల పరిశ్రమలు.

ప్రథమ, ద్వితీయ పంచవర్ష ప్రణాళికల కాలాలలో మన పారిశ్రామిక రంగం పూర్తిగా మార్పుచెందినదనడం సుస్పష్టం. నూతన యంత్రాలనూ, సరికొత్త పని విధానాలను అభివృద్ధిపరిచి ప్రవేశపెడుతున్నారు. వాటిని నిర్వహించడానికి విద్యావంతులు, వివేకవంతులు అయిన శిక్షణ పొందిన ఉద్యోగులను నియమించ

వలసిన అవసరం కలిగింది. మన పరిశ్రమలు క్రమానుగతంగా అభివృద్ధి చెందడంతో పాటే మన సాయుధ దళాలు అంటే సైనిక, నావిక, వైమానిక దళాలు కూడా చాలా వరకు విస్తృతి చెందాయి. మన సాయుధ దళాల యాంత్రీకీకరణ వల్ల వివిధ రకాలైన టెక్నీషియన్లు, నిపుణత గల పని వారలు, తగు మాత్రం నిపుణత గల పనివారలతో కూడిన సాంకేతిక నిపుణుల బృందానికి భారీ ఎత్తున ఉద్యోగావకాశాలు ఏర్పడ్డాయి. ఉదాహరణకు జనరల్ ఇంజనీరింగ్ పనులలోని వెల్డర్లు, కమ్మరలు, వడ్రంగులు మొదలైన వృత్తి పనివారలూ: మోటారు మెకానికులు, వైర్‌లెస్ మెకానికులు, రీడర్ మెకానికులు, గన్ ఫిట్టర్ల వంటి ప్రవీణులైన సాంకేతిక నిపుణులు వివిధ రకాల మిలిటరీ ఉపకరణాల మరమ్మతులకూ, నిర్వహణకూ నియోగించబడ్డారు. బెంగాలు, బొంబాయి, మద్రాసు ఇంజనీరింగ్ గ్రూపులలో 36 రకాల సాంకేతిక నిపుణులు వేల మంది పనిచేస్తారు. ఎలక్ట్రికల్, మెకానికల్ ఇంజనీరింగ్ దళాలలో అనేక మంది సాంకేతిక నిపుణులు, ఇంజనీర్లు వున్నారు. ఇ. ఎం. ఇ. గా ఇది ప్రసిద్ధి చెందినది. భారత సైన్యానికిచెందిన మెకానికల్, ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్, ఆప్టికల్ ఉపకరణాల తనిఖీ, మరమ్మతు నిర్వహణ భారం ఇది వహిస్తుంది ఆధునిక ప్రపంచంలో యుద్ధాలు అతిక్లిష్టమైనవిగా పరిణమించాయి. వీటిలో ఉపయోగించే ఉపకరణాలు బహువిధాలైనవిగా, క్లిష్టతమమైనవిగా వుంటున్నాయి. ఇలాంటి వాటిని సర్వవేళ సవ్యావస్థలలోనూ యుద్ధ ప్రయోజనాలకు సంసిద్ధంగా వుంచడం ఇ.ఎం.ఇ. పని. ఈ దళాలలో దాదాపు అన్ని రకాల సాంకేతిక నిపుణులూ అధిక సంఖ్యలో పని చేస్తారు. సైనిక సిగ్నల్ దళంలో వైర్లెస్ ఆపరేటర్లు, రేడియో టెలిగ్రాఫ్ మెకానికులు, స్విచ్‌బోర్డు ఆపరేటర్లు మొదలైన వారికి అధికంగా ఉద్యోగావకాశాలు వుంటాయి. సాయుధ దళాలలో పనిచేసే ప్రతి సాంకేతిక నిపుణుడు కూడా సైనికుడు కావడం చేత, వ్యాయామ శిక్షణ, మిలటరీ శిక్షణ, ఆయుధ శిక్షణ పొందవలసి వుంటుంది. ఇవిగాక మన దేశంలో ముఖ్యమైన కేంద్రాలలో సైనిక ఆర్డినెన్స్ ఫ్యాక్టరీలున్నాయి. అరువంకడులో నున్న కార్డైట్ ఫ్యాక్టరీ, యుద్ధరంగంలో మన సైనిక దళాలకు అవసరమయ్యే పలురకాల వినియోగ వస్తువులను ఉత్పత్తి చేస్తుంది. ఈ ఫ్యాక్టరీ తుపాకీ మందుసూ, అనేక రకాల బుల్లెట్లను కూడా ఉత్పత్తి చేస్తుంది. దీనిలో జనరల్ ఫిట్టర్లు మొదలు కమ్మరలు, వడ్రంగుల వరకు అనేక మంది నిపుణతగల పనివారలు పనిచేస్తారు. సివిలియన్ ఉద్యోగులుగానే వీరు వీటిలో పనిచేస్తారు. ఫీల్డు సర్వీసు బాధ్యతలు వీరికి వుండవు.

దీనిని బట్టి రక్షణ సర్వీసులలో ఒక విభాగంలో ఉద్యోగావకాశాలు ఉజ్వలంగా ఉన్నాయనే విషయం ఎవరికైనా బోధపడుతుంది.

మనరక్షణ బలగాలలోని మరి రెండు విభాగాలు నౌక, వైమానిక దళాలు. ఇవి శీఘ్రంగా అభివృద్ధి చెందుతున్నాయి. ఆర్టిఫిసర్స్ ఇంకా ఇతర మెరీన్ ఇంజనీరింగ్ వృత్తులు. వైర్‌లెస్ ఆపరేటర్లు, ఏంటి ఎయిర్‌క్రాఫ్ట్ మెకానికులు, ఇన్‌స్ట్రుమెంట్ మెకానికులవంటి, ఇంజనీరింగ్ పనులకు చెందిన సాంకేతిక నిపుణులకు—ధైర్య సాహసాలుగల యువ సాంకేతిక నిపుణులకు—ఉద్యోగావకాశాలు ఉజ్వలంగా వున్నాయి. మతం, వర్గం, సాంఘిక ప్రతిపత్తులతో ప్రమేయంలేకుండా ఆయా వృత్తులలో ప్రతిభ కనబరిచినవారు పైస్థాయికి, ఆఫీసరుహోదాకు కూడా ప్రమోటు చేయబడే అవకాశాలుంటాయి. మన రక్షణ సర్వీసుల మూడు విభాగాలూ ఆకర్షణీయమైన విధానంలో మన సాంకేతిక నిపుణులకు ఉద్యోగావకాశాలు సమృద్ధిగా కల్పిస్తున్నాయి. ఈ మూడు సర్వీసులలోనూ ప్రతిభా వంతులైన వారికి పై హోదాకు చేరుకోడానికి ప్రమోషను అవకాశాలు ఇదే విధంగా అధికంగా వుంటాయి.

సాయుధ దళాలలోచేరడానికి ఇష్టపడనివారికి, ప్రభుత్వ నిర్వహణలోనున్న పరిశ్రమలలోనూ, రైల్వేలలోనూ, ఉద్యోగావకాశాలు మిక్కుటంగా లభిస్తాయి. అన్ని భారీ పరిశ్రమలనూ రైల్వేలవర్క్‌షాపులనూ, వాటిలో సాంకేతిక నిపుణులకు గల ఉద్యోగావకాశాలకు సంబంధించిన సమాచారాన్ని వివరంగా పేర్కొనడం ఇక్కడ స్థలాభావంవల్ల సాధ్యంకాదు. అయినప్పటికీ ఉద్యోగావకాశాలను గురించి సంక్షిప్తంగా పేర్కొనవచ్చు. ప్రభుత్వరంగంలో మన రైల్వేలశాఖ పెద్దది. రెండు పంచవర్ష ప్రణాళికల అమలుతో పెంపొందుతున్న మన పరిశ్రమల అవసరాలను తీర్చడానికై రైల్వేల రవాణా శక్తిని అభివృద్ధి పరచవలసి వచ్చింది. ఈ విధంగా అవసరమైనచోట్ల కొత్త మార్గాలు వేయడం, ప్రస్తుత నిర్వహణ యూనిట్లను విస్తృత పరచడం తప్పనిసరి అయింది. నిపుణతగలవారు, తగుమాత్రం నిపుణతగల వారు, నిపుణతలేని పనివారలు వేల సంఖ్యలో పనిచేసే రైల్వే వర్క్‌షాపులు అనేకం వున్నాయి. నిర్వహణ, మరమ్మతులను ఇవి చేపడతాయి. లాలాగూడాలో వున్నటువంటి కొన్ని వర్క్‌షాపులలో నారోగేజ్ ఆల్‌స్టీల్‌పెట్టెలు, టాంక్ వ్యాగన్లు, పెట్టెనమూనావ్యాగన్లు తయారుచేస్తారు. పని ప్రమాణం తగ్గకుండా చూడటానికీ, ఈ వర్క్‌షాపులలో పని చేయడానికి సుశిక్షితులైన అన్ని రకాల

సాంకేతికులు అత్యధిక సంఖ్యలో నియమించబడతారు. మద్రాసు పెరంబూరులోని ఇంటెగ్రల్ కోచ్ బిల్డింగ్ ఫ్యాక్టరీ మన దేశంలో చాలా పెద్దది. అన్ని రకాల సాంకేతిక నిపుణులు వేల సంఖ్యలో దీనిలో పనిచేస్తారు ఈ ఫ్యాక్టరీకి అనుబంధంగా ఒక రిక్రూట్మెంట్ కమిటీవుంది. ఈ కమిటీవారు మధ్య మధ్య ఫ్యాక్టరీకిచెందిన వివిధ శాఖలలో పనిచేయడానికై శిక్షణ నిమిత్తం అర్హులైన అభ్యర్థులను ఎన్నికచేస్తారు. ఐ. టి. ఐ. శిక్షణపథకం క్రింద శిక్షణపొందిన సాంకేతిక నిపుణులకు ప్రాధాన్యత ఇస్తారు. మనరైల్వేలకు కావల్సిన ఇంజన్లలో కొన్నింటిని చిత్తరంజన్ లోకొమోటివ్‌వర్క్స్ లిమిటెడ్‌లో తయారుచేస్తున్నారు. ఇటీవలే ఈ పరిశ్రమను ఆరంభించారు. దేశంలోని రైల్వేల కన్నింటికీ అవసరమైన ఇంజన్లను తయారుచేస్తూ దేశమంతటిలోకీ ముఖ్యమైన పరిశ్రమగా భాసిల్లే అవకాశం దీనికి వుంది. బ్రహ్మాండమైన ఈ ఫ్యాక్టరీలో వివిధ శాఖలలో పనిచేయడానికి సాంకేతిక నిపుణుల అవసరం నిశ్చలంగా వుంటుంది.

అభివృద్ధి జెందుతున్న మన ఇతర పరిశ్రమలలో సాంకేతిక నిపుణులకుగల ఉద్యోగావకాశాలను గురించి సంక్షిప్తంగా తెలుసుకుందాం. రెండవ పంచవర్ష ప్రణాళికా కాలంలో క్రొత్త పరిశ్రమలు ప్రారంభించబడినాయి కాబట్టి, శిక్షితులు, అర్హులు అయిన ఉద్యోగులకొరత అధికంగా కానవచ్చింది. మన అభివృద్ధి ప్రణాళికల పురోగతికి కూడా ఈ పరిస్థితి కొంత వరకు అంతరాయం కలిగించింది. అర్హులైన సాంకేతికులను లభించినంతవరకు నియమించడంతోపాటు, పరిశ్రమలకు అవసరమైన సాంకేతిక నిపుణులను సిద్ధంచేయడానికై యువకులకు సాంకేతిక శిక్షణ గరపడానికి కార్యక్రమాలను ప్రారంభించడం అవసరమని భావించబడింది. ఈ ఉద్దేశంతోనే భారత ప్రభుత్వానికిచెందిన వివిధ మంత్రిత్వశాఖలు నెలకొల్పిన పరిశ్రమలకూ, ఫ్యాక్టరీలకూ కావల్సిన సాంకేతికోద్యోగుల శిక్షణ నిమిత్తం పథకాలను రూపొందించడం, అమలుపరచడం, వెన్వెంటనే కార్మిక ఉద్యోగ సాధక మంత్రిత్వ శాఖ సాంకేతికశిక్షణ కార్యక్రమాలను కూడా నిర్వహించడం జరిగింది. ఈ శిక్షణ కార్యక్రమాల ఫలితంగా మన సాంకేతికసంస్థలు మన పరిశ్రమలకు శిక్షితులు, అర్హులు అయిన సాంకేతిక నిపుణులను నిశ్చలంగా లభింపచేయ గలుగుతున్నాయి. మన పరిశ్రమలు విస్తరిస్తున్నాయి. కనుక సాంకేతికసిబ్బంది అవసరాలు ఏటేటా పెరుగుతాయి. ఉక్కు పరిశ్రమ మన ప్రధాన పరిశ్రమలలో ఒకటి. ప్రభుత్వ రంగంలోని నాలుగు భారీ ఉక్కు ఫ్యాక్టరీలైన హిందుస్తాన్ స్టీల్ లిమిటెడ్, రూర్కేలా, భిలాయ్ ఉక్కు యంత్రాగారాలు, మైసూరు ఐరన్ అండ్ స్టీల్‌వర్క్స్). ప్రైవేటు రంగంలోని భారీ సంస్థలైన తాతా ఐరన్ అండ్ స్టీల్ కంపెనీ ఇండియన్ ఐరన్ అండ్ స్టీల్ కంపెనీలలో కొన్ని వేల మంది అర్హులైన ఇంజనీర్లు, పర్యవేక్షణ సిబ్బంది, సాంకేతికులు తదితర నిపుణులైన పనివారు పనిచేస్తున్నారు. జనరల్ ఫిట్టర్లు, టర్నర్లు, మొదలుకొని కమ్మరులు, వడ్రంగులవరకు అన్నిరకాల సాంకేతిక నిపుణులకు విరివిగా ఉద్యోగావకాశాలు వున్నాయి. హిందుస్తాన్ స్టీల్ లిమిటెడ్, తాతా సంస్థలలో సాంకేతిక సిబ్బంది శిక్షణకు కూడా ఏర్పాట్లు వున్నాయి.

నూనె పరిశ్రమ, నైవెల్లీ లిగ్నైట్ కార్పొరేషన్ లిమిటెడ్, భారత గనుల సంస్థ సింగరేణి కాలరీస్ కంపెనీ, నేషనల్ కోల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చక్కెర పరిశ్రమ, భారత తంతి పరిశ్రమ, హిందుస్తాన్ ఎయిర్ క్రాఫ్ట్ భారత్ ఎలక్ట్రానిక్స్ హిందుస్తాన్ మెషిన్ టూల్ వంటి సంస్థలలో కూడా సాంకేతిక నిపుణులకు ఉద్యోగావకాశాలు వున్నాయి. నూనె పరిశ్రమ, లిగ్నైట్ కార్పొరేషను, భారత గనులసంస్థ, సింగరేణి కాలరీస్ నేషనల్ కోల్ డెవలప్‌మెంట్ కార్పొరేషనులలో ఫిట్టర్లు, టర్నర్లు, వెల్డర్లు మొదలైన ఇంజనీరింగ్ వృత్తుల సాంకేతిక నిపుణులలేగాక డ్రిల్లర్లు, అండర్‌గ్రౌండ్ మెకానికల్, ఎలక్ట్రికల్ ఫిట్టర్లు, డీసెల్ ఇంజన్ ఫిట్టర్ల వంటి సాంకేతిక నిపుణులు కూడా అవసరమవుతారు. తంతి పరిశ్రమలు, హిందుస్తాన్ మెషిన్ టూల్స్, హిందుస్తాన్ ఎయిర్ క్రాఫ్ట్ భారత్ ఎలక్ట్రానిక్స్‌లలో ఇన్‌స్ట్రుమెంట్ మెకానికులకు విరివిగా ఉపాధి అవకాశాలు వున్నాయి. ప్రభుత్వ రంగంలోని ఈ పరిశ్రమలు, ఫ్యాక్టరీలలోనే గాక ప్రైవేటు రంగంలోని కొన్ని సంస్థలలో కూడా ప్రభుత్వ రంగంలో

ఉన్నంతగాకాకున్నా విరివిగానే సాంకేతికనిపుణులకు ఉద్యోగావకాశాలు లభిస్తాయి. వీటిలో అనేక సంస్థలు ఆయా పరిశ్రమలకు అవసరమైన సాంకేతికోద్యోగులకు తర్ఫీదు ఇచ్చే నిమిత్తం శిక్షణ కార్యక్రమాలను కూడా నిర్వహిస్తున్నాయి.

మన దేశంలో సాంకేతిక నిపుణులకుగల ఉద్యోగావకాశాలను గురించి పైన సంగ్రహంగా తెలుసుకున్నాము. పోతే ఆంధ్ర ప్రదేశ్‌లో సాంకేతిక నిపుణులకు ఉద్యోగావకాశాలు చక్కగా వున్నాయి. ఈ విషయాలను గురించి తెలుసుకోడానికి పరిశ్రమల సరళిని గురించిన పరిజ్ఞానం కలిగివుండటం అవసరం. పారిశ్రామికంగా కొన్ని ఉత్తర భారత రాష్ట్రాలు అభివృద్ధి జెందినంతగా ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి జెందలేదనే విషయం యథార్థమే అయినప్పటికీ పూర్వం. ఇప్పుడూ మనరాష్ట్ర ప్రభుత్వాలు గైకొన్న చర్యల ఫలితంగా ప్రథమ, ద్వితీయ పంచవర్ష ప్రణాళికల కాలంలో వివిధ రకాల పరిశ్రమలనూ, ఫ్యాక్టరీలను స్థాపించడానికి వీలు కలిగింది. అయితే ఆంధ్రప్రదేశ్ దేశ పారిశ్రామిక పటంలో బడుగు స్థానాన్ని మాత్రమే ఆక్రమిస్తుంది.

ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక సరళిని గురించి దిగువ పట్టిక బట్టి తెలుసుకొనవచ్చు:

	సంఖ్య
1. ఉక్కు తీగెలను పోతపోయడం, నిర్మాణ సాధనాలు	2
2. జి. ఐ. గొట్టపు ఫ్యాక్టరీలు	3
3. యంత్రసామగ్రి వ్యవసాయపరికరాల, ఉత్పత్తి	4
4. ఉక్కు యంత్రపరికరాల, ఉత్పత్తి	1
5. రేజర్ బ్లేడులు	1
6. రీరోలింగ్ మిల్లులు	1
7. టిన్ కంటేనర్స్	2
8. కిరోసిన్ ఇంజన్ల ఉత్పత్తి	1
9. నౌకా నిర్మాణ కేంద్రం	1
10. నూనె శుద్ధి కర్మాగారం	1
11. బిస్కెట్లు, ఫలాలను డబ్బాలలో నిల్వచేయడం, మిఠాయిలు, వనస్పతి వగైరా	7
12. ప్లాస్టిక్, సెరామిక్, సిమెంట్, ఆస్బెస్టాస్ ఫ్యాక్టరీలు	14
13. ఇనార్గానిక్, ఆర్గానిక్, భారీ రసాయనికాలు,	1
డ్రగ్, పవర్ ఆల్కహాల్, కార్బండై ఆక్సైడ్ ఫ్యాక్టరీలు, స్టార్చిఫ్యాక్టరీలు వగైరా	18
14. ఎరువుల ఫ్యాక్టరీలు	4
15. కాగితపు మిల్లులు, స్ట్రాబోర్డు, హేండ్ బోర్డు ఫ్యాక్టరీలు, క్లిప్ బోర్డులు,	6
16. ప్రేలుడు పదార్థాలను ఉత్పత్తిచేసే కంపెనీ.	1
17. చక్కెర ఫ్యాక్టరీలు	7
18. బట్టల మిల్లులు, జనపనార మిల్లులు	11
19. విద్యుత్ పరికరాలు, శాస్త్రీయ పరికరాలు,	3
20. సబ్బు ఫ్యాక్టరీలు, పిండిమరలు వగైరా	13

పైన పేర్కొన్న జాబితా సమగ్రమైనదీ, కొత్తదీ కాకపోయినప్పటికీ, ఆంధ్రప్రదేశ్‌లో వివిధ రకాల సాంకేతిక నిపుణులకు గల ఉద్యోగావకాశాలను గురించి కొంతవరకు తెలుసుకోడానికి ఇది తోడ్పడుతుంది. సాంకేతిక సిబ్బందికి దేశంలో వ్యాపించివున్న భారీ పరిశ్రమల్లో వున్నంతగా ఉద్యోగావకాశాలు లేకపోయినప్పటికీ, ప్రస్తుత పరిశ్రమలు, ఫ్యాక్టరీల విస్తరణ పథకాలవల్లా, రాష్ట్ర, కేంద్రప్రభుత్వాల నూతన పారిశ్రామిక కార్యక్రమాలవల్లా తృతీయ ప్రణాళికాకాలంలోనూ ఆ తరువాతి ప్రణాళికల్లోనూ ఉద్యోగాలకు అత్యధికంగా అవకాశాలు ఏర్పడతాయి. ప్రపంచంలోకెల్లా పెద్ద రాతి ఆనకట్ట అయిన నాగార్జునసాగర్ ప్రాజెక్టువద్ద రోజు పని ముమ్మరంగా జరిగే సమయంలో నిపుణులు కాని అనేకమంది పనివారలుగాక సాంకేతిక నిపుణులతో సహా సుమారు 4,500 మంది నిపుణతగల పనివారలు పనిచేయవలసి వుంటుందని అంచనా వేశారు. ఆనకట్ట నిర్మాణం త్వరలో ముఖ్యదశ నందుకుంటుంది. కాబట్టి అప్పటికి సాంకేతిక నిపుణులు, నిపుణతగల పనివారు, నిపుణతలేని పనివారల అవసరం కూడా పెరుగుతుంది. ఆనకట్ట నిర్మాణంతో పాటు కాలువ త్రవ్వకం పథకం కూడా అమలు జరుగుతుంది. డబ్బు కేటాయింపు దృష్ట్యా,

(మిగతా XXXవ పేజీలో)

ఆంధ్ర ప్రదేశ్‌లోని

సాంకేతిక సంస్థలలో పరిశ్రమలకు లభ్యమయ్యే పరిశోధనా సౌకర్యాలు

ప్రొఫెసర్ శ్రీ వి.వి.యల్. రావు

(అనంతపూరు ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్)

ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్‌లో 6 ఇంజనీరింగు కళాశాలలు 15 పాలీ టెక్నిక్‌లు, 6 పారిశ్రామిక శిక్షణ సంస్థలూ ఉన్నాయి. భారతప్రభుత్వం వివిధ రాష్ట్రాలలో నెలకొల్ప నిర్ణయించిన తొమ్మిది ఇంజనీరింగ్ కళాశాలలలో వరంగల్‌లోని ప్రాంతీయ ఇంజనీరింగ్ కళాశాల ఒకటి. దీన్ని నెలకొల్పి మూడేళ్ళే అయినందున ఇది ఇంకా తగిన సాధన సంపత్తిని సమకూర్చుకో వలసి ఉంది. వాల్తేరు, తిరుపతిలలోవున్న విశ్వవిద్యాలయ ఇంజనీరింగ్ కళాశాలలు కూడా ఇదే దశలోవున్నాయి. హైదరాబాద్‌లో ఉస్మానియా విశ్వ విద్యాలయానికి అనుబంధంగావున్న ఇంజనీరింగ్ కళాశాల చాల పాతది. ఇది మంచి స్థితిలోనేవున్నది. ఈ విధంగా మంచిసాధన సంపత్తితోవున్న కళాశాలలు (16 సంవత్సరాలు పైబడ్డవి) కాకినాడ, అనంతపూర్‌లలోవున్నవి. కాకినాడలోది తప్ప రాష్ట్రంలోని పెక్కు పాలిటెక్నిక్‌లను గత కొద్ది సంవత్సరాల కాలంలోనే ప్రారంభించారు. అందువల్ల పారిశ్రామిక పరిశోధనా సౌకర్యాలను ఆశించడం తొందరపడటమే అవుతుంది. కొన్ని పారిశ్రామిక శిక్షణసంస్థలు వివిధ సహాయ పథకాలక్రింద మంచి సాధన సంపత్తిని సమకూర్చుకోగలిగినాయి కాని ఈ సాధన సామగ్రులు ఉత్పత్తికే ఉపయోగించుతాయి కాని పరిశోధనకు అంతగా ఉపయోగించవనడంలో ఎట్టి సందేహమూలేదు.

ప్రస్తుత పరిస్థితులలో పారిశ్రామిక పరిశోధనను చేపట్టడం కాకినాడ, అనంతపూర్‌లలోని ఇంజనీరింగ్ కళాశాలలలో మాత్రమే వీలవుతుంది. అయితే హైదరాబాదులోని ఇంజనీరింగ్ కళాశాలలోకూడా బహుశా ఈ అవకాశం యేర్పడవచ్చు. ఇక్కడ కూడా చేపట్టవలసినపనులు వైవిధ్యంలోనేగాక. పని పరిమాణంలో కూడా కొన్ని కారణాలవల్ల సహజంగా చాలా పరిమితమైనవి. ఈ సంస్థలలోని వర్కుషాపులు, వివిధ ప్రయోగశాలలు బేసిక్ (బి. ఇ.) డిగ్రీ స్థాయిలో విద్యార్థులకు ప్రాథమిక బోధనకు తగినట్లున్నవి. పారిశ్రామిక పరిశోధనకు లభించే అవకాశాలు యాదృచ్ఛికం మాత్రమే. అంతేగాక వీటిలో కాలపరిమితి సమస్య కూడా వుంది ఆంధ్రప్రదేశ్‌లో బాగా అభివృద్ధిదశలో వున్న ఈ రెండు ప్రభుత్వ ఇంజనీరింగ్ కళాశాలలు ఇతర సంస్థలకు (పాలిటెక్నిక్‌లు, ఇంజనీరింగ్ కళాశాలలు) చెందిన విద్యార్థులకు వారి ప్రయోగాత్మకశిక్షణకు సౌకర్యాలు కల్పించడం ద్వారా శిక్షణ గరపాలని ప్రభుత్వం ఆదేశించింది. అందువల్ల పూర్తిగా ఈ పనిలోనే నిమగ్నమై వుండటంవల్ల ఈ రెండు కళాశాలలలో ఇతర పారిశ్రామిక పరిశోధనకు అవకాశం వుండదు.

పారిశ్రామిక పరిశోధనకు వలసిన సౌకర్యాలు ఈ రెండు ఇంజనీరింగ్ కళాశాలలలోని ధాతువుల పరిశోధన ప్రయోగశాలలోను, అంతకు తక్కువస్థాయిగలవాటికి, విద్యుత్ ఇంజనీరింగ్ ప్రయోగశాలలోనూ అవకాశాలున్నాయి. ఉదాహరణకుకాకినాడలోని

ఇంజనీరింగ్ కళాశాలలో "లోహశక్తి (Strength of Material) ప్రయోగశాలలో జర్మనీలో తయారైన మూడు వందల టన్నుల కంప్రెషన్ టెస్టింగ్ మెషిన్ వున్నది. దీనిని 13 అడుగుల ఎత్తు వరకు వరుసగా జరుపుకోవచ్చు. అంతేగాక కలపపై అన్ని రకాల పరిశోధనలు జరపడానికి నిర్దేశించబడిన ఒక కలప పరిశోధన మెషిన్ బైటుమెన్ (శిలాజిత్తు అను తైలము) నాణ్యాన్ని పరిశోధించడానికనువైన యంత్రసామగ్రి కూడా ఈ కళాశాలలోవున్నది. అలాగే అనంతపూర్‌లో వివిధ నిర్మాణాలపై బరువుల ప్రభావాన్ని పరిశీలించడానికి ఒక 'ఫోటో ఎలాస్టిక్'యంత్ర సాధనంవుంది. తేలికరకం ఉక్కు కడ్డీలపై పెళుసుదనపు పరిశోధనలను, కాంక్రీటు. శిలాఘనపు వస్తువులపైకంప్రెషన్ పరిశోధనలు, సిమెంటుపై పరిశోధనలు లోహాలగట్టిదనం పరిశీలన, నేలలపై తేలికరకం పరిశోధనలు కూడా దానిపై సాగించవచ్చు.

విద్యుత్ ఇంజనీరింగ్ రంగంలో కాకినాడ ఇంజనీరింగ్ కళాశాలలో ఒక ఇంపల్సు జనరేటర్‌తో ఎక్కువ ఓల్టేజిగల ప్రయోగశాలవున్నది. ఈ ప్రయోగశాలలో ఏర్పరచబడిన కృత్రిమ కాంతి విధానంక్రింద ట్రాన్స్‌ఫార్మర్లు, ఇన్సులేటర్లు మొదలైన యంత్ర సామగ్రిపనిని పరిశీలించడానికి ఈ జనరేటరు ఎంతో ఉపయోగిస్తుంది. 25 అశ్వశక్తి 15 కి. వాల పరిమాణంగల అన్ని రకాల విద్యుత్ యంత్రాలను పరీక్షించడానికిక్కడ అవకాశాలున్నాయి. రెండుదశలు, మూడుదశలు శక్తిగల మీటర్లను భారీ ఎత్తున పరీక్షించడానికి అనంతపూరు, కాకినాడలలోని రెండు కళాశాలలలో "లోడ్—టెస్టింగ్ సెట్లు" వున్నాయి. వోల్టు మీటర్లు, ఎమ్మీటర్లు, వాట్ మీటర్లువంటి కొలతల సాధనాల ప్రమాణీకరణ కూడా ఇక్కడ చేయవచ్చు. దీపాల యంత్రసామగ్రికి సంబంధించిన పొలార్‌కర్వు బల్బులు ఇక్కడవున్నాయి. ట్రాన్స్‌ఫార్మర్ నూనెలను వాటి డయలక్ట్రిక్ వివరాలకై పరిశోధించవచ్చు. ఏది ఏమైనా కాకినాడలోని అధిక ఓల్టేజిగల ప్రయోగశాలలో ఇన్సులేటర్లు మొదలైనవాటి పరిశోధనలను చేపట్టడానికి ముందు దానినింకా అభివృద్ధి చేయవలసివుంది.

ఇంతవరకు తెలిపిన సంస్థలే గాక రాష్ట్రంలో ఇంకా ఇతర సాంకేతిక సంస్థలు, కెమికల్ ఇంజనీరింగ్ కోర్సులు గలవి వున్నాయి. వాటిలో ఒకటి వాల్తేరులోని ఆంధ్ర విశ్వవిద్యాలయంలోనూ, రెండవది హైదరాబాద్‌లోని ఉస్మానియా విశ్వవిద్యాలయంలోనూ వున్నాయి. హైదరాబాద్‌లోని ఒక కళాశాలలో గనుల త్రవ్వకం (మైనింగ్)లో డిగ్రీ కోర్సువుంది. అనంతపూరులో "నూనె సాంకేతిక పరిశోధనా సంస్థ" (Oil Technological Research Institute) వుంది. రెండు మైనింగ్ సంస్థలు—గూడూరులో ఒకటి, కొత్తగూడెంలో మరొకటి—వున్నాయి.

"నూనె సాంకేతిక పరిశోధనా సంస్థ" ముఖ్యంగా నూనె విత్తనాలు, నూనెలు, తత్సంబంధమైన వాటి విషయాల పరిశోధనల కేర్పడింది. ఈ సంస్థలో నూనెలు తత్సంబంధమైనవాటి అభివృద్ధి, పరిశోధనలకు తగిన సాధన సంపత్తి వున్నది. ముడి సరుకులు, నూనె విత్తనాలు, అంత అవసరంకాని కాయనూనెలు. ఆయిల్ కేకులు, సబ్బులు, గ్లిసరిన్, నెయ్యి, వనస్పతి, రంగులు, వార్నీషులు మొదలైన నూనె ఉత్పత్తులను పరిశీలించడానికి ఇందులోని సౌకర్యాలుపయోగిస్తాయి.

భారతదేశంలోని ఇతర రాష్ట్రాలతో పోల్చి చూసినట్లయితే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం పారిశ్రామికంగా చాలా వెనుకబడివుందని చెప్పాలి. అయితే గనులు, ముడిసరుకులకు ఇక్కడ కొదవలేదు. అవి మాత్రం సమృద్ధిగా లభిస్తాయి. నిజంగా చూస్తే భారీ పరిశ్రమలు ఆంధ్రప్రదేశ్‌లో చాలాకొద్ది. రాష్ట్రంలోని వివిధ సాంకేతిక సంస్థల అభివృద్ధి విషయంలోకూడా ఇదే పరిస్థితి ఏర్పడింది. ద్వితీయ, తృతీయపంచవర్ష ప్రణాళికలలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఎక్కువ పరిశ్రమలు నెలకొల్పడానికి అన్ని చర్యలను తీసుకొని ఆ విధంగా పరిశ్రమలను నెలకొల్పనున్నారు. ఈ సందర్భంలో పెక్కు సాంకేతిక సంస్థలను నెలకొల్పడం, వున్న వాటిని అభివృద్ధిచేయడం ఎంతో హర్షించదగిన విషయం. ఇట్టి పరిస్థితులలో వివిధ పరిశ్రమల అవసరాలను దృష్టిలో పెట్టుకొని, వివిధ సంస్థలకు తగిన సాధన సంపత్తిని సమకూర్చడం సమంజసం. అందువల్ల ఆ సంస్థలు భవిష్యత్‌లో రాష్ట్రాన్ని పారిశ్రామికంగా అభివృద్ధి పరచే కార్యక్రమంలో పాల్గొనడానికవకాశముంటుంది. పరిశ్రమలకు, విద్యా సంస్థలకు (ప్రయోగశాలలు) మధ్య అటువంటి సమన్వయం వుండటం వల్ల ఎన్నో లాభాలున్నాయి. అధ్యాపకులు

తమ విజ్ఞాన దృక్పథాన్ని విద్యవరకే పరిమితం చేయక ఆధునిక పారిశ్రామిక ఉత్పత్తులను పరిశోధించడానికి, వస్తువుల ఉత్పత్తిలోని నిపుణతను తెలుసుకోడానికి వీలుం టుంది. ఈ సంస్థలలో విద్య నభ్యసించి వెళ్ళే విద్యార్థుల ప్రతిభకు ఈ ప్రయోగాత్మకశక్తి తోడ్పడుతుంది. అంతే గాక ఆ శక్తిని వారు త్వరితంగా పారిశ్రామిక పథం వైపు పురోగమిస్తున్న ప్రస్తుత భారతదేశానికి కావలసిన విభిన్నావసరాలకు తగినట్లుగా ఉపయోగించడానికి వీలవుతుంది. అఖిలభారత సాంకేతిక విద్యా సంఘం (All-India Council of Technical Education) వారు నిర్దేశించిన ప్రమాణాలకు భిన్నంగా వున్నప్పటికీ, ఈ ఆశయసాధనకై ప్రత్యేక సాధన సంపత్తి కొనవలసిన అవసరం ఏర్పడుతుంది. అంతకుమునుపే నిర్దేశించిన ప్రమాణాలకు భిన్నమైనప్పటికీ సంస్థల అధిపతులతోనూ, పరిశ్రమల నిపుణులతోనూ సంప్రదించి అట్టి సాధన సామగ్రిని కొనడం అత్యవసరం. అందువల్ల రెట్టింపు వ్యయమంతగ్గి లభ్యమయ్యే సౌకర్యాలన్నిటినీ గరిష్ఠ పరిమితి వరకు వినియోగించుకునే అవకాశం కలుగుతుంది.

మన రాష్ట్రంలో అన్నిరకాల పారిశ్రామిక యూనిట్లు (చిన్నరకానివి, భారీవి) అధికం కావడంతో అన్నిరకాల ఇంజనీరింగ్, టెక్నికల్, టెక్నలాజికల్, సంస్థలలో బేసిక్ శిక్షణలో ఒక భాగంగా "ధాతువులు లేక లోహాలు, వాటి భాగాల పారిశ్రామిక పరిశోధన"లో శిక్షణ గరపవలసిన ఆవశ్యకత ఏర్పడింది. మన రాష్ట్రంలోని పెక్కు టెక్నలాజికల్ సంస్థలలో తగిన ప్రయోగశాలల ప్రమాణం లేక పరిశోధనను భారీ ఎత్తున కొనసాగించడానికి తగిన సౌకర్యాల కొరత ఏర్పడింది. దానికి తోడు పరిశోధనలకు వలసిన ఉన్నతశ్రేణి యంత్రసామగ్రి మనదేశంలో ఉత్పత్తి కాకపోవడం వల్ల విదేశాలనుంచి దిగుమతి చేసుకోవలసి వస్తుంది. మనకు రెండు తీవ్రమైన ప్రతిబంధకాలున్నాయి. (1) విదేశీమారకద్రవ్యం, (2) దిగుమతి లైసెన్సులు. మన రాష్ట్రంలోని సాంకేతిక సంస్థలలో పరిశ్రమలకు పరిశోధనావకాశాలను కల్పించడానికి ఈ రెండు సమస్యలను మనం పరిష్కరించుకోవాలి.

(XXVII వ పేజీ తరువాయి)

ఉద్యోగావకాశాలదృష్ట్యా ఇంకా ఇతర కారణాలవల్ల ఆనకట్ట కంటే కూడా ఈ పథకం పెద్దది. పని ముమ్మరంగా జరిగే సమయంలో రోజూ సుమారు 4,600 మంది సాంకేతిక నిపుణులూ, నిపుణతగల పనివారూ, మరో 40,000 మంది నిపుణత లేనిపనివారు అవసరమవుతారని అంచనా. ఆనకట్ట స్థలంవద్ద 4,00,000 కి. వా. విద్యుత్కేంద్రం నిర్మించడంవల్ల వివిధ రకాల సాంకేతిక ప్రవీణులకు ముఖ్యంగా ఎలక్ట్రీషియన్లు, వెల్డర్లు, ఆర్మెచర్ వైండర్లు, ఫిట్టర్లు, టర్నర్లు మొదలైనవారికి ఉద్యోగావకాశాలు అధికంగా ఏర్పడతాయి.

అఖిల భారత స్థాయిలోనూ ఆంధ్రప్రదేశ్‌లోనూ సాంకేతిక ప్రవీణులకుగల ఉద్యోగావకాశాలనుగురించి స్థూలంగా తెలియజేయడానికి పైన ప్రయత్నించడం జరిగింది. పరిశ్రమల్లో పనిచేస్తున్న విద్యాయోగ్యతలు, సాంకేతిక యోగ్యతలులేని నిపుణతగల పారిశ్రామిక పనివారల ఉన్నతికిగల అవకాశాలను గురించి ఒక మాట. వివిధ పరిశ్రమలు, ఫ్యాక్టరీలలో పనిచేస్తూ, ఆయా పనులలో ఇతోధికంగా విజ్ఞానం సంపాదించి ఉన్నతిని పొందగోరే నిపుణతగల పనివారల ప్రయోజనార్థం, సాయంకాలం తరగతులు నిర్వహించడానికై భారత ప్రభుత్వం ఒక పథకాన్ని ప్రారంభించింది. ఈ నూతన పథకం చాలా ప్రాముఖ్యం పొందింది. తృతీయ ప్రణాళిక ముగింపునాటికి ఇది చాలా వరకు విస్తరించే అవకాశం వుంది.

సాంకేతిక నిపుణుడు పరిశ్రమకు వెన్నెముక. మన వినియోగ వస్తువులను అతనే తయారు చేస్తాడు. భవిష్యత్తులో యుద్ధాలలో పాల్గొని మన దేశ సరిహద్దులను సంరక్షించవలసినది కూడా అతనే. అభివృద్ధి జెందుతున్న మన పరిశ్రమలకు సాంకేతిక నిపుణులూ, శిక్షణపొందిన వృత్తిపనివారల నిపుణత, పరిజ్ఞానం చాలా అవసరం. కనుక వారికి ఉజ్వలమైన భవిష్యత్తు వుంది.

ఆంధ్రప్రదేశ్ లో గ్రంథాలయోద్యమం

శ్రీ కె. రాఘవరెడ్డి

దేశంలో పూర్వం కొన్ని గ్రంథాలయాలుండేవి. కాని అవి పండితులకు మాత్రమే ఎక్కువగా ఉపయోగపడేవి. అవి కొద్ది మందికి మాత్రమే అందుబాటులో వుండేవి. విశ్వవిద్యాలయాలలోని గ్రంథాలయాలు విద్యార్థులకు మాత్రమే వినియోగపడేవి.

సుమారు మూడు దశాబ్దాల క్రితం గ్రంథాలయాల స్థాపనా, నిర్వహణా ఒక ఉద్యమ స్వరూపం దాల్చింది. గ్రంథాలయాల వ్యాప్తికై అవిభాజిత మద్రాసు రాష్ట్రం ఒక శాసనం చేసింది. దీనిని 1953 వ సంవత్సరంలో ఆంధ్ర రాష్ట్రం ఏర్పడిన తరువాత దానికి అవలంబింప జేశారు. పూర్వ హైద్రాబాదు రాష్ట్రం 1955వ సంవత్సరంలో హైద్రాబాదు పౌర గ్రంథాలయాల చట్టం అనే శాసనం చేసింది. పూర్వ రాష్ట్రంతోనూ హైద్రాబాదు. సికింద్రాబాదు జంటనగరాలతో సహా పూర్వ హైద్రాబాదు రాష్ట్రంలోని తొమ్మిది తెలుగు జిల్లాలతోనూ విస్తృతమైన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఏర్పడిన తరువాత నూతన రాష్ట్రమంతటికీ వర్తింపజేసే నిమిత్తం సమీకృత శాసనం చేయడం అవసరంగా భావించబడింది. ఈ ఉద్దేశంతోనే, పైన పేర్కొన్న రెండు చట్టాల స్థానే 1960 వ సంవత్సరపు ఆంధ్రప్రదేశ్ పౌర గ్రంథాలయాల చట్టాన్ని అమల్లోకి తెచ్చారు. 1960 ఏప్రిల్ మొదటి తేదీ నుంచి ఈ శాసనం అమలులోకి వచ్చింది. ఈ చట్టం అచరణకై కొన్ని నియమావళులను కూడా రూపొందించారు.

ఇతర రాష్ట్రాలలో వలెనే మన రాష్ట్రంలో కూడా పౌర గ్రంథాలయాల నిర్వహణ విద్యా శాఖ పరంగా జరిగేది. 1960 వ సంవత్సరపు ఆంధ్రప్రదేశ్ పౌర గ్రంథాలయాల చట్టం అమల్లోకి వచ్చిన తరువాత, ఈ చట్టం 8 వ సెక్షను క్రింద పౌర గ్రంథాలయాలకు ఒక ప్రత్యేక శాఖను స్థాపించారు విద్యా శాఖ ఆధీనంలో ఈ నూతన శాఖ పనిచేస్తున్నది. పౌర గ్రంథాలయాలకై ఒక డైరెక్టరును నియమించడానికి ఈ చట్టంలో ఒక నిబంధన వున్నప్పటికీ, విద్యాశాఖ డైరెక్టరునే పౌర గ్రంథాలయాల ఇన్‌ఛార్జి వేయడం అవసరమని భావించబడింది. ఈ శాఖ నిర్వహణాధిపతిగా ఆయన, సాంకేతిక విషయాలపై ప్రభుత్వానికి సూచనలు చేస్తూ, ప్రభుత్వం రూపొందించిన విధానాలను అమలు పరుస్తారు. రాష్ట్రంలో పౌర గ్రంథాలయాలకు సంబంధించిన అన్ని విషయాలనూ ఆయన చూస్తారు.

పౌర గ్రంథాలయాల చట్ట నిబంధనల క్రింద ఉత్పన్నమయ్యే సమస్త విషయాలపై ప్రభుత్వానికి సలహాలిచ్చే నిమిత్తం రాష్ట్ర గ్రంథాలయ సంఘాన్ని నియమించారు. ఈ సంఘంలో 30 మంది సభ్యులున్నారు. విద్యా శాఖా మంత్రి దీని అధ్యక్షులు. స్థానికపరిపాలనా శాఖా మంత్రి, విద్యా శాఖ కార్యదర్శి, విద్యాశాఖ డైరెక్టరు, స్థానిక పరిపాలనా శాఖ డైరెక్టరు, రాష్ట్ర కేంద్ర గ్రంథాలయం భాండాగారి మొదలైనవారు సభ్యులు. రాష్ట్ర శాసనసభ, రాష్ట్రంలోని మూడు విశ్వవిద్యాలయాలు, ఆంధ్రప్రదేశ్ గ్రంథాలయ సంఘం మొదలైన వాటికి కూడా దీనిలో సభ్యత్వం వుంది. పౌర గ్రంథాలయాల శాఖ డిప్యూటీ డైరెక్టరు, సంఘం కార్యదర్శిగా వ్యవహరిస్తారు.

పౌర గ్రంథాలయాల శాఖ డైరెక్టరు, ప్రభుత్వాధికారానికి లోబడి, రాష్ట్రంలోని అన్ని పౌర గ్రంథాలయాలపై అజమాయిషీ వహిస్తారు. అంతే గాక ఆయన ఇంగ్లీషు, సంస్కృతం మినహా రాష్ట్రంలో అన్ని భాషలలోనూ ప్రచురించబడిన పుస్తకాల వివరణ పట్టికను ఏటా ప్రకటింపజేస్తారు. కేంద్రీకృత వర్గీకరణ, పుస్తకాల జాబితాల తయారీ గ్రంథాలయాల మధ్య పుస్తకాల ఇచ్చి పుచ్చుకోవడాల వంటి వాటికి కూడా ఆయన ఏర్పాట్లు చేస్తారు.

రాష్ట్రంలో పౌర గ్రంథాలయాల నిర్వహణ ప్రభుత్వం, స్థానిక గ్రంథాలయ సంస్థలు, ప్రైవేటు యాజమాన్యాల పరంగా

జరుగుతున్నది. ప్రజాస్వామిక వికేంద్రీకరణ సూత్రం గ్రంథాలయాల రంగంలోనే బహుళా కార్యరూపం దాల్చింది. రాష్ట్రంలో ప్రతి జిల్లాలోనూ ఆ జిల్లా స్థానిక గ్రంథాలయ సంస్థ పౌర గ్రంథాలయాల స్థాపన, నిర్వహణకు ప్రధానంగా బాధ్యత వహిస్తాయి. స్థానిక గ్రంథాలయ సంస్థ పౌర ప్రతినిధులతో కూడుకొని వుంటుంది. నిర్ణీత గడువు తరువాత కొత్త సభ్యుల ఎన్నిక జరుగుతూ సంస్థ శాశ్వతంగా వుంటుంది. ఆస్తులను సంపాదించడానికీ, నిర్వహించడానికీ, విక్రయించడానికీ, ఒప్పందాలు కుదుర్చుకోడానికి వీటికి అధికారం వుంటుంది. తన పరిధిలో గ్రంథాలయాలను నెలకొల్పే బాధ్యత స్థానిక గ్రంథాలయ సంస్థకు వుంటుంది. పౌర గ్రంథాలయాల కార్యనిర్వాహక వర్గ సభ్యులూ, ఆంధ్రప్రదేశ్ పౌర గ్రంథాలయ సంఘం జిల్లా, రాష్ట్ర శాఖల సభ్యులలోనుంచి ఎన్నుకున్న వారితో స్థానిక గ్రంథాలయ సంస్థలను నెలకొల్పుతారు. వీరంతా ప్రజాస్వామికమైన ఎన్నికల విధానంలో ఎన్నుకోబడతారు. స్థానిక గ్రంథాలయ సంస్థ ఆధీనంలో పనిచేసే జిల్లా కేంద్ర గ్రంథాలయం భాండాగారి పై సంస్థ కార్యదర్శి బాధ్యతలను నిర్వర్తిస్తారు. జిల్లాలోని శాఖా గ్రంథాలయాలూ ఇంకా ఇతర పౌర గ్రంథాలయాలను తనిఖీ చేయడానికీ, అధ్యక్షుని ఆదేశాలననుసరించి ఉత్తర ప్రత్యుత్తరాలు జరపడానికీ ఇతనికి అధికారం ఇవ్వబడింది.

రాష్ట్రంలో నాలుగు ప్రభుత్వ గ్రంథాలయాలున్నవి. అవి ఏవంటే :- (1) రాష్ట్ర కేంద్ర గ్రంథాలయం, హైద్రాబాదు (2) రాష్ట్ర ప్రాంతీయ గ్రంథాలయం, గుంటూరు, (3) సంచార గ్రంథాలయం, ఏలూరు, (4) బాలల గ్రంథాలయం, హైద్రాబాదు.

రాష్ట్రకేంద్ర గ్రంథాలయంలో స్టేట్ సెంట్రల్ లైబ్రరీ, స్టేట్ లెండింగ్ లైబ్రరీ అనే రెండు విభాగాలున్నాయి. హైద్రాబాదులోని రాష్ట్రకేంద్ర గ్రంథాలయాన్ని మొదట అప్పటి హైద్రాబాదు రాష్ట్రపు రాజవంశంపేరిట అసఫియా గ్రంథాలయం అనిపిలిచేవారు. 1891 వ సంవత్సరంలో అప్పుడు విద్యాశాఖ డైరెక్టరుగా పనిచేసిన కీ. శే. నవాబ్ దీనిని ఇమాదుల్‌ముల్క్ బహద్దూర్ స్థాపించినారు మొదట దీనిని కేవలం సూఫీ గ్రంథాలయంగా మాత్రమే ప్రారంభించడం జరిగింది. 1936 వ సం, లో దీనిని ప్రస్తుతభవనంలోకి మార్చారు. అందమైనభవనంగా ఇది ప్రసిద్ధిగాంచింది. ఈ గ్రంథాలయంలో లిఖితపత్రులు 16.000 వరకూ, ముద్రిత గ్రంథాలు 1,50,000 వరకూ వున్నాయి. ఈ లిఖితప్రతులు చాలా అమూల్యమైనవి. 11 12 వ శతాబ్దాలనాటి పురాతనమైన లిఖిత ప్రతులు కూడా కొన్ని వీటిలోవున్నాయి, వీటిప్రతులు ప్రపంచంలో మరెచ్చటా లభించవు. ఆధునిక విధానాలలోనూ, శాస్త్రీయ పద్ధతులలోనూ గ్రంథాలయాన్ని అభివృద్ధి పరచడానికి వివిధ పథకాలను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఉదారంగా మంజూరు చేస్తున్నది. రూ. 9.00 లక్షలు వెచ్చించి గ్రంథాలయంలోని వివిధ శాఖలలో అనువుగా వసతి సౌకర్యాలు సమకూర్చారు. బాలల విభాగాన్ని పునర్నిర్మించి తగు సౌకర్యాలు కలుగజేశారు. 1891 వ సంవత్సరంలో కొద్ది ఎత్తున ప్రారంభింపబడిన రాష్ట్ర కేంద్ర గ్రంథాలయం క్రమంగా పెంపొందుతూ నేడు జాతీయ ప్రాముఖ్యంగల గ్రంథాలయంగా అభివృద్ధి చెందింది.

ప్రస్తుతం గుంటూరులో వున్న రాష్ట్ర ప్రాంతీయ గ్రంథాలయాన్ని, అప్పటి ఆంధ్రరాష్ట్రానికై 1954వ సంవత్సరంలో రాష్ట్ర కేంద్రగ్రంథాలయంగా విశాఖపట్నంలో స్థాపించారు. ఆంధ్రప్రదేశ్ అవతరణ తరువాత ప్రాంతీయావసరాల నిమిత్తం దీనిని ప్రాంతీయ గ్రంథాలయంగా మార్చారు. ప్రస్తుతం ఇది అద్దెగృహంలో వుంది. సుమారు రూ. 27,000 లు విలువచేసే ఒక భవనాన్ని స్వాధీనం చేసుకోడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఈ గ్రంథాలయంలో సభ్యులకు పుస్తకాలు ఇచ్చే సౌకర్యం వుంది. అంతేగాకుండా ఒక సూచీ విభాగంకూడా ఈ గ్రంథాలయంలో వుంది. తెలుగు పుస్తకాల వివరణ పట్టికలను తెలుగులో వెలువడిన పిల్లల పుస్తకాల వివరణ పట్టికలను సిద్ధంచేసే పనికూడా దీనికి అప్పగించారు. రాష్ట్ర ప్రాంతీయ గ్రంథాలయాన్ని ఇటీవలే స్థాపించినప్పటికీ అది బాగా ప్రచారం పొందింది.

మొదటి పంచ వర్ష ప్రణాళిక క్రింద భారత ప్రభుత్వ సహాయంతో, 1956 వ సంవత్సరంలో ఏలూరులో ఒక సంచార గ్రంథాలయాన్ని ప్రారంభించారు. అన్ని ఆధునిక సౌకర్యాలు, దృశ్య శ్రవణ యంత్రాలతో కూడిన ఈ గ్రంథాలయం పశ్చిమ గోదావరి జిల్లాలో మారు మూల ప్రదేశాలలో గ్రంథాలయావసరాలను తీరుస్తున్నది.

పబ్లిక్ గార్డెన్స్‌లో 1954 వ సంవత్సరంలో ప్రత్యేకంగా పిల్లల కొరకు ఒక గ్రంథాలయాన్ని స్థాపించడం జరిగింది. ప్రతిరోజూ అనేక మంది పిల్లలు దీనికి వస్తారు, పాఠశాలలకు వెళ్లే పిల్లలందరికీ అనుకూలంగా వుండే సమయాలలో దీనిని తెరిచి వుంచుతారు. కేవలం పిల్లలకు మాత్రమే ఉపయోగపడే పుస్తకాలు పత్రికలు ఇచ్చుటవుంటాయి.

ప్రతి జిల్లాలోనూ జిల్లా ప్రధాన కార్యస్థానంలో ఒక కేంద్ర గ్రంథాలయంవుంది. దానిక్రింద శాఖా గ్రంథాలయాలూ, దూరంలో నున్న ప్రదేశాలకోసం డెలవరీ స్టేషను వున్నాయి. జిల్లా కేంద్ర గ్రంథాలయాలన్నిటినీ, శాఖా గ్రంథాలయాలలో చాలావాటిని సుశిక్షితులైన వారు నిర్వహిస్తున్నారు. అన్ని జిల్లా కేంద్ర గ్రంథాలయాలలోనూ, చాలా శాఖా గ్రంథాలయాల లోనూ పిల్లలకోసం ప్రత్యేక విభాగాలున్నాయి. స్థానిక గ్రంథాలయ సంస్థల నిర్వాహణక్రింద ప్రత్యేకంగా కొన్ని బాలల గ్రంథాలయాలున్నవి. ప్రస్తుతం రాష్ట్రంలో 210 శాఖా గ్రంథాలయాలూ, 470 డెలవరీ స్టేషన్లు కలవు.

దాదాపు దేశం మొత్తంమీద కూడా గ్రంథాలయోద్యమంలో కానవచ్చే ఒక ప్రత్యేకమైన విషయమేమిటంటే ప్రతి జిల్లాలోనూ జిల్లా కేంద్ర భాండాగారి స్థానిక గ్రంథాలయ సంస్థ కార్యదర్శిగా వుంటూ, పాఠకులకు, స్థానిక గ్రంథాలయ సంస్థలకుమధ్య అనుసంధాన కర్తగా వ్యవహరిస్తారు.

స్థానిక గ్రంథాలయ సంస్థలకు, గ్రంథాలయాల స్థాపనా, నిర్వహణలకై కావల్సిన డబ్బు ఇంటిపన్ను, ఆస్తి పన్నులపై విధించే గ్రంథాలయ సుంకంద్వారా లభిస్తుంది. ఇంతేగాకుండా పన్నులద్వారా వసూలైన మొత్తానికి తగ్గకుండా ప్రభుత్వం డబ్బు విరాళంగా ఇస్తుంది ఈ విధంగా విరాళాలు ఇవ్వడంతో పాటు ప్రభుత్వం, సిబ్బందికి జీతాల చెల్లింపు, బాలల గ్రంథాలయాల స్థాపనవంటి ప్రత్యేక పథకాలను అమలు పరచడానికి ఏటేటా స్థానిక గ్రంథాలయ సంస్థలకు ఉదారంగా గ్రాంట్లు మంజూరు చేస్తున్నది. ఆయా జిల్లాలలో ప్రైవేటు ఎయిడెడ్ గ్రంథాలయాలకు స్థానిక గ్రంథాలయ సంస్థలు స్వంత నిధులలోనుంచి గ్రాంటులు ఇవ్వవలసివుంటుంది కూడా.

ప్రైవేటు యాజమాన్యం, సహకార సంఘాలు, గ్రామ సంఘాలు, పంచాయతీలు మొదలైనవాటి నిర్వహణలో దాదాపు 1,110 గ్రంథాలయాలున్నవి.

కొద్దిపాటి ఎయిడెడ్ గ్రంథాలయాలు మినహా రాష్ట్రమంతటా అన్ని పౌర గ్రంథాలయాలలోనూ ప్రజలకు ఉచితంగా ప్రవేశం లభింపజేయబడుతున్నది. కేంద్ర గ్రంథాలయాలలో సాంస్కృతిక కార్యక్రమాలూ, సాంఘిక విద్యా కార్యకలాపాలు, దృశ్య శ్రవణ కార్యక్రమాలు మొదలైనవాటిని ఏర్పాటు చేస్తారు. రాష్ట్రమంతటా అన్ని పౌర గ్రంథాలయాలలోనూ ఒకే విధానం ఆచరణలో వుండే నిమిత్తం డెవేడిసిమల్ వర్గీకరణ విధానాన్ని ప్రవేశపెట్టారు. హైదరాబాదులోని రాష్ట్రకేంద్ర గ్రంథాలయంలోనూ, గుంటూరులోని రాష్ట్ర ప్రాంతీయ గ్రంథాలయంలోనూ, కొన్ని జిల్లా కేంద్ర గ్రంథాలయాలలోను స్టడీ గ్రూపులు, రీడింగ్ సర్కిళ్ళను ప్రారంభించారు. రాష్ట్ర కేంద్ర గ్రంథాలయంలో ప్రత్యేకంగా సాంఘిక విద్యాశాఖను తెరిచారు. తగు సంఖ్యలో పుస్తకాలూ, తగినంతగా డబ్బు లేనప్పుడు వివిధ గ్రంథాలయాల మధ్య ఇచ్చి పుచ్చుకునే పద్ధతిని ప్రవేశపెట్టారు. దీననుసరించి గ్రంథాలయాలు పరస్పరం పుస్తకాలను ఇవ్వడం, తీసుకోవడం, స్వేచ్ఛగా చేయవచ్చు. పాఠకులు తక్కువ వ్యవధిలో సునాయాసంగా పుస్తకాలు తీసుకొనగలగడానికై కొన్ని జిల్లా కేంద్ర గ్రంథాలయాలలో టిక్కెటు పద్ధతిని ప్రవేశపెట్టారు. కొత్తగా అక్షరాస్యులైన వయోజనులకు ఉపయోగపడే సాహిత్యం లేని కొరత చాలా కాలంగా వుంటున్నది. ఈ కొరతను తీర్చే ఉద్దేశంతో కొన్ని స్థానిక గ్రంథాలయ సంస్థలకు, ఇలాంటి వయోజనులకు ఉపయోగపడే పుస్తకాలు మొదలైనవాటిని తయారు చేసే నిమిత్తం ప్రత్యేకంగా గ్రాంటు ఇస్తారు.

ఆంధ్రప్రదేశ్ అవతరణానంతరం, పిల్లలకు పుస్తకాలు వ్రాసే విషయంలో రచయితలకు శిక్షణ ఇచ్చే నిమిత్తం రెండు రచనాలయాలను నిర్వహించారు ఒక్కొక్క దానిలో 20 మంది రచయితల చొప్పున శిక్షణ పొందారు. వీరు 45 పుస్తకాలు రచించారు. వీటిలో కొన్ని ప్రచురింపబడినాయి కూడా.

జిల్లా గ్రంథాలయాలన్నింటినీ, చాలా శాఖా గ్రంథాలయాలను సుశిక్షితులైనవారు నిర్వహిస్తున్నారు. అయినప్పటికీ ఇంకా సుశిక్షితులైన ఉద్యోగుల కొరతవుంది. ఈ కొరతను కొంతవరకైనా తీర్చే ఉద్దేశంతో ప్రభుత్వం ఒక పథకాన్ని రూపొందించింది. దీనిని అనుసరించి లైబ్రేరియన్‌షిప్‌లో శిక్షణపొందే నిమిత్తం పట్టభద్రులను రిక్రూట్ చేస్తారు. వీరికి ఉదారంగా స్టయిఫండులు కూడా ఇస్తారు. శిక్షణ కోర్సు నిర్వహించడానికై ప్రభుత్వం ఉస్మానియా విశ్వవిద్యాలయానికి ఏటా రూ. 10,000 చొప్పున గ్రాంటు ఇస్తుంది. పట్టభద్రులు కాని బ్రాంచ్ లైబ్రేరియన్లు లైబ్రేరియన్‌షిప్ స్వల్పకాలిక కోర్సులో శిక్షణ పొందడానికి డిప్యూటు చేయబడతారు. ఇందుకొరకు కూడా ఉస్మానియా విశ్వవిద్యాలయానికి ప్రత్యేక గ్రాంట్లు చెల్లిస్తున్నారు.

గత అయిదు సంవత్సరాల కాలంలో, నాలుగు లక్షలరూపాయలకు పైగా విలువచేసే భవనాలనూ, ఫర్నిచరును సేకరించి శాఖాగ్రంథాలయాలకూ, కేంద్ర గ్రంథాలయాలకూ బహూకరించ,

దానికై స్థానిక గ్రంథాలయాలకు అప్పగించడం జరిగింది. ఇంటి అద్దెలకు ఖర్చు జరుగకుండా వుండేందుకై భవనాలను ఇతోధికంగా కానుకలుగా సేకరించడానికి కృషి జరుగుతున్నది ఇంతేగాక, జిల్లా కేంద్ర గ్రంథాలయాలను నెలకొల్పడానికి భవనాలు నిర్మించడానికై ప్రభుత్వం అవసరమైనప్పుడల్లా స్థానిక గ్రంథాలయ సంస్థలకు గ్రాంట్లు చెల్లిస్తున్నది.

గ్రంథాలయ రంగంలో మూడు సంవత్సరాల స్వల్ప వ్యవధిలోనే సాధించబడిన సత్వరాభివృద్ధిని గురించి ప్రాంతాల వారీగా సిద్ధంచేసిన ఈ దిగువ సంఖ్యా వివరాలు తెలియజేస్తాయి.* వీటికి రాష్ట్ర ప్రజల, దేశంలోని ప్రసిద్ధ లైబ్రేరియన్ల గుర్తింపు లభించింది.

ప్రజాస్వామికంగా అధికార వికేంద్రీకరణకై ఆంధ్ర ప్రదేశ్ పౌరగ్రంథాలయాల చట్టం క్రింద తలపెట్టిన విధానాన్ననుసరించి, తమ తమ ప్రాంతాలలో గ్రంథాలయోద్యమ వ్యాప్తికి ఆయా స్థానిక గ్రంథాలయ సంస్థలు ప్రధానంగా బాధ్యత వహిస్తాయి. ప్రభుత్వం ఇచ్చే విరాళం, పన్నుల వసూళ్లద్వారా వచ్చే డబ్బు వాటి ఆదాయం. ఈ విధంగా లభించే ఆదాయం, ప్రస్తుత గ్రంథాలయాలను నిర్వహించడానికి కూడా సరిపోదనే సంగతి ఈ శాఖకుపూర్తిగా తెలుసు. స్థానిక గ్రంథాలయ సంస్థలు ప్రతి గ్రామంలోనూ మారుమూల ప్రదేశాలలో సైతం చక్కని గ్రంథాలయ సౌకర్యాలు సమకూర్చగలగడానికి వీలుగా ప్రభుత్వం వాటికి ఉదారంగా విరాళాలను లభింపజేయడం అవసరం.

తృతీయ పంచవర్ష ప్రణాళికా కాలంలో 1,000 అంతకంటే అధిక జనాభాగల ప్రతి ప్రాంతంలోనూ గ్రంథాలయం నెలకొల్పాలని ఈ శాఖ ఉద్దేశిస్తున్నది. గ్రంథాలయ రంగంలో రాబోయే సంవత్సరాలలో ఇతోధికంగా అభివృద్ధి జరగడానికి అనేక పథకాలను రూపొందిస్తున్నారు. నిధులు లభ్యమైన వెంటనే వాటిని అమలు పరుస్తారు.

అంశం	తెలంగాణా ప్రాంతం 1-10-57 నాటికి	తెలంగాణా ప్రాంతం 1-10-61 నాటికి	ఆంధ్ర ప్రాంతం 1-10-57 నాటికి	ఆంధ్ర ప్రాంతం 1-10-61 నాటికి
1. జిల్లా కేంద్ర గ్రంథాలయాలు	లేవు	9	11	11
2. శాఖా గ్రంథాలయాలు	లేవు	30	120	220
3. పుస్తక డిపాజిటు కేంద్రాలు	లేవు	110	226	360
శిక్షితులైన సిబ్బంది:				
డిప్లొమా పొందినవారు	లేరు	18	11	24
స్థానిక గ్రంథాలయ సంస్థల ఆధీనంలోని గ్రంథాలయాలలో నిలువవున్న పుస్తకాలు	75,000	2,50,000	8,65,000	10,20,000
పన్నువసూళ్లు	10,515	2,97,278	3,22,000	4,12,798

ఆంధ్రప్రదేశ్‌లో వికలాంగులకు
విద్యా, సంక్షేమ కార్యక్రమాలు

శ్రీ టి. ఆర్. కప్పుస్వామి, శ్రీ షహరియార్ కౌసుజీ

గుడ్డి, చెవిటి, కుంటి, క్షయరోగులు, ప్రత్యేక సహాయం ద్వారా విద్య, శిక్షణ, ఉద్యోగం దొరకని యితరులు వికలాంగులుగా భావించబడ్డారు. సంక్షేమ రాజ్యంగా త్వరితగతిని అభివృద్ధి జెందుతున్న భారతదేశంలో వివిధ కార్యక్రమాల ద్వారా వికలాంగుల సంక్షేమానికి పాటుపడటం జరుగుతున్నది.

1939 లో అప్పటి నిజాం ప్రభుత్వం హైదరాబాదులో గ్రుడ్డివారికి, చెవిటివారికి ప్రభుత్వ పాఠశాలను ప్రారంభించటంతో ఆంధ్రప్రదేశ్‌లోని అంధులకు విద్యా సౌకర్యాలు కలుగజేయడం మొదలైంది. తదనంతరం వచ్చిన ప్రభుత్వాలు యీ పాఠశాలను అంధులకు, చెవిటివారికి సమిష్టిగానే నిర్వహించారు. అయితే ఆంధ్రప్రదేశ్ యేర్పడిన తర్వాత 1961 జనవరి 1 వ తేదీ నుండి అంధులకు, చెవిటివారికి విడివిడిగా ప్రభుత్వ పాఠశాలలను యేర్పాటుచేశారు. కడపలో అంధులకు ప్రభుత్వపాఠశాల ఉన్నది. గుంటూరు జిల్లా రెంటిచింతలో ప్రభుత్వసహాయంతో లూథరన్ మిషనువారు అంధులకు ఒక పాఠశాలను నిర్వహిస్తున్నారు. భారత సేవక్‌సమాజం మహిళా విభాగం ఆధ్వర్యంలో గుంటూరు పట్టణంలో అంధులకు ఒక పాఠశాలను ప్రారంభించారు.

హైదరాబాదు, మలక్‌పేటలోని అంధులకు ప్రభుత్వోన్నత పాఠశాల అన్ని హంగులతో నిర్వహించబడుతూ ఉన్నది. రాష్ట్రంలోని యితర ప్రభుత్వపాఠశాలలలో బోధించబడుతూ ఉన్న పాఠ్య ప్రణాళికలనే యీ పాఠశాలలో కూడా అనుసరించడం జరుగుతున్నది, యిక్కడ హెచ్. యస్. సి. వరకు విద్యా బోధన జరుగుతున్నది. యిందులో విజయవంతులైన అభ్యర్థులు. ఉస్మానియా విశ్వ విద్యాలయంయొక్క వివిధ అనుబంధ కళాశాలల్లో మాస్టర్సు డిగ్రీలవరకు విద్యాభ్యాసం చేస్తున్నారు.

కడప, రెంటిచింతలల్లో ఉన్నవి మాధ్యమిక పాఠశాలలు. యిక్కడ VIII తరగతి వరకు విద్య గరపుతారు. యీ పాఠశాలల విద్యార్థులు, హైదరాబాదులోని ఉన్నత పాఠశాలలో ఉన్నత విద్య అభ్యసిస్తారు.

గుంటూరులో ఉన్నది ప్రాథమిక పాఠశాల. యిక్కడ మూడవ తరగతివరకు విద్య నేర్పుతారు. రాష్ట్రంలోని యితర పాఠశాలల్లో సాధారణ విద్యార్థులకు అన్వయించే పాఠ్య ప్రణాళికలనే యీ పాఠశాలలో కూడా అనుసరించడం జరుగుతుంది.

రాష్ట్రంలో దాదాపు 20.000 మంది అంధులు ఉన్నారు. యిందులో కనీసం 8000 మంది పాఠశాలలకు వెళ్ళే బాల బాలికలు, శిక్షణ పొందగల యువతీ యువకులు ఉన్నారు. అయితే రాష్ట్రంలో అంధులకు ఉన్న మొత్తం పాఠశాలల్లో 150 మంది మాత్రమే ఉన్నారు. విద్యాశిక్షణ పొందవగిన అంధులందరికీ విద్యా శిక్షణ సౌకర్యాలను కల్పింపజేయడానికి యెంతో కృషి చేయాల్సి ఉంది.

రాష్ట్రంలో అంధులకు విద్య, శిక్షణా వసతులను కలిగించడానికి విద్యాశాఖ సాధ్యమైన అన్ని సౌకర్యాలను కల్పించడానికి ప్రయత్నిస్తూ ఉంది. ఇప్పటికి దిగువ సౌకర్యాలను కల్గించడం జరిగింది.

(1) ఉచిత విద్య.

(2) ఉచిత భోజన నివాసవసతులు.

(3) పాఠశాలకు రాకపోకల ఖర్చులు.

(4) సంవత్సరానికి ప్రతి విద్యార్థికి రూ. 30-/ చొప్పున బట్టల ఖర్చు.

(5) సంవత్సరానికి ప్రతి విద్యార్థికి రూ 15-/ చొప్పున పుస్తకాల ఖర్చు

(6) ఉచిత వైద్యచికిత్స, అవసరమైతే ఆసుపత్రి చికిత్స.

పాఠశాలలో సాధారణ విద్యతోపాటు గ్రుడ్డివాళ్ళకు వృత్తి విద్యా శిక్షణ కూడా యివ్వడం జరుగుతున్నది.

హైద్రాబాదు, మలక్‌పేటలోని ప్రభుత్వ అంధుల పాఠశాలలో అంధులకు విద్యగరపే ఉపాధ్యాయులకు శిక్షణ యివ్వడం జరుగుతున్నది. అంధుల విద్యాబోధనలో జూనియర్, సీనియర్ల డిప్లొమాలకు శిక్షణపొందిన సెకండరీ ఉపాధ్యాయులను, శిక్షణ పొందిన పట్టభద్రులైన ఉపాధ్యాయులను స్వీకరిస్తారు. 1958 సంవత్సరం నుండి మూడు కోర్సులను విజయవంతంగా నిర్వహించారు. 19 మంది ఉపాధ్యాయులు డిప్లొమా పొందారు. అంధులైన మెట్రిక్యులేటు, పట్టభద్రులు యీ సాధారణ శిక్షణ పొందే అవకాశాలు తక్కువగా ఉన్న విషయాన్ని గుర్తించి వారిని అంధుల విద్యాబోధన శిక్షణకోర్సులో చేర్చుకునేందుకు వీలుగా నియమావళిని ప్రభుత్వం సవరించింది తత్ఫలితంగా 16 మంది అంధ పట్టభద్రులు. మెట్రిక్యులేట్లు యీ కోర్సులో చేరనున్నారు.

రాష్ట్రంలో అంధుల పాఠశాలలు తక్కువగా ఉన్న కారణంగా వీటికై ప్రత్యేక ఇన్స్పెక్టరు కార్యాలయాన్ని నెలకొల్పే అవకాశం లేకపోయింది. అయితే అంధుల పాఠశాలలు సమర్థవంతంగా పనిచేయడానికి వీలుగా హైద్రాబాదులోని ప్రభుత్వ అంధుల పాఠశాల ప్రధానోపాధ్యాయుణ్ణి అధికార పరిశీలకునిగా నియమించడం జరిగింది. సంవత్సరానికొకసారి పాఠశాలలను దర్శించి సాంకేతిక విషయాలను గురించిన సలహాలను ఆయన సూచిస్తారు. పరిపాలనకు సంబంధించిన విషయాలను మామూలుగా ఆయాజిల్లా విద్యాధికారులు, ప్రాంతీయ డిప్యూటీ డైరెక్టర్లు చూస్తారు.

విద్యాధికులైన అంధులకు ఉపాధి కలిగించడంలో ప్రభుత్వం ఉదార వైఖరిని అవలంబిస్తున్నది.

అంధుల పాఠశాలలోను, సాధారణపాఠశాలలోను అంధులైన విద్యాధికులకు ఉద్యోగాలు కల్పిస్తున్నారు. ప్రస్తుతం 12 మంది అంధులకు అట్టి ఉద్యోగాలు యివ్వడంజరిగింది, వికలాంగులకు ఉపాధిసౌకర్యాలు కల్గించడానికై హైద్రాబాదులో ప్రత్యేక ఉద్యోగ సాధకకేంద్రాన్ని త్వరలో నెలకొల్పనున్నారు హైద్రాబాదులోని ప్రాంతీయ ఉద్యోగసాధక కేంద్రానికి అనుబంధంగా దీనిని ఉంచుతారు.

రాష్ట్రంలో అంధులైన వయోజనులకు శిక్షణ కేంద్రం లేదు. శిక్షణ పొందదల్చిన వారు డెహరాడూనులో భారత ప్రభుత్వ విద్యా మంత్రిత్వశాఖ నిర్వహిస్తున్న శిక్షణ కేంద్రానికి వెళ్ళాల్సి వుంటుంది.

ఆంధ్ర ప్రదేశ్‌లోని అంధుల పాఠశాలలు, శిక్షణ కోర్సులు సమర్థవంతంగా నిర్వహింపబడుతున్నవి. అయితే పాఠశాలలలో ప్రవేశం కోరే అంధుల సంఖ్య యెక్కువగా ఉన్నది. తగినన్ని పాఠశాలలు మాత్రంలేవు. అన్ని పాఠశాలలలోను 'వెయిటింగ్ లిస్టులు' చాలా ఉన్నాయి. ఇతోధిక పాఠశాలలు, శిక్షణ కేంద్రాల అవసరం చాలా ఉంది.

నాలుగు లక్షల జనాభాఉన్న ప్రతిచోటా అంధుల పాఠశాలనుగానీ, శిక్షణ కేంద్రాన్నిగానీ నెలకొల్పాలని ప్రతిపాదించారు. మూడవ ప్రణాళికాంతానికి యీ అంచనాను పూర్తి చేస్తారని ఆశించడం జరుగుతున్నది.

సంక్షేమ రాజ్యంలో అన్ని అభివృద్ధి కార్యక్రమాలనూ ప్రభుత్వమే అమలు జరుపలేదనే విషయాన్ని అందరూ అంగీకరించారు. భౌతికంగా వికలాంగులైన వారికి సకల సౌకర్యాలు కల్పించడంలో సమాజంకూడా శక్తివంచన లేకుండా సహాయపడాలి. ఇదే దృష్టితో అంధుల సంక్షేమానికై హైద్రాబాదులో ఒక సంఘాన్ని ప్రారంభించడం జరిగింది. దీనిలో అందరూ సభ్యులుగా చేరవచ్చు. ఆంధ్ర ప్రదేశ్ ఆర్థిక మంత్రి శ్రీ బ్రహ్మానందరెడ్డి యీ సంఘానికి అధ్యక్షులుగా ఉన్నారు. అంధులకు సహాయం చేసే కార్యక్రమాన్ని యీ సంఘం ప్రారంభించింది. ప్రభుత్వం, అంధులకు మధ్య యీ సంఘం సంధాన కర్తగా పనిచేస్తున్నది. బొంబాయిలోని అంధుల జాతీయ సంఘానికి అనుబంధంగా ఉండేందుకు ఈ సంఘం ప్రయత్నిస్తున్నది.

చెవిటి, మూగల సంక్షేమ కార్యక్రమాలు

స్వభావ సిద్ధంగా చెవిటివారు మూగవారుగా ఉంటారు. చెవిటి మూగవారిని ఉపయోగకరమైన పౌరులుగా మార్చడానికి రాష్ట్రంలో హైద్రాబాదు, కాకినాడలలో రెండు పాఠశాలలను నిర్వహిస్తున్నారు. యీ పాఠశాలలలో ప్రాథమిక స్థాయి పాఠ్య ప్రణాళికను అనుసరించి విద్యాబోధన జరుగుతుంది. ఐదు సంవత్సరాల వయసుగల బాల బాలికలకు ప్రవేశం లభిస్తుంది. వీటిలో పది సంవత్సరాల వరకు బాల బాలికలకు విద్యాబోధన జరుగుతుంది. మౌఖిక విధానం ద్వారా బాల బాలికలకు మాట్లాడే శిక్షణ

యివ్వబడుతుంది. లెక్కలు, సాంఘిక శాస్త్రం, డ్రాయింగ్ వగైరా నేర్పబడుతాయి. కుట్టు పని, పుస్తకాల బైండింగ్, బెత్తం, కొయ్య పనులు, చేనేత వగైరా వృత్తి విద్యలలో ప్రాథమిక శిక్షణకూడా యిస్తారు. వ్యాయామం, ఆటలు నేర్పడానికి శిక్షణ పొందిన వ్యాయామ శిక్షకుడుకూడా ఉన్నాడు. పాఠశాలలో ప్రతి విద్యార్థికి పుస్తకాలకై సంవత్సరానికి రూ. 15/- చొప్పున అలవెన్సుకూడా యిస్తారు. ఉదయంపూట పాఠశాలలకు వెళ్ళే అర్హతగల విద్యార్థులకు స్కాలర్‌షిప్పులుకూడా యిస్తారు. పాఠశాలకు అనుబంధంగా ఒక హాస్టల్‌గూడా ఉంది. యిందులోని విద్యార్థులకు ఉచిత భోజన వసతి సౌకర్యం. సంవత్సరానికి రూ. 30/-ల చొప్పున బట్టల అలవెన్సు, వేసవి సెలవులకు రాకపోకలకై ఖర్చులు యివ్వడం జరుగుతుంది. హైద్రాబాదు, మలక్‌పేటలోని ప్రభుత్వ అంధుల పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, రాష్ట్రంలోని చెవిటివారి పాఠశాలల అధికార పరిశీలకుడుగా నియమింపబడ్డారు. సాంకేతిక విషయాలలో ఆయన సలహా లిస్తారు. పరిపాలనా వ్యవహారాలను ఆయా జిల్లా విద్యాధికారులు, ప్రాంతీయ డిప్యూటీ డైరెక్టర్లు నిర్వహిస్తారు.

కేంద్ర ప్రభుత్వం నిర్దేశించిన వయోజనులైన చెవిటివారి శిక్షణ కేంద్రాన్ని 1962, సెప్టెంబరు 15 వ తేదీనుండి ప్రారంభించడం జరిగింది. భారత దేశం మొత్తంనుండి దరఖాస్తులను స్వీకరించడం జరుగుతున్నది. దిగువ కార్యక్రమాన్ని అనుసరించి తేలికరకం ఇంజనీరింగులో యీ కేంద్రంలో శిక్షణ యిస్తారు.

1962_63	(1)	షీట్ మెటల్ వర్కు
	(2)	వైర్ మెన్ షిప్పు
	(3)	ఫిట్టింగ్
1963_64	(4)	వెల్డింగ్
	(5)	పెయింటింగ్
1964_65	(6)	టర్నింగ్
	(7)	మెకానిస్ట్
1965_66	(8)	మెకానిక్స్ పరికరాలు
	(9)	రేడియో విడిభాగాల ఉత్పత్తి.

ప్రతి దరఖాస్తుదారుకు శిక్షణకు సంబంధించిన వివరాలు పంపడం జరిగింది.

వికలాంగులకు ఉపాధికల్పించే నిమిత్తం హైద్రాబాదులో ప్రత్యేక ఉద్యోగ సాధక కేంద్రాన్ని నెలకొల్పనున్నారు. వికలాంగులైన వ్యక్తులు, భౌతిక మానసికలోపాలకారణంగా సరి అయిన ఉద్యోగ సౌకర్యాలను పొందలేక పోతున్నారు. నమోదు అయిన వికలాంగులకు వారి శక్తి సామర్థ్యాలను బట్టి ఓపెన్ వర్కుషాపుల్లోనూ షెల్టర్డ్ వర్కుషాపులలోనూ పనిచూపాలి. దిగువ ఉద్దేశాలతో ఉద్యోగసాధక కేంద్రాన్ని ప్రారంభించారు. (1) వికలాంగులైన వ్యక్తులకు తగిన ఉద్యోగాలను కల్పించడం. (2) అవసరమైన చోట్ల వృత్తి పనులను చూపడం. (3) యీ సమస్యకు సంబంధించిన సమాచారాన్ని సేకరించి వికలాంగుల ప్రత్యేక సమస్యలను పరిశీలించడం. (4) వికలాంగులకు అనువైన ఉద్యోగాలను అన్వేషించడం. (5) వికలాంగులను పనులలోకి తీసుకునేట్టుగా యజమానులను ప్రోత్సహించడం. (6) వికలాంగుల సంక్షేమానికి కృషి చేసే యితర సంస్థలతో సంబంధాలు నెలకొల్పడం. (7) ప్రతి వికలాంగుడూ ఉద్యోగంలో స్థిరపడేందుకు కృషి చేయడం.

వికలాంగుల ఆరోగ్య పరిస్థితిని పరిశీలించి, ఉద్యోగాలకు గల అర్హతలను పరీక్షించేందుకు ప్రవీణులగల మెడికల్ బోర్డును కూడా నెలకొల్పారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో అంధులు, చెవిటివారికై విరివిగా పాఠశాలలను నెలకొల్పడానికి రాష్ట్ర ప్రభుత్వం యోచిస్తున్నది. పోలియో వ్యాధికి గురిఅయిన బాల బాలికకై హైద్రాబాదులో ఒక పాఠశాలను త్వరలోనే ప్రారంభించ నున్నారు.

చెవిటివారికి సహాయపడేందుకు వీలుగా అఖిల భారత చెవిటివారి సమాఖ్య శాఖను హైద్రాబాదులో నెలకొల్పారు. భారత దేశంలోని చెవిటివారి ఉపాధ్యాయుల సమావేశానికి సీనియరు ఉపాధ్యాయున్ని పంపడంతో రాష్ట్ర ప్రభుత్వం సహకరించింది. దీని 10 వ సమావేశం యీ సంవత్సరం హైద్రాబాదులో జరపాలని ప్రతిపాదించారు.

వికలాంగుల సంక్షేమ జాతీయ సలహా మండలిలో మన రాష్ట్రం ప్రాతినిధ్యం వహిస్తున్నది. యీ మండలి సిఫారసులను రాష్ట్ర ప్రభుత్వం పరిశీలిస్తుంది.

దేశంలోని వివిధ ప్రాంతాల్లో కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యాన జరిగే వివిధ వికలాంగుల సెమినార్లకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతినిధులను పంపుతూ ఉంటుంది.

వికలాంగుల సంక్షేమ సమస్యలను పరిశీలిస్తే చాలా తక్కువ మాత్రమే చేశామని మనం చెప్పవచ్చు. వికలాంగుల సంక్షేమానికై కేంద్ర ప్రభుత్వం కొంత నిధిని కేటాయించింది. రాష్ట్ర ప్రభుత్వాలు, స్వచ్ఛంద సంస్థలు సంక్షేమ కార్య క్రమాలను అమలు జరపాలని కేంద్ర ప్రభుత్వం ఆదేశించింది. ఖర్చులో 50 శాతం భరించడానికి కేంద్రం సంసిద్ధత తెల్పింది. వికలాంగుల సంక్షేమానికి ప్రతి పౌరుడూ ముందుకు రావాలి. వికలాంగులకు సహాయ పడటమే నాగరికతా లక్షణం.

సెకండరీ విద్య

శ్రీ యన్. వి. నాయుడు

(ఆంధ్రప్రదేశ్ విద్యాశాఖ డిప్యూటీ డైరెక్టరు)

కొన్ని కొన్ని పదాలు వాటి సరియైనఅర్థాన్నికాక వేరే అర్థాన్ని ద్యోతకం చేస్తూ ఉంటాయి. అటువంటి వాటిలో 'సెకండరీ విద్య' ఒకటి. ఈ పదం సూచిస్తున్నట్లు ఒక విద్య తర్వాత ప్రాముఖ్యం గల మరొక విద్యాదశ అని అర్థంకాదు. రెండు దశల విద్యా విధానానికి—అంటే క్రిందిస్థాయిలో ప్రాథమిక విద్య, ఉన్నత స్థాయిలో విశ్వవిద్యాలయ విద్య—మధ్య వున్న ఈ 'సెకండరీ విద్య' అత్యంత గణనీయమైన స్థానాన్ని వహిస్తున్నది. ఏ ప్రజాస్వామ్య దేశాభివృద్ధికైనా ఈ సెకండరీ విద్య తప్పనిసరి అవుతుంది. మెకాలే మహాశయుని నివేదికనుంచి మొదలియార్ కమిషన్ వరకు దీనిపై ఎక్కువ ఆసక్తిని చూపడం జరిగింది. దీనిని బట్టి మన విద్యా విధానంలో 'సెకండరీ విద్య' ఎంత ప్రముఖ స్థానం వహిస్తుందో తెలుస్తుంది.

మనదేశంలోని విద్యా విధానం పెక్కు మార్పులకు గురయింది. "భవిష్యత్ విద్యా విధానం" గురించిన మెకాలే మహాశయుని నివేదిక, ఆ తర్వాత 1835 లో వచ్చిన ప్రతిపాదన—ఈ రెండూ—ఆధునిక సెకండరీ విద్యా విధానానికి పునాది వేశాయి. తర్వాత లార్డ్ విలియమ్ బెంటింగ్ ఇచ్చిన ప్రభుత్వ ఉత్తరువు దాన్నింకా పటిష్టం చేసింది. తత్ఫలితంగా దేశస్థులలో "ఇంగ్లీషు" విద్యాభివృద్ధికై ప్రభుత్వ నిధులను కేటాయించారు. ఈ విధానం రాజా రామ మోహనరాయ్ వంటి నాయకుల మన్ననలను కూడా పొందడమే గాక, భారతీయులలో ఆంగ్ల విద్యాభివృద్ధికై ఆయన ఎంతో ఉత్సాహంతో పనిచేశారు. 1844 లో లార్డ్ హార్డింజ్ ప్రభుత్వోద్యోగాలకు ఆంగ్లభాష పరిజ్ఞానం ప్రాథమికార్హత అని ఉద్ఘాటించారు. ప్రభుత్వమంత్రి వర్గ శాఖలలో నానాటికీ అధికమవుతున్న అవసరాలను తీర్చడానికి ముఖ్యమైన సెకండరీ విద్యాశయాలకు లార్డ్ హార్డింజ్ ప్రకటన ఒక నిర్ణీత రూపాన్ని కల్పించింది. కనీసం ఈ దశలోనైనా కలో—గంజో లభించే సమస్యను పరిష్కరించడమే విద్యయొక్క ముఖ్యాశయమైంది. ఆ తర్వాత దేశంలో క్రమ క్రమంగా ఈ సెకండరీ విద్య దిన దిన ప్రవర్ధమానమై ఆర్థిక, రాజకీయ, సాంఘిక శాస్త్రాలవంటి మానవ శాస్త్రాల అభ్యాసం పెంపొందింది.

దేశంలోని విద్యాభివృద్ధిని ఆ తదుపరి ఒక దశాబ్దం తర్వాత సమీక్షించారు. ఈ సమీక్ష ఫలితంగా ఒక ఉత్తరువును (వుడ్స్ ఉత్తరువు) జారీ చేశారు. ఈ ఉత్తరువులో కొన్ని ముఖ్యమైన సిఫార్సులు: (1) ప్రతి రాష్ట్రంలో విద్యాశాఖకై ఒక ప్రత్యేక డైరెక్టరేట్‌ను విద్యాశాఖ డైరెక్టర్ క్రింద నెలకొల్పాలి. (2) పరీక్షలు నిర్వహించడానికి, డిగ్రీలు నివ్వడానికి విశ్వ విద్యాలయాలను ప్రారంభించాలి. (3) పెక్కు ఉన్నత పాఠశాలలను నెలకొల్పాలి. ఇతరత్రా ఏ సహాయం లేకుండా స్వయం శక్తితో విద్యా సముపార్జన చేయలేని అసక్తివంతులైన ఈ ప్రజా బాహుళ్యానికి నిత్యజీవిత మజిలీలలో ఆచరణ యోగ్యంగా ఉపయోగపడేట్లు ఈ విద్యను తీర్చి దిద్దాలనే అభిప్రాయాన్ని ఆ ఉత్తరువులో వెలువరించడం ఆ ఉత్తరువులోని ఒక విశిష్టత. లార్డ్ హార్డింజ్ ప్రకటన వెలువడిన పదేళ్ళ తర్వాత గూడా వృత్తి పనులలో శిక్షణ అవసరమనే అభిప్రాయ పడ్డారు.

1857 లో విశ్వవిద్యాలయాలు నెలకొల్పబడినాయి. ఇవి ఆరంభంలోనే సెకండరీ విద్యా విధానాన్ని అమలు జరపడం ప్రారంభించాయి. ఒక పాఠ్య ప్రణాళికను నిర్ణయించి, పరీక్షలను నిర్వహించి ఆ విధంగా సెకండరీ విద్య విశిష్ట స్థాయిని నెలకొల్పడం విశ్వ విద్యాలయ అధికార పరిధిలోనే వున్నాయి. మాతృభాష సంపూర్ణంగా నిర్లక్ష్యం చేయబడింది. చదువులు విద్యాలయాలకే అంటిపెట్టుకొని జీవితానికి సంబంధం లేకుండా తయా

రయ్యాయి. వృత్తిపనుల్లో శిక్షణ కోర్సులు మూలపడ్డాయి. విద్యార్థులను మెట్రిక్యులేషన్ పరీక్షకు పంపడం అనేది ఒక్కటే సెకండరీ విద్యావిధానం యొక్క సంపూర్ణాశయమైంది.

1882లో హంటర్ కమిషన్ వచ్చింది. అది సెకండరీ విద్యా సమస్యను సాకల్యంగా పరిశీలించింది. సెకండరీ విద్యకై అమిత వ్యయం అవుతున్నందున ప్రైవేటుగా గూడా సెకండరీ పాఠశాలల నిర్వహణకు ప్రోత్సాహమిచ్చారు. సహాయక గ్రాంట్ల పద్ధతిని ప్రవేశపెట్టారు. విశ్వ విద్యాలయాలలో ప్రవేశానికవసరమయిన ప్రవేశ పరీక్షకు, వృత్తి పనుల శిక్షణ కోర్సుకు సంబంధించిన రెండు విధానాల అవసరం ప్రప్రథమంగా గుర్తింపబడింది. కాని దానివల్ల ఎట్టి ఫలితమూ రాలేదు.

ఆ తర్వాత ఇరవై సంవత్సరాల కాలంలో సెకండరీ విద్య చెప్పుకోదగినంతగా విస్తృతమైంది. దీనికి కారణం ప్రైవేట్ కృషికి ప్రభుత్వం అందిచ్చిన ప్రోత్సాహమే.

1902 లో విశ్వ విద్యాలయాల సంఘం (యూనివర్సిటీ కమిషన్) చేసిన సిఫార్సులూ, 1904లో భారతీయ విశ్వ విద్యాలయాల శాసనం అమలులోకి రావడమూ సెకండరీ విద్యపై విశ్వవిద్యాలయాల అధిక ప్రభావాన్ని ఇంకా పెంపొందించాయి. సెకండరీ పాఠశాలలను విశ్వ విద్యాలయాలు ఆమోదించాలని ఈ విశ్వ విద్యాలయాల చట్టం నిబంధనలలో వివరించారు. కనుక సెకండరీ విద్యపై విశ్వవిద్యాలయాల యాజమాన్యం బలపడడంలో ఆశ్చర్యం ఏమీలేదు.

ఇండియా వైస్రాయిగా వున్న లార్డ్ కర్జన్ (1899–1905) ఎన్నో పటిష్ఠమైన విద్యాభివృద్ధి కార్యక్రమాలను రూపొందించారు. కాని దురదృష్ట వశాత్తు ఆయనలో రాజీపడే ధోరణి లేనందున భారత ప్రజల తీవ్ర వ్యతిరేకతను ఆయన ఎదుర్కొనవలసి వచ్చింది. గోపాలకృష్ణ గోఖలేవంటి నాయకులు ఆయనను బ్రిటిష్ కాలంలోని "ఔరంగజేబు" అని పేరు పెట్టారు. ప్రజా ప్రోత్సాహం లభించనందున ఆయన రూపొందించిన పెక్కు విద్యా కార్యక్రమాలు అమలులోకి రాలేదు. అయినప్పటికీ ఆయన కార్యక్రమాలలో సెకండరీ విద్య ఎక్కువ ప్రాముఖ్యతను పొందింది. సెకండరీ పాఠశాలల ఉపాధ్యాయులకు శిక్షణ నివ్వడానికి, విజ్ఞాన శాస్త్రాన్ని బాగ బోధించడానికి, విద్యార్థులకు వసతికల్పించడానికి, కాయకష్టంలో శిక్షణ నివ్వడానికి, అధికమైన సహాయక గ్రాంట్లను చెల్లించడానికి తగిన సౌకర్యాలను కల్పించారు. సెకండరీ విద్యను విశ్వవిద్యాలయాల గుప్పిట నుంచి విడిపించాలని తలపెట్టిన ఉద్యమం ఫలితంగా 1905–21 లో పెక్కు రాష్ట్రాలలో సెకండరీ విద్యా బోర్డులను నెలకొల్పారు. ఈ బోర్డులు పాఠ్య ప్రణాళికలను రూపొందించి, పరీక్షలను నిర్వహించి, స్కూల్ లీవింగ్ సర్టిఫికెట్లను ఇచ్చాయి. ఉద్యోగాలలోకి, విశ్వవిద్యాలయాలలోకి ప్రవేశించడానికి వీలుగా ఈ సర్టిఫికెట్లు అభ్యర్థులకుపయోగించేవి. పాఠశాల తుది దశకు (స్కూల్ ఫైనల్) వచ్చిన ఈ పరీక్ష, విశ్వవిద్యాలయాలు నిర్వహించే మెట్రిక్యులేషన్ పరీక్షకు ప్రత్యామ్నాయమైంది.

కలకత్తా విశ్వవిద్యాలయ సంఘం 1917 లో పనిచేయడం ప్రారంభించింది. సర్ మైఖేల్ శాడ్లెర్ అధ్యక్షతన ఈసంఘం కొన్ని ముఖ్యమైన సిఫార్సులను–ఇతర రాష్ట్రాలకు కూడా ఉపయోగించే విధంగా–చేసింది. వీటిలో ముఖ్యమైనవి కళాశాలలలో ఇంటర్మీడియట్ కోర్సులను తీసివేయడం, సెకండరీ విద్యలో ఒక సంవత్సరం పోస్ట్–మెట్రిక్యులేషన్ క్లాసులు చేర్చడం, విశ్వవిద్యాలయాలలో మూడు సంవత్సరాల మొదటి డిగ్రీ కోర్సులను ప్రారంభించడం. విశ్వవిద్యాలయ డిగ్రీ తరగతులకు ప్రవేశదశయైన ఇంటర్మీడియట్ కోర్సు చివర విశ్వవిద్యాలయ కోర్సులను సెకండరీ విద్యను వేరు చేయాలని అది సూచించింది. మొదలియార్ కమిషన్ చేసిన సిఫార్సులకు శాడ్లర్ కమిషన్ నివేదిక ఒక విధంగా మూలం అని చెప్పవచ్చు.

కర్జన్ అనంతరం సెకండరీ పాఠశాలలు చెప్పుకోదగినంతగా పెరిగాయి. కాని వృత్తి పనుల లేక వృత్తి పనుల ముందు శిక్షణ కోర్సులను అభివృద్ధి చేయడానికి చేసిన యత్నాలు మాత్రం ఫలించలేదు. ఈ కాలంలో తర్వాత దశలో చేసిన ముఖ్య సంస్కరణలలో పేర్కొనదగింది– లోయర్ సెకండరీ తరగతులలో బోధనా భాషను ఇంగ్లీషు నుంచి స్థానిక భాషలకు మార్చడం.

1919 వ సంవత్సరం భారత ప్రభుత్వ చట్టం విద్యను ఒక బదిలీ విషయంగా చేసినందున అది రాష్ట్ర ప్రభుత్వ ఆధిపత్యం క్రిందకు వెళ్ళింది. విద్యారంగం నుంచి తన ఆధిపత్యాన్ని కేంద్ర ప్రభుత్వం ఉపసంహరించుకుంది. ఈ ఉపసంహరణ వల్ల కేంద్ర విద్యా సలహా మండలి కూడా 1923 లో రద్దయింది. వివిధ రాష్ట్రాలు సెకండరీ విద్యకు తమ స్వంత విధానాలను రూపొందించుకొని వాటినభివృద్ధి చేశాయి. ఒకే విధానం దేశంలో అమలు జరగలేదు. అందువల్ల మళ్ళీ విద్యాపరిస్థితులను సమీక్షించవలసి వచ్చింది. ఇందుకై 1929 లో ఒక కమిటీని (హార్టోగ్

కమిటీ) నియమించారు. ఆ సమీక్ష ఉపాధ్యాయుల శిక్షణ సౌకర్యాల లోపాన్ని బహిర్గతం చేసింది. అది ప్రజల దృష్టిని ఉపాధ్యాయుల తక్కువ జీతాల వైపు కేంద్రీకరింపజేసింది.

రాష్ట్రంలో విద్యావంతులైనవారి నిరుద్యోగానికిగల కారణాలను గురించి విచారించడానికి సంయుక్త రాష్ట్రాల ప్రభుత్వం 1935 లో సప్రూ కమిటీని నియమించింది. ఈ నిరుద్యోగ సమస్యకు ముఖ్యకారణం— విశ్వవిద్యాలయాలలో ప్రవేశానికై పరీక్షలలో ఉత్తీర్ణులయ్యేట్లు మాత్రమే చేస్తున్న సెకండరీ విద్య దుర్విధానమేనని ఆ కమిటీ నివేదిక తెలిపింది. సెకండరీ విద్యా స్థాయిలో వివిధ కోర్సులను ఏర్పాటు చేయడమే దీనికి విరుగుడు అవుతుంది. అటువంటి కోర్సు నిత్యజీవితాచరణలో ఉపయోగపడేట్లుండాలి. ఇంటర్మీడియట్ కోర్సును తీసివేయాలని, సెకండరీ విద్యా దశను మరొక సంవత్సరానికి పెంచాలని, దిగువ సెకండరీ స్థాయికి చివర వృత్తి పనుల శిక్షణను ప్రారంభించాలని, విశ్వవిద్యాలయాలలో మూడేళ్ళ డిగ్రీ కోర్సులను ప్రవేశపెట్టాలని ఈ కమిటీ సూచనలు చేసింది. ఈ సిఫార్సుల ప్రాముఖ్యత గమనింపబడి వాటికి మొదలియార్ కమిషన్ నివేదికలో స్థానం ఏర్పడింది.

1935 వ సంవత్సరం భారత ప్రభుత్వ చట్టం రాష్ట్రాల స్వయం పరిపాలనా విధానాన్ని ప్రవేశపెట్టింది. విద్యా కార్యక్రమాలు రాష్ట్రాల బాధ్యతగా కొనసాగాయి. రాష్ట్రాలకు ఇచ్చిన స్వతంత్రం వల్ల సెకండరీ విద్యా పథకాలు విస్తృతం కావలసి వుంది. కాని అలా జరగలేదు. దేశంలో విద్యావంతులైన యువకులెదుర్కొంటున్న నానాటికి అధికమవుతున్న నిరుద్యోగ సమస్యను పరిశీలించడానికి వీలుగా విద్యా పునర్వ్యవస్థీకరణకు ముఖ్యంగా వృత్తి పనుల విద్యకు సంబంధించిన కొన్ని సమస్యలపై భారత ప్రభుత్వానికి సలహాలివ్వడానికి ఎబ్బాట్, ఉడ్ అనే ఇద్దరు నిపుణులను 1936_37) ఆహ్వానించారు. సాధారణ విద్యను నిర్దేశించిన సంస్థలతో బాటు వృత్తి పనుల సంస్థలను పునర్వ్యవస్థీకరించాలని ఆ నిపుణులు తమ నివేదికలో సూచించారు. కొన్ని రాష్ట్రాలు ఆ సూచననను సరించి సాంకేతిక, వాణిజ్య, వ్యవసాయకోన్నత పాఠశాలలను ప్రారంభించాయి. ప్రస్తుతం వున్న పాలిటెక్నిక్‌లకు మూలం ఆనాటి ఎబ్బాట్_ఉడ్ నిపుణుల నివేదికయే!

1937_1946 మధ్య కాలంలో దేశంలో సెకండరీ విద్య విస్తరణ చెప్పుకోదగినంతగా జరగలేదు. దీనికి ముఖ్య కారణాలు రెండవ ప్రపంచ యుద్ధం, దేశంలో చెలరేగిన రాజకీయ సంక్షోభం. జాతీయతత్వం, స్వాతంత్ర్య పోరాటం పరాకాష్ఠ నందుకున్నాయి. భారతదేశంలో నానాటికీ క్షీణిస్తున్న శాంతి భద్రతల పరిస్థితిని అదుపులో వుంచడానికి, భారతదేశం ఉత్తర, తూర్పు సరిహద్దులలో శత్రువుల నెదుర్కొనడానికీ ప్రభుత్వ శక్తి అంతా కేంద్రీకరింపబడింది. రెండవ ప్రపంచ యుద్ధం ముగిసిన వెంటనే దేశంలో ఆర్థిక పరిస్థితులకు అంతరాయం కలిగింది. అలాగే విద్యా కార్యక్రమాలు కూడా వెనుకబడ్డాయి. ఈ సమయంలోనే ఉన్నత పాఠశాలలలో బోధనా భాషగా ప్రాంతీయ భాషను అధిక భాగంలో ఏర్పాటు చేశారు. ప్రైవేట్ సంస్థలు స్థాపించిన వృత్తుల సంస్థలకు ప్రభుత్వం నుంచి గ్రాంటులు లభించాయి.

1923 లో రద్దు చేయబడిన కేంద్ర విద్యా సలహా మండలిని పునర్నిర్మించారు. భారత ప్రభుత్వ సలహాదారుడైన సర్ జాన్ సార్జెంట్ యుద్ధానంతరం విద్యాభివృద్ధికై 1944 లో కొన్ని ముఖ్య సూచనలు చేశారు. 6 నుంచి 14 సంవత్సరాల మధ్య వయస్సుగల బాలబాలికలకు నిర్బంధోచిత ప్రాథమిక విద్యను సర్వత్రా ప్రవేశపెట్టాలని ఆ నివేదిక సూచించింది. ప్రాథమిక విద్యాదశ తర్వాత ఐదేళ్ళ కాలం పాటు వివిధ కోర్సులను ఏర్పాటు చేయాలని, ఉన్నత పాఠశాలా విద్య ఆరేళ్ళ పాటు— (అ) సాధారణ విద్య (ఆ) సాంకేతిక విద్య అని—రెండు రకాలుగా వుండాలని అది సూచించింది. జీవితంలో ఉపయోగించే విధంగా అన్ని రకాల విద్యను గరపడమే ప్రాథమిక సెకండరీ విద్యల ముఖ్యాశయంగా ఉండాలి. అన్ని తరగతుల ఉపాధ్యాయులకు మంచి జీతాలనివ్వాలని కూడా ఆ నివేదిక సిఫార్సు చేసింది. 1946 లో జాతీయ విద్యా మంత్రిత్వ శాఖ ఏర్పడడంతో విద్యాభివృద్ధికి వినూత్న ప్రోత్సాహం లభించింది. రాష్ట్రాలు తమ స్థానిక పరిస్థితుల కనుగుణమైన కొన్ని సంస్కరణలను ఉత్సాహంతో ప్రవేశపెట్ట నారంభించాయి. సెకండరీ విద్యా సమస్యను పరిశీలించడానికై పెక్కు రాష్ట్రాలు కమిటీలను నియమించాయి. భారతదేశంలో సెకండరీ విద్యను గురించి సమీక్షించి, దానికి సంబంధించిన వివిధ సమస్యలపై సిఫార్సు చేయడానికి కేంద్ర ప్రభుత్వం కూడా 1948 లో తారాచంద్ కమిటీని ఏర్పాటు చేసింది. ఆ కమిటీ చేసిన కొన్ని ముఖ్య సిఫార్సులను 1949 లో అలహాబాద్‌లో సమావేశమైన కేంద్ర విద్యా సలహా మండలి నిశితంగా పరిశీలించింది. అది సెకండరీ విద్యా సమస్యలను సమగ్రంగా పరిశీలించి తగిన సిఫార్సులు చేయడానికి సెకండరీ విద్యా కమిషన్‌ను ఏర్పాటు చేయవలసిందని భారత ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. 1951 వరకు ఈ సూచనపై ఎట్టి చర్యా తీసుకొనలేదు. సెకండరీ విద్యా కమిషన్ ఏర్పాటు చేయవలసిందని మళ్ళీ పునరుద్ఘాటించడంతో 1952 లో

ఆ కమిషన్‌ను నియమించారు.

భారత ప్రభుత్వం 1948 లో డా. యస్. రాధాకృష్ణన్ అధ్యక్షతన విశ్వవిద్యాలయ విద్యా సంఘాన్ని (యూనివర్సిటీ ఎడ్యుకేషన్ కమిషన్) నియమించింది. ఆ సంఘం తమ నివేదికలో సెకండరీ విద్యాపరిస్థితిని కూడా సమీక్షించి, హైస్కూలు, ఇంటర్మీడియట్ కోర్సులలో 12 సంవత్సరాలు చదివిన తర్వాతనే విశ్వవిద్యాలయాల్లోకి ప్రవేశార్హత కలిగించాలని సిఫార్సు చేసింది. దీనివల్ల కొన్ని రాష్ట్రాలలో పదేళ్ళ తర్వాత, మరి కొన్ని రాష్ట్రాలలో 11 సంవత్సరాల తర్వాత పూర్తి అయ్యే సెకండరీ విద్యా కాలాన్ని మళ్లీ ఒకటి, రెండు సంవత్సరాలు పొడిగించవలసిన అవసరం కలుగుతుంది.

1952 లో ఏర్పాటయిన మొదలియార్ కమిషన్ సెకండరీ విద్యా విధానాన్ని సాకల్యంగా పరిశీలించి, ప్రస్తుత విధానంలో వున్న లోపాలను చూపుతూ, కొన్ని ముఖ్యమైన సిఫార్సులు చేసింది. ఆ కమిషన్ తెలిపిన కొన్ని లోపాలు : (1) ఈ విద్య జీవితానికి సంబంధం లేకుండా వుండడం వల్ల, కోర్సు పూర్తయాక విద్యార్థి ఎటువైపుగా మొగ్గాలో తెలియని పరిస్థితుల్లో పడడం. (2) అది ఒకే దృక్పథాన్ని కలిగివుంది, చదువడం, వ్రాయడం, పరీక్షలలో ఉత్తీర్ణులవడాన్ని మాత్రమే ప్రోత్సహించడం (3) సాంఘికంగాను, మానసికంగాను ముఖ్యమైన ఇతర విషయాలు, బోధింపబడకపోవడం. (4) వ్యక్తిత్వం పెంపొందడం పూర్తిగా నిర్లక్ష్యం చేయబడడం. (5) వ్యక్తిగతంగా ఆలోచించడానికి, ఏ పనికైనా పూనుకోవడానికి తగిన శక్తిని పెంపొందించలేని బోధనా పద్ధతులు, (6) తరగతి పరిమాణం పెరగడం వల్ల ఉపాధ్యాయులకు, విద్యార్థులకు మధ్య సంబంధాలు సన్నగిల్లడం, అందువల్ల క్రమశిక్షణ లోపించడం, (7) ఉపాధ్యాయుల వేతనాలు చాలా తక్కువగా వుండి వారి శక్తి క్షీణించడం, (8) ఉపాధ్యాయులకు సాంఘిక గౌరవం లోపించడం (9) పాఠశాలలలో బోధనపై పరీక్షల ఒత్తిడి ఎక్కువై, ఉపాధ్యాయుల చొరవ క్షీణించి, పాఠ్య గ్రంథాలు కట్టలకొద్దీ ముద్రితమై, నిర్జీవమైన యాంత్రిక బోధనా విధానాలను పెంపొందింప చేసి, ప్రయోగాత్మక చర్యలకు నిరుత్సాహం కలిగిస్తూ, అనవసరమైన విషయాలపై ఒత్తిడి తేవడం.

సెకండరీ విద్యా విధానానికి ఈ క్రింది ఆశయాలుండాలని ఆ కమిషన్ తెలిపింది.

1. ప్రజాస్వామ్య పౌరసత్వాన్ని పెంపొందించడం,
2. వృత్తి పనుల శక్తి సామర్థ్యాల నధికం చేయడం.
3. వ్యక్తిత్వాన్ని పెంపొందించడం.
4. నాయకత్వానికి శిక్షణ గరపడం.

దేశంలో సెకండరీ విద్యా విధానాన్ని పెంపొందించి దీని ఆశయాలను సాధించడానికి వీలుగా సెకండరీ విద్యలోని లోపాలను తొలగించడానికి ఆ కమిషన్ కొన్ని ప్రతిపాదనలను సిఫార్సు చేసింది. ఈ సిఫార్సులను కేంద్ర ప్రభుత్వంతో పాటు రాష్ట్రాలు కూడా సాధారణంగా అంగీకరించాయి. మొదలియార్ కమిషన్ చేసిన సిఫార్సుల నమలు జరపడం వల్ల సెకండరీ విద్యా విధానం ఈ క్రింది విధంగా వుంటుంది:

1. ఏడు లేక ఎనిమిది సంవత్సరాల సమీకృత ప్రాథమిక విద్య.
2. మూడేళ్ళ సెకండరీ విద్య.
3. సెకండరీ విద్యా కోర్సుకు మరొక సంవత్సరాన్ని చేర్చడం వల్ల హయ్యర్ సెకండరీ కోర్సు ఏర్పడుతుంది. ఆ కోర్సు పూర్తయాక పబ్లిక్ పరీక్ష జరుగుతుంది. ఈ పరీక్షలో ఉత్తీర్ణులవడంతో మూడేళ్ళ విశ్వవిద్యాలయ విద్య కోర్సులోని మొదటి సంవత్సరంలోకి ప్రవేశార్హత లభిస్తుంది.

(4) ఈ హయ్యర్ సెకండరీ పాఠశాలలతో బాటు బహూకార్థసాధక పాఠశాలలుంటాయి. ఈ పాఠశాలలలో 9 వ తరగతి తర్వాత వాణిజ్యవిషయాలు, ఇంజనీరింగు, వ్యవసాయం, లలిత కళలు మొదలైన వివిధ విషయాలలో విద్యార్థులు ఎన్నుకొన్న ప్రకారం శిక్షణ గరపుతారు. ఈ బహూకార్థసాధక పాఠశాలలలో విద్యార్థులు తమ అనక్తి కనుగుణంగా విషయాల నెన్నుకోడానికి సహాయపడడానికి వృత్తిపనులలో శిక్షణ సౌకర్యం వుంటుంది.

మొదలియార్ కమిషన్ నివేదిక తర్వాత సెకండరీ విద్యా విధానంలో ఈ క్రింది కొత్త విషయాలను ప్రవేశపెట్టారు. విద్యా వృత్తి విషయక సంస్థల స్థాపన, పరీక్షల సంస్కరణ, గోష్ఠులు వర్క్‌షాపులు, ఓరియంటేషన్ కోర్సులు మొదలైనవాటిని నిర్వహించడం ద్వారా బోధనా విధానాలలో విభిన్న పద్ధతులను ప్రతిపాదించడం, రికార్డుల సమీకరణను ప్రవేశపెట్టడం.

మొదలియార్ కమిషన్ సిఫార్సుల ననుసరించి ఈ రాష్ట్రంలో విద్యా విధానం ఈ క్రింది విధానాలమీద పునర్నిర్మించబడింది.

1. ఏడు సంవత్సరాల సమీకృత ఎలిమెంటరీ (బేసిక్) విద్య.

2. నాలుగు సంవత్సరాల సెకండరీ విద్య. దీని క్రింద హయ్యర్ సెకండరీ పాఠశాలలలో నాన్-ఎలక్టివ్ ప్రాతిపదికపై ఎకాడమిక్ కోర్సులలో బోధిస్తారు. అలాగే బహూకార్థ సాధక పాఠశాలలు వాణిజ్యం, టెక్నాలజీ వ్యవసాయం మొదలైన విభిన్న విషయాలను బోధిస్తాయి.

ఆంధ్రప్రదేశ్ రెండు ప్రాంతాలతో రూపొందింపబడింది. (1) మాజీహైద్రాబాద్ రాష్ట్రంలోని తొమ్మిది జిల్లాలతోఏర్పడిన తెలంగాణా ప్రాంతం. (2) ఒకప్పుడు మద్రాసు రాష్ట్రంలో అంతర్భాగంగాగల ఇది వరకటి ఆంధ్ర రాష్ట్రంలోని 11 జిల్లలతోగల ఆంధ్ర ప్రాంతం. ఈ రెండు ప్రాంతాలలోని సెకండరీ పాఠశాలలలో రెండు విధానాలు వున్నాయి. ఇదివరకటి హైదరాబాద్ రాష్ట్రంలోని తెలంగాణా ప్రాంతంలో ఎన్నిక విధానం (ఎలక్టివ్) వుండేది. కాని 1953 కు ముందు మద్రాసు రాష్ట్రంలో అంతర్భాగంగావున్న ఆంధ్ర ప్రాంతంలో ఈ విధానంలేదు. అప్పుడు మద్రాసు రాష్ట్రపు నాన్- ఎలక్టివ్ విధానం వుండేది. ఆంధ్ర ప్రదేశ్ మొత్తానికీ ఒకే సెకండరీ విద్యాబోర్డు వున్నప్పటికీ ఈ రెండు ప్రాంతాలలో స్కూలు ఫైనలు పరీక్షలు వేర్వేరుగా జరుగుతున్నాయి. ఆ విధంగా ప్రస్తుతం రాష్ట్రంలోని సెకండరీ పాఠశాల లన్నింటిలో ఒకే విధానంలేదు. ప్రత్యేక నిపుణుల కమిటీలను ఏర్పాటుచేసి రాష్ట్రం మొత్తానికి ఒకే సమీకృత విధానం రూపొందించబడింది.

1960-61 లో ఎలిమెంటరీ (ప్రైమరీ) స్థాయిలో ఏడేళ్ళ సమీకృత కోర్సును ఒకటి రెండు తరగతులలో ప్రవేశ పెట్టడం జరిగింది. దీనిని ఒక్కొక్క సంవత్సరం తర్వాత ఇతర తరగతులకు విస్తరింప చేయనున్నారు.

సెకండరీ తరగతులకు (తొమ్మిదవ తరగతి నుంచి 12 వ తరగతివరకు) సమీకృత పాఠ్య ప్రణాళికను తొమ్మిదవ తరగతిలో 1963-64 నుంచి ప్రవేశపెట్ట నున్నారు. 1965-66 నాటికి ఏడుసంవత్సరాల సమీకృత ఎలిమెంటరీ (ప్రైమరీ) విధానం 7 వ తరగతికి చేరుకుంటుంది. 1966-67 విద్యా సంవత్సరం నుంచీ ప్రస్తుతంవున్న ఎనిమిదవ తరగతిపోయి, ప్రస్తుతంవున్న తొమ్మిదవ తరగతి ఎనిమిదవ తరగతి అవుతుంది. ఈ విధానం 1969-1970 వరకూ- అంటే హయ్యర్ సెకండరీ లేక బహూకార్థసాధక పాఠశాలలలోని 12 వ తరగతి 11 వ తరగతి అయ్యే వరకూ- కొనసాగుతుంది. ఆవిధంగా హయ్యర్ సెకండరీ విద్యాకాలం ప్రస్తుతం వున్నట్లు 12 సంవత్సరాలుగాగాక 1969-70 నుంచి 11 సంవత్సరాలకాలం వుంటుంది.

ఆంధ్రప్రదేశ్ లోని ఈ సమీకృత విధానంయొక్క ముఖ్య లక్షణం దానిలోని భాషావిధానం. త్రిభాషా విధానాన్ని ఈ రాష్ట్రం అంగీకరించింది. (మొదలియార్ కమీషన్ ద్విభాషా పథకాన్ని రూపొందించింది) సెకండరీ విద్య అన్నిదశలలో మాతృ భాష లేక ప్రాంతీయభాష, హిందీ, ఇంగ్లీషు నిర్బంధంగా బోధింపబడతాయి. మాతృభాష, లేక ప్రాంతీయ భాష కింద- విద్యార్థి తన ఇష్టానికి వ్యతిరేకంగా ఏ భాషనూ చదవకుండా పెక్కు గ్రూపులను ఏర్పరిచారు. అల్ప సంఖ్యాక భాషలుగల గ్రూపులలో ప్రాచీన ఆధునిక భాషలు కూడా చేర్చబడ్డాయి.

ప్రస్తుతం ఇంగ్లీషును ఆరవ తరగతి నుంచీ నిర్బంధంగా బోధిస్తున్నారు. మూడవ తరగతి నుంచీ ఇంగ్లీషును నేర్పాలన్న ప్రతిపాదనను ప్రభుత్వం ఇటీవలనే ఆమోదించింది.

సెకండరీ పాఠశాలలలో బోధనాభాష మాతృ భాష లేక ప్రాంతీయభాష. ఇంగ్లీషులో బోధించడానికి కూడా సౌకర్యాలున్నాయి.

1963-64 లో ఆంధ్రప్రదేశ్ సెకండరీ విద్యా విధానంలో సమీకృత పాఠ్య ప్రణాళిక ప్రవేశపెట్ట బడటంతో దానికీ, మొదలియార్ నివేదిక రూపొందించిన అఖిల భారత విధానానికి ఒక విషయంలో భేదం ఏర్పడుతుంది. ఆంధ్రప్రదేశ్ లో లోగడ ఆంధ్ర ప్రాంతంలో అనుసరించిన ప్రస్తుత నాన్ఎలక్టివ్ విధానమే వుంటుంది. అయితే మొదలియార్ నివేదిక ఎలక్టివ్ విధానాన్ని సిఫార్సు చేసింది.

ఈరాష్ట్రంలో 2207 సెకండరీ, మాధ్యమిక, ఉన్నత పాఠశాలలున్నాయి. అందులో కొన్ని అసంపూర్తిగానే వున్నాయి. పెక్కు ఉన్నత పాఠశాలలు పబ్లిక్ పరీక్షకు అర్హత కలిగించే మూడేళ్ళ సెకండరీ విద్యాకోర్సును గరపుతున్నాయి. అంగీకరింపబడిన ఉన్నత సెకండరీ విద్యా విధానంవల్ల సెకండరీ విద్యకాలాన్ని మరొక సంవత్సరంపాటు పొడిగించి ప్రతి పాఠశాలను అప్‌గ్రేడ్ చేయవలసివుంటుంది. అలా చేయడం వల్ల ఈ క్రింద చర్చించిన కొన్ని ప్రయోగాత్మక సాధకబాధకాలను దేశం ఎదుర్కొంటుంది.

మొదటిది అప్‌గ్రేడ్ చేయవలసిన పాఠశాలల సంఖ్య ఒక తీవ్ర సమస్య. ద్వితీయ ప్రణాళికాంతంనాటికి 140 (47 బహూకార్థ

సాధక పాఠశాలలు, 93 హయ్యర్ సెకండరీ పాఠశాలలు) సెకండరీ పాఠశాలలు అప్‌గ్రేడ్ చేయాలని తలపెట్టారు. ఆమొత్తంలో ఆరింట ఒక వంతును సంవత్సరానికి 20 పాఠశాలల (సగటున) చొప్పున అలా అప్‌గ్రేడ్‌చేయాలి. ఆ విధంగా అన్ని పాఠశాలలను హయ్యర్ సెకండరీ పాఠశాలలుగా అప్‌గ్రేడ్ చేయడానికి మరొక అర్ధశతాబ్దం పడుతుంది. వీటిని బహుళార్థసాధక పాఠశాలలుగా మార్చాలంటే ఇంకా వ్యవధి కావాల్సుంటుంది.

ఇక రెండవది: తగినంతమంది పోస్ట్-గ్రాడ్యుయేట్ ఉపాధ్యాయులు లేకపోవడం పాఠశాలలను అప్‌గ్రేడ్ చేసే కార్యక్రమాన్ని సన్నగిల జేస్తుంది. ఇప్పటికే అప్‌గ్రేడ్‌చేయబడిన 140 పాఠశాలలలో కూడా తగినంతమంది అర్హతలు గల ఉపాధ్యాయులు లేరు. ఈ ఉపాధ్యాయుల లోపాన్ని పరిష్కరించుకోడానికి ఈ క్రింది చర్యలు తీసుకోబడ్డాయి: విశ్వ విద్యాలయాలు (1) ప్రస్తుతం వున్న పట్టభద్రుల ఉపాధ్యాయులకు స్వల్పకాల వ్యవధి గల సర్టిఫికెట్ కోర్సులు నిర్వహించడం. (2) పోస్ట్ గ్రాడ్యుయేట్ కోర్సులలోని అన్ని సబ్జక్టులలో కొన్ని స్థానాలను (విద్యాశాఖ పంపే ఉపాధ్యాయులకు) ప్రత్యేకించడం. (3) ఉపాధ్యాయుల సౌకర్యార్థం ఒక సంవత్సరం కాలపరిమితి గల క్లుప్తీకరించిన తీవ్రతర పోస్ట్ గ్రాడ్యుయేట్ కోర్సులను ప్రారంభించడం. ఈ ప్రయత్నాలు క్రమ క్రమంగా ఫలవంత మవుతున్నాయి.

మూడవది: తగినంత డబ్బులేకపోవడం ఒక పెద్ద ప్రతిబంధకం. పెక్కు పాఠశాలలకు తగినన్ని భవనాలు, ఫర్నిచరు, సాధనసంపత్తి లేవు. ప్రతి పాఠశాలను హయ్యర్ సెకండరీ పాఠశాలగా అప్ గ్రేడ్ చేయడానికి కనీసం ఒక లక్ష రూపాయలు కావలసి వుంటుంది. బహుళార్థ సాధక పాఠశాలగా అప్‌గ్రేడ్ చేయడానికి రెండు మూడు లక్షల రూపాయలు (ఈ ఖర్చు ఆ పాఠశాలలలో బోధించే వివిధ కోర్సుల సంఖ్యనుబట్టి వుంటుంది) కావాలి. ద్వితీయ ప్రణాళికలో పాఠశాలలను అప్ గ్రేడ్‌చేసే పథకానికి రూ. 52.11 లక్షల నాన్-రికరింగ్ ఖర్చు అయింది.

ఇటీవల కాలంలో సెకండరీ పాఠశాలలను నిర్వహించడానికి ప్రైవేట్‌రంగం పూర్తిగా రాష్ట్ర ప్రభుత్వ సహాయంమీద ఆధారపడింది. ఎనిమిదవ తరగతి వరకు ఉచితవిద్యా పద్ధతిని ప్రవేశపెట్టడం, కళాశాలలలో ఇంటర్మీడియట్ కోర్సులను తీసివేయడం, స్కూల్ ఫైనల్ అభ్యర్థులకు (హయ్యర్ సెకండరీ, బహుళార్థ పాఠశాలల సర్టిఫికెట్లు వున్నవారుకాక) ప్రీ-యూనివర్సిటీ కోర్సులను ప్రారంభించడం వల్ల రాష్ట్ర ధనాగారానికి ఎక్కువ డబ్బు కావాల్సి వచ్చింది. మొదలియార్ కమిటీ సూచించిన సంస్కరణల నమలు పరచడానికి రాష్ట్ర ప్రభుత్వానికయ్యే ఖర్చులో ఎక్కువ భాగానికి కేంద్రం సహాయం చేస్తుంది.

ఈ అవరోధాలున్నప్పటికీ సెకండరీ విద్యావసరం త్వరగా పెరిగింది. (దాదాపు 7 లక్షల మంది సెకండరీ పాఠశాలలకు వెళుతున్నారు.) ఇదిఇక ఒకవర్గానికిచెందిన విద్యకాదు. ఇది 'జనబాహుళ్యం' విద్యఅయింది. ఇంతకుతప్పమరేమీ గాదు. ఎందుకంటే,ఏరాష్ట్ర ప్రభుత్వమైనా రాజ్యాంగంలో నిర్దేశించిన ప్రత్యక్ష విధానాల నమలు పరచాలంటే ప్రజావసరానికి వ్యతిరేకంగా సెకండరీ విద్యా విధానాన్ని అది వ్యతిరేకించజాలదు. "సామ్యవాద సరళి సమాజ"మే దేశంయొక్క ఆర్థిక, సాంఘిక ఆశయమని 1954లో పార్లమెంటు నిర్ణయించడంతో దేశ ఆర్థికాభివృద్ధికి శిక్షణ పొందిన మానవశక్తిని సమకూర్చడం తప్పనిసరి అవుతుంది.

అభివృద్ధిని ఏ కారణం చేతనైనా ఆపలేము. ఒకవేళ ఆపినట్లయితే దేశ ఆర్థికాభివృద్ధి కుంటుపడి, అది ప్రజాస్వామ్య పౌరసత్వ బాధ్యతలను భుజస్కంధాలపై నిడుకొనడానికి వ్యక్తుల నశక్తులను చేస్తుంది. అందువల్ల సెకండరీ పాఠశాలలను అప్‌గ్రేడ్ (హయ్యర్ సెకండరీ, లేక బహుళార్థ సాధక పాఠశాలలుగా) చేయడం-మనం మొదలియార్ కమిటీచేసిన సూచనను నంగీకరించడం వల్ల తప్పనిసరి అవుతుంది. మనం మొదటి దాన్నించి తప్పించుకోలేము. రెండవదాన్ని భరించలేము. ఇందుకు కారణాలు ఇదివరకే తెలుపడం జరిగింది. అందువల్ల ప్రస్తుతవిధానంలో కొద్ది మార్పు అవసరం. రెండురకాల పాఠశాలలు (మూడేళ్ల సెకండరీ లేక నాలుగేళ్ల హయ్యర్ సెకండరీ లేక బహుళార్థ సాధక కోర్సును గలపేవి) కొన్ని సంవత్సరాల పాటు అలాగే వుండడం అవసరం. ఇక పోతే తగిన సాధన

(మిగతా XLVI వ పేజీలో)

మన విద్యావశ్యకతలు-కొన్ని కర్తవ్యాలు

శ్రీ పాములపర్తి సదాశివరావు

పశుపక్షులు సహజ ప్రవృత్తులతో జీవిస్తాయి. వాటికి భావాలు ఆలోచనలు వుండవు. భావాలు ఆలోచనలు మానవునికి మాత్రమే వర్తిస్తాయి. భావాలు పదజాలంగా రూపుదాల్చి సంభాషణ రూపొందింది. పిదప పదజాలం అక్షర సంకేతగతమై పరోక్ష వ్యవహార మాధ్యమాలగు భాషలు వికసించినవి. భావాలను, ఆలోచనను నిర్దేశించే తర్కం, పదాలను, వాక్యాలను శాసించే వ్యాకరణం మానవ విజ్ఞానయాత్రకు రహదార్లుగా పనిచేసినవి. ఈ ఆధారంపైననే విద్యావ్యవస్థ నిర్మితమైనది...

వ్రాయటం, చదవటం, లెక్కించటం విద్యకు ప్రాథమిక రూపాలు. సాంఘికజీవితం పురోగమించి పదార్థ విజ్ఞానం పెంపొందిన కొద్దీ విద్యకూడ క్రమబద్ధమై శాఖోపశాఖలుగా విస్తరిల్లినది. మధ్యయుగాంతం వరకూ తర్కం, వ్యాకరణం, సాహిత్యం, వేదాంతం, ఉన్నత విద్యలుగా రాజ్యం చేసినవి. వీటితోబాటు వైద్యం, జ్యోతిషం, శిల్పం, సంగీతం, స్మృతి పురాణాలు మున్నగునవి కూడ గురుకులాశ్రమాల్లో ప్రబోధింపబడినవి. ఆ కాలంలో ప్రకృతి విజ్ఞానం తర్కశాస్త్ర అధీనతకులోనై వుండేది. విద్యావిధానం సాంఘిక పాక్షికతలకు లోనైయుండేది. స్వేచ్ఛాశీలమైన శాస్త్ర పరిశోధనకు, సార్వజనీన విద్యాబోధనకు అవకాశాలు ఉండేవికావు... బౌద్ధులు, వైశేషికులు, లోకాయతులు పదార్థ పరిశోధనలో మతతత్వ అధీనతను అధిగమింప ప్రయత్నించి విఫలులైనారు. స్త్రీ, శూద్రులకు (పాటకజనులకు) ఉన్నత విద్యావకాశాలు నిరాకరించబడినవి. ఈ విధంగా పూర్వకాలపు విద్యావిధానం రెండువిధాల అసమగ్రతలకు లోనైయుండేది.

విద్యా విజ్ఞానాలు సార్వజనీన స్వభావం కలవి. తోడ్తో అవి వాస్తవశీలమైనవి. ఐనప్పటికీ ఇటీవలి వరకూ సార్వజనీనత గాని వస్తుశీలమైన సత్యాన్వేషణ స్వేచ్ఛకాని ఆచరణకు రాలేదు. ప్రజాస్వామ్య రాజ్యాంగ విధాన ఆవిష్కరణతో ఈ అవరోధాలు తొలగిపోయినవి. ఈనాడు విద్యా విధానం తన సార్వజనీన స్వభావాన్ని, వాస్తవిక సత్యాన్వేషణ శీలతను గుర్తించి అమలు పరచ ప్రారంభించినది. విద్యా విధాన పరిణామంలోని ఈ ఉద్గమన విశిష్టత గమనార్హమైన అంశం...

ఈ క్రమంలోనే నవభారత విద్యా విధానంకూడా రూపందినది. ముఖ్యంగా జాతీయ స్వాతంత్ర్య సాధనానంతరం మన విద్యా యంత్రాంగం సత్వర బహుముఖ వికాసం పొందుతూ పురోగమిస్తున్నది. నిష్పాక్షిక అర్హతా ప్రాతిపదిక, నిర్మత శాస్త్రశీల దృక్పథం మన విద్యాలయాల్లో అనుసరింపబడ్తూ ఉన్నది...

ఈనాడు విద్యారంగంలో మనం కొన్ని సమస్యలను గూర్చి తరుచు వింటున్నాము. విద్యార్థులలో విజ్ఞానాసక్తి-క్రమశిక్షణ లోపించి విద్యా ప్రమాణాలు పడిపోతున్నవని ఒకటి. మన విద్యావిధానం దేశ నిరుద్యోగ సమస్యను పరిష్కరించలేదన్నది మరొకటి. విద్యా విధానంద్వారా మనం ఆదర్శపౌరుల నిర్మించుకొనటం లేదన్నది ఒకటి. ఈ విమర్శలు వార్తాపత్రికల్లో సామాన్యీకరణల రూపంలో తరచు కన్పిస్తుంటాయి.

పై విమర్శలను పూర్తిగా నిరాకరించుట సాధ్యంకాదు. కాని విమర్శలు సామాన్యీకరణల రూపందాల్చటంవల్ల ఫలితం శూన్యమే. విద్యా ప్రమాణాల కొరకనియే శాశ్వత సులభోపాయాలు ఉండవుకదా. క్రమశిక్షణ సమస్యకూడ అలాంటిదే. దీనిని యెక్కడికక్కడ నిరంతరం యెదుర్కొని యెప్పటికప్పుడు పరిష్కరించుకుంటూ పోవలసిందేకదా...విద్యా ప్రమాణాల సమస్య వెనుక క్రమశిక్షణ వెనకగల నిర్దిష్టకారణాల ఆధారంపై మాత్రమే వాటి పరిష్కారమార్గాలను అనుసరించ సాధ్యమౌతుంది. కనుక విమర్శలు సామాన్యీకరణలుగాకాక సక్రియ రూపంలో, నిర్దిష్టవిధానాన్ని అనుసరించవలసి యుంటుంది. అప్పుడే అవి ఆచరణకు దారి

మాంగంపు. ఇక నిరుద్యోగ సమస్య. గత శతాబ్దకాలంలో పాఠశాల విద్య ప్రభుత్వోద్యోగాల సంపాదనకొరకే నన్నభావం గాఢంగా ప్రబలినది. కాని విద్యాలక్ష్యమే ఉద్యోగాల కల్పన అనుకొనటం సరికాదుగదా! అదేవిధంగా ఆదర్శపౌరులను నిర్మించలేక పోతున్నామనే సామాన్యీకరణకూడ విద్యావేత్తల–యువవిద్యార్థుల వయోతారతమ్య మనస్తత్వం సంక్లిష్టతలనుండియో, దేశంలో కొనసాగుతున్న సత్వర సాంఘిక పునర్నిర్మాణ కలాపాల అవగాహనలో తలసూపే క్లిష్టతలనుండియో, బహుళంగా రూపందుతున్నట్లు తోస్తుంది... యేదీ యెలాగైనా, మన విద్యా దృక్పధాన్ని, విధానాన్ని, వ్యవస్థను మరికొంత సంతృప్తికరంగా పునరుజ్జీవింప జేసికొనుటకై కృషి జరగాలన్న ఆకాంక్ష పైవిమర్శల్లో గర్భితమైయున్నది, ఇది యెంతేనివాంఛనీయమే...

మన విద్యారంగం సమస్యలకు అతీతమైనస్థాయిలో ఉందని భావించవీలులేదు, అలా ఉండదుకూడ. పరీక్ష చదువులు–నోట్స్ గైడ్స్ వల్లింపు మన పాఠశాలల్లో అలవాటైపోయినవి. ఆర్థిక వనరులు చాలక అనేక విద్యాలయాల్లో విద్యా పరికరాలు–సౌకర్యాలు లోపిస్తున్నవి. విద్యా యంత్రాంగంలో పై అధికార్ల ఆజ్ఞాపనతత్వం, క్రింది ఉద్యోగుల జోహుకుంభావం–యధా తధ దృక్పధం సృజనాత్మతకు అవరోధాలౌతున్నవి. మధ్యయుగీనమైన కొన్ని భావాలు వ్యక్తితత్వం, వంశకులమత మర్యాదా భావనలు, ఆచారదాస్యధోరణులు, అంధానుకరణ వ్యామోహం స్వచ్ఛంద విద్యా దృక్పధానికి అవరోధాలౌతున్నవి. విశ్వజనీనత– శాస్త్రీయ దృక్పధం బోధనా ప్రణాళికలలోఇంకా స్ఫుటపడవలసి యున్నవి. విద్యావిద్యావిలోకనలో ప్రజాస్వామ్య–సామ్యవాద జీవిత దృక్పధం స్వీకృతి జెందవలసి యున్నది. విద్యారంగంలో పరిశీలన, పరిశోధన, అవగాహన, ఆలోచన, కళాత్మకత, నైతిక శీలత, విమర్శన, విశ్లేషణ, వాదనమున్నగు అవశ్యక లక్షణాలను జాగరితం చేయవలసి యున్నది. విద్యార్థులలో విధిబాధ్యతల నిర్వహణ–క్రమశిక్షణ, స్వావలంబన, స్వతంత్రత, సభ్యతమున్నగు గుణగణాలను నిర్మాణం చేయవలసియున్నది. ఈ కర్తవ్యాల నిర్వహణ కొరకు తగు యంత్రాంగాన్ని నిర్మించకుండా మన జాతీయ విద్యా వ్యవస్థను సమగ్ర స్థాయికి అభివృద్ధి పరచుకొనుట సాధ్యంకాదు.

విద్యసాంఘిక జీవితానికి ఉపయుక్తమైనదిగాను విద్యార్థులలో వివేకాన్ని పెంపొందించేదిగాను ఉండాలి. యువకశక్తులలోని నిద్రాణమైయున్న ప్రతిభావిశేషాలను జాగరితం చేయగల్గాలి. కర్తవ్య నిర్వహణలో విచక్షణను, స్వావలంబనను, సహనతను పెంపొందించాలి. వ్యక్తిత్వాన్ని, శీలాన్ని, ఆత్మ గౌరవాన్ని మేల్కొల్పాలి. సాంఘిక జీవనంలో విశిష్టపాత్రను ప్రబోధించాలి. విద్యార్థుల శక్తిసామర్థ్యాలను ఉత్సాహోద్రేకాలను నిర్మాణాత్మక దిశలో వికసింప జేయాలి. వారి స్ఫూర్తిశక్తుల వినియోగావకాశాలు కొరవడి తరచు తలచూపుతున్న క్రమ శిక్షణ సమస్యలు సానుభూతితో పరిష్కరింప బడాలి.

అధ్యాపకుల బోధనా ప్రమాణాలకు విద్యార్థుల అర్హతలకు ప్రోత్సాహం ఇనుమడింప బడాలి. మూసపోత పాఠ్యక్రమం సందేహాలను దాటవేసుకొని పోయే అలక్ష్యధోరణి తొలగింపబడాలి. సాంఘిక జీవనంలో వ్యాప్తమైయున్న అవినీతి–పక్షపాత–స్వార్థ ధోరణులనుండి విద్యార్థులను, విద్యాలయాలను తప్పించుటకు తగు జాగ్రతలు తీసికోబడాలి. సాంఘికశీల దృక్పధం పట్ల వ్యక్తుల బాధ్యతారాహిత్యాన్ని–విచ్ఛిన్న ధోరణిని, అజ్ఞాన అనాగరిక లక్షణాలుగా ప్రబోధించు కృషి జరగాలి ..ఇలా వేవిధాల మన విద్యావిధానం సమకాలిక జాతీయావశ్యకతలకు అనుగుణ్య స్వభావంతో పునరుజ్జీవన జెందాలి. అధ్యాపకులు ఆధునిక పదార్థ విజ్ఞాన, సాంఘిక పరిణామ విశేషాలను నిరంతరం అధ్యయనం చేస్తూ వాటిని మన పాఠ్య ప్రణాళికల్లో ప్రవేశపెట్టాలి. స్వాతిశయ భావ సంకుచితత్వానికి లోను కాకుండా దేశ చరిత్రలోని ఆర్థిక–సాంఘిక–విజ్ఞాన–సాంస్కృతిక వికాసంలోని విశిష్టతలను క్రొత్త వెలుగులోకి కొనితెచ్చుటకు–మరియు అనుకరణ వ్యామోహానికి అతీతంగా దేశదేశాల పురోగాముక విజ్ఞాన విశేషాలను–ఆచార వ్యవహార విలువలను మన సాంప్రదాయంలో ఇముడ్చుకొనుటకు మన విద్యాలయాలు కంకణ ధారణ చేయాలి. ఇలా మన విద్యాలయాలు స్వచ్ఛంద–స్వమర్శక–సక్రియ విజ్ఞాన పరిశోధనాలయాలుగా విలసిల్లాలి.

ఈనాడు మానవ విజ్ఞానోద్యమం మహోన్నత స్థాయికి చేరుకున్నది. బ్రహ్మాండమైన విశ్వ విద్యాలయాలు–బృహత్ శాస్త్ర పరిశోధనా కేంద్రాలు వెలసి భావి ప్రపంచ రూపకల్పనకు ప్రయోగశాలలుగా పనిచేస్తున్నవి. అంతేకాక అనేక విజ్ఞానసర్వస్వకోశాల రూపంలో విద్యా సర్వస్వం ప్రతి సామాన్యుని అందుబాటులోకికూడ వచ్చినది. ఈ విజ్ఞాన సాధనాలద్వారా నేటి మానవుడు ప్రకృతిని యజమానియై శాసించి నూత్న ప్రపంచ రూపకల్పన చేస్తున్నాడు. ప్రకృతి సంపదలను వినియోగించుకొని మహోన్నత సాంఘికాభివృద్ధిని సాధిస్తున్నాడు. కనుక ఇది విజ్ఞాన యుగం. ఈ

యుగంలో మిగిలిన అన్ని కర్తవ్యాలకంటె విద్యాసమార్జన అత్యధిక ప్రాముఖ్యతను చేకూర్చుకున్నది. యేదేశం విజ్ఞానపౌరులతోను, మహోన్నత శాస్త్రజ్ఞ–సాంకేతిక నిపుణులతోను సుభిక్షమై యుండగలదో అదియే భావిప్రపంచ చరిత్ర నిర్మాణంలో ప్రముఖ పాత్ర వహించగలదు......

అందువల్ల నవభారత పునర్నిర్మాణంలో మనం విద్యారంగ ప్రాధాన్యతను విస్మరించలేము. సామాన్య విద్యదేశ వ్యాప్తంగా విస్తరించాలి. ఉన్నత విద్య మహోన్నత స్థాయికి వికసించాలి. ఇలా వ్యాప్తిలోను ఔన్నత్యంలోను విజ్ఞానోద్యమం సత్వరాభివృద్ధి చెందుటకు కృషి జరగాలి. మన విద్యా–విజ్ఞాన విస్తృతియే మన స్వాతంత్ర్యవిస్తృతికీ–మన అభ్యుదయ విస్తృతికీ మన సాంస్కృతిక విస్తృతికీ వీటి భావి మహోన్నతికీ ఆధారభూతమని అసందిగ్ధంగా గుర్తింపబడాలి. ఈ గుర్తింపు తగు విధంగా కార్య రూపం దాల్చినప్పుడే ఒకానొకనాడు అఖిల ప్రపంచానికీ వైజ్ఞానిక–సాంస్కృతిక సారథ్యం నెరపగల్గిన మన దేశం పూర్వపు తన మహౌన్నత్యాన్ని తిరిగి చేకూర్చుకొని భావి చరిత్రను నిర్మింపగలదు.

(XLIII వ పేజీ తరువాయి)

సంపత్తి, వసతి, ఉపాధ్యాయుల నిబంధనలకు తగినట్లున్న పాఠశాలలను యెన్ని అప్‌గ్రేడ్ చేయాలి.

అప్‌గ్రేడ్ చేయ ప్రతిపాదించిన సెకండరీ పాఠశాలలను పరీక్షించడానికి ఒక ఉన్నతాధికార సంఘాన్ని నియమించాలి. ఆ సంఘం చేసిన సిఫార్సుల ప్రాతిపదికపైనే పాఠశాలలను అప్‌గ్రేడ్ చేయడానికి నిర్ణయించాలి.

పశ్చిమబెంగాల్, ఉత్తరప్రదేశ్ తప్ప దేశంలోని ఏరాష్ట్రమూ కూడా సెకండరీ విద్యకు సంబంధించిన చట్టాలు చేయలేదు. సింహళం, చైనా, జపాన్, ఇండొనీసియావంటి దేశాలకు సెకండరీ విద్యా విషయంలో చట్టాలున్నాయి. రాష్ట్రంలో సెకండరీ విద్య. విద్యాశాఖ డైరెక్టరేట్ సలహానను సరించి ప్రభుత్వం రూపొందించిన చట్టం క్రిందగాని, నియమ నిబంధనల క్రింద గాని వుంటుంది.

ఇతర దేశాలతో పోల్చిచూస్తే విద్యాభివృద్ధి విషయంలో మనం వెనుకబడి వున్నాము. రష్యాలో విద్యమొత్తం ప్రైమరీ స్థాయినుంచి పోస్ట్-గ్రాడ్యుయేట్ స్థాయివరకూ–ఉచితమే. అర్హతగల విద్యార్థులకు అన్ని దశలలో తగినన్ని స్కాలర్‌షిప్పులు లభిస్తాయి. ఆఫ్ఘనిస్థాన్‌లో విద్యాసంస్థలన్నీ ప్రభుత్వ అజమాయిషీ క్రిందనే వుంటాయి. వాటికయ్యే ఖర్చుమొత్తాన్ని ప్రభుత్వమే భరిస్తుంది. 1959 వరకు బర్మాలో సెకండరీ విద్యను ఉచితంగా నేర్పేవారు. సింహళంలో కిండర్ గార్టెన్‌నుంచి యూనివర్సిటీ విద్యతో సహా విద్య ఉచితమే.

త్వరలో మన దేశంలోకూడా మన దేశానికనుగుణమై, అభివృద్ధి చెందిన ఇతర దేశాలలోని విద్యా ప్రమాణాలకు సాటి కాగల సెకండరీ విద్యా విధానాన్ని రూపొందించుకోగలవని ఆశిద్దాం.

ఆంధ్రప్రదేశ్‌లోని గ్రంథాలు

శ్రీ బోయి భీమన్న

మానవ మేధస్సు సాధించిన ఉన్నతి అనాదినుంచీ వస్తున్న వారసత్వం పుస్తకంలో నిక్షిప్తమై ఉంటాయి. మానవ విజ్ఞాన పరంపరలను గ్రంథాలలో సమీకరింప చేయవచ్చు. అంతేగాక యీ విధంగా గుప్తపరచిన విజ్ఞానాన్ని విస్తరింపచేసే ఉచిత సంస్థగా గ్రంథాలు ఉపయోగపడుటయే గాక ముందు తరాల వారికి కూడా విజ్ఞాన విషయాలను భద్రపర్చడానికి కూడా పనికి వస్తాయి. యీ విధంగా నాగరికతా ప్రపంచంలో గ్రంథాలు ముఖ్యమైన పాత్రవహిస్తాయి. త్వరితగతిని అభివృద్ధిచెందే, మార్పుచెందే యీ నవీన ప్రపంచంలో పుస్తక పరిశ్రమ ప్రాముఖ్యత వహించి ఉంది. ప్రచురణ పద్ధతులలో వచ్చిన సాంకేతికమైన మార్పులు కారణంగా ప్రపంచంలోని పుస్తక పరిశ్రమ త్వరితగతిని మార్పు జెందుతూ ఉంది. స్వాతంత్ర్యానికి పూర్వం మన దేశంలో పుస్తక ప్రచురణ తగినంత అభివృద్ధిని సాధించలేదు. అయితే స్వాతంత్ర్యం తర్వాత యీ పరిశ్రమ త్వరగా అభివృద్ధి చెందనారంభించింది. అంధకారంలో ఉన్న మధ్యయుగాన్ని వెలుగుకు తీసుకువచ్చి, గతంలో సాధించిన విజయాలను ముందు తరాల వారికి అందజేసిన ఘనత యీ ప్రచురణ పరిశ్రమకు దక్కిందనటం యథార్థమైన విషయం. అక్షరక్రమ పద్ధతిని ప్రారంభించి సరయిన రచనా విధానాలను ప్రవేశపెట్టిన ప్రాచీన దేశాలలో భారతదేశం ఒకటి అయితే ప్రాచీన భారతీయులు రచనా సంపత్తిని మౌఖిక పద్ధతి ద్వారా యితరులకు అందజేసే సాంప్రదాయాన్ని అవలంబించారే గాని ప్రచురణా విధానాలను అనుసరించే అవసరాన్ని గుర్తించలేదు. ఆ తర్వాత కాలంలో తాళ పత్రాలను, భూర్జ పత్రాలను, రాతిపలకలను, ఇత్తడి రేకులను వ్రాతలకై వాడేవారు. విదేశీ పరిపాలకులు నవీన ప్రచురణ విధానాలను భారతదేశంలో ప్రవేశపెట్టారు. మత ప్రచారాలకై క్రైస్తవ మిషనరీలు, పరిపాలనా అవసరాలకై ప్రభుత్వాలు అచ్చు వేసే విధానాలను అవలంబించే వారు. ప్రపంచంలోని యితర ప్రాంతాల్లో మాదిరిగానే భారతదేశంలో కూడా పుస్తక ప్రచురణ, వార్తా పత్రిక పరిశ్రమలకు ముద్రణ విధానం మార్గం చూపింది. నవీన ప్రపంచంలో వార్తా పత్రికలకు గల ప్రాముఖ్యాన్ని వివరించాల్సిన పని లేదు. నిత్య జీవితావసరాలలో యిది కూడా ఒకటి. గత కొద్ది సంవత్సరాల నుండి మనదేశంలో చదివే అలవాటు బాగా పెరిగింది. దీనిని అనుసరించే వార్తా పత్రికల సంఖ్య కూడా పెరుగుతున్నది. స్వాతంత్ర్యం తర్వాత ముఖ్యంగా భాషా ప్రచురణలు పురోభివృద్ధి గాంచినవి. యెటువంటి ప్రభుత్వంలోనయినా ముద్రణ, ప్రచురణలను క్రమపద్ధతిలో ఉంచడం చాలా ముఖ్యం. యీ దృష్టితోనే 1867 వ సం.లో ముద్రణ, పుస్తకాల నమోదు చట్టాన్ని ప్రవేశపెట్టడం జరిగింది. యిది కేంద్ర చట్టం. మన రాష్ట్రంలో విద్యాశాఖ అజమాయిషీలో ఉండే పుస్తకాల రిజిస్ట్రార్ యీ చట్టాన్ని అమలు పరుస్తారు.

పుస్తకాలు, వార్తా పత్రికలు, యితర పత్రికలు "ప్రచురణలు" గా పరిగణింపబడ్తాయి. చట్టాన్ని అనుసరించి ప్రజలకు సంబంధించిన వార్తలను, వాటిపై వ్యాఖ్యలను ప్రచురించే ప్రతి ప్రచురణ "వార్తా పత్రిక" గా భావించబడుతుంది. యే భాషలోనైనా ప్రచురించే కరపత్రంగానీ, సంపుటాల భాగాలు గానీ, సంపుటాలు గానీ, "పుస్తకం" అర్థంలో చేరుతాయి. విడిగా ప్రచురించే లిథో పద్ధతిని ముద్రించే మ్యాపు, చార్టు, ప్లాను వగైరాలు కూడా "పుస్తకం" అర్థంలోనే చేయతాయి. పుస్తకాలను ప్రచురించే ముద్రణ కర్తలు, ప్రచురించిన మూడు మాసాలలో హైద్రాబాదులోని పుస్తకాల రిజిస్ట్రార్‌కు ముద్రించిన పుస్తకం మూడు ప్రతులను పంపాలి. పంపనివారిపై కఠిన చర్యలు తీసుకోవడానికి చట్టం అనుమతిస్తుంది. కలకత్తా, బొంబాయి, మద్రాసులలో ఉన్న జాతీయ గ్రంథాలయాలకు ప్రచురణ కర్తలు మూడు ప్రతులను పంపాలి.

ముద్రణ. ప్రచురణల స్వభావాన్ని రాష్ట్ర ప్రభుత్వం తెలుసుకోవడానికి వీలుగా ముద్రణ కర్తలు, ప్రచురణ కర్తలు పై నియమనిబంధనలను విధిగా పాటించాల్సి ఉంది. అంతే గాక ప్రచురించిన పుస్తకాల పేర్లను నమోదు చేయించి ప్రజల సమాచారార్థం ప్రచురణ పట్టికలలో చేర్చాల్సిన అవసరం కూడా ఉంది.

ఆంధ్రప్రదేశ్ లోని ప్రచురణలను మూడువర్గాలుగా విభజించవచ్చు సాధారణమైనవి, విద్యావిషయకమైనవి, అధికారప్రచురణలు. సాధారణ ప్రచురణలలో ఆసక్తి కలిగించేవి చాలాతక్కువగా ఉంటాయి. సాంప్రదాయకమైన విలువలుగల (ప్రాచీనకావ్యాలు మొ.) గ్రంథాల ప్రచురణలు యిటీవల చాలావరకు తగ్గిపోవడం బాధాకరమైన విషయం. సగటు స్థాయికి తక్కువ విలువగల పుస్తకాలను చదువరులు విధిలేక చదువుతున్నారు. గత్యంతరం లేక పఠితలు చదువుతున్న పుస్తకాల రకాలను ఆధారంగా పఠితల అభిరుచిని అంచనా వేయడం సరిఅయిన విధానం మాత్రం కాదు. యీనాడు ప్రతి పుస్తక విక్రయందార్ల వద్ద చౌక బారు కథలు, డిటెక్టివ్ సాహిత్యం మనం చూస్తున్నాం. యీ రోజులలో సాహిత్య ప్రమాణాలు గల క్రొత్త గ్రంథాలు చాలా తక్కువ లభిస్తాయి. సాంప్రదాయ విలువ గల (Classic) గ్రంథాలను చదవగోరే పఠితలకు పురాతన ప్రచురణలే శరణ్యం. చదువరులు, రచయితల మధ్య యిప్పుడు పందెం యేర్పడింది. అయితే యిందులో చదువరులదే పైచేయిగా ఉండనడంలో సందేహం లేదు. పురాతన సాహిత్య విలువలను రచయిత నిజంగానే పునరుద్ధరించదలిస్తే తన భావాలను నిజరూపానికి మార్చడానికి ఎంతో గట్టి కృషి చేయాల్సి ఉంది. అటువంటి స్థితిలో రచయిత సమాజం మార్గదర్శకుడుగా తన స్థాయికి న్యాయం చేసినవాడవుతాడు. మన రాష్ట్రంలో విశిష్టమైన గ్రంథాలను ప్రచురించడానికి తగిన ప్రచురణ సంస్థలు చాలా తక్కువగా ఉన్నాయి. క్రొత్త గ్రంథాలను రచించే గ్రంథకర్తలను ప్రోత్సహించడానికి వీలుగా తగిన సంస్థలను రాష్ట్రంలో నెలకొల్పాలి.

ప్రచురణకర్తలు కళాశాలల, పాఠశాలల పాఠ్య పుస్తకాలను ప్రచురించడానికే తమ కృషిని చాలా వరకు కేంద్రీకృతం చేస్తున్నారు. యిదిలాభసాటిపని. అయితే ఇందువల్ల సామాన్యవ్యక్తులు, విద్యార్థులు చదవడానికి అవసరమైన మంచి పుస్తకాల ప్రచురణ దెబ్బతింటుంది. యిప్పుడు పాఠ్యపుస్తకాల ప్రచురణను ప్రభుత్వం జాతీయం చేసింది. ప్రచురణ కర్తలు సామాన్య వ్యక్తికి కావలిసిన ఉత్తమ స్థాయి గల విజ్ఞానదాయకమైన యితర పుస్తకాలను ప్రచురించడానికి పూనుకోవాలి.

అధికార ప్రచురణలు చాలా పరిమితంగా ఉంటాయి. ముద్రణ, పుస్తకాల నమోదు చట్టాన్ని అనుసరించి నమోదు చేయించడంలో వీటిని మినహాయించడం జరిగింది. అయితే ప్రజల సమాచారార్థం ప్రచురించే అధికార ప్రచురణలను త్రైమాసిక పట్టికలో చేర్చడానికి వీలుగా నమోదు చేయించాల్సి ఉంటుంది. త్రైమాసిక పట్టిక అధికార ప్రచురణ. గెజెటుకు అనుబంధంగా దీనిని ప్రచురిస్తారు. చట్టాన్ని అనుసరించి పుస్తకాల రిజిస్ట్రారు కార్యాలయంలో నమోదు అయిన రాష్ట్రంలో ప్రచురించబడిన అన్ని పుస్తకాల పేర్లను యీ పట్టికలో చేర్చడం జరుగుతుంది. నమోదు అయిన పుస్తకాలను త్రైమాసిక పట్టికలో దిగువ విధంగా వర్గీకరిస్తారు.

(1) వ్యవసాయం, (2) మనుష్యవర్ణన శాస్త్రం, (3) పురాతత్వ శాస్త్రం, (4) కళలు వృత్తి పనులు, (5) ఖగోళ-జ్యోతిశ్శాస్త్రాలు, (6) జీవితచరిత్రలు (జ్ఞాపకాలతో సహా) (7) పౌరశాస్త్రం, (8) వాణిజ్యం, (9) నాటకం (10) ఆర్థిక శాస్త్రం, (11) విద్య, (12) ఇంజనీరింగ్, (13) కల్పితకథలు, (14) ఆటలు, (15) భూగోళ శాస్త్రం, (16) ఆరోగ్యం, (17) చరిత్ర, (18) పరిశ్రమలు, (19) భాషలు, (20) న్యాయ శాస్త్రం, (21) గణిత శాస్త్రం, (22) వైద్యం, (23) యితరములు, (24) సంగీతం (నాట్యంతో సహా) (25) ప్రకృతి శాస్త్రం, (26) తత్వ శాస్త్రం, (మానసిక, నీతిశాస్త్రాలతో సహా) (27) కవిత్వం, (28) రాజనీతి శాస్త్రం, (29) మతం (30) విజ్ఞాన శాస్త్రం, (భౌతిక శాస్త్రం, రసాయన శాస్త్రం, జంతు శాస్త్రం, భూగర్భ శాస్త్రం, వృక్ష శాస్త్రంతో సహా) (31) సోషియాలజి, (32) యాత్రలు, (33) యుద్ధం.

పుస్తక వార్తా పత్రిక పరిశ్రమలో ముద్రణ సౌకర్యాలు యెక్కువ లెక్కకు వస్తాయి. హైదరాబాదు, సికింద్రాబాదు, జంట నగరాలు మినహా తెలంగాణా ప్రాంతంలో ముద్రణా యంత్రాలు చాలా తక్కువగా ఉన్నాయి. ఆంధ్ర ప్రాంతంలో కూడా సమస్త హంగులు గల ఉత్తమ ముద్రణాలయాలు చాలా తక్కువగా ఉన్నాయి.

రాష్ట్రానికి సంబంధించిన కొన్నిపుస్తకాలు, పత్రికలు మద్రాసు వంటి యితర ప్రాంతాల్లో ప్రచురించబడటం జరుగుతున్నది. రాష్ట్రంలోనే వాటి సర్క్యులేషన్ యెక్కువగా ఉన్నా

రాష్ట్రానికి వాటిపై యెటువంటి అధికారం లేదు. భాషా ముద్రణా లయాలు దేశంలోని యే ప్రాంతంలో ఉన్నా ఆయా భాషా రాష్ట్రాలకు వాటిపై అధికారం ఉండే విధంగా తగిన చర్యలు తీసుకోవాలి.

1956–62 సం. కాలంలో పుస్తకాల నమోదు చట్టాన్ని అనుసరించి నమోదు అయిన పుస్తకాల సంఖ్య దిగువ విధంగా ఉంది:

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ముఖ్య భాష తెలుగు కావడాన యెక్కువ ప్రచురణలు తెలుగులోనే ఉన్నాయి. తెలుగు పుస్తకాలలో ముఖ్యంగా కల్పిత కథలలో, ఇంగ్లీషు, బెంగాలి, హిందీ భాషల అనువాదాలే యెక్కువగా ఉన్నాయి. విద్యా సంస్థలకు అవసరమైన ఇంగ్లీషు ప్రచురణలు కూడా ఉన్నాయి. హిందీ, ఉర్దూ ప్రచురణల సంఖ్య కూడా స్వల్పమే. మరాఠీ, కన్నడ, తమిళం, ఒరియా భాషల పుస్తకాలు రాష్ట్రంలో అప్పుడప్పుడు ప్రచురించబడుతూ ఉంటాయి. గత కొద్ది సంవత్సరాల నుండి దిన పత్రికలు, యితర పత్రికల సంఖ్య పెరిగింది. ప్రజలలో నవ చైతన్యం వెల్లివిరుస్తున్నది ఉత్తమ జర్నలిజం స్థాయిలో పత్రికలు కావాలని ప్రజలు కోరుతున్నారు. పత్రికల స్థాయి కూడా ప్రోత్సాహకరంగానే ఉంది. అయితే కొన్ని పత్రికలు అప్పుడప్పుడు వ్యక్తిగత విమర్శలకు పూనుకుంటూ ఉన్నవి. సినిమా కళాకారుల, వ్యక్తుల వ్యక్తిగత దూషణ, అసహ్యకర వ్రాతలకు ప్రాధాన్యం యిస్తూ ఉన్న పత్రికలు కూడా కొన్ని ఉన్నాయి. అయితే యీ విధమైన వ్రాతలు మొత్తం పత్రికా రంగానికే కళంకాన్ని ఆపాదిస్తాయి. అదృష్టవశాత్తు యిటువంటి పత్రికల సంఖ్య చాలా స్వల్పం. ఇటువంటి పత్రికలు ఉత్తమ స్థాయిని అందుకొని రాష్ట్రానికీ, దేశానికి నిజమయిన సేవ చేస్తాయని ఆశించటం జరుగుతున్నది. రాష్ట్రంలోని కొన్ని సాహిత్య సంస్థలు విశ్వవిద్యాలయాలు, సాహిత్య అకాడమీలు ప్రసిద్ధ విద్యావంతుల ఉద్గ్రంథాలను వెలువరించాయి. యీ సంస్థలు ముమ్ముందు యిటువంటి గ్రంథాలను యింకా ప్రచురిస్తాయని మేము ఆశిస్తున్నాం. బాలసాహిత్యం కూడా అభివృద్ధిచెందుతూ ఉంది. శాస్త్ర విషయక గ్రంథాలు కూడా వస్తున్నాయి. యేకాలంలోనైనా దేశాభివృద్ధిని లెక్కకట్టడానికి ఆకాలంలో సృష్టింపబడి, ప్రచురించబడిన సాహిత్యమే కొలమానం అవుతుంది. యీ దృష్టితో చూస్తే మన ఆంధ్రప్రదేశ్ సరిఅయిన పంథానే అనుసరిస్తున్నదనీ, భవిష్యత్తు ఉజ్వలంగా ఉందనీ, భావించవచ్చు.

• ప్రచురణలు	1956–57	1957–58	1958–59	1959–60	1960–61	1961–62
పుస్తకాలు	731	788	933	678	682	662
పత్రికలు	229	620	1177	1171	1304	1402



మన తృతీయ ప్రణాళికలో

నిర్బంధ ప్రాథమిక విద్య

శ్రీ వి. రామచంద్రన్. బి.ఎ. (ఆనర్స్)

ఆధునిక ప్రపంచంలో అక్షరజ్ఞానం లేనివ్యక్తి జనసమ్మర్దం గల వీధిలో నడచే అంధునివలె వుంటాడు. నాగరిక జీవనానికి అక్షరజ్ఞానం కలిగివుండడం కనీస విద్యాయోగ్యత. ప్రాథమికవిద్య పిల్లల్ని అక్షరాస్యులనుగా చేయడమేగాక, వారిని నైతికంగా, శారీరకంగా, మానసికంగా కూడా పెంపొందించి స్వయంపోషక శక్తిగల యువకులనుగా తయారుచేస్తుంది.

బ్రిటిష్‌వారు మనదేశానికి రాక పూర్వం మనదేశమంతటా అనేక దేశీయ పాఠశాలలు వ్యాప్తిలోవుండేవి. బ్రిటిష్‌వారు పరిపాలన సాగించే తొలిదశలో సార్వజనీన విద్య ఏమాత్రమూ అభివృద్ధి చెందలేదు. ఆంగ్లభాషలో మాత్రమే ఉన్నతవిద్య కొనసాగించడానికి ప్రాధాన్యత ఇవ్వబడింది. అయితే గోపాలకృష్ణ గోఖలేవంటి మహనీయులైన నాయకుల కృషివల్ల, నిర్బంధవిద్యకు స్థానిక సంస్థలు, విద్యాధికులైన ప్రజానీకపు సహకార సహాయాలు లభించాయి. ప్రథమ ప్రపంచ యుద్ధానంతరం, నిర్బంధవిద్యకు శాశ్వత ప్రాతిపదిక యేర్పడింది. దక్షిణాదిని అవిభక్త మద్రాసు రాష్ట్రంలో 1920 సం॥పు మద్రాసు ప్రాథమిక విద్యాచట్టం ప్రకారం, నిర్బంధ ప్రాథమిక విద్య ప్రవేశపెట్టడం జరిగింది.

అవిభక్త మద్రాసురాష్ట్రంలో, ఆంధ్రప్రాంతంలోని కొన్ని మునిసిపాలిటీలలోను, జిల్లాబోర్డు అధీనంలో వున్న కొన్ని ప్రాంతాలలోను నిర్బంధ ప్రాథమిక విద్య అమలు పరచడం జరిగింది. 1920 సం॥పు మద్రాసు ప్రాథమిక విద్యాచట్టపు నియమావళి ప్రకారం దీనిని క్రమబద్ధం చేయడం జరిగింది. ఈ చట్టపు 44వ సెక్షన్ ప్రకారం, ఏ ప్రాంతంలో నిర్బంధ విద్యను ప్రవేశపెట్టడానికి ప్రజలు ఆసక్తి చూపుతారో, ఆ ప్రాంతపు ప్రజలందరూ కలసి ఒక సమావేశం జరిపి, హాజరైన సభ్యులలో మూడింట రెండు వంతుల మెజారిటీ తీర్మానంతో తమ అధీనంలోగల నిర్ణీత ప్రాంతాలలో దీనిని అమలు జరపవచ్చు.

పాఠశాలలకు వెళ్ళే వయస్సుగల పిల్లలందరికీ, లేక బాలురకూ, లేక బాలికలకూ లేక నిర్ణీత కాలంవరకు ప్రాథమిక పాఠశాలల్లో చదువుకొన్న పిల్లలకూ ఇది వర్తిస్తుంది. నిర్బంధ విద్య ప్రవేశపెట్టబడిన ప్రాంతంలో పాఠశాలకు వెళ్ళే వయస్సు పిల్లలను బడికి పంపకపోయినట్లయితే, పిల్లల తల్లిదండ్రులకుగానీ, వారి సంరక్షకులకుగానీ శిక్షలు విధించేందుకు ఈ చట్టంలో వీలు కల్పించబడింది. నిర్బంధ విద్య ప్రవేశపెట్టుటకు అంగీకరించిన స్థానిక సంస్థలు, వాటి అధీనంలో గల ప్రాథమిక విద్యానిధులను వినియోగించి పాఠశాలలను స్థాపించాలి. ఈ చట్టాన్ని పురస్కరించుకొని కొన్ని స్థానిక సంస్థలు నిర్బంధవిద్యను ప్రవేశపెట్టాయి. తత్ఫలితంగా, పాఠశాలలకు వెళుతున్న పిల్లలసంఖ్య వెంటనే కొద్దిగా పెరిగింది. కొంతకాలం తరువాత ఈ సంఖ్య యధాతథంగానే వున్నది. కాని ఏదో ఒకచోట బడికి వెళ్ళే వయస్సుగల పిల్లలను అందరినీ చేర్చడం సాధ్యం కాలేదు. 1945వ సంవత్సరంలో ఎన్నుకోబడిన కొన్ని గ్రామీణ ప్రాంతాలకు నిర్బంధవిద్యను విస్తరింపచేయడానికి ప్రభుత్వం నిర్ణయించింది. ఈవిధంగా అయ్యే అదనపు ఖర్చును ప్రభుత్వమే భరిస్తుందనికూడా ఉత్తర్వు జారీచేసింది. నిర్బంధ విద్యా ప్రాంతాలలో బడికిపోయే వయస్సుగల పిల్లలందరికీ విద్యా సౌకర్యం కల్గించి, క్రొత్తగా ఉపాధ్యాయులను నియమించి, పాఠశాలల్లో కొత్తగా చదివే పిల్లలకు ఉచితంగా పుస్తకాలు, పలకలు సరఫరా చేయడానికి ప్రభుత్వం డబ్బు మంజూరుచేసింది. నిర్బంధ ప్రాంతాలలో పిల్ల

లకు ఉచిత మధ్యాహ్నభోజన సౌకర్యాలు కూడా కల్పించబడ్డాయి. ప్రారంభమాసాల్లో ఈ విషయంలో ప్రోత్సాహకరమైన కొన్ని సౌకర్యాలు కల్పించిన ఫలితంగా పాఠశాలల్లో చదువుకొనే పిల్లల సంఖ్య చాలా వరకు పెరిగింది. అయితే, ఆ తరువాత కొంతకాలానికి మొదట్లో వున్న ఉత్సాహం సన్నగిల్లింది. మధ్యాహ్న భోజన సౌకర్యం నిలిపివేయబడింది. తత్ఫలితంగా నిర్బంధ ప్రాంతాలలో విద్యార్థుల సంఖ్య తగ్గిపోయింది.

1952 సం॥పు హైద్రాబాదు నిర్బంధ ప్రాథమిక విద్యా చట్టం ప్రకారం, తెలంగాణా ప్రాంతంలో అంచెలవారీగా నిర్బంధ విద్య ప్రవేశపెట్టడం జరిగింది. నిర్ణీతప్రాంతాల్లో కొన్ని నియమిత స్కూళ్ళల్లో కొన్ని తరగతులవరకూ ఇది అమల్లో పెట్టబడింది. ప్రతినిర్బంధ ప్రాంతానికి ప్రభుత్వం ఒకస్థానిక సంఘాన్ని నియమించింది. నిర్బంధ విద్యా చట్టాన్ని అమలు పరిచే బాధ్యత ఈ సంఘానికి అప్పగించబడింది. స్థానికసంఘ అధికారాలు, విధులు ఇవి:

(1) నిర్బంధ ప్రాంతంలో ప్రాథమిక స్కూళ్ళు వుండవలసిన స్థలాన్ని నిర్ణయించడం.

(2) ఈ ప్రాంతంలో స్కూళ్ళకు హాజరయే విద్యార్థుల తాజా జాబితాలను తయారు చేయడం.

(3) నిర్బంధ హాజరీలకు మినహాయింపులు మంజూరు చేయడం.

(4) హాజరీ ఉత్తర్వులను జారీచేయడం.

అయితే మొత్తంమీద 1952 సం॥పు హైద్రాబాదు నిర్బంధ ప్రాథమిక విద్యా చట్టం కానీ, 1920 సం॥ మద్రాసు ప్రాథమిక విద్యాచట్టంగానీ సంతృప్తికరంగా పని చేయలేదు. అందుకు కారణాలు ఇవి:—

(అ) విద్యార్థుల తలిదండ్రులు సాధారణంగా బీదవారు. తమ పిల్లలు సంపాదించాలని వారికోరిక. నిరక్షరాస్యులైన బీద తలిదండ్రులకు వాళ్ళ పిల్లలు బడికి పోవలసిన అగత్యాన్ని గూర్చి ఎంత నచ్చజెప్పినా, వారు వినిపించుకోరు.

(ఆ) కొంతమంది నిరక్షరాస్యులైన తలిదండ్రులకు ముఖ్యంగా గ్రామంలో ధనవంతులుగా వుంటూ, అన్ని సౌకర్యములు గలవారికి విద్యయొక్క విలువ తెలియదు. తమ మాదిరే తమ పిల్లలు కూడా సౌఖ్యంగా వుండగలరని వారి నమ్మకం. మరి కొంత మందికి విద్య అంటే గిట్టదు. ఎవరో ఒక పిల్లవాడు, ఎప్పుడో స్కూల్లో చదువుకొంటున్న రోజుల్లో చిన్నవయసులో చనిపోయినందువల్ల, తమకుటుంబాలకు విద్య అచ్చిరాదని ఒక మూఢ విశ్వాసం ప్రబలి వుండడం కూడా ఇందుకు ఒక కారణం.

(ఇ) పిల్లల్ని బడికి పంపినట్లయితే, వారికి క్రొత్తదుస్తులు పుస్తకాలు, పలకలు వగైరా కొని యివ్వాల్సివుంటుందనీ, ఇవన్నీ సంపాదించిపెట్టే స్తోమతలేదని జడిసి కొంతమంది బీద తలిదండ్రులు తమ పిల్లల్ని స్కూళ్ళకు అసలే పంపరు.

(ఈ) తలిదండ్రులు కూలిపనికి పోయినప్పుడు వారిపిల్లలు ఇంటి పనులు చేస్తూ వుంటారు. స్కూలుకు పోయినట్లయితే ఇది సాధ్యపడదు. అందుకని తలిదండ్రులు తమపిల్లల్ని బళ్ళకు పంపరు.

మద్రాసు, హైద్రాబాదు విద్యాచట్టాల ప్రకారం శాసనరీత్యా చర్యలు తీసుకొనుటకు రూల్సు వున్నప్పటికీ, సాధారణంగా వాటిని ఎప్పుడూ వుపయోగించడం జరగలేదు. ఎందుకంటే, శాసనధిక్కారం చేసినవారిసంఖ్య చాలహెచ్చు. అంతేగాక, కేవలం పేదరికంవల్లనే పిల్లల్ని స్కూళ్ళకు పంపడం లేదుగానీ, విద్యపై ఇష్టంలేక కాదు. ఈ చట్టాలక్రింద శిక్షలను అమలు పరిచినంత మాత్రాన ఆర్థిక పరిస్థితులు చక్కబడవు గదా!

నిర్బంధ విద్యా వయస్సులో వున్న బాలికలను కూడా ఇందులో చేర్చడానికి కొన్ని ప్రయత్నాలు జరిగాయి. మొదటి రెండవ తరగతులవరకు మాత్రమే బాలికలసంఖ్య సంతృప్తికరంగా వుండింది. రెండేండ్లకుమించి వాళ్ళను స్కూళ్ళలో ఉంచడం సాధ్యం కాలేదు. బాలికలు కాస్త ఎదిగిన తరువాత, ఇంటిపనులు చూసుకోవడంలో తలిదండ్రులకు చాలా సహాయకారిగా వుంటారు. పైగా కూలీనాలీ చేసి కొంత సంపాదించగలరు కూడా. కనుక మధ్యతరగతికి, ధనిక వర్గాల కుటుంబాలకు చెందినవారు తప్ప రెండేండ్ల తర్వాత బాలికలు బళ్ళకురారు.

ఖర్చు ఎక్కువవుతున్న కారణంవల్ల నిర్బంధ విద్యను క్రొత్త ప్రాంతాలకు విస్తరింపజేసే కార్యక్రమాన్ని ప్రభుత్వం విరమించింది. ఆరంభంలోవున్న ఉత్సాహం, తరువాత కనిపించలేదు. అందుకనే ఇది పాక్షికంగా విఫలమైంది.

భారత రాజ్యాంగపు 45వ సూత్రం ప్రకారం రాజ్యాంగం అమల్లోకి వచ్చిన తరువాత పదేండ్లలోపుగా అన్ని రాష్ట్రాల పిల్లలకు 14 ఏండ్ల వయస్సు వరకు ఉచిత నిర్బంధవిద్యా సౌకర్యాలు కల్పించాలి. అనేక కారణాలవల్ల ఈ సూత్రం అమలు జరుగలేదు. ఈ ఆశయాన్ని పాక్షికంగా సాధించేందుకై భారత ప్రభుత్వం

మూడవ పంచవర్ష ప్రణాళిక కాలంలో 6_11 ఏండ్ల మధ్య వయస్సుగల పిల్లలకు అందరికీ ఉచిత నిర్బంధ విద్యా సౌకర్యాలు కల్పించాలని నిర్ణయించింది.

ఈ నిర్ణయానుసారం 1961 వ సం॥ ఆంధ్రప్రదేశ్ ప్రాథమిక విద్యా చట్టం యేర్పరచడం జరిగింది. షెడ్యూలు ప్రాంతాల్లోతప్ప రాష్ట్రమంతటా 1961 ఏప్రిల్ 10వ తేదీనుంచి ఇది అమల్లోకి వచ్చింది. 1954 జూలై 1, 1955 సెప్టెంబరు మధ్యపుట్టిన పిల్లలందరికీ అంటే 6_7 ఏండ్ల మధ్య వయస్సుగల వారందరికీ ప్రథమంలో ప్రాథమికవిద్య నిర్బంధం చేయబడింది. క్రమేణా ప్రతియేటా దీనిని 6_8, 6_9, 6_10, 6_11 సంవత్సరాల మధ్యవయస్సుగల పిల్లలందరికీ వర్తింపజేయడం జరుగుతుంది. ఈ క్రింద ఉదహరించిన పట్టిక ప్రకారం ఆయా తేదీలమధ్య పుట్టిన పిల్లలు 6 సంవత్సరముల వయస్సుకు వచ్చినట్లుగా భావించడం జరుగుతుంది.

పిల్లలు పుట్టిన కాలం		సం. నాటికి విద్యాసంవత్సరంలో 6 ఏండ్లు వస్తాయి.
1_7_1954 నుంచి 1_9_1955 వరకు	(రెండుతేదీలు కలుపుకొని)	1961_62
2_9_1955 నుంచి 1_9_1956 వరకు	..	1962_63
2_9_1956 నుంచి 1_9_1957 వరకు	..	1963_64
2_9_1957 నుంచి 1_9_1958 వరకు	..	1964_65
2_9_1958 నుంచి 1_9_1959 వరకు	..	1965_66

మొదటి సంవత్సరంలో 6_7 సంవత్సరాల వయస్సుగల పిల్లలకు నిర్బంధ విద్య వర్తింపచేయడానికి ప్రధాన కారణాలు ఇవి:

ఒకే సంవత్సరంలో 6_11 ఏండ్ల వయస్సు గలవారికి ఈ పథకం అమలు జరిపితే ఖర్చు భరించలేనంత అవుతుంది.

శిక్షణ పొందిన ఉపాధ్యాయులను తగినంత మందిని నియమించటం సాధ్యం కాదు.

తగిన వసతి సౌకర్యాలు కల్పించడం అసాధ్యమైన కార్యం

వయస్సు పెరిగిన పిల్లలు ఇదివరకే ఏదోఒక పనిలో నియుక్తులై వుంటారు. కనుక వారిని స్కూళ్ళలో చేర్పించడం సాధ్యంకాదు.

కనుక ఈ విధంగాచూస్తే 6_7 ఏండ్ల వయస్సునుంచి ఆరంభించి క్రమేణా 6_11 ఏండ్ల వయస్సు గలవారికి ఈ పథకం విస్తరింపజేయడం సులభ మవుతుంది. ఈ పథకం ప్రకారం 1961_62 సం. లో 5 ఏండ్ల వయస్సు నిండిన పిల్లలకు, వారికి 11 ఏండ్ల వయస్సు నిండేవరకు అంటే 1965_66 సంవత్సరం వరకు నిర్బంధ విద్య వర్తిస్తుంది. ఆనాటికి వారు 5 వ తరగతి వరకు చదివి వుంటారు. దశలవారీగా ఈ పథకాన్ని అమలు పరచడం వల్ల ఆర్థిక ఇబ్బందులూ, ఉపాధ్యాయుల కొరతా వుండదు.

ఆంధ్ర ప్రాంతంలో సమితి ప్రాంతాలలో సమితులు, సమితులు లేని ప్రాంతాలలో పంచాయతీలద్వారా జిల్లా పరిషత్తులు, మునిసిపల్ ప్రాంతాల్లో మునిసిపల్ కౌన్సిళ్ళు ఎన్యూమరేషన్ రిజిస్టర్లను తయారు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. తెలంగాణా ప్రాంతంలోని పట్టణ మునిసిపాలిటీలు, విశాల హైద్రాబాదు మునిసిపల్ కార్పొరేషను, సమితులు ఏర్పాటుకాని ప్రాంతాలలో వున్న పాఠశాలలు విద్యాశాఖ ఆధ్వర్యాన నడుస్తుండడం వల్ల ఈ ప్రాంతాలలోని ఎన్యూమరేషన్ రిజిస్టర్లను తయారుచేసే పనిని జిల్లా విద్యాశాఖాధికారులకు అప్పగించారు.

ఈ పథకాన్ని అమలుపరిచే బాధ్యత ఆంధ్ర ప్రాంతంలో స్థానిక సంస్థలకు అంటే సమితి ప్రాంతాలలో పంచాయతీ సమితులకూ, సమితులు ఏర్పడని ప్రదేశాలలో జిల్లా పరిషత్తులకూ మునిసిపల్ కౌన్సిళ్లకు అప్పగించబడింది. అలాగే తెలంగాణా ప్రాంతాలలో ఈ పని సమితులు ఏర్పడని ప్రదేశాలు, హైదరాబాదు కార్పొరేషను, నగర మునిసిపాలిటీలు, పట్టణ మునిసిపాలిటీలలో జిల్లా విద్యా శాఖాధికార్లకు అప్పగించడం జరిగింది.

ఈ చట్టం ప్రకారం స్థానిక సంస్థలు తమ యాజమాన్యం క్రింద వుండే ప్రాంతంలో నిర్బంధ విద్య ప్రవేశ పెట్టుటకు పథకం తయారు చేయాల్సి వుంటుంది. ఈ పథకంలో నిర్బంధ విద్య అమలు జరుగు ప్రాంతం, ఇది వర్తించు పిల్లల సంఖ్య, వారి వయస్సు, మాతృభాష, ప్రస్తుతం ఆమోదం పొందిన స్కూళ్ళ సంఖ్య, ఇక ముందు క్రొత్తగా తెరచు స్కూళ్ళ సంఖ్య, ఇదివరకు నియమించబడిన ఉపాధ్యాయులు, ఇక ముందు అవసరము కాగల ఉపాధ్యాయుల సంఖ్య, ఈ పథకానికయ్యే, ఆవృత్త, అనావృత్త ఖర్చుల వివరాలు స్థానిక సంస్థలు తెలపాల్సి వుంటుంది.

1961వ సం. ఆంధ్ర ప్రదేశ్ ప్రాథమిక విద్యాచట్టం క్రింద జరుగు నేరాలను విచారించేహక్కుగల న్యాయస్థానాలు ఆచట్టంలో పేర్కొన బడివున్నాయి.

ప్రజలే ముందుకువచ్చి ఈ పథకానికి ప్రోత్సాహమివ్వాలి ముందుగానే తగిన వాతావరణం కల్పించేఉద్దేశంతో రాష్ట్రమంతటా 1961 జూన్ 17 నుంచి 1961 జూన్ 23 వరకు నిర్బంధ ప్రాథమిక విద్యా వారోత్సవాలు ఏర్పాటు చేయబడినాయి. ఈ ప్రచారం విజయవంతంగా జరిగినందువల్ల 1961_62 సం॥ లో బడిపిల్లల సంఖ్య నిర్దేశించిన లక్ష్యాన్ని మించిపోయింది. రెండవ పంచవర్ష ప్రణాళిక ముగిసేనాటికి అంటే 1960_61 సం॥

అంతంనాటికి ప్రాథమిక తరగతులలో విద్యార్థుల సంఖ్య 29.75 లక్షలు వున్నది. 1961–62 సం॥ నికి అదనంగా 1.2 లక్షల మంది కొత్తగా స్కూళ్ళలో చేరగలరని అంచనా వేయబడింది. వాస్తవానికి ఈ సంఖ్య 1.62 లక్షలకు పెరిగింది.

అనేక ప్రాంతాలలో ప్రజలు ముందుకు వచ్చి అద్దె లేకుండా ఉచిత వసతి సౌకర్యాలు కల్పించారు. వస్తు, ధనరూపములలో విరాళాలిచ్చారు. ఇంతవరకు ఫలితాలు చాలా ప్రోత్సాహకరంగా వున్నాయి. అయితే ముందుముందు ఎంతో కృషిచేయాల్సి వుంది. మూడవ పంచవర్ష ప్రణాళిక కాలంలో 1 నుంచి 5 వ తరగతి వరకు అదనంగా మరో 16 లక్షల మంది విద్యార్థులను స్కూళ్ళల్లో చేర్చుకోవాలని సంకల్పం. తృతీయ ప్రణాళిక కాలంలో 1 నుంచి 5 వ తరగతి వరకు మొత్తం 25.40 లక్షల మంది బాలురు, 18.80 లక్షల మంది బాలికలు మొత్తం 44.20 లక్షల మంది విద్యార్థులు స్కూళ్ళలో చేరుతారని అంచనా.

ఆంధ్ర ప్రదేశ్‌లో 6–11 ఏండ్ల మధ్య వయస్సుగల బాలురు 95 శాతం, బాలికలు 70 శాతం, మూడవ ప్రణాళిక కాలంలో ప్రాథమిక తరగతులలో చేరాలని లక్ష్యం నిర్దేశిస్తూ విద్యాసంఘం కార్యాచరణ సమితి సూచించింది. ప్రణాళికలో చేసిన కేటాయింపులు ఈ సూచనకు అనుగుణంగానే వున్నాయి. తృతీయ ప్రణాళిక అంతంనాటికి 6–11 ఏండ్ల మధ్య వయస్సుగల పిల్లలు 1 నుంచి 5 వ తరగతి వరకు బాలురు 94.8 శాతం, బాలికలు 70.1 శాతం అంటే మొత్తం 82.4 శాతం మంది విద్యార్థులు చేరుతారని అంచనా.

1961–62 సంవత్సరంలో నిర్బంధ ప్రాథమిక విద్యా కార్యక్రమాన్ని అమలు జరుపుటకై రాష్ట్ర ప్రభుత్వం అదనంగా 3300 మంది ఉపాధ్యాయ పదవులను మంజూరు చేసింది. ఇందులో అధిక భాగం స్కూళ్ళులేని ప్రాంతాల్లో క్రొత్తగా స్కూళ్ళు తెరిచేందుకు వినియోగించ బడుతాయి. ఉపాధ్యాయులను నియమించడమే గాకుండా కంటింజెంటు ఖర్చుకై సాలీనా రూ. 80/–లు, అనావృత్త ఖర్చు క్రింద సాలీనా రూ. 100/– నుంచి రూ. 150/–ల వరకు కూడా ప్రతి ఉపాధ్యాయునికి ఇచ్చుటకు ఏర్పాట్లు వున్నాయి. పుస్తకాలు, కాగితాలు వగైరా సరఫరాచేయుటకై రూ. 50,000/–లు మధ్యాహ్న భోజన ఖర్చుకై రూ. 2,84,200/–లు మంజూరు చేయడం జరిగింది. పాఠశాల భవనాల నిర్మాణానికై పంచాయతీ సమితులకు రూ. 6½ లక్షలు సహాయక గ్రాంటుగా ఇవ్వడమైంది.

ప్రస్తుతం, ప్రచారం ద్వారా, మంచి మాటలతో నచ్చజెప్పడం ద్వారా మాత్రమే నిర్బంధ విద్యావ్యాప్తికి కృషి చేయడం జరుగుతుంది. ఇక ముందు కూడా ఇదే పద్ధతి అనుసరించ బడుతుంది. శిక్షను విధించడం చట్ట నియమావళిని ఆచరణలో పెట్టడం జరగదు. ఇప్పుడు ప్రజలందరూ చైతన్యవంతులైనారు. అందువల్ల పిల్లల్ని స్కూళ్ళకు పంపడానికి ఆర్థిక, సాంఘిక మత సంబంధమైన ఇబ్బందులేవీ అడ్డం రావు.

ప్రస్తుత విద్యా సంవత్సరానికి అదనంగా 3500 మంది ఉపాధ్యాయ పదవులు మంజూరైనాయి. ఇప్పుడున్న స్కూళ్ళలో సిబ్బందిని పటిష్ఠం చేయడానికై ఇందులో చాలామంది ఉపాధ్యాయులు నియమించ బడుతారు. "కేర్" సంస్థవారు సరఫరా చేసిన ఆహారపదార్థాలతో నిర్బంధ ప్రాంతాలలో 2 లక్షల మంది పిల్లలకు మధ్యాహ్న భోజనం. ఏర్పాటు చేయబడుతుంది. 1.52 లక్షల మందికి పాలు సరఫరా చేయబడతాయి. ఇందుకు అవసరమైన పాలపొడిని యునిసెఫ్ సంస్థవారు సరఫరాచేశారు. సహాయం కావలసిన పిల్లలకు ఉచితంగా పుస్తకాలు, పలకలు, దుస్తులు సరఫరా చేస్తూ వారికి తగిన ప్రోత్సాహం ఇవ్వడంవల్ల ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య ఉత్తరోత్తరా పెరగడానికి అవకాశముంది.

ఆంధ్రప్రదేశ్‌లో
సాంకేతిక విద్యాభివృద్ధి

ఆంధ్రప్రదేశ్‌లోని ఆంధ్ర, తెలంగాణా ప్రాంతాల సాంకేతిక విద్యాభివృద్ధి చరిత్ర అనేక విషయాలలో భిన్నంగా వుంటుంది. తెలంగాణా ప్రాంతంలో ప్రప్రథమ పారిశ్రామిక పాఠశాలను 1890 వ సంవత్సరంలో ప్రారంభించారు. పాతిక సంవత్సరాల తరువాత 1915 వ సంవత్సరంలో మరో ఆరు పారిశ్రామిక పాఠశాలలను తెరిచారు. మింట్‌లో అప్రెంటీసులుగా పనిచేస్తున్న వారి ప్రయోజనార్థం, 1922 వ సం. లో ఉస్మానియా కేంద్ర సాంకేతిక సంస్థ అనే ఒక సాంకేతిక సంస్థను నెలకొల్పారు. అదే ఇప్పుడు ప్రభుత్వ పాలిటెక్నిక్‌గా అభివృద్ధి చెందింది.

కీ. శే. రైట్ ఆనరబుల్ సర్ అక్బర్ హైదరీచే నియమించబడిన మెకెంజీ కమిటీ, ప్రాథమిక, మాధ్యమిక పాఠశాల దశల ముగింపులో విద్యార్థులకు సాంకేతిక, వృత్తి పనులలో పరిజ్ఞానం కలిగించాలని సిఫార్సు చేసింది. ఈ సిఫార్సును అమలు పర్చడానికి 1937 మే 11 వ తేదీన సాంకేతిక, వృత్తి విద్యా శాఖను ప్రారంభించారు. అదే సంవత్సరం, అప్పటి హైద్రాబాదు రాష్ట్రంలోని పారిశ్రామిక పరిస్థితులనూ, సాంకేతిక విద్యాభివృద్ధికి గల అవకాశాలనూ పరిశీలించి తగు సలహాలిచ్చే నిమిత్తం ఇంగ్లాండు విద్యా బోర్డుకు చెందిన శ్రీ ఎ. ఎబ్బట్‌ను ఆహ్వానించడం జరిగింది. ఎబ్బట్ నివేదికలో పేర్కొనబడిన సిఫార్సులననుసరించి, ప్రభుత్వ సాంకేతిక కళాశాలలో మరి కొన్ని కోర్సులను ప్రారంభించారు. బాల బాలికల కొరకు నాలుగు పోస్టు ప్రైమరీ పాఠశాలలను తెరిచారు. హైద్రాబాదులో కళలు, వృత్తి పనుల కేంద్ర పాఠశాల నొకదానిని కూడా నెలకొల్పారు. దీనినే ఇప్పుడు ప్రభుత్వ లలిత కళలు, శిల్ప శాస్త్ర కళాశాల అని పిలుస్తున్నారు.

1951 వ సంవత్సరాంతం నాటికి తెలంగాణా ప్రాంతంలో 15 సంస్థలను నెలకొల్పడం జరిగింది. ఇవేగాక ప్రభుత్వ పరిగణన పొందిన మరో 12 ఎయిడెడ్ సంస్థలు కూడా ఉండేవి. ఉస్మానియా ఇంజనీరింగ్ కళాశాలను 1922 వ సం. లో స్థాపించారు. అప్పుడు సివిల్ ఇంజనీరింగ్ కోర్సులో 12 మంది విద్యార్థులు చేరారు.

ఆంధ్ర ప్రాంతంలో సాంకేతిక విద్యాభివృద్ధి 1946 వ సంవత్సరంలోనే ఆరంభమైంది. ఆ సంవత్సరంలో కాకినాడ అనంతపురంలలో రెండు ఇంజనీరింగ్ కళాశాలలు స్థాపించబడటంతో దీనికి నాంది ఏర్పడింది. ఈ కళాశాలలో వరుసగా 110, 85 మందికి సివిల్, ఎలక్ట్రికల్, మెకానికల్ ఇంజనీరింగ్ శాఖలలో ప్రవేశావకాశాలు కల్పించారు. అదే సంవత్సరం, కాకినాడ ఉయ్యూరులలో రెండు పాలిటెక్నిక్‌లను ప్రారంభించారు. వాటిలో వరుసగా 120, 60 మంది విద్యార్థులు మూడు ప్రాతిపదిక ఇంజనీరింగ్ కోర్సులలో చేరడానికి అవకాశం కల్పించారు.

కాకినాడలోని ఆంధ్ర పాలిటెక్నిక్‌లో సర్టిఫికెటు కోర్సులకై 9 వృత్తి పనులలో శిక్షణగరిపే పారిశ్రామిక విభాగాన్ని 124 మందికి ప్రవేశావకాశం కల్పిస్తూ తెరిచారు. రెండవ ప్రపంచయుద్ధమప్పుడు, రక్షణ సంస్థకు అవసరమైన సాంకేతిక నిపుణులకు శిక్షణ ఇచ్చే నిమిత్తం హైద్రాబాదులో ఒకటి, ఆంధ్ర ప్రాంతంలో మూడు పారిశ్రామిక శిక్షణ సంస్థలను తెరిచారు.

మొదటి పంచవర్ష ప్రణాళిక

ప్రథమ పంచవర్ష ప్రణాళికా కాలంలో కాకినాడ, అనంతపురంలలోని ఇంజనీరింగ్ కళాశాలలను అభివృద్ధి పరిచారు. 1955 వ సం. లో వాల్తేరులో ఆంధ్ర విశ్వవిద్యాలయావరణలో మూడు ప్రాతిపదిక ఇంజనీరింగ్ కోర్సులలోనూ 100 మంది విద్యార్థులు

ప్రవేశంపొందడానికి అవకాశంకల్పిస్తూ కొత్తగా ఒక ఇంజనీరింగ్ కళాశాలను నెలకొల్పారు. కాకినాడ ఆంధ్ర పాలీటెక్నిక్ భవనాలను రూ. 14 లక్షల వ్యయంతో పూర్తిచేశారు. రెండు ఇంజనీరింగ్ కళాశాలలూ, పాలీటెక్నిక్‌ల నిమిత్తం సుమారు 38 లక్షల విలువచేసే సాధన సామగ్రిని కొనుగోలు చేశారు. పబ్లిక్ వర్క్సు శాఖకు అధిక సంఖ్యలో కావల్సివచ్చే సూపర్ వైజింగ్ సిబ్బంది అవసరాలను తీర్చే నిమిత్తం, కాకినాడ, అనంతపురంలలోని ఇంజనీరింగ్ కళాశాలల్లో రెండున్నర సంవత్సరాల క్లుప్తీకరించిన డిప్లొమా కోర్సును రూ. 3 లక్షల వ్యయంతో ప్రారంభించారు. ఈ కోర్సులో ఒక్కొక్క సంస్థలో 100 మంది ప్రవేశం పొందడానికి అవకాశం వుంటుంది.

తెలంగాణా ప్రాంతంలో సాంకేతిక, వృత్తి విద్యాశాఖకు 1947 సం. లో ప్రత్యేకాధికారిని నియమించారు. 16 పథకాలను విజయవంతంగా ముగించారు. ఆవృత్త, అనావృత్త వ్యయాల క్రింద వీటికి మొత్తం రూ. 13.92 లు ఖర్చయ్యాయి. మొదటి ప్రణాళిక చివరి సంవత్సరంలో, సివిల్ ఇంజనీరింగ్ కోర్సులో మాత్రమే శిక్షణ గరిపే ఒక పాలిటెక్నిక్‌ను వరంగల్‌లో ప్రారంభించారు.

రెండవ పంచవర్ష ప్రణాళిక

రాష్ట్రాల పునర్నిర్మాణం జరిగి ఆంధ్రప్రదేశ్ ఏర్పడిన వెంటనే, నూతన రాష్ట్రంలో సాంకేతిక విద్యాభివృద్ధికై రూ. 374 లక్షల వ్యయంతో కూడిన సమన్వయ ప్రణాళికను రూపొందించారు.

1957_58 వ సంవత్సరంలో ఆంధ్రప్రాంతంలో కొత్తగా అయిదు సంస్థలను తెరిచారు. వైజాగ్‌లోని హిందుస్తాన్ నౌకా నిర్మాణ కేంద్రంలో నిపుణతగల పనివారికి శిక్షణ గరిపేందుకై అప్రెంటీస్‌షిప్ పథకాన్ని ప్రారంభించారు. ఈ పథకం క్రింద 120 విద్యార్థులు శిక్షణ పొందడానికి వీలుంటుంది. కాకినాడలోని ఇంజనీరింగ్ కళాశాలలో 1958_59 వ సం. లో డిగ్రీ స్థాయిలో టెలీ కమ్యూనికేషన్ కోర్సును ప్రవేశపెట్టారు.

సాంకేతిక విద్యాపథకాల విస్తరణ కార్యక్రమం క్రింద అధిక సంఖ్యలో విద్యార్థులకు ప్రవేశాలు కల్పించడానికి, భారత ప్రభుత్వం, హైదరాబాదులోని ప్రభుత్వ పాలీటెక్నిక్‌నూ, కాకినాడలోని ఆంధ్ర పాలీటెక్నిక్‌నూ విశాఖపట్నం పాలీటెక్నిక్‌ను ఎన్నిక చేసింది. 250 మందిని వీటిలో అదనంగా చేర్చుకుంటారు. అందుకు రూ. 250 లక్షలు ఖర్చవుతాయి. ఈ ఖర్చునంతటినీ కేంద్ర ప్రభుత్వమే భరిస్తుంది.

గనుల పరిశ్రమకు కావల్సిన ఉద్యోగులకు శిక్షణ ఇచ్చే నిమిత్తం రెండవ ప్రణాళికా కాలంలో గూడూరు, కొత్తగూడెంలలో రెండు మైనింగ్ ఇనిస్టిట్యూట్లను ప్రారంభించారు. వీటిలో ఒక్కొక్క దానిలో 40 మందికి ప్రవేశావకాశం వుంది.

ప్రైవేటు యాజమాన్యం క్రింద తణుకు, వనపర్తి, హైదరాబాదులలో మూడు పాలీటెక్నికులు తెరవబడినాయి. ఈ మూడు సంస్థలలో మొత్తం 360 మంది విద్యార్థులకు ప్రవేశం లభిస్తుంది.

మొదటి పంచవర్ష ప్రణాళికకు పూర్వం ఆంధ్ర ప్రాంతం మొత్తంమీద వివిధ పథకాల ఆవృత్తవ్యయం క్రింద రూ. 22.36 లక్షలు ఖర్చయింది. కాగా రెండవప్రణాళిక ముగింపునాటికి ఆంధ్ర ప్రదేశ్ మొత్తంలో ఆవృత్త వ్యయం క్రింద ఖర్చయినది రూ. 61_41 లక్షలు. విశ్వ విద్యాలయ ఇంజనీరింగ్ కళాశాలలపై ఖర్చు చేసిన మొత్తంకూడా దీనిలో చేరివుంది. రెండవ ప్రణాళికా కాలంలో అభివృద్ధిపై జరిగిన ఖర్చు రూ. 3.74 కోట్లు. మొదటి పంచ వర్ష ప్రణాళికలో చేసిన వ్యయంకంటె ఇది దాదాపు అయిదు రెట్లు ఎక్కువ.

వివిధ స్థాయిలలో సాంకేతిక విద్యాభివృద్ధి విషయాలపై ప్రభుత్వానికి సలహాలిచ్చే నిమిత్తం 1957 ఫిబ్రవరి 26 వ తేదీన సాంకేతిక విద్య, శిక్షణల రాష్ట్ర బోర్డు అనే సలహా సంఘాన్ని స్థాపించారు.

వృత్తిపనుల అప్రెంటీసులు, వృత్తి పనివారల శిక్షణ విషయాలపై సలహాలు ఇవ్వడానికై రెండవ ప్రణాళికా కాలంలో వృత్తిపనుల శిక్షణ రాష్ట్ర మండలినికూడా నెలకొల్పారు.

మూడవ పంచ వర్ష ప్రణాళిక

ఈ శాఖకు సంబంధించిన తృతీయ ప్రణాళికా కార్యక్రమాలు, రెండవ ప్రణాళికా కాలంలో ప్రారంభించబడిన సంస్థల ఏకీకరణను, అభివృద్ధి పనులను, పూర్తిచేయ తలపెట్టుతున్నవి. అంతేగాక దేశంలో ప్రప్రథమంగా కొన్ని నూతన పథకాలను ప్రారంభించడానికి కూడా ఈ కార్యక్రమాలు లక్షిస్తున్నవి. మూడవ పంచవర్ష ప్రణాళికా కాలంలో శ్రీకాకుళంలో సివిల్, ఎలక్ట్రికల్, మెకానికల్ ఇంజనీరింగ్ కోర్సులతో ఒక

పాలీటెక్నిక్‌ను తెరవడానికి ప్రతిపాదించారు. ప్రైవేటు రంగంలో డిగ్రీ కోర్సులో ఒక ఇంజనీరింగ్ కళాశాలను ప్రారంభించడానికి తగు విధంగా అవకాశం కల్పించడం కూడా జరిగింది. మన దేశంలో ఇంతవరకూ ఎక్కడా లేని కోర్సులనూ, సంస్థలను ప్రారంభించడానికి తృతీయ ప్రణాళికలో అధికంగా ప్రాధాన్యత ఇస్తారు. ఇంజనీరింగ్‌లో డిప్లొమా కోర్సు శిక్షణ ఇచ్చే బాలికల పాలీటెక్నిక్‌లు ఈ కోవకు చెందుతాయి. డిప్లొమా పొందినవారు డిగ్రీ పొందడానికి అర్హత సంపాదించడానికి వీలుగానూ మెట్రిక్యులేషను తరువాత డిప్లొమా కోర్సులు చదవడానికి వీలుగాను ఇంజనీరింగులో పార్ట్‌టైమ్ కోర్సులను ప్రారంభించడానికి కూడా ఈ అభివృద్ధి కార్యక్రమాలు లక్షిస్తున్నవి. రాష్ట్రంలోని ఇంజనీరింగ్ కళాశాలలో పోస్టు గ్రాడ్యుయేటు కోర్సును ప్రవేశ పెట్టవలసిన అగత్యంకూడా వుంది ఇందుకొరకు ప్రణాళికలో తగు విధంగా మొత్తాలను ప్రత్యేకించడం జరిగింది.

రెండవ ప్రణాళికా కాలంలో జూనియర్ సాంకేతిక పాఠశాలలను తెరిచే పథకాన్ని ప్రవేశ పెట్టారు. విద్యార్థులు మొదట ఈ పాఠశాలల్లో శిక్షణ పొంది చివరకు పాలీటెక్నిక్‌లలో చేరుతారు. ఈ పథకాన్ని విస్తృతీకరించారు. మూడవ ప్రణాళికా కాలంలో మరో ఏడు సంస్థలను ప్రారంభించడానికి ప్రతిపాదించారు.

హైదరాబాదులోని ప్రభుత్వ లలిత కళలు, శిల్పశాస్త్ర కళాశాల, వాస్తుశాస్త్ర శాఖలను అభివృద్ధి పరచడానికీ, ఈ కోర్సులను జాతీయ డిప్లొమా స్థాయికి పెంచడానికికూడా తలపెట్టడంజరిగింది. విజయవాడ, హైదరాబాదులలోని రెండు సంగీత కళాశాలలను, వాటికి శాశ్వత భవనాలనూ, సాధన సామగ్రినీ మొదలైన వాటిని సమకూర్చడం ద్వారా అభివృద్ధి పరచడానికీ, హైదరాబాదులోని సంగీత, నృత్య కళాశాలలో డిగ్రీకోర్సులను ప్రారంభించడానికి కూడా తలపెట్టారు.

రాష్ట్రంలోని మూడు విశ్వకళా పరిషత్తులైన ఆంధ్ర, శ్రీ వేంకటేశ్వర, ఉస్మానియా విశ్వ విద్యాలయాలు, వరుసగా వాల్తేరు, తిరుపతి, హైదరాబాదులలో మూడు ఇంజనీరింగ్ కళాశాలలను నిర్వహిస్తున్నాయి. వీటిలో కోర్సుల బోధన విషయంలో సాంకేతిక విద్యాశాఖ డైరెక్టరు అనుసంధానాధికారిగా వ్యవహరిస్తారు. ఇందుకు జరిగే వ్యయంలో కొంత మొత్తాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఈ విశ్వ విద్యాలయాలకు చెల్లిస్తుంది. పై విశ్వ విద్యాలయాలలో అయిదు సంవత్సరాల సమీకృత ఇంజనీరింగు కోర్సులు నిర్వహించడానికి మూడవ ప్రణాళికలో తగు కేటాయింపులు చేశారు.

సాంకేతిక విద్యా పథకాలపై రూ. 301 లక్షలు ఖర్చు చెయ్యడానికి ఉద్దేశించబడింది. రెండవ ప్రణాళికలో ఇందుకు రూ. 269 లక్షలు వెచ్చించడం జరిగింది.

మన రాష్ట్రంలో సాంకేతిక విద్యాశాఖకు మరో విభాగం కూడా వుంది. భారత ప్రభుత్వ కార్మిక మంత్రిత్వ శాఖ పరిధిలోని పారిశ్రామిక శిక్షణ సంస్థలు దీని అధీనంలో వుంటాయి. ఈ ప్రణాళికా కాలంలో రాష్ట్రంలో మరో 8 పారిశ్రామిక శిక్షణ సంస్థలను ప్రారంభించడంతో పాటు, ప్రస్తుతం పని చేస్తున్న 5 సంస్థలను విస్తృత పరచడానికి ప్రతిపాదించారు. ప్రణాళికా కాలంలో వృత్తి పనివారల శిక్షణ కార్యక్రమం క్రింద అదనంగా 3,126 మందికి శిక్షణాసౌకర్యాలు కల్పించడానికి కూడా ప్రతిపాదించారు. పరిశ్రమల అప్రెంటీస్‌షిప్ శిక్షణ పథకాలను విస్తృత పరచడానికీ, పారిశ్రామిక కార్మికుల కొరకు సాయంకాలపు తరగతులను ప్రారంభించడానికి కూడా ఈ పథకం లక్షిస్తున్నది. ప్రణాళికా కాలంలో కార్మిక మంత్రిత్వశాఖకు చెందిన పథకాలపై సుమారు రూ. 2 కోట్లు వెచ్చించబడతాయని అంచనా.

సాంకేతిక విద్యావ్యాప్తికై ప్రథమ, ద్వితీయ ప్రణాళికలలో తృతీయ ప్రణాళికలో చేసిన కేటాయింపుల వివరాలు దిగువ పేర్కొనబడినాయి. ఈ రంగంలో రెండవ ప్రణాళికా కాలంలో సాధించిన సాఫల్యాభివృద్ధినీ, తృతీయ ప్రణాళికలో తలపెట్టిన ఇతోధికాభివృద్ధినీ ఇవితెలుపుతాయి:

	ప్రథమ ప్రణాళిక (రూ. లక్షలు)	ద్వితీయ ప్రణాళిక (రూ. లక్షలు)	తృతీయ ప్రణాళిక (రూ. లక్షలు)
సాంకేతిక విద్య (వృత్తి పనివారల శిక్షణ పథకాలతో సహా)	13.91	351.22	505.00

మొదటి ప్రణాళిక, రెండవ ప్రణాళికా కాలాలలో సాధించిన భౌతిక లక్ష్యాలు, మూడవ ప్రణాళికలో తలపెట్టిన లక్ష్యాలు LVII వ పుటలో (చూ. *) ఇచ్చినపట్టికలో పేర్కొనబడినాయి.

తృతీయ ప్రణాళికలో తలపెట్టిన భౌతిక లక్ష్యాలు ఆ ప్రణాళికాంతంనాటికి నెరవేరేటప్పటికి సాంకేతిక విద్యారంగంలో ప్రథమ ప్రణాళిక ఆరంభంలో వున్న పరిస్థితికంటే డిగ్రీ స్థాయిలో

నాలుగింతలూ, డిప్లొమా స్థాయిలో ఏడింతల అభివృద్ధి కాన వస్తుంది. పోటీ వృత్తి పనివారల శిక్షణ సౌకర్యాల విషయంలో నాలుగింతల అభివృద్ధి ఏర్పడుతుంది. అంతేగాక బాలికలకు డిప్లొమా సౌకర్యాలు కూడా ఏర్పడతాయి.


రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ అభివృద్ధి చెందడంతో అన్ని స్థాయిలలోనూ ఈ సదుపాయాలు ఇతోధికంగా సమకూరవల్సి వుంటాయి. పారిశ్రామికంగా అభివృద్ధి చెందడంవల్ల పెంపొందిన అవసరాలను తీర్చడానికి అదనంగా సౌకర్యాలు సమకూర్చుకొనవలసిన అవసరం రాష్ట్రానికి త్వరలోనే కలుగవచ్చు.

* ఆంధ్రప్రదేశ్---సాంకేతిక విద్య, శిక్షణ

	ప్రణాళికకు పూర్వం		మొదటి ప్రణాళిక ముగింపునాటికి		రెండవ ప్రణాళిక ముగింపునాటికి		మూడవ ప్రణాళిక ముగింపునాటికి	
	సంస్థల సంఖ్య	వార్షిక ప్రవేశాలు	సంస్థల సంఖ్య	వార్షిక ప్రవేశాలు	సంస్థల సంఖ్య	వార్షిక ప్రవేశాలు	సంస్థల సంఖ్య	వార్షిక ప్రవేశాలు
ఇంజనీరింగ్ కళాశాలలు	3	290	3	290	6	1015	• 7	1235
పోలిటెక్నికులు, మైనింగ్ సంస్థలు	3	240	4	463	19	2473	20	2593
పారిశ్రామిక శిక్షణ సంస్థలు	5	+1624	4	+1624	10	+3530	18	+6656
బాలికల పోలిటెక్నికులు	—	—	—	—	—	—	4	720
జూనియర్ సాంకేతిక పాఠశాలలు	—	—	—	—	3	180	10	600

• ప్రైవేటు రంగంలో ఒక ఇంజనీరింగ్ కళాశాలను తెరవడానికి తలపెట్టారు.

+ ఈ గుర్తు వార్షిక ప్రవేశాలు గాక ప్రవేశం లభించగల స్థానాల సంఖ్యను సూచిస్తుంది. మొత్తం సీట్లలో సగం స్థానాలకు ప్రతి తొమ్మిది నెలలకు ప్రవేశాలు లభింపజేస్తారు.



పాఠ్య పుస్తకాల జాతీయకరణ,

పాఠ్యపుస్తకాల ముద్రణాలయం

శ్రీ యస్. నారాయణరావు, యం. యస్. సి. (టెక్నాలజీ)

ప్రపంచదేశాలు క్రమేణా సోషలిస్టు సమాజ వ్యవస్థవైపు మొగ్గుచూపుతున్న తరుణంలో, జాతీయకరణ ప్రాముఖ్యాన్ని, ఆవశ్యకతనూ గూర్చి ప్రత్యేకంగా ప్రస్తావించ నవసరంలేదు. ప్రజాభ్యుదయానికి వెన్నెముకవలెనున్న విద్యారంగంలో జాతీయకరణ అత్యంత ప్రాధాన్యత వహిస్తున్నది. పాఠ్య పుస్తకాల జాతీయకరణ, అక్షరాస్యులైన ప్రతివ్యక్తి దృష్టినీ ఆకర్షించింది. అనేకమంది ప్రముఖ విద్యావేత్తల అభిప్రాయాల్ని, సిఫార్సులను ఆధారంగా తీసుకొని, ప్రభుత్వం ఈ విషయమై ఒక నిర్దుష్టమైన నిర్ణయం తీసుకోవలసిన సమయం వచ్చిందని భావించింది.

1954వ సంవత్సరంలో ప్రభుత్వం నియమించిన ప్రాథమిక విద్యా సంఘం (దీనినే కుప్పుస్వామి కమిటీ అని అంటారు) ఈ విషయాన్నే పరిశీలించి రాష్ట్ర ప్రభుత్వం కనీసం ప్రాథమిక విద్యా దశలోనైనా పాఠ్యపుస్తకాల ప్రచురణకు పూనుకోవాలని సిఫార్సు చేసింది. పాఠ్యపుస్తకాలన్నీ ఒకే తీరులో వుండాలనే దీని ఆశయం. ప్రభుత్వంవారు శ్రీ యస్. గోవిందరాజులుగారి అధ్యక్షతన మరొక సంఘాన్ని వేశారు. అన్ని దశలలో పాఠ్య పుస్తకాలు, ఇతర జనరల్ పుస్తకాల ప్రచురణను జాతీయం చేయాలనీ, ఈ బాధ్యతను స్వతంత్ర ప్రతిపత్తి గల ఒక సంస్థకు వప్పగించాలనీ, ఈ సంఘం సిఫార్సు చేసింది. విద్యా రంగంలో జరిగిన అభివృద్ధితర పరిణామములలో ఇది ద్వితీయ సోపానమని చెప్పవచ్చు.

జాతీయకరణ, పుస్తకాల ప్రమాణీకరణ అనే ఉన్నత ఆశయానికి 1957 నవంబరు నెలలో రూపురేఖలు తీర్చడం జరిగింది. జాతీయం చేయబడిన పాఠ్యపుస్తకాలను అచ్చువేయుటకు ప్రత్యేకంగా ఒక ముద్రణాలయం నెలకొల్పాలని ప్రభుత్వం నిర్ణయించింది. పాఠ్యపుస్తకాల ముద్రణాలయం అన్ని హంగులతో ఒక సుందరమైన భవనంలో ఇప్పుడు నెలకొనివుంది. సచివాలయానికి సమీపంలో మింట్ కాంపౌండ్‌లో ఈ భవనం వుంది.

పాఠ్య పుస్తకాల ముద్రణాలయం ఏవిధంగా ఆరంభమైనదీ, ఏవిధంగా అభివృద్ధి చెందినదీ, ఇప్పుడు ఏ పరిస్థితిలో వున్నదీ, క్లుప్తంగా తెలుసుకొందాం. పాఠ్యపుస్తకాలకు ప్రత్యేకంగా ఒక ముద్రణాలయం వుండాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకొన్న తరువాత, జాతీయం చేయబడిన పుస్తకాలను ప్రచురించే ముద్రణాలయాన్ని ఏర్పాటుచేసే బాధ్యతను పాఠ్యపుస్తకాల ముద్రణాలయ సూపరింటెండెంటుకు వప్పగించింది. ఆ సమయంలో ఈ పనికి కావలసిన సౌకర్యాలు అసలే లేవని చెప్పవచ్చు. సెక్యూరిటీ ప్రెస్‌ను ఏర్పాటుచేయుటకై నిజాం ప్రభువు కట్టించిన భవనం ఈ కార్యానికి అందుబాటులోవున్నది, అయితే పాఠ్య పుస్తకాల ముద్రణాలయ స్థాపనకు అనువుగా వుండేట్లు ఈ భవనానికి కొన్ని చేర్పువేతలు, మార్పులు చేయడం అవసరమైంది. ప్రెస్ సూపరింటెండెంటు 5 వ తరగతి వాచకాలను కర్నూలులోని ప్రభుత్వ ముద్రణశాలలో అచ్చువేయించే పనిని ఒకవైపు నిర్వహిస్తూనే మరోవైపు ఈ పనినికూడా చూడాల్సివచ్చింది. ఏర్పాట్లకు సంబంధించిన సమస్యలన్నీ పరిష్కారమైనాయి కానీ, యంత్రాలను వాటిని నడిపించే సిబ్బందిని ఏర్పాటు చేయడం మున్నగు సాంకేతిక సమస్యలు ఎదుర్కొన్నాయి. విదేశమారక ద్రవ్యం ఇబ్బందుల దృష్ట్యా, అచ్చుయంత్రాలను సేకరించడానికి చాల జాగ్రత్త వహించాల్సి వచ్చింది. మన కరెన్సీలోనే డబ్బు చెల్లించే పద్ధతిలో అతి సున్నితమైన ఆటో మెటిక్ ఆఫ్‌సెట్ పరికరాలు, లెటర్-ప్రెస్ పరికరాలు, మొదలైన వాటిని కొనడం రిజ

గింది. వివిధ రంగులలో అచ్చువేయడానికీ, ఒకే సారిగా అనేకమైన అచ్చుపనులు చేయడానికీ ఆఫ్-సెట్ పద్ధతి అనేక విధాల శ్రేష్ఠమైనది. నలుపు తెలుపు పనికి లెటర్ ప్రెస్ పద్ధతి సులువైనది.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఈ విషయమై అత్యంత శ్రద్ధ వహించి రూ. 5.15 లక్షల మేరకు విదేశీ మారక ద్రవ్యాన్ని సమకూర్చింది. ఈ కృషి ఫలితంగా ఈ ముద్రణాలయంలో ఇప్పుడు లెటర్ ప్రెస్ యంత్రాలు, ఫోటో-లితో, బ్లాకులు తయారు చేయు పరికరాలున్నాయి. పుస్తకాలు బైండు చేయడానికీ కాగితాలు మడతపెట్టడానికీ, కోయడానికీ, కుట్టుపనులు చేయడానికీ, వలసిన మంచి పరికరాలు కూడా వున్నాయి. ట్రిమ్మింగ్ సెక్షన్‌లో అత్యంత ఆధునికమైన మూడుకత్తులు అమర్చబడిన యంత్రం కూడా వుంది. ఇంగ్లీషు హిందీ, ఇతరభాషలలో అక్షరాలను కూర్చడానికి మోనోటైపు కంపోజిషన్‌కొస్టర్స్‌నూ బైండింగు విభాగంలో పుస్తకాలను ఒక చోటికి చేర్చడానికీ, స్పేసింగ్ వస్తువులు, నమూనా రకాలు మున్నగువాటి కొరకై మోనోటైప్ సూపర్ కాస్టింగ్ పరికరాలనూ త్వరలో ముద్రణాలయంలో ఏర్పాటు చేయడానికి పనులు చురుకుగా కొనసాగుతున్నాయి. ఇక్కడ ఆధునికమైన నైఫ్-గ్రైండర్ వుంది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో వున్నవాటిల్లో అన్నింటికంటే ఇది అత్యంత శ్రేష్ఠమైనది. ఇతర చోట్లనుంచి వచ్చేపనులు చేయడానికి కూడా ఇది ఉపకరిస్తుంది. కనుక ముద్రణాలయానికి ఇది లాభం కలిగిస్తుంది.

ఇవన్నీ ముద్రణాలయ స్థాపనకు అవసరమైన పరికరాలు. ఇది సమర్థవంతంగాను, లాభకరంగాను పనిచేయాలంటే అక్కడక్కడా కొన్ని మెరుగులు దిద్దడం అవసరం. ఈ ముద్రణాలయం విద్యాశాఖ ఆధ్వర్యాన ప్రభుత్వ వ్యాపార సంస్థగా పని చేస్తున్నది. ఇందుకు అవసరమైన నిధులు రాష్ట్ర కంటింజెన్సీ ఫండునుంచి అప్పురూపంలో లభించాయి. 5 శాతం వడ్డీ రేటు చొప్పున ఈ అప్పును తిరిగి చెల్లించాల్సివుంటుంది.

ముద్రణాలయం ఏ విధంగా పని చేస్తుందో వివరంగా తెలుసుకొందాం. విద్యాశాఖ డైరెక్టరుకు, సహాయకుడుగా వున్న పాఠ్యపుస్తకాల జాతీయకరణ స్పెషల్ ఆఫీసరు లిఖిత ప్రతులను సిద్ధం చేయించి, ప్రభుత్వం ఆమోదానికి వాటిని పంపుతారు. ఆ తరువాతనే, అవి ముద్రణాలయానికి వస్తాయి. అంతేగాకుండా ఆయన ఎన్ని ప్రతులను అచ్చు వేయాల్సిందీ అంచనావేసి, వాటి అమ్మకాలను పరిశీలిస్తూ, అవసరమైతే వాటి పునర్ముద్రణకు ఏర్పాట్లు చేస్తారు. జాతీయకరణ కొరకు వివిధ తరగతులకు పాఠముల లిఖిత ప్రతులనుగూడా సిద్ధం చేయిస్తారు. లిఖిత ప్రతులన్నీ తయారై వచ్చేప్పటికి పాఠ్యపుస్తకాల ముద్రణాలయం కావలసిన కాగితాలను, ఇతర ముడి పదార్థాలను సమకూర్చుకొంటుంది. లిఖిత ప్రతులు వచ్చిన తరువాత, వాటిని కూర్చడం, ప్రూఫులు దిద్దడం మున్నగుపనులు పూర్తిచేసి, ప్రైసుకు ఆర్డరుకొరకు వాటిని పాఠ్య పుస్తకాల జాతీయకరణ స్పెషల్ ఆఫీసరుకు పంపడం జరుగుతుంది.

ప్రైసుకు ఆర్డర్లతో పాటు లిఖిత ప్రతులు అందిన తరువాత యంత్రంపని ఆరంభిస్తుంది కాగితాలు, మానవసహాయం అవసరంలేకుండా వాటంతట అవే యంత్రంలోకి పోయి, ఆకర్షణీయమైన అచ్చులతో అతిశీఘ్రముగా బయటికి వచ్చేదృశ్యం చూడటానికి ఇంపుగా వుంటుంది. జీవిత పురోగమనానికి పాటుపడే వ్యక్తిని స్ఫురింపజేస్తాయి. ఈ ఆటోమెటిక్ యంత్రాలతో అన్ని పనులు, అనుకొన్నట్లుగా ఒడుదుడుకులు లేకుండా నిక్కచ్చిగా జరిగిపోతాయి. యంత్రం చేసే ప్రతి కదలికలో జీవం తొణికిసలాడుతుంది. ప్రక్క బల్లలు నానావర్ణములతో శోభాయమానంగా వుంటాయి. లెటర్ ప్రెస్ విభాగంలో జరుగే పనికి తోడుగా, ఆఫ్ సెట్ విభాగంలో అచ్చుపనికూడా చురుకుగా జరుగుతుంది. డార్కురూము, కెమేరా, ప్లేటు తయారుచేసే విభాగాలలో సాంకేతిక విజ్ఞానమంతా ప్రదర్శించాల్సి వుంటుంది. అవి సరియైన శీతోష్ణస్థితిలో సదాపని చేయగలందులకై ఏర్-కండిషన్ చేయబడుతున్నాయి. కెమేరా విభాగంలో, ఏ సమయంలో ఎంత వెలుతురు కావలసిందీ తెలుసుకొని పనిచేసేందుకై లైట్ ఇంటిగ్రేటర్ అనే ఒక పరికరంవుంది. నెగెటివ్ తయారు చేస్తున్నపుడు, పనివారలు అరుణకాంతి ప్రసరించేగదిలో వుండాలి. ఇక్కడ పనిచేయడం చాలా హుషారుగా వుంటుంది. నెగెటివ్‌ను పాజిటివ్‌గా చేయడం జరుగుతుంది. ఒక్కొక్క నెగెటివ్ 24 అం. పొడవు 20 అం. వెడల్పు; మరి కొన్ని 20 అం. × 30 మున్నగు సైజులలో వుంటాయి. జింక్ ప్లేట్లను నునుపుచేయడం చూస్తూంటే ముచ్చట వుంటుంది. అనేక వేల సంఖ్యలో వుండు పింగాణీగుండ్లు బరువుగావున్న జింక్ ప్లేట్లను చదునుచేస్తాయి. ఈ పింగాణీగుండ్లు పనిచేస్తూంటే, చిన్న చిన్న బొమ్మలు నాట్యం చేస్తున్నట్లు అనిపిస్తుంది. జింక్ ప్లేట్లు చదును అయిన తరువాత వాటిపైన రసాయనిక పదార్థాల

పూతపూస్తారు. అవి ఆరిన తరువాత వేక్యూం ప్రింటింగ్ ఫ్రేములో పాజిటివ్ పైన వుంచుతారు. కార్బన్ ఆర్క్ లైటును దానిపై ప్రసరింపజేస్తారు. ఆ తరువాతనే వాటిని డెవలప్ చేసి, ద్రావకాల సహాయంతో చిత్రములు వేసి, యంత్రంలో అమర్చడం జరుగుతుంది.

యంత్ర విభాగంలో ఈ ప్లేట్లను సిలిండర్లపైన వుంచి, యంత్రాలను నడిపిస్తారు. అచ్చువేయడానికి అనేక రంగుల సిరా వాడుతారు. యంత్రం పనిచేసే దృశ్యం కనులకు ఇంపుగా వుంటుంది. ఈ విభాగంలో రెండు రంగులు అచ్చు వేసే యంత్రం నిర్విరామంగా పనిచేయగలదు. ఆశ్చర్యం కల్గించేంత వేగంగా పని జరుగుతుంది. కాగితాలు అందించడం, కాగితాలను భర్తీ చేసుకోవడం, అచ్చు అయిన కాగితాలను ఒకచోటికి చేర్చడం, అన్ని పనులూ విశ్రాంతి లేకుండా యంత్రాలే చేస్తాయి. ఇవి అత్యంత ఆధునికమైనవి. కాలం వృధా చేయకుండా పనిచేయగలిగే సామర్థ్యం వున్నందు వల్ల, ఉత్పత్తిని హెచ్చించుటకు దోహదమిస్తాయి. ఇక్కడ అచ్చు పూర్తి అయిన తరువాత అవి బైండింగు విభాగానికి చేరుతాయి.

బైండు విభాగంలో, అచ్చు అయిన కాగితాలను మడతబెట్టి ఒక చోట చేర్చి వాటిని దారాలతో కుట్టి, అతికించి, కాగితాలను కోసి పుస్తకాలుగా తయారు చేయడం జరుగుతుంది. కాగితాల్ని మడతపెట్టే యంత్రాలు పని చేస్తుంటే కన్నుల పండువుగా వుంటుంది. పనివారలు జట్లు జట్లుగా వివిధ పనులను నిర్వర్తిస్తుంటారు. కుట్టు పని, కోత పనులు కూడా చూడ ముచ్చటగా వుంటాయి. కుట్టు పడిన పుస్తకాలు పైనుంచి ఎగిరి క్రిందికి దుముకుతూ వుంటాయి. మూడు కత్తులు అమర్చిన యంత్రం చూచే వారికి చాలా కుతూహలం కలిగిస్తుంది.

ఈ విధంగా తయారైన పుస్తకాలు కట్టలు కట్టలుగా పేర్చబడుతాయి. ఆ తరువాత వాటిని స్టోర్సు విభాగంలో జాగ్రత్తగా భద్రపరచడం జరుగుతుంది. ఇక్కడినుంచి ఇవి విద్యార్థులకు సరఫరా అవుతాయి. విద్యార్థులచేతుల్లోకి ఈ పుసకాలు ఎలా చేరుతాయి? జిల్లాపరిషత్తులు, పంచాయతీసమితులు, మునిసిపాలిటీలు పుస్తకాల పంపిణీ ఏజెన్సీలుగా వ్యవహరిస్తాయి. వీటికి నూటికి 10 వంతులు కమీషన్ లభిస్తుంది. స్టోర్సుకు చేరిన పుస్తకాలను, జాగ్రత్తగా ప్యాక్ చేసి, ఏజెంట్లకు సరఫరా చేయడం జరుగుతుంది. రవాణా ఖర్చుల్ని ఏజెంట్లే భరిస్తారు. పుస్తకాలను తూకం వేసి, కట్టలుగా ప్యాక్ చేసి, వాటిని లారీలకుఎక్కించి రాష్ట్రం నలుమూలలకు చేరవేసే బాధ్యతను స్టోర్స్ సెక్షన్ వహిస్తుంది. అందమైన ఆకారంతో, ముచ్చటైన అచ్చుతో వెలువడిన ఈ పుస్తకాల్ని బడి పిల్లలు హర్షామోదాలతో స్వీకరిస్తారు.



బాలబాలికలకు క్రొత్త పుస్తకాలంటే యిష్టం. (నమూనా)

జాతీయకరణ పథకాన్ని అమలుపరచడంతో, ఆకర్షణీయమైన పాఠ్య పుస్తకాలను తక్కువ ధరకు సకాలంలో సరఫరా చేయాలని చిరకాలం నుంచి ఆశిస్తున్న ప్రభుత్వ కృషి సఫలీకృతమైంది. ముద్రణాలయం ఇంతవరకు, ఏకవర్ణంలోను, అనేక రంగులలోను ఈ క్రింది పుస్తకాలను అచ్చువేసింది.


1.	తెలుగు వాచకము I	26,00,000	త్రివర్ణములలో
2.	.. II	13,50,000	..
3.	.. III	7,00,000	రెండు రంగులు
4.	.. IV	7,30,000	ఒకే రంగులో
5.	.. V	7,65,000	..
6.	3 వ తరగతికి గణితబోధిని	5,00,000	..
7.	4 వ ..	2,00,000	..
8.	5 వ ..	3,80,000	..
9.	4 వ తరగతికి సామాన్య విజ్ఞాన శాస్త్రము	2,00,000	(కొన్ని బొమ్మలు రంగులలో)
10.	5 వ ..	4,50,000	ఒకే రంగులో
11.	4 వ తరగతికి సాంఘిక శాస్త్రములు	2,00,000	..
12.	5 వ ..	4,50,000	..
	మొత్తం	85,25,000	

జాతీయ కరణ కార్యక్రమం ప్రకారం, ప్రతి సంవత్సరం జూన్ నుండి మే నెల వరకు క్రొత్త పుస్తకాలను అచ్చు వేయడం, ఇదివరకే జాతీయం చేయబడిన పుస్తకాలను పునర్ముద్రించడం వగైరా పనులను ముద్రణాలయం నిర్వహిస్తుంది. జూన్ నెల మొదటి వారం విరామం లేకుండా పని జరిగే కాలం. ఎందుకంటే రాష్ట్రమంతటాగల ఏజెంట్లకు స్టోర్సు సెక్షను పుస్తకాలు పంప వలసి వుంటుంది ఈ సమయంలోనే.

కొత్తపాఠ్య ప్రణాళిక ప్రకారం పాఠ్య పుస్తకాలన్నీ జాతీయం కావాల్సి వుంటుంది. వీటిని ప్రభుత్వం దశలవారీగా అచ్చు వేయించుతుంది. ఏటా కొత్త పుస్తకాలు ప్రవేశపెట్ట బడడంతో ముద్రణాలయ విస్తరణ కార్యక్రమం అమలు జరుగ వలసి వుంటుంది. అనతి కాలంలోనే పుస్తకాల వుత్పత్తి కోట్ల సంఖ్యకు మించుతుంది. ఇంతవరకు జాతీయం చేయబడి, ప్రభుత్వ యాజమాన్యం క్రింద అచ్చు అయిన పుస్తకాలు, ఆకర్షవంతమై, తక్కువ ధరకు, సకాలంలో సరఫరా కావడమే గాక, పాఠ్యాంశముల దృష్ట్యానూ, భాషావిషయక దృష్ట్యానూ ప్రజలకు నచ్చేట్లుగా వున్నాయని ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. పాఠ్యాంశాలు, భాషావిషయాలకై ప్రభుత్వంవారు భాషావేత్తలను ఎన్నుకొన్నారు. సాధారణ పరిశీలక సంఘంలో సబ్జక్టు నిపుణులు నియమించబడినారు.

రాష్ట్ర ప్రభుత్వం ఈ విషయంలో చేస్తున్న కృషి పట్ల ప్రజలు అభిమానం చూపుతున్నారని నిస్సందేహంగా చెప్పవచ్చు. ఇదివరకు అచ్చు వేయబడిన వివిధ పుస్తకాల కంటే, ఇప్పటి పుస్తకాల నాణ్యత బాగుండడంవల్ల, ప్రభుత్వానికి ప్రజా సహకారం కూడా లభించింది. లోటుపాట్లు లేకుండా వుంటే ప్రజాదరణ లభిస్తుంది. జాతీయ కరణ విధానానికి తోడ్పడే నిర్మాణాత్మక సలహాల్ని ప్రభుత్వం తప్పకుండా పాటిస్తుంది. ఏ రంగంలో నైనా జాతీయ కరణం ప్రవేశపెట్టాలంటే, అది సాహసంతో కూడిన పని, దేశం పురోగమిస్తున్నప్పటికీ, దేశం తలపెట్టిన మహత్కార్యానికి ప్రతి ఘటన అంటూ వుండనే వుంటుంది. ప్రగతి పథంలో అనాదినుంచీ మానవాళి అనుభవంలోకి వస్తున్న విషయమే ఇది. ఆరంభంలో ఇబ్బందులున్నా అంతిమంగా ఏ మహత్కార్యమైనా విజయాన్ని చూరగొంటుంది. ఆధునిక సోషలిస్టు సమాజ వ్యవస్థకు దోహదం కల్పించుటకై రాష్ట్రప్రభుత్వం తలపెట్టిన పాఠ్య పుస్తకాల జాతీయ కరణ విధానం పరాకాష్ఠ నందుకొని తీరుతుంది.

పాఠ్య పుస్తకాల జాతీయ కరణ విధానాన్ని అమలు పరచే విషయమై ఇతర రాష్ట్ర ప్రభుత్వాలు ఇంకా సమాలోచనలు చేస్తుండగా ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం మాత్రం డాక్టర్ సంజీవరెడ్డి ముఖ్యమంత్రిత్వ కాలంలో 1957 వ సంవత్సరంలోనే ఇందుకు పూనుకొన్నది. ఎన్ని ఆక్షేపణలు వచ్చినా, ఎన్ని సమస్యలు వచ్చినా వాటిని లెక్క చేయకుండా ఈ కార్యక్రమం చేపట్టింది. మన రాష్ట్రం. ఈ విషయంలో ఇతర రాష్ట్రాలకు మార్గదర్శకంగా వ్యవహరిస్తున్నదని చెప్పడంలో అతిశయోక్తి లేదని డాక్టర్ సంజీవరెడ్డిగారు అప్పుడు చెప్పారు. భారత ప్రభుత్వంకూడా మన కృషిని మెచ్చుకోవడం, మన భాగ్యం. పాఠ్య పుస్తకాల జాతీయ కరణ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం త్వరిత గతిని అభివృద్ధి చెందగలదని ఆశిద్దాం. భావిపౌరులుగా రూపొందే విద్యార్థిలోకానికి సేవ చేయగలదని ఆశిద్దాం.



యువ యాత్రికుల పురోగమనం (నమూనా)

మూడవ ప్రణాళికలో

మధ్యాహ్న భోజన పథకం

కేర్, యునిసెఫ్‌ల సహాయం

ప్రాథమిక పాఠశాలలలోని బాలబాలికలకు మధ్యాహ్న భోజన పథకం అమలు పరచడంతో, నిర్బంధ ప్రాథమిక విద్యా ప్రగతి ముడిపడిఉంది. పాఠశాలలకు వెళ్ళే వయస్సుగల బాలబాలికలు యితోధికంగా ప్రాథమిక పాఠశాలలకు వెళ్ళాలని తద్వారా అక్షరాస్యుల శాతం యెక్కువ కావాలని ప్రభుత్వం ఆత్రుత చెందుతున్నది. అయితే దారిద్ర్యం కారణంగా తల్లిదండ్రులు తమ పిల్లలను విద్యాభ్యాసానికి కొన్ని గంటలైనా విడవలేకుండా వున్నారు. ఆర్థిక పరిస్థితికారణంగా 8,9 సంవత్సరాల వయసుగల బాలబాలికలు కూడా కాయకష్టం చేసి రోజుకు 2 అణాలు సంపాదించి కుటుంబ ఆదాయానికి చేదోడుగా ఉంటారని నిరక్షరాస్యులైన తల్లిదండ్రులు వాదిస్తారు. యీ వాదన కొంతవరకు సమర్ధనీయమే కావచ్చు. అయితే బాలబాలికలకు విద్యా సౌకర్యాన్ని కల్పించి తద్వారా దేశ భవిష్యత్ శిక్షిత పౌరులుగా తయారు చేసే అంతిమ బాధ్యత ప్రభుత్వంపై ఉండడంవల్ల తల్లిదండ్రుల వాదన ప్రభుత్వానికి సహేతుకంగా ఉండదు. అయితే తల్లిదండ్రుల ఆర్థికబాధ్యతను కొంతవరకైనా ఆముకోవడానికి పిల్లలకు కనీసం రోజుకు ఒక పూట భోజన సౌకర్యాన్ని ప్రభుత్వం కలిగించి తద్వారా తల్లిదండ్రుల అనుకూలతను సంపాదించాలి. రాష్ట్ర ప్రభుత్వం యీ విషయాన్ని గుర్తించి, రాష్ట్రంలో నిర్బంధ ప్రాథమిక విద్యా పథకాన్ని అమలు చేయుటతోపాటు ప్రాథమిక పాఠశాలలో అవసరమైన బాలబాలికలకు రోజూ ఒక పూట ఉచిత భోజనాన్ని సరఫరాచేసే కార్యక్రమాన్ని కూడా ప్రారంభించారు. యీ విధంగా తల్లిదండ్రుల సమ్మతి పొందడమేగాక, బాలబాలికలలో పాఠశాలలకు వెళ్ళే అలవాటును కలిగించడం జరుగుతున్నది.

1945_47 సంవత్సరాలలో రాష్ట్రంలో యెన్నిక చేసిన ప్రాంతాల్లో నిర్బంధ ప్రాథమిక విద్యాపథకాన్ని అమలు చేయడం జరిగింది. అంతేగాక యీ కేంద్రాలలో కొద్దికాలం పాటు మధ్యాహ్న భోజన పథకాన్ని కూడా ప్రవేశపెట్టారు. దీనివల్ల విద్యార్థులసంఖ్య పెరిగింది. పాఠశాలలకు వెళ్ళే విద్యార్థుల సంఖ్య పెరుగుతున్న కారణంగా అవసరమైనసంఖ్యలో ఉపాధ్యాయులనుగూడ నియమించాల్సి వచ్చింది. అయితే ఆర్థిక కారణాల దృష్ట్యా యీ పథకం అమలును ఉపసంహరించడం జరిగింది.

మూడవ పంచవర్ష ప్రణాళికా కాలంలో ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రం మొత్తంలో నిర్బంధ ప్రాథమిక విద్యా పథకాన్ని అమలు చేయడం ప్రారంభించారు.

నిర్బంధ ప్రాథమిక విద్యాపథకం అమలు పరిణామం మధ్యాహ్నభోజన పథకం అమలుపై ఆధార పడిఉంది.

మూడవ ప్రణాళికలోని రాష్ట్ర బడ్జెటులో యీ పద్దుక్రింద కేటాయించిన మొత్తం చాలాస్వల్పమైనది. ప్రజాస్వామ్య వికేంద్రీకరణ తర్వాత 959_60 సం॥ నుండి 1961_62 ఆఖరు వరకు మూడు సంవత్సరాలలో రాష్ట్ర ప్రభుత్వం రూ. 10.00 లక్షలు మాత్రమే దీనికై ఖర్చు చేసింది. యీ పథకం క్రింద 20,000 మందికి మాత్రమే లాభం కలిగింది.

కేర్ సంస్థ (అవసరమైన చోట్ల అమెరికా పౌరుల సహకారం)

మధ్యాహ్నభోజన పథకంవల్ల బాలబాలికలలో పాఠశాలలకు వెళ్ళే ఉత్సాహం కలుగుతుందనటంలో సందేహంలేదు. యీ ఉద్దేశ్యంతోనే కేర్ సంస్థ అందజేసే ఆహార పదార్థాలను (పాల పొడి, కాయధాన్యాలు, నూనె) స్వీకరించడానికి రాష్ట్ర ప్రభుత్వం ఆమోదించింది.

కేర్ సంస్థ దిగువ మొత్తాలలో ఆహార పదార్థాలను బహుమతిగా యిచ్చింది.

కాయధాన్యాలు	...	25,00,000 పౌండ్లు
పాలపొడి	...	25,00,000 ,,
నూనె	...	12,50,000 ,,

ఆంధ్రప్రదేశ్‌లోని నెల్లూరు, రాయలసీమ జిల్లాలు మినహా అన్ని ప్రాంతాల్లోని 2,00,000 మంది పాఠశాలల బాలబాలికలకు యివి అందజేస్తారు. నెల్లూరు, రాయలసీమ జిల్లాలకు యునిసెఫ్ సంస్థ సహాయం లభిస్తుంది. కేర్ సంస్థ సరఫరాచేసే పదార్థాలతో భౌతికమైన సంతృప్తి కల్గడమేగాక ప్రొఫెసర్ గాల్‌బ్రెత్ చెప్పినట్టు "కాలేకడుపుకు యేవిద్యా అవసరంలేదు. సాధారణమానవునికి కడుపునిండా తిండి దొరకటమే ముఖ్యమైన విషయం. లక్షల మంది బాల బాలికలకు కేర్ సంస్థ సహాయంతో భోజనం దొరుకుతుంది, దీనివల్ల విద్యాభ్యాసం సుకరమవుతుంది." యీ పథకంవల్ల పౌష్టికాహారం లభ్యం కావడమేగాక, బాల బాలికలకు వచ్చే అన్ని రకాల వ్యాధులను నివారించినట్టు అవుతుంది.

పథకం పురోభివృద్ధి

జిల్లా విద్యాధికారులందరూ యీ ఆహార పదార్థాలను స్వీకరిస్తారు. వీరు సమితులకు పంచుతారు. (విద్య) విస్తరణాధికారులు యీ మొత్తాలను ఆయా కేంద్రాలకు పంపిణీ చేస్తారు. ప్రజల సహకారం అందే మంచి సూచనలుకూడా ఉన్నాయి. ప్రజల విరాళాలు ప్రోత్సాహకరంగా లభిస్తున్నాయి. బాల బాలికలకు ఉద్దేశించిన యీ ఆహారం వారికే అందేటట్లు తగిన చర్యలు తీసుకుంటున్నారు. విద్యా శాఖ డైరెక్టరు కార్యాలయంలో కేర్‌సంస్థ కార్యక్రమాలలో ప్రతి కేంద్రాన్ని దర్శించడం, జిల్లా విద్యాశాఖాధికారులకు సహాయపడటం, ఆహారపదార్థాల రవాణాలో జాప్యం లేకుండా చూడడంవంటి విషయాలను చేర్చారు. 1962 సెప్టెంబరు వరకు అన్ని కేంద్రాలను ప్రారంభించడం జరుగుతుంది.

యునిసెఫ్

అంతర్జాతీయ బాలబాలికల అత్యవసర నిధి సహాయంతో పాఠశాలల బాలబాలికలకు ఆహారం సరఫరాచేసే సంస్థయిది. మధ్యాహ్న భోజన పథకానికి అనుబంధంగా యీ సంస్థ పాలపొడిని సరఫరా చేస్తుంది.

నెల్లూరు జిల్లా, రాయల సీమలోని కడప, కర్నూలు, చిత్తూరు, అనంతపుర జిల్లాలకు యీ పథకం క్రింద పాలపొడిని సరఫరా చేయడం జరిగింది. యీ పథకం అమలుకు పరిపాలనకు సంబంధించిన ఖర్చు రూ. 2.84 లక్షలు. జిల్లా పరిషత్తు డిప్యూటీ కార్యదర్శి (విద్య), డిప్యూటి ఇన్స్‌పెక్టర్లకు వీరు పాఠశాలా కేంద్రాలకు యీ ఆహార పదార్థాలను సరఫరా చేస్తారు.

యీ పథకాన్ని అమలు జరిపిన జిల్లాల సంఖ్య:— 5

సమితులు, సమితులులేని ప్రాంతాల సంఖ్య:— 119


యీ పథకాన్ని అమలు జరిపిన గ్రామాలసంఖ్య:. 2405

యీ పథకాన్ని అమలు జరిపిన పట్టణాల సంఖ్య:— 15

మునిసిపాలిటీలలోని 327 పాఠశాలలు.

మొత్తం 19 లక్షల పౌండ్ల పాలపొడిని సరఫరా చేయాల్సి ఉంది.

15,2000 మంది బాలబాలికలకు యీ పథకం వర్తిస్తుంది. సెప్టెంబరు నెల మధ్యభాగంలో ఆహార పదార్థాలను సరఫరా చేయడం జరుగుతుంది. అప్పటివరకూ అవసరమయిన మంజూరీ లభిస్తుందని ఆశిస్తున్నారు. యీ విధంగా రాష్ట్రంలో మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేయడం జరుగుతున్నది. తగిన సంరక్షణలేని పాఠశాలలకు వెళ్ళే బాల బాలికల శారీరక, మానసిక అస్వస్థలను పోగొట్టడమే యీ పథకం ఆశయం.



దేశంతోపాటు మీరుకూడా అభ్యుదయం పొందండి !

మీరు మిగుల్చుకున్న డబ్బును

భారత ప్రభుత్వ చిన్న మొత్తాల పొదుపు పథకమునకు పెట్టుబడి పెట్టండి !

భా ర త దే శం యొ క్క

సమాజాభివృద్ధి కార్యక్రమమునకు, గొప్ప నదీలోయ ప్రాజెక్టులకు, రైలుమార్గములు, రోడ్ల అభివృద్ధికి తోడ్పడండి !

మీ డబ్బును ఈ క్రింది ఆకర్షణీయమైన గ్యారంటీడ్ సెక్యూరిటీలలో దేనిలోనైనాడి: పెట్టుబడి పెట్టండి!

12 సంవత్సరముల జాతీయ ప్రణాళికా పొదుపు పత్రాలు

పరిణతి పొందిన పిమ్మట నూటికి సంవత్సరానికి 5.41 వంతుల చొప్పున వడ్డీ ఇవ్వబడుతుంది. ఇవి రూ. 5 లవి మొదలు రూ. 25,000 లవి వరకూ లభిస్తాయి. వ్యక్తిగతంగా ఒక్కొక్కరు రూ. 25,000 ల వరకూ కొనవచ్చు. రూ. 25,000 ల విలువ పత్రాలు ప్రావిడెంటు ఫండ్ పెట్టుబడులకు మాత్రమే.

10 సంవత్సరముల ట్రెజరీ సేవింగ్సు డిపాజిట్ సర్టిఫికెట్లు

ఏటా నూటికి 4 వంతులు వడ్డీ చెల్లించబడుతుంది. ఒక్కొక్కరు రూ. 50 లవి మొదలు రూ. 25,000 ల వరకూ కొనవచ్చు.

15 సంవత్సరాల యాన్యుయిటీ సర్టిఫికెట్లు

జారీ చేయబడు ధరలు : రూ. 1,330, రూ. 3.325, రూ. 6,650, రూ. 13,300, రూ. 26,600. ఈ సొమ్ము నూటికి యేడాదికి 4.25 కు కొంచెమెక్కువగా వచ్చే చక్రవడ్డీతోసహా నెలసరి వాయిదాలలో 15 సంవత్సరాలలో తిరిగి చెల్లించబడుతుంది. ఒక్కొక్కరురూ. 26,600 ల వరకూ కొనవచ్చు.

పోస్టాఫీసు సేవింగ్సు బ్యాంకు అకౌంట్లు

25 నుంచి 10,000 ల వరకు గల నిల్వలపై నూటికి 3 చొప్పున, రూ. 10,000 లకు మించిన నిల్వలపై నూటికి $2\frac{1}{2}$ చొప్పున వడ్డీ ఇవ్వబడుతుంది.

క్యూములేటివ్ టైమ్ డిపాజిట్ పథకం

నెలనెలా రూ. 5, 10, 20, 50, 100, 200, లేక 300 వంతున 5, 10 లేక 15 సంవత్సరాలపాటు డిపాజిటు చేస్తే, వడ్డీతోసహా మొత్తం అంతా ఒక్కసారే చేతికి వస్తుంది.

ఆదాయంపన్ను లేకుండా మీకు మంచి ఆదాయం లభిస్తుంది: భావిభారత సౌభాగ్యానికై పెట్టుబడి పెట్టండి;

ఈ పెట్టుబడులకు సంబంధించిన నిబంధనలను గూర్చి యితర వివరాలు మీకు చేరువగా వున్న పోస్టాఫీసు వద్దగాని రీజియనల్ డైరెక్టరు నేషనల్ సేవింగ్స్ 10-2-2, ఎ.సి. గార్డ్సురోడ్డు, హైదరాబాదు, లేక, మీ జిల్లా కలెక్టరు ఆఫీసులోని, జిల్లా ఆర్గనైజరు వద్దగాని తెలుసుకోవచ్చు.

పరీక్షలు: కొన్ని ఇటీవలి రీతులు

డాక్టర్ సి. బి. రావు ఎం.ఏ.

పరీక్షలనేవి ప్రాచీన కాలంనుంచీ ఆనవాయితీగా వస్తున్న విధానాలలో ఒకటి అయినందున, వీటిపై ఎన్ని విమర్శలు వచ్చినా ఇవి ఇంకా కొనసాగుతూనే వున్నాయి. బోధనా సామర్థ్యాన్ని, విద్యాసముపార్జనను పరీక్షలద్వారానిర్ణయించడం సరికాదనే అభిప్రాయంకొంతవరకు సరైందే. అయితే పరీక్షలు-పేర్లు, తేదీలు, లెక్కల వివరాలు మొదలైన అవసరమైన సత్యాలను జ్ఞాపకముంచుకోడానికి ఒక ఉత్తేజాన్ని కలిగిస్తాయి. అంతంత మాత్రపు పరిజ్ఞానాన్ని, ఒక నిర్దిష్ట పరిజ్ఞానంగా మార్చడానికి పరీక్షలు ఒక ఉత్తేజంగా పని చేస్తాయి. బోధన, విద్యాసముపార్జన ఫలితాని గ్రహించడానికి పరీక్షలు ఒక విధంగా తోడ్పడుతాయి.

థాండిఫోర్డ్ ("Educational Psychology" అనే తన గ్రంధంలో) పరీక్షల విషయంలో 'అతి విద్యాభ్యాసన' విధానాన్ని గురించి ప్రస్తావించారు. అభ్యసించిన దాని నిలకడ ఈ 'అతి విద్యాభ్యసన' స్థాయి మీద ఆధారపడి వుంటుంది. వ్రాత, వర్ణక్రమం (స్పెల్లింగ్) సామాన్య గణితం మొదలైన వాటి శక్తిసామర్థ్యాలు ఈ 'అతిఅభ్యసనం' వల్ల జీవితంలో అలాగే వుంటాయి. టైపు చేయడం, సైకిల్ త్రొక్కడం, కారు నడపడం వంటి యాంత్రిక నైపుణ్యం విషయంలోగూడా ఇదే జరుగుతుంది. ఈ విధంగా పరీక్షలు 'అతి అభ్యసన'కు తోడ్పడి, సత్యాలను శాశ్వతంగా మనకు జ్ఞాపకం ఉండేట్లు చేస్తాయి. కాని పరీక్షలు వ్రాసి డిగ్రీలు పొందిన వారిలో మళ్ళీ ఆ పరీక్షలు వ్రాసి డిగ్రీ సంపాదించుకోగలమనే విశ్వాసం చాలా తక్కువ మందికి వుంటుంది. ఇందుకు కారణం పరీక్షల సమయంలో వారు 'అతి విద్యాభ్యాసం' (Over learning) చేయకపోవడమే.

ప్రస్తుత పరీక్షలను గురించి పరిశీలిస్తే, వీటిలోని కొన్ని లోపాలు లెక్కకు తేలుతాయి. స్పెన్సర్ 1961లో ఇలా వ్రాశాడు: "ఒకసారి పరీక్షలో ఉత్తీర్ణత పొంది అందుకు చదవిన పుస్తకాలను ఒక ప్రక్కన పెట్టినతరవాత, అందులో చదివినదంతా త్వరలోనే మర్చిపోవడం జరుగుతుంది." ఈ విమర్శలకు పరీక్షకులు, పరీక్షలు ధ్యేయం. పరీక్షల విషయంలో తీవ్ర నిరసనం, విమర్శలుఉన్నాయి. ఈ పరీక్షలవల్ల కొందరు ప్రతిభగల విద్యార్థుల ఆరోగ్యం చెడిపోతుంది. కొందరి ఆరోగ్యం పూర్తిగా నాశనమైపోతుందని కొందరు అంటారు. పరీక్షలు కేవలం శక్తిని దుర్వ్యయం చేస్తాయని మరికొందరి అభిప్రాయం. ఇక పోటీ పరీక్షలలో లోపాలకు అంతులేదు. పరీక్షలు ఒక సాధనంగా గాక ధ్యేయంగా పరిగణించబడ్డవి. భౌతిక విజయాన్ని అమితంగా అంచనా వేయడం జరుగుతున్నది. అసలు పాఠ్య విషయంలో వీటిని నిర్లక్ష్యం చేసి ఎక్కడో మారుమూల వున్నవాటిపై ప్రశ్నలు వేయడం జరుగుతున్నది. విద్యార్థుల శక్తినిగాక వారి జ్ఞానాన్ని పరీక్షించే విషయాలకు ప్రాముఖ్యత ఇవ్వాలి. భారత దేశంలోని పరీక్షలను ఇతర దేశాలలోవాటిని గూర్చి తెలుసుకుంటే ఇవి విద్యపై తీవ్రమైన ప్రభావాన్ని తీసుకు వచ్చినట్లు తెలుస్తున్నది. 72 దేశాలనుంచి సమర్పించబడిన నివేదికలు ఆధారంగా పరీక్షల విచారణ సంఘం సమర్పించిన నివేదికలో ప్రస్తుత పరీక్షా విధానాలు పెక్కు దేశాలలోని విద్యా కార్యక్రమాలకు తీవ్రంగా అడ్డువస్తున్నాయని ముగింపులో తెలిపింది. విద్య యొక్క ప్రాథమికాశయాలకు హాని కలిగిస్తూ పరీక్షలో ఉత్తీర్ణతకు అనుచితమైన ప్రాముఖ్యం యివ్వడం కూడా పరీక్షల దుష్ఫలితాలలో ఒకటని అంతర్జాతీయ పరీక్షల కమిషన్ సూచించింది. పరీక్షలు విద్యార్థులలో మానసికాందోళనను కలిగిస్తాయనిఅంటారు. అందువల్ల సహజమైన ఉత్సుకతను ఆసక్తిని వారు కోల్పోతారు. తమ పేరు ప్రతిష్ఠలు పరీక్షల విజయాలమీద ఆధారపడి వుంటాయనుకొనే ఉపాధ్యాయులు వాటివల్ల మనోస్థైర్యాన్ని కోల్పోతారు. ఇంగ్లాండు, కెనడా, ఆస్ట్రేలియా దక్షిణాఫ్రికాలలోని పరీక్షా విధానాలు కూడా భారతదేశంలో వలెనే పెక్కు విమర్శలకు లోనయ్యాయి.

పరీక్షలలో లోపాలున్నాయంటే అవి వాటిల్లో అంతర్గత మైనవి కావు. ఆ లోపాలు పరీక్షల నిర్వహణకు సంబంధించినవి. పైన సూచించిన లోపాలను, దోషాలను తగ్గించడానికి పరీక్షలను ఇంకా సమర్థవంతంగా అనేక రీతులుగా నిర్వహించవచ్చు. పరీక్షల తీరు తెన్నులు సహజసంగా ఉండాలి. విద్యార్థులనుంచి సుదీర్ఘ మైన సమాధానాలను (తేలికైనవి) ఆశించే ప్రశ్నాపత్రం, క్లుప్తమైన సమాధానాల నాశించే దానికన్నా తక్కువ ప్రయోజన కారి అని అంటారు. సుదీర్ఘమైన సమాధానాలు విద్యార్థుల జ్ఞాపక శక్తిని, క్లుప్తమైన సమాధానాలు ఆలోచనా శక్తి, మొదలైన వాటిని వెల్లడిస్తాయి. అందువల్ల సృజనాత్మకమైన ప్రశ్నలకు క్లుప్త మైన సమాధానం ఇవ్వడం అనేది ఇటీవలి విధానం. అలాగే తేలిక ప్రశ్నలకివ్వవలసిన సమాధానవిషయాన్ని కూడా తగ్గించారు. క్లుప్తమైన సమాధానాల విషయంలో తప్పు సమాధానాల నిచ్చినందుకు శిక్షించడం ఉచితమైనదని సిఫార్సు చేయబడింది. ప్రతి విషయానికి సంబంధించిన మాదిరి ప్రశ్నా పత్రాలను ప్రమాణీకరించి పాఠశాలలకు అందచేయాలి. ఇక పోతే రెండవది పరీక్షలలో విశ్వాసం, నమ్మకంవుండాలి. పశ్చిమ దేశాలతో పోల్చి చూస్తే తేలికరకమైన పరీక్షలు విశ్వసింప దగ్గవి కావు. అందువల్ల వివిధలోపాలను పరిష్కరించడానికి సృజనాత్మకమైన (Objective questions) ప్రశ్నలే ప్రస్తుత విధానం. ఎంతో కాలానికి పరీక్షలు నిర్వహించటం కన్నా మధ్య మధ్య తరచుగా పరీక్షలు నిర్వహించటం కూడా అవసరం. మృదువుగా వుండే నరాలకు మానసికోద్రిక్తతను తగ్గించడానికి వీలుగా విద్యార్థులలో పరీక్షల వాతావరణం పరివ్యాప్తం అయ్యేట్లు చూడాలి. విద్యార్థుల విజయాన్ని లెక్క గట్టేటప్పుడు, పాఠశాలలలో ఆ విద్యార్థులకై తయారు చేయబడిన రికార్డులను కూడా పరిశీలించాలని పెక్కు ఉన్నత స్థాయి సంఘాలనొక్క చెప్పాయి. విద్యార్థి యొక్క జ్ఞానాన్ని, నైపుణ్యాన్నే గాక అతను సంఘంలో మెలగ గలడో లేడో, నలుగురితో కలిసిపోగలడో లేడో మొదలైన విషయాలపైగూడా పరీక్షలు నిర్వహించాలి. నిర్ణీత కాలంలో జరిగే పనికి, పాఠశాల రికార్డులకు ఇచ్చే ప్రాముఖ్యత మన పరీక్షల విధానంలోని ముఖ్య సంస్కరణ. దీనికి తోడు పరీక్షల పట్ల విద్యార్థులకు గల అయిష్టతను తెలుసు కోడానికి భౌతిక పరిస్థితులు చాలా వరకు తోడ్పడుతాయి.

విజ్ఞానానికి పరీక్షలు ఎన్నోవిధాల ఉపయోగిస్తాయి. వాటిని క్రింది విధంగా పేర్కొనవచ్చు. (అ) విద్యార్థుల దృష్టిలో (ఆ) ఉపాధ్యాయుల దృష్టిలో (ఇ) పాఠశాలల దృష్టిలో.

విద్యార్థుల దృష్టిలో : పరీక్షలు (1) బాలుల ఆలోచనాశక్తిని కేంద్రీకరించి, దాన్ని పెంపొందిస్తాయి, (2) విద్యార్థుల విజ్ఞాన పరిధిని పరీక్షిస్తాయి (3) ప్రశ్నలను అర్థంచేసుకోలేని, తగిన సమాధానాన్ని ఇవ్వలేని, పదజాలం తెలియని జ్ఞాన శూన్యులైన వారిని కనుగొంటాయి. (4) విద్యార్థులకు స్వంతంగా ఆయా విషయాలను సేకరించుకోడానికి (5) ప్రశ్నలకు విద్యార్థులు సమాధాన మివ్వడానికి (6) వారు నేర్చుకున్న దానిలో తప్పులను దిద్దుకోవడానికి (7) నిర్ణీత విషయంపై విద్యార్థి దృక్పథాన్ని పెంపొందించుకోవడానికి (8) నిర్ణీత విషయంలోని ముఖ్య లక్షణాలను విద్యార్థులు తెలుసుకోవడానికి (9) విషయాన్ని క్లుప్తీకరించడంలో విద్యార్థులకు సహాయ పడడానికి (10) పరీక్షలకు సిద్ధం కావడం ద్వారా ప్రోత్సహించడానికి (11) ముందు ఇంకా పరీక్షలలో ఉత్తీర్ణులవడానికి అభ్యాసాన్నివ్వడానికి ఉపయోగిస్తాయి. ఉపాధ్యాయుల దృష్టిలో : (1) ఉపాధ్యాయుడు తననుతాను పరీక్షించుకోడానికి ఉపయోగిస్తాయి. (2) ఒక తరగతి యొక్క సామర్థ్యాన్ని గుర్తించడానికి, ఆ తరగతిలో జరిగిన అభివృద్ధిని నిర్ణయించడానికి, (3) ముందు వచ్చే పాఠాలకుపయుక్తమయ్యే విషయాలను నిర్ణయించడానికి (4) పై తరగతులకు ప్రమోటు చెయ్యడానికి యోగ్యులను, అయోగ్యులను తెలుసుకోడానికి (5) వ్యక్తిగత బలహీనతలను, ప్రత్యేకతలను తెలుసుకోడానికి (6) ఒక తరగతి మరొక తరగతితో, ఒక పాఠశాలను మరొక పాఠశాలతో, ఒక ఉపాధ్యాయుడిని మరొక ఉపాధ్యాయునితో పోల్చడానికి (7) అంత వరకు నేర్పిన కోర్సులను సమీక్షించడానికి (8) నిర్ణీత విషయంపై మంచి అభ్యాసాన్ని సాధించడానికి (9) విద్యార్థుల విజ్ఞాన పరిధిని తెలుసు కోడానికి (10) విద్యార్థుల చదువులోని అలవాట్లను గ్రహించి వారి అభివృద్ధిని తెలుసుకోడానికి.

పాఠశాలల దృష్టి : (1) బృందాల మధ్య, వ్యక్తుల మధ్య పోటీని పెంపొందించడానికి (2) ప్రవేశాల ప్రాతిపదికను నిర్ణయించడానికి (3) విద్యార్థుల అభివృద్ధిని గురించి వారి తల్లిదండ్రులకు నివేదికలు పంపడానికి (4) విద్యార్థులకు విద్యా విషయకంగాను, వృత్తి పనులలో మార్గదర్శిగా వుండ డానికి.

పరీక్షలకు సంబంధించిన ఈ క్రింది కొన్ని విభజనలు పాఠకుల కుత్సాహాన్ని కలిగించవచ్చు. (1) పరీక్షలరీతి మౌఖి

కం. లిఖిత పూర్వకం(2) ఉద్దేశం. తెలివితేటల్ని లెక్కగట్టడం లేక సాధక బాధకాలను గుర్తించడం. లేక విద్యార్థి అభ్యసించినదాన్ని గుర్తించడం. (3) విధానం: (పాఠ్య విషయిక పరీక్ష వ్యాసం) మేధా శక్తిని పరిశీలించే పరీక్షలు కొత్త నమూనా లేక క్లుప్తమైన సమాధానాలుగల ప్రశ్నలు. (4) పరీక్షలు జరిపే కాలం దిన లేక వార లేక టెర్మినల్ లేక వార్షిక (5) స్కోరింగ్ విధానం: ప్రమాణీకరించిన, ప్రమాణీకరించని (6) అందుకు కావలసిన శక్తులు నాణ్యం, పరిమాణం, వేగం. ఖచ్చితమైన విధానం. (7) అవకాశం. లాంగ్వేజి సబ్జక్టులు; (8) కావలసిన మానసిక విధులు, కూర్పు పునశ్చరణ, గుర్తింపు. సమస్య పరిష్కారం (Problem solving) నిర్ణయం, గ్రహణశక్తి. గుణగ్రహణం. (9) అందుకు కావలసిన బాధ్యతారీతులు. (Alternate Response) లేదు-అవును పద్ధతి. బహుబాధ్యత (మంచి జవాబు, సరియైన జవాబు. సరిపోవడం.) పూర్తి. గుర్తింపు, లెక్కచేయడం, వ్యాసం.

అంతర్ పరీక్షలతోపాటు బాహ్య పరీక్షలకు సంబంధించి లాభ నష్టాలను గురించి కూడా కొంత ఆలోచించాలి. మొదటి రకం (External Examinations) పరీక్షలను పాఠశాలకు చెందని బయటి అధికారులు, రెండవరకం పరీక్షలను (Internal Examinations) పాఠశాలాధికారులు నిర్వహిస్తారు. బయట జరిగే పరీక్షల (External Examinations) విషయంలో ఉపాధ్యాయులు విద్యార్థుల దృష్టి వివిధ సబ్జక్టులకు సంబంధించిన మొత్తం విషయం మీద గాక పరీక్షలలో ఉత్తీర్ణులు కావడం మీదనే కేంద్రీకృతమై వుంటుంది. పరీక్షలలో ఉత్తీర్ణత సాధించడం అనేదే దృక్పథం కావడం వల్ల వివిధ రకాల అవాంఛనీయమైన సంఘటనలు జరుగుతాయి. ఈ లోపాన్ని ఇంటర్నల్ పరీక్షల ద్వారా పారద్రోలవచ్చు కాని ఆ పరీక్షల యోగ్యతలను కూడా భగ్నం చేసే కొన్ని శక్తులుంటాయి. ఇందువలన మన ముందు నిలిచే సమస్య మనం పెక్కుమంది ఉపాధ్యాయులు. విద్యార్థులతో మసలటం, వారి మానవ స్వభావం, నిర్ణయ విధానం విమర్శకు దూరం కాకుండా వుండదు. ప్రతి వ్యక్తి పరీక్షల సమైక్యతకు తోడ్పడితే పరీక్షలలోని దొసగులన్నీ నిర్మూలించవచ్చు.

ఈ రెండు రకాల పరీక్షలను కలపడం ప్రస్తుతం వివిధ స్థాయిలలో ఆమోదయోగ్యంగా కనుపిస్తున్నది. ఇంటర్నల్ పరీక్షలకు ఎక్కువ ప్రాముఖ్యత ఇస్తే యెక్స్టర్నల్ పరీక్షల లోపాలను కొంతవరకు తగ్గించవచ్చు. ఇంటర్నల్ పరీక్షలకు నూటికి 50 లేక 25 లేక ఎంత శాతం ప్రాముఖ్యత నివ్వాలనే విషయం ఇంకా తుది నిర్ణయం కాలేదు. కొందరు 50 శాతం కన్నా ఎక్కువ ప్రాముఖ్యత నివ్వాలని, మరి కొందరు 25 నుంచి 30 శాతంవరకు ఇవ్వాలని అభిప్రాయపడుతున్నారు. ఏమైనా ఈ విషయంలో సామాన్యాభిప్రాయాన్ని- ఒక వైపు టెర్మినల్ పరీక్షలలోని మార్కుల ద్వారాను, మరొకవైపు మౌఖిక పరీక్షలు, కాంపోజిషన్ల అభ్యాసాలు (సైన్సు సబ్జక్టుల విషయంలో ప్రాక్టికల్ పరీక్షలు కూడా) మొదలైనవాటి ద్వారా- తెలుసుకోవాలి. పరీక్షల భయాన్ని గనక విద్యార్థులలో దూరంచేస్తే ఇంటర్నల్ పరీక్షలు ఎంతో ఉపయోగిస్తాయి. పరీక్షలు మొదలైన వాటికి విద్యార్థులు సంసిద్ధులుగా వుండాలి. ఈ రెండవ విధానం విద్యార్థులు కొత్త విషయాలను తెలుసుకోడానికి, తమ అభివృద్ధిని అంచనా వేసుకోడానికి, తమ బలహీనతలను తెలుసుకొని కొత్త అనుభవాలను పొందడానికి తోడ్పడుతుంది. అంతేగాక అటువంటి పరీక్షలు తాము చెప్పినదానిని విద్యార్థులెంతవరకు గ్రహించారో ఉపాధ్యాయులు విద్యార్థులకు తెలియ చెప్పాలి. విద్యార్థికి విద్య నేర్పడంలో తామెంతవరకు కృతకృత్యులయ్యారో తెలుసుకోడానికి కూడా ఉపాధ్యాయులకు వీలు కలుగుతుంది. దిద్దిన సమాధాన పత్రాలను-తమ శక్తిని పెంపొందించుకోడానికి- విద్యార్థులకు తిరిగిఇచ్చివేయాలి. విద్యార్థులు సూచించిన తప్పొప్పులను ఉపాధ్యాయులు సరిదిద్దుకుంటే అది చాలా ఉత్తమమైంది. చివరిసారిగా విద్యార్థిని ప్రమోటుచేసే విషయంలోని విధానాలను తల్లి దండ్రులకు, విద్యార్థులకు ముందుగా తెలియచేయాలి. కూడా. నిర్ణీత కాలాలలో ప్రోగ్రెస్ కార్డులను ఇస్తే అందువల్ల విద్యార్థులలోను, తల్లి దండ్రులలోనూ సద్భావం యేర్పడుతుంది.

ఇంటర్నల్ పరీక్షలలో పాఠ్యవిషయకమైన ప్రశ్నలను తగ్గించాలి. మామూలుగా పాఠశాలలలో ఉపాధ్యాయులకు, విద్యార్థులకు మధ్య వుండే సన్నిహిత సంబంధాల ప్రభావం పరీక్షలపై పడుతుంది. ఇందుకు (Ojective type) పరీక్షలు ఒక పరిష్కారం. ఈ లోపాన్ని తొలగించడానికి ఆయాచుట్టు ప్రక్కల ప్రాంతాలలో గల ఇద్దరు ముగ్గురు ప్రధానోపాధ్యాయులతో ఒక కమిటీని వేసి ఈ పరీక్షలను నిర్వహించాలి. వివిధ సబ్జక్టుల ఇన్స్పెక్టరు వచ్చినపుడు పాఠశాలలో పరీక్షలను నిర్వహించి, సమాధాన పత్రాలను వారి పర్యవేక్షణ క్రింద దిద్దించాలి. అలా చేయడం వల్ల విద్యావిషయిక, పరిపాలనా విషయ దోషాలన్నీ కూడా సమసిపోతాయి.

20 వ శతాబ్దపు ప్రథమ దశాబ్దం నుంచీ కూడా పరీక్షలు చాలా క్లిష్టంగా వుంటున్నట్లు కనుపిస్తున్నది. ఒక్కొక విద్యార్థి యొక్క అర్హతను పరిశీలించడానికి (Essay type) వ్యాసాల రీతిలో వుండే పరీక్షలు అంత మంచివి కావని ముఖ్య పరిశోధనల వల్ల తెలుస్తున్నది. 1920 వరకు ఎన్నో రకాల పరీక్షలు వ్యాప్తిలో వున్నాయి. ఏమైనా ఈ కొత్తరకపు పరీక్షల విషయంలో శాస్త్రీయ దృక్పథం పెంపొందింది. అవి వ్యాస పరీక్షలకు (Essay examinations) మారుగా ఏర్పడినవికావు. మరొకవైపు. అవి విద్యాలక్ష్యాలకు తగిన సాధనాలు, అందువల్ల వ్యాస పరీక్ష, ఉపాధ్యాయుల గుర్తింపు మొదలైన వాటి ద్వారా అవి విద్యార్థులు సాధించిన దాన్ని ఒక చోట చేరుస్తాయి. పైన వివరింపబడిన పరీక్షలు (Objective Tests) అమెరికాలోను, కొంత వరకు ఇంగ్లాండులోనూ, ఇంకా ఇతర పశ్చిమ దేశాలలోను బహుళ వ్యాప్తిలో వున్నాయి. ఈ పరీక్షల బహుళ వ్యాప్తి గాక వివిధ దేశాలలో పరీక్షలను గురించి పునరాలోచిస్తున్నారు. ఈ పునరాలోచన వల్ల పరీక్షలకుగల రెండు ఆశయాలను వెల్లడిస్తుంది. (1) విలువ కట్టడం (Evaluation) (2) శిక్షణ (Guidance).

ఒక విద్యార్థి యొక్క ప్రతిభను నిర్ణయించడానికి పరీక్షలొక్కటే చాలవు. ఆ విద్యార్థి వివిధ దశలలోని రికార్డు కూడా అందుకు అవసరమవుతుంది. విద్యార్థుల అంతర్గత శక్తికి మించిన చిత్రణ విద్యార్థి శక్తిని గ్రహించడానికెంతో ఉపయోగిస్తుంది. పరీక్షలలో పెక్కు మంది తప్పడం మెలకువ గల శిక్షణ అవసరమని సూచిస్తుంది. విద్యా విధానం సాధన సామగ్రి విధానం వివిధ రకాల విద్యార్థులకు తగినట్లుగా వుండటం అవసరం. ప్రతి తరగతిలో ఏ విషయాన్ని ఏ ప్రమాణంలో ఏ విధానంలో బోధించాలో అన్న విషయాన్ని పరీక్షల విషయానికి సంబంధించిన సమగ్ర పరిశోధనలు సూచించాయి. జ్ఞాపక శక్తిని పరీక్షించే ప్రస్తుత విధానానికి బదులు విద్యార్థి యొక్క నిర్ణయ శక్తిని, గ్రాహ్య శక్తిని పరీక్షించే విధానాన్ని ప్రవేశపెట్టారు. అర్థం తెలీకుండా బట్టీ పట్టే విధానంబదులు సృజనాత్మక శక్తిని పెంపొందించే విధానాన్ని ప్రవేశపెట్టాలి. విద్యకు ముఖ్య సాధనాలైన విజ్ఞాన నైపుణ్యాలు ఈ కార్యక్రమాన్ని కొనసాగించడానికుపయోగిస్తాయి. విద్యా లక్ష్యాన్ని సాధించడానికి విలువ కట్టే నైపుణ్యం అటువంటిదే.

వ్యాస పరీక్షలో విషయపరిజ్ఞానంతో పాటు, కాంపోజిషన్, స్పెల్లింగు, చక్కని వ్రాత, శుభ్రత మొదలైనవి కూడా చేరి ఉంటాయి కాబట్టి విద్యార్థి ప్రతిభను కచ్చితంగా విలువకట్టడానికి వీలు ఉండదు. సమాధాన పత్రాల్ని వివిధ పరీక్షకులు పెక్కుసార్లు దిద్దిన తర్వాత అందులో ఎన్నో భేదాలున్నట్లు పలు పరిశోధనల వల్ల తెలుస్తున్నది. ఇందుకొక ఉదాహరణ: స్పెల్లింగ్ సరిగ్గా లేక, వ్రాత గజిబిజిగా వుండి కొంత విలువ వున్న ఒక సమాధాన పత్రానికి ఒకసారి నూటికి 50 మార్కులు ఇచ్చారు. అదే సమాధాన పత్రాన్ని చక్కని వ్రాతలో వ్రాసి, స్పెల్లింగ్ పొరపాట్లను దిద్ది, కొన్ని అసలు తప్పులనలాగే వుంచిన దాన్ని మళ్ళీ దిద్దించగా దానికి 70 మార్కులివ్వబడ్డాయి. ఇట్టి అవకతవకలు జరిగేది ఎగ్జామినర్ల అశక్తత వల్ల కాదు. పరీక్షావిధానం వల్లనే. ఎగ్జామినర్లలోని పాఠ్యవిషయకమైన (Subjective) అభిప్రాయం ఒక సహజమైన లోపం. మిగతా లోపాలు ఇవి: ప్రశ్నాపత్రం నిర్ణయించే వ్యక్తి పరిమితంగా ఉదాహరణలివ్వడం, నిర్ణయించిన ప్రశ్నలు ప్రశ్నాపత్రం నిర్ణయించే వ్యక్తి మీద ఆధారపడటం, ప్రశ్నలకిచ్చే తప్పుడు దండాన్వయం: స్థలాన్ని విద్యార్థులు అనవసరపు విషయంతో నింపటం, కలగా పులగంగా వ్రాసి అదృష్టం కోసం చూడటం. అయితే వ్యాస పరీక్షలో ఈ క్రింది లాభాలున్నాయి : (1) విషయానికి సంబంధించి వీలైనంత ఎక్కువ విషయం సేకరించడం జరుగుతుంది. (2) ఆ విషయంపై ఆలోచన పెరుగుతుంది. (3) వ్రాత, వేగం, భాష, శైలి, వర్గక్రమం మొదలైనవాటి ప్రతిభ పెంపొందుతుంది. (4) నిర్ణీత విషయాన్ని ఈ విషయానికి సంబంధించిన విమర్శతో సహా అర్థం చేసుకునే శక్తి అభివృద్ధి అవుతుంది. (5) ఒక పరీక్షలో పలురకాల ప్రశ్నాపత్రాలకు జవాబులివ్వడానికి, తయారు కావడానికి వీలుగా అవసరమైన సామర్థ్యం పెరుగుదలకు తోడ్పడుతుంది.

విశాల దృక్పథంతో చూస్తే (Essay Test, Objective Test) ఈ రెండు రకాల పరీక్షల యోగ్యతలు ఆమోదయోగ్యమైనవి. అయితే ఈ రెండింటిలోని లోపాలను ఈ రెంటిని కల్పటం ద్వారా సరిదిద్దవచ్చు. ఈ విధానం ప్రస్తుతం విశ్వల ప్రచారాన్ని పొందుతున్నది. ఈ రెండు రకాల పరీక్షల సమన్వయం సంవత్సరాలు గడిచిన కొద్దీ విశ్వలంగా వుండగలదు.

ద్వితీయ ప్రణాళికా కాలంలో విద్యాభివృద్ధి సంక్షిప్త పరిశీలన

డాక్టర్. వి. సి. వామనరావు

1951 వ సంవత్సరంలో ప్రారంభించి ఇప్పటికి మనం రెండు పంచవర్ష ప్రణాళికలను పూర్తిచేశాం. రెండవ పంచవర్ష ప్రణాళిక విద్యాభివృద్ధి రంగంలో నూతనశకాన్ని ప్రారంభించింది. ప్రణాళికను అమలు పరచడంలో మొదట ఎన్నో ఇబ్బందులను ఎదుర్కోవలసి వచ్చింది.

అవిభాజిత హైద్రాబాదు రాష్ట్రంలోని తొమ్మిది తెలంగాణా జిల్లాలతోనూ, పూర్వ ఆంధ్ర రాష్ట్రంలోని 11 జిల్లాల తోనూ 1956 నవంబరు ఒకటవ తేదీన ఆంధ్ర ప్రదేశ్ ఏర్పడింది. నూతన రాష్ట్రం అవతరించిన నాటికి ఈ రెండు ప్రాంతాలూ, విద్యాభివృద్ధి విషయంలో భిన్న భిన్నస్థాయిలలోవున్నాయి. పరిపాలనా నిర్వహణ విధానాలలో కూడా వీటి మధ్య తేడా వుంది.

1959 వ సంవత్సరంలో పంచాయతీ రాజ్య వ్యవస్థను ప్రవేశపెట్టడం జరిగింది. రెండవ పంచవర్ష ప్రణాళికా కాలంలో సంభవించిన అతిముఖ్యమైన సంఘటన ఇది. ఈ ప్రజాస్వామిక వికేంద్రీకరణ పథకంక్రింద రాష్ట్రాన్ని 445 పంచాయతీ సమితులు, 20 జిల్లా పరిషత్తు ప్రాంతాలక్రింద పునర్నిర్మించారు. పంచాయతీ సమితులు జిల్లా పరిషత్తుల ప్రాతిపదికపై రాష్ట్రం పునర్నిర్మించబడటంతో ఆయా పంచాయతీ సమితులు, జిల్లా పరిషత్తుల పరిధులలోని ఎలిమెంటరీ పాఠశాలలు, ప్రభుత్వ నిర్వహణక్రిందవున్న సెకండరీ పాఠశాలలన్నీ కూడా ఆయా స్థానిక సంస్థలకు అప్పగించడం జరిగింది. ఎలిమెంటరీ విద్య విషయంలో విస్తరణాధికారిగా పనిచేసే నిమిత్తం 445 బ్లాకులకూ సాంఘిక విద్యా కార్యకర్తలతోపాటు ఒక్కొక్క పాఠశాలల డిప్యూటీ ఇన్‌స్పెక్టరును మంజూరుచేశారు. ఇరవై జిల్లా పరిషత్తులకూ ఒక్కొక్కటి చొప్పున ఇరవై ఉపకార్యదర్శి (విద్య) ఉద్యోగాలను రాష్ట్రప్రభుత్వం మంజూరుచేసింది. ఈ నూతన వ్యవస్థవల్ల ఎలిమెంటరీ. సెకండరీ పాఠశాలలు ఒకే విధమైన అధికారం వహించడానికి వీలుకలుగుతుంది. విద్యాభివృద్ధి విషయంలో స్థానికప్రజలు స్వయం సహాయానికి పూనుకోడానికి, చొరవతీసుకోడానికి విస్తృతంగాఅవకాశాలు ఏర్పడతాయి.

ఉపాధ్యాయుల జీతపుస్కేళ్ల సవరణ 1958 నవంబరు 1వ తేదీ నుంచి అమల్లోనికివచ్చింది. ఇది రెండవ పంచవర్ష ప్రణాళికా కాలంలో జరిగిన మరో ముఖ్య సంఘటన. ఈ కొత్త స్కేళ్ళ ప్రత్యేకత ఏమంటే వీటివల్ల ఆంధ్ర, తెలంగాణా ప్రాంతాలలో అన్ని మేనేజిమెంట్ల క్రిందవున్న పాఠశాలల్లో ఉపాధ్యాయులందరికీ ఒకే విధమైన జీతపుస్కేళ్లు మొదటిసారిగా వర్తింపులోకి వచ్చాయి.

శిక్షణ సౌకర్యాల విషయంలో తెలంగాణా ప్రాంతాలు చాలా వెనుకబడివున్నాయి. శిక్షణపొందిన ఉపాధ్యాయుల కొరతను తీర్చేవిషయంలో తగు సిఫార్సులుచేసే నిమిత్తం, 1958 వ సంవత్సరారంభంలో ప్రభుత్వం అప్పుడు విద్యాశాఖ డిప్యూటీ డైరెక్టరుగావున్న శ్రీ ఎల్. బుల్లయ్య. బి ఏ.(ఆనర్స్)బి. ఇ.డి. అధ్యక్షతన ఒక కమిటీని నియమించింది. ఈ కమిటీ సిఫార్సుల ననుసరించి ఆంధ్ర, తెలంగాణా ప్రాంతాలలో వరుసగా ఆరు 32 శిక్షణ పాఠశాలలను కొత్తగా తెరిచారు అందువల్ల రాష్ట్రంలోని శిక్షణ కళాశాల లన్నింటిలోనూ శిక్షితుల సంఖ్య 1957–58 వ సం. లో 6386 వుండగా 1960–61 వ సంవత్సరం నాటికి వారి సంఖ్య 13,782 లకు హెచ్చింది. శిక్షితులందరి స్టయిపండురేట్లను కూడా పెంచారు.

విజయనగరం ఎం. ఆర్. కళాశాల పార్ట్‌టైమ్ బి. ఇడి. కోర్సును ప్రత్యేక శిక్షణ కళాశాల క్రింద మార్చారు. తెలుగు, హిందీ పండితుల కొరకు ఒక్కొక్కటి చొప్పున కొత్తగా ప్రభుత్వ శిక్షణకళాశాలను హైద్రాబాదులో నెలకొల్పారు.

తెలంగాణాలోని పదహారు శిక్షణ పాఠశాలలకూ సుమారు రూ. 2.10 లక్షలు ఖర్చయ్యే భవననిర్మాణ పథకాలను మంజూరు చేశారు. బాలికల ప్రభుత్వశిక్షణ పాఠశాలను నెలకొల్పడానికై బేగంపేటలోని "కొత్తానివాస్"ను రూ. 2.41 లక్షలకు ప్రభుత్వం ఖరీదుచేసింది. ఆంధ్ర ప్రాంతంలో మూడు బేసిక్ శిక్షణ పాఠశాలలకు భవనాలను నిర్మించారు. ఏలూరు, మచిలీ పట్నంలలో ప్రస్తుతం బాలికల ప్రభుత్వ శిక్షణ పాఠశాలలు నెలకొల్పబడిన భవనాలను ప్రభుత్వం స్వాధీనం చేసుకున్నది. పెంటపాడులో పోస్టు గ్రాడ్యుయేటు బేసిక్ శిక్షణ కళాశాలకు, దాని అనుబంధ సంస్థలకు రూ. 2.27 లక్షల వ్యయంతో శాశ్వత భవనాలను నిర్మించారు.

కర్నూలు, వరంగల్, నెల్లూరులలోని ప్రభుత్వ శిక్షణ కళాశాలలకు రూ 11.99 లక్షల ఖర్చుతో శాశ్వత భవనాలను నిర్మించడానికి ఒక పథకాన్ని మంజూరుచేశారు.

ఆంధ్ర ప్రాంతంలోని శిక్షణ పాఠశాలలన్నింటిలోనూకలిపి 1962-63 వ సం. లో మొత్తం 4870 మందికి శిక్షణ లభించగలుగుతుంది. (అంతా కొత్తగా చేరేవారే) అదే విధంగా తెలంగాణా ప్రాంతంలోని శిక్షణ పాఠశాలల్లో 2400 మంది కొత్తగా చేరే అభ్యర్థులకూ, 2000 మంది ఉపాధ్యాయ ఉపాధ్యాయులకూ శిక్షణ లభిస్తుంది.

రాష్ట్రాల పునర్నిర్మాణం జరిగి నూతన రాష్ట్రం అవతరించిన తరువాత ఏర్పడిన ప్రత్యేక పరిస్థితి ఏమంటే ఈ రాష్ట్ర బడ్జెట్లలో విద్యాభివృద్ధికి ఇతోధిక మొత్తాలను కేటాయిస్తున్నారు. వివిధ సంవత్సరాలలో విద్యాభివృద్ధికి జరిగిన బడ్జెటు కేటాయింపుల వివరాలు దిగువ పేర్కొనబడినాయి.

1956-57	...... రూ.	9,36,78,500
1957-58	...... రూ.	11,29,95,400
1958-59	...... రూ.	12,03,62,000
1959-60	.. ... రూ.	14,70,85,300
1960-61	...... రూ.	15 40,16,000

రాష్ట్ర రెండవ ప్రణాళిక వ్యయం రూ. 175.37 కోట్లు కాగా దీనిలో రూ 12.80 కోట్లు (7.3 శాతం) విద్యాభివృద్ధికి (సాంకేతిక విద్యతోసహా) కేటాయించారు. ఈ మొత్తంలో ప్రత్యేకంగా సాధారణవిద్యకు కేటాయించినది రూ. 10.43 కోట్లు

ఎలిమెంటరీ విద్య

ప్రస్తుత మన దేశ పరిస్థితి దృష్ట్యా ఎలిమెంటరీ విద్యావ్యాప్తికిగల ప్రాముఖ్యతను ప్రత్యేకంగా పేర్కొనవలసిన అవసరము లేదు. 1955-56 వ సంవత్సరంలో ఎలిమెంటరీ పాఠశాలల (మొదటి తరగతి నుంచి అయిదవ తరగతి వరకు) సంఖ్య 28,527 వుండగా, 1960-61 లో నాటి సంఖ్య 34534 కు పెరిగింది. అదే విధంగా వీటిలో చేర్చుకున్న విద్యార్థి విద్యార్థినుల సంఖ్య కూడా 23.59 లక్షల నుంచి 29.75 లక్షలకు హెచ్చింది. మాధ్యమిక పాఠశాలల సంఖ్య కూడా 281 నుంచి 1041 కి పెరిగి వీటిలో ప్రవేశాల సంఖ్య 46000 వరకు హెచ్చింది. రాష్ట్రంలోని రెండు ప్రాంతాలలోనూ రెండు నిర్ణీత ప్రదేశాలలో ఎలిమెంటరీ పాఠశాలల్లో సైన్సు బోధన అభివృద్ధికై ఒక పైలెట్ పథకాన్ని అమలు పరిచారు. విద్యావంతులైన నిరుద్యోగుల సహాయ పథకం క్రిందా, ఎలిమెంటరీ విద్యా విస్తరణ కార్యక్రమం క్రిందా 1960-61 సంవత్సరాంతం నాటికి 4740 మంది ఉపాధ్యాయులను నియమించారు.

1958-59 విద్యా సంవత్సరం ముగింపు వరకు ఆంధ్ర, తెలంగాణా ప్రాంతాలలో పాఠశాల విద్యా బోధన జరిగే కాలం దిగువ విధంగా 12 సంవత్సరాలు :-

లోయర్ ఎలిమెంటరీ లేదా ప్రాథమిక దశ (మొదటి తరగతి నుంచి అయిదవ తరగతి వరకు) — 5 సంవత్సరాలు

హయ్యర్ ఎలిమెంటరీ లేదా లోయర్ సెకండరీ లేదా మాధ్యమిక పాఠశాల దశ (ఆరవ తరగతి నుంచి ఎనిమిదవ తరగతి వరకు) — 3 సంవత్సరాలు

హయ్యర్ సెకండరీ దశ (తొమ్మిదవ తరగతి నుంచి 12 వ తరగతి వరకు) — 4 సంవత్సరాలు

పాఠశాల విద్యా బోధన కాలాన్ని 12 సంవత్సరాల నుంచి 11 సంవత్సరాలకు తగ్గించడానికి ప్రభుత్వం నిశ్చయించింది. తగ్గించ బడిన ఈ విద్యాబోధన కాలంలో రెండు భాగాలుంటాయి మొదటిది ఏడు సంవత్సరాల సమీకృత ఎలిమెంటరీ విద్యాదశ. రెండవది నాలుగు సంవత్సరాల సెకండరీ విద్యాదశ 1959-60వ సంవత్సరం నుంచి మొదటి తరగతిలో ప్రవేశం లభింప జేయ

దానికి విద్యార్థి కనీస వయః పరిమితిని అయిదు సంవత్సరాలకు నిర్ణయించారు. ప్రవేశం జరిగే సంవత్సరం అగస్టు 15 వ తేదీ వరకు వయస్సును లెక్క కడతారు.

ఏడు సంవత్సరాల సమీకృత కోర్సుకు రూపొందించిన నూతన ప్రణాళికల విశేషమేమంటే, అవి ఒకే ఒక మార్పు తప్ప బేసిక్, నాన్ బేసిక్ పాఠశాలలు రెండింటికీ ఒకే విధంగా వుంటాయి. బేసిక్ పాఠశాలల్లో కార్యకలాపాల ప్రాతిపదికపై విద్యా బోధన జరగ్గా నాన్ బేసిక్ పాఠశాలల్లో సంప్రదాయకమైన పద్ధతులలో ఇది జరగడమే ఈ మార్పు.

తృతీయ ప్రణాళికా కాలంలో నిర్బంధ విద్యా విధానాన్ని ప్రవేశపెట్టడానికి ముందు భారత ప్రభుత్వం, రాష్ట్రీ ఎడ్యుకేషన్ సర్వే అధికారి సూపర్ వైజరీ అధికారితో విద్యా విషయక భోగట్టా సేకరణ విభాగాన్ని మంజూరు చేసింది. ఈ విభాగం, 1957 ఏప్రిల్ ఒకటవ తేదీ నుంచి విద్యాశాఖ డైరెక్టరు కార్యాలయంలో పని ప్రారంభించింది.

1961 వ సం. లో నిర్బంధ ప్రాథమిక విద్యా చట్టాన్ని ఆమోదించారు. ఈ చట్టం నిబంధనల క్రింద, నిర్బంధ విద్యా విధానం 1961–62 వ సంవత్సరం నుంచి 6–7 సంవత్సరాల మధ్య వయస్కులైన వారితో ప్రారంభించి ఐదు సంవత్సరాలలో 6–11 సంవత్సరాల మధ్య వయస్కులైన వారికి వర్తింప జేయబడుతుంది.

బేసిక్ విద్యను, ప్రాథమిక స్థాయిలో జాతీయ విద్యా విధానంగా ఆమోదించారు. రాష్ట్రంలో జూనియర్ బేసిక్ పాఠశాలల సంఖ్య 1955–56 వ సం. లో 685 మాత్రమే వుండగా 1960–61 నాటికి వాటి సంఖ్య 2615 కు పెరిగింది. బేసిక్ విద్యా విషయాలకు సంబంధించిన కేంద్ర మదింపు సంఘం, ప్రస్తుత పాఠశాలలన్నింటినీ బేసిక్ విద్యా ప్రాతిపదికపై మార్చడానికి రెండు దశలలో దేశవ్యాప్తంగా కార్యక్రమాన్ని ప్రారంభించాలని సిఫార్సు చేసింది.

(1) పెద్దగా ఖర్చు లేదా పూర్తిగా బేసిక్ శిక్షణ పొందిన సిబ్బంది అవసరం లేనంత వరకు బేసిక్ విద్యా విధానాలను ప్రవేశ పెట్టడం, (2) పూర్తిగా బేసిక్ పాఠశాలల క్రింద మార్చడం. మొదటి దశను 1961–62 నాటికి పూర్తి చేయడానికి నిర్ణయించారు. ఇందుకు అయ్యే ఖర్చులో కొంత భాగం క్రింద ప్రణాళికలో 1960–61 వ సంవత్సరానికి తగు కేటాయింపు చేశారు. అనేక మంది ఉపాధ్యాయులకు, డిప్యూటీ ఇనస్పెక్టర్లకు ఓరియెంటేషను శిక్షణ ఇచ్చారు. తెలంగాణాలోని శిక్షణ పాఠశాలలన్నింటిలోను, ఆంధ్ర లోని 78 శిక్షణ పాఠశాలల్లో 40 పాఠశాలల్లోనూ బేసిక్ విద్యా విధానం అమల్లో వుంది. సీనియర్ బేసిక్ పాఠశాలల సంఖ్య 44 నుంచి 277కు పెరిగింది. పశ్చిమ గోదావరి జిల్లా పెంటపాడు, కృష్ణా జిల్లా తిరువూరులలో ప్రయోగాత్మకంగా రెండు పోస్టు గ్రాడ్యుయేటు బేసిక్ పాఠశాలలను ప్రారంభించారు. వాటి పురోగతిని పరిశీలిస్తున్నారు.

స్త్రీ విద్యా విషయంలో ఆంధ్ర ప్రదేశ్ వెనుక బడివుంది. శ్రీమతి దుర్గాబాయ్ దేశ్‌ముఖ్ అధ్యక్షతన 1958 సం. లో స్థాపించ బడిన జాతీయ మహిళా విద్యా సంఘం అనేక ముఖ్య సిఫార్సులు చేసింది. వాటిని అమలు పరుస్తున్నారు. వయోజన స్త్రీల కొరకు ప్రభుత్వ ప్రత్యేక పాఠశాలలను ఆరింటిని తెరిచారు. బీద స్థితిలో వున్న, వయోజన స్త్రీలు మూడు సంవత్సరాల పాటు సాధారణ విద్య ఉపాధ్యాయినుల శిక్షణను పొందడానికి ఈ ప్రత్యేక పాఠశాలలు అవకాశం కలిగిస్తాయి. శిక్షణ పొందే మహిళలకు నెలకు రూ. 30/– ల చొప్పున స్టయిపెండులు చెల్లిస్తున్నారు. రాష్ట్రంలోని అనేక శిక్షణ పాఠశాలలలో ఎలిమెంటరీ గ్రేడు శిక్షణను పునరుద్ధరించారు. కేవలం మహిళల కొరకు ఆరు ప్రదేశాలలో కొత్తగా శిక్షణ పాఠశాలలను తెరిచారు. ఉపాధ్యాయినుల నిమిత్తం అనేక పునశ్చరణ కోర్సులను నిర్వహించారు. మహిళా విద్యకై కేంద్రం తలపెట్టిన పథకాల క్రింద ఉపాధ్యాయినుల కొరకు 60 ఇండ్ల నిర్మాణాన్ని, విద్యావంతులైన నిరుద్యోగుల సహాయానికి ఉద్దేశించిన పథకం క్రింద మరో 491 ఇండ్ల నిర్మాణాన్ని రెండవ ప్రణాళికా కాలంలో చేపట్టారు. 10, 11 వ తరగతులలో చదువుతూ తమ సెకండరీ స్కూలు కోర్సు పూర్తి అయిన తరువాత ఉపాధ్యాయినుల శిక్షణ పొందడానికి అంగీకరించిన విద్యార్థినులకు నెలకు రూ. 20/– ల చొప్పున స్టయిఫండులు కూడా చెల్లించారు. మొదటి తరగతి మొదలు 8వ తరగతి వరకు విద్యార్థినులకు 1958–59, 1959–60 వ సంవత్సరాలలో రూ. 2.60 లక్షల మేరకు అటెండెన్స్ స్కాలర్‌షిప్పులు ఇచ్చారు. ఈ చర్యలన్నింటి ఫలితంగా, 1957–58 వ సం. లో 2720 వున్న ఉపాధ్యాయినుల శిక్షణ పొందుతున్న అభ్యర్థినుల సంఖ్య 1960–61 నాటికి 3493 కు పెరిగింది.

ప్రజాస్వామికమైన ప్రణాళికా విధానం దృష్ట్యా, ప్రభుత్వం సాగించే అభివృద్ధి కార్యకలాపాలలో ప్రజలు సమర్థంగా పాల్గొనడానికి గల అవకాశాలకు ఇతోధిక ప్రాముఖ్యత లభించింది. విద్యా

రంగంలో ప్రజా సహకారానికి అనేకమార్గాలున్నాయి. నూతన మార్గాలను అన్వేషించడానికై 1959–60 వ సం. లో పాఠశాలా భవనాల నిర్మాణానికి ఒక పథకాన్ని ప్రవేశపెట్టారు. దీని క్రింద రాష్ట్రంలోని 235 పంచాయతీ సమితి బ్లాకులకు ఒక్కొక్కదానికి రూ. 7,500 ల చొప్పున గ్రాంట్లు ఇచ్చారు. ఈ డబ్బును ఎలిమెంటరీ పాఠశాలల భవనాల నిర్మాణానికి ఖర్చు చేస్తారు. అయితే అందుకు స్థానికుల నుంచి ప్రతి పనికీ అయ్యే ఖర్చులో కనీసం మూడవ వంతు మేరకు ధన, వస్తు, శ్రమ రూపంలో విరాళాలు లభించాల్సి వుంటుంది. ప్రభుత్వ గ్రాంటు ప్రతి సందర్భంలోనూ భవనం ఒక్కింటికి రూ. 2,500 లకు పరిమితమై వుంటుంది. ఉచిత మధ్యాహ్న భోజన సరఫరా పథకం ఈ విధమైన మరో కార్యక్రమం. దీనిని కూడా ఇదే సంవత్సరం రాష్ట్రంలోని ఇరవై జిల్లాలలో మొదట ఒక్కొక్క నిర్ణీత సమితి బ్లాకులో ప్రవేశపెట్టారు. ఒక్కొక్క విద్యార్థికి ఒక పూట భోజనం పెట్టడానికి 16 నయాపైసలు ఖర్చవుతుంది. దీనిలో 12 నయాపైసలను ప్రభుత్వం భరిస్తుంది. మిగతా వ్యయాన్ని పంచాయతీలు, పంచాయతీ సమితులు, స్థానిక ప్రజలు భరించవలసి వుంటుంది. ఈ పథకాలు ప్రజాదరణ పొందాయి. ముమ్ముందు ఇతర మార్గాలలో ఇలాంటి సహకారం లభించడానికి ఇవి ఒరవడి పెట్టాయి.

సమాజాభివృద్ధి కార్యక్రమం ప్రారంభించబడటంతో గ్రామీణ ఉపాధ్యాయులకు నూతన బాధ్యతలు సంక్రమించాయి. గ్రామీణాభివృద్ధికి సంబంధించిన వివిధ విషయాలలో వారికి శిక్షణ గరిపే నిమిత్తం ఓరియంటేషన్ శిక్షణ పథకాన్ని రూపొందించారు. పౌరసత్వం, ప్రజారోగ్యం, గ్రామీణ పరిశ్రమలు, సమాజాభివృద్ధి కార్యక్రమం, పంచవర్ష ప్రణాళికల లక్ష్యాలు, సాంఘిక విద్యా కార్యకలాపాలు, యువజన, మహిళ, శిశు సంక్షేమ కార్యకలాపాలు, బాలభటుల దళాల నిర్వహణ, ప్రథమ చికిత్స విధానాలలో ఈ పథకం క్రింద శిక్షణ ఇస్తారు. 676 మంది ఉపాధ్యాయులకు శిక్షణ గరిపారు. అందుకు రూ. 66,559.12 లు ఖర్చయ్యాయి.

ఎలిమెంటరీ పాఠశాలల పాఠ్యపుస్తకాలను జాతీయం చేయాలన్న అభిప్రాయాన్ని పూర్వ ఆంధ్రప్రభుత్వంచే 1954 వ సంవత్సరంలో నియమించబడిన ఎలిమెంటరీ విద్యా సంఘం మొదట వెలుబుచ్చింది. తరువాత ఒక నిపుణుల సంఘాన్ని నియమించడం జరిగింది. ఈ సంఘంవారు ఈ విషయాన్ని క్షుణ్ణంగా పరిశీలించి జాతీయకరణకు అనుకూలంగా కొన్ని సిఫార్సులు చేశారు. జాతీయకరణ పథకానికి సంబంధించిన వ్యవహారాలు చూడటానికి ప్రభుత్వం విద్యాశాఖ డైరెక్టరు కార్యాలయంలో ఒక ప్రత్యేకాధికారిని నియమించింది. ఈ పథకాన్ని ప్రారంభించిన 4 సంవత్సరాల స్వల్ప వ్యవధిలోనే నాల్గవ తరగతి సబ్జెక్టు పుస్తకాలు మినహా ప్రాథమిక తరగతుల పుస్తకాలన్నింటినీ (తెలుగు మీడియం) జాతీయం చేయడం జరిగింది.

జాతీయం చేసిన పుస్తకాలను అమ్మవేసే నిమిత్తం ప్రభుత్వం హైదరాబాదులో ప్రత్యేకంగా పాఠ్య పుస్తకాల ముద్రణశాలను నెలకొల్పింది. జాతీయం చేసిన కొత్త పాఠ్యపుస్తకాలతో పాటు ఇ. ఎస్. ఎల్. సి. టి. ఎస్. ఎల్. సి., ఎస్. ఎస్. ఎల్. సి. పబ్లిక్ పరీక్షల భాషల పాఠ్యపుస్తకాలను కూడా ఈ ముద్రణాశాలలో అచ్చు వేస్తారు. ఇప్పటి వరకూ ఈ పుస్తకాలను మామూలు ప్రభుత్వ ముద్రణశాలలో అచ్చొత్తించడం జరుగుతున్నది. మొదట ప్రతి డిప్యూటీ ఇనస్పెక్టరు రేంజిలోనూ, డైరెక్టరుచే అధికారిక ఏజెంటుగా నియమించబడిన పుస్తక విక్రేత ద్వారా జాతీయం చేసిన పాఠ్యపుస్తకాల పంపిణీ జరిగేది. ఇప్పుడీ పుస్తకాలను, పంచాయతీ సమితులు, జిల్లా పరిషత్తులు, మునిసిపాలిటీల ద్వారా సరఫరా చేసే విధానాన్ని ప్రవేశపెట్టారు.

తగు పాఠ్య పుస్తకాలను ఎన్నిక చేసే నిమిత్తం ప్రభుత్వం ప్రతి సంవత్సరం అడ్‌హాక్ కమిటీలను నియమిస్తుంది. ప్రభుత్వంచే నియమించబడిన అడ్‌హాక్ కమిటీ సిఫార్సుల ఆధారంగా ప్రభుత్వమే సెకండరీ పాఠశాలలకు పుస్తకాలను నిర్ణయిస్తున్నది.

ఈ విధంగా ప్రభుత్వం నిర్ణయించిన పుస్తకాలు మినహా మరేదైనా పుస్తకాన్ని ప్రవేశపెట్టే అవకాశం మేనేజిమెంట్లకు వుండదు. ఏదైనా సబ్జెక్టుకు ప్రభుత్వం పుస్తకాన్ని నిర్ణయించని పక్షంలోనే మేనేజిమెంటు ఆ సబ్జెక్టుకు మామూలు పద్ధతి ననుసరించి పుస్తకాన్ని నిర్ణయించడానికి వీలుంటుంది.

1959–60వ సంవత్సరాంతం నాటికి 43 ప్రీప్రైమరీ పాఠశాలలు పనిచేస్తున్నాయి. వాటిలో విద్యాభ్యాసం చేసే విద్యార్థులు 2839 మంది, ఉపాధ్యాయులు 95 మంది. (ప్రైమరీ పాఠశాలలు ఇంకా ఇతర పాఠశాలలకు అనుబంధ పరచబడిన నర్సరీ సెక్షనుల సంఖ్యను చేర్చలేదు)

పశ్చిమ గోదావరిజిల్లా పెంటపాడులో 1957–58వ సంవత్సరంలో ప్రీప్రైమరీ పాఠశాల ఉపాధ్యాయులకు ఒకశిక్షణపాఠశాలను తెరిచారు. తెలంగాణా ప్రాంతానికై 1959–60వ సంవత్సరంలో హైద్రాబాదులో కూడా ఒక శిక్షణ పాఠశాలను ప్రారంభించారు. ఈ

శిక్షణ పాఠశాలల్లో ఒక్కొక్క దానిలో ఏటా 40 మందికి ప్రవేశాలు లభిస్తాయి.

ఆంధ్రలోని నాలుగు జిల్లాలలో 4812 చదరపు మైళ్ళ మేరలో ఏజెన్సీ ప్రాంతాలు విస్తరించి వున్నాయి. ఏజెన్సీ ప్రాంతాలలోని గ్రామాల సంఖ్య 2000 1955_65 వ సం. లో వాటి జనాభా 4,56,552. ఈ జనాభాలో ఎక్కువమంది కొండజాతులవారు. ఈ ప్రాంతాల విద్యాభివృద్ధి ఈ శాఖ ప్రత్యేక సమస్య. 1959_60 వ సంవత్సరాంతంనాటికి ఈ ప్రాంతాలలో 665 ఎలిమెంటరీ పాఠశాలలు. 24 బోర్డింగ్ గృహాలు వున్నాయి.

ఏజన్సీ ప్రాంతాలలో విద్యాభివృద్ధికి సంబంధించిన ప్రత్యేక కార్యక్రమాలకై రెండవ ప్రణాళికాకాలంలో దాదాపు రూ. 17 లక్షలు ఖర్చు పెట్టారు. 1957_58 వ సంవత్సరంలో కాకినాడ కార్య స్థానంగా ఏజెన్సీ విద్యాధికారినీ, అయిదుగురు డిప్యూటీ ఇనస్పెక్టర్లనూ, అవసరమైన ఇతర సిబ్బందిని నియమించారు. ఈ ప్రాంతాలలో ఆరు ఉన్నత పాఠశాలలను, మూడు మాధ్యమిక పాఠశాలలను తెరిచారు. గిరిజన బాలలకు రూ. 5 లక్షల వ్యయంతో పుస్తకాలు, పలకలు, బట్టలు ఉచితంగా సరఫరా చేశారు. వీటివల్ల సుమారు 1,06,000 మంది పిల్లలకు లాభం కలిగింది. ఎలిమెంటరీ పాఠశాలలకొరకు ఒక్కొక్క దానికి రూ. 9,000 ల ఖర్చుతో 43 భవనాలు నిర్మించారు. కొత్తగా 60 ఎలిమెంటరీ పాఠశాలలను, రెండు ఆశ్రమ పాఠశాలలను తెరిచారు. సబ్సిడీపొందే ఏడు హాస్టళ్లను, ప్రభుత్వ ఉచిత భోజన గృహాల క్రింద మార్చారు. 5 ప్రభుత్వ హాస్టళ్లను కొత్తగా తెరిచారు.

తెలంగాణా ప్రాంతంలో ఏజెన్సీ అభివృద్ధికి సుమారు రూ. 3.50 లక్షలు ఖర్చుపెట్టారు.

సెకండరీ విద్య

స్వాతంత్ర్యానంతరం సెకండరీ విద్యా సంస్కరణ విషయంపై తీవ్రంగా ఆలోచన జరిగింది. భారత ప్రభుత్వం 1952 వ సంవత్సరంలో సెకండరీ విద్యా సంఘాన్ని నియమించింది. ఆ సంఘం మరుసటి సంవత్సరం తన నివేదిక సమర్పించింది. సెకండరీ విద్యను పునరుద్ధరించవలసిన అవసరాన్ని సంఘం నొక్కి చెప్పింది. స్వాతంత్ర్యానంతరం నూతన విద్యా లక్ష్యాల కనుగుణంగా పాఠ్య నిబంధనలలో చేసిన మార్పులననుసరించి ఈ రాష్ట్రంలో దిగువ విధానాలలో విద్యా వ్యవస్థను పునర్నిర్మించడానికి నిశ్చయించబడింది.

1. ఏడు సంవత్సరాల సమీకృత ఎలిమెంటరీ (బేసిక్) విద్య.

2. 4 సంవత్సరాల సెకండరీ విద్య. హయ్యర్ సెకండరీ పాఠశాలలు ఎన్నిక చేయని పద్ధతిపై విద్యా విషయాలలో బోధన జరుపుతాయి. బహుళార్థ సాధక పాఠశాలలు కామర్స్, టెక్నాలజీ. వ్యవసాయం లలిత కళలు మొదలైన వాటిలో కూడా అనేకమైన వివిధ కోర్సులలో శిక్షణ ఇస్తారు.

3. హయ్యర్ సెకండరీ పాఠశాల విద్య తరువాత ప్రథమ డిగ్రీకై మూడు సంవత్సరాల విశ్వ విద్యాలయ విద్య.

పాఠశాలలను హయ్యర్ సెకండరీ లేదా బహుళార్థ సాధక పాఠశాలలుగా పై స్థాయికి పెంచే కార్యక్రమం కొనసాగింది. 1960_61 వ సంవత్సరం ముగింపు నాటికి 47 పాఠశాలలను బహుళార్థ సాధక పాఠశాలలుగానూ, 93 పాఠశాలలను హయ్యర్ ఎలిమెంటరీ పాఠశాలలుగాను మార్చారు.

ఈ పునర్నిర్మాణ కార్యక్రమం సందర్భంగా ఎదుర్కొనవలసి వచ్చిన ముఖ్య సమస్య ఏమంటే, పై స్థాయికి పెంచిన పాఠశాలలకు యోగ్యతలుగల ఉపాధ్యాయులను సరఫరా చెయ్యటం ఇబ్బంది కరంగా పరిణమించింది. యోగ్యులైన ఉపాధ్యాయుల కొరతను తీర్చడానికి, సాధారణ సెకండరీ పాఠశాలలలో పని చేసే అనుభవం కల పట్టభద్రులైన ఉపాధ్యాయులకు పై స్థాయికి పెంచిన పాఠశాలలలో పని చేసే అవకాశం కలిగించడానికీ, ఈ శాఖ రాష్ట్రంలోని మూడు విశ్వ విద్యాలయాల సహకారంతో స్వల్ప వ్యవధి ప్రత్యేక సర్టిఫికెటు కోర్సులను నిర్వహించింది 1960_61 వ సంవత్సరాంతం వరకు 582 మంది ఉపాధ్యాయులు ముఖ్యమైన సబ్జెక్టులలోనూ, భాషలలోను ఈ సర్టిఫికెటు కోర్సులలో శిక్షణ పొందారు.

సెకండరీ విద్య పునర్నిర్మాణ కార్యక్రమం ఈ విధంగా కొనసాగుతుండగా, ఉన్నత పాఠశాలలలో సాధారణ విద్యా సౌకర్యాలను కూడా విస్తృతీకరించారు. 1955_56 లో ఉన్నత పాఠశాలలు 687 వుండగా 1960_61 నాటికి వాటి సంఖ్య 959 కు పెరిగింది. 9, 10, 11 వ తరగతులలో చదివే విద్యార్థుల సంఖ్య కూడా 1.81 లక్షల నుంచి 1.86 లక్షలకు హెచ్చింది. మాధ్యమిక పాఠశాల తరగతులతో సహా సెకండరీ పాఠశాలలన్నింటినూలో నిమమించ బడిన ఉపాధ్యాయుల సంఖ్య 15618 నుంచి 21986 కు పెరిగింది. రెండవ ప్రణాళికా కాలంలో భవనాలపై

రూ. 518367 లు, సాధన సామగ్రులపై రూ. 545912.25 లు ఖర్చు చేశారు. ఆంధ్ర ప్రాంతంలోని ఏడు ఎయిడెడ్ ఉన్నత పాఠశాలలను ప్రభుత్వం స్వాధీనం చేసుకున్నది. తెలంగాణా ప్రాంతంలో 252 ప్రభుత్వ పాఠశాలలలో ఎయిడెడ్ పద్ధతిలో నడుస్తున్న సెకండరీ తరగతులను కూడా ప్రభుత్వం తన పరం చేసుకున్నది.

బోధన స్థాయినీ, క్రమ శిక్షణను పెంపొందించడానికి అనేక చర్యలు తీసుకున్నారు.

ఆంధ్ర, తెలంగాణా ప్రాంతాలకు విడివిడిగా వున్న బోర్డుల స్థానే 1957 వ సంవత్సరంలో రాష్ట్రంమొత్తానికి ఒకే సెకండరీ విద్యా బోర్డును స్థాపించారు. తెలంగాణా ప్రాంతానికి ప్రాతినిధ్యం కల్పించే నిమిత్తం రాష్ట్ర విద్యాసలహా మండలిని పునర్నిర్మించారు.

ఎస్. ఎస్. ఎల్. సి. పబ్లిక్ పరీక్షా ఫలితాలు నిరాశా జనకంగా వుండటానికి గల కారణాలను పరిశీలించే నిమిత్తం 1958 వ సంవత్సరంలో శాసన మండలి సభ్యుడు డాక్టర్ ఏ. ఎల్. నారాయణ అధ్యక్షతన ఒక సంఘాన్ని నియమించారు. ఈ సంఘం చేసిన సిఫార్సులను పరిశీలించి వాటి విషయంలో తగు చర్యలు తీసుకోవడం జరిగింది. ఆంధ్ర, తెలంగాణా ప్రాంతాలలో వర్తింపులోనున్న విద్యా నియమావళులను సమీకరించి రాష్ట్రం మొత్తానికీ వర్తింపజేయడానికై ఒకే నియమావళిని రూపొందించే నిమిత్తం ఒక సంఘాన్ని నియమించారు.

భారతప్రభుత్వం 1958 వ సం.లో హైద్రాబాదులో కేంద్ర ఇంగ్లీషు విద్యా సంస్థను నెలకొల్పింది. ఈ సంస్థ 1961 మార్చి 31 వరకు 5 కోర్సులు నిర్వహించింది. ఈ రాష్ట్రానికి చెందిన 27 మంది ఉపాధ్యాయులు, పాఠశాలల్లో, కళాశాలల్లో ఇంగ్లీషు బోధనాస్థాయిని పెంపొందించుకోడానికై శిక్షణ పొందారు.

రాజమండ్రిలో 1957 అక్టోబరులో రాష్ట్ర విద్య వృత్తి, పనుల మార్గదర్శకసంస్థను నెలకొల్పారు. 1958 మార్చి 31 న దీనిని హైద్రాబాదుకు మార్చారు. రెండవ ప్రణాళికా కాలంలో ఈ సంస్థ మూడు నెలల ఉపాధ్యాయ సలహాదార్ల కోర్సునూ, 10 నెలల పూర్తి సమయం ఉపాధ్యాయ సలహాదార్ల కోర్సునూ, మూడువారాల కెరీర్ మాస్టర్ల కోర్సులను మూడింటిని నిర్వహించింది. అన్ని సెకండరీ పాఠశాలల్లో పనిచేసే ప్రధానోపాధ్యాయులకు, క్యుములేటివ్ రికార్డుల నిర్వహణ విధానాలలో శిక్షణ ఇచ్చే నిమిత్తం ఒక స్వల్పకాలిక శిక్షణకోర్సును కూడా ఇది నిర్వహించింది. బహుళార్థసాధక పాఠశాలల విద్యార్థులకై వృత్తిపనుల విషయాలపైన ప్రసంగాలను ఏర్పాటు చేయటంతోపాటు 11–16 సంవత్సరాల మధ్య వయస్కులైన వారికై ప్రాంతీయ భాషలలో, తెలివితేటలకు సంబంధించినమౌఖిక పరీక్షలను కూడా ఈ సంస్థ నిర్వహించింది. ప్రాంతీయభాషలో ఫిజికల్ సైన్స్, ఇంజనీరింగు విషయాలలో కూడా పరీక్షలను నిర్వహించారు. సలహాలు, మార్గదర్శకత్వాలపై బహుళార్థసాధక పాఠశాల లన్నింటికి పోస్టర్లు, చార్టులు, కరపత్రాలు మొదలైనవాటిని సరఫరాచేశారు. హయ్యర్ సెకండరీ, బహుళార్థసాధక పాఠశాలలన్నింటిలోనూ పేరంట్ టీచర్ సంఘాలను స్థాపించారు. బ్యూరో, ఉద్యోగ సాధక కేంద్రాల మధ్య సాన్నిహిత్యం నెలకొల్పారు. 1960 అక్టోబరులో హైద్రాబాదులో అఖిలభారత విద్య, వృత్తిపనుల మార్గ దర్శకసంస్థ పంచమ వార్షికోత్సవం జరిగింది.

రాష్ట్రంలో ప్రస్తుత విద్యా విధానాన్ని పరిశీలించి నూతన రీతుల దృష్ట్యా తగుసంస్కరణలను సూచించే నిమిత్తం ప్రభుత్వం 1959 జూలైలో విద్యాశాఖ డైరెక్టరు అధ్యక్షతన ఒక సంఘాన్ని నియమించింది. రాష్ట్రంలో ఒక పరీక్షా పరిశోధన సంస్థను తక్షణమే నెలకొల్పాలని ఈ సంఘం తన నివేదికలో సిఫార్సు చేసింది. సెకండరీ పాఠశాలల్లో ఎవాల్యుయేషను విధానాలూ, పరీక్షలు మొదలైనవాటిని గురించి నిరంతరం తెలుసుకోడానికి, సమీక్షించడానికి ఈ సంస్థ అవసరమని ఈ సంఘం అభిప్రాయపడింది. సెకండరీవిద్య విస్తరణ కార్యక్రమాల డైరెక్టరేటుతాలూకు కేంద్ర ఎవాల్యుయేషను విభాగం వారు అయిదు వారాలపాటు నిర్వహించిన శిక్షణకోర్సుకు హాజరుకావడానికి ఇద్దరు అధికార్లను ఎన్నిక చేసి పంపారు.

ఎస్. ఎస్. ఎల్. సి. పబ్లిక్ పరీక్షల్లో జరిగే అవాంఛనీయ సంఘటనలకుగల పెక్కు కారణాలను గురించి పరిశీలించి వాటిని నివారించడానికి తీసుకొనవలసిన తగుచర్యలను సూచించేనిమిత్తం, 1958 నవంబరులో ప్రభుత్వం విద్యాశాఖ డైరెక్టరు అధ్యక్షతన ఒకసంఘాన్ని నియమించింది. ఈ సంఘం వారు తమ దర్యాప్తులను ముగించి 1959 మేలో నివేదిక సమర్పించారు. ఈ అవాంఛనీయమైన చర్యలను అరికట్టడానికి ఈ సంఘం సూచించిన విధానాలను అమలుపరిచారు.

సంస్కృతం ప్రధానబోధన విషయంగాగల పాత పాఠశాలలను ప్రాచ్యభాషా సెకండరీ పాఠశాలలుగా మార్చారు.

ఈ పాఠశాలలలో కొన్ని ఆధునిక విషయాల బోధనకు కూడా ఏర్పాట్లుచేశారు. ఈ విధంగా సంస్కృత విద్యాభివృద్ధికి ప్రోత్సాహం లభించింది. 1955–56 వ సం. లో ఈ సంస్థల సంఖ్య 59 వుండగా 1960–61 నాటికి వీటి సంఖ్య 92 కు పెరిగింది. 1955–56 లో ప్రాచ్య భాషా పాఠశాలలూ, కళాశాలలపై రూ. 1.59 లక్షలు ఖర్చుపెట్టారు. కాగా 1960–61 లో వాటిపై రూ. 5.03 లక్షల ఖర్చు జరిగింది. ఈ ప్రణాళికా కాలంలో ప్రాచ్య భాషా కళాశాలల విద్యా విధానంలో ఎట్టి మార్పు జరగలేదు. అయితే ప్రాచ్యభాషా సెకండరీపాఠశాలల పాఠ్య ప్రణాళికలో మాత్రం మార్పులు జరిగాయి. ప్రారంభంలో ప్రధానభాష, ఇంగ్లీషు, ప్రాంతీయ భాష–పార్ట్ 1 లేదా మోడరన్ లాంగ్వేజ్, సాంఘిక శాస్త్రాల బోధనకు మాత్రమే అవకాశం వుండేది. ఈ విధానాన్ననుసరించి తొలి పబ్లిక్ పరీక్ష 1958 మార్చిలో జరిగింది. కాని ఈ సర్టిఫికెటు పొందేవారికి కూడా విశ్వవిద్యాలయ స్థాయిలో వైద్యం మొదలైనకోర్సులలో ప్రవేశంపొందడానికిఅర్హతకల్పించడానికై జనరల్ సైన్స్, సాధారణ (లేదా కంపోజిట్) గణితం, హిందీ భాషబోధనకు అవకాశం కలుగచేశారు. ఈ నూతనవిధానాన్ననుసరించి ప్రథమ పబ్లిక్ పరీక్ష 1961 మార్చిలో జరిగింది.

తెలంగాణా ప్రాంతంలో 1956 జనవరిలో కేంద్ర సంస్కృత విద్యా మండలిని స్థాపించడంతో సంస్కృత విద్యా వ్యాప్తికి ప్రోత్సాహం లభించింది. ఈ ప్రణాళికారంభంలో అయిదు సంస్కృత పాఠశాలలతో ఈ మండలిని స్థాపించారు. ఒక్కొక్క పాఠశాలకు రూ. 6000 ల చొప్పున సహాయం చేయడానికి ప్రభుత్వం వాగ్దానం చేసింది. ఈ ప్రణాళికాంతంనాటికి ఒక సంస్కృత కళాశాల 24 పాఠశాలలు ఏర్పడ్డాయి. ఉస్మానియా విశ్వవిద్యాలయం నిర్వహించే సంస్కృత ప్రవేశ పరీక్షకు కూర్చునే విద్యార్థులకు ఈ పాఠశాలలు శిక్షణ గరుపుతాయి. అంతేగాక ఇవి ఇంగ్లీషు, లెక్కలు మొదలైన సాధారణ విషయాలలో విద్యార్థులకు ప్రాతిపదిక పరిజ్ఞానం కూడా కలుగజేస్తాయి. ఈ పాఠశాలల్లో కొన్నింటిలో ఆగమాలు, వేదాలు మొదలైన వాటి బోధనకు కూడా ఏర్పాట్లు వున్నాయి.

సంస్కృత విద్యాభివృద్ధికై ప్రభుత్వం ఒక ప్రత్యేకాధికారిని నియమించింది. ఈయన విద్యా శాఖ డైరెక్టరు కార్యాలయంలో పనిచేస్తారు. ప్రాచ్య భాషా పాఠశాలలకు ఒక ఇనస్పెక్టరు కూడా నియమించబడినారు. సంస్కృత భాషాభివృద్ధికి కృషి చేస్తున్న బొంబాయి, హైద్రాబాదు సంస్కృత విశ్వ పరిషత్తు, ఉస్మానియా విశ్వవిద్యాలయపు సంస్కృత అకాడమీ, తదితర ప్రైవేటు సంస్థలకు రెండవ ప్రణాళికా కాలంలో రూ. 62,200 ల మేరకు సహాయక గ్రాంట్లు ఇచ్చారు.

జాతీయ విద్యా సౌధంలో విశ్వవిద్యాలయ విద్య అన్నిటికంటే పై అంతస్థు వంటిది. మన రాష్ట్రంలో మూడు విశ్వవిద్యాలయాలున్నవి. అవి ఇవి: ఆంధ్ర, శ్రీ వేంకటేశ్వర, ఉస్మానియా. వీటిలో ఉస్మానియావిశ్వవిద్యాలయం పాతది. హైద్రాబాదు నిజాం 1917 వ సం. లో జారీ చేసిన రాజ ఉత్తర్వు ద్వారా ఇది స్థాపితమైంది. ఇతర రెండు విశ్వవిద్యాలయాల చట్ట నిబంధనలననుసరించి రూపొందించిన ఉస్మానియా విశ్వవిద్యాలయ నూతన చట్టాన్ని ఆమోదించారు. ఈ కొత్త చట్టం 1959 ఫిబ్రవరి 2 వ తేదీ నుంచి అమల్లోకి వచ్చింది.

రెండవ ప్రణాళికా కాలంలో రాష్ట్రంలోని మూడు విశ్వవిద్యాలయాలూ, విస్తృతమైన అభివృద్ధి పథకాలను స్వయంగా చేపట్టాయి. విశ్వవిద్యాలయ గ్రాంట్ల సంఘం సాపనతో ఉపయుక్తమైన, ముఖ్యమైన చర్య తీసుకున్నట్లయింది. దీనివల్ల ఈ విశ్వవిద్యాలయాలకు ఆర్థిక సహాయం, సాంకేతికమైన మార్గదర్శకత్వం లభించడానికి వీలు కలిగింది. విశ్వవిద్యాలయాల నిర్వహణకై నిర్ణీత మొత్తాల మేరకు వార్షికంగా వాటికి లభింపజేసే గ్రాంట్లు కాక, రాష్ట్రంలోని మూడు విశ్వవిద్యాలయాలకు రాష్ట్ర ప్రభుత్వం రెండవ ప్రణాళికా కాలంలో వాటి అభివృద్ధి పథకాలను అమలుపరచడానికి రూ. 102.915 లక్షల మేరకు ఇచ్చింది. కళాశాల, విశ్వవిద్యాలయ విద్యా ప్రమాణాన్ని పెంపొందించడానికీ, దుబారాను తగ్గించడానికి విశ్వవిద్యాలయాలు అనేక చర్యలు గైకొన్నాయి. వీటిలో చాలా ముఖ్యమైనది పి.యు.సి., మూడు సంవత్సరాల డిగ్రీకోర్సులను ప్రవేశపెట్టడం. దేశం మొత్తంలో ఈ సంస్కరణను ఉస్మానియా విశ్వవిద్యాలయమే ప్రప్రథమంగా ప్రవేశపెట్టింది. ఈ పథకాన్ని అమలుపరచడానికి రెండవ ప్రణాళికా కాలంలో రూ. 1,26,10,000 ల ఖర్చును మంజూరు చేశారు. (అవృత్త వ్యయం రూ. 46,20,000/– అనావృత్త వ్యయం. రూ. 79,90,000/–).

రెండు సంవత్సరాల ఇంటర్మీడియేటు కోర్సును రద్దు చేయడం, ఒక సంవత్సరపు ప్రి. యు. సి. కోర్సు, మూడు సంవత్సరాల డిగ్రీ కోర్సులను ప్రవేశ పెట్టడం, ఇంగ్లీషు, ప్రాంతీయ భాషలు, ఐచ్ఛిక విషయాల పాఠ్య ప్రణాళికలను సవరించడం ఈ నూతన సంస్కరణ ప్రధానాంశాలు.

రెండవ ప్రణాళికా కాలంలో కొత్తగా అయిదు కళాశాలలను తెరవడం, 7 కళాశాలల నిర్వహణ భారాన్ని ప్రభుత్వం స్వీకరించడం జరిగింది. ఎయిడెడ్ కళాశాలలకు ప్రభుత్వ రేటులో మాత్రమే గ్రాంటు లభింపజేస్తున్నారు. రాష్ట్రంలోని వివిధ కళాశాలలలో పనిచేస్తున్న సిబ్బంది జీతపు స్కేళ్లలో చాలా వ్యత్యాసాలు వున్నాయి. కళాశాల సిబ్బందికి ప్రభుత్వం 1961 మార్చి మొదటి తేది నుంచి విశ్వ విద్యాలయ గ్రాంట్ల సంఘం సిఫార్సు చేసిన జీతపు స్కేళ్లను వర్తింప జేసింది.

ఆంధ్ర సహాయక గ్రాంట్ల నియమావళి నిబంధనల ననుసరించి ఆంధ్ర ప్రాంతంలోని ఎయిడెడ్ కళాశాలలు బోధన గ్రాంటుతో పాటు, సాధన సామగ్రి, భవనపు గ్రాంట్లను కూడా పొందడానికి అర్హత వుంటుంది. తెలంగాణా ప్రాంతంలో ఇలాంటి గ్రాంట్లకు సంబంధించి క్రమమైన నియమావళి లేవీ లేవు. ఆంధ్ర నియమావళులనే తెలంగాణా ప్రాంతానికి కూడా విస్తరింపజేశారు. రెండవ ప్రణాళికా కాలంలో రాష్ట్రంలోని ఎయిడెడ్ కళాశాలలకు సాధన సామగ్రి, భవనాల గ్రాంట్ల క్రింద రూ. 16,93,721 ల మొత్తం చెల్లించారు.

ఈ గ్రాంట్లు గాక, తెలంగాణా ప్రాంతంలో మూడు కొత్త ప్రైవేటు కళాశాలలకు, వాటి స్థాపన విషయంలో ప్రారంభ ఖర్చుల క్రింద ఒక్కొక్క దానికి రూ. 50,000 ల చొప్పున అడ్‌హాక్ గ్రాంట్లు చెల్లించడం కూడా జరిగింది. రాష్ట్ర ప్రభుత్వం ప్రతి కళాశాలకు, కళాశాల ప్రణాళిక గోష్ఠి నేర్పాటుచేసి అలాగే ఒక రాష్ట్ర ప్రణాళికా గోష్ఠి కార్యవర్గాన్ని నియమించింది. ఈ పథకం క్రింద రెండవ ప్రణాళిక ఆఖరు నాటికి రాష్ట్రంలో 32 కళాశాల ప్రణాళికా గోష్ఠులు ఏర్పడ్డాయి.

రాష్ట్రంలోని నాలుగు శిక్షణ కళాశాలలలో విస్తరణ సేవా శాఖలను స్థాపించారు. ఈ పథకం పరిధిలో దిగువ కార్యకలాపాలు వస్తాయి :—

(అ) సెకండరీ పాఠశాలల ఉపాధ్యాయులు, అధిపతులకోసం కోర్సులు, మహాసభలు, గోష్ఠులు, వర్కుషాపులు, శిబిరాలు ; (ఆ) డివిజను గ్రూపులు ; (ఇ) పాఠ్య విషయాలు, తత్సంబంధమైన పాఠశాల కార్యక్రమాలకు సలహాలు ; (ఈ) గ్రంథాలయ సౌకర్యాలు ; (ఉ) వృత్తి సంబంధమైన సామర్థ్యాన్ని పెంపొందించడం ; (ఊ) విద్యా విషయకమైన పర్యటన కార్యక్రమాలు ; (ఋ) ప్రదర్శనలు ; (ౠ) గ్రామీణ, సాంఘిక విద్యా ప్రణాళికలు వగైరా.

రాష్ట్రాల పునర్నిర్మాణం జరిగిన నాటికి, ఆంధ్రప్రాంతంలో సెకండరీ పాఠశాలల విద్యార్థులకు దిగువ పేర్కొన్న ఫీజు రాయతీలు, విద్యా నియమావళిలో నిర్దేశించిన కొన్ని ఆదాయ పరిమితులకు లోబడి వర్తింపులో వున్నాయి.

(1) నిమ్న జాతులు (1957–58 వరకు మాత్రమే వర్తించాయి) క్రైస్తవ మతం స్వీకరించిన నిమ్న జాతుల వారికి–రెండవ తరం వరకు.
(2) నిమ్న తెగలు (ఇతర మతాలు పుచ్చుకున్న వారితో సహా)
(3) కులాలు తెలియని అనాథులు.
(4) విముక్త జాతులు.
(5) ప్రాచ్య భాషా ఉన్నత పాఠశాలల్లో చదివే వారందరు.
(6) 6, 7, 8 వ తరగతులలోచదివే వారందరు (1956–57లో 6 వ తరగతికి వర్తింప జేసి తరువాత 1957–58 లో 7 వ తరగతి కీ, 1958–59 లో 8 వ తరగతికి కూడా వర్తింప జేశారు)

దిగువ తరగతులు, వర్గాలకు చెందిన విద్యార్థులకు సగం ఫీజు రాయతీలు :—

(1) వెనుకబడిన తరగతులు.
(2) ముస్లిములు
(3) బాలికలు
(4) ఉపాధ్యాయులు, ప్రభుత్వ నాన్ గెజిటెడ్ ఉద్యోగులు, గ్రామోద్యోగుల పిల్లలు

తెలంగాణా ప్రాంతంలో ప్రతి పాఠశాలకు కూడా దిగువ విధానంలో ఫీజు రాయతీలను మంజూరు చేయడానికి అనుమతించబడింది :—

	హైద్రాబాదు, సికింద్రాబాదు		జిల్లాలు	
	పూర్తి ఫీజు రాయతీ శాతం	సగం ఫీజు రాయతీ శాతం	పూర్తి ఫీజు రాయతీ శాతం	సగం ఫీజు రాయతీ శాతం
బాలుర పాఠశాలలు	15	30	20	40
బాలికల పాఠశాలలు	20	40	20	40

ఆంధ్రప్రదేశ్ అవతరణానంతరం కూడా ఫీజు రాయతీల విషయంలో తెలంగాణా ప్రాంతంలో లోగడ అమల్లో వున్న విధానాలనే అక్కడ కొనసాగించారు. ఇంతేగాక ఆంధ్ర ప్రాంతంలో అమల్లో వున్న దిగువ రాయతీలను కూడా తెలంగాణా ప్రాంతానికి వర్తింపజేశారు :

1. గ్రామోద్యోగుల పిల్లలకు విద్యారాయతీలు— 1957–58వ సంవత్సరం నుంచి

2. నాన్ గెజిటెడ్ ఉద్యోగులు, ఉపాధ్యాయుల పిల్లలకు విద్యారాయతీలు —1959–60 వ సం. నుంచి

3. 1959–60వ సం.నుంచి 6, 7, 8 వ తరగతులకు ఉచిత విద్యా పథకం. 1959–60 వ సంవత్సరంనుంచి 7 వ తరగతి విద్యార్థులకు కూడా పై ఫీజు రాయతీలన్నింటినీ వర్తింప జేశారు.

1956–57 వ సంవత్సరం నుంచి సెకండరీ పాఠశాలల్లో 6, 7, 8 వ తరగతులకు నెలకు రూ. 2.75 నయాపైసలచొప్పునా, 9 వ తరగతికి నెలకు రూ. 6/– ల చొప్పునా, 10 వ తరగతికి రూ. 6–50 న.పై. ల చొప్పునా, 11 వ తరగతికి రూ. 7/– ల చొప్పునా, 12 వ తరగతికి రూ. 8/– ల చొప్పునా ఫీజు రేట్లను స్థిరీకరించారు. ప్రత్యేక ఫీజుల వసూలుకు నిబంధనావళిని రూపొందించి, ఆంధ్ర, తెలంగాణాప్రాంతాలలోని సెకండరీ పాఠశాలలలో 1960–61 వ సంవత్సరం నుంచి దానిని అమల్లోనికి తెచ్చారు.

అన్ని విద్యా స్థాయిలలోనూ విద్యార్థులకు లభింపజేసే వివిధ స్కాలర్‌షిప్పులు గాక, విద్యా శాఖ డైరెక్టరు, ప్రతి సంవత్సరం దాదాపు రూ. 10,000 ల మేరకు "విక్టరీ స్కాలర్ షిప్పులు" ఇస్తారు. రెండవ ప్రపంచ యుద్ధంలో మిత్రదేశాల కూటమి సాధించిన విజయం జ్ఞాపకార్థం హైద్రాబాదు నిజాం ఏర్పరిచిన ధర్మ నిధిపై ఈ సొమ్ము వడ్డీగా లభిస్తుంది. ఈ స్కాలర్‌షిప్పులను ప్రధానంగా వృత్తి, సాంకేతిక కళాశాలం విద్యార్థులకు సంవత్సరంలో 10 నెలల పాటు నెలకు రూ. 20/–ల చొప్పున ఇస్తారు.

ఆంధ్ర ప్రాంతంలో 1956 నవంబరు మొదటి తేదీ నాటికి 102 బోర్డింగ్ గృహాలున్నాయి. రెండవ ప్రణాళిక ఆఖరుకు వాటి సంఖ్య 125 కు పెరిగింది. తెలంగాణా ప్రాంతంలో ప్రత్యేక గ్రాంటులు పొందే బోర్డింగ్ గృహాలు నాలుగు మాత్రం కలవు. ఈ ప్రణాళికా కాలంలో మరో రెండు బోర్డింగ్ గృహాలను తెరిచి, ఆంధ్ర ప్రాంతంలో వర్తింపులో వున్న నియమావళిననుసరించే వాటికి సహాయం లభింప జేశారు. జంటనగరాలలోని అనాథలైన ముస్లిమ్ పిల్లలకు తగు వసతి, విద్యా సౌకర్యాలను కల్పించే నిమిత్తంప్రభుత్వం హైద్రాబాదు నగరంలోని మూడు ముస్లిం అనాథ శరణాలయాలలోనూ ఒక్కొక్కదానిలో 100 మంది బాలురు, 50 మంది బాలికలకు ఒక్కొక్కరికి నెలకు రూ. 25/–ల చొప్పున గ్రాంట్లు మంజూరు చేసింది.

డైరెక్టరేటు

రెండవ ప్రణాళిక ఆరంభమైన తరువాత రాష్ట్రాల పునర్నిర్మాణం జరిగింది. దీనివల్ల నూతన రాష్ట్రంలో పరిపాలనా వ్యవహారాలను పూర్తి అదీనంలోకి తేవడానికి, అభివృద్ధి కార్యక్రమాలను కొనసాగించడానికి అనేక ఇబ్బందులు ఏర్పడ్డాయి. కొత్తగా సాంకేతిక విద్యా శాఖను ప్రారంభించి, ప్రభుత్వ సాంకేతిక పరీక్షల నిర్వహణతో పాటు అన్ని సాంకేతిక సంస్థలకు సంబంధించిన వ్యవహారాలను కూడా దీనికి అప్పగించారు.

విద్యా శాఖ డైరెక్టరు కార్యాలయంలో సాధారణంగా పని పెరగడం వల్ల సిబ్బందిని అనుమతించడంతో పాటు (సుమారు 10 అదనపు సెక్షన్లు) ప్రణాళికా పథకాలు శీఘ్రంగా అమలు జరగడానికి వీలుగా 1957–58 వ సం. లో ప్రణాళిక, గణాంకముల విభాగాన్ని నెలకొల్పారు.

తృతీయ ప్రణాళికలో నిర్బంధ ప్రాథమిక విద్యా పథకాన్ని ప్రవేశపెట్టడానికి అవసరమైన ప్రారంభ చర్యలు మొదలుపెట్టడానికి 1959 మేలో ఒక ప్రత్యేకాధికారినీ, కొంత సిబ్బందినీ నియమించారు. ఈ ప్రత్యేకాధికారి హోదాను 1960 డిసెంబరు 10 వ తేదీన డిప్యూటీ డైరెక్టరు స్థాయికి పెంపొందించారు.

పూర్వ హైద్రాబాదు వ్యవస్థ క్రింద గల ప్రాతిపదిక, సాంఘిక విద్యల ప్రత్యేకాధికారి కార్యాలయాన్ని 1959 డిసెంబరు 28 వ తేదీ నుంచి రద్దు చేశారు.

ఆంధ్ర ప్రాంతం నిమిత్తమై గుంటూరు కేంద్ర కార్య స్థానంగా మూడవ ప్రాంతీయ విద్యా శాఖ డిప్యూటీ డైరెక్టరు కార్యాలయాన్నీ, బాలికల పాఠశాలల ఇన్‌స్పెక్ట్రెసెస్ తృతీయ కార్యాలయాన్ని నెలకొల్పారు.

తెలంగాణా ప్రాంతంలో అదనంగా ఆరు జిల్లా విద్యా శాఖాధికార్ల కార్యాలయాలనూ, వరంగల్ కేంద్ర కార్య స్థానంగా రెండవ ప్రాంతీయ విద్యాశాఖ డిప్యూటీ డైరెక్టరు కార్యాలయాన్నీ, బాలికల పాఠశాలల ఇన్‌స్పెక్ట్రెసెస్ కార్యాలయాలను రెండింటినీ ప్రారంభించారు.

తెలంగాణాలోని జిల్లా విద్యాశాఖాధికార్లందరికీ పర్సనల్ అసిస్టెంట్లను నియమించారు.

తెలంగాణా ప్రాంతంలోని పాఠశాలల డిప్యూటీ ఇనస్పెక్టర్లకు 1958 వ సం.లో కార్యాలయాలను ఏర్పరిచారు.

తెలంగాణాలో అదనంగా 36 పాఠశాలల డిప్యూటీ ఇనస్పెక్టరు కార్యాలయాలను మంజూరు చేశారు. అదేవిధంగా ఆంధ్ర ప్రాంతానికి 67 ఉద్యోగాలను మంజూరు చేశారు.

ఎలిమెంటరీ విద్యావిస్తరణా, విద్యావంతులైన నిరుద్యోగులకు సహాయమూ చేసే పథకం క్రింద, ఆ పథకాన్ననుసరించి 1958 59 నుంచి తెరువబడిన ఏకోపాధ్యాయ పాఠశాలల నిమిత్తం 52 పాఠశాలల డిప్యూటీ ఇనస్పెక్టరు ఉద్యోగాలను, 40 పాఠశాలల జూనియర్ డిప్యూటీ ఇనస్పెక్టరు ఉద్యోగాలను మంజూరు చేశారు.

రాష్ట్రంలోని సబార్డినేటు ఇనస్పెక్టరేటు నంతటినీ పునర్వ్యవస్థీకరించి, ప్రతిబ్లాకుకూ ఒక కార్యాలయాన్నీ, పట్టణ ప్రాంతాలూ, ఆంధ్రప్రాంతంలోని ఉరుదూ పాఠశాలల కొరకు ప్రత్యేక కార్యాలయాలను ఏర్పాటు చేశారు.

విద్యాశాఖ డైరెక్టరు కార్యాలయావరణలో సుమారు రూ. 2,65,000ల వ్యయంతో కొత్తగా ఒక భవనాన్ని నిర్మించడానికి మంజూరీ లభించింది.

ముదలియార్ కమిషను చేసిన ఒక సిఫార్సు ననుసరించి 1959_60 లో ప్రభుత్వం, సైన్సు, లెక్కలు, తెలుగు, ఇంగ్లీషు, సాంఘిక శాస్త్రంలో అయిదుగురు సబ్జెక్టు ఇనస్పెక్టర్లను నియమించింది. సెకండరీ పాఠశాలలకు వెళ్లి ఆయా విషయాలను బోధించే ఉపాధ్యాయులకు సలహాలివ్వడం వీరి పని.

1953_54లో ప్రభుత్వం ఆంధ్రప్రాంతానికై, విద్యాశాఖ డైరెక్టరు కార్యాలయానికి అనుబంధంగా డిపార్టుమెంటల్ ఆడిట్ బ్రాంచి నొకదానిని ప్రత్యేకంగా ఏర్పరిచింది. ఆంధ్రప్రదేశ్ అవతరణానంతరం, ఎయిడెడ్ పాఠశాలలు, ప్రత్యేక పాఠశాలలు ప్రభుత్వ ఎయిడెడ్ కళాశాలల ఆడిటింగుకు సంబంధించిన ఈ విధానాన్ని 1960_61 నుంచి తెలంగాణా ప్రాంతానికికూడా విస్తరింప జేశారు.

సాంఘిక విద్య

సాంఘిక విద్యారంగంలో వయోజన విద్యావ్యాప్తికై ప్రధానంగా కృషిజరుగుతున్నది.

1955_56వ సం. లో రాష్ట్రంలో 2659 వయోజన విద్యా కేంద్రాలు వుండేవి. వాటిలో 77, 947 మంది చదివేవారు. జాతీయ విస్తరణ సేవ తదితర అభివృద్ధి పథకాలు వర్తింపులోలేని ప్రాంతాలలోగల వయోజన విద్యాకేంద్రాలన్నింటినీ 1956 ఆగస్టు 1వ తేదీనుంచి మూసివేశారు. సాంఘిక విద్యా కార్యకలాపాల విస్తరణ, రాష్ట్రంలో జాతీయ సేవా కార్యక్రమాలు వ్యాప్తి జెందడంపై ఆధారపడి వుంది. ఈ కార్యక్రమాలను ప్రారంభించినది లగాయతు 1960 మార్చి 21 వరకు సాంఘిక విద్యపై రూ. 70,58,162 లు ఖర్చుచేశారు. 1959_60లో రాష్ట్రంలో దాదాపు 7500 వయోజన విద్యా కేంద్రాలు పనిచేశాయి. 3,71,869 మంది వయోజనులు అక్షరాస్యులయ్యారు.

కొత్తగా అక్షరాస్యులైన వారికి ప్రయోజనకరమైన పుస్తకాలు మొదలైనవాటిని సిద్ధంచేసే నిమిత్తం 1957వ సం. లో రూ. 49,200ల వ్యయంతో కూడిన ఒక పథకాన్ని మంజూరుచేశారు. దీని క్రింద ఈ శాఖ 42 పుస్తకాలను సిద్ధం చేసింది.

వయోజన విద్యాతరగతులను, వయోజన విద్యా విధానాలలో శిక్షణపొందిన ఉపాధ్యాయులు నిర్వహిస్తున్నారు. ఇలాంటి శిక్షణను కృష్ణాజిల్లా పటమటలోని వయోజన పాఠశాల ఉపాధ్యాయుల ప్రభుత్వ శిక్షణ పాఠశాలలో ఇస్తారు. వయోజన పాఠశాలల్లో అక్షరాస్యులుగా చేయడానికి విద్యాబోధన నాలుగు నెలలపాటు జరుగుతుంది. కోర్సు ముగిశాక పరీక్ష జరిపి, కృతార్థులైన వయోజనులకు సర్టిఫికెట్లు బహూకరిస్తారు.

బ్లాకు స్థాయిలో సాంఘిక విద్యా కార్యకర్తలు, సాంఘిక విద్యా కార్యక్రమాలను నిర్వహిస్తారు. రాష్ట్రంలోని సాంఘిక విద్యా కార్యకర్తలకు జాబ్‌కోర్సులో శిక్షణ ఇచ్చారు. షెడ్యూల్డు, కొండజాతి ప్రాంతాలలో పనిచేయడానికి వారికి ప్రత్యేక శిక్షణ కూడా ఇచ్చారు.

1958వ సం. లో 754 మంది ఉపాధ్యాయులు, విశ్వవిద్యాలయ ఉపాధ్యాయులు సాంఘిక విద్యా కార్యకర్తలుగా శిక్షణ పొందారు. అంతేగాక 10 మంది జిల్లా విద్యాశాఖాధికార్లు, న్యూఢిల్లీలోని జాతీయ ప్రాతిపదిక విద్యా కేంద్రంలో శిక్షణ పొందారు.

పౌర గ్రంథాలయాలు

1960వ సం. లో ఆంధ్రప్రదేశ్ పౌర గ్రంథాలయచట్టాన్ని, ఆమోదించారు. ఈ నూతన చట్టం ప్రధానాంశాలు ఇవి:–

(1) పౌర గ్రంథాలయాలకు సంబంధించిన సమస్త విషయాలపై ప్రభుత్వానికి సలహాలిచ్చే అధికారం గల రాష్ట్రీ గ్రంథాలయ సంఘాన్ని నియమించడం; (2) పౌర గ్రంథాలయాలకు ప్రత్యేకంగా ఒక శాఖను నెలకొల్పడం; (3) ప్రతిజిల్లాకూ స్థానిక గ్రంథాలయ సంస్థను ఏర్పర్చడం. ఇవి చట్టబద్ధమైన సంస్థలుగా వుంటూ పౌర గ్రంథాలయాలను నిర్వహిస్తాయి. పరిగణించబడిన గ్రంధాలయాలకు సహాయం లభింపజేస్తాయి. తమ పరిధిలో గ్రంథాలయోద్యమ వికాసానికి సాధారణంగా బాధ్యత కలిగివుంటాయి. ప్రతి స్థానిక గ్రంథాలయసంస్థ గ్రంథాలయనిధికీ (1) ఆ సంస్థ పరిధిలో విధించబడే ఆస్తిపన్ను, ఇంటిపన్నులలో రూపాయికి నాలుగు మొదలు ఎనిమిది నయాపైసల వరకు వసూలు చేసే సుంకంద్వారా, (2) ఈ విధంగా వసూలయ్యే సుంకం మొత్తానికి తగ్గకుండా ప్రభుత్వం వార్షికంగా ఇచ్చే విరాళంద్వారా డబ్బు సమకూరుతుంది.

ఈ చట్ట నిబంధనల ననుసరించి, 1961 జనవరి మొదటి తేదీనుంచి పౌర గ్రంథాలయాలకు ప్రత్యేకంగా ఒక శాఖను ఏర్పరిచారు. ప్రస్తుతానికి విద్యాశాఖ డైరెక్టరే పౌర గ్రంధాలయ శాఖ డైరెక్టరుగా కూడా పనిచేస్తున్నారు. రెండవ ప్రణాళికాంతం నాటికి 21 జిల్లా కేంద్రగ్రంథాలయాలు, 209 శాఖా గ్రంథాలయాలు, 370 పుస్తక డిపాజిటు కేంద్రాలు, 1,061 సహాయక గ్రంథాలయాలు కలవు. 1960–61వ సంవత్సరంలో గ్రంథాలయ సుంకంగా రూ. 4.70 లక్షలు వసూలయ్యాయి.

దృశ్య, శ్రవణ విద్య

దృశ్య, శ్రవణ విద్యా పథకాన్ని మొదట అవిభాజిత మద్రాసు రాష్ట్రంలో 1948 వ సం. లో ప్రవేశ పెట్టారు. ఆంధ్ర ప్రదేశ్ అవతరణానంతరం, ఈ పథకాన్ని తెలంగాణా ప్రాంతానికి కూడా వర్తింపజేశారు. రాష్ట్రంలోని పాఠశాలలకు 60 రేడియోలను 15 ఛేపు రికార్డర్లను ఉచితంగా సరఫరా చేశారు.

విద్యాశాఖ డైరెక్టరు కార్యాలయంలో, 35 ఎం. ఎం. చిత్రాలనునిర్మించడానికీ, ఫొటోగ్రాఫిక్ ఫిల్ములు, కాగితాలు మొదలైన వాటి ప్రింటింగ్, డెవలపింగుకు ఒక ఫొటోగ్రాఫిక్ సెక్షన్ను కూడా నెలకొల్పారు.

వ్యాయామ విద్య

వ్యాయామ విద్య సహ పాఠ్య విషయంగా పరిగణించబడుతుంది. ప్రణాళికారంభంలో రాష్ట్రంలో ఒకేఒకఎయిడెడ్ వ్యాయామ విద్యాకళాశాల వుండేది. ప్రభుత్వ నిర్వహణక్రింద హైదరాబాదులో కొత్తగా ఒక వ్యాయామ విద్యా కళాశాలను తెరిచారు. ఇది రెసిడెన్షియల్ సంస్థ. దీనిలో స్త్రీ, పురుషులకు సహ శిక్షణ గరపుతారు. ఈ సంస్థలో (1) పట్టభద్రులకు డిప్లొమా కోర్సు, పి. యు. సి. ఉత్తీర్ణులైనవారికి, సెకండరీ గ్రేడు శిక్షణ పొందిన అభ్యర్థులకు హయ్యర్ గ్రేడు సర్టిఫికెటు కోర్సులలో శిక్షణ ఇస్తారు. ఏడుగురు ఇనస్పెక్టర్లు, ముగ్గురు ఇనస్పెక్ట్రెసెస్తో కూడిన వ్యాయామ విద్యా శిక్షణ ఇనస్పెక్టరేటు వుంది.

ప్రణాళికా కాలంలో యువజన సంక్షేమానికి విస్తృతమైన కార్యక్రమం కూడా అమలు జరిగింది. విద్యార్థులు, విద్యార్థులు కాని యువజనులకోసం రాష్ట్రీ యువజన సంక్షేమ మండలిని 1960–61లో ఏర్పరిచారు. భారత యువజన హాస్టలు సంఘానికి రాష్ట్రీ శాఖను స్థాపించారు. రాష్ట్రీ సంఘానికి 1959–60 లో రూ. 5,000 లనూ, 1960–61లో రూ. 9,3 0 లను మంజూరు చేశారు.

భారత్ సేవక్ సమాజ్ వారు అప్పుడప్పుడూ నిర్వహించిన యువజన, కార్మిక సేవా శిబిరాలలో అనేక మంది విద్యార్థులు పాల్గొన్నారు. "కాంపస్ వర్క్స్ ప్రాజెక్టు" పథకం క్రింద కొన్ని పాఠశాలలు భారత ప్రభుత్వం నుంచి గ్రాంట్లు పొందాయి.

భారత ప్రభుత్వం 1960–61వ సం. లో "జాతీయ శరీర దార్ఢ్య ఉద్యమాన్ని" ప్రారంభించింది.

హైదరాబాదులో 27.98 లక్షల వ్యయంతో క్రీడలకోసం ఒక స్టేడియంను నిర్మించే పనిని చేపట్టారు.

బాలభటులు, గైడ్లు

సమీకృత ఆంధ్రప్రదేశ్ భారత బాలభటులు, గైడ్ల సంస్థను 1957 ఫిబ్రవరి మొదటి తేదీన ఏర్పరిచారు. 1960–61వ సంవత్సరాంతంనాటికి బాలభటుల సంఖ్య 56,670, గైడ్లసంఖ్య 11,750, అధికార్లసంఖ్య 1,600 వుంది.

180 బాలభటుల శిక్షణ శిబిరాలు, 64 గైడ్ల శిక్షణ శిబిరాలు, 2 కమీషనర్ల శిక్షణ శిబిరాలు, 5 హిమాలయ ఉడ్‌బాడ్జ్ శిబిరాలు నిర్వహించబడినాయి. ఈ శిబిరాలలో మొత్తం 5,265 మంది స్కౌట్ మాస్టర్లు, 1,511 మంది గైడ్ కెప్టెన్లు శిక్షణ పొందారు.

1958 లో జరిగిన రాష్ట్ర జంబూరీకాక నాలుగు రాష్ట్ర రాలీ శిబిరాలు నిర్వహించబడినాయి. 1961 ఫిబ్రవరిలో రాష్ట్ర మంతటా గర్ల్‌గైడ్స్ స్వర్ణోత్సవాలు జరిగాయి. ఉత్సవాల ముగింపు రోజున హైద్రాబాదులో బాలభటులు, గైడ్ల బ్రహ్మాండమైన రాలీ జరిగింది. ప్రపంచ ప్రధాన గైడ్ లేడీ బాడెన్ పావెల్ దీనిలో పాల్గొన్నారు.

హైద్రాబాదు, విజయనగరం (సర్కార్లు) హార్సిలీకొండలు (రాయలసీమ) జీడిమెట్ల (తెలంగాణా) లలో నాలుగు శిబిరస్థలాలను నిర్మించడానికి రాష్ట్ర ప్రభుత్వ కేంద్రసంస్థకు 1957–58 లో రూ. 1,20 000 గ్రాంటు ఇచ్చింది. ఈ నాలుగింటి నిర్మాణమూ దాదాపు పూర్తి అయింది.

ఎన్. సి. సి., ఏ. సి. సి.

1948 జూలైలో జాతీయ కేడెట్ దళాల (ఎన్. సి. సి.)కు ప్రారంభోత్సవం జరిగింది. దీనిలో బాలికలు, సీనియర్, జూనియర్ అనే మూడు ముఖ్య విభాగాలున్నాయి. కాగా సీనియర్, జూనియర్ విభాగాలలో మూడు శాఖలు–సైనిక, నావిక, వైమానిక దళాలు–వున్నాయి. మామూలు సాయుధ దళాలలో మాదిరిగానే కేడెట్లకు అన్ని విషయాలలోనూ, ఆయుధాల వాడకం విషయంలోనూ శిక్షణ ఇస్తారు. గ్రామీణ ప్రజలకు ఉపయోగించే సాంఘిక సేవా కార్యక్రమాలను కూడా వారు చేపడతారు.

ఆంధ్రప్రాంతం నిమిత్తం ప్రత్యేకంగా ఒక ఎన్. సి. సి. సర్కిలు (కేడెటుదళాల 12వ సర్కిలు)ను ఏర్పరిచారు. దీని పరిధిలోకి రాష్ట్రమంతా వస్తుంది. రెండవ ప్రణాళిక ముగింపునాటికి యూనిట్ల సంఖ్య 42 వుంది. సీనియర్, జూనియర్ విభాగాలలో సైనిక, నావిక, వైమానిక శాఖలతో కలిపి వరుసగా 9816, 6705 మంది కేడెట్లు వున్నారు. సీనియర్ విభాగంలో 1035 మంది, జూనియర్ విభాగంలో 2920 మంది బాలికలు కూడా వున్నారు.

ఏ. సి. సి. ఒక స్వచ్ఛంద సంస్థ. పాఠశాలలకు వెళ్ళే అనేకమంది పిల్లలకు ప్రత్యేకమైన శిక్షణ కాకపోయినా సమర్థవంతమైన శిక్షణ ఇవ్వడానికి ఈ సంస్థను ఏర్పరిచారు.

1960–61 వ సంవత్సరం ఆఖరు నాటికి 821 పాఠశాలల్లో ఏ. సి. సి. దళాలు ఏర్పడ్డాయి. వీటిలో 1,14,781 బాలురు, 3,662 బాలికలు చేరారు. ఈ ప్రణాళికా కాలంలో 74 ఏ. సి. సి. సేవా శిబిరాలు, 65 శిక్షణ శిబిరాలు జరిగాయి. రెండవ ప్రణాళికలో ఏ. సి. సి., ఎన్. సి. సి. ల అభివృద్ధిపై రూ. 1,02,60,533 లు మొత్తం వెచ్చించారు.

హిందీ భాషా వ్యాప్తి.

సెకండరీ పాఠశాలా తరగతులన్నింటిలోనూ హిందీబోధన నిర్బంధంగా జరుగుతుంది. సమీకృత పాఠ్య ప్రణాళిక క్రింద తెలంగాణా ప్రాంతంలో 4,5 తరగతులకు హిందీని రెండవ భాషగా వుంచగా, ఆంధ్ర ప్రాంతంలో ఆ తరగతులకు ఈ భాషను ఐచ్ఛిక విషయకంగా వుంచారు.

తెలంగాణాలోని ప్రభుత్వ సెకండరీ పాఠశాలా గ్రంథాలయాలన్నింటికీ మాధ్యమిక పాఠశాల అయితే రూ. 400/–లు, ఉన్నత పాఠశాల అయితే రూ. 500/– విలువ చేసే హిందీ పుస్తకాలను సరఫరాచేశారు.

హిందీ భాషా వ్యాప్తికై హిందీ విద్యాధికారి ఉద్యోగాన్ని ఏర్పరిచారు. సెకండరీ పాఠశాలల్లో పనిచేసే ఉపాధ్యాయుల ప్రయోజనార్థం 14 గోష్ఠులను నిర్వహించారు. జిల్లాల వారీగా వక్తృత్వ పోటీలు జరిపి ఉత్తమమైన విద్యార్థులకు బహుమతులు ఇచ్చారు. రాష్ట్రానికి చెందిన సుప్రసిద్ధ పండితులు, హిందీ–తెలుగు భాషలపై 19 పరిశోధన వ్యాసాలను సిద్ధంచేశారు. హిందీ పాఠ్యపుస్తకాలలో ఉపయోగించడానికై శబ్ద సముదాయం ప్రమాణం విషయంలో పని చేయడానికి 1958–59 లో ప్రభుత్వం ఒక సంఘాన్ని నియమించింది.

హైద్రాబాదులోని దక్షిణభారత హిందీప్రచారసభ, హైద్రా

బాదు హిందీ ప్రచార సభలు, హిందీ భాషావ్యాప్తికై కృషిచేస్తున్న రెండు స్వచ్ఛంద సంస్థలు. ఇవి హిందీ విద్యాలయాలనూ, హిందీ ప్రేమీ మండలులను నడుపుతున్నాయి. వీటికి ప్రభుత్వ సహాయం లభిస్తుంది. ఈ ప్రణాళికా కాలంలో నిర్వాహణకై గ్రాంట్లు పొందిన ఇతర సంస్థలలో ఇవి కూడా చేరివున్నాయి. ఆదర్శ మహిళాసంస్థ, రాజమండ్రి: బాలికల హిందీ పాఠశాల, మచిలీపట్నం; హిందీ ప్రేమీ మండలి మహా విద్యాలయం, తెనాలి.

కళలు, సంస్కృతి

ప్రభుత్వం, రాష్ట్ర సాహిత్య అకాడమీ, రాష్ట్రసంగీత నాటక అకాడమీలను స్థాపించింది. రెండవ ప్రణాళికా కాలంలో ఈ రెండు అకాడమీలకు గ్రాంట్ల రూపంగా రూ. 2,77,000 లు చెల్లించారు.

తెలుగు భాషా సమితి, దక్షిణభాషా పుస్తక ప్రచురణసంస్థ, శాస్త్రవిజ్ఞానం, చరిత్రల, తెలుగు ఉరుదూ అకాడమీ మొదలైన అనేక ఇతర ప్రైవేటు సంస్థలకు గూడా ఆర్థిక సహాయం లభింపజేశారు.

టాగూరు శతజయంత్యుత్సవాల సందర్భంగా ప్రభుత్వం, రూ. 16.40 లక్షల వ్యయంతో హైద్రాబాదులో జాతీయ నాటకశాలను నిర్మించడానికి మంజూరు చేసింది.

ఉరుదూ, భాషాభివృద్ధి

తెలంగాణా ప్రాంతంలోని తొమ్మిది జిల్లాలలోనూ అధికార వ్యవహారాల నిమిత్తం ఉరుదూను ప్రాంతీయ భాషగా ప్రకటించారు. రెండవ ప్రణాళికా కాలంలో పెక్కు ఉరుదూ సంస్థలకు వార్షిక ఆవృత్త గ్రాంట్లు క్రింద రూ. 2,36,500 ల మొత్తం చెల్లించారు.

వికలాంగులకు పాఠశాలలు

రాష్ట్రంలో వికలాంగులైన పిల్లలకోసం ఎనిమిది పాఠశాలలున్నాయి. వీటిలో 1960 వ సంవత్సరంలో 384 మంది ప్రవేశం పొందారు.

హైదరాబాదు మలక్‌పేటలోని పాఠశాలలకు సుమారు రూ. 4.50 లక్షల ఖర్చుతో భవనాలు నిర్మించారు. వికలాంగులకు శిక్షణ ఇచ్చే ఉపాధ్యాయులకోసం ఈ పాఠశాలలో శిక్షణ కోర్సు (డిప్లొమా, సర్టిఫికెటు) లను నిర్వహించారు.

ఆంగ్లో ఇండియన్ పాఠశాలలు

రాజ్యాంగం అమలులోకి వచ్చిన 10 సంవత్సరాల వరకు, ఆంగ్లో ఇండియన్ ప్రజల ప్రయోజనార్థం క్రమేణ తగ్గింపు పద్ధతిలో విద్యావిషయకమైన గ్రాంట్లు లభింపజేయాలని రాజ్యాంగంలోని 337వ సూత్రం నిర్దేశిస్తున్నది. ద్వితీయ ప్రణాళికారంభంలో రాష్ట్రంలో పదకొండు ఆంగ్లోఇండియన్ సంస్థలు కలవు. ఇవన్నీ కూడా కొనసాగింపబడినాయి. ప్రత్యేకమైన నిబంధనావళి వీటికి వర్తిస్తుంది. రాజ్యాంగంలో కల్పించిన రక్షణలు కాలపరిమితి 1961 జనవరి 21 వ తేదీతో తీరిపోయినప్పటికీ రాష్ట్రంలోని ఈ సంస్థల విషయంలో మరికొంతకాలం వరకు యధా స్థితిని కొనసాగించడానికి రాష్ట్ర ప్రభుత్వం అంగీకరించింది.

ఈ విధంగా రెండవ పంచవర్ష ప్రణాళికా కాలంలో విద్యారంగంలో సర్వతోముఖమైన అభివృద్ధి జరిగింది. భావి తరాల వారికై ఉత్కృష్టమైన విద్యా విధానాన్ని ఏర్పరచడానికి గొప్ప విశ్వాసంతో, నిశ్చయంతో మనం పురోగమిస్తున్నాం.

ఇంగ్లీషు భాషా బోధన

శ్రీ షేక్‌మౌలా. యం. ఏ.

అంతర్జాతీయ ప్రతిపత్తిని గణించడమేగాక వివిధ దేశాల మధ్య ఇంగ్లీషు భాష ఉత్తర ప్రత్యుత్తరాలలో కూడా ప్రాముఖ్యత వహించడంవల్లనే మనం దేశంలో ఇంగ్లీషును బోధించడానికి ఇతోధిక ప్రాధాన్యం యివ్వడం జరిగింది. మానవ మేధా శక్తిని ప్రతిఫలింపజేసే సారస్వతం యీభాషలోనేనిక్షిప్తమైఉంది. ప్రపంచ వర్గాల సమకాలీన సంస్కృతీ రీతులను, విభిన్న రాజకీయ దృక్పథాలను సమన్వయపర్చే శక్తిగా ఇంగ్లీషు ప్రాముఖ్యం వహించింది. మానవ క్రియాత్మక శక్తి యెన్నడూ అందుకోలేని శిఖరాలను యీ భాషాసాహిత్యం ద్వారానే అందుకోగల్గడమేగాక, అంతర్జాతీయ స్థాయిలో ఒకరి నొకరు అర్థం చేసుకోవడానికి, ఉత్తర ప్రత్యుత్తరాలు జరుపుకోవడానికి అవకాశాలను కలుగజేయడానికి సాధనగా యీ భాష ఉపయోగ పడుతున్నది. 20 వ శతాబ్దంలో శాస్త్రీయ, సాంకేతిక అభివృద్ధి ఫలితంగా ప్రపంచ దేశాల మధ్య దూరం తగ్గిపోయి, వీటి మధ్యగల భౌతికమైన హద్దులు మాసిపోతున్నవి. దీని ఫలితంగానే అంతర్జాతీయ భాష కావలసి వచ్చింది. విశ్వవ్యాప్తంగా సాంస్కృతిక, ఆధ్యాత్మిక పునరుద్ధరణకు అవకాశాలేర్పడినాయి. మానవాభ్యుదయానికి ఏకైక ప్రపంచ భాషవిధిగా కావలసిన అగత్యం యేర్పడింది.

వసుధైక కుటుంబాన్ని యేర్పరచడంలో ప్రపంచంలోని ఇతర భాషలన్నింటికన్నా బహుశా యింగ్లీషు మాత్రమే అనువైన సాధన కాగలదు. ప్రపంచ జనాభాలోని యెక్కువ శాతం మంది మాట్లాడగల కొన్ని విదేశీ భాషలలో యిది ఒకటి: యీ భాష ద్వారానే మనం శాస్త్రీయ, సాంకేతిక విజ్ఞానాన్ని పొందగలిగాం. పురాతన, ఆధునిక భాషలనుండి స్వేచ్ఛగా పదాలను కలుపుకోవడం ద్వారా శతాబ్దాల తరబడి అభివృద్ధి చెందుతూ నేడు ఈ భాష సజీవ భాషగా మనగల్గుతున్నది.

అందువల్ల యెటువంటి విద్యావిధానంలోనైనా ఇంగ్లీషుభాషను నేర్పడం అత్యవసరం. అంతమాత్రాన యితర భాషలను విస్మరించాలనిగానీ, వాటి అభివృద్ధి, కార్యక్రమాలకు యింగ్లీషుభాష అవరోధం అని కాని అర్థం తీయరాదు. యేదేశంలోనైనా మానవతను అర్థం చేసుకోవడానికి, శాస్త్రీయ విజ్ఞానానికి దోహదం చేయడానికి యే భాష అయినా ఉపకరణంగా భాసిల్లవచ్చు. అయితే యిది క్రమానుగతంగా అభివృద్ధి చెందగలదేగాని కొద్ది కాలంలో ఒక్కసారే వచ్చేదికాదు. మానవాభ్యుదయానికి పాటుపడే వారందరికీ ఇంగ్లీషుభాష అపురూపనిధిగా లభించింది.

అయితే భారత దేశానికి స్వాతంత్ర్యం లభించిన తర్వాత దేశంలో ప్రజాస్వామ్య సంస్థలు అభివృద్ధి చెందడంతో ఇంగ్లీషు స్థానంలో యితర దేశీయభాషలకు అవకాశంకల్గించాల్సిన అవసరం యేర్పడింది. సెకండరీ పాఠశాలల స్థాయిలో బోధనాభాషగా ప్రాంతీయ భాషలను ప్రవేశ పెట్టారు. విశ్వ విద్యాలయంస్థాయిలో కూడా యీ భాషలనే ప్రవేశ పెట్టడానికి అవసరమైన చర్యలను కూడా తీసుకుంటున్నారు. కాని సెకండరీ పాఠశాలలలో ఇంగ్లీషు నిర్బంధ భాషగా కొనసాగుతూనేఉంది. అంతేగాక ఉన్నత విద్య, పరిపాలనా వ్యవహారాలకు యీభాషను వాడడమే జరుగుతున్నది. స్వాతంత్ర్యం తర్వాత ఇంగ్లీషు భాషాధ్యయనం అవసరాన్ని గూర్చి, దీని సాంస్కృతిక విలువలను గూర్చి సభల్లోనూ. పత్రికల్లోను చర్చించడం జరిగి దేశం అన్ని విధాల అభివృద్ధి చెందడానికి ఇంగ్లీషును సెకండరీ పాఠశాలలలోను, కళాశాలలలోను నిర్బంధ భాషగా బోధించడాన్ని కొనసాగించాలనే అభిప్రాయాన్ని కలిగించారు. ఆంధ్ర ప్రదేశ్‌లోని పట్టణ ప్రాంతాల్లో ప్రాథమిక స్థాయినుండే ఇంగ్లీషు బోధనా భాషగాగల పాఠశాలలు కొన్ని ఉన్నాయి. సెకండరీ పాఠశాలలలో VI తరగతి నుండి నిర్బంధ భాషగా ఇంగ్లీషును బోధించడం జరుగుతున్నది. అవసరమైన చోట్ల హయ్యర్ సెకండరీ పాఠశాలలలో భాషావిషయాలుకాని

రెండు సబ్జక్టులను యింగ్లీషులో బోధించడానికి ప్రభుత్వం అనుమతి యిచ్చింది, 3 వ తరగతినుండి యింగ్లీషును బోధించడాన్ని రాష్ట్ర ప్రభుత్వం యిటీవలనే ఆమోదించింది.

విదేశీ భాషగా లేక "తర్వాత (Later)" భాషగా ఇంగ్లీషును బోధించడంలోగల ఉద్దేశాలు మార్పు చెందిన కారణంగా గత శతాబ్దంనుండి రాష్ట్రంలోని అన్ని సెకండరీ పాఠశాలల్లో "నిర్మాణక్రమం సిలబస్" (Structure Syllabus) అనే క్రొత్త పాఠ్య ప్రణాళికను ప్రవేశ పెట్టడం జరిగింది. విద్యార్థులు ఇంగ్లీషు మాట్లాడడాన్ని, యింగ్లీషు భాషను సరిగా అర్థం చేసుకోవడాన్ని, చదవడం వ్రాయడం నేర్పడమే యీ పాఠ్య ప్రణాళిక ఉద్దేశం. యీ పాఠ్య ప్రణాళిక ద్వారా సెకండరీ విద్యను పూర్తి చేసుకునేలోగా 2.500 ఉచ్చారణ పదాలను, దాదాపు 250 ముఖ్యమైన సౌష్టవమైన వాక్యాలను విద్యార్థులకు బోధించడమే ప్రధాన అంశం. వాక్యాల స్థాయి VI నుండి IX తరగతి వరకు విస్తరించి ఉంటుంది. అయితే ఉచ్చారణ పరిమితి మొత్తం పాఠశాల కోర్సు పూర్తి అయ్యే వరకు ఉంటుంది. ఉపయోగం తరచుగా వాడకం, బోధనా సౌలభ్యం, సఫలత అనే ముఖ్య సూత్రాలను అనుసరించి వాక్యాల స్థాయి, ఉచ్చారణలను విభాగించడం జరిగింది. విదేశీ భాషలను నేర్చే వారికి భాషాధ్యయనాన్ని స్థాయీలవారిగా నేర్పాలనే విషయాన్ని విదేశీ భాషలను బోధించే ప్రవీణులందరూ అంగీకరించారు.

భాషా విషయాలను వర్గీకరించడంతో కొన్ని తప్పుడు అభిప్రాయాలు యేర్పడినాయి. దీని ప్రభావం మన పాఠశాలలోని ఇంగ్లీషు బోధనపై కూడా చాలా వరకు పడింది. అందువల్ల నిర్మాణ క్రమం సిలబస్ (Structure Syllabus) వల్ల ఆచరణలో మంచి ఫలితాలు పొందలేకపోయాం. భాషా బోధనా విషయాలను క్రమగతం చేయడాన్నే భాషా బోధనా పద్ధతిగా తప్పుడు అభిప్రాయం చాలా వరకు కలగటమే గాక సాధారణ సంభాషణలో దీనిని నిర్మాణాత్మకమైన పద్ధతి (Structure Method) అనే కొత్త సాంకేతిక పదంతో వాడడం జరుగుతున్నది. అయితే భాషా విషయాలను వర్గీకరించడం కేవలం భాషా బోధనకు మార్గమేర్పరచడమే గానీ దానికి అదే ఒక పద్ధతి గాదు. ప్రత్యేక నిర్మాణ క్రమాన్ని (Structural order) ప్రతిపాదించేవారు యితర నిర్మాణ పద్ధతులు కూడా ఉంటాయనే విషయాన్ని గుర్తించారు. ఉదాహరణకు బోధనా ప్రారంభదశలో ప్రశ్నావళి సరళి వస్తుందని కొందరి అభిప్రాయమైతే విద్యార్థులు కొంత విషయ పరిజ్ఞానాన్ని సంపాదించే వరకూ దానిని వాయిదా వేయాలని కొందరు అభిప్రాయపడుతున్నారు. అయితే నిర్మాణ క్రమానికి సంబంధించి వేరు వేరు పథకాలను సూచిస్తే అవి సాధారణ ఉపాధ్యాయులను గందరగోళపరుస్తాయని చెప్పవచ్చు. అందువల్ల నిర్మాణ క్రమం (Structural) భాషా బోధనకు మార్గమే కానీ అదే బోధనా పద్ధతి కాదనీ తెలుస్తున్నది. నిర్మాణ క్రమం కేవలం ఇంగ్లీషు భాషా బోధనా విషయాలను క్రమానుగతంగా అమర్చడమే అవుతుంది. కేవలం భాషా సూత్రాల నాధారంగా బోధనా విషయాలను ఎన్నిక చేసి వర్గీకరించినట్లయితే వివిధ దశలలో యే అంశాలను బోధించాలనే విషయాలు ఉపాధ్యాయునికి సువ్యక్తం కాగలవు. ఇది ఉపాధ్యాయుని దిన చర్యలో మార్గదర్శకమవడమే గాక దీనివల్ల క్రమపద్ధతిలో బోధన కూడా జరిగే అవకాశం యేర్పడుతుంది.

రెండవ విషయం–నిర్మాణ క్రమ మార్గం కృత్రిమమైందీ, యాంత్రికమైనదనే గాక ఇంగ్లీషు భాషను గురించి పూర్తి సత్యాన్ని యీ మార్గం తెల్పదనే విమర్శ ఉంది. యిది భాషా విషయాలు, పద్ధతి మధ్య అయోమయ స్థితిని కల్పిస్తున్నది. నిర్మాణ క్రమం కేవలం భాషయొక్క వెన్నెముక మాత్రమే. అంటే ఇంగ్లీషు భాషను కేవలం మాట్లాడటం, చదవడం, వ్రాయడం రావాలనుకునే వారికి కావలసిన కనీస అవసరాలు మాత్రమే నిర్మాణంలో ఉంటాయి. యీ ఇంగ్లీషు భాష వెన్నెముకలోకి రక్తాన్ని, జవాన్ని చేర్చే బాధ్యత ఉపాధ్యాయునిది. అయితే వాక్యాల సరళిని సమంగానూ, స్వాభావికంగాను ఆసక్తి కలిగించే విషయాలలోకి మార్చే బాధ్యత పాఠ్యపుస్తకాల ప్రచురణకర్తలపై ఉంటుంది.

పాఠ్య విషయాలను నిర్దేశించడంలోను, చదవడానికి వీలుగా రూపొందించడంలోను ప్రత్యేక నిపుణత, ఆలోచనా క్రమం యెంతో అవసరం. దీనికి ఇంగ్లీషు భాషలో ప్రవేశం యెంతో ముఖ్యం.

విదేశీ భాషా బోధనకు పూర్వం, బోధనా విషయాల సక్రమ యెన్నిక, ఆ భాషను స్థూలంగా పరిశీలించే దృక్పథం, విదేశీ భాషా బోధనా పరిశోధనలో యెంతో ఉపయోగకరమైనవి, యీ పరిశీలన ఉపాధ్యాయుని పనిని యెంతో తేలికపర్చింది. అయితే భాషా బోధనను విద్యార్థులలో ఆసక్తి కలిగించే విధంగా చేయడం ఉపాధ్యాయుని విధి. ప్రారంభదశలో భాషా బోధన విసుగు కలిగించే విధంగా గానీ, వాక్యాలను అర్థం లేకుండా పదే పదే దొర్లించడంగా గానీ, ఉండకూడదు. ఉపాధ్యాయుడు, విద్యార్థికి చెప్పే

ప్రతి విషయమూ జీవనరంగానికి సంబంధించినదై ఉండడం ఎంతో ముఖ్యం. ఉపయోగకరమైన కార్యక్రమాలు, ఆసక్తికరమైన అనుభవంతో పాటు విద్యార్థుల ఉచ్చారణ, వాక్యాల సరళి అభివృద్ధి చెందుతూ ఉండాలి. ప్రారంభదశలో చదవడం, వ్రాసే సమర్థత అంతకు ముందు జరిగిన మౌఖిక పద్ధతిపై చాలా వరకు ఆధారపడి వుంటుంది. పాఠ్యపుస్తకాలే విద్యార్థులలో భాషా పాటవాన్ని కలిగిస్తుందనే తప్పుడు అభిప్రాయం ప్రబలి ఉంది. దాని ఫలితంగానే చాలా సమయాన్ని పాఠ్య పుస్తకాలను చదవడంలో వినియోగించి వాటిలోని అర్థాలతో విద్యార్థులను సతమతం చేయడం జరుగుతున్నది. పాఠ్యపుస్తకాలలోని అంశాలు విద్యార్థులు సులభంగా ఆవగాహన చేసుకునే విధంగా ఉండాలి. తద్విరుద్ధంగా ఉంటే విద్యార్థులు పరీక్షలలో ఉత్తీర్ణులవటానికి అనుచితమైన ప్రక్కదారులు తొక్కడానికి అవకాశాలేర్పడుతాయి. ఇంగ్లీషు బోధనకు సంబంధించిన నవీన పద్ధతులను అనుసరించి పరీక్షా విధానాలు మారాలి. భాషా స్వభావం, వివిధ స్థాయిలలో బోధన పద్ధతుల ఉద్దేశాలను దృష్టిలో ఉంచుకొని ప్రశ్నావళులను తయారు చేయాలి. నిర్మాణ (Structural) విధానం ద్వారా ఇంగ్లీషు భాషా బోధన చాలా క్లిష్టమైంది. ఇంగ్లీషును ప్రారంభదశలో బోధించే సెకండరీ గ్రేడు ఉపాధ్యాయులకు బోధనలోని నవీన పద్ధతులలో కూలంకషంగా శిక్షణ యివ్వాలి. పట్టభద్రులైన సెకండరీ ఉపాధ్యాయులను ఉంచడానికై ఉద్యమాలను నిర్వహించాలి. కళాశాలల పాఠశాలల పాఠ్య ప్రణాళికలలో భాష, సాహిత్యాలకుగల ప్రాముఖ్యాన్ని యిక్కడ యివ్వడం అనవసరం కాదు

కళాశాల, పాఠశాలల పాఠ్య ప్రణాళికలలో ఇంగ్లీషు సాహిత్యానికి గల స్థానం, విద్యార్థులు చేరుకోవాల్సిన స్థాయిలను గురించి స్పష్టంగా నిర్దేశించడం జరగలేదు. యీ విధంగా భాషా విషయాన్ని బోధించడంలో కొంత అయోమయస్థితి యేర్పడింది.

సాహిత్యంలోని ప్రాథమిక విషయాలను విస్మరించి, కఠినమైన గద్య పద్యాలపై అవివేకమైన ఉత్సాహాన్ని చూపే దృష్టితోనే ఉన్నత స్థాయిలో కూడా భాషా విషయాల ఎన్నిక, బోధనను ప్రవేశపెట్టడానికి సాహిత్యాన్ని స్వీకరించడం జరుగుతున్నది. ఊహాలోకాల్లో విహరింపజేసే పదాడంబరం, ఉత్తేజకరమైన కవిత్వాన్ని రసహీనంగా బోధించడమే యిప్పటి సాహిత్యబోధన ముఖ్యలక్షణంగా కనిపిస్తుంది. సాహిత్యాన్ని మలచడానికి గానీ, భాషను ఉపయోగించడానికి గానీ అంతర్దృష్టిని అలవరచుకోవడానికి యెట్టి ప్రయత్నమూ జరగలేదు.

భాష, సాహిత్యాల మధ్య వ్యత్యాసాన్ని కలిగించే ప్రయత్నంవల్ల మానవ మేధస్సులోను, బోధన విధానంలోను భయానకమైన విషమపరిణామాలు కలగడమేగాక, భాషా స్వరూపంలోను, మన విద్యార్థుల భాషా పాటవానికి కూడా నష్టం వాటిల్లుతుంది. మొదటి నాలుగు సంవత్సరాలు నిర్మాణ విధానంలో (Structural approach) శిక్షణ యివ్వబడిన విద్యార్థులు, ఉన్నత తరగతులలో భాషాలంకారాలు, ఉన్నత శైలిని వ్యక్తంచేసే భాషా విషయాలను యెదుర్కోవాల్సివస్తుంది. దీని ఫలితంగా ప్రాథమిక దశలోని పాఠ్య విషయాలకు ఉన్నత దశలోని విషయాలకు మధ్య భాషా విషయకమైన అఘాతం యేర్పడింది.

యీ అఘాతాన్ని అధిగమించడానికి ఉపాధ్యాయులు, పాఠ్య ప్రణాళికలను తయారుచేసే వారు ప్రయత్నించాలి. విద్యార్థులకు సాహిత్య పరిజ్ఞానం కలిగించడం ఇంగ్లీషుబోధన ముఖ్య ఉద్దేశమని కొన్ని వర్గాలవారి భావన. పూర్వంనుండీ ప్రజలలో ఉన్న యీ భావాన్ని తొలగించలేకపోవడమేగాక కనీసం దీన్ని సరిఅయిన విధంగా గ్రహింపజేయులేక పోయారు. శుద్ధమైన సాహిత్యాన్ని అర్థంచేసుకునే భాషా విషయకశక్తి చాలామంది విద్యార్థులలో లోపించింది. వారి లక్ష్యానికి సాధనగా ఇంగ్లీషు ఉండాలికాని దానికదే లక్ష్యం కాకూడదు. తేలికరకం సాహిత్యాన్ని, శాస్త్ర విజ్ఞానం, వాణిజ్యానికి సంబంధించిన విషయాలను సులభంగా అర్థం చేసుకోవడానికి యింగ్లీషుభాష వారికి సహాయపడేవిధంగా ఉండాలి. యింతేగాక వారి భావాలను స్పష్టంగా తెలియజేసేశక్తినికూడా ఇది కలిగించాలి. వారికి యెక్కువలో యెక్కువ "వాస్తవమైనఇంగ్లీషు"ను తక్కువలో తక్కువ "శుద్ధమైన సాహిత్యం"నూ బోధించాలి.

అయితే పాఠ్య ప్రణాళికలలో సాహిత్యాన్ని చేర్చకపోవడం

హేతుబద్ధంకాదు. మానవ వ్యక్తిత్వాన్ని వికసింపజేయడానికి దోహదకారి అయిన సాహిత్యాన్ని పాఠశాల, కళాశాలల పాఠ్య ప్రణాళికలలో తప్పకుండా చేర్చాలి. ఇంగ్లీషు సాహిత్యంలో ఉత్తమ, రసపూరితమైన రచనలతోపాటు శాస్త్రవిజ్ఞానానికి సంబంధించిన రసహీనమైన రచనలు కూడా మేళవించి ఉండటం హర్షదాయకం. మన విద్యార్థులు యీ విషయాలను నేర్చుకోవడం యెంతో అవసరం. యేదేని పాట, కల్పితకథ, కల్పితరచనలను సాహిత్యం అనే పిలవవచ్చు. ముఖ్యంగా వినోదానికై సాహిత్యపఠన జరుగుతుంది. అయితే జాగ్రత్తగా ఎన్నిక చేసిన సాహిత్యాన్ని భాషాబోధనకు ఉపయోగించవచ్చు.

సాహిత్య రూపంలో వృద్ధులు, యువకులను సమానంగా ఆకర్షించేది కల్పితకథలు. ఇవి ప్రజలను ఊహాలోకాల్లో విహరింపజేస్తాయి. ముఖ్యంగా బాలబాలికలు ఇట్టి రచనలను యెక్కువ ఆసక్తిగా చదువుతారు. విద్యాబోధన ప్రథమదశలో ఆసక్తి కలిగించే విషయాలను మాత్రమే బోధించాలి కాని 'పెన్సిల్, కలం—వ్రాతబల్ల' మొదలైన పదాలను నేర్పడంతో సంతృప్తిజెందకూడదు. పాఠ్యపుస్తకాలలో కథలను, పాటలను, నిర్ణీత పద్ధతిలో బోధించే విధంగా చేర్చుకోవాలి. 10 సంవత్సరాలు ఆ పైవయస్సుగల విద్యార్థులు యెల్లప్పుడూ తరగతి గది వాతావరణానికి యిష్టపడుతారని భావించడం భ్రమమాత్రమే. అన్ని స్థాయీల చదువరులకు అవసరమైన, ఆసక్తి కల్గించే సచిత్ర విషయాలు ఇంగ్లీషు భాషలో లభిస్తాయి. ఉపాధ్యాయులు యీ విషయాలను బోధించడానికి అవకాశాలు ఉండాలి.

భాషా విషయాలను వివిధ మార్గాలద్వారా నేర్పుతో అభ్యసించి, వివిధ పదార్థాలను, పదాల వాడుకలోగల చిక్కులను అధిగమించవచ్చు. అన్ని ఉత్తమ సాహిత్యాలలోనూ భాషా సంపత్తిని పూర్తిగా వినియోగించుకోవడం జరిగింది. ఉత్తమ పద్ధతిలోకూర్చబడిన పదాల పొందికను గద్యమనీ, ఉత్తమ పద్ధతిలో జరిగిన ఉత్తమ పదాల కూర్పును పద్యమనీ అనడం జరుగుతున్నది. సాహిత్యం, భాషలలో వైరుధ్యం ఉందనే సందేహాలను యీ విషయం నివృత్తిచేస్తుంది. బోధనా స్థాయిలలోని వివిధ దశలలో భాషా సాహిత్యాలకు సమానస్థానం కల్పించడమే, ఇంగ్లీషు భాషా స్థాయి దిగజారుతున్నదనే సమస్యకు ముఖ్య పరిష్కారమార్గం కాగలదు.

విద్యాసంచిక రచయితలు

శ్రీ సి.వి.హెచ్. రావు, హైదరాబాదు.

శ్రీ కె. రాఘవరెడ్డి, బి.ఏ.;బి.ఎస్.సి., ఎల్.టి.డిప్లొ. ఎడ్యు. (లీడ్స్) డి.ఎల్.ఎస్.సి., పౌర గ్రంథాలయాలశాఖ డిప్యూటీ డైరెక్టరు, హైద్రాబాదు.

శ్రీ ఆర్. హెచ్. పి. హాల్మన్, ఎం. ఏ., ఎల్. టి. విద్యాశాఖ డిప్యూటీ డైరెక్టరు (ఆర్థిక వ్యవహారాలు) ఆంధ్రప్రదేశ్.

శ్రీ వి. భాస్కరాచార్యులు. విద్య, వృత్తిపనుల శిక్షణసంస్థ, హైద్రాబాదు.

శ్రీ కె, వి. రంగారెడ్డి, స్టాటిస్టికల్ ఆఫీసర్, విద్యాశాఖ డైరెక్టరు కార్యాలయం, హైద్రాబాదు.

ప్రొఫెసర్ వి. వి. ఎల్. రావు, ప్రిన్సిపాల్ అనంతపురం ఇంజనీరింగ్ కళాశాల.

శ్రీ కె. రాఘవరెడ్డి.

శ్రీయుతులు టి. ఆర్. కుప్పుస్వామి, షెహరాయర్ కసూజీ

శ్రీ ఎన్. వి. నాయుడు, విద్యాశాఖ డిప్యూటీ డైరెక్టరు ఆంధ్రప్రదేశ్.

శ్రీ పాములపర్తి సదాశివరావు.

శ్రీ బోయి భీమన్న, ప్రభుత్వానువాదకుడు, పుస్తకాల రిజిస్ట్రారు, ఆంధ్రప్రదేశ్

శ్రీ వి. రామచంద్రన్, బి. ఏ. (ఆనర్స్), బి. ఇడి. విద్యాశాఖ డిప్యూటీ డైరెక్టరు ఆంధ్రప్రదేశ్

శ్రీ ఎన్. నారాయణరావు, ఎం. ఎస్. సి. (టెక్నాలజి) డిప్లొ, ప్రింటి, (లీడ్స్) ఎ ఆర్.పి.ఎస్. (లండన్) డిప్లొ. ఫొటో (కలోగ్నె) ఆంధ్రప్రదేశ్ పాఠ్యపుస్తకాల ముద్రణ శాఖ సూపరింటెండెంట్.

డాక్టర్, సి. బి. రావు, ప్రభుత్వపరీక్షల డిప్యూటీ కమీషనర్, ఆంధ్రప్రదేశ్.

శ్రీ షేక్ మౌలా, ఎం. ఏ,, ఎం. ఇ. డి. డిప్లొ. టి. ఇ. ఎఫ్. ఎల్. (లండన్)

డాక్టర్. వి. సి. వామనరావు, విద్యాశాఖ డైరెక్టరు, ఆంధ్రప్రదేశ్,

వృత్తి పనుల శిక్షణ

ప్రజాస్వామ్య దేశాలలో పౌరులకు ప్రజాస్వామ్యంలో సుశిక్షణ ఇవ్వడం పరిపాటి. ఒక వ్యక్తియొక్క శక్తి సామర్థ్యాలను, అతని ఆశయాలు, ఆత్మ సంతృప్తితో అతను నిర్వహించే విధులు, అతని నేర్పరితనం లేక నైపుణ్యం, అతని ప్రగతి రీతి, అతని శక్తి, బలహీనతలను ఖచ్చితంగా గుర్తించి సాధ్యమైనంత నిష్పక్షపాతంగా నిర్ణయించాలి. అలా చేయడంవల్ల ఆ వ్యక్తి సంతృప్తికరమైన ఒక జీవన స్థాయికి వచ్చి తన సంక్షేమంతో పాటు అందరి సంక్షేమాన్ని కాంక్షించ గలుగుతాడు. ప్రతి వ్యక్తియొక్క శక్తిసామర్థ్యాలను పెంపొందించి, సాధ్యమైనంత స్వయం శిక్షణను (Self-Guidance), భద్రతను ఆర్థికంగానూ, సాంఘికంగానూ సాధించడానికి వీలుగా పరిస్థితుల కల్పనకు, వ్యక్తి నర్థం చేసుకోడానికి పరిగణించడానికి అది (Guidance) తోడ్పడుతుంది. ఈ విధమైన శిక్షణ మన ప్రజాస్వామ్య సిద్ధాంతాన్ని సంక్షిప్తం చేస్తుంది. అది జీవిత విధానానికి సంబంధించింది కనుక ప్రజాస్వామ్యం వలెనే మనగలదు.

ఏ శిక్షణా కార్యక్రమమైనా పాఠశాలావసరాలు, సమస్యలు సమాజ సాధన సంపత్తి దృష్ట్యా ప్రారంభం కావాలి. ప్రణాళికాబద్ధమైన ఒక నిర్ణీత కార్యక్రమం లేనిచోట తరగతి గదిలోనే కొంత శిక్షణ ప్రారంభమవుతుంది. చాలామంది ఉపాధ్యాయులు ఒక విషయాన్ని బోధించే కన్నా కార్యరూపేణా ఎక్కువ పని చేస్తారు. వారు మామూలుగా సంప్రదించి ఒక్కొక్క విద్యార్థికి కొంత రికార్డునుంచుతారు. ఒక విద్యార్థిని గురించి, అతని సమస్యల గురించి తెలుసుకోడానికి గాని, విద్యార్థి పాఠశాలలో ఇంకా ఎక్కువ కృషి చేయడానికి వీలుగా తల్లిదండ్రుల మద్దతును పొందడానికిగాని కొందరు ఉపాధ్యాయులు విద్యార్థుల ఇళ్ళకు వెళుతుంటారు. విద్యార్థి ఆరోగ్యం, అతని ఇంటిలోని ఇతరులతో అతనికున్న సంబంధాలు మొదలైన వాటి ప్రభావం అతని చదువు సంధ్యలపై పడుతుందని చాలా మంది ఉపాధ్యాయులు గ్రహించారు. మానసిక ఉద్రిక్తత తగినంతలేని విద్యారులు లేక తగినంత ఆహారం, విశ్రాంతి లేని విద్యార్థులు శాయశక్తులా కృషి చేయలేరని శిక్షణే ధ్యేయంగాగల ఉపాధ్యాయులు గుర్తించారు. నిరుపయోగమైన విద్యను నేర్పడంవల్ల ఉపయోగం వుండదని ఉపాధ్యాయునికి తెలుసు. తన శక్తి సామర్థ్యాలను పొగడటాన్ని విద్యార్థి కాంక్షిస్తాడని వారికి తెలుసు. ఒక ఉపాధ్యాయుడుగాని, శిక్షణ కార్యకర్తగాని పాఠశాల కార్యక్రమంలో ఎక్కడైనా శిక్షణ నారంభించవచ్చు. ఒక్కొక్క పిల్లవాడు ఎందుకు సిగ్గుపడుతున్నాడో రోజుల తరబడి బడి కెందుకు రావడం లేదో, అతనెందుకు చదవలేక పోతున్నాడో, లేక ఎందుకు పరీక్షలలో తప్పుతున్నాడో తనశక్తికి తక్కువయినదాన్ని ఎందుకు చేస్తున్నాడో మొదలైన విషయాలను గురించి ఉపాధ్యాయుడు విచారిస్తున్నాడంటే ఆయన శిక్షణ పనికి లేక మార్గదర్శకుడుగా వుండడానికి పూనుకొంటున్నాడన్నమాట. ఎప్పుడైనా ఉపాధ్యాయుడు విద్యార్థిని పరిశీలిస్తూ అతన్ని గురించి సమాచారాన్ని సేకరించి అతనికి సహాయపడడానికి యత్నిస్తున్నాడంటే ఆయన శిక్షణ కార్యక్రమం దృక్పథాన్ని చూస్తున్నాడన్న మాట.

శిక్షణ వివిధ దృక్పథాలు

ఆ విధంగా శిక్షణ అనేది విద్యార్థియొక్క కృషి ద్వారా స్వప్రయోజనానికి, సంఘోపయోగానికి అతని శక్తి సామర్థ్యాలను కనుగొని వాటిని పెంపొందించడానికి సహకరిస్తుంది. అది రెండు విధాల పనిని ముందుగా ఊహించే ఒక శక్తివంతమైన సహాయ విధానం. అంటే మొదటిది: ఒక వ్యక్తియొక్క శక్తిని, ఆశలను ఆశయాలు, నడవడి, నైపుణ్యం, అతను సాధించిన విజయాల్ని, అతని సాంఘిక, ఆర్థిక, సాంస్కృతిక పరిస్థితుల నర్థం చేసుకోవడం. ఇక రెండవది: వివిధావసరాలు, శక్తియుక్తులతో పాటు, వాస్తవిక స్వప్రకృతిని, ఒకరి పరిసరాల సాంఘిక, భౌతిక ప్రభావాల ప్రాముఖ్యతను పరిసరాలవల్ల లభించే విద్యా, వృత్తిపనుల అవకాశాలను అర్థం చేసుకోవడం. కనుక శిక్షణ (Guidance) ను ఈ రెండు విధానాలను కలిపే విధానంగా పేర్కొనవచ్చు.

అలా చేయడం వల్ల వ్యక్తి జీవితంలోని కొత్త పుంతలతో వారు అంటుకు పోతారు.

శిక్షణ అనేది సెకండరీ విద్యలోని కొత్త విధిగాను, పాఠశాలలలోని విద్యా ప్రణాళికలోని అంతర్భాగంగాను అయినప్పుడు అందులో త్రివిధాలైన (1) విద్యా (2) వృత్తిపనులు (3) వ్యక్తిగతమైన అభివృద్ధి కార్యక్రమాలుంటాయి. ఈ మూడు దృక్పథాలు కాద్దో గొప్పో విద్యార్థి అభివృద్ధికి సంబంధించినవి. వాటి ప్రభావం విద్యార్థిమీద ప్రసరిస్తుంది. విద్యా, వృత్తిపనులు, వ్యక్తిగతమైన శిక్షణకు సంబంధించిన ముఖ్య దృక్పథాలను తెలుసుకోవడం వాంఛనీయం.

విద్యా శిక్షణ (Educational Guidance) అనేది విద్యార్థులు తమ ఇష్టానుసారంగా పాఠశాలలు, కోర్సులు, పాఠ్య ప్రణాళిక పాఠశాలా జీవనానికి సంబంధించిన విషయాలను నిర్ణయించుకోడానికిచ్చే సహాయానికి సంబంధించింది. విద్యార్థియొక్క మానసికాభివృద్ధికి పాఠశాల పనిలో తగిన అభివృద్ధిని సాధించడానికి అందజేసే సహాయం అని కూడా దానిని పేర్కొనవచ్చు. శక్తికి సాధనకు మధ్య సమన్వయం లేకపోవడం, స్కూల్ సబ్జక్టులలోని ఒక దానిలో వెనకబడి వుండడం, సరియైన అధ్యయనాభ్యాసం లేకపోవడం, మొదలైనటువంటి విద్యార్థుల సమస్యల పరిష్కారానికి అది తోడ్పడుతుంది. ఆ విధంగా విద్యావిషయక శిక్షణలో ఈ క్రింది విషయాలుంటాయి: ఎలా చదవాలి; చదువులో సహజ విధానాల నవలంబించడం; పాఠశాలా జీవితాన్ని ఇతర కార్యకలాపాలకు సరి పుచ్చుకోవడం; పాఠశాలకు, పాఠశాల పనులకు క్రమబద్ధంగా హాజరు కావడం; మాట్లాడడం; వ్రాయడం నేర్చుకోవడం; పరీక్షలు వ్రాయడం; గ్రంథాలయాలమపయోగించుకోవడం: విద్యావిషయకమైన నిర్ణయాలు చేయడం వంటివి. వృత్తిపనుల శిక్షణ అనేది వృత్తి వ్యాపారాలకు, ఉద్యోగాలలో ప్రవేశానికి తత్సంబంధమైన వాటికీ సంబంధించిన సమస్యల పరిష్కారానికందించే సహాయం. పనిని అందుకు వలసిన విజ్ఞానం, నైపుణ్యం శిక్షణ, శక్తి, ఉత్సాహం వంటి విభిన్నావసరాలను విద్యార్థికి తెలియజెప్పడం దాని ఉద్దేశం. విద్యార్థి తానువుండే పరిస్థితులలో తానను కున్న వృత్తిపనులను చేపట్టడానికి అందుకు తనకున్న శక్తిసామర్థ్యాలను గురించి తెలుసుకోడానికిది ఉపయోగిస్తుంది. ఈ రకమైన శిక్షణ ముఖ్యంగా రెండు రకాల విభేదాలవల్ల—అంటే వ్యక్తులలోని భేదాలవల్ల, ప్రస్తుత వృత్తులలోవున్న పెక్కు అవకాశాలు, అవసరాలవల్ల—సాధ్యమైంది. వ్యక్తులందరూ ఒకేలావుంటేవృత్తిపనుల శిక్షణావసరం తల ఎత్తేదేకాదు విద్యార్థికి ఇలా సహాయం. చేయడంవల్ల వ్యక్తికి తృప్తి, విజయంచేకూరి సంఘానికి ఎంతో లాభం చేకూరుతుంది. వ్యక్తిగత శిక్షణ వ్యక్తిగతంగా అతని సాంఘిక సమస్యలను సర్దుబాటు చేసుకోడానికుపకరిస్తుంది. ఈ సమస్యలకు ఉన్నత ప్రమాణ శిక్షణ, నైపుణ్యంగా పరిష్కరించడం మొదలైనవి అవసరం.

శిక్షణకు ప్రయోజనాత్మక సౌకర్యంకోసం విద్యా, వృత్తి, వ్యక్తిగత విభాగాలుగా విభజించడం జరిగిందని గుర్తుంచుకోవడం అవసరం. అయినా వాస్తవికంగా ఈ మూడింటికి మధ్య పెద్ద తేడా ఏమీలేదు ఏవో పరిస్థితులలో వ్యక్తిగత సమస్యలు తల ఎత్తవచ్చు. ఆ సమస్యకు సంబంధించిన క్లిష్ట పరిస్థితుల నెదుర్కొనడానికి శిక్షణ కార్యకర్త సంసిద్ధుడై వుండాలి.

శిక్షణావశ్యకత

దేశంలోని బాలల అభివృద్ధికై పాఠశాలలుండాలి. నేటి పాఠశాలలు గత తరం నాటి కన్నా ఎన్నో రకాల విధులు నిర్వర్తించ వలసి వున్నాయి. ఆ కాలంలో తగిన సిబ్బంది సౌకర్యాలు లేవు కదా అని ఇప్పుడు అనవసరమని చెప్పడం సమంజసంగా వుండదు. నేడు అనేక విధాలుగా ఆందోళన చెందుతున్న యువకులకు ఆకాలంలోనే మంచి సలహా ఇచ్చి, వారికి తగు మార్గం చూపించే వ్యక్తి లభించి వుంటే వారిప్పుడు చాలా ఆనందంగా వుండే వారు. శిక్షణ కార్యక్రమంలో తరగతి ఉపాధ్యాయుడు ప్రముఖ పాత్ర వహిస్తాడు. ఇందులో ఆయన సహకారం లేకుంటే ఏ కార్యక్రమమూ కూడా సఫలీకృతం కానేరదు. కాలచక్రంలో వస్తున్న మార్పులను గుర్తించి పరిస్థితుల కనుగుణంగా పిల్లలకు కార్యక్రమాన్ని ఎప్పటి కప్పుడు రూపొందిస్తూ వుండాలి. శిక్షణా పద్ధతి (Guidance philosophy)లో వుండే విశేషమే ఇది. శిక్షణా పద్ధతి ననుసరించే పాఠశాలలో ఉద్రిక్తత తక్కువగా వుంటుంది. పిల్లలు ఉత్సాహవంతులుగా వుంటారు. బోధన తక్కువగా వుండి నేర్చుకునే విషయాలెక్కువగా వుండాలి. అట్టి పాఠశాలలోని ముఖ్యానుభవాలు పిల్లల సాంఘిక, సాంస్కృతిక అవసరాలను తీరుస్తాయి. వారి అవసరాలను పరిశీలించి నట్లయితే శిక్షణ ఇచ్చే ఓర్పు, తాహతుగల ఉపాధ్యాయులు అత్యవసరమనిపిస్తుంది. ఉన్నతపాఠశాలలో సరియైనశిక్షణవుంటే కళాశాలల్లో విద్యార్థులు పరీక్షలలో తప్పడాన్ని చాలా వరకు అరికట్ట వచ్చు. చేయవలసిన పనిని నిర్వర్తించే సామర్థ్యం లేక పోవడం వల్ల కొందరు పిల్లలు పరాజయం పొందు తుంటారు. అట్టి విద్యార్థులు

కళాశాలకు వెళ్ళనవసరం లేదని వారికి సలహా ఇవ్వ వచ్చు. అలాంటప్పుడు లాభసాటిగల ఏ వృత్తిలో ప్రవేశించాలనే సమస్య వారి నెదుర్కొంటుంది. అవకాశాన్ని బట్టి చాలా మంది ఏదో ఒక వృత్తిలో ప్రవేశిస్తారు. నిశితంగా ఆలోచించి అవలంబించిన వృత్తులు కావు వారివి. అందువలన వారికి అనుకూలం కాని వృత్తులలో ప్రవేశించడం జరుగుతున్నది. కనుక పని చేసే వ్యక్తికి పనిలో అతన్ని నియమించే యజమానికి తరచుగా ఆర్థిక నష్టం వాటిల్లు తుంటుంది. కార్మికుల కోసం ఈ విధంగా ఎక్కువ ఆర్థిక దుర్వ్యయం జరుగు తుంటుంది. ఒక్కొకప్పుడు సరిపడని వృత్తిని ఎన్ను కోవడం వల్ల ఆయా వ్యక్తుల ఆరోగ్యం చెడిపోతుంది. ఆయా వృత్తులకు తగని వ్యక్తులు తమ పనిలో తృప్తిని పొంద లేక పోవడం వల్ల అటు సాంఘిక దుర్వ్యయం ఇటు ఆర్థిక దుర్వ్యయం కూడా జరుగు తుంది. యువకులు తమకు తగిన వృత్తుల నెన్నుకోడానికి సహాయాన్ని అందజేయడానికి తగిన మంచి సౌకర్యాలు లభ్యమవు తున్నాయి. ఆ విధంగా యువకులకు కావలసిన వృత్తి శిక్షణావసరాలను కల్పించడం ఒక బృహత్ సాంఘిక బాధ్యత అయింది. యువకులకవసరమైన వృత్తి శిక్షణ గరపే బృహత్ బాధ్యత-యువకుల ఆశలకు ఆశయాలకు తగిన విధంగా సమాచారాన్ని సేకరించే బాధ్యత-పాఠశాలా విధానంపై వుంటుంది. అది వృత్తులకు అవసరమైన సమాచారాన్ని సేకరించడానికి, దాన్ని ఎక్కువగా ఉపయోగించుకోడానికి ఉపయోగిస్తుంది. బాలలు యువకుల సంక్షేమ బాధ్యతను పాఠశాలల పై ప్రజలు ఎక్కువ చేస్తున్నారు. అందు వల్ల ఒక వ్యక్తి తన శక్తి సామర్థ్యాలను పెంపొందించు కోడానికి తగిన అవకాశాలను కల్పించడం ద్వారా ప్రస్తుత కాలంలో మానవ శక్తిని సాధ్యమైనంత వరకు వినియోగించుకోడానికి పాఠశాల లెక్కువ ప్రాముఖ్యత నివ్వాలి. అలా చేయడం వల్ల తనకు సరిపడిన వృత్తిని ఎన్ను కొనడం ద్వారా తన విద్యను సద్వినియోగం చేసుకోడానికి తద్వారా సక్రమమైన జీవితాన్ని గడపడానికి వీలుంటుంది. పాఠశాలలకు తోడు ప్రజాస్వామ్య వ్యవస్థ మారుతున్న సాంఘిక వ్యవస్థ కూడా శిక్షణావసరాన్ని పెంపొందిస్తున్నది. ప్రజాస్వామ్యం అంటే ఒక ఓటుహక్కు మాత్రమే కాదు. వ్యక్తికి వుంటుందని, ఆ విలువను సాధ్యమైనంత అధికంగా పెంపొందించుకోవాలని, అందుకు పాఠశాలలు, ఇతర సాంఘిక సంస్థలు తోడ్పడాలని అది నిర్దేశిస్తున్నది. ప్రజాస్వామ్యంలో ఏ వ్యక్తి పై కూడా ద్వేషం అంటూ వుండదు. అందరికీ సమాన హక్కులుండాలని, ప్రతి వ్యక్తీ తన శక్తి సామర్థ్యాలను పెంపొందించుకోవాలని అది కాంక్షిస్తుంది. ఒక వ్యక్తి తన శక్తి సామర్థ్యాలను గరిష్ఠ పరిమితివరకు పెంపొందించుకునే అవకాశం ప్రజాస్వామ్యంలో ఇవ్వ బడింది.

శిక్షణ అనేది ఏదైనా చేయాలనుకుంటే ఒక వ్యక్తికి కావలసిన వృత్తి విషయంలోనూ, విద్యారంగంలోనూ పౌరజీవితంలోనూ అది సహాయంచేస్తుంది. నేటి సాంఘిక వ్యవస్థ వ్యవసాయమే ఆధారంగాగల సంఘ వ్యవస్థవంటి తేలికదికాదు. మన సాంఘిక జీవనం పారిశ్రామిక పథంవైపు పురోగమిస్తున్నది. అది రోజు రోజుకూ మారుతున్నది. మారుతున్న సమాజంలో వ్యక్తుల వృత్తి పనులకు అనుగుణంగా కావలసిన పరికరాలను సమకూర్చడానికి శిక్షణ కార్యక్రమం రూపొందించడం ఎంతో అవసరమవుతున్నది. యువకుల వృత్తి అవసరాలను తీర్చడం సంఘం బాధ్యత. ఇది పాఠశాల వ్యవస్థపై ఆధార పడి వుంటుంది, వృత్తి శిక్షణ సమాజానికి మేలు చేకూర్చాలంటే ఈ కార్యక్రమాన్ని అమలు పరిచే పాఠశాలాధికారులు నిశితంగా ఆలోచించి సరియైన నాయకత్వంతో వ్యవహరించాలి. ఈ విషయంలో పాఠశాల వ్యవస్థ తన బాధ్యతలను నిర్వహించ గలిగితే సమాజావసరాలకు అవసరమైన వృత్తి శిక్షణ కార్యక్రమం తగు రీతిగా పెంపొందగలదు.

సెకండరీ పాఠశాలలు

సెకండరీ పాఠశాలలలో సమగ్రమైన వృత్తి శిక్షణా కార్యక్రమం 5 విభాలుగా వుంటుంది. ఈ ఐదు విభాగాలు సక్రమంగా పని చేయక పోతే ఈ శిక్షణ వృథా అవుతుందని అధికారులు గ్రహించాలి. ఆ ఐదు విభాగాలు ఇవి : (1) సలహాల విభాగం. (2) ప్రతి వ్యక్తికి అవసరమైన సమాచారాన్ని సేకరించడం, (3) వృత్తి సమాచార విభాగం. (4) ఉద్యోగావకాశాలు చూపించే విభాగం. (5) పరిస్థితుల కనుగుణంగా దిద్దు బాటు చేయగల విభాగం. ఈ కార్యక్రమం సమర్థవంతంగా పని చేయాలంటే ఈ ఐదు విభాగాలే గాక, విడి విడిగా ప్రతి విభాగమూ సరిగా పని చేయాలి. సలహా ఇవ్వడం చాలా ముఖ్యమైంది. అనేక ముఖ్య అంశాలపైన ఇది ఆధారపడి వుంటుంది. దీని పని ఆయా వృత్తులలో చేరమని, అవలంబించమని కేవలం సలహా ఇవ్వడంతో సరిపోదు. స్వయం నిర్ణయం చేసుకునే బాధ్యత వ్యక్తిదే. ఇది శిక్షణా కార్యక్రమంలోని ముఖ్యాంశం. విద్యార్థులకు వారికి తగినట్లుగా అవసరమైన సమాచారాన్ని సేకరించడం రెండవ విభాగంలో జరిగే పని. ఉపాధ్యాయులకు కూడా ఇది ఉపకరిస్తుంది.

తన శక్తి సామర్థ్యాలను గుర్తించడానికి ఈ విభాగం చేసే పని ఉపకరిస్తుంది. విద్యార్థులకు అవసరమైన సమాచారాన్ని తెలియజేయడానికి వృత్తి సమాచార విభాగం ఉపకరిస్తుంది. ఏదైనా ఒక వృత్తిలో ప్రవేశించే ముందు అతనికి శ్రద్ధాసక్తులు గల వృత్తికి తగిన సమాచారాన్ని తెలుసుకోవడం ముఖ్యం. సెకండరీ పాఠశాలల పాఠ్య ప్రణాళికలో ఒక ప్రత్యేక సబ్జక్టుగా వృత్తి పనుల సమాచారం ఉండడం చాలా అవసరం. ఈ సబ్జక్టును బోధించే ఉపాధ్యాయుడూ ప్రత్యేక శ్రద్ధ వహించాలి. విద్యార్థులు చదువుకున్న సబ్జక్టుకు సంబంధించిన ముఖ్య సమాచారాన్ని ప్రతి ఉపాధ్యాయుడూ తెలియజేయవలసి వుంటుంది. ఉద్యోగ సమాచారాన్ని అందజేసే విభాగం లేనట్లయితే వృత్తి పనుల శిక్షణా కార్యక్రమం అసంపూర్తిగా వుంటుంది. యువకులకు వయోజనులకు ఉద్యోగావకాశాలు చూపించే బాధ్యతను "నేషనల్ ఎంప్లాయ్‌మెంట్ సర్వీస్" వహిస్తుంది. సాధారణ పరిస్థితులలో పాఠశాల శిక్షణ కార్యక్రమంలో ఉద్యోగం చూపించడం సాధ్యంకాదు. రాష్ట్ర ప్రభుత్వ కార్మిక మంత్రిత్వ శాఖ క్రింద వున్న నేషనల్ ఎంప్లాయ్‌మెంట్ సర్వీసులో ఒక వినూత్న పద్ధతి ప్రవేశపెట్టడం జరిగింది. జిల్లా ఎంప్లాయ్‌మెంటు కార్యాలయంలో వృత్తి పనుల శిక్షణ విభాగం ప్రత్యేకంగా ఏర్పాటు చేయబడింది. పాఠశాలను విడిచి వెళ్ళేవారికి నిర్ణీత వృత్తి పనులు చూపించడంలో ఇది సహాయపడుతుంది. అభ్యసించిన వృత్తి పనులు ఆచరణలో పెట్టడానికి తగిన సౌకర్యం కల్పిస్తుంది ఐదవ విభాగం. యువకులకు, వయోజనులకు ఈ విభాగం చేసే సేవ ఎంతో ఉపయోగిస్తుంది.

శిక్షణా సర్వీసుల వ్యవస్థ, నిర్వహణ

శిక్షణా సర్వీసులను (Guidance Services) సరియైన మార్గంలో వినియోగించుకోడానికి ఒక నిర్దిష్టమైన వ్యవస్థ వుండాలి. ఎన్ని సదుద్దేశాలున్నా అవకాశాన్ని బట్టి మాత్రమే శిక్షణా సర్వీసులు బాగా అభివృద్ధి చెందడం జరగదు. శిక్షణా సర్వీసులను సక్రమంగా నిర్వహించి తగురీతిగా పరిశీలిస్తూ పనిచేయక పోతే ఈ కార్యక్రమం నిష్ఫలమవుతుంది. పాఠశాల సిబ్బంది మొత్తం ఈ కార్యక్రమంలో పాల్గొనడానికి వీలుగా శిక్షణ సర్వీసుల వ్యవస్థను రూపొందించాలి. ఈ వ్యవస్థా నిర్వహణకు సంబంధించిన సమస్య లనేకం ఉత్పన్నం అవుతాయి. సలహా విభాగ కార్యక్రమానికి అనుబంధంగా వుండే రీతిగా శిక్షణా కార్యక్రమం అమలు జరగడం అవసరం. పాఠశాల వ్యవస్థకు, వృత్తి పనుల శిక్షణా కార్యక్రమానికీ, పరస్పర సన్నిహిత సంబంధ బాంధవ్యాలున్నాయి. ఇది మొత్తం పాఠశాలా కార్యక్రమానికి సంబంధించింది. సలహా ఇచ్చే వారు, వృత్తి చేపట్టే విద్యార్థులు మాత్రమే గాక పాఠశాల సిబ్బంది మొత్తం కూడా ఇందులో పాల్గొంటారు. పాఠశాలల శిక్షణా కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు గాని, ప్రిన్సిపాల్ గాని కేవలం పరిపాలనా నిర్వాహకుడుగా మాత్రమే గాక నాయకుడుగా కూడా వ్యవహరించాలి. సలహా ఇచ్చే ఉపాధ్యాయుడు అతనికి సహాయకుడుగా వుంటాడు. ఇందులో ఇతర ఉపాధ్యాయులు నిర్వహించే పాత్ర కూడా ముఖ్యమైనదే. శిక్షణ, విద్య, రెండూ వేర్వేరు భాగాలు కావు. విద్యార్థులకుత్తమమైన మార్గదర్శకుడు ఉపాధ్యాయుడు. విద్యార్థులలో వున్న గుణగణాలను, శక్తి సామర్థ్యాలను పెంపొందించడానికి ఆయన సదా సహకరిస్తారు. పాఠశాలలోని ఇతర అధ్యాపకుల సహాయాన్ని పొందడం కూడా అతని కర్తవ్యం. అటువంటి సహకారం లేకుండా ఈ కార్యక్రమాన్ని ఏ కొద్దిగానైనా కూడా అమలు జరపడం సాధ్యంకాదు.

శిక్షణా సిద్ధాంతాలు, రీతులు
(Principles and Techniques)

శిక్షణ అనేది విద్యా రంగంలో ఒక సమీకృత భాగం అయినందున అది ఈ క్రింది ప్రాథమిక సిద్ధాంతాలను పాటించాలి.

1. శిక్షణ అనేది ఒక అవసరం కాని, సుఖం కాదు.

2. అది పిల్లల సమస్యలకే నిర్దేశింపబడలేదు. అది అందరి అభివృద్ధిని సమాన దృష్టితో చూస్తుంది.

3. పిల్లలు భావి జీవితం కలవారు. కనుక వారికి తగిన జీవనోపాధిని కల్పించడానికి వివిధ దశలలో అభివృద్ధిని నిరంతరం పరిశీలించడం అవసరం.

4. అది పిల్లవాని పూర్తి వ్యక్తిత్వానికి సంబంధించింది కాని, అందులోని ఒక దశకు కాదు.

5. శిక్షణ అనేది ప్రధానంగా అభివృద్ధి విషయకమైంది. వైద్యంలో వ్యాధి చికిత్సకంటే వ్యాధి నిరోధానికున్న ప్రాముఖ్యతే దీనికి ఉన్నది.

6. దానిని శిక్షణ పొందిన ఒకేఒకవ్యక్తి నిర్వహించలేడు. అందుకు సహోద్యోగుల మొత్తం సహకారం కావాలి.

7. అది సరియైన కోర్సులను, వృత్తులను నిర్ణయించుకోడానికి నిర్దేశింపబడినది.

8. ప్రతి విద్యార్థి స్వయం నిర్ణయశక్తిని పెంపొందించు కొనేట్లు చేయడం దాని ముఖ్యాశయం.

9. అది కేవలం సలహా ఇచ్చేదే గాని విధిగా పాటించ వలసింది కాదు.

10. అది ప్రతి విద్యార్థి యొక్క పాఠశాల జీవితం పొడు గునా కొనసాగుతుంది.

వ్యక్తుల శక్తి సామర్థ్యాలను సరిగ్గా నిర్ణయించే అవసరాన్ని అందరూ గుర్తించడమేనని ఈ ప్రాథమిక సిద్ధాంతాలు తెలుపు తున్నాయి. కనుక ప్రతిఒక్కరూ తమకు కావలసిన వివిధ రకాల సమాచారాన్ని, అందుకుపయోగించే వివిధ రీతులను తమకు తామే నిర్ణయించుకోవాలి. ఒక వ్యక్తి యొక్క వ్యక్తిత్వంలోని ముఖ్యాం శాలు తెలివి తేటలు, సాధన, ఆశయం, వ్యక్తిగత లక్షణాలు. వీటన్నింటిని గురించి తెలుసుకోవడానికి మనం టెస్టింగ్, నాన్–టెస్టింగ్ విధానాలనవలంభించవచ్చు.

విద్యార్థులను గురించిన సమాచారాన్ని సేకరించడానికి తగినటువంటిది పరీక్షా విధానం (Testing Technique). ఈ పరీక్ష విధానం ఒక అర్ధ శతాబ్దపు కాలంలోనే త్వరగా అభి వృద్ధి చెందింది. ఒక వ్యక్తి యొక్క వివిధ వ్యక్తిత్వ లక్షణాలను తెలుసుకోడానికి ఎన్నో విధానాలున్నాయి. తెలివితేటల పరీక్షలు (Intelligence Tests) స్వశక్తిని పరీక్షిస్తాయి. సాధన పరీ క్షలు (Achievement Tests) వివిధ విషయాలను గురించి నేర్చుకున్నదానిని, బోధనా ఫలితాలను పరీక్షిస్తాయి. మరొకరకం పరీక్షలు -Aptitude Tests- టెక్నికల్ లేక మెకానికల్ రంగాలలో భవిష్యత్ విజయానికి దారితీసే ప్రస్తుత శక్తిని పరీక్షిస్తాయి.

ఈ పరీక్షల ద్వారా సేకరించిన సమాచారాన్ని, పరిశీలన, ఇంటర్వ్యూ, స్వీయ చరిత్ర, డైరీ వంటి నాన్–టెస్టింగ్ విధా నాల ద్వారా సేకరించిన సమాచారంతో పోల్చి చూసి ధృవీకరించ వచ్చు. ఆ విధంగా ఈ రెండు విధానాల ద్వారా సరియైన సమా చారాన్ని సేకరించడం శిక్షణా కార్యక్రమానికి ముఖ్య సాధనం.

విద్యార్థులను గురించిన ఏ కొద్ది సమాచారమో సరిపోదు. సలహా ఇచ్చే వ్యక్తినీ, అందుబాటులో వున్న వృత్తులు, శిక్షణా సౌకర్యాలు, విద్యావకాశాల సమాచారాన్ని సేకరించాలి. అప్పుడు వాటినెలా వినియోగించుకోవాలనే సమస్య ఉత్పన్నమవుతుంది. సలహా ఇచ్చేవారు వ్యక్తినీ, పనిని కూడా పరిశీలించి ఆ వ్యక్తి స్వభావానికి ఏరకమైన పని సరిపోతుందో తెలుసుకోవాలి. ఈరకమైన పనిని వ్యక్తిగత సలహా విధానాల వల్ల, బృందాల శిక్షణ వల్ల నిర్వర్తించవచ్చు.

రెండవ విధానం గ్రూప్ గైడెన్స్ కొంత వరకే ఉపయోగిస్తుంది. కాని మొదటి విధానం –Individual Counselling–వృత్తి విషయక సమస్యలతో బాధపడుతున్న వారికి ఉపయోగకరమైన శిక్షణగరపి ఎంతోతోడ్పడుతుంది. సలహా ఇవ్వడం అనేది ఒక పద్ధతి. సలహాదారునికి సలహాపొందే వ్యక్తితో ముఖాముఖి సంబంధం వుంటుంది. అతను స్వశక్తి గుర్తించడంలోసలహాదారుడుగా ఉపయోగపడ్తాడు. అది ముఖ్యంగ సలహా పూర్వకమైంది. విద్యార్థులకు వాళ్ళని గురించి వాళ్ళకు తెలపకూడదు. కాని వారిచ్చే సలహా విద్యార్థులు తమ శక్తిని తామే గ్రహించేట్లుగా చేయగలగాలి. విద్యార్థి ఏకోర్సును, వృత్తిని చేపట్టాలో శిక్షణా కార్యకర్త ప్రత్యక్షంగా చెప్పకూడదు. అతనిచ్చే సలహా వల్ల విద్యార్థి తన భవిష్యత్తును తనే నిర్ణయించుకోవాలి.

ఈసలహా ఇచ్చేవిధానం(Counselling Technique) పాఠశాలలలో ఎంతో ఉపయోగిస్తుంది. మొట్టమొదట అది విద్యా ర్థుల సందేహాలను తొలగించి వారి సమస్యలను పరిష్కరిస్తుంది. సందేహాలు, అనుమానాలతో వుండేవారు జీవితంలో ఎన్నడూ పైకి రాలేరు. సలహా ఇచ్చే వ్యక్తి వారి సమస్యలను పరిష్కరించ గలిగితే విద్యార్థులు అన్ని ఇబ్బందులను అధిగమించి వృత్తిని చేప ట్టడానికి శక్తిని, జీవితంలో, సంఘంలో మెలగగల సామర్థ్యాన్ని పొందగలుగుతాడు. ఇక రెండవది ప్రస్తుతం చాలా కృత్రిమంగా వున్న ఉపాధ్యాయుడు–విద్యార్థి, తల్లిదండ్రులు–ఉపాధ్యాయుల సంబంధాలు ఎంతో మెరుగు కాగలవు. పాఠశాలలు, కళాశాలలలో క్రమశిక్షణ లోపిస్తున్నదని భారతావని అంతటా వినవస్తున్నది. దీనికి సలహా విధానం పరిష్కారమార్గం. దీనివల్ల తల్లిదండ్రుల తోనూ, విద్యార్థులతోనూ ఐక్యత, స్నేహ సుహృద్భావములు పెంపొందగలవు.

ఈ విధానంలో ముఖ్యమైంది మరొకటిఇంటర్వ్యూ. సలహా ఇచ్చే వ్యక్తి ఎంతోమందితో ఇంటర్వ్యూలు జరపవలసి వుంటుంది గనక అతని వ్యవధి చాల కొద్ది. దాన్ని కేవలం సలహా ఇవ్వడానికి మాత్రమే వినియోగించాలి. ఇతర విధానాల ద్వారా వీలైనంత సమాచారాన్ని సేకరించవచ్చు. విద్యార్థులు తమ మనసులోని భావా లను, అవి ఎంతటి రహస్యమైనవి అయినా వాటిని సలహాదారునితో నిర్మొహమాటంగా పరిష్కరించుకోవడానికి ఈ విధానం ఒక్కటే శరణ్యం.

ఒక శిక్షణ కార్యకర్త (Guidance Worker) కు వుండవలసిన ముఖ్య లక్షణాల విషయానికి వస్తే అతని యొక్క విజయం అతని గుణగణాల మీద, సలహాను కోరివచ్చిన అతనికి

మధ్య వున్న పరస్పర నమ్మకం మీద ఆధారపడి వుంటుంది. ఈ పరస్పర నమ్మకం లేకపోతే విద్యార్థులు సత్యాలను వెల్లడించరు. సత్యాన్ని దాచిపెట్టి దానికనుగుణంగా సలహా ఇస్తే అది నిరుపయోగమవుతుంది.

వాదనకోసం విద్యార్థి అసలు సత్యాలను బహిర్గతం చేస్తాడనే మనం అనుకుందాం. సలహాననుసరించి చేయవలసిన పరిస్థితి ఏర్పడినప్పుడు అతను ఆ సలహాను పాటించడు. పరస్పర నమ్మకాన్ని నెలకొల్పడానికి సలహా ఇచ్చే వ్యక్తి విద్యార్థుల పట్ల నిష్పక్షపాతంగా దయార్ద్ర హృదయంతో గౌరవంగా ప్రవర్తించాలి. ఇక్కడ "గౌరవం" అంటే "విద్యార్థుల సమస్యలను పరిష్కరించటంలో అమితోత్సాహంగా" వుండటం అన్నమాట. విద్యార్థి అతన్ని చూసి ఆయన తన సమస్యలను పరిష్కరించటంలో ఉత్సాహం గల ఉపాధ్యాయుడని హృదయాంతరాళంలో భావించగలిగి వుండాలి. అట్టి ప్రశాంత పరిస్థితిలో విద్యార్థి నిజాలను బహిర్గతం చేసి, శిక్షణ కార్యకర్త చెప్పేదాన్ని సావధానంగా వినగలుగుతాడు. ఆ విధంగా శిక్షణ కార్యక్రమం పూర్తవుతుంది.

ప్రస్తుతం మన దేశంలో అమలులోవున్న శిక్షణ సర్వీసులను గురించి క్షుణ్ణంగా తెలుసుకోడానికి వీలుగా అమెరికా, బ్రిటన్ వంటి పశ్చిమ రాజ్యాలలోని గైడెన్స్ సర్వీసుల పుట్టు పూర్వోత్తరాలను గురించి తెలుసుకోవడం మంచిది.

అమెరికా

అమెరికాలోని పాఠశాలలు, కళాశాలలలో ఈ శిక్షణ కార్యక్రమాలు (Guidance Programme) 20వ శతాబ్దారంభంలోనే ప్రారంభమయ్యాయి. బోస్టన్, న్యూయార్కు, ఫిలడల్ఫియా, సిన్సిన్నాటి, చికాగో, సెంట్‌లూయిస్, మిన్నియాపొలిస్‌లలోని ఉన్నత పాఠశాలలు మొట్టమొదటగా ఈ కార్యక్రమాలను ప్రారంభించాయి. ఈ ఉద్యమానికి పెక్కురు నాయకులు, సంక్షేమసంస్థలు, విద్యావేత్తల మద్దతుకూడా లభించింది. అటువంటి నాయకులలో పేర్కొనదగినవారు బోస్టన్‌కు చెందిన ఫ్రాంక్ పార్సన్స్. పార్సన్స్ ఈ వృత్తి పనుల శిక్షణోద్యమానికి (Vocational Guidance Movement) 'పిత'గా గణుతికెక్కారు. పార్సన్స్ 1908లో ఒకేషనల్ బ్యూరో ఆఫ్ బోస్టన్‌ను నిర్వహించారు. అది ఆ తర్వాత హార్వర్డ్ విశ్వవిద్యాలయపు వృత్తిపనుల శిక్షణా సంస్థ (Bureau of Vocational Guindance of Harvard University) అయింది. ఈ ఉద్యమం ఎందరో అమెరికన్ రచయితలను ఆకర్షించింది. జీవితంలోగాని వ్యాపారంలోగాని ఎలా విజయం సాధించాలన్న విషయంపై ఎందరో సంపాదకీయాలు, వ్యాసాలు, గ్రంథాలు వ్రాశారు. రసెల్ కాన్వెల్, హొరేషియో ఆల్జర్, యస్.సి. ఫౌలర్, ఫ్రాంక్ రాలిన్స్ వంటి రచయితలు ప్రజల దృష్టిని ఈ ఉద్యమం వైపు మరల్పడానికి ఎంతో సహాయం చేశారు. 1910 నాటికి అమెరికాలో ఈ విషయంలో ఉత్సాహం బహుళవ్యాప్తం కాగా, బోస్టన్‌లోని ఒకేషనల్ బ్యూరో సంస్థ, ఒకేషనల్ గైడెన్స్ జాతీయ మహాసభను ఏర్పాటుచేసింది. ఆ మహాసభకు దేశం నలుమూలల నుంచి ప్రతినిధులు వచ్చారు. అప్పటినుంచి పెక్కు జాతీయ సంస్థలు ఈ ఉద్యమానికి బహువిధాల తోడ్పడ్డాయి. వీటిలో చెప్పుకోదగినవి: అమెరికన్ కళాశాల ఉద్యోగుల సంఘం, గైడెన్స్ సూపర్‌వైజర్ల జాతీయసంస్థ, వృత్తిపనుల జాతీయ శిక్షణసంస్థ. ఈ మూడు సంస్థలుకూడా "అమెరికన్ పర్సనల్ అండ్ గైడెన్స్ అసోసియేషన్" అనే కొత్త సంస్థలో 1951 లో విభాగాలుగా రూపొందాయి. మొదటి నుంచీ పబ్లిక్ ఎంప్లాయ్‌మెంట్ ఆఫీసులు అమెరికన్, సంస్థవంటి పాఠశాలేతర సంస్థలుకూడా ఈ ఉద్యమానికెంతో తోడ్పడి సహాయంచేశాయి.

మొదటి ప్రపంచయుద్ధం సమయంలో ఈ గైడెన్స్ ఎంతో అభివృద్ధి అయింది. అప్పుడు యుద్ధశాఖలో మానసిక శాస్త్ర విభాగం వివిధ వృత్తులకు కావలసిన వారినెన్నుకోడానికి తెలివితేటలను తెలుసుకోవడానికి పరీక్షలను నిర్వహించింది. యుద్ధానంతరం వికలాంగులకు ఉద్యోగ సౌకర్యాలు కల్పించబడినవి. ఉద్యోగంలో చేరడానికి ముందు మానసిక పరీక్షలను నిర్వహించడం పరిపాటి అయింది. ఉద్యోగార్హతను నిర్ణయించడానికి లూయిస్ యం. టెర్మాన్, థార్న్‌డైక్, కెల్లీ, మన్రో, స్టారింగ్, థర్‌స్టోన్, క్యూడర్ వంటి మానసిక శాస్త్రవేత్తలు ఎన్నో విధానాలను కనిపెట్టారు. ప్రత్యక్ష పరీక్షలు నిర్వహించడానికి ఎడ్యుకేషనల్ టెస్టింగ్ సర్వీస్, ఎడ్యుకేషనల్ రికార్డ్స్ బ్యూరో, సైకలాజికల్ కార్పొరేషన్ వంటి పెక్కు సంస్థలు గత 30 ఏళ్ళలో ప్రారంభమయ్యాయి.

అమెరికా రెండవ ప్రపంచయుద్ధంలో చేరడంతో యుద్ధావసరాలదృష్ట్యా ఉపాధ్యాయులు మొదలైనవారి కొరత ఏర్పడి ఈ (గైడెన్స్) శిక్షణ అభివృద్ధి తాత్కాలికంగా కుంటువడింది. దీనిపై యుద్ధంయొక్క ప్రభావం పడి ఆ తర్వాత ఎన్నో కొత్తరకాల పరీక్షలు ఏర్పడినాయి. యుద్ధం ముగిసిన తర్వాత ఈ కార్యక్రమాలు మళ్ళీ అభివృద్ధి చెందనారంభించాయి.

బ్రిటన్

బ్రిటన్‌లో ఈ వృత్తి పనుల శిక్షణాభివృద్ధి స్థానికమైంది. అక్కడ ఈ కార్యక్రమం సెకండరీ పాఠశాలలలో వుంటుంది. వాటిలోని పెక్కు పాఠశాలలకు కెరీర్‌మాస్టర్లున్నారు. సాధారణంగా పాఠశాలలలో ఈ పద్ధతిని ప్రవేశపెట్టడానికి వాటినుంచే ప్రోత్సాహం లభిస్తుంది. ఇది బ్రిటిష్ విద్యా విధానంలోని ఒక ముఖ్య లక్షణం. వృత్తిపనుల సలహా వంటి వాటిని కార్మిక మంత్రిత్వ శాఖ క్రింద నేషనల్ ఎంప్లాయ్‌మెంట్ ఎక్స్చేంజిలు నిర్వహిస్తున్నా అటువంటి

వాటిని కొన్ని ప్రైవేటు సంస్థలు కూడా నిర్వహిస్తున్నాయి. అటువంటి వాటిలో పేర్కొనదగినవి లండన్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండస్ట్రియల్ సైకాలజీ. ఇది 1922 వరకు పనిచేస్తూ వచ్చింది. ఈ సంస్థ ఆయా వ్యక్తులకు సలహాలిస్తూ, కారీర్ మాస్టర్లకు శిక్షణ ఇస్తుంది. ఛార్లెస్ స్పీయర్‌మెన్ అనే ఒక ఆంగ్ల మానసిక శాస్త్రవేత్త "ఫాక్టర్ ఎనాలిసిస్" (Factor Analysis) అనే ఒక పద్ధతిని కనుగొన్నారు. ఆయా వ్యక్తులకు ఎందులో అభినివేశం వుందో కనుగొనడానికి పరీక్షలు నిర్వహించే పరికరాన్ని ఆయన కనుగొన్నారు. ఈ పరికరం బ్యాటరీల సహాయంతో పని చేస్తుంది.

రెండవ ప్రపంచ యుద్ధంమూలంగా బ్రిటన్‌లో ప్రభుత్వ, ప్రైవేట్ శిక్షణ (గైడెన్స్) సర్వీసులు యుద్ధకాలంలో కార్మికావసరాల దృష్ట్యా కుంటుపడినై. అందువల్ల కొందరు యువకులకు శిక్షణ (గైడెన్స్) సహాయం కూడా లేకుండా ఉద్యోగాలివ్వబడినాయి. బ్రిటన్‌లో యుద్ధానంతరం ఈ సర్వీసులు పునర్నిర్మాణానికి లోనయ్యాయి.

భారత దేశంలో శిక్షణ (గైడెన్స్) ఉద్యమం

1954లో ఆల్బర్టు థాంప్సన్ అమెరికాలోని వృత్తి పనుల శిక్షణను గురించి వ్రాస్తూ ఇలా అన్నారు. "వృత్తి పనుల శిక్షణ అమెరికాలో ఒక ఉద్యమం అది ఇంకా యౌవ్వనదశలోనే వుంది" (Personnel and Guidance Journal, మే, 1954) ఈ ఉద్యమం అమెరికాలో 45 సంవత్సరాల అభివృద్ధి తర్వాత కూడా యౌవన దశలో వున్నదంటే ఈ ఉద్యమం భారతదేశంలో బాల్యదశలోనే వున్నదనాలి.

పాట్నా విశ్వ విద్యాలయంలో 1945 లో మానసిక శాస్త్ర సర్వీసులు, పరిశోధనాశాఖను నెలకొల్పడంతో భారతదేశంలో వృత్తి పనులలో శిక్షణ గరపడమనేది ప్రారంభమైంది. ఆ తర్వాత ఈ ఉద్యమాన్ని కొందరు వ్యక్తులు, సాంఘిక సంక్షేమ సంస్థలు కొనసాగించాయి. బొంబాయిలోని ఒక సాంఘిక సంక్షేమ సంస్థ పార్సీ పంచాయతీ నిమలు, ఆస్తుల ధర్మకర్తల కార్యాలయం 1947లో వృత్తి పనుల శిక్షణ సంస్థను (Vocational Guidance Bureau) నెలకొల్పింది. యుద్ధానంతర కాలంలో ముందు పార్సీలకు, తరువాత పౌరులందరికీ సహాయం చేసే ఉద్దేశంతో ఈ సంస్థ నెలకొల్పబడింది. ఈ దేశంలో కారీర్ మాస్టర్ల శిక్షణ కోర్సును ఈ సంస్థే ప్రారంభించినట్లు కనుపిస్తున్నది. ఈ ఉద్యమం ఆరంభమైన ప్రాథమికకాలంలో దీని అభివృద్ధికి తోడ్పడిన వాటిలో పేర్కొనదగిన ప్రైవేట్ సంస్థలు జలంధర్‌లోని యునైటెడ్ క్రిస్టియన్ మిషన్, బొంబాయిలోని రోటరీ క్లబ్, కలకత్తాలోని వై. యం. సి. ఎ.

ఈ రంగంలో ప్రప్రథమంగా ప్రవేశించిన ప్రభుత్వ సంస్థ 1947లో నెలకొల్పబడిన అలహాబాద్‌లోని మానసిక శాస్త్ర సంస్థ. సెకండరీ విద్య కమీషన్ పాఠశాలలలో శిక్షణ (గైడెన్స్) కార్యక్రమాలను ప్రారంభించాలని గట్టిగా సిఫార్సు చేయడంతో ఈ ఉద్యమ కార్యక్రమానికి భారత ప్రభుత్వ అధికారామోదం లభించింది. తత్ఫలితంగా 1954 లో వృత్తి విద్యా విషయక శిక్షణ కేంద్ర సంస్థ (సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఎడ్యుకేషనల్ ఒకేషనల్ గైడెన్స్) ఏర్పడింది. అదే ఇప్పటికీ కూడా ఈ రంగానికి మార్గదర్శకమైంది. ఆ తర్వాత 1956 లో ప్రప్రథమంగా ఈ కార్యక్రమానికి సంబంధించిన ఉద్యోగులు తమ సామాన్య సమస్యలను చర్చించడానికి ఢిల్లీలో సమావేశమయ్యారు. తత్ఫలితంగా అఖిల భారత వృత్తి విద్యా, విషయక శిక్షణ సంఘం (All India Educational and Vocational Guidance Association) ఏర్పడింది. ఆ తర్వాత కేంద్ర సంస్థ (Central Bureau) నెలకొల్పబడటంతోను, భారత ప్రభుత్వ సహాయంతోనూ పెక్కు రాష్ట్ర ప్రభుత్వాలు వృత్తి విద్య విషయక సంస్థలను నెలకొల్పారు. ఆంధ్ర ప్రదేశ్‌లో కూడా వృత్తి విద్యా విషయక రాష్ట్ర శిక్షణ సంస్థను (State Bureau of Educational and Vocational Guidance) 1957 లో నెలకొల్పారు. సెకండరీ విద్యలో వృత్తి పనుల శిక్షణాభివృద్ధికి సరి సమానంగా ఒకేషనల్ గైడెన్స్ యూనిట్లతో ఎంప్లాయ్‌మెంటు ఎక్స్‌ఛేంజిలు కూడా భారత ప్రభుత్వానికి చెందిన ఉద్యోగ సాధన, శిక్షణ డైరెక్టరేట్ జనరల్ (Directorate General of Employment and Training) ఆధ్వర్య పర్యవేక్షణల క్రింద క్రమంగా పెంపొందసాగాయి. సెకండరీ విద్యా స్థాయికి ఆయా ఉద్యోగులుండే స్థాయికి మధ్య వుండవలసిన సమన్వయాన్ని గుర్తించడం జరిగింది.

ప్రతి సెకండరీ పాఠశాలలోనూ శిక్షణా సర్వీసులను ప్రవేశపెట్టడానికి తృతీయ ప్రణాళికలో కొన్ని ముఖ్య ప్రతిపాదనలు చేశారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, పాలకులు వ్యక్తిసుఖాన్ని సంక్షేమాన్ని కోరే ఇతర వ్యక్తుల సహాయంతో ఈ ఉద్యమం పాఠశాలలలో బాగా అభివృద్ధి చెందగలదు. అప్పుడే ప్రతివ్యక్తి యొక్క శక్తి సామర్థ్యాలు సాధ్యమైనంత ఎక్కువగా పెంపొందుతాయి. అందువల్ల ప్రతి వ్యక్తికి సంతోషసౌఖ్యాలు సమకూరడమే గాక; సంఘానికింత సహాయం చేయగలుగుతాడు. ఆలా జరిగినప్పుడే మానవశక్తి సామర్థ్యాలు వృథాకాకుండా జాతీయ ఆర్థిక పరిస్థితి చెప్పుకోదగినంతగా మెరుగుకాగలదు. అప్పుడే మనదేశం అంతర్జాతీయ ప్రపంచంలో మానవ జీవితానికి సంబంధించిన ప్రతి రంగంలో సరియైన స్థానాన్ని పొందగలుగుతుంది. ★

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం

విస్తీర్ణం, సివిల్ డివిజన్లు (1961 జనాభా లెక్కలు)

వైశాల్యం	... 1,06,052 చదరపు మైళ్ళు
జనాభా	... 359.8 లక్షలు
జిల్లాలు	... 20
తాలూకాలు	... 189
పట్టణాలు, నగరాలు	223
జనసాంద్రత (చదరపు మైలుకు)	340 మంది

పంచవార్షిక పశుగణన -- 1961

(వేలలో)

పశువులు	...	123,45
గేదెలు	...	69,49
గొర్రెలు	...	83,63
మేకలు	...	42,47
గుర్రాలు	...	71
ఇతర జంతువులు	...	6.76

సమాజాభివృద్ధి కార్యక్రమం

వివరాలు:_	1959_60	1960_61	1961_62
బ్లాకులు ...	282	326	378
సగటున వేయిగ్రామాలకుగల బ్లాకులు ...	10.66	16	17
సగటున పదిలక్షల జనాభాకు గల బ్లాకులు	7.72	16	16
బ్లాకులక్రింద వున్న గ్రామాలు ...	178.87	20,901	245 02
బ్లాకు ప్రాంతాలో నివసించే ప్రజలు	187,31	205,73	235,65

ఖనిజోత్పత్తి

	1959_60 టన్నులు	1960_61 టన్నులు
బొగ్గు ...	2296,000	2596,000
ముడిఇనుము ...	203,000	233,000
మాంగనీస్ ...	16,000	24,000
అభ్రకం ...	3,000	3,000
సున్నపురాయి ...	776,000	1,036,000

